53473

# అధ్యాత్మ రామాయణము

యత్పాద పంకజ పరాగ సురాగ
యోగి వృందైర్జితం భవభయం
జితకాల చక్రైః

యన్నామకీర్తన పరాజిత
దుఃఖ శోకా దేవాస్తమేవ
శరణం సతతం ప్రపద్యే.



**అనువాదకులు**

**మహావ్రతయాజుల శంకరశర్మ**

# అధ్యాత్మ రామాయణము

( ఆంధ్రానువాదము )



రచన :

శ్రీ మహావ్రతయాజుల శంకర శర్మ

This book is published with the financial assistance of Tirumala Tirupati Devasthanams under their scheme of "Aid to publish Religious Books"

కాపీరైటు : శ్రీమతి M. ధనలక్ష్మి

ప్రతులు : 1000 కాపీలు

O35,3N1
N96

రూ. 100-00

SRI VENKATESWARA
CENTRAL LIBRARY
RESEARCH CENTRE
Acc No 53423
Date
TIRUPATI

ప్రతులకు : శ్రీమతి M. ధనలక్ష్మి,
43-15-4/3, సుబ్బలక్ష్మినగర్,
విశాఖపట్నం – 530 016.

ముద్రణ : శ్రీ భవానీ ప్యాకేజర్స్ & ప్రింటర్స్,
సుబ్బలక్ష్మినగర్, విశాఖపట్నం-530 016.
ఫోన్ : 547321

# నివేదనము.

సహృదయ పాఠకులకు నమస్కారములు !

అధ్యాత్మ రామాయణ ఆంధ్రానువాదమునకు ముద్రణ నిమిత్తము సహాయముచేసిన శ్రీశ్రీశ్రీ టి. టి. డి. పాలకవర్గమునకు నా ధన్యవాదములు.

అధ్యాత్మ రామాయణానువాదమును ఆరంభము నుండి పట్టాభిషేకము వఱకు శ్రద్ధాభక్తులతో విని నన్ను గ్రంథ రచనకు ప్రోత్సహించిన శ్రీ మద్దు సూరరాజుగారు మఱియు శ్రీ సిరిపురపు సత్యనారాయణ మిత్ర ద్వయమునకు నా హృదయపూర్వక ధన్యవాదములు.

నా యీ తెనుగుసేతను చదివి ఆనందించి వాత్సల్యంతో దీవించిన మిత్రరత్నము శ్రీ శ్రీ శ్రీ అప్పల్ల సోమేశ్వర శర్మగారికి నా కృతజ్ఞతలు. నమస్సుమస్సులు. ఆంధ్రావనిలో కలియుగ శ్రీరామునిగా ప్రశస్తిగాంచిన శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచారిగారు నా యీ తెనుగుసేతను చదివి వారి యనర్ఘ ఆశీస్సులను అందించి నందుకు వారికి నా ప్రత్యేక ధన్యవాదములు. నమస్సుమస్సులు.

ఉభయ భాషాప్రవీణ బాల్యంనుండి నాకు సంస్కృత భాషను చెప్పి నన్ను సంస్కృతునిగా చేసిన గంటి (దివంగత గురువర్యులు) శ్రీ నరసింహ శర్మగారి స్మృత్యర్థము నా యీ తెనుగుసేత సమర్పింపబడినది.

నాకు బాల్యం నుండి రామాయణ గాథను చెప్పి సంస్కృత విద్యలో చేర్పించి నన్ను కృతకృత్యుని చేసిన పూజ్యపితరులు శ్రీ మహావ్రతయాజుల సూర్యనారాయణశాస్త్రి, రత్నమాంబలకు (కలువరాయి) శతసహస్ర పాదాభి వందనములు.

నాకు ఆంగ్ల విద్యాగురువులు శ్రీ దివాకర్ల వేంకటావధాని గారికి నమోవాకములు.

నా యీ పుస్తకము ముద్రణకు రాత్రిపగలు కష్టపడి శ్రమించిన భవానీ పేకేజర్స్ మఱియు ప్రింటింగ్ ప్రెస్ కర్మచారులకు నా ధన్యవాదములు.

నా యీ ప్రచురణకు శ్రద్ధతో చదివి ప్రూఫులను ముందు సవరించి తరువాత నాకందించిన చిరంజీవి నా జ్యేష్ఠ కుమారుడు అనంతరామన్ ఇతని సతీమణి ధనలక్ష్ములకు నా హృదయపూర్వక ఆశీస్సులు.

మన అందఱియందు హనుమత్ సీతాలక్ష్మణ సమేత శ్రీశ్రీశ్రీ రామచంద్ర భగవానుని కరుణా కటాక్ష తరంగములు నిత్యము ప్రవహించు గాత. శ్రమతో చూచినా ముద్రారాక్షసములు తప్ప లేదు. క్షంతవ్యుడను.

పాఠక శిరోమణుల హృదయ కమలములందు శ్రీరాముడు నిత్యము గోచరించు గాత.

విశాఖపట్నం — ఇట్లు సత్పురుష విధేయుడు

27-11-1996 — —మహావ్రతయాజుల శంకర శర్మ.

'వ్యాకరణ విద్యాప్రవీణ', 'సాహిత్య విద్యాప్రవీణ', 'భాషాప్రవీణ'
'వ్యాకరణాలంకార చక్రవర్తి', 'సాహిత్య విశారద'
ఆచార్య అప్పల్ల సోమేశ్వర శర్మ, M.A., P.O.L.
(విశ్రాంత సంస్కృతాచార్యుడు, ఆంధ్ర విశ్వవిద్యాలయము)

# సంభావన

యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే ।
తావత్ రామాయణ కథాలోకేషు ప్రచరిష్యతి ।

(పర్వతాలు, నదులును ఉన్నంతవరకు రామాయణ కథ లోకంలో ఉంటుంది). ఇది రామాయణాన్ని గురించిన ప్రశస్తి. వాల్మీకి మహాముని రామాయణాన్ని రచించేరు. అతడు ఎప్పుడు పుట్టేడో, ఎలాగ ఉండేవాడో, ఎక్కడ ఉండేవాడో, ఎంతకాలం బ్రదికేడో – ఇవన్నీ ఎవరికిన్నీ తెలియవు. చరిత్రకు అందవు. అవన్నీ ఊహాగానాలే. అన్నీ తమతమ మతివైభవాలే. కాని అతని వరప్రసాదం. రామాయణం శాశ్వతమయి పోయింది. విశ్వజనీన మనోవికాసమై వెలుగుతోంది. అదీ రామ కథ – శ్రీరామ కథ. దానికంత బలం ఉంది. మానవుని మనుగడకు అది రాజరాజ మార్గం వేసింది. అది మానవమాత్రునికి శిరోధార్యం.

ఈ రామాయణం కాలక్రమంలో విశ్వరూప సందర్శనాన్ని సంతరించు కుంది. ఎన్నో–ఎన్నెన్నో–రామాయణాలుగా, ఆవిర్భ వించింది. శతసహస్ర సంఖ్యాకంగా కావ్య, నాటక, గద్య పద్య గేయాది స్వరూపాలకు మూలకారణ మయింది. చిట్టచివరకు వేదాంత గ్రంథంగాను, అద్వైత విద్యగాను కూడా అవతార మెత్తింది.

ఇదిగో! ఈ అవతారమే అధ్యాత్మ రామాయణం. దీని అసలు చరిత్ర కూడా పమంగా తెలియదు. సంస్కృత సాహిత్య చరిత్రలో దీనికి తగిన స్థానమే దొరకలేదు. అయినా మూలం మాత్రం సంస్కృతమే. పురాణాల్లోను, ఉపపురాణాల్లోను ఇది లెక్కకు రాలేదు. కర్త ఎవరో తెలియదు. విశ్వామిత్రుడని ఒక భావన. ఇది పురాణమని. సాక్షాత్తు వ్యాసుడే దీని కర్త అని సంప్రదాయ వచనం. నవీన రచన అని మరికొంద రంటారు. సరే. ఈ వాదాలు ఇలాగే ఉంటాయి. గ్రంథ ప్రాశస్త్యం ముఖ్యంగా మనకు కావల సింది. ఈ గ్రంథంలో రామకథ అంతంత మాత్రమే. శివపార్వతుల సంభాషణం మూలాధారంగా బయల్దేరి శ్రీరాముడు, అంజనేయా దులకు ఉపదేశించిన తత్త్వ విద్య ఇందులో అతిముఖ్యంగా ఉంటుంది. దీని సారాన్ని "అధ్యాత్మ రామాయణ కీర్తనలు" అన్న పేరుతో తెలుగులో ఒక శాస్త్రికుడు వెలయించేడు. ఏటిని ఆంధ్రదేశంలో అందరున్ను కమ్మగా పాడుకునేవారు. ప్రస్తుతం సినిమా పాటల ప్రభంజనంలో అవి ఎగిరిపోతున్నవి. ఇది కాలప్రభావం!

ఇలా ఉండగా — మరల అధ్యాత్మ రామాయణ తత్త్వాన్ని అందరకు అందించాలని శ్రీ మహావ్రతయాజుల శంకర శర్మగారు దీక్షపూని నడుం బిగించేరు. కార్యం సాధించేరు, సులభమైన తెలుగు భాషలో వచన రూపంలో అధ్యాత్మ రామాయణాన్ని రచించేరు. శ్రీ శర్మగారు నాకు అత్యంతాప్త మిత్రులలో ఒకరు. సహృదయ శేఖరులు, సంస్కృతాంధ్రాంగ్ల భాషాసాహిత్యాలలో నిష్ణాతులు, జ్యోతిర్విద్యా ధురీణులు. తేజస్వి — వచస్వి. ఇదివరకే వీరు ఎన్నో గద్యాలను, పద్యాలను అల్లి 'సెభాసు' అనిపించు కున్నారు. భారతీయ తత్త్వ రహస్యాలను — ముఖ్యంగా — అద్వైత సారాన్ని అనాయాసంగా తెలుసుకోవడానికి. ఈ కృతి బాగా సాయం చేస్తుంది, సంస్కృత పాండిత్యం, ఉద్గ్రంథ పఠనం మొదలైనవి లేనివారు

కూడా. ఈ గ్రంథంవల్ల 'ఆత్మవిదులు' అయ్యే అవకాశం అధికంగా ఉంటుంది. కాగా ఈ "అధ్యాత్మ రామాయణం" (గద్యం) సర్వజన సమాదరణీయం అని నా భావన — సంభావన. "అస్తు"

తమ కృతికి "ముందుమాటలు" వ్రాయమని శ్రీ శంకర శర్మగారు గౌరవాదరాలతో నన్ను పురమాయించినారు. రామ చరితానికి, తత్త్వవిచారానికిన్ని ఇటువంటి లాంఛనాలు వాస్తవంగా అక్కరలేదు. అయినా మనోబంధం — సౌహార్ద బంధం — నేను కాదనలేక పోయేను. "ఉన్న మాటలను" కొన్నింటిని వ్రాసేను. నాతోపాటు సహృదయులందరు శ్రీ శర్మగారిని సంభావిస్తారని ఆశిస్తున్నాను.

సీతమ్మధార, విశాఖపట్నం-13.
తేది 18-11-1986

—అప్పల్ల సోమేశ్వర శర్మ

# అభినందనము

శ్రీరామ చరిత్రాన్ని ఎందరో ఎన్నో విధాల అనుభవించి నారు. శ్రీరాముడు సర్వజగత్కారణమైన పరమాత్మయే. అతడే శ్రీమహా విష్ణువు. అతడు రావణ సంహారంకోసం నరుడిగ వచ్చి మానవులకు పరమప్రవర్తనను నేర్పి అధర్మముగ ప్రవర్తించేవారిని అంతమొందించినాడు. వాల్మీకి రచించిన శ్రీ రామాయణములో ఆత్మతత్వము ఉండదు. అది వేదాంత గ్రంథము కాదు. అది మానవ జీవితానికి వివరించిన గ్రంథం. రాముడు మానవుడిగ అందు ప్రవర్తించినాడు. శ్రీ రామాయణము వాల్మీకి ప్రోక్తం. అధ్యాత్మ రామాయణం వ్యాసప్రోక్తం. ఇది బ్రహ్మాండ పురాణములోనిది అని చెప్పుతారు. ఇందులో రాముడు సర్వజగత్కారణమైన శ్రీ మహా విష్ణువుగ గాక ఆత్మతత్త్వముగ కనిపిస్తాడు. ఇది వేదాంత గ్రంథము. భక్తి జ్ఞాన వైరాగ్యములను ప్రబోధిస్తుంది. రామపరంగ సాగిన గీత అధ్యాత్మ రామాయణం. దీని మహాత్మ్యము చాల గొప్పది. వేదాంత గ్రంథములలో ఉపనిషత్తులను, భగవద్గీతను అధ్యయనము చేసినట్లే అధ్యాత్మ రామాయణాన్ని యోగవాసిష్ఠాన్ని కూడ అధ్యయనము చేస్తూ ఉంటారు. ఇందులో రాముడు మానవుడు కాదు. ఆత్మ స్వరూపము ఇది సత్యము, నిత్యము, శుద్ధము అయిన నిర్గుణ తత్త్వమని నిరూపిస్తారు. తెనుగులో సీతారామాంజనేయ సంవాదము చాలమంది చదువుతూ అది తంత్రశాస్త్ర పద్ధతిలో షట్చక్రాలు మనస్సు స్వరూపాలని తెలియజేస్తుంది. భారతీయమైన సనాతనమైన సాంప్రదాయానికి చెందిన సిద్ధాంతములను ప్రజలలో వ్యాప్తి చేయడానికి ఆవిర్భవించిన మహా గ్రంథాలివి. అధ్యాత్మ రామాయణాన్ని ఎన్నో ప్రయోజనాలకి ఉపయోగిస్తూ ఉంటారు. రామ రక్షాస్తోత్రము, రామగీత పారాయణ చేస్తే ఎన్నో కార్యములు నెరవేర్తాయని, పాపాలు నశిస్తాయని మన విశ్వాసం. ఆత్మతత్వాన్ని నిరూపించేది రామచరిత్ర కనుక దీనికి అధ్యాత్మ రామాయణమని పేరు, అద్వైత సిద్ధాంతములో బ్రహ్మము అనిన ఆత్మ అనిన ఒక్కటే. రెండు కావు.

భేదము లేదు. జీవబ్రహ్మలకు ఐక్యాన్ని బోధించడమే ఉపనిషద్వ్సార మని అదే తత్త్వమని వారి సిద్ధాంతము. ఆ బ్రహ్మమే విష్ణువని ఆత్మ అని రాముడు అని ప్రకటింప బడుతోంది. అధ్యాత్మ రామాయణ ములో ప్రధానంగా శ్రీరామ రక్షాస్తోత్రము ముఖ్యమైనది. దీనిని శ్రద్ధతో, విశ్వాసముతో పారాయణ చేసినవారు సమస్త ప్రయోజన ములను పొందుతున్నారు. వేదాంత గ్రంథముగ రామగీతగ ప్రసిద్ధి నందినది. అధ్యాత్మ రామాయణము.

ఇంతకుముందు ఎందరో ఆంధ్రభాషలో దీనిని వ్రాసేరు. మహాప్రతయాజులువారు పండితులు. ప్రాచ్య విద్యలో నిష్ణాతులు వారికి నాలుగు భాషలలో ప్రవేశమున్నది. వారికి ఉన్న సంస్కృత జ్ఞానాన్ని ఆధారంగ చేసికొని ఈ అధ్యాత్మ రామాయణాన్ని సులభంగా సర్వజనోపయోగముగ వ్రాయాలని సంకల్పించినారు. వారు ఆశించిన ప్రయోజనము నెరవేరినది. విషయములో స్పష్టత, భాషలో సొరస్యం, నిర్దుష్టత ఈ గ్రంథము యొక్క ప్రత్యేకతలు. వీనిని అనువదించుట చాలకష్టము. వీరు పండితులు సరళంగా వ్రాయ గల శక్తిగల వారగుటచే విషయాన్ని కూలంకషంగ అర్థం చేసు కొనుటచే అంధ్రుల పాఠకలోకానికి అందించి మహోపకారము చేసినారు. వీరు మొదట ప్రాచ్యవిద్యాపట్టాన్ని పొంది తరువాత ఆంగ్లవిద్యలో ప్రవేశించి ఎమ్. ఎ. పట్టాన్ని పొందేరు. కేవలము ప్రాచ్యపండితుడిగ గాక ప్రభుత్వోద్యోగము చేసేరు. కాని అన్న సిద్ధమైన సంస్కారము వారిని అధ్యాత్మ రామాయణంవైపు ఆకర్షించి నది. దీనిని ఆంధ్రభాషలో వ్రాసి మహోపకారము చేసినారు. శ్రీరామచంద్ర ప్రభువు వారికి దీర్ఘ ఆయురారోగ్యములను ప్రసా దించి లోకానికి ఉపకరించే మరికొన్ని గ్రంథములను అందించేలా, అనుగ్రహించేలా ప్రార్థిస్తున్నాను.

విశాఖపట్నం

~~21-22-1900~~ 21-12-1996

ఇట్లు

—శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యులు

ఓం

# శ్రీమదధ్యాత్మరామాయణం

1) వందే కైలాసనాధస్య పుత్రం శ్రీ విఘ్న
నాయకం అంబికా పరమానంద
దాయకం లోకపోషకం.

2) వందే రామప్రభుం సీతాం వందే లక్ష్మణపుంగవం
వందే హనూమతం దేవం వందే వాల్మీకి పండితం.

3) వందేమరూన్ తథాదేవీం శారదాం భక్తవత్సలాం
ఆనందకారిణీమంబా ముమాం లోకేశ సుందరీం.

4) వందే మత్పితరం సూర్యనారాయణ మహోదయం
వందే మన్మాతరం పూతాం రత్నమాంబా
సువత్సలాం.

5) ఆచార్య నరసింహంచ, తథాతన్మితర్
దేశికాన్ వందే త్వనన్యయా భక్త్యా
ఇష్టకామ్యార్థ సిద్ధయే.

6) వందే కృష్ణం ఘనశ్యామం
వాసుదేవం బుధాశ్రితం
సర్వజీవాత్మకం దేవం
మన్మనోభీష్ట దైవతం.

# మనవి

భారత దేశము పవిత్రమైన భూస్థలము. ఇచ్చట గంగా, గోదావరీ యమునాది నదీమ తల్లులు, కైలాస, మేరు, వింధ్యాది మహా నగములు ప్రకృతి పరమేశ్వరులకు సంబంధ రూపంలో అన్వయించి కనపడును. శ్రీ మహావిష్ణువు దశావతారములెత్తి మానవులకు కనువిప్పుచేసినచోటు మన భారతదేశము. తులసి, గోమాత అశ్వర్థ వృక్షము మున్నగు పవిత్ర సృష్టిని కనుగొన్నది మన దేశము. బ్రహ్మ మొదలు చీమవఱకు భగవంతుని రూపములని గుర్తెఱింగిన చోటు. పరమేశ్వర భవాని లీలావిలాసములతో కాశీ, శ్రీశైలము, అరుణాచలములు, మధుర, గోకుల బృందావనాది ఎన్నియో అవతార కథలను మనకు నిత్యము చూపించు తల్లి మన భారతమాత. "భా" అంటే కాంతి. రతులు ఇష్టపడినవారని యర్థము. మన భారతీయులందరు కాంతియనగా జ్ఞానము. అందు ఇష్టము కలవారని యర్థము.

శ్రీ మద్రామాయణ మహాభారత భాగవతాది పవిత్ర గ్రంథములు పాలుపారినచోటు. నాలుగు వేదములు కొన్ని వేల యుపనిషత్తులు ప్రవహించిన చోటు. ఈ వేదసారము నంతటిని సామాన్య సంస్కృత భాషలో ప్రప్రథమముగా ప్రవచించిన మహనీయుడు వాల్మీకి. ఇతడు ఆదికవి. ఇతని వాగమృతమే శ్రీమద్రామాయణము సనాతన వేదధర్మముల నన్నింటిని ప్రజలకు ఒక కథగా చెప్పి శాశ్వతంగా ఆబాలగోపాలం, నిత్యం స్మరించేలాగున శ్రీమద్రామాయణ మహాకావ్యమును వాల్మీకి రచించిరి. దేశ, కాలపాత్రల నధిగమించి, ఎల్లప్పుడు, ఎప్పుడు ఏదు వారు అనికాకుండా అందఱికి అన్నివేళలందు జీవితమార్గమును చూపించిన మహాకావ్యము శ్రీ

మద్రామాయణము భూలోకములోని మానవులందరికీ ఆదర్శమైన మనుగడ రామచరితము. గంగ పారునంతవరకు, సూర్యుడుద యించువరకు సజీవంగా ఉండేది శ్రీమద్రామాయణము. ఎన్ని సార్లు విన్నా, చదివినా, తిరిగితిరిగి చదివితే బాగుంటుంది అని అని పించే కావ్యము అది. ఈ మహాకావ్యమునకు ముసలితనము, చావు లేవు. దేవతలు కూడ దీనిని గానముచేసి తరిస్తారు. మన విశ్వ విద్యాలయముల కన్నిటికి, శ్రీకారం చుట్టింది శ్రీమద్రామాయణమే. వాల్మీకివలెనే వ్యాసుడుగూడ ప్రాతఃస్మరణీయుడు. మహాభారతము పద్దెనిమిది పురాణములను రచించి జగత్కళ్యాణము కావించిన మహ నీయుడు వ్యాసమహర్షి. అష్టాదశ పురాణములలో బ్రహ్మాండ పురాణమొకటి. అందలి ఉత్తరకాండలోనిది ఈ అధ్యాత్మ రామాయ ణం. శ్రీరాముని చరితమని స్థూలంగా చెప్పాలి. కాని ఇది అదు గడుగునా, భక్తి, జ్ఞాన, వైరాగ్య, ఉపాసన, సదాచారములను బోధించు మహోన్నత గ్రంథము. శ్రీ మద్భగవద్గీతకును దీనికిని ఎన్నియో సామ్యములున్నవి. కృష్ణార్జున సంవాదముగా వ్యాసుల వారే గీతను మహాభారత కథలలో భాగంగా వ్రాసారు. బ్రహ్మాండ పురాణంలో భాగంగా వ్యాసులు వారే ఈ అధ్యాత్మ రామాయణాన్ని వ్రాసారు. భగవద్గీత కృష్ణ పరమైతే ఇది రామపరంగా చెప్పారు. రామకృష్ణులకు బేధము లేదు. ఇంక వ్యాసులవారు దీనిని ముందుగా వ్రాసారంటే మనము కాలమును నిర్ణయించలేము. కొలిచేవానికి కాలము కావాలిగాని లోకకళ్యాణం కొఱకు రచించిన వాల్మీకి వ్యాసులకు కాలమక్కరలేదు. వారు ఎప్పుడు పుట్టేరు, ఎక్కడి వారంటే విష్ణువుకుతప్ప మనకు తెలియదు. మనము సూర్యుని కొలు స్తాము కాని కొలవలేము. కాని హిస్టరీని మనం చదువలేదు. అలాగే వ్యాసుడుకూడ మౌలికమైన విష్ణుతత్త్వమును శ్రీరామ పరంగా చెప్పిరి. విష్ణుహృదయమును బోధించు తత్త్వము అధ్యాత్మ రామాయణము. ఈ అధ్యాత్మ రామాయణములోని విష్ణువు త్రిమూ

ర్తులలోని విష్ణువు కాదు. త్రిమూర్తులకు కారణభూతుడైన ఆత్మ, ఆత్మస్వరూప వివరణయే అధ్యాత్మ రామాయణ వివరణ. గీతయందలి కృష్ణుడువలె ఇచ్చట రాముడు భూత. భవిష్య ద్వర్తమానములను. సృష్టి స్థితి లయములను, మాయను. విద్యను తెలిసిన భగవంతుడు. ఇచ్చట శ్రీరాముడు పామరుడు కాడు. సామాన్య మానవుడు కాడు.

అవ్యయుడాది మర్త్యుల యహోని వికార విరక్తుడై సదా
భవ్యము సాధుపుంగవ, సుభావిత బ్రహ్మము నాత్మదాల్చి తా
భావ వికార శూన్యుడయి భావములోన
వెలుంగు నట్టి యీ
కావ్యము రాజు విష్ణువని రామపరంబుగ
నేర్చి చెప్పె తా
రాముడు విష్ణుతత్త్వమని రామముగా
ప్రకటించి నేర్పుతో
రామకథామృతంబు కవిరాముడు
వ్యాసుడు కాంచి చెప్పగా
రామము శుద్ధబ హ్మము, వి రామయ మార్గ
ము రామమూర్తిలో
కామము కండటంచు కవిగానము చేసెను
కావ్యపక్కిలో
సారము లేని యీ జగము పారము నేర్చి వెలుంగు బుద్ధితో
పారము చూపబూని కవిపండిత పామర కారణార్థమున్
కారణహీనుడై ఘనవికార విదూరుడునైన బ్రహ్మమున్
సారముగా నెఱింగి భవసాగర తారణనావ జూపెడిన్.

అట్టి వ్యాసప్రోక్తమైన అధ్యాత్మ రామాయణమును నా ఎరుకకొలది తెనుగులో వ్రాసి తరించుటయే ఇందలి కథారంభమునకు మూల మనోరథము. సాహసమైనను కర్తవ్యము గాన తలపెట్టితిని. ఇందలి గుణదోషములను హంసలగు పాఠకులకు విడిచిపెట్టుచున్నాను.

# కథా ప్రారంభము

మాయాతీతం మాధవమాద్యం
జగదాద్యం మానాతీతం మోహవినాశం మునివంద్యం
యోగిధ్యేయం యోగవిధానం, వందే రామం
రంజితలోకం రమణీయం.

విశ్వమయుడైన రామున్ని కొలిచెదను. సోమశంకరుని భజిస్తాను. అజ్ఞానమును పోగొట్టి జ్ఞానమును సంపాదింపజేయు శంకర వచోమృతం చంద్రికను నేను కొలుచుచున్నాను. అప్రమేయుడు త్రియాతీతుడు, జ్ఞానమూర్తి మనోవాక్కులకు అగోచరుడు అయిన దక్షిణామూర్తిని నమస్కరించెదను.

సూతుడు చెప్పిన కథ :

నారద మహాముని లోకకళ్యాణము కొఱకు, సకల లోకములను సంచరించుచు సత్యలోకమును చేరెను. అచ్చట మూర్తీభవించిన వేదములతో పరివేష్టితుడయి సభాసదులను బాలసూర్యప్రభచే ప్రకాశింపజేయుచు పదేపదే మార్కండేయుడు మున్నగు మునీశ్వరులచే స్తుతింపబడుచు నున్నవాడు, సమస్త విషయములను తెలుపు జ్ఞాన సమన్వితుడు సరస్వతీదేవిచే కూడినవాడు భక్తులకు వెను వెంటనే కోరికలకు ఫలముల నిచ్చువాడు విశ్వప్రభువగు బ్రహ్మను చూచి నమస్కరించి స్తోత్రము చేసెను. సాష్టాంగదండ ప్రణామము జేసి కూర్చొనియున్న నారదుని జూచి బ్రహ్మ "నీవు దేనిని అడుగ దలచితివో నేను దానిని చెప్పెదను. అని అనెను. అంత నారదుడు "స్వామీ! ఇదివఱకు నేను మీనుండి ఎన్నియో వినవలసిన శుభాశుభవిషయములను వినియుంటిని. ఇప్పుడు నేను వినవలసినది ఒకే

విషయము. మీకు నా యందనుగ్రహ మున్నచో అది రహస్య మైనను చెప్ప గోరుచున్నాను. ఘోరమైన కలియుగము సంప్రాప్త మైనచో మానవులు పుణ్యములు నాచరింపక దురాచారరతులై సత్య వార్తాపరాంగ్ముఖులై ఇతరులను నిందించుటయందు ఆసక్తులై ఇతర స్త్రీలయందు, ఇతర ధనములందు లగ్నమైన మనస్సు కలవారయి పరహింస జేయుచు పశుబుద్ధికలిగి నాస్తికులై ఈ శరీరమే సర్వస్వ మని యెంచి తల్లిదండ్రులను కూడ ద్వేషించుచు, కామమునకు దాసులై స్త్రీల నాశ్రయించెదరు. బ్రాహ్మణులు వేదవిక్రయము చేసి జీవించుచు, లోభగ్రస్తులై మదమోహితులై, ధనార్జనకొఱకు విద్యల నభ్యసించుచు, పరవంచకులై తమ జాతి ధర్మములను, విడిచిపెట్టి జీవించెదరు. క్షత్రియులు కూడ అదేవిధముగా వైశ్యులు కూడ అదేవిధముగా తమతమ ధర్మములను వీడి సంచరించెదరు. శూద్రులు బ్రాహ్మణాచారములను స్వీకరించి యుందురు. స్త్రీలు భ్రష్టలై స్వభర్తృ నిందచేయుచు అత్తమామలకు ద్రోహము చేసె దరు. ఈ విధముగా నష్టబుద్ధులైన మానవులకు ఉత్తమ లోకములు ఎట్లు సంప్రాప్తించును. నా చిత్తము ఎల్లప్పుడు వీని విషయమై ఆందోళన గ్రస్తమై యున్నది. కలియుగములోని మానవులకు ఉత్తమ లోకప్రాప్తికి ఏదైన సులభమైన ఉపాయమున్నచో తమకు అన్నియు తెలియును గాన సెలవియ్య వలసినదిగా ప్రార్థించు చున్నాను.

అంత బ్రహ్మ "నారదా" నీవు యోగ్యముగా పలికితివి. నీవు చెప్పిన దుఃఖమునకు తగనుపాయమును చెప్పెదను గ్రహింపుము పూర్వకాలములో భక్తవత్సలయగు పార్వతీదేవి త్రిపురాసుర సంహా రము చేసిన శంకరుని సవినయముగా శ్రీరామతత్త్వమును ఉప దేశింప ప్రార్థించెను. అత్యుత్తమమగు ఆ ఉపదేశమే అధ్యాత్మ రామాయణముగా ప్రసిద్ధి చెందినది. శంకరుడు సాకల్యముగా శ్రీరామ తత్త్వమును ఇందుప దేశించెను. అందువలన అధ్యాత్మ

రామాయణముగా ప్రసిద్ధి చెందినది. ఈ అధ్యాత్మ రామాయణ తత్త్వమును సాకల్యముగా రాత్రింబవళ్లు పూజించి ఆనందమగ్నురాలై పార్వతీదేవి పరవశురాలై యుండెను.

లోకములో ఏ సమయములోనైనను అధ్యాత్మ రామాయణము ప్రచురింపబడి, ఆ సమయములో దానిని అధ్యయనము చేసినంత మాత్రాన సద్గతి కలుగును. అధ్యాత్మ రామాయణము ప్రభవించు వఱకు లోకములో బ్రహ్మహత్యాది పాపములు నశించవు. కలి విపరీతముగా ప్రవర్తించును. యమభటులు నిర్భయులై సంచరించెదరు. శాస్త్రములు పరస్పర వివాదములలో గ్రస్తములగును. మహాపురుషులుకూడ అధ్యాత్మ రామాయణము ప్రాదుర్భావము కానంతవఱకు శ్రీరామతత్త్వమును ఎఱుంగజాలరు. ఓ నారదముని! శ్రేష్ఠమైన అధ్యాత్మ రామాయణ పఠనమువలన కలిగెడు ఫలములను నేను సంపూర్ణముగా చెప్పలేను. అయినప్పటికి పాపరహితుడైన నారదమునీ ఏ కొద్దిపాటియో వివరించెదను. సావధానుడవై వినుము. పూర్వము సాక్షాత్ పరమశివుడు నాకు వినిపించెను. శ్రీరామ తత్త్వమును నేను నీకు సంపూర్ణముగా వివరింపలేను. అధ్యాత్మ రామాయణమందలి శ్లోకమాత్రమునుగాని, తదర్థమునుగాని భక్తియుక్తుడై ఎవరు పఠించెదరో వారాక్షణము నుండి పాపములనుండి విముక్తుడగును. ఎవరు ప్రతిదినము ఇతర విషయాక్తుడుగాక కేవలము అధ్యాత్మ రామాయణమును యథాశక్తిగా భక్తితో పఠించునో వానిని జీవన్ముక్తుడని చెప్పవలెను. శ్రద్ధాభక్తి సమన్వితుడై ప్రతిదినము అలసతలేక ఎవడు అధ్యాత్మరామాయణమును పూజించునో వానికి అశ్వమేధయాగ ఫలము లభించును. అనాదరముగా ఇతరులవలన తాను కోరకుండ యాదృచ్ఛికముగా అధ్యాత్మ రామాయణమును విన్నవాడు కూడ పాతకములనుండి విముక్తుడగును. ఎవ్వడు దగ్గఱగా అధ్యాత్మ రామాయణ గ్రంథమును ఉంచి నమస్కరించెదడో వాడు సర్వదేవార్చన ఫలమును

పొందును. అధ్యాత్మ రామాయణమును సంపూర్ణముగా వ్రాసి రామ భక్తులకు ఎవడిచ్చునో వానికి వేదాధ్యయనఫలము సర్వశాస్త్రములను చర్చించుట వలన కలుగు ఫలము లభించును. ఏకాదశినాడు ఎవరు సంపూర్ణముగా అధ్యాత్మ రామాయణమును సభాముఖముగా ఉపన్యసించునో వానికి గాయత్రీ ప్రత్యక్షర పునశ్చరణఫలము సంభవించును. శ్రీరామనవమినాడు ఉపవాసముచేసి, రాత్రియందు జాగరణముచేసి ఇతర మనస్కుడు గాక కేవలము అధ్యాత్మ రామాయణమును పఠించినను, వినినను, వానికి కురుక్షేత్రాది నిఖిల పుణ్యతీర్థములందు అనేక సమయములందు, వ్యాసునితో సమానులగు బ్రాహ్మణులకు సూర్యగ్రహణ కాలమందు తన శరీర భారముతో సమానమగు ధనమును దానముచేసిన ఫలము లభించును. ఇది సత్యము. ఇది సత్యము. ఇందులో సంశయము లేదు. రాత్రింబవళ్లు ఎవరు అధ్యాత్మ రామాయణమును గానము చేసెదరో వారి యాజ్ఞను ఇంద్రాదులు శిరసావహించెదరు. తదేకలగ్నుడై వ్రతమును బూని ఎవడు అధ్యాత్మ రామాయణమును పఠించునో వానికది కోటి గుణమునిచ్చును. సావధానచిత్తుడై ఎవడు శ్రీరామ హృదయమును ఈ అధ్యాత్మ రామాయణమును పఠించునో వాడు బ్రహ్మహత్యాపాతకుడైనను మూడు దినములలో పవిత్రుడగును. హనుమంతుని విగ్రహమును లేక ప్రతిమకు ఎదురుగా ఎవడు శ్రీరామ హృదయమును మూడుసార్లు మౌనియై పఠించునో వాడు సమస్త మనోరథములను పొందును. తులసిమొక్క సమీపము నందుగాని లేక రావిచెట్టుయొక్క సమీపమునందుగాని శ్రీరామ హృదయమగు ఈ అధ్యాత్మ రామాయణమును పఠించిన ఒక్కొక్క అక్షరము పఠించకొలది బ్రహ్మహత్యా పాపము క్రమక్రమముగా తొలగిపోవును. శ్రీరామ గీతామహాత్మ్యమును శంకరుడు సంపూర్ణముగా నెఱింగి యున్నాడు. పార్వతీదేవి అందుల సగమును మాత్రము ఎఱింగి యున్నది. ఆ కారణమువలన నేను ఇంచుకమాత్రము చెప్పు·

చున్నాను. పూరణముగా చెప్పవలసి కాదు. ఈ మాత్రము తెలిసి కొన్నను చిత్తశుద్ధి వెనువెంటనే కలుగును. శ్రీరామ గీత పఠించుట వలన ఏ పాపము నశించదో ఆ పాపము లోకములోని ఏ తీర్థమును సేవించినను నశించదు. అనగా ఎటువంటి పాపమైనను శ్రీరామ గీత పఠనమువలన నశించి తీరును. షడ్గుణైశ్వర్య సంపన్నుడగు శ్రీరామచంద్ర ప్రభువు ఉపనిషత్తులనెడి సముద్రమును మథించి లక్ష్మణుని కొఱకు అందించిన రామకథాసుధను పానము చేసి అమరులు కండు. కార్తవీర్యార్జునిని చంపదలచి జమదగ్ని సుతుడగు పరశురాముడు ధనుర్విద్య నభ్యసింప సంకల్పించి ఈశ్వర సమీపమును పొంది పార్వతీదేవి చేరిక పఠింపబడిన రామగీతను సావధానముగా విని గ్రహించి నారాయణాంశను పొందెను.

బ్రహ్మ హత్యాది పాపములనుండి నిష్కృతి కోరిన మానవుడు రామగీతను ఒక నెల దినములు పఠించిన విముక్తి కలుగును. దుష్టగ్రహణమువలన, నిషిద్ధాన్న భోజనమువలన, దురాలాపముల వలన మఱియు నితర దుష్కృత్యములు వలన కలిగిన పాపములను రామగీత నశింపచేయును. సాలగ్రామ శిలయందుగాని, తులసి యందుగాని లేక రావిచెట్టు ఎదుటగాని లేక యతీశ్వరుల సమక్షమునందుగాని రామగీతను భక్తితాత్పర్యములతో పఠించినవాడు ఉత్తమ పదములను పొందును. అట్టివానిని మనమూహింపజాలము. శ్రాద్ధకాలమందు రామగీతను పఠించుచు బ్రాహ్మణులను తినిపించునో వానియొక్క పితృదేవతలు విష్ణులోకమును పొందెదరు. ఏకాదశి నాడు నిరాహారుడు, జితేంద్రియుడు నగుచు, ద్వాదశినాడు రావిచెట్టు క్రింద కూర్చొని రామగీతను ఎవడు పఠించెదడో వాడు సాక్షాత్ శ్రీరామచంద్రుడే. వానిని సర్వదేవులు పూజించెదరు. దానము లేకుండగనే, ధ్యానము లేకుండగనే తీర్థస్నానములు లేకుండగనే

రామగీతము అభ్యసించినంత మాత్రాన మానవుడు అనంతఫలమును పొందుచున్నాడు. ఓ నారదా! ఇంకిన్ని మాటలెందుకు. తత్త్వమాలోచించిన శ్రుతి స్మృతి పురాణ ఇతిహాస ఆగమశతములు-శ్రీమదధ్యాత్మ రామాయణ కలాశకలముతో సమానములు కావు.

ఈ విధంగా మునీశ్వరుడైన నారద మహాముని కొఱకు బ్రహ్మ అధ్యాత్మ రామాయణ మాహాత్మ్యమును వినిపించెను. ఏ మానవుడు శ్రద్ధతో దీనిని చదువునో లేక వినునో వాడు దేవపూజితుడై విష్ణుపదవిని పొందును.

ఓం తత్సత్

# అధ్యాత్మ రామాయణము

## బాలకాండ

### ప్రథమ సర్గ

సనాతనుడగు పరమాత్మ జగములునేలిన ప్రభువు శ్రీ మహా విష్ణువు భూలోకములో ఆవిర్భవించుట.

నాశరహితుడు చిత్స్వరూపుడగు శ్రీమన్నారాయణుడు భూ భారమును పోగొట్టుటకు దేవతలచేత ప్రార్థింప బడ్డవాడై భూలోకములో సూర్యవంశమందు మాయామానవ రూపంలో అవతరించి, రాక్షస సంహారం కావించి లోకకళ్యాణంకొఱకు పాపములను పోగొట్టు తన కీర్తిని విస్తరింపజేసి తిరిగి తన నిజస్థానమగు వైకుంఠమున కేగెనో అటువంటి జానకీ ప్రభువును, నేను సేవించుచున్నాను. సృష్టిస్థితి లయములకు, ఏకైక కారణభూతుడు మాయకు ఆశ్రయుడయ్యు మాయలేని వాడును, మాయాతీతుడు చింతింపనలవి కాని రూపం కలవాడు ఆనంద స్వరూపుడు, ఉపాధిదోషములు లేని వాడును, తత్త్వవేత్తయు, స్వయంప్రకాశమానుడు అగు సీతాపతిని నేను నమస్కరించు చున్నాను. ఇతరములగు మనోచింతలు లేకుండ ఏ మానవులు ఎల్లప్పుడు సర్వపురాణ సారమైన అధ్యాత్మ రామాయణమును పఠించెదరో లేక వినెదరో వారు సర్వపాపవిముక్తులై సాక్షాత్ శ్రీహరిని పొందుచున్నారు. ఏ మానవుడు ఈ సంసార బంధంనుండి విముక్తిని కోరునో వాడు నిత్యము అధ్యాత్మ రామాయణమును పఠించవలెను. ఏ మానవుడు ప్రతినిత్యము అధ్యాత్మ రామాయణంను వినునో వాడు వెయ్యి గోవులను దానము చేసిన

ఫలితమును పొందును. శ్రీ శంకరుడనే పర్వతంనుండి ప్రవహించి నదియై శ్రీరాముడనే సముద్రములో కలసిపోయిన ఈ అధ్యాత్మ రామాయణమనే గంగామతల్లి మూడులోకములను పావనం చేయు చున్నది. ఒక దినమున కైలాసపర్వత శిఖరమందు, కోటిసూర్య ప్రభాభానమైన మందిరంలో రత్న ఖచిత సింహాసనమందు ధ్యాన నిష్ఠయందు ఉన్న వాడును, సిద్ధసంఘములచే సేవింపబడినవాడును, భయం లేనివాడు సకలపాపహరుండును అగు శంకరుడు ఉండగా, ఆ పరమేశ్వరుని ఎడమ తొడయందు కూర్చొనియున్న పార్వతీ దేవి, భక్తిపారవశ్యముతో వినమితగాత్రియై పలికెను.

హే జగన్నివాస, దేవ, నీకు నమస్కారం. సర్వాంతఃకరణ సాక్షివి నీవు పరమేశ్వరుడవు. నీవు సనాతనుడవు. అందువలన పురుషోత్తముడైన శ్రీమన్నారాయణుని సనాతనతత్త్వము గూర్చి నిన్ను అడుగుచున్నాను. అత్యంత గోప్యమైనదియు, ఇతరులకు చెప్పరానిదియు నగు విషయమును భక్తజనులకు మహానుభావులు చెప్పెదరు. ఓ దేవదేవ! నేను నీకు భక్తురాలను. నాకు నీవు ప్రియుడవు కాన నేను అడిగినదానిని చెప్ప ప్రార్థన. ఏ జ్ఞానం ద్వారా మనుష్యుడు సంసార సాగరమును దాటగలడో అట్టి విజ్ఞాన సహితమైన భక్తివైరాగ్య యుక్తమైన జ్ఞానమును అల్పశబ్దములతో నుపదేశింపుడు. నేను ఆడదానిని అయినను నీవు చెప్పినదానినీ గ్రహించగలను. ఇంకొక పరమ రహస్యమును కూడ దేవదేవ అడుగుచున్నాను. దానినే ముందుగా అనుగ్రహింపుడు. ఓ కమల నయన! సమస్త లోకముల సారభూతుడయిన శ్రీరామచంద్రుని యందు విశుద్ధమైన భక్తి యీ సంసారసాగరంను దాటుటకు నావ యగుచున్నది. జరామరణరూపమగు సంసారంను దాటుటకు భక్తి పరమప్రసిద్ధమైనది. దానికంటె వేరొక సాధనం లేదు. అయినప్పటికీ నా హృదయంలోని సంశయమనెడి ముడిని నీ నిర్మలవాక్కులచే భేదింప సమర్థుడవు నీవు. సిద్ధపురుషులు, అప్రమత్తులై అహర్ని

శలు శ్రీరామచంద్రమూర్తి యొక్కడే అద్వైతి మాయావశుడు గాక వర్తించు పరమ దైవమని చెప్పుచు సేవించెదరు. ఆ విధంగా పరమ పదంను పొందెదరు. మఱికొంతమంది శ్రీరామచంద్రమూర్తి సాక్షాత్ పరమాత్మ స్వరూపమైనప్పటికి తన మాయచేత కప్పబడ్డ వాడయి తనయొక్క నిజస్వరూపంను తెలిసికొనలేక పోవుచున్నా డనియు వశిష్టాది మహామునుల ఉపదేశమువలన ఆత్మతత్త్వమును ఎఱిగినాడనియు చెప్పుదురు. ఒకవేళ రాముడు స్వయముగా ఆత్మ తత్త్వమును ఎరింగియున్నచో అట్టి పరమాత్మకు, సీతావిషయిక విలాపమెందులకు? ఒకవేళ రామునకు పరతత్త్వము తెలియనిచో అతడుకూడ సమస్త మానవులతో సమానుడే. అటువంటి వానిని ఎందుకు భజన చేయవలెను? ఈ నా సంశయంను ఛేదించు వాక్య ములతో నాకు సమాధానం ఇప్పించ వలసినదిగా కోరుచున్నాను. అంత భగవంతుడగు మహదేవుడు పలికెను.

"దేవీ"! నీవు చాలాధన్యురాలవు. పరమ రహస్యమైనదియు నిగూఢమైన శ్రీరామతత్త్వమును గూర్చి నీవడిగినావు. ఇంతవఱకు ఇతరులెవరు నన్నడిగి యుండలేదు. నీవు తెలసికొనుటకు అడిగితివి. ఈ కారణంవలన, నేను శ్రీరామచంద్ర మూర్తికి వందనం చేయుచు నీయొక్క ప్రశ్నకు సమాధానం నిచ్చెదను: నిస్సందేహంగా శ్రీరామచంద్ర ప్రభువు పరాత్పరుడు, పరమాత్మ, ఆదిరహితుడు, ఆనంద స్వరూపుడు, అనన్యుడు, పురుషోత్తముడు కూడ. అందులో సంశయం లేదు. ప్రకృతికంటె పురాణుడు, ఆదిరహితుడు, ఆనంద స్వరూపుడు, పురుషోత్తముడయి యున్నాడు. తనయొక్క మాయ చేతనే యీ సర్వప్రపంచంను సృష్టించి లోపల బయట అన్నిదిశ లందు వ్యాపించి ఉన్నాడు. (తత్ సృష్ట్వాతదేవాను ప్రావిశత్) సమస్త ప్రాణి హృదయాంతర్వర్తియై తనచేత సృజింపబడిన జగ త్తులో తాను ప్రవేశించెను. అయస్కాంతంయొక్క సన్నిధిలో జడ మైన ఇనుము తత్క్షణము తామ చలించుచున్నదో ఆ విధంగానే శ్రీరామ

చంద్ర ప్రభువు నన్ని ధిమాత్రానతః సమస్త ప్రపంచము ఎల్లప్పుడు అన్ని దిశలందును భ్రమించును. మాయచేత ఆవరింపబడిన మూఢ జనులు దీనిని తెలిసికొనజాలరు. ఇట్టి యజ్ఞానులు మాయాతీతుడై, శుద్ధుడై, బుద్ధుడై యుండెడి పరమాత్మయందు కూడ తమ యజ్ఞాన మును ఆరోపణ చేయుదురు. వారు ఎల్లప్పుడు స్త్రీ పుత్రాదులందు లగ్నమనస్కులయి, పామరులయి, కోరికలకు దాసులయి, జరా మరణ రూపసంసార చక్రంలో పడిపోవుదురు. ఇట్టి జ్ఞానశూన్యులు తమ కంఠమందలి బంగారుగొలుసును ఏ విధంగా కనుగొనలేరో ఆవిధంగనే తమ హృదయాకాశమందున్న ఆత్మారాముని కనుగొన జాలరు. యదార్థమేమనగా సూర్యోదయమైన పిదప చీకట్లు పోవు రీతిని, తేజోరూపుడు, విశుద్ధవిజ్ఞాన ఘనుడు ప్రకృతికంటె అతీతుడు పరమాత్మ స్వరూపుడు అగు శ్రీరామచంద్ర ప్రభువునందు అవిద్య ఎట్లుండును ? ఉండదు. దృష్టిదోషము కలవానికి, కదలకుండా నిశ్చలముగా ఉన్న ఇండ్లు మున్నగునవి కదులుచున్నట్లు కనపడునో ఆవిధముగనే, అజ్ఞానులు తమ శరీరము, ఇంద్రియంలు చేయుచున్న కార్యకలాపమును ఆత్మయందు ఆరోపణ చేసికొని మోహములో పడి పోవుచున్నారు. సూర్యునియందు ఏవిధంగా రాత్రిపగలు అను భేదము లేదో, అతడు సర్వకాలములందు ఏకరూపుడయి జ్యోతిర్మయు డయి ప్రకాశించుచున్నాడో ఆ విధంగనే శుద్ధచిత్ స్వరూపుడైన రామప్రభువునందు, భగవత్‌స్వరూపుడు విష్ణురూపుడైన రాముని యందు జ్ఞాన అజ్ఞానములు ఏ విధంగ ఉండగలవు ? ఉండజాలవు. అందువలన పరానంద స్వరూపుడు విజ్ఞాన ఘనుడు అయిన శ్రీరా మునియందు తమస్సనేటి అజ్ఞానలేశము కూడ లేదు. ఎందువలన అనగా కమలనయనుడైన శ్రీరామచంద్రుడు మాయకు అధిష్ఠానము కావున అందుచేత మాయ అతనిని మోహింపచేయజాలదు. ఈ పవిత్ర హృదయములో రహస్యం దుర్లభమయినప్పటికి ఓ దేవీ ! మోక్షసాధనమగు సీతారామాంజనేయ సంవాదమును నీకు చెప్పెదను. వినుము.

పూర్వకాలమునందు శ్రీరామచంద్రుడు దేవతలకు కంటకుడైన రావణాసురుని పుత్రమిత్ర బాంధవసమేతంగా సంహరించి సీతమ్మ, సుగ్రీవుడు, హనుమంతుడు, లక్ష్మణుడు మున్నగువారలతో అయోధ్యానగరమును ప్రవేశించెను. అంతట వశిష్టాది ఋషులచేత పట్టాభిషిక్తుడైన పిదప, కోటి సూర్యప్రభాభాసమానుడై, శ్రీరామచంద్ర ప్రభువు సింహాసన మధివసించి అమ్మ సీతమ్మతో ఇట్లు పలికెను. ప్రతి ఫలాపేక్ష లేకుండ రామకార్యమును సాధించినట్టి వాడు జ్ఞానకాంక్షి, కోరికలు లేనివాడు బుద్ధిమంతుడు, నమ్రుడు అంజల్యగ్రముతో అగ్రభాగమందు నిలబడియున్నట్టి అంజనేయునికి తత్త్వోపదేశము చేయమని పలికెను. మరియు హనుమంతుడు నిష్కల్మషుడు జ్ఞానోపదేశమునకు అర్హుడు మన యిరువురియందు ప్రగాఢమైన భక్తికలవాడు కావున వీనికి నా తత్త్వమును ఉపదేశింపవలెనని శ్రీరాముడు పలికెను. లోకవిమోహిని యగు సీతమ్మ శ్రీరాముని విశ్వతత్త్వమును ఉపదేశించెను. ఓ హనుమ! శ్రీరామచంద్రుడు సాక్షాత్ సచ్చిదానంద ఘనుడగు అద్వితీయ పరబ్రహ్మమని తెలిసికొనుము. ఇది నిస్పందేహము. ఉపాధిరహితుడు సత్తుమాత్రుడు, ఇంద్రియములకు మనస్సుకు గోచరము కానివాడు, ఆనంద ఘనుడు, నిర్మలుడు, శాంతుడు, నిర్వికారుడు, నిరంజనుడు, సర్వవ్యాపకుడు, స్వయంప్రకాశుడు, పాపరహితుడు అగు పరమాత్మయే శ్రీరాముడు. నేను సృష్టి స్థితి లయములకు కారణమగు మూలప్రకృతిని అయియున్నాను. అతని సన్నిధిలో ఒక త్రుటికాలములో ఈ సమస్త విశ్వమును, సృష్టించుచున్నాను. అజ్ఞానులు నేను సృష్టించినదానిని రామునియందారోపించుచున్నారు. శ్రీరాముడు సాక్షాత్ పరమాత్మ స్వరూపుడు అగుటవలననే అతి పవిత్రమైన రఘువంశమందు, అత్యంత పవిత్రమైన అయోధ్యలో జన్మించెను. విశ్వామిత్రునికి సహాయము చేయుట అతని యాగ సంరక్షణము, అహల్యా శాప విమోచనము, శివ ధనుర్భంగము, నా పాణిగ్రహణము, పరశురామ

గర్వభంగము, ఆ తరువాత పన్నెండు సంవత్సరములు అయోధ్యలో కలిసియుండుట, దండకారణ్య ప్రవేశము, విరాధవధ, మాయలేడి రూపముధరించిన మారీచుని వధించుట మాయసీతమ్మకు అపహరణము, జటాయువు, కంబంధునకు ముక్తిని ప్రసాదించుట శబరి పూజలను గ్రహించుట సుగ్రీవమైత్రి వాలివధ. సీతాన్వేషణము, సేతుబంధము లంకను ముట్టడించుట, రావణ సంహారము, విభీషణ రాజ్యప్రతిష్ఠ, నాతో కూడ పుష్పకవిమానములో కూర్చొని అయోధ్యకు వచ్చుట తిరిగి యీ విధంగా పట్టాభిషిక్తుడగుట మున్నగు సర్వకర్మలు నాచేత చేయబడినవి. వీనిని మూర్ఖులైన వారు, నిర్వికారుడు నిఖిలాత్మ స్వరూపుడు అయిన రాముని యందు అజ్ఞానముచే ఆరోపించు చున్నారు. నిజమాలోచిస్తే శ్రీరామ చంద్రుడు కదలలేదు, కూర్చొనలేదు, దుఃఖించలేదు, కోరలేదు, విడిచిపెట్టుట లేదు. అంతేకాదు. అతడు ఏ పనిని చేయలేదు. అతడానంద స్వరూపుడు. మార్పు లేని వాడు. మాయాగుణములను పొందనివాడు. నిత్యప్రకాశుడు అని శ్రీరామతత్త్వమును సీతమ్మ హనుమంతునికి ఉపదేశించెను. ఆ తరువాత శ్రీరాముడు స్వయముగా ఆంజనేయునితో పలికెను. హే ఆంజనేయా! ఆత్మ అంటే అనాత్మ అంటే పరమాత్మ అంటే వాని నిజస్వరూపమును చెప్పుచున్నాను వినుము. గొప్పదైన ఆకాశము ఒక సరస్సులో మూడు విధములుగా కనపడుచున్నది. 1) మహాకాశము, 2) జలముచేత వ్యాప్తమైన ఆకాశము, 3) ప్రతిబింబితాకాశము. ఆత్మకూడ 1) సర్వత్ర వ్యాప్తము 2) బుద్ధిచేత అవచ్ఛిన్నము 3) బుద్ధియందు ప్రతిబింబితముగా కనపడును. బుద్ధియందు ప్రతిబింబితమైన దాని ఆభాస చైతన్యమంటారు. అనగా చిదాభాసముచేత కూడిన బుద్ధి సర్వకార్యములను చేయుచున్నది. కాని మూర్ఖులు, జ్ఞానము లేనివారు భ్రాంతి వశులై సర్వత్ర వ్యాప్తమై, నిర్వికారమై, సాక్షిరూపమైన ఆత్మ యందు కర్తృత్వమును జీవత్వమును ఆరోపించుచున్నారు. ఆత్మకు

కర్తృత్వ భోక్తృత్వములు లేవు. అఖండమైన పరబ్రహ్మ అవిచ్ఛిన్నమై యున్నది. వికల్పమున, విచ్ఛిన్నముగా, ఖండితముగా కనబడును. అవిచ్ఛిన్నమగు పరబ్రహ్మము పూర్ణమైనది ఒక్కటిగా ఉన్నది. "తత్త్వమసి" నీవు ఆ పరమాత్మవు అయియున్నావు. ఇత్యాది మహావాక్యములవలన జీవాత్మ పరమాత్మల ఏకత్వము మనకు తెలియబడుచున్నది. ఈ విధమగు బ్రహ్మజ్ఞానము ఎప్పుడు కలుగునో అప్పుడు అవిద్య నశించును. ఇందులో సంశయము లేదు. నా భక్తుడు పైని చెప్పబడిన తత్త్వమును తెలిసినవాడై నా స్వరూప ప్రాప్తికి అర్హతను పొందెదడు. నాయందు భక్తిలేని మానవులకు, శాస్త్రచర్చ యనెడి గోతులలో మునిగినవారికి జ్ఞానము కలుగదు. మోక్షము కలుగదు. ఎన్ని జన్మలెత్తినను వారికి రెండును కలుగవు. పైని చెప్పినదానిని రామహృదయ మంటారు. నాచేత స్వయముగా చెప్పబడ్డ రామతత్త్వము రహస్యమైనదియై రామ హృదయమై యున్నది. ఓ హనుమంతా ! నేనే నీకు స్వయముగా చెప్పితిని. నా భక్తిలేని, దుష్టునకు ఇంద్రసంపత్తుకంటె అధికమైన సంపత్తును ఇచ్చినప్పటికి దీనిని ఉపదేశింప కూడదు. శ్రీరామ హృదయమును రామునియందు భక్తిలేనివారికి ఉపదేశము చేయ కూడదు. ఇంద్రలోక భోగములకంటె అధిక భోగముల నిచ్చినను చేయకూడదు. పై విధముగా శ్రీరాముడు హనుమకు స్వయముగా శ్రీరామ హృదయము నుపదేశించెను. అని పరమేశ్వరుడు పార్వతీ దేవికి చెప్పెను. ఓ దేవి ! నాచేత నీకొఱకు శ్రీరామ హృదయము చెప్పబడినది. ఇది రహస్యాతి రహస్యము పాపములను పోగొట్టునది పవిత్రమైనది హృదయానందకర మైనది. సర్వ వేదాంతసార సంగ్రహము. దీనిని సాక్షాత్తు శ్రీరామచంద్రుడు ఉపదేశించెను. ఏ మానవుడు ఎల్లవేళలందు దీనిని భక్తితో పఠించెదడో వాడు జీవన్ముక్తు డగుచున్నాడు. ఇందులో సందేహము లేదు దేవి. అనేక జన్మలందు చేయబడిన బ్రహ్మహత్యాది పాపములను కూడ రామ

హృదయ పాఠము నశింపజేయును. ఇందుల సంశయము ఎందు వలన? స్వయముగా రాముడు చెప్పినది ఇది. అతిభ్రష్టుడు, మహా పాపి, పరధన పరస్త్రీలయందు నిత్యము ఆసక్తి కలిగియున్నవాడ యినను, దొంగయైనను బ్రహ్మహత్య, మాతృహత్య, పితృహత్యలు చేసినవాడు కూడ రాముని పూజించి రామహృదయమును చదివి నచో అటువంటి మానవుడు యోగిపుంగవులుకూడ పొందరాని పరమ పదమును పొందుచున్నాడు. ఇట్లు అధ్యాత్మ రామాయణమందలి శ్రీరామహృదయమనే బాలకాండలోని ప్రథమ సర్గము సమాప్తము.

—:●:—

# బాలకాండ

## రెండవ సర్గ

పాపభారమును భరించలేని భూమాత బ్రహ్మాది దేవతలను ప్రార్థించుట. ఆమె ప్రార్థనను మన్నించి ఆమెను భగవంతుడు ఓదార్చుట—పార్వతీదేవి పలికెను.

జగత్ ప్రభువగు మహేశ్వరా ! ధన్యురాలను. కృతార్థురాలను. అనుగృహీతురాలను. నాయొక్క ముఖ్యమైన సందేహము పటాపంచల మాయెను. నీ అనుగ్రహమువలన నీ ముఖమునుండి ప్రవహించిన శ్రీరామతత్త్వామృత రసాయనమును పానముచేసిన నాకు మనస్సు తృప్తి పొందలేదు. శ్రీరామునియొక్క కథను సంక్షిప్తముగా నీ ముఖమునుండి వినకోరిక గలిగినది. విస్తరముగా నాకు బోధపడునట్లుగా ఉపదేశించవలెనని ప్రార్థించెను. అంత పరమేశ్వరుడు రహస్యాతిరహస్యమైనదియు, శ్రీరామునిచేత స్వయముగా నాకొఱకు ఉపదేశింపబడిన అధ్యాత్మ రామాయణ చరితమును వినుము దేవి చెప్పెదను. సాక్షాత్ శ్రీరాముడు నాకు చెప్పినది తాపత్రయములను పోగొట్టునది, అజ్ఞానమువలన జనించిన భయమును పోగొట్టునదియు, దేనిని వింటే పుత్రసంతతిని దీర్ఘాయువును అతి సమృద్ధిని పొందెదరో అట్టి రామకథను చెప్పెదను. వినుము.

తొల్లియొకనాడు రావణాది రాక్షసులయొక్క భారముచేత ఖిన్నురాలై భూమాత ఆవురూపమును ధరించి దేవతలతోడను, మునీశ్వరులతోడను, బ్రహ్మలోకమునకు పోయి విలపించుచు బ్రహ్మగారికి తనకు కలిగిన సర్వదుఃఖములను నివేదించుకొనెను. బ్రహ్మ

క్షణమాత్రము హృదయమునందు ధ్యానమునలిపి సర్వాంతర్యామి యగుటవలన భూమాతయొక్క దుఃఖమును పోగొట్టు ఉపాయమును మనసులో తెలిసికొనెను. వెంటనే సమస్త దేవతలు వెంట రాగా భూమాతతో కూడా పాలసముద్రప్రాంతమును చేరెను. అచ్చట అత్యంత నిర్మలమైన మనస్సుతో ఆనందబాష్పములతో, సర్వాంతర్యామియు జరామరణ రహితుడు, సర్వజ్ఞుడును అగు విష్ణువును స్వచ్ఛందమైన భక్తిపారవశ్యముతో వేదములందు, పురాణములందు ప్రసిద్ధములయిన నామములతో గానముచేసెను. అంత శ్రీహరి వేయిమంది సూర్యులకాంతి గలవాడై చీకట్లను పోగొట్టుచు తూర్పు దిక్కున ఆవిర్భవించెను. కృతకృత్యులు కానివారికి దర్శనీయుడు కానట్టియు, ఇంద్రనీలకాంతి గలట్టియు, మందస్మిత వదనారవిందము గలవానిని, పద్మలోచనుని కిరీటము, హారము, కేయూరములను ధరించినవానిని, కుండలములు, కంకణములుతో విరాజిల్లు వానిని, శ్రీవత్సముయొక్కయు, కౌస్తుభముయొక్కయు, కాంతిచే ప్రకాశించు చున్న వానిని, ఇరుపార్శ్వములందు స్తోత్రపాఠములు గావించుచు సనకసనందనాదులు గలవానిని శంఖము, చక్రము, గద, పద్మము, వనమాలలచేత విరాజిల్లు చున్న వాని బంగారు యజ్ఞోపవీతమును ధరించినవానిని, బంగారురంగుగల పట్టుబట్టలను ధరించినవానిని శ్రీదేవి భూదేవులతో కూడినవానిని, గరుత్మంతుని యందు అధివసించియున్న శ్రీ మహావిష్ణువును, ఆనందముచేతను గద్గదస్వరముచేతను బ్రహ్మగారు స్తోత్రము చేయ నారంభించిరి. హే నారాయణ ప్రభూ! కర్మపాశములనుండి విముక్తులైన జీవన్ముక్తులు తమ ప్రాణమనోబుద్ధీంద్రియములచేతను మనస్సుచేతను దేనిని నిత్యము ఆరాధించెదరో అట్టి నీ చరణారవిందమునకు నమస్కారము. నీవు నీయొక్క సత్వ రజస్తమోగుణమయమైన మాయచేత ఈ జగత్తును పుట్టించి, పాలించి, లయ మొనరించు చున్నావు. కాని జ్ఞానస్వరూపుడవు. ఆనంద స్వరూపుడవు అగు నీవు ఆ మాయ

యందు బద్ధుకవు కాలేదు. ఓ భగవంతుడా ! నీయొక్క శుభ్రి స్వచ్ఛకీర్తియందు మగ్నులగు మానవుల అంతరాత్మ శుద్ధమయి పోవును. దానము, వేదాధ్యయనము మున్నగు కర్మల నాచరించిన వారికైనను నీయందు భక్తి వినా హృదయము పవిత్రము కాజాలదు. అందువలన భక్తులైన మునిజనులు నిరంతరము దేనిని ధ్యానించెదరో అలాగుననే నేనుకూడ నా చిత్తమందలి మలిన వాననలు పోయి దోషములు నశించుటకు నీ పాదపద్మముల దర్శనము చేసికొంటిని. బ్రహ్మాదిదేవతలందరు ముందుగా నీ చరణకమలములను వారివారి స్వార్థసిద్ధులకు ధ్యానము చేసియున్నారు. జ్ఞానులైన మునులు అపరోక్షానుభవము కొఱకు తమ హృదయకమలందు నిరంతరము నీ పాద పద్మములను ధ్యానించెదరు. లక్ష్మీదేవి కూడ నీ వక్షఃస్థలమునందు స్థానమును పొందిన దయున్, నీ చరణారవింద పూజానమయమందు సమర్పించబడిన తులసి మాలను సపత్ని వలె స్పర్థించుచున్నది. అనగా లక్ష్మీదేవి విష్ణు పాదములందు తులసిమాలను కూడ సహించలేదు. ఎందుకంటె ఇతరులకచ్చట చోటు ఇవ్వకూడదని ఆమె స్వార్థము. నీ పాద పద్మములందు పూజచేసెడి భక్తులయందు, లక్ష్మీదేవికంటె నీకు ప్రేమ అధికము. నీయొక్క నిజతత్త్వమును తెలిసిన భక్తులు నీ పాదపద్మ సేవయందే ఎక్కువ కోరిక కలిగియుంటారు. అందువలన నాకు కూడ నీ పాదపద్మములందు సర్వకాల సర్వావస్థలయందు అధికమగు భక్తి కలుగుగాక. ఎందువలెనంటె సంసారమనెడి రోగమువలన తపించెడి జనులకు నీయందు భక్తి ఏకమాత్రమైన ఔషధమై యున్నది. ఈ విధముగ పలుకుచున్న బ్రహ్మను చూచి భగవంతుడగు విష్ణువు నేనేమి చేయగలనని అడిగెను. అందులకు సంతుష్టాంతరంగుడై బ్రహ్మగారు తిరిగి చెప్ప నారంభించెను. ఓ భగవంతుడా ! శ్రీహరీ పులస్త్యుని కుమారుడగు రావణుడు నాచేత ఇవ్వబడిన వరములచేత గర్వించినవాడై మూడు లోకములకు

మఱియు ఇంద్రాదిదేవతలకు బాధలను కలిగించు చున్నాడు. మంగళస్వరూపుడవగు శ్రీహరీ వానికి మానవునిచేత చావుకలుగునని నేను నియమించినాను. అందువలన నీవు మనుష్యజన్మమును పొంది దేవతలకు శత్రువగు రావణాసురుని సంహరింపుము. అంత శ్రీహరి నేను కశ్యపుని తపస్సుకు సంతుష్టుడనై అతనికి వరమిచ్చితిని. ఆ వర ప్రభావఫలముగా నాతడు నన్ను తన పుత్రుడుగా నుద్భవింపమని వేడినాడు. నేను అందుల కంగీకరించితిని. అతడిప్పుడు భూలోకములో దశరథుడుగా ఉంటున్నాడు. అతనికి నేను పుత్రరూపముతో వేరువేరుగా నాలుగు అంశలతో కౌసల్య యొక్కయు మఱి యిద్దరి మాతృమూర్తుల యొక్కయు గర్భములందు జన్మమెత్తెదను. ఆ సమయమందు నాయొక్క యోగమాయ జనకమహారాజు ఇంట్లో సీతారూపముతో పుట్టును. నేను ఆమెను నాతోకూడ తీసికొని నీయొక్క కార్యమును సంపూర్ణముగా నిర్వర్తించెదను. ఈ విధముగా చెప్పి భగవంతుడగు విష్ణువు అంతర్ధానమాయెను. అంతట బ్రహ్మగారు దేవతల నుద్దేశించి పలికెను. ఓ దేవతలారా ! శ్రీ మహావిష్ణువు మానుషరూపముతో రఘుకులమునందు జన్మించెదడు. మీరుకూడా మీమీ అంశలద్వారా వానరవంశమునందు పుత్రోత్పత్తి గావింపుడు. శ్రీ మహావిష్ణువు భూలోకము నందున్నంతవఱకు మీరు అతనికి సహాయము చేయవలెను. ఈ విధముగా దేవతల కాదేశించి భూదేవిని ఓదార్చి బ్రహ్మ తన లోకమున కరిగి నిశ్చింతగా ఉండెను. దేవతలుకూడ కోతి రూపములను ధరించినవారయి అచ్చటచ్చట పర్వతములతోను వృక్షములతోను యుద్ధము చేయుచు మహాబలధారులయి భగవంతుడగు శ్రీహరి అవతారమునకు నిరీక్షించుచు హరి సహాయము నపేక్షించుచు నుండిరి.

బాలకాండయందలి ఉమామహేశ్వర సంవాదమనెడి రెండవ సర్గము సమాప్తము.

మూడవ సర్గ

# శ్రీరామచంద్ర జననము - బాల్యలీలలు

భగవంతుడగు భవుడు భగవతియగు పార్వతితో చెప్పెను.

సత్యవాక్య పరిపాలకుడు అన్ని లోకములందు వ్యాపించిన కీర్తి కలవాడు వీరుడు శ్రీమంతుడు అగు దశరథ మహారాజు సంతానము లేనందున దుఃఖించుచు తమ కులగురువగు వశిష్ఠుని పిలిపించి నమస్కరించి పలికెను. స్వామీ! "నాకు ఏవిధమున సర్వలక్షణ సంపన్నులగు పుత్రులు పుట్టెదరు? పుత్రహీనుడనగు నాకు ఈ సమస్త రాజ్యములు దుఃఖకారకము లగుచున్నవి. అని పలికెను. అంతట వశిష్ఠ మహర్షి "తమకు" తప్పక పుత్రులు కలిగెదరనియు, అపర లోకపాలురువలె ప్రకాశించుచు బలపరాక్రమ సంపన్నులగు నలుగురు కుమారులు కలిగెదరనియు శాంతాకుమారి భర్తయు తపోధనుడును అగు ఋష్యశృంగ మహామునిని తెప్పించి మాతోకూడ పుత్రకామేష్టి యాగమును వెంటనే చేయమని నుడివెను. చాలా మంచిమాట యని పొంగి దశరథుడు ఋష్యశృంగుని పిలిపించి, మంత్రులతో కూడ పవిత్రుడై నిష్ణాతులైన మునివరులతో యాగమును చేయుచుండెను. శ్రద్ధతో హోమములు చేయుచుండ, తప్తమగు బంగారు రూపమును ధరించిన అగ్నిహోత్రుడు అవతరించి బంగారుపాత్రలో ఉంచబడిన పాయసమును స్వీకరించవలని ఇది దేవతల నిర్మితమయిన పాయసమనియు పుత్రుల నొసగును. దీనిని స్వీకరింపుము. సాక్షాన్మహా విష్ణువును నీవు పుత్రునిగా పొందగలవని చెప్పి యంతర్ధాన మాయెను. దశరథుడు తన కోరిక నెరవేరినదని ఋషుల నందరిని కొనియాడెను. వశిష్ఠుని పాదపద్మము

లకు నమస్కరించెను. ఋష్యశృంగునకు కూడ ప్రణమిల్లెను. వారి రువురి యాజ్ఞచే, సావధానచిత్తుడై, కౌసల్యకు, సగభాగమును కైకేయికి సగభాగమును పంచిపెట్టెను. ఆ సమయములో సుమిత్ర రాగా కౌసల్య తనవంతు పాయసములో సగమామెకిచ్చెను. కైకేయి కూడ సుమిత్రకు సగభాగము నిచ్చెను. ఎవరి పాయసమును వారు ముగ్గురు భుజించిరి. కాలక్రమమున వారు ముగ్గురు గర్భవతు లైరి. పదియవ మాసమందు కౌసల్య మహాశక్తి సంపన్నుడగు బాలుని ప్రసవించెను. చైత్ర శుద్ధ నవమినాడు పునర్వసూ నక్ష త్రము. కర్కాటక లగ్నము. ఐదు గ్రహములకు ఉచ్ఛస్థితి. మేష మందు రవియుండగా నాదిదేవుడగు శ్రీ మహావిష్ణువు జన్మించెను. ఆకాశమునుండి దేవతలు పుష్పవర్షమును కురిపించిరి. ఆ శిశువు నల్లకలువల రంగు, పట్టుబట్టలు ధరించినవాడు, నాలుగు భుజములు కలవాడు రక్తలోచనుడు, దివ్యకుండలధారి వేయి సూర్యులతో సమానమైన కాంతి కలవాడు, అందమైన కేశములు, చక్కని కిరీ టము, శంఖ, చక్ర, గదా, వైజయంతీ మాలలతో ఒప్పువాడు, హృదయమందలి అనుగ్రహమును సూచించు చక్కని మందహాసము కలవాడు దయ ననుగ్రహించు కండ్లు, శ్రీవత్సము మణిహారము, బాహుపురులు అందెలు కలవాడు పరమాత్మ స్వరూపుడు అయి కౌసల్యకు ఆనందమొనగెను. ఆశ్చర్యచకితయగు కౌసల్య, కండ్ల నిండ ఆనందబాష్పములు పొంగి పొర్లగా రెండుచేతులు జోడించి నమస్కరించి "హే దేవదేవ! శంఖ చక్ర గదాధర నీవు పరాత్పరు డగు పురుషోత్తముడవు అచ్యుతుడు అనంతుడు వాక్కులకు గోచరిం చనివాడు పూర్ణుడు అగు ఆ పరమాత్మవు నీవు వేదవిదులయిన జను లందరు నిన్ను జ్ఞానస్వరూపుడవని నుతించెదరు. సృష్టిస్థితి లయములను నీవే చేయుచున్నావు. నీవు తురీయమందు ఎల్లప్పుడు ఉండెదవు. గుణత్రయము నిన్నాకర్షించ లేవు. నీవు అమలుడవు. అన్ని పనులను చేసినను నీవు కర్తవు కావు. నీవు చలించుచున్నావు

అయినను నీకు సంచారము లేదు. వినుచున్నావు వినుటలేదున్నట్లు కనుపిస్తావు. చూచుచున్నావు చూచుటలేనట్లు కనుపిస్తావు. మనః ప్రాణములు లేనివాడవు. సర్వభూత హృదయములందును సమముగా నున్నావు అయినను అజ్ఞానులకు కనపడవు. నీ కుక్షిలో బ్రహ్మాండములన్నియు అణు స్వరూపముగా నున్నవి. నీవు నా గర్భమందు జన్మించితివని లోకములకు చెప్పుచున్నావు. భక్తుల యందు నీకుగల పారవశ్యతను చూచుచున్నాను. రఘువంశతిలక నేను మాయచేత సంసారసాగరమందు మునిగి భర్త, పిల్లలు, ధనము అను మూడింటిలో రక్తురాలను ఇప్పుడే నీ పాదమూలమును చూచితిని. ఎల్లకాలములందు నీ యాదివ్యమంగళ రూపము నా హృదయమందుండు గాక. ప్రపంచమును మోహింపజేయు నీ మాయ నన్నెప్పుడు ఆవరింపకుండు గాక. హే విశ్వాత్మ నీయొక్క యీ అలౌకిక రూపమును ఉపసంహరింపుము అత్యంత కోమలము, మహానంద సంభరితమును అగు నీ బాలభావమును చూపించుము. సుందరములగు నీ యాలింగనములతో ముద్దు పలుకులతో నా యజ్ఞానమును దాటగలను. అంతట భగవంతుడు పలికెను.

అమ్మా ! నీకేది యిష్టమో ఆ విధముగనే అంతయు జరుగుగాక. ఇంకొక విధముగ జరుగకూడదు. నేను బ్రహ్మచేత భూభారమును తగ్గించుటకు, రావణవధను కావించుటకు మానుషరూపమును ధరింప ప్రార్థితుడనయితిని. నీచేతను దశరథునిచేతను మీమీ తపస్సులచేత ఆరాధింపబడితిని. నన్ను పుత్రునిగా కావలెనని కోరినారు. ఆ విధముగనే జరిగినది. నీవు చూచిన యీ నా రూపము మీ పూర్వజన్మల పుణ్యఫలము. ఇతరులకు పొందరాని నా దర్శనము మోక్షము నిచ్చును, మన యీ సంవాదమును విన్నను, పఠించినను వారు నా సారూప్యమును పొందుచున్నారు. మరణకాలమందు వారికి నా స్మృతి కలుగును. ఈవిధముగ పలికి శ్రీమన్నా

రాయణుడు బాలుడయి ఏడ్వనారంభించెను. నీలమేఘ శ్యాముడు, నీలకేశములు కలిగినవాడు, సుందరమైన శరీరము కలవాడు, బాల సూర్యప్రభాభాసమానుడు అయిన బాలుడు సమస్త లోకపాలురను పుట్టుకతోనే ఆనందింపజేసెను. అంతట దశరథ మహారాజు పుత్రోత్సవమును విని ఆనందసాగర నిమగ్నుడై గురువయిన వశిష్టునితో కూడ రాజభవనమునకు అరిగెను. కలువరేకులవంటి కన్నులుకల రామునిచూచి ఆనంద బాష్పములతో వేదోక్తములైన జాతకర్మాది విధులను నిర్వర్తించెను. కైకేయి భరతుని ప్రసవించెను. పూర్ణ చంద్రునితో సమానలైన ఇద్దరి పిల్లలను సుమిత్ర ప్రసవించెను. అప్పుడు దశరథుడు, బ్రాహ్మణులకు, సహస్ర గ్రామములను, సువర్ణములను, రత్నములను, శుభములైన గోవులను వస్త్రములను దానము చేసెను. మునీశ్వరులు ఏ పరమాత్మయందు రమించెదరో ఏ పరమాత్మ భక్తజనులను రమింపజేసెదడో అట్టి కౌసల్యా కుమారునకు 'రామ' అను నామకరణమునిడెను. ప్రపంచ భారమును భరించువాడు కావున కైకేయీ పుత్రునకు భరతుడని పేరుపెట్టెను. యోగ్యమైన లక్షణములు కలవాడగుటచేత లక్ష్మణుడనియు, శత్రువులను కొట్టువాడగుటచే శత్రుఘ్నుడనియు, సుమిత్ర పిల్లలకు నామకరణము గావించెను. కౌసల్య మఱియు కేకేయలచేత ఇవ్వ బడిన పాయసము ప్రకారము లక్ష్మణుడు రామునివెంటను, శత్రుఘ్నుడు భరతుని వెంటను జోడీలుగా నుండిరి. రాముడు లక్ష్మణునితో బాల్యచేష్టలు చేయుచు ముద్దుముద్దు మాటలచేత తల్లిదండ్రులను ఎక్కువ ఆనందపరచెను. ఫాలభాగమందు బంగారు రావియాకును, కంఠమునందు రత్నములు, మణులు, పులిగోళ్లతో కూడిన పతకమును, చెవులందు రత్నమయ సువర్ణ కుండనములను, మొలయందు ఘల్లుఘల్లుమని నాదముచేయు బంగారు సిరిమువ్వలు గల మణులతో పొదగబడిన మొలత్రాడును బాజాబందులు, బాహువులందును, చిరునవ్వు ముఖము చిన్న పన్నులవరుస, ఇంద్రనీల

సమానమైన మహాకాంతి బాలభావముతో ఇటుఅటు పరుగులువేయు
చున్న బాలరాముడు కౌసల్యాదశరథుల మనస్సుకు అనందోల్లాస
వికాసతరంగములను కలిగించెను. భోజన సమయమునందు కూడ
రామా, రామ అంటూ రాముని పిలువమని దశరథుడు ఆజ్ఞాపించెడి
వాడు. ఆనందహాస వదనారవిందయైన కౌసల్య పరుగు విడినను
చేరాగి పనోగతియగు రాముని తాత్రిక లేక పోయెను. తల్లి అలసి
పోవునని రాముడు తానే నవ్వుకుంటూ బుసవచేతితో ఏదో పిడసను
తిని తిరిగి పారిపోయెడువాడు. మాతృవారిధియగు కౌసల్యారాము
నికి, రకరకాల దుస్తులను తొడిగి ప్రతినెల విచిత్రములయిన
వాయనములను ఇచ్చుచు పండుగ చేసికొనెను. లడ్డులు, జిలేభీలు
మున్నగు మధురపదార్థములను, పిండివంటలను వాయనము
లను ఇచ్చుచుండెడిది. అలాగుననే పుట్టినరోజు పండుగలను
కావించెను. రాముని బాల్య చాపల్యముపలన కౌసల్య ఇంటిపను
లను పాడి చేసినవి. రాము డంతఃపురములోని కేగి అన్నముపెట్టు
మని అమ్మను అడుగగా కౌసల్య ఏమరుపాటున వినలేకయున్న
సమయములో కోపముతో ఒక కర్ర పట్టుకొని పాకభాండములను
ముక్కలు గావించెను. ఉట్టిమీద వ్రేలాడబడియున్న వెన్నకుండ
లను కొట్టి గోక్షీరముల వెన్నను లక్ష్మణ, భరత శత్రుఘ్నులకు
పంచిపెట్టెను. పాలు పెరుగులను కూడ పంచిపెట్టెను. పనివారు
ఈ విషయమును కౌసల్యతో చెప్ప రాముడు నవ్వుతూ అచ్చటనుండి
పరుగులుతీసి పారిపోయెను. కౌసల్యకూడ పరుగులిడుచు, మధ్య
మధ్య పడిపోవుచు తిరిగి లేచి రాముని పట్టుకొని ఏమీ మాట్లాడ
లేక పోయెను. రాముడు బాల్యభావముతో ఏడ్వనారంభించెను.
కౌసల్య రాముడు భయపడినాడని గుండెకు హద్దుకొని ముద్దిడి
ఓదార్చుచుండెను. లీలామానుష వేషధారియగు రాముడు తల్లిదండ్రు
లను మహదానంద భరితులను జేసెను.

కాలక్రమమున శ్రీరామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు కౌమారా

వస్థను పొందిరి. వశిష్ఠ మహాముని చేత నుపనయనములు కావింప బడినవి. సర్వవిద్యలు, ధనుర్వేదము కూడ అభ్యసించిరి. రాముని వెంట లక్ష్మణుడు, భరతుని వెంట శత్రుఘ్నుడు భృత్యభావముతో తిరుగుచుండెడివారు. శ్రీరాముడు ధనుస్సు స్వీకరించి లక్ష్మణుడు వెంటరాగా గుఱ్ఱముపై వేటకు అడవులకు వెళ్లి క్రూరమృగము లను చంపి దశరథునకు తన విలాసములను చెప్పుచుండెడి వాడు. ప్రాతఃకాలముననందే లేచి స్నానాదులను గావించి తల్లిదండ్రులకు పాదాభివందనము చేయుచు, పౌరుల కార్యములను చేయుచు, బంధు వులతో సహా ప్రతిదినము మునీశ్వరులనుండి ధర్మశాస్త్ర రహస్యము లను విని తాను కూడ వానిగూర్చి ప్రసంగము చేసెడివాడు. వికా రము, మార్పులు లేని పరమాత్మ మానుషలోకమునకు కార్యములను చేయుచుండెను. నిజముగా ఆలోచించిన అతడేమియు చేయలేదు.

ఇట్లు బాలకాండ యందలి ఉమామహేశ్వర సంవాదమందలి తృతీయ సర్గము సమాప్తము. శ్రీరామ శ్రీరామ శ్రీరామ

—:●:—

## చతుర్థ సర్గ

# విశ్వామిత్రాగమనము - రామలక్ష్మణ సహాయము కొటకవధ

శంకరుడు పార్వతీదేవితో పలికెను. పరాత్పరుడు తనమాయ చేత శ్రీరామునిగా అవతరించెనని తెలిసికొని విశ్వామిత్రుడు శ్రీరామ దర్శనముకొఱకు అరుదెందెను. చూడగనే దశరథుడు భక్తిభావముతో వశిష్ఠునితోకూడ రెండుచేతులు జోడించి ఆహ్వానించి అర్ఘ్యపాద్యాది సపర్యలు చేసెను. ఆ తరువాత విశ్వామిత్రునితో "హే మునీంద్రా! మీరాకచేత నేను కృతార్థుడనైతిని. మీవంటి మహానుభావులు ఏ యింటికి తెంచెదరో ఆ యింటికి సంపదలు కలుగును. మీరాకకు కారణము నాజ్ఞాపించండి. నేను తప్పకుండ ఆ పనిని నిర్వర్తిస్తాను. నేను నిజము పలుకుచున్నా ననెను". అంత విశ్వామిత్రుడు చాలా సంతోపించేను. తిరిగి యిట్లు దశరథునితో పలికెను, రాజేంద్రా, నేను దేవతల ప్రీతికి పితృదేవతాప్రీతికి యజ్ఞయాగములు చేసెదను. మారీచ సుబాహువులను ఇద్దరు రాక్షసులు వారి యనుయాయులు విఘ్నము కావించుచున్నారు. వానిని వధించుటకు నీ జ్యేష్ఠ కుమారుడగు రాముని లక్ష్మణుడు తోడురాగా పంపవలెననియు, దానివలన శుభములు కలుగుననియు, వశిష్ఠునితో సంప్రదించి చేయుమనియు చెప్పి యూరకుండెను. ఈ మాటలను విన్న దశరథుడు చింతాక్రాంతుడై రహస్యముగా వశిష్ఠునితో సంప్రదించెను. మఱియు నిట్లు నివేదించెను. వశిష్ఠ మునీంద్రా! నా మనస్సు రాముని వీడుటకు కష్టపడలేదు. కొన్ని వేల సంవత్సరాల తరువాత దేవసమానులగు నలుగురు కుమారులు కలిగినారు. వారలలో శ్రీరాముడు మహాసుందరమూర్తి రాముడతని వెంటవెళ్లినచో నేను

శిలించను. నేను అడ్డుచెప్పిన ముని శపిస్తాడు. నాకు ఏ విధముగా శుభము కలుగునో ఆనతీయుడు. నేను అబద్ధమాడకూడదు. అంతట వశిష్ఠుడు దశరథునితో నిట్లనెను, ఓ దశరథ మహారాజా! దేవతలకు కూడ తెలియని రహస్యము ఇది వినుము. రాముడు మానవుడు కాడు. అతడు సనాతనుడైన పరమాత్మ. భూభారమును తగ్గించుటకు బ్రహ్మచేత ముందు ప్రార్థింపబడినాడు. నీవు పూర్వజన్మమున కశ్యప ప్రజాపతివి కౌసల్య పూర్వజన్మమునందు దేవమాతయగు అదితియై యుండెడిది. మీ యిరువురు అనేక సంవత్సరములు తపస్సు చేసినారు. విష్ణుపూజలను సర్వసంగ పరిత్యాగముచేసి గావించినారు. భక్తవత్సలుడగు విష్ణువు వరము కోరుకోమని యడుగగా నీవు అతనిని తన కుమారునిగా జన్మమొందవలెనని యడిగితివి. భూతభావనుడైన విష్ణువు అంగీకరించి ఇప్పుడు నీకు పుత్రుడుగా జన్మించెను. వాడే రాముడు. రాముని సేవచేయుటకు ఆదిశేషువు లక్ష్మణుడుగా జన్మించెను. రామున్ని అనుసరించెను. శ్రీ మహావిష్ణువు యొక్క శంఖచక్రములు రెండును భరత శత్రుఘ్నులుగా జన్మించినవి. యోగమాయ జనకనందినియగు సీతగా జన్మించెను. ఆ సీతను రామునితో కలుపుటకు విశ్వామిత్రుడు వచ్చెను. ఇది చాలా రహస్యమైన విషయము. దీనిని ఇతరులకు బహిర్గతము చేయరాదు. అందువలన సంతుష్టాంతరంగుడవై విశ్వామిత్రుని పూజించి సలక్ష్మణునిగా రాముని పంపుమని వశిష్ఠుడానతి యిచ్చెను. దశరథుడు తనజన్మ ధన్యమైనదని భావించి రామ, రామ, లక్ష్మణ, లక్ష్మణ అని పిలిచి వారి శిరముల నాఘ్రాణించి ముద్దుపెట్టుకొని ఆలింగనము చేసికొని విశ్వామిత్రునికి అప్పజెప్పెను. విశ్వామిత్రుడు మిక్కిలి సంతసించి ఆశీర్వదించి, ధనుర్బాణములు ఖడ్గములను ధరించిన రామలక్ష్మణులను స్వీకరించి వెడలెను. కొంతదూరము వెళ్ళినతరువాత రాముని పిలిచి బలఅతిబల అను దేవనిర్మితములైన మంత్రములు నుపదేశించెను. ఆకలి, నిస్సత్తువ ఈ విద్యలను గ్రహించినవారికి ఉండవు. అనంతరము

వారు గంగానదిని దాటి, తాటక సంచరించు వనమునకు ఏగిరి. అంత సత్యపరాక్రముడైన రాముని చూచి "ఇచ్చట కామరూపిణి యగు తాటకి యనెడి రాక్షసి కలదు. ఆమె లోకముల నన్నిటిని బాధించుచున్నది. నీవు ఏ సంకోచము లేకుండ చంపివేయుమని ఆజ్ఞాపించెను. శ్రీరాముడు ధనుస్సుతో వనమంతయు దద్దరిల్లినట్లు నాదము కావించెను. శబ్దము విని తామసియగు తాటకి క్రోధముతో రామునివైపు మేఘమువచ్చునట్లు వచ్చి ఎదుర్కొనెను. ఒకే ఒక బాణమును రామచంద్రుడు ఆమె వక్షస్థలమునందు సంధించెను. ఆమె ఘోరమైన వికృతాకారమును ధరించి రక్తము కక్కుకుంటు అరణ్య భూమిలో పడిపోయెను. అంతట ఆమె సుందరరూప ధారిణియైన యక్షిణిగా మరి రామునికి నమస్కరించి రామాజ్ఞవలన స్వర్గమునకు పోయెను. రామకృపవలన తాటకికి శాపవిమోచనము కలిగెను. అంత విశ్వామిత్రుడు ఆలింగనము చేసికొని శిరస్సునందు దగ్గరగా చేర్చి కొంతసేపు ఆలోచించి సర్వాస్త్రజాలములకు మూలములగు రహస్య మంత్రములను రామున కుపదేశించెను. ఇట్లు అధ్యాత్మ రామాయణ మందు బాలకాండలో ఉమామహేశ్వర సంవాదములో నాలుగవ అధ్యాయము సమాప్తము.

## పంచమ వర్గము

# మారీచ సుబాహుల వధ అహల్యను ఉద్ధరించుట

అంత రామలక్ష్మణులు విశ్వామిత్రునితో కలసి ముని సమ్మతమైన కామాశ్రమము నందు ఒక రాత్రి ఉండి తిరిగి బయలు దేరిరి. విశ్వామిత్రునిచేత ఆజ్ఞాపింప బడినవారైన సిద్ధులు, చారులు, మునులు రామలక్ష్మణులకు సత్కారము గావించిరి. ఇతర మునీశ్వరులతోపాటు విశ్వామిత్రుడు యజ్ఞదీక్ష బూని యాగము సలుపుచుండిరి. మధ్యాహ్న కాలమగునరికి కామరూపధారులైన మారీచ సుబాహులు రక్తమును, ఎముకలను, కురిపించుచు కనపడిరి. రాముడు రెండు బాణములను సంధించి ఆకర్ణాంతము ఎక్కుపెట్టి బుద్ధిమంతుడు గాన వానిని వేరువేరుగా విడిచిపెట్టెను. అందులో ఒక బాణము మారీచుని శతయోజనములను త్రిప్పుచు సముద్రములో పడద్రోసెను. అగ్నిమయమైన రెండవ బాణము క్షణకాలములో సుబాహుడను రాక్షసుని భస్మీభూతుని జేసెను. వీరితోవచ్చిన రాక్షసులను లక్ష్మణుడు హతమార్చెను. రామలక్ష్మణులపై పుష్పవర్షము కురిసినది. దేవదుందుభులు మ్రోగినవి. శ్రీరామ లక్ష్మణులను సిద్ధజనులు గానముచేసిరి. విశ్వామిత్రుడు పూజార్హుడగు శ్రీరాముని పూజించి తొడయందు కూర్చొబెట్టుకొని ఆలింగనము చేసికొని భక్తితో కూడిన ఆనందబాష్పములచేత ఆవరింపబడిన నేత్రములు కలవాడై ఆరముగ్గిన పండ్లను రామలక్ష్మణులకు సమర్పించి తినిపించి శ్రోత్రపేయములైన పురాణకథలను చెప్పుచు మూడుదినములు గడపెను. నాలుగవదినము రాగానే విశ్వామిత్రుడు రామునిగూర్చి పలికెను. శ్రీరామ మనము మహాయజ్ఞమును చూచుటకు వెళ్లెదము. పూర్వము పినాకియైన శంకరుడు జనకపురిలో మాహేశ్వరమగు

ధమమ్మును పంపెను. మహాసత్య సంపన్నమైన ఆ ధనుస్సును నీవు చూచెదవుగాక. జనకునిచేత సత్కరింపబడెదవు. అని చెప్పి ఇతర మునిగణములతో బయలుదేరి గౌతమముని ఆశ్రమమునకు వచ్చెను. దివ్యఫలపుష్ప సంభరితమైన క్రూరజంతు రహితమైన ఆశ్రమమును చూచి శ్రీరాముడు విస్మయమును గొలిపించు ఆశ్రమ ప్రాంతమును తిలకించి మనోజ్ఞమై దివ్యమై వెలుగొందు ఆశ్రమమును కనులారా చూచి ముగ్ధుడై ఎవరిదీ దివ్యాశ్రమమని విశ్వామిత్రుని ప్రశ్నించెను. విశ్వామిత్రుడంత పూర్వగాధను వినిపించెను. పూర్వము లోక ప్రసిద్ధిపరితుడు సర్వధర్మ స్వరూపుడు అగు గౌతముడు విష్ణువును ధ్యానించుచుండెను. అతనికి బ్రహ్మగారు లోక సుందరియైన తన కుమార్తె నిచ్చెను. బ్రహ్మచర్య నియమముతో సహధర్మచారిణిగా గౌతముడు స్వీకరించెను. దేవేంద్రుడు ఆమె అందమునకు ముగ్ధుడై ఏదోయుపాయముతో ఆమె ననుభవించుటకు సంకల్పించెను. ఒకరోజు గౌతముడు గృహమునుండి బయటకు వెళ్ళినతరువాత గౌతమముని వేషముతో ఇంద్రుడు ప్రవేశించెను. అహల్యను అనుభవించి అప్పటినుండి తొందరగా వెళ్లుట కారంభించెను. కాని గౌతమముని కూడ అదే సమయములో వచ్చి తన రూపమును ధరించిన ఇంద్రుని చూచి మహాకోపోద్రిక్తుడై నీవెవడవు. ఎందుకీ కపటవేషమును ధరించితివి. దుష్టాత్మా నిజము చెప్ప లేనిచో భస్మము చేసెదనని గర్జించెను. అంతట దేవేంద్రుడు తన నిజనామమును చెప్పి కామవశుడై నిందితమైన కర్మ నాచరించితినని అంగీకరించెను. క్రోధముతో కూడిన గౌతముడు యోని లంపటుడవైన పాపకర్మ చేసితివి గాన నీ శరీరమందంతటను వెయ్యి యోనులతో కూడి సంచరించెదవని శపించెను. భయకంపితయైన భార్య నహల్యను జూచి దుష్టాత్మురాలా! నీవు రాతివై నా యాశ్రమములో ఉండెదవు గాక అని శపించెను. ఆహారము లేకుండ రాత్రింబవళ్లు తపస్సుచేయుచు ఎండవానలను భరిస్తూ

ఉ

పరమేశ్వరుడైన రాముని ధ్యానిస్తూ వెయ్యి సంవత్సరాలు నా ఆశ్రమంలో తపస్సు చేయవలెను. నా యీ ఆశ్రమములో జంతువు లుండవు. కొన్ని వేల సంవత్సరాల తరువాత శ్రీరామచంద్రుడు లక్ష్మణసమేతుడై నా ఆశ్రమమునకు వచ్చి తన పాదములతో రాతి రూపములోవున్న నిన్ను తాకెడదు అప్పుడు నీ పాపము నశించును. రాముని నమస్కరించి, పూజించి, ప్రదక్షిణచేసి స్తోత్రముచేసిన తరువాత నా శాపమునుండి విముక్తురాల వగుదువు. అనాటి నుండి మునుపటివలె నా శుశ్రూషను చేయగలవని చెప్పి గౌతముడు హిమవత్పర్వతమునకు పోయెను. అనాటి నుండి అహల్య భూతములకు కనపడకుండ వాయుభక్షణ చేయుచు నీ రాకకు ఎదురుచూచు చున్నది. ఓ రామ! మునిభార్యను నీవు కాపాడుము. బ్రహ్మగారి కుమార్తె అని రామచంద్రుని చేతిని విశ్వామిత్రుడు పట్టుకొనెను. ఎదుటనున్న అహల్యను ఘోరతపస్సులోనున్న దానిని చూపించెను. అంత రాముడు తన పాదపద్మములచే ఆ రాతిని స్పృశించెను. తపోధనురాలైన అహల్యను చూచి రాముడు నమస్కరించెను. నేను రాముడను అని పలికెను. అంత పట్టుబట్టలు ధరించినవాడు, నాలుగు భుజములు కలవాడు, శంఖము, చక్రము, గదా, పద్మములతో కూడినవాడు, ధనుర్బాణములను ధరించినవాడు, సలక్ష్మణుడు నవ్వుముఖము కలవాడు, పద్మనేత్రుడు, శ్రీవత్సశోభితుడు, ఇంద్ర నీలమాణిక్యములవంటి దేహకాంతి కలవాడు. పదిదిశలను వెలిగించు చున్న దివ్యకాంతిసంపన్నుడైన రాముని చూచి అహల్య గౌతముని వాక్యములను స్మరించి సాక్షాత్ నారాయణుడని గ్రహించి అర్ఘ్యపాద్యములతో యథాశాస్త్రముగ పూజచేసి నేత్రముల నిండ ఆనందబాష్పములు క్రిక్కిరుచుండ సాష్టాంగదండ ప్రణామమాచరించి, శరీరము సందంతటను గగుర్పాటు కలుగగా రాజీవలోచనుడైన రామున్ని తిరిగితిరిగి చూచి గద్గదమైన వాక్కులతో స్తోత్రము చేసెను.

హే జగన్నివాస, శ్రీరామచంద్ర ప్రభో! నీ పాదపద్మము లందలి ధూళివలన కృతార్థురాలనైతిని. అమనస్కులైన శంకరుడు బ్రహ్మలచేత ఏ పాదములు ఎల్లప్పుడు వెదకబడి ప్రార్థింపబడు చున్నవో అట్టి పాదపద్మములందలి ధూళివలన నేను కృతకృత్యు రాలనైతిని. నీ జీవితము చాల విచిత్రమైనది. జగత్తునంతా నిన్ను ను మానవుడువలె గ్రహించు చున్నారు. అతి మాయుడవు. సంపూర్ణ ఆనందమయుడవు కాళ్లు లేకుండ కదిలేవాడివి. నీ పాదపద్మము లందలి పరాగము (అనగా ధూళి) వలన పవిత్రురాలైన గంగాదేవి శంకరుని బ్రహ్మను మఱియు నితరులను పవిత్రింపచేయు చున్నది. అట్టి నీ పాదధూళి నాకు ప్రత్యక్షమాయెను. నాయొక్క పూర్వజన్మ భాగ్యము నేమని వర్ణించాలో కదా! మానవావతారంలో మనుష్య రూపాన్ని ధరించి రాముడనే పేరుతో సుందరదేహ విలసితుడయిన వాడు ధనుర్ధరుడు పద్మరేకులవంటి విశాలమైన కన్నులుగల రామున్ని నేను నిత్యం సేవిస్తాను. ఇతరులను సేవించను. ఏ రాముని పాదధూళిగూర్చి వేదములు వెదుకుచున్నవో ఎవ్వనిబొడ్డు నుండి పుట్టి బ్రహ్మ అవతరించాడో, ఎవ్వని పవిత్రనామ సంకీర్తన ముచే శంకరుడు నిత్యతృప్తుడగునో అట్టి రామున్ని నేను భజిస్తాను. హృదయంలో భావిస్తాను. ఏ రామచంద్రుని పవిత్రగాథలను బ్రహ్మలోకములో నారదాదులు పఠిస్తారో బ్రహ్మశంకరులు కీర్తి స్తారో ఆనందబాష్పములతో తడిసిన స్తనాగ్రభాగయై సరస్వతి గానము చేయునో అట్టి రామున్ని నేను సేవిస్తాను. ఆ రాముడు పరమాత్మ సనాతనుడు, ఏకుడు, అనంతుడు తాను వెలుగువాడు అంతము లేనివాడు ప్రథముడు. లోకములో నాటకములో మాదిరి లోకమును మోహింపజేయుటకు శరీరధారియై కనబడువాడు. లోకోప కారము కొఱకు ఈ రాముడు అవతరించాడు. సృష్టిస్థితి లయకారకు డితడే. తనదైన మాయయందు బింబములో మాదిరి కనపడువాడు వీడే. బ్రహ్మ అని విష్ణువని శంకరుడని మూడు భిన్ననామములను

తానొక్కడే ధరించుచున్నాడు. స్వతంత్రుడు, పరిపూర్ణుడు, ఆత్మ స్వరూపుడు నీకు నమస్కారము రామ! నీ పాదపద్మములను అమ్మ లక్ష్మి హృదయమందుంచుకొని ప్రేమతో అడిస్తోంది. మనస్సును జయించిన మునీంద్రులు నిన్నును ఈ మూడు లోకములందు వ్యాపించియున్న ఏకమూర్తివని ధ్యానము చేస్తారు. జగత్తులకు ఆదియైనవాడవీవు. జగత్తువు నీవే. జగత్తుకు ఆశ్రయుడవు. ఆధార భూతమైన వాడవు నీవే. సర్వభూతము లందున్న వాడవయ్యు సంగ రహితుడవు గావు. నీ వొక్కడవే అద్వితీయమైన పరబ్రహ్మ రూపముతో ప్రకాశించు చున్నావు. ఓ రామా! నీవు ఓంకారమునకు అర్థము, వాక్కులకు దొరకనివాడవు. వాచ్యము నీవే వాచకము నీవే అనగా చెప్పబడినవాడవు నీవే చెప్పేవాడివి నీవే. నీవు విశ్వమయుడవు. కార్యం, కారణం-కర్త అను భేదముతో అనగా చేయువాడవు నీవే. చేయబడినది నీవే చేయబడు సాధనము నీవే, ఒక్కడివే అయి బహురూపకమైన మాయచే ప్రకాశించు చున్నావు. నీ మాయవలన కప్పబడిన బుద్ధికలవారై నిన్నును నిజతత్త్వముతో ఎరుగిరు. నీవు మాయకు అధిపతివి కాని మూఢులు సామాన్య మానవునిగా గ్రహిస్తారు. నీవు మాయకు లొంగనివాడవని వారలకు తెలియదు. నీవు మాయకు అతీతుడవు, నీవు ఆకాశమువలె లోపల బయట శుద్ధుడవు. లంపటము లేనివాడవు, చలించనివాడవు, నిత్యుడవు శుద్ధుడవు, బుద్ధుడవు, అవ్యయుడవు, మూర్ఖురాలను, మూఢురాలను, ఆడుదానిని నీయొక్క నిజతత్త్వమరయ నే నెంతటిదానను. అందువలన రామ! నీకు వెయ్యి నమస్కారములు చేస్తాను ఇంకొకబుద్ధి లేకుండా. దేవ! ఎచ్చట ఎక్కడ ఉన్న దానైననూ ఎల్లప్పుడు నీ పాదపద్మమునందు అంటుకొన్న భక్తి నాకు ఉండుగాత, పురుషోత్తమా! నీకు నమస్కారము. భక్తవత్సలా! నీకు నమస్కారము. హృషీకేశా! నీకు నమస్కారము. నారాయణా! నీకు నమస్కారము. సంసార భయమును పోగొట్టిన వానిని, అద్వితీయుని, సహస్ర

సూర్య సంకాశుని, చేతియందు ధనుర్బాణములను ధరించినవానిని, నల్లని మేఘకాంతి శరీరమువానిని, బంగారు పట్టుబట్టలు ధరించిన వానిని, రత్న ఖచిత కుండలములను ధరించినవానిని, పద్మ రేకుల వంటి విశాలమైన నేత్రములు గలవానిని, లక్ష్మణ సహితుడైన రామున్ని నేను కొలుస్తాను. అహల్య రామున్ని స్తోత్రముచేసి, ప్రదక్షిణచేసి సాక్షాత్ కళ్లెదుటనున్న రామున్ని పునః పునః నమస్కరించి, రామునియొక్క అనుమతితో తిరిగి భర్తను పొందెను. అహల్యచేత చేయబడిన రామస్తోత్రమును భక్తితో కూడినవాడై ఎవడు పఠించెదడో వాడు సర్వపాపముల నుండి విముక్తుడగును. మఱియు పరబ్రహ్మమును పొందును. పుత్రుడు మున్నగు ఏ కార్యములను మనస్సులో ధ్యానించి, రామున్ని హృదయంలో నిల్పి భక్తితో ఈ స్తోత్రమును పఠించునో వంధ్య అగు స్త్రీకూడ అనగా గొడ్డురాలుకూడ సంవత్సరములో పుత్రున్ని పొందును. శ్రీరామచంద్రుని అనుగ్రహమువలన అన్ని కోరికలను పొందును. బ్రహ్మహత్యాది పాపములను చేసినవాడు, గురుతల్పగతుడు సురాపానము చేయువాడు, పాపి తల్లి అన్న దమ్ములను హింసించినవాడు ఎల్లప్పుడు భోగములందు తగులుకున్న వాడు అయినప్పటికి నిత్యము ఈ స్తోత్రమును జపించుచు హృదయమునందు రఘుపతిని శ్రీరామున్ని ధ్యానించుచు భక్తితో స్మరించినచో ముక్తిని పొందుతాడు. ఆచారవంతుడైన మానవుని విషయములో ఇంక చెప్ప వలసిన దేముంది! ఆచారవంతుడనగా ఎవరి ధర్మమును వాడనుసరించిన వాడు.

ఇట్లు బాలకాండలో ఉమామహేశ్వర సంవాదమందలి పంచమ సర్గ సమాప్తము.

—O—

## ఆరవ సర్గ

# శివ ధనుర్భంగము - సీతా వివాహము

అంత విశ్వామిత్రుడు రామలక్ష్మణులను చూచి జనక మహారాజుచే పరిపాలింపబడిన మిథిలానగరమును దర్శిద్దాము. అచ్చట జరుగు క్రతురాజమును చూచిన పిమ్మట అయోధ్యకు వెళ్ళవచ్చునెను. రామలక్ష్మణులతో జనకుని నగరమగు మిథిలకు బయలుదేరెను. గంగనుదాటి వెళ్లాలి. పడవను తెమ్మంటే నావికుడు శ్రీరాముని నిషేధించెను. మఱియు ఇట్లు పలికెను.

ఓ ప్రభువా! నీ పాదములకు కడిగెదను. బాగా కడుగుతాను. రాతికి చెట్టుకర్రకి పెద్దతేడా లేదు. నీ పాదధూళికి మనుష్యులనుగా మార్చే శక్తి కలదని లోకంలో కథ ప్రసిద్ధంగా ఉంది. అందు నీ పాదపద్మములను పరిశుభ్రముగా కడిగి, తరువాత ఒడ్డు దాటిస్తాను. ధూళిని కడగకుండ నేను నిన్ను పడవ ఎక్కిస్తే నా పడవకూడ వెంటనే ఆడదై పోతుంది. అలాగైపోతే నా కుటుంబమునకు హాని కలుగును. అనగా జీవనము గడపుటకు తగిన వృత్తి పోవును. నా నావ ఆడదయిపోతే అప్పుడు నేను భార్యాబిడ్డలు పస్తు పడుకోవాలి అని పలికి నావికుడు శ్రీరాముని పాదపద్మములను శుభ్రముగా కడిగెను. ఆ తరువాత గంగ అవతలొడ్డుకు తీసికొని వెళ్లెను. రఘుపతితో కూడ విశ్వామిత్రుడు మిథిలానగరమును చేరెను. లక్ష్మణుడుకూడ వెళ్లెను. ముందుగా మిథిలా నగరమందలి ఋషివాటికలకు వెళ్లెను. విశ్వామిత్ర మహర్షి వచ్చినాడని విని జనకుడు మిక్కిలి సంతోషించి పూజాద్రవ్యములను గైకొని తమ పురోహితులతో సహా వెళ్లి సాష్టాంగప్రణామ మాచరించి విశ్వా

మిత్రుని పూజించెను. సర్వదిక్కులను తమ శరీరకాంతులతో ప్రకాశింపజేయుచు సూర్యచంద్రులవలె దేదీప్యమానులై సర్వలక్షణములతో మహారాజ లక్షణములతో నొప్పారు రామలక్ష్మణులను చూచి ఈ వరశ్రేష్ఠులెవరు ? దేవతాకుమారులవలె నున్నారు. నర నారాయణులవలె భాసిస్తున్నారు. నా మనస్సుకు ఆనందాన్ని కలిగిస్తున్నారు. అని అడిగెను. అంత విశ్వామిత్రుడు వీరు దశరథుని కుమారులు రామలక్ష్మణులని చెప్పెను. నాచేత యాగ సంరక్షణార్థము తీసికొని రాబడిరి. లోకకంటకురాలైన తాటకిని రాముడొక్క బాణముతో నేలగూల్చెను. సుబాహుడనె రాక్షసుని చంపెను. మఱియు మారీచను రాక్షసుని శతయోజన విస్తీర్ణమందుగల సముద్రములోనికి ఒకేఒకసారి ఒకే బాణంతో విసిరివేసిరి. గౌతమాశ్రమమును చూచి అప్పుడు శిలారూపములో నున్న గౌతమ భార్యను మానుషరూపధారిణిగా చేసిరి. నీ యింటిలో మాహేశ్వరమైన ధనుస్సును చూడకోరిక కలవారు. రాజేంద్ర, మీరు దానిని చూపుడని విశ్వామిత్రుడు పలికెను.

జనక మహారాజు పూజార్హులని రామలక్ష్మణుల కిరువురికి శాస్త్రమార్గపూజచేసెను. శాస్త్రమంటే వేదము. జనకుని శివధనుస్సు చూపమని విశ్వామిత్రుడు అర్థించెను. మంత్రులను సత్వరమే శివ ధనుస్సు తీసికొని రమ్మని జనకుడాజ్ఞాపించెను. మఱియు విశ్వామిత్రునితో రాముడు శివధనుస్సునందు నారిని తగిల్చినచో తన కుమార్తె సీతమ్మను ఇచ్చి వివాహము చేసెదనని చెప్పెను. అటులనే అని విశ్వామిత్రుడు మందహాసంతో వినుచున్న రాముని చూచి బదులు పలికెను. తొందరగా రామునికి శివధనుస్సు చూపించమని జనకుని కోరెను. ఆదేశమయంలో ధనుస్సును గ్రహించి ఐదువేల మంది పరివారము వచ్చిరి. చిరుగంటలు కొన్ని వందలు కలదియు వజ్ర మణిరత్నములతో పొదగబడినదియు నగు శివధనుస్సును రాముని కొఱకు పరివారములో ముఖ్యుడు చూపించెను. రాముడు శివ

ధనుస్సును చూచి, దాని పరికరములను సరిచేసి ఎడమచేతితో గ్రహించి విలాసతో నారిని సమస్త రాజశ్రేష్ఠులు చూచుచుండ నారో పించెను. కుడిచేతితో కొంచెము ఎక్కుపెట్టునరికి దశదిక్కుల యందు శబ్దముచేయుచు శివధనుస్సు విరిగిపోయెను. ఆ శబ్దము స్వర్గ మర్త్యరసాతలాది లోకము లందంతటను వ్యాపించెను. అంతరిక్ష మందలి దేవతలకు అద్భుతమాయెను. దేవతలు పుష్పవర్షమును కురిపించిరి. దేవదుందుభులు మ్రోగినవి. అప్సరస్త్రీలు నాట్యమాడిరి. శివధనుస్సు రెండుముక్కలగుట చూచి జనకుడు రాముని ఆలింగ నము చేసికొనెను. అంతఃపుర సీతామాతలందరూ ఆశ్చర్యము పొందిరి. సీత, బంగారు పూలమాలను కుడిచేతితో ధరించి నవ్వు ముఖముతో నిండుగా ఆభరణములచేత అలంకరింప బడినదియై పట్టు బట్టలు ధరించి పైటచెంగులో నిగూఢంగా కనపడు స్తనద్వయముతో రాముని మెడలో అలంకరించెను. అంతట అంతఃపుర స్త్రీలందరు ఆనందించిరి. సర్వధర్మములను తెలిసిన జనకుడు తొందరగా దశ రథునకు పత్రము పంపమని విశ్వామిత్రుని కోరెను. అంతః ప్రాసా దముల కిటికీలనుండి రాజమాతలు లోకవిమోహనుడగు రాముని దర్శించిరి. దశరథుడు తొందరగా వచ్చి తన నలుగురి కుమారుల వివాహమును చేయవలెనని జనకుడు పలికెను. అటులనే అని విశ్వామిత్రుడు శీఘ్రగాములగు రాజభటులను దశరథునికడకు పంపెను. వారును దశరథునకు వృత్తాంతమును తెలియజేసిరి. శ్రీరాముని అద్భుతకృత్యమును మహదానందగా తలంచుచు మిథిలా నగరమునకు తర్లి వెళ్లుటకు మంత్రులందరిని దశరథుడు పిలిపిం చెను. గజములు, అశ్వములు, రథములు, పదాతులు మిథిలకు వెళ్ల వలెను. నా రథమును కూడ వెంటనే తెప్పించండి నేను వెంటనే వెళ్లాలి. ముందు వశిష్ఠుడు వెళ్లాలి. అగ్నిహోత్రముతోను, భార్యల తోను, రాముని తల్లు తోను బయలుదేరి వెళ్లాలి అని ఆజ్ఞాపించెను. అవిఘ్నముగనే తానుకూడ బయల దేరి వశిష్ఠాదులుతో మిథిలా నగర

మునకు ఇచెను. దశరథుని రాక తెలిసికొని తన పురోహితుడగు శతానందుని తోడ్కొని దశరథునకు జనకుడు రాజోచితసత్కారములను గావించెను. రామలక్ష్మణులు తండ్రిగారి పాదములకు నమస్కరించిరి. దశరథుడు రామునిజూచి నా పూర్వపుణ్యము వలన వికసిత పద్మమువంటి రామముఖమును చూచితిని. మునివరుని యనుగ్రహమువలన నాకు కళ్యాణము జరిగినది. అని రాముని శిరస్సును అలింగన మొనర్చి తిరిగి తిరిగి ముద్దుపెట్టుకొని బ్రహ్మానందముతో నుండెను. ఆ తరువాత జనకుడు దశరథుని కుమారులను యథోచితమైన ప్రాసాదములందు బసయిచ్చి శుభమువహూర్తమున మంచి దినమున శ్రీరాముని పిలిపించెను. సోదరులను కూడ రప్పించెను. రత్న స్థంబములతోను, చిత్రమైన పతాకములతోను, మంగళ తోరణములతోను, కళ్యాణమండపమును అలంకరింపజేసెను. ముత్యాల పువ్వులతో మాలలు కట్టించి కళ్యాణవేదిక నలంకరించెను. సర్వశాస్త్ర విశారదులైన బ్రాహ్మణులతో సువాసినీ స్త్రీలతోను, వేదవిదులతోను, భేరీమంగళ వాద్యములతోను, నృత్యములతోను, కళ్యాణవేదికను కనులపండుగగా నలంకరించెను. దివ్యరత్నములతో కూడిన బంగారు పీఠమునందు రాముని కూర్చో పెట్టును. శతానందుడు, విశ్వామిత్ర వశిష్ఠులను సత్కరించెను. సీరిరుపురికి రాముని కిరుపక్కల ఆసనములువేసి సత్కరించిరి. కళ్యాణవేదికమధ్య స్థలమందు వైదికాగ్నిని తెచ్చియుంచి సీతమ్మను తెప్పించెను. చక్కని లక్ష్మీకళలతో వికసించుచున్నదయు అనేకవిధములైన వజ్రమణిమయ సువర్ణాభరణములతోను సీతమ్మ వికసించెను. భార్యాసహితుడయి జనకుడు రాముని సమీపించి కాళ్లుకడిగి ఆ నీళ్లను తన శిరమునందు జల్లుకొనెను. బ్రహ్మ, శివుడు ఇతర మునిజనులు రామ పాదజలములను ఎల్లప్పుడు తమ శిరస్సులందు జల్లుకొనెదరు. అక్షతోదకములతో సీతమ్మను తన చేతతో ధరించి రామునికి పాణిగ్రహణ విధానముతో అర్పించెను. ఓ రఘూత్తమా ! పద్మదళములు

వలె కన్నులు కలదియు, ముత్యముల హారములతో నలంకరింపబడినదియు అగు నా కుమార్తెయగు సీతమ్మను నీకొఱకు ఇచ్చుచున్నాను. నీవు సంతుష్టుడవు కమ్ము. అని రామునిచేతిలో సంతోషముతో నప్పచెప్పెను. పాలసముద్రము లక్ష్మీదేవిని శ్రీ మహావిష్ణువుకు సమర్పించు సందర్భములో ప్రీతుడయినట్లు జనకుడు సీతమ్మను రాముని చేతియందుంచి మహానందమును పొందెను. తన కన్నకుమార్తెయగు ఊర్మిలను లక్ష్మణున కిచ్చెను. తన సోదరుని పుత్రికలగు శ్రుతకీర్తి మాండవులను భరత శత్రుఘ్నులకు ఇచ్చి పెండ్లిచేసెను. నలుగురు అన్నదమ్ములు నూతన వధువులతో కూడినవారై లోకపాలకులువలె మంచికాంతితో ప్రకాశించిరి.

అప్పుడు జనకుడు, వశిష్ఠ, విశ్వామిత్రుల నుద్దేశించి తనకు నారదుడు చెప్పిన కథను చెప్పెను. అనగా తాను పెంచుచున్న సీత నుద్దేశించి చెప్పిన వృత్తాంతమును చెప్పెను. జనకుడొకనాడు యజ్ఞభూమిని శుద్ధిచేయుటకు నాగలితో భూమిని దున్నుతూఉంటె శుభలక్షణ సంపన్నయైన కన్య సీతాముఖమునుండి దొరికినది. సీత అంటె నాగలిచాలు. ఆమెను నేను కన్నకూతురుగా భావించి రక్షించి నా ప్రియభార్యకు అర్పించితిని. అంతట ఒకప్పుడు మహతీవీణతో నారాయణ నామమును మీటుతూ అంతరిక్షము నుండి నారదుడు వచ్చెను. నేను అతన్ని వేదోక్తముగా పూజ చేసితిని. నారదుడు సుఖాసీనుడై రహస్యముగా నాతో చెప్పెను. పరమాత్ముడైన శ్రీమన్నారాయణుడు భక్తానుగ్రహము కొఱకు దేవకార్య సిద్ధికి రావణవధకొఱకు మాయామానుష వేషమును ధరించి దశరథుని గర్భవాసమందు జన్మించెను. నాలుగంశములుగా అనగా భరత, లక్ష్మణ, శతృఘ్నులతో సహా తన అంశను విభజించి అవతరించెను. యోగమాయ **సీత** అను పేరుతో నీ యింటియందు జన్మించినది. అందువలన నీవు సీతను రాఘవుడైన రామునకు ఇచ్చి

వివాహము ప్రయత్నపూర్వకముగ చేయవలెను. పరమాత్ముడైన రామునికంటె ఈమె ఇతరులకేనాడు భార్య కాలేదు. అని పలికి నారదుడు దేవమార్గములో ప్రయాణము చేసెను. నేను నాటినుండి రాఘవునకే విధముగ లక్ష్మీస్వరూపురాలైన సీతమ్మను ఇచ్చి పెండ్లిచేయగలనని ఆలోచించి యుంటిని. అప్పుడు ఒక ఆలోచన వచ్చినది. మా తాతగారి యింట్లో (తండ్రి తండ్రి ఇంట్లో) ఈశ్వరుడు త్రిపురాసుర సంహారముచేసిన తరువాత శివధనుస్సును అట్టిపెట్టి ఉంచెను. శివధనుర్భంగమును పణముగాపెట్టి సీతాపాణిగ్రహణము కావించెదనని తలంచితిని. అందరి గర్వమును హరించిన విల్లిది. విశ్వామిత్ర మీ అనుగ్రహమువలన సాక్షాత్ రాముడే ఈ శివ ధనుస్సును చూచుకోటికతో నా యింటికి విచ్చేసినాడు. నా కోటిక ఫలించినది. ఇప్పుడు నా జన్మ తరించినది. సీతా సమేతుడైన రామున్ని ఒక ఆసన మందున్న వారిని చూచితిని. బలిచక్రవర్తి నీ కాళ్లు కడిగి దేవేంద్రలోకమునకు ప్రభువయ్యాడు. నీ కాళ్ల నీటితో బ్రహ్మగారు సృష్టిని కావించిరి. అహల్య నీ పాదధూళి స్పర్శమాత్రముననే నిజరూపమును పొందినది. భర్తృశాపమునుండి విముక్తురాలైనది. కాలచక్రాన్ని దాటిన యోగీశ్వరులు నీ పాదపద్మ పాంశువులను ధరించి సంసార భయమునుండి విముక్తులైనారు. దుఃఖశోకములను జయించి ఏ మహానుభావులు నీ నామస్మరణ యందు ఎల్లప్పుడు అభిరతులై దేవులయ్యారో అటువంటి నిన్ను ను నేను ఎల్లప్పుడు శరణపొందుతాను. అని స్తోత్రముచేసి శ్రీరామునికి ఒకకోటి బంగారు నాణెములను, పదివేల రథములను, పదిలక్షల గుఱ్ఱములను, ఆరువందల ఏనుగులను, లక్ష పదాతిదళమును, మూడువందల మంది దాసీజనమును ఇచ్చెను. సీతమ్మకు దివ్యాంబరములను, మంచి ముత్యాలహారములను కూతురుయందు వాత్సల్యముచే ఇచ్చెను. వశిష్ఠమహర్షిని, లక్ష్మణుని, భరతున్ని, శత్రుఘ్నున్ని దశరథ మహారాజుని వారివారి తాహత్తుకు అనుగుణముగా

ధనధాన్యాదులిచ్చి సత్కరించెను. అమ్మ సీతమ్మ కంటతడిపెట్టి ఏడుస్తుంటే తల్లులుకూడ కళ్ల వెంట నీళ్లుకారుస్తూ నిత్యము రామున్ని అనుసరించు అత్తమామలను సేవించు. పతివ్రతా ధర్మములను పాటించి అమ్మ, ఎల్లప్పుడు సుఖముగా జీవించు అని ఆశీర్వదించిరి. సీతమ్మను రఘురాముని అంపకం పెట్టుచున్న సమయంలో మంగళ వాయిద్యములు మారుమ్రోగినవి. అంతరిక్షంలో కూడ దేవతలు దుందుభులు మున్నగు మంగళ వాయిద్యములను వాయించగా ఈ రెంటి శబ్దము ప్రాణిలోకమునకు మూర్ఛ కలిగించెను.

ఇట్లు అధ్యాత్మ రామాయణములోని ఉమామహేశ్వర సంవాదములో బాలకాండలో ఆరవ సర్గము సమాప్తము.

—○—

## సప్తమ సర్గము

# పరశురామునితో యుద్ధము

శ్రీరాముడు మిథిలా నగరమును దాటి మూడు యోజనముల దూరమును వెళ్లిన తరువాత దశరథునకు దుర్నిమిత్తములు కనుపించెను. వశిష్ఠునితో సమాలోచించగా భయము లేదు తిరిగి శుభములు కలుగునని వశిష్ఠుడు చెప్పెను. అంత తిరిగి శుభసూచనలు కనిపించెను. మృగములు నీకు ప్రదక్షిణము చేయుచున్నవి. అని చెప్పునంతలో బ్రహ్మాండమైన గాలి వీచింది. అంత అందరి కండ్లలో ధూళిపడి విపరీతమైన ధూళివర్షము పడినది. ఆ తరువాత కొంచెము దూరము వెళ్ళుసరికి మెరుపుతీగతో సమానమైన కాంతిగలవాడు వేయి సూర్యుల కాంతిగలవాడు, రాశిపోసిన తేజస్సువలె కనపడు జమదగ్ని పుత్రుడగు పరశురాముడు ఎదురుపడెను. ఉన్నతకాయుడు, నీలమేఘ కాంతికలవాడు, మహాప్రతాపవంతుడు జటాజూటధారి చేతిలో ధనుస్సు పరశులను ధరించినవాడు, యముని ఆకారములో గల పరశురాముని చూచెను. మరియు నీతడు కార్తవీర్యునకు యముడైనవాడు. మదించిన క్షత్రియజాతియొక్క గర్వమును అపహరించినవాడు అపరకాల మృత్యుస్వరూపుడు. అతన్ని చూచి దశరథుడు భయకంపితు డాయెను. అర్ఘ్యపాద్యాదులను మరచి త్రాహి త్రాహి అని పలికెను. సాష్టాంగదండ ప్రణామము నాచరించి నాకు పుత్రభిక్ష పెట్టుమని ఎంతో వినయంతో దీనంగా ప్రార్థించెను. దశరథుని మాటలను లెక్కసేయకుండ క్రోధాగ్ని చే మండుచున్నవాడై నిష్ఠురంగా పలికెను. ఓరీ క్షత్రియాధమ! నేను పరశురాముడను ఉంటూఉండగా మరొకడివి రామ అను పేరుతో చలిస్తున్నావు. నీవు నిజంగా క్షత్రియుడవైతే నాతో ద్వంద్వయుద్ధం చేయుము. బూజ

పట్టిన పాతధనుస్సును భంగపరిచి వ్యర్థంగా కీర్తిని పొందావు. నీకు సత్తాఉంటే ఇదిగో ఈ వైష్ణవ ధనుస్సునందు నారిని ఎక్కుపెట్టుము. అప్పుడు నీతోకూడ యుద్ధంచేస్తాను. లేకపోతే మిమ్ములనందఱిని చంపిపారేస్తా. నేను క్షత్రియాంతకుండను. భార్గవరాముడు పలికిన పలుకులకు భూమికదలి పోయెను. అందఱి కండ్లలో చీకట్లు కమ్మాయి. అంత రఘురాముడు కోపముతో పరశురాముని వైపు చూచి అవలీలగా అతని చేతిలోని విష్ణుధనుస్సును లాక్కొని బాణముసు సంధించి ఎక్కుపెట్టి "ఓ బ్రాహ్మణుడా! నామాట వినుము. నా బాణానికి లక్ష్యమును చూపెట్టు. నా బాణము అమోఘము. లోకాల నన్నిటిని చూపెడతావో లేక నీ పాదద్వంద్వమును ఎన్నుకుంటావో చెప్పు. దానిని ఈ బాణముతో నాశనము చేస్తాను. ఇది నా ఆజ్ఞ. దీని బారినుండి నీవిప్పుడు ఈ లోకంలోగాని, పరలోకంలోనికి గాని కదలలేవు. తొందరగా చెప్పు నేనేమి చెయ్యాలో అనగానే భార్గవరాముడు చిన్నపోయిన ముఖము కలవాడయి పూర్వవృత్తాంతమును జ్ఞప్తికి తెచ్చుకొని ఇట్లు పలికెను.

హేరామ, రామ, మహాబాహో! నిన్ను పరమేశ్వరుడవని ఎరుగుదను. సృష్టిస్థితి లయకారకుడవైన శ్రీమన్మహా విష్ణువు నీవే. నేను బాల్యమందు విష్ణువు గూర్చి చక్రతీర్థంలో తపస్సు చేసాను. ఏకాగ్రచిత్తుడనై శ్రీమన్నారాయణుడు ప్రత్యక్ష మయ్యేవఱకు తపస్సు చేసాను. విష్ణువు ప్రసన్నముఖుడై నాతో పలికెను. ఓ బ్రాహ్మణశ్రేష్ఠ! నీ తపస్సు యొక్క ఫలితము విశిష్ఠమైనది. నీవు నాయొక్క చిదంశచే జన్మించితివి. పితృఘాతియైన కార్తవీర్యార్జునిని చంపివేయుము. తిరిగి ఇరువది యొక్కసార్లు క్షత్రియుల నందరిని చంపివేసి కశ్యపునకు సమస్త భూమిని దానము చేయుము. భూమిమీద శాంతిని నిలపెట్టు. నేను అవినాశియైన పరమాత్మను త్రేతాయుగమునందు దశరథ గర్భమందు రామనామముతో జన్మ ఎత్తుతాను అప్పుడు నీవు నా పరమశక్తితో కూడిన (సీత) నన్ను

చూస్తావు. నీ యందుంచబడిన యీ శక్తిని నేనప్పుడు తిరిగి తీసికొంటాను. అందువలన కల్పాంతముపఱకు తపస్సు చేసికొంటూ భూమిమీద ఉండు" అని చెప్పి విష్ణువు అంతర్హింతుడాయెను. ఆ విష్ణువే నీవు రామ, బ్రహ్మగారిచేత కోఱబడ్డవాడవై పుట్టితివి. నీయొక్క తేజస్సు నాయందున్నదానిని తిరిగి నీవు ఈ దినమందు తిరిగి తీసికొన్నావు. ఇప్పుడు నా జన్మ సఫలమయింది. నిన్ను గుర్తుపట్టాను. నీవు బ్రహ్మాదులకు కూడ పొందరాని వాడవు. ప్రకృతికంటె పరుడవు. నీయందు పుట్టుక, పెరుకుట, ముసలితనము-చావు అను వికారములు లేవు. నీవు వికారములు లేనివాడవు. సంపూర్ణుడవు. గమనాదులు లేనివాడవు. నీటిలో బుడగలాగున, అగ్నియందు పొగలాగున, నీ మాయి ఈ లోకంలో నానావిచిత్రములైన పనులను చేస్తోంది. నిన్ను దూరం చేస్తోంది. మాయదే మనుష్యుడెంతవఱకు బాధింపబడతాడో అంతవఱకు తత్త్వమును తెలిసికోలేడు. దేహమందలి చిచ్ఛక్తిని జీవుడని యంటారు. ఈ చిచ్ఛక్తి నీ ప్రతిబింబమే. దేహమందు అనగా శరీరమందు అభిమానముంచుకొని నేనే చేయుచున్నాను. నేనే అనుభవించుచున్నాను, అని తనయందు అజ్ఞానముతో ప్రవర్తించు జీవుడు సంసారిఅయి పోవుచున్నాడు. బుద్ధియందు జ్ఞానశక్తి కలుగదు. జలము అగ్ని కలిస్తే నీటిలో వేడి, అగ్నికి శాంతి ఎట్లు కలుగుచున్నాయో అటులనే జడమైన బుద్ధికి చైతన్యమైన ఆత్మతో సంపర్కమేర్పడగానే పరస్పరము ఒకదానియందు ఒకటి ప్రతిబింబించును. అప్పుడు జడత్వమును తెలిసికొనవచ్చును, ఆత్మను తెలిసికొనవచ్చును. కానిజడమగు బుద్ధినే స్వీకరించినవాడు నేను కర్తను, నేను భోక్తనుఅని అజ్ఞానంలో పడిపోవుచున్నాడు. హే రామ! మానవుడు నీ పాదపద్మ సక్తులతో సహవాసము చేయడో అంతవఱకు వానికి దుఃఖముల నుండి విముక్తి లేదు. సత్‌సహవాస మధికమైనకొలది మాయ మెల్లమెల్లగా జారిపోతుంది. ఆత్మలాభం పొందినవారికి దుఃఖము లుండవు. ఆత్మ

లాభంపొందిన సద్గురువు దొరకుతాడు. ఆ సద్గురువు మహావాక్యములు బోధించి అజ్ఞానమును నాశనము చేయును. అప్పుడు నీ దయవలన ముక్తుడు అగును. అందువలన నీ భక్తిశూన్యులకు వేలాది జన్మలెత్తినను ముక్తిగాని బ్రహ్మజ్ఞానము గాని లభించవు. అందువలన నేను నీ పాదపద్మములందు జన్మజన్మలకు భక్తిని కోరుచున్నాను. మఱియు రామభక్తి సామ్రాజ్యమును అనుభవించు సత్పురుషులతో సహవాసమును కోరుచున్నాను. ఈ రెంటివలన అవిద్య నశిస్తుంది. లోకములో నీయందు భక్తి కల మానవులు సర్వలోకములను రక్షిస్తారు. ఇంక వారి కులస్థులను రక్షించెదరనుటలో సందేహ మేల? జగన్నాధ! నీకు నమస్కారము. భక్తిచేత భావింపబడు దేవా! నీకు నమస్కారము. కరుణామయుడగు రామచంద్రా! నీకు నమస్కారము. దేవ! నాచేత లోకములను జయించాలి అను కోఱికచేత, చేయబడిన పుణ్యము నీ బాణమునకు లక్ష్యము అగు గాత! నీకు నమస్కారము.

అంత కరుణామయుడైన శ్రీరాముడు ఓ బ్రాహ్మణోత్తమా! నేను ప్రసన్నుడనైతిని. నీ మనస్సులో దేనిని కోరుచున్నావో దానినంతటిని నీకిచ్చు చున్నాను. ఇందు సందేహమునకు తావు లేదు. అంత ప్రహృష్టుడైన పరశురాముడు ఓ రామ! నీకు నాయందు అనుగ్రహముంటే నీ పాదభక్తిని అనుగ్రహించు. నీ భక్తులతో సదా కూడియుండుటను ఇమ్ము.

ఈ స్తోత్రమును ఏ మానవుడు పఠించునో భక్తిహీనుడైననూ వానికి నీయందు భక్తి నీ విజ్ఞానము కలుగును. మఱియు అంత్యకాలమందు నీయందు స్మృతి కలుగును అని అనగా శ్రీరాముడు తథాస్తు అనెను. అంత పరశురాముడు రఘురామునికి ప్రదక్షిణచేసి నమస్కరించి తిరిగి పూజింపబడ్డవాడై రామాజ్ఞచేత మహేంద్ర పర్వతమునకు వెళ్ళిపోయెను.

దశరథుడు వచ్చి శ్రోత్రికినట్లుగా రామున్ని చూచి సంతోషించి ఆలింగన చేసికొని మహదానందముతో అయోధ్య కేగెను. రామ లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు తమతమ నివాసములయిన అంతః పురములందు తమతమ భార్యలతో ఆనందంగా కాలం చేయుచుండిరి. రాముడు వైకుంఠంలో లక్ష్మితో శ్రీహరివలె ఆనందించెను. తల్లి దండ్రుల ప్రాపునూతనమైన భార్యలు, అనంతమైన ఐశ్వర్యము, అధికారము ఇహలోకంలో ఆనంద కారకాలు. నలుగురు సోదరులు ఈ ఆనందాన్ని అపారంగా అనుభవిస్తున్నారు. ఇంతలో కైకేయి అన్నదమ్ముడు యుధాజిత్తు భరతున్ని తీసికొని వెళ్లుటకు వచ్చెను. దశరథుడు అటులనే పంపించెను. శత్రుఘ్ననికూడ అతని వెంట పంపెను. కౌసల్యాదేవి సీతారాములతో మిక్కిలి ప్రకాశించెను. శచీపురందరుల్లాగా ఉండేను. లోకవిఖ్యాత కీర్తి గలవాడు, లోక నాథులచేత ప్రశంసింపబడిన గుణగణము కలవాడు అగు శ్రీరాముడు సీతమ్మతో హాయిగా సమస్త జనులకు ఆనందకారకములగు పను లను జేయుచు నిత్యశ్రీమంతుడై, నిర్వికారుడై, అంతులేని సంపత్తు గలవాడై, నిత్యమును మాయను దూరంగా ఉంచినవాడై అన్ని కార్యములను మాయకు లొంగినవాడులాగున చేయుచు మానవుడు వలె అఖిలేశుడైన దేవుడైనప్పటికి జీవితమును సంతోషంగా సుఖంగా గడపుచున్నాడు.

ఇట్లు అధ్యాత్మ రామాయణంలో బాలకాండ సప్తమ సర్గతో సహా బాలకాండ సమాప్తము.

—O—

# అయోధ్యకాండ

# అయోధ్యకాండ

## ప్రథమ సర్గ

శ్రుత్వైవ యో భూపతి మాత్తవాదం
వనం గతస్తేన ననోది తోపి.

1) తంలీలయా అహ్లాద విషాదశూన్యం
శ్రీ జానకీ జీవనమాన తోస్మి.

2) అహో సుధన్యోహము మూనిరామ
పాదారవిందాంకిత భూతలాని
ప శ్యామియత్పాదరజో విమృగ్యం
బ్రహ్మాది దేవైః శ్రుతిభిశ్చ నిత్యం.

ఒకనాడు, సర్వాభరణ సమలంకృతుడై, నల్లని కలువరంగు కలవాడు, కౌస్తుభము మెడయందు ధరించినవాడు, రత్న సింహాసన స్థితుండు అగు రాముని అమ్మ సీతమ్మ తాంబూలముల నిచ్చి రత్న దండముగల చామరముతో సేవించుచున్న సమయములో నారదుడు ఆకాశమునుండి చూచుటకు వచ్చెను. శుద్ధస్ఫటిక కాంతి గలవాడు, శరచ్చంద్రునివలె తెల్లని శరీరము కలవాడు, దివ్యదర్శనుడు అగు నారద మహాముని ఎందుకు వచ్చాడో తెలిసికొనుటకు వీలు లేకుండా హటాత్తుగా వచ్చినాడు. వానివి చూచి శ్రీరాముడు ఆస నమునుండి లేచి నమస్కరించి సీతతో కూడ సాష్టాంగదండ ప్రణా మము గావించెను. పరమ భక్తితో రాముడు నారదుని గూర్చి పలికెను. మునిశ్రేష్ఠ! విషయములందు తగుల్కొన్న మావంటి సంసారులకు మీ దర్శనము బహుకష్టము. మాచేత చేయబడిన

పూర్వజన్మములందలి పుణ్యఫలముగా మీ దర్శనభాగ్యము నాకు కలిగినది. పుణ్యకర్మల నాచరించే గృహస్థులకు కూడ సత్సమాగమము కలుగుతుంది. నీ దర్శనమువలన నేను ధన్యుడనైతిని. తమకు ఏ పనిని నేను చేయాలి. సెలవీయండి. దాన్ని తప్పక చేస్తాను. భక్తవత్సలుడైన రాముని గూర్చి నారదుడు కూడ పలికెను. హే రామ ! నన్ని విధముగ సామాన్యులు సందర్భాను సారంగా చెప్పే రీతిలో ఎందుకు మోహింప చేస్తావు. నేను సంసారిని అన్నావు. ఇది సత్యమే జగత్తు లన్నిటికి అది భూతురాలైన యోగమాయగు సీతమ్మ నీ భార్య. అమెయందు నీ సాన్నిధ్యము వలన బ్రహ్మాది పిపీలికవఱకు ప్రజలు పుట్టుచున్నారు. త్రిగుణాత్మకమైన మాయ నీ ఆజ్ఞవలన సంచరిస్తోంది. తెలుపు, నలుపు, ఎరుపు అను మూడురంగులుకల సత్వము, తమస్సు, రజస్సు అను త్రివిధములైన ప్రజలను సృష్టిస్తోంది. మూడు లోకములు మీ యిల్లు. గృహస్థు నన్నావు ఈ మూడు లోకముల సంసారి నీవు. నీవు విష్ణువు. జానకి లక్ష్మి నీవు శివుడవు జానకి శివ. నీవు బ్రహ్మావు జానకి వాణి. నీవు సూర్యుడవు జానకి కాంతి నీవు చంద్రుడవు జానకి రోహిణి తెల్లని శుభలక్షణము కలది. నీవు ఇంద్రుడవు జానకి శచీదేవి. నీవు అగ్నివి జానకి స్వాహాదేవి. నీవు కాలరూప యముడవు. సీత సంయమని నీవు నిరుఋతివి జానకి తామసి. నీవు వరుణుడవు జానకి భృగుకన్య యగు భార్గవి. నీవు గాలివి సీత గమనము. నీవు కుబేరుడవు సీత సర్వసంపత్తు ప్రపంచ ఖ్యాతి నార్జించినది. నీవు రుద్రుడవు జానకి రుద్రాణి. లోకనాశంకరుడు రుద్రుడు. స్త్రీలింగ పరమైన సర్వము జానకీదేవి. పుల్లింగ వాచకమైనదంతయు నీవు. అందుచేత మూడు లోకములందు మీరు కానిది లేదు.

మీయొక్క ఛాయలో పుట్టిన అజ్ఞానమును అవ్యాకృత మంటారు. అవ్యాకృతము నుండి మహత్త్వము పుట్టినది. మహత్త

త్వమునుండి సూత్రాత్మ అని పిలువబడు హిరణ్యగర్భుడు పుట్టెడు. సూత్రాత్మనుండి లింగదేహము పుట్టింది. ఈ లింగదేహమునకు సంబంధించినవియే. అహంకారము, బుద్ధి. పంచప్రాణములు, పది ఇంద్రియములు వీని సమూహము అంతా కూడ. మరియు సుఖ దుఃఖములు చావుపుట్టుకలు గూడ లింగదేహమునకు సంబంధించిన వియే. జగత్తులో తన్మయుడగు లింగదేహమును అభిమానించు మని షిని జీవుడు అంటారు. చెప్పరానిది అనాది యైనదియు అగు అవిద్య దీనికి కారణమంటారు పెద్దలు. శుద్ధచైతన్యము యొక్క మూడు విధములగు స్థూల, సూక్ష్మ కారణములను ఉపాధిత్రియ మంటారు. ఈమూటితో అనగా స్థూల సూక్ష్మ కారణ శరీరము కలవాడు జీవుడని పిలువబడు చున్నాడు. ఈ మూడు లేనివాడు పరమేశ్వరుడు. జాగ్రత్ స్వప్న సుషుప్తి అను మూడవ స్థలతో కూడినది సృష్టి. హే రఘూత్తమా! నీవు దీనికి విలక్షుణడవు నీవు సాక్షిభూతుడవు. చైతన్యమాత్రము కలవాడవు. నీనుండి విశ్వము పుట్టినది. నీయందు ఉంచబడింది. నీయందే లయమును కూడ పొందుచున్నది. అందు వలన నీవు సర్వకారణుడవు. త్రాటిని చూచి పామును భ్రాంతి పడట్లు నిన్ను ను జీవుడను కొనుటవలన భయము కలుగుచున్నది. నేను పరమాత్మను అని తెలిసికొనుటవలన భయము లేదు. దుఃఖము లేదు. చైతన్యరూపములగు బుద్ధులు సర్వదేహములందు నీయొక్క చిత్ కాంతిచేత ప్రకాశించు చున్నవి. అందుచేత నీవు సర్వమునకు ఆత్మవయి యున్నావు. నీయొక్క నిజస్వరూపమును తెలిసికొన నంతకాలము భ్రాంతి కలుగును అనగా త్రాటియందు పాముని కొను భ్రాంతి కలుగును. నీయొక్క జ్ఞానమువలన అనగా నీ స్వరూపస్థితిని తెలియుట వలన అజ్ఞానము నశించి జ్ఞాన ముదయించును. అందు వలన మానవుడు ఎల్లప్పుడు జ్ఞానమును అభ్యసించవలెను దానికి తోడుగా నీయందు భక్తికలిగిన మానవులు ముక్తిని పొందుచున్నారు. నేను నీ భక్త భక్తులయొక్కయు, వారలయొక్క భక్తులయొక్కయు

కింకరుడను సేవకుడను. అందువలన నన్ను గ్రహింపష్టము గాని మోహింప జేయకుము నీ నాభికమలమునుండి మా తండ్రి బ్రహ్మ గారు ఉదయించినారు. అందువలన నేను నీకు పౌత్రుడను అంతే కాదు. నీయొక్క భక్తుడను నన్ను రక్షించు రాఘవ! అని వేడు కొనెను. ఈ విధంగా పలికి అనేకములుగా నమస్కరించి ఆనందా శ్రువులు కళ్లనిండ నారదుడు పలికెను. హే రఘునాథా! బ్రహ్మ గారు నన్ను నీ దగ్గఱకు పంపినారు. ఓ రామా! నీవు రావణవధకు జన్మించితివి. ఇప్పుడు మీ తండ్రి దశరధుడు నిన్ను రాజ్యాభి షిక్తుని గావింప దలచినాడు. రాజ్యాభిషిక్తుడవయినచో నీవు రావణుని చంపవు. భూభారహరణము చేస్తానని ప్రతిజ్ఞ చేసినావు. దానిని యథార్థము చేయుము రాజేంద్ర! నీవు సత్యసంధుడవు. అంత రాముడు నవ్వుచు నారదా! నాకు తెలియనదంటూ ఏ కొంచెమైనా ఉందా? ఏయే దానిని చేస్తానని ప్రతిజ్ఞ చేసానో దానిని అవశ్యం చేసి తీరుతాను. కాని కాలక్రమములో వారివారి ప్రారబ్ధ కర్మ ననుసరించి క్రమంగా సర్వభూభారమును తగ్గించెదను. రాక్షసజాతి నాశనము చేస్తాను. రేపే నేను రావణ వధకొఱకు దండకారణ్య మునకు వెళ్లెదను. ముని వేషమును ధరించి జటావల్కల ధారినై పదునాలుగు సంవత్సరము లుంటాను. సీతమ్మ మిషతో పుత్ర, మిత్ర బాంధవ సమేతంగా రావణాసురుని నశింప చేస్తాను. ఈ విధంగా రాముడు చెప్పునరికి నారదుడు అత్యంత ఆనందమును పొంది కాళ్లకు సాష్టాంగ ప్రణామము గావించి రాముని దగ్గఱ అనుమతి తీసికొని దేవమార్గములో నారదుడు వెడలిపోయెను. ఆకాశ మార్గములో వెడలెను. ఏ మానవుడు నారద రామచంద్ర సంవాదమును, భక్తితో పఠించునో, స్మరించునో, వినునో వాడు దేవతలకు సాధ్యము కాని మోక్షమును వైరాగ్యముతో క్రమశః పొందుతాడు.

ఇట్లు అధ్యాత్మ రామాయణ మందలి ఉమామహేశ్వర సంవాదమందలి ప్రథమ సర్గము సమాప్తము.

SRI VENKATESWARA CENTRAL LIBRARY
TIRUPATI.
53473

## ద్వితీయ సర్గ

# శంకరుడు అమ్మ పార్వతితో పలికెను

అంత దశరథు డొకనాడు తన కులాచార్యుడైన వశిష్ఠుని రహస్యముగా సంభాషించెను. హే భగవాన్, రామున్ని అందరు పొగుడుచున్నారు. పౌరులు, వేదవృద్ధులు మంత్రులు పదేపదే పొగడుచున్నారు. సర్వగుణ సంపన్నుడైన రామున్ని రాజ్యమందు నేను అభిషిక్తున్ని చేస్తాను. నేను ముసలివాడను. రాముడు జ్యేష్ఠ కుమారుడు. భరతుడు శత్రుఘ్ను సహితంగా మేనమామను చూసుటకు వెళ్ళినాడు. రేపే రామున్ని పట్టాభిషిక్తుని చేస్తాము. మీరు అనుజ్ఞ ఇవ్వండి అన్ని ఏర్పాట్లు గావించండి. మీరు రామున్ని సంప్రదించండి. నగరంలో రంగురంగు పతాకాలను ఎగురువేయండి. బంగారు తోరణములను, ముత్యాల తోరణాలను కట్టండి. మరియు మంత్రిశ్రేష్ఠుడైన సుమంతున్ని పిలిపించి వశిష్ఠులవారికి కావలసిన దల్లా మీరు తెప్పించి యివ్వండి. రేపు రామున్ని పట్టాభిషిక్తుని చేయుచున్నాను. సుమంత్రుడు అటులనే అని చెప్పి వశిష్ఠునితో నేనేమి చేయగలనని అడిగెను. వశిష్ఠుడు జ్ఞానులలో గొప్పవాడు. సుమంతునితో విట్లనియెను. రేపటి దినమున ప్రభాత సమయమందు బంగారు తొడుగులతో పదునారు కన్యలు అంతఃపుర మధ్యభాగము నందు ఉండవలెను. ఐరావత కులమందు పుట్టినది, నాలుగు దంతములు కలదియు నగు ఒక ఏనుగు కావాలి, అనేక దివ్యతీర్థములనుండి కొని తేబడిన ఉదకములతో నిండిన వేయి స్వర్ణకలశలు కావాలి. మూడు కొత్త పులి చర్మములు, శ్వేతచ్ఛత్రము, రత్న దండము, ముత్యాలతో కూడినది, దివ్యమైన మాలలు, దివ్యమైన వస్త్రములు, దివ్యమైన ఆభరణములు పూజితులైన మునులు దర్భలను ధరించినవారు సర్తకులు,

భోగం మేళాలు, గాయకులు వేణునాద విద్వాంసులు, మఱియు శంఖము మున్నగు వానిచేత ఆలాపించ సర్వవిధములయిన శబ్ద శాస్త్రవేత్తలు వారివారి వాయిద్యములను ప్రదర్శించవలెను. నాలుగో విధములైన గజ, అశ్వ రథపదాతులు ఎవరి ఆయుధములను ధరించి వారు జాగరూకులై నగరము బయట ఉండెదరు గాక ! పట్టణంలో ఉండే అన్ని దేవాలయములలోను అనేక విధములైన బలిప్రదానములు పూజలు కావింపబడు గాక. సమస్త సామంతరాజులు వారి వారి కానుకలను పట్టుకొని రావలెను. ఈవిధంగా సుమంత్రుని ఆదేశించి వశిష్ఠుడు సుందరాతి సుందరమైన రామమందిరమునకు తాను స్వయముగా చనెను. తన రథమును తాను ఎక్కి మూడు కక్షలను దాటి రథమునుండి దిగెను. ఆచార్యుడగుట వలన ముందు అనుమతి అక్కరలేకుండ అంతఃపురములోనికి ప్రవేశించెను. గురువులు వచ్చిరని రాముడు ఎదురునెళ్లి సాష్టాంగంగా నమస్కరించి రత్నసింహాసనమందు కూర్చోపెట్టి సీతమ్మ స్వయంగా తెచ్చిన బంగారు కలశలలోని నీళ్లతో పాదములు కడిగి సీతమ్మ తాను ఆ పాదజలములను తమతమ శిరస్సులపై జల్లుకొనిరి. ధన్యుడ నైతినని రాముడు చెప్పనంత వశిష్ఠురు నవ్వుచు నీ పాదజలముల వలన శంకరుడు, బ్రహ్మ మఱియు మా తండ్రిగారు ధన్యులయిరి. నీ పాదతీర్థ మహిమ అటువంటిది రామా ! సామాన్య లోకరీతిని నీవు మాట్లాడుచున్నావు. లక్ష్మీదేవితో సహా జన్మించిన నారాయణుడవని నిన్ను నేనెరుగుదును. దేవ కార్యార్థసిద్ధి కొఱకు, భక్తులయొక్క భక్తి పండుటకు, రావణుని చంపుటకు నీవు పుట్టినట్లు నాకు తెలుసును. అయినను దేవకార్యము గాన గుహ్యమైనది. నేను ప్రకటించలేక పోవుచున్నాను. నీవంత మాయచేత పనులను చేయించు చున్నావు. నేను కూడ నిన్ను ఆ మార్గంలో అనుసరిస్తాను. నేను నీకు శిష్యుడను. మఱియు గురువును. నీవు గోచరుడివు గావు. జగత్తులో సమస్త జీవికోటిలో అంతర్యామిగా ఉన్నావు. నీవు శుద్ధ సత్త్వప్రధానమైనట్టి నీ స్వాధీనములో నున్న దేహమును ధరించి యోగమాయచేత మనుష్యుడు

వశి సంచరించు చున్నావు. పౌరోహిత్యము నింద్యమైన జీవన విధానమని నాకు తెలుసును. అయినను ఇక్ష్వాకు వంశమందు రాముడు జన్మిస్తాడు అని బ్రహ్మగారు నాకు ముందు చెప్పినారు. అందువలన నీ సంగము దొరుకుతుందని నీకుకూడ నేను ఆచార్యత్వమును వహించు భాగ్యము కలుగునని, నింద్యమైనది యైనను పౌరోహిత్యమును స్వీకరించితిని. హే రఘునందన! నా కోరిక ఫలించినది. మాయ నీయందు ఉన్నది నీవు ఏలాగు నడిపిస్తే నేను అలాగున నడుచుకుంటాను. ఒకటి కోరుకుంటున్నాను. నీ మాయ నీ యధీనమందున్నది, కాన అది నన్నును మోహింపకుండ అనుగ్రహించుము. గురువుగారికి తరణోపాయమును కలిగించుదామని సంకల్పము నీకుంటే దీనిని మాత్రము అనుగ్రహింపుము. ప్రసంగం వచ్చింది కాబట్టి సందర్భానుసారంగా నీతో ఈ విషయమును బయటపెట్టినాను. ఇంకెక్కడ అనకూడదు. దశరథ మహారాజు చేత నేను పంపబడ్డాను. రేపు నిన్నును పట్టాభిషిక్తుని చేస్తా"ని దశరథుడు చెప్పమన్నాడు. యధావిధిగా ఈ దినము సీతమ్మతో కూడ ఉపవాసం ఉండుము శుచివై భూమియందు శయినించి జితేంద్రియుడవై ఉండుము. నేను తిరిగి రాజావారి దర్శనము కొఱకు వెళ్లుచున్నాను. నీవు రేపు దర్శనము చేయుదువు గాక. అని చెప్పి వశిష్ఠుడు రథము నెక్కి వెళ్లిపోయెను. వశిష్ఠుడు రాజగురువు. రాముడు లక్ష్మణుని చూచి నవ్వుచు రేపు నాకు పట్టాభిషేకము జరుగును. నేను నిమిత్తమాత్రంగా రాజుగా ఉంటాను చేత, అనుభవము నీవి. నీవు నా బహిఃప్రాణము ఇందులో సంశయమునకు తావులేదు. వశిష్ఠమునిచేత చెప్పబడినట్లు తక్కిన పనులను నిర్వర్తించెదను. వశిష్ఠుడు దశరథునితో చేసినదంతయు చెప్పెను. ఓ మనిషి ఈ రామపట్టాభిషేక విషయమును కౌసల్య సుమిత్రలకు చెప్పెను. వారలు విని సంతోషించి ముత్యాల హారములను దానము చేసిరి. అంత కౌసల్య రామునికి సర్వసౌభాగ్యసిద్ధి కొఱకు పుత్రప్రేమ గలదిగాన లక్ష్మి

ఖి

పూజ గావించెను. దశరథుడు సత్యవాది తాను చెప్పింది చేస్తాడు. కాని కాముకుడు కైకేయీ వశంలో ఉన్నవాడు. తాను చెప్పింది చేస్తాడో లేదో అని చిన్న సంశయము వచ్చింది కౌసల్యకు. ఈ విధంగా వ్యాకుల చిత్తురాలై ఆమె దుర్గాదేవి పూజను కూడ చేసెను.

ఈ సందర్భములో ఇదే సమయంలో దేవతలందరూ దేవి సరస్వతిని సమీపించి అయోధ్యకు వెళ్లి భూలోక ప్రవేశము చేయ మనియు బ్రహ్మవాక్య సంసిద్ధికొఱకు రామ పట్టాభిషేకమునకు, విఘ్నము వాటిల్లులాగున, ముందుగా మంథరయందు ఆ తరువాత కైకేయియందు ఆవేశించి విఘ్నము జరిగిన తరువాత స్వర్గలోకము నకు తిరిగి రమ్మని వేడిరి. అమ్మ సరస్వతి అలాగే అని ముందు మంథరలో ప్రవేశించెను. కుబ్జయైన మంథర మేడమీదికి ఎక్కి నగరమంత అలంకరింపబడి యుండుట గమనించి ఆశ్చర్యమ్మును పొంది తిరిగి మేడ దిగింది. ఆయాను అడిగింది. తల్లీ ఎందుకీ నగర మంతా ఈ అలంకరణ చేసారు. కౌసల్య బ్రాహ్మణు లందఱికి బట్టలు, హారములను దానము చేయుచున్నది. ఆ మాటలను వినిన వెంటనే మంథర కైకేయి దగ్గఱకు వెళ్లెను. కైకేయి మంచముమీద ఏకాకురాలయి ఉంది. ఓ అభాగ్యురాలా మూర్ఖురాలయిన కైకేయి ఎందుకు నువ్వీవిధంగా నిద్రిస్తున్నావో నాకు తోచలేదు. నీకు మహాంతమైన ఆపత్తు వచ్చింది. నీవు సౌందర్యముచేత మదించిన రాణివి. నీకేమి తెలియదు దశరథుని అనుగ్రహమువలన రేపే రామునికి పట్టాభిషేకము జరుగుతుంది. ఆ మాట విని సంతోషించి సమనస్సుతో తన కాలిఅందెను బంగారంతో తయారుకాబడిన దానిని మహాద్భుతమైన దానిని కానుకగా నిచ్చెను. ఆనందించవలసిన సమయమిది. నాకేమిటి మహాంతమైన ఆపత్తు వచ్చిందంటావు. నాకు భరతుడుకంటె రాముడు అత్యంత ప్రియుడు. నేనంటే రామునికూడ మహాప్రేమ కౌసల్య నన్నెప్పుడు తనతో సమానంగా గౌరవిస్తుంది. ఎల్లప్పుడు నన్ను సేవిస్తుంది. రామునివలన ఏ ఉపద్రవము రాదు.

ఓ మూర్ఖురాలా ! నీ భయమేమిటో దయచేసి చెప్పుమనెను. అంత మంథర నామాట విను నీకు నిజంగా మహాంతమైన ఆపత్తు వచ్చింది. నిన్నెప్పుడు సంతోషపెడుతు దశరథుడు ఇష్టమైన మాటలు చెప్పు తాడు. వీడు కాముకుడు అసత్యవాది నీకు మాటలమూట ఇచ్చి రాముని తల్లియైన కౌసల్యకు సర్వోపకారములు చేస్తాడు. ఇది మన స్సులో పెట్టుకొని నీ కొడుకుని మీ కన్న వారింటికి శత్రుఘ్నునితో కూడ పంపివేసాడు. ఇందులో సుమిత్రకు ఏవిధమైన ఫరవాలేదు. రామున్ని లక్ష్మణుడు వెంటపెట్టుకొని వెళ్తాడు రాజ్యాన్ని కూడా అనుభవిస్తాడు. నీ కొడుకు భరతుడు రాముని రాజ్యంలో సేవకు డుగా నిలబడుతాడు. ఒకవేళ నగరంనుండి బయటకు పొమ్మనమని గెంటివేయ బడవచ్చు లేక వెంటనే భరతుని ప్రాణములను తీసి వేయవచ్చు. నీవు కౌసల్యదగ్గఱ ఒక దాసీగా పనిచేయాలి. దీనికంటె సవతివల్ల పరాభవంకంటె చచ్చిపోవడం మేలు. అందువలన నీవు వెంటనే భరతుని పట్టాభిషేకమునకు ప్రయత్నించుము. పధ్నాలుగు సంవత్సరాలు రామునికి అరణ్యవాసము కొఱకు ప్రియత్నం చేయుము. అందువలన రాము డరణ్యమునకు వెళ్ళిపోతే భరతునికి భయంలేకుండా ఉంటుంది. ఈ రెంటి పనులను సాధించుటకు చక్కని ఉపాయాన్ని కూడా ఆలోచించాను. పూర్వం దశరథుడు దేవాసుర సంగ్రామంలో దేవతలకు సహాయంకొఱకు రాక్షసులపయి దండెత్తి యుద్ధం చేయుచుండగా వాని రథము ఇరుసువిరిగి పడిపోయింది.

దశరథుడది చూసుకోలేదు. దశరథునకు అపాయము సంభ వించునని నీవు నీచేతిని కీలుకు బదులుగా రథంలో అమర్చి నీ భర్త ప్రాణరక్షణ కొఱకు చాలాసేపు నీచేయిని అవిధంగా ఉంచావు. అది యొక సాహసోపేతమైన పని. పతి ప్రాణరక్షణ నెపంతో నీవు చేసిన అద్భుతకృత్యం. రాక్షసుల నందరిని చంపి అప్పుడు దశరథుడు నీ చేయిని ఇరుసుగా ఉండుటను చూచేడు. పరమానందభరితుడై విన్నా లింగనం చేసికొని ఏకేమి కావాలో నీ మనసులోని ఏ

కోరిక ఉందో దానిని అడుగమని సంతోషంలో నీకు మాటయిచ్చాడు. రెండు వరములను కోరుకొమ్మనమని శపథం చేసాడు. అప్పుడు నీవు ఆ వరద్వయమును దశరథుని అడక్కుండా అవసరమైనప్పుడు అడుగుతానని చెప్పి ఏమీ అడుగలేదు. కాని అవసరము వచ్చి నప్పుడు తప్పకుండా అడుగుతానని చెప్పినావు. అటులనే ఇస్తానని దశరథుడు నీకు మాటయిచ్చేడు. నాకిప్పుడా కథ గుర్తు కొచ్చింది. నీవే చెప్పేవు నాకు గతంలో అందువలన నీవు వెంటనే కోపగృహ మునకు వెళ్ళి సర్వాభరణములను తీసివేసి గదినిండా జిమ్మి వేసి మౌనంతో భూమిమీద పడుక్కో సత్యవాక్య పరిపాలకుడైన దశరథ మహారాజు నీకోరికల రెంటిని నెరవేర్చేవఱకు అటులనే ఉండుము. కుబ్జయైన మంథర చెప్పిన మాటలను విని కైకేయి యదార్థం చెప్పింది. మంథర, అని నమ్మి ఆమె బుద్ధికి సంతోషించి ఇదివఱకు మంథర ఇంత బుద్ధిమంతురాలని తనకు తెలియదని ప్రశంసించి మంథరకు భరతుడు రాజ్యాభిషిక్తుడైన తరువాత నూరు గ్రామాలు కాను కగా ఇస్తానని చెప్పి వెంటనే కోపమందిరంలోకి ప్రవేశించింది. సర్వాభరణములను తీసివేసి నేలనిండా జిమ్మివేసి మాసిన బట్టలుకట్టు కొని నేలమీద పడుకుంది కైకేయి. మఱియు మంథరతో రాముడు అరణ్యానికి వెళ్లేవఱకు ఇటులనే ఈ కోపమందిరంలోనే పడుకుం టాను లేకపోతే ప్రాణములను వదిలివేస్తాను. అని శపథంతో చెప్పింది. మంథర చెప్పవలసినదంతా చెప్పి ఆ మాటమీద ఉండు నీకు నిశ్చయంగా శుభము కలుగుతుంది అని చెప్పి తన యింటికి తాను వెళ్లిపోయింది. ఎంత దయగలిగిన వాడైనను, ధైర్యవంతు డైనను సుగుణములు కలవాడయినను ఆచారవంతుడయినను నీతిజ్ఞు డైనను వేదశాస్త్రజ్ఞానము కలిగినవాడయినను మలినమయిన పాప భూయిష్టమైన మనస్సుకల దుష్టులతో సహవాసం చేస్తే ఇంత సత్పు రుషుడు దుష్టుడై పోతాడు. సహవాస దోషం అంత గొప్పది. అందు

వలన దుష్టులతో సంగము విడిచిపెట్టాలి. దుస్సంగము కలవాడు కైకేయివలె శుభములకు దూరుడయి పోతాడు. కైకేయి రాజకన్య అయినను చెడుసహవాసంవలన దుష్టబుద్ధి అయిపోయింది. దుష్టుని నికి పాముకి ఎప్పుడూ దూరంగా ఉండాలి అని పెద్దలంటారు. ఇది యదార్థమే.

ఇట్లు అయోధ్యకాండలో రెండవ సర్గము సమాప్తము.

—O—

# తృతీయ సర్గ

## శంకరుడు పలికెను

దశరథుడు శ్రీరాముని పట్టాభిషేక ఉత్సవంలో నిమగ్నుడై మంత్రులందరిని మంగళకరములగు పనులందు నియమించి కైకేయి భవనమును జేరెను. ఆ మందిరంలో కైకేయి లెదు. ఎప్పుడు తాను వెళ్లినా ఎదురువచ్చి అహ్వానించే ఛవ్యముఖముతో ఉండే కైకేయి ఈరోజున ఎందుకు లేదు. అని ఆశ్చర్యమగ్నుడై అంతఃపుర జనమును అడుగగా వారు కారణం మాకు తెలియదు. క్రోధభవనంలో ఉన్నదామె. అచ్చటకు వెళ్లి మీరు కారణమును అడుగవచ్చని చెప్పిరి భయముతో వణుకుచు. క్రోధభవనంలోనికి వెళ్లి మెల్లగా అమె దేహమును చేతితో స్పృశించి ఈవిధంగా నేలమీద ఎందుకు పడుకున్నావు మంచములను వదిలిపెట్టి అభరణము లన్నిటిని తీసివేసావు. మాసిన బట్టలు కట్టుకున్నావు ఏమి మాట్లాడవు అని ప్రశ్నించెను. ఎందుకీ కోపము నీయొక్క కోరికను చెల్లిస్తాను. నీకు అహితమును చేసినవాడెవడు అడదా మగవాడా ఎవరైనా వానిని శిక్షిస్తాను మరియు చంపివేస్తాను. నాకు చెప్పు ఈక్షణంలో నీపనిని చేస్తాను. నీఎదుట పరిష్కరిస్తాను. నేను నీవశంలో ఉన్నవానిని నాయొక్క హృదయం బాగా తెలిసినదానివి అయినప్పటికి ఈవిధంగా నన్ను దుఃఖపెట్టుచున్నావు నీకిష్టమైన దరిద్రున్ని కుబేరసమానునిగా చేస్తాను. ధనవంతుడైతే దరిద్రునిగా చేస్తాను. చెప్పు ఎవనిని చంపమంటావు. చంపదగ్గవాన్ని వదిలివేస్తాను. ఎందుకిన్ని మాటలు నీకు నా ప్రాణములను ఇస్తాను. నా ప్రాణముల కంటె ప్రియమైన రామునిమీద ఒట్టుపెట్టుకొని చెప్పుచున్నాను. నీకేది హితమో దానిని చేస్తాను. చేసి తీరుతాను. రామునిమీద ఒట్టు

అన్న మాటలను విన్న కైకేయి మెల్లగా కండ్లువిప్పి పలికెను. నీవు రామునిపయి ఒట్టుపెట్టి చెప్పినావు. కాన నేను అడుగుచున్నాను. పూర్వము దేవాసుర యుద్ధమందు నీవు నాచేత రక్షింపబడ్డావు. అప్పుడు నీవు సంతోషించి నాకు రెండువరముల నిచ్చితివి. ఆరెంటిని నీయందే ఉంచినాను. దానిలో ఒకవరము ననుసరించి ఇప్పుడు రేపు రామ పట్టాభిషేక ముహూర్తమునకే, భరత పట్టాభిషేకము చేయుము. రెండవ వరము ననుసరించి రాముడు పదునాలుగు సంవత్సరములు వనములో వల్కలధారియై జటలను ధరించి కందమూలములను తినుచు మునివేషధారియై ఉండుమని చెప్పవలెను. రేపు తెల్లవారుసరికి రాముడు అరణ్యమునకు వెళ్లిపోవాలి. ఈ నా రెండు కోరికలను అల సించితివో ఇప్పుడే నీయెదుటనే ప్రాణములను విడిచిపెట్టు చున్నాను. నీవు సత్యప్రతిజ్ఞుడవగుట నాకు ఇష్టము వజ్రముచేత కొట్టబడిన కొండవలె దశరథుడు కైకేయీ సంభాషణమువలన భూమిమీద పడిపోయెను. చిత్తవిభ్రమమా లేక నిజమా లేక కలవచ్చిందో దశరథునికి తెలియలేదు. ఆడపులిలాగున్న కైకేయిని చూచి నా ప్రాణములను హరించు వచనములను పలికితివి దేవీ. రాముడు రాజీవలోచనుడు నీకేమి యపరాధము కావించినాడు. రాముని గుణ గణములను నాఎదుట ఎన్నోసార్లు వర్ణించే దానివి. కౌసల్యతో సమానంగా రాముడు నన్ను చూచుచున్నాడని రామునిగూర్చి ఇన్నాళ్లు చెప్పేదానివి. ఇప్పుడేమి ఈవిధంగా మాటలాడు చున్నావు. పోనీ నీ కొడుకు భరతునికి రాజ్యం తీసికో రాముడింట్లో ఉండనీ నన్ను అనుగ్రహించు. నీకు రామునివలన ఎట్టి భయములేదు. అని బాష్పములతో నిండిన కండ్లతో కైకేయి పాదములపై దశరథుడు పడిపోయెను. కైకేయి దశరథున్ని చూచి నీకు పిచ్చిపట్టిందా? నీయొక్క వాగ్దానమును వ్యర్థము చేసినచో నీకు నరకము సంభ వించును. రేపు ఉదయం ప్రాతఃకాలమయిన తరువాత జటావల్కల ధారియై రాముడరణ్యమునకు వెళ్లకపోతే నేను ఉరిపోసుకొని

చచ్చిపోతాను. లేక విషము త్రాగి అయినా మరణిస్తాను. అన్ని సభాస్థలములందు సత్యప్రతిజ్ఞడను అని ప్రకటించుకొనుచు ఆత్మ వంచన చేసికోవద్దు. రామునియందు ఒట్టుపెట్టుకొని నామాట చెల్లిస్తానని ఒప్పుకున్నావు. ఇప్పుడీవిధంగా తప్పుకుంటే నీకు నరకము తప్పదు. అంత దశరథుడు మూర్ఛిల్లి స్మృతిలేకుండ భూమిపై చచ్చినవాడు వలె పడిపోయెను. ఈ విధంగా ఆ రాత్రి ఒక సంవత్సరం కాలము యింది. దశరథునకు తెల్లవారకముందే వందిమాగధులను గాయకులను కైకేయి మంగళవాయిద్యములను వాయించవద్దని కోపముతో నివారించెను, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, ఋషులు, కన్యకలు, ఛత్రచామరాలు, దివ్యగజము గుర్రము, వారవనితలు, పౌరులు, పల్లెలనుండి ప్రజలు యథాప్రకారం సన్నద్ధులయి వశిష్టాజ్ఞ ప్రకారం వచ్చిరి.

స్త్రీలు, బాలురు, వృద్ధులు శ్రీరామచంద్రుని పట్టుబట్టలతో, సర్వాభరణములతో కేయురములు కిరీటములతో శతకోటి మన్మధాకారున్ని పట్టాభిషిక్తునిగా చూడ ముచ్చటతో రాత్రి తెల్లవార్లు నిద్రపోకుండా తదేక దృష్టితో జాగరం చేసారు. ఎప్పుడు తెల్లవారుతుంది ఎప్పుడు రాముడు వస్తాడు అని ఉవ్విళ్లూరుచు కూర్చొనిరి. దశరధుని జాడ తెలియక సుమంతుడు కైకేయీ గృహమందున్నాడని తెలిసికొని జయశబ్దంతో శిరస్సుతో నమస్కరించి అంతఃపురంలోనికి వెళ్లెను. అప్పుడు దశరధుడు బహు శోకతప్తుడై దుఃఖంలో మునిగి యుండుట చూచి కైకేయిని అడగగా రాజావారికి రాత్రి నిద్రపట్టలేదు. ఎంతసేపు రామ రామ రామంటు చింతిస్తు జాగరం చేసెదు అందువలన అస్వస్థతో నుండెను. మఱియు సుమంతునితో నీవు తొందరగా వెళ్లి రామున్ని తీసికొనిరావలెనని చెప్పినది. రాజుగారి అనతిలేనిది నేనెట్లు తీసికొని రాగలనవెను. అంత దశరధుడు సుందర రామున్ని తీసికురమ్మని చెప్పు నాకు చూడాలని ఉంది అని పలికెనూ. సుమంతుడు వెంటనే రామ మందిరమునకు

వెళ్లి ఎవరి చేత నిషేధింపబడనందున రామునితో సత్వరముగా రమ్మనమనియు తండ్రిగారింటికి తనతో బయలుదేరుమని చెప్పెను. రాముడు లక్ష్మణ సమేతుడై తొందరగా సారథితో సహా తండ్రిగారి దగ్గఱకు వెళ్లెను. మధ్య కక్ష్యలో ఉన్న వశిష్ఠుకు మున్నగు వారిని చూచియు త్వరితగతిని తండ్రి వద్దఱకు వెళ్లిపోయెను. వెళ్లి తండ్రి గారి పాదములకు నమస్కరించేను. రామున్ని ఆలింగనం చేసికొను టకు దశరథుడు లేచి రెండు బాహువులను మీదికెత్తి దుఃఖము ముం చెత్తినందువలన మధ్యకాలాలో పడిపోయెను. అంత రాముడు దశర థుని కంఠముమీద చెయ్యివేసి తన తొడమీద కూర్చోబెట్టుకొని హా తండ్రి హా తండ్రి అంటు ఏడ్చెను. రాజ స్త్రీలందరు ఏడ్వనా రంభించిరి. ఎందుకొఱకేడ్చు చుంటిరని వశిష్ఠుడు కూడ అచ్చటనే కూర్చొనెను. దశరథుని దుఃఖమునకు కారణమేమిటని కేకేయిని రాముడు ప్రశ్నించెను నీవే కారణమంటు కేకేయి రామునితో చెప్పి యీ దుఃఖము పోవాలంటే దశరథున్ని సత్య ప్రతిజ్ఞున్ని చేయాలి రాజుగారు తొలి నాకు రెండు వరములిచ్చినారు. దానిని చెప్పుటకు రాజుగారు సిగ్గుపడుచున్నారు. పున్నామనరకము నుండి రక్షించు వాడు పుత్రుడు నీవు తండ్రిగారిని సత్యపాశమునుండి కాపాడాలి అనెను. రామునికి కత్తితో పొడిచినట్లయింది. చాలా బాధపడుచు కేకేయితో అనెను. తండ్రిగారి కొఱకు నా జీవితాన్ని ఇస్తాను భయం కర విషాన్ని త్రాగమంటే త్రాగుతాను. కౌసల్యను గాని సీతను గాని, రాజ్యాన్ని, తండ్రిగారి కొఱకు త్యాగము చేయుటకు సిద్ధంగా ఉన్నాను. ఆజ్ఞలేకుండ తండ్రిగారికి ఇష్టము జరుపు పుత్రుడు ఉత్తముడు. తండ్రి కోటితే ఆ పనిని చేసినవాడు మధ్యముడు. చెప్పిన చేయని పుత్రుడు అశుద్ధముతో సమానుడు. అందువలన తండ్రిగారి ఏయే పనులను చేయమని పెలవిచ్చినారో వాని నన్నింటిని చేస్తాను. సత్యం సత్యం దీనిని దాటను. రామునికి రెండు నాలుకలు లేవని తెలిసికొనండి అని పలికెను. రామ ప్రతిజ్ఞను విని

కేకేయి హే రామ ప్రస్తుతం రాజ్యపట్టాభిషేకం కొఱకు చేయ బడిన సంభారములతో నా ముద్దుల పట్టి భరతునికి రాజ్యాభిషేకం జరిగించవలెను రెండవ వరం ఏమిటంటే నీవు జటావల్కల ధారివై వనమునకు వెళ్లిపోవాలి మునీశ్వరులువలెనే అన్నమును తింటూ పదు నాలుగు సంవత్సరములు అరణ్యములో కాపురం చేయాలి. ఇదే ప్రస్తుతం నీవు తండ్రిగారి విషయమై చేయవలసినపని ఈకి రెండు విషయములను చెప్పుటకు దశరథుడు సిగ్గుపడుచున్నాడు.

అంత శ్రీరాముడు భరతునికే రాజ్యమగు గాక నేను దండ కారణ్యమునకు వెళ్లుచున్నాను. కాని దశరథ మహారాజు ఈ విష యము ఎందుకు నాకు చెప్ప లేకుండా ఉన్నాడో కారణం తెలియదు దుఃఖితుడైన దశరథుడు దుఃఖసహితమైన వాక్కులను పలికెను. స్త్రీవశుడు పిచ్చెక్కినవాడు కుమార్గగామి అగు నన్ను బంధించి ఈ రాజ్యమును నీవు తీసికొమ్ము. ఇందులో పాపం రాదు నాకు అనృతం పలుకుటవలన అని మఱింత దుఃఖముతో ఏడ్చెను. హా రామ హా జగన్నాథ నీవు నా ప్రాణము నన్ను విడిచిపెట్టి అరణ్యమునకెట్లు పోయెదవు? అని ఆలింగన చేసికొని ఘోరుమని ఏడ్చుచుండెను తండ్రిగారి కన్నీళ్లు తుడుస్తూ మెల్లగా దశరథుని ఓదార్చెను. ప్రభూ ఇచ్చట దుఃఖించుటకు కారణము లేదు. మా తమ్ముడు భరతుడు రాజ్యమేలుతాడు. నేను ప్రతిజ్ఞాపాలన తరువాత తిరిగి అయోధ్యకు వస్తాను. వనమందున్న నాకు రాజ్యమందు కంటెకోటి రెట్లు సుఖము అధికము. మీకు సత్యపాలనం దక్కు తుంది దైవకార్యము నెరవేరుతుంది. కైకేయికి ప్రియము జరుగు తుంది. ఇప్పుడే వెళ్లుటకు ఇష్టపడుచున్నాను తల్లి కైకేయి హృదయ బాధశమించుగాక అభిషేకమునకు తీసికొని రాబడిన సంభరముల నన్నింటిని ఒక చోట పేర్చండి తల్లి కౌసల్యను ఓదార్చి జానకిని బుజ్జగించి తిరిగి మీ పాదభివందనము చేసి అరణ్యమునకు సుఖ

ముగా వెళ్లెదను. తండ్రికి ప్రదక్షిణ చేసి రాముడు కౌసల్య కొలకు చనెను. రాముని పట్టాభిషేక సందర్భముగా ఆ సమయములో కౌసల్య విష్ణు పూజ చేసి హోమమును కూడ చేయించెను బ్రాహ్మణులకు ధనం దానం చేసింది. సచ్చిదానంద స్వరూపుడైనవాడు సదానందమయుడు, తేజోమయుడు నిరతిశయ స్వరూపుడగు విష్ణువుని మనస్సులో ధ్యానించుచు కౌసల్య రామున్ని చూడలేదు.

ఇట్లు అయోధ్యకాండలోని మూడవ సర్గము సమాప్తము.

—:●:—

## చతుర్థ సర్గము

# శంకరుడు పార్వతితో చెప్పెను

అంత సుమిత్ర, రాముని రాకను ధ్యానమగ్నురాలైన కౌసల్యకు తట్టి చెప్పెను. రామనామం వినగానే కౌసల్య బాహ్యమందు దృష్టిని ప్రసరించి రామున్ని చూచి తొడపైని కూర్చో పెట్టుకొని, శిరస్సును వాసనచూసి నీలోత్పల కాంతిగల రాముని శరీరమును తనివెను. రాముడాని కళ్లనిం జూచి పుత్ర, భోజనము చేయుము. ఎంతసేపయిందో భోజనంచేసి ఆకలితో ఉన్నావు. ఇష్టమైన అన్నమును తినమని అంది. అంత రాముడు అమ్మ నాకు భోజనము చేయుటకుకూడా కాలము చాలదు. దండకారణ్యములో ప్రవేశించవలసిన కాలము వచ్చినది. కైకేయికిచ్చిన వరద్వయము చేత నాన్నగారు భరతునకు రాజ్యాన్ని, నాకు అరణ్యవాసం ఆజ్ఞాపించారు. మునివేషధారినై పదునాలుగు సంవత్సరములు అచ్చట ఉండి తిరిగి తొందరలో వస్తాను. నీవు చింతపొందవద్దు. అది విని కౌసల్య దుఃఖతాడితయై మూర్ఛపొందెను. తిరిగిలేచి దుఃఖసముద్రములో మునిగిపోయి, దీనురాలయి ఓ రామా ! నీవు నిజంగా వనం వెళ్లదలచుకుంటే నన్ను కూడ తీసికొని వెళ్లుము. నీవు లేకుండా అర్ధక్షణంకూడా నేను జీవితం గడపలేను. ఆవు దూడను విడిచిఉండలేనట్లు ప్రాణములకంటె నిష్టమయిన కొడుకుని విడిచి నేను ఉరిడలేను. రాజుగారు భరతునికి రాజ్యం ఇవ్వదలచుకుంటే ఇమ్మనుము. నాకిష్టుడవైన నిన్నును వనవాసము ఎందుకు చేయమన్నాడు. కేకేయికి వరములిచ్చి సర్వస్వము ఇవ్వవచ్చును. కేకేయికిగాని, రాజు దశరథునికిగాని నీచేత ఏమి అపరాధము చేయబడినది. హే రామ ! నీకు తండ్రిగారు గురువైతే అంతకంటె అధికురాలను

నేను. తండ్రిగారు వనవాసంకొఱకు అనతిస్తే నేను దానిని ప్రతి ఘటించు చున్నాను.

ఒకవేళ నీవు నా మాటకాదని రాజుగారి మాటప్రకారం అరణ్యానికి వెళ్లెదవో అప్పుడు నేను ప్రాణములను వదిలిపెట్టి యమ పురికి ప్రయాణం చేస్తాను.

కౌసల్య మాటలువిన్న లక్ష్మణుడు మూడు లోకములను దహించు కోపంతో పలికెను. నేను కైకేయుకిలోలుడు అపస్మారంలో ఉన్న దశరథున్ని కట్టివేసి భరతున్ని వాని మేనమామలను చంపి వేస్తాను. ఇప్పుడు చూడండి నా బలపరాక్రమాలు సర్వలోకములను దహించే నా శక్తిని పురజనులు చూచెదరు గాక. రామ, నీవు అభి షేకానికి యత్నం చేయుము. అడ్డుపెట్టిన వాళ్లనందఱిని నరికి వేస్తాను. ఇట్లు పలుకుచున్న లక్ష్మణుని కౌగిలించుకొని రాముడు శభాష్ శభాష్ లక్ష్మణ నీవు నిజంగా మహాశూరుడవు. నాకిష్టము చేయుటలో బద్ధకంకణుడవు. నీయొక్క సత్తువ నాకు తెలునును. కాని యిది సమయం కాదు. ఈ రాజ్యము, ఈ శరీరము, ఈ కన పడ్డ ప్రపంచమంతా సత్యమైనదైతే నీ ప్రయాసకు అర్థం ఉంది. భోగములన్నియు మేఘముమీద ప్రకాశించు విద్యుత్తువలె క్షణ భంగురములు. ఆయువు బాగా కాలిన ఇనప పెనముమీద ఒక నీటి బిందువు. కప్ప పాము నోట్లో పడికూడ ఈగలను, దోమలను తిను టకు అరుదాచుతుంది. ఆ ప్రకారంగానే లోకము కాలమనే పాముచేత ఆకర్షింపబడినదయ్యు క్షణికములైన భోగములను అపేక్షి స్తుంది. మనుష్యులు రాత్రి పగలు అనకుండా శరీరభోగముల కొఱకు దుఃఖముతో పనిచేయు చుంటారు. వారలకు శరీరము ఆత్మకంటె భిన్నమని తెలిసినచో సత్పురుషులు ఏవిధంగా ఏ భోగ ములను అనుభవిస్తారు ? తండ్రి, తల్లి, తమ్ములు, భార్య, బంధు వులయొక్క సంబంధము నదిలో ప్రవహించుచు కలియుచున్న

కరిపుల్లలతో సమానము. లక్ష్మి నీడవలె చంచలమని జగత్ ప్రసిద్ధము. యౌవనము నీటిమీద బుడగ. స్త్రీ సుఖము ఒకకల. అయువు బాహ్యాల్పము. అయినప్పటికి ప్రాణులకు అభిమాన మెందులకో ఆశ్చర్యంగా ఉంది. సంసారము ఒక కలతో సమానము. దీనినిండా రోగము లున్నవి. మూఢుడు దీనిని అనుసరిస్తాడు. సూర్యోదయ సూర్యాస్తమానములతో అనుదినము అయువు క్షీణించు చున్నది ఇతరులయొక్క వార్ధక్యావస్థ మరణములను చూచి కూడా తాను జ్ఞానమును పొందకున్నాడు. రాత్రి పగలు ఒకదాని వెనుక మఱియొకటి వస్తూనే ఉన్నాయి. అయినను మూర్ఖుడు భోగముల వెంట పరుగిడతాడు. పచ్చికుండలోని నీరులాగా అయువు ప్రతి క్షణము క్షీణిస్తోంది. శత్రువులవలె రోగములు శరీరమును పీకు చున్నవి. ముసలితనము ఆడపులివలె భయపెడుతూ ఉంది. దీని వెనకాతలే మృత్యువుకూడా సమయంకోసం వేచియుంది. "నేను రాజును అని పురుగులుతో పుచ్చిన శరీరమును" అహంకారముతో మానవుడు పలుకుచున్నాడు చర్మము, మాంసము, ఎముకలు, మూత్రపురీషాలు రేతోరక్తాలతో కూడిన శరీరము వికారములతో కూడినది. పరిణామము అనగా మార్పుకలది కూడా. ఓ లక్ష్మణ! నీవు కొంచెము ఆలోచించి దేనినిగూర్చి నీవు లోకాలను ధగ్ధం చేస్తావో చెప్పుము. దేహమందు అభిమానమున్న వానికి అన్ని దోషములు సమకూరును. ఈ శరీరము నేను అని అనుకొనుట అవిద్య. నేను దేహము కాదు చిదాత్మను అనుకొనుట విద్య. అవిద్య సంసారమునకు కారణము. విద్య సంసార నివృత్తికి కారణము. మోక్షార్థి ఎల్లప్పుడు విద్యనే అభ్యసించాలి. కామము మున్నగునవి పరమశత్రువులు, వానిలో ఒక్క కోపం చాలును. మోక్షమునకు హానిచేయుటకు కోపంవలన తండ్రిని, తల్లిని, అన్న దమ్ములను చంపివేస్తాడు. క్రోధము మనస్తాపమునకు కారణము. క్రోధము సంసారబంధనము. క్రోధము ధర్మమును నాశనం చేస్తుంది. అందువలన క్రోధాన్ని విడిచిపెట్టుము.

క్రోధము మహాశత్రువు. ఆశ వైతరిణి నది. సంతోషమే నందనవనము. శాంతియే కామధేనువు. దేహముకంటె, ఇంద్రియ ములకంటె, బుద్ధికంటె విలక్షణమైనది ఆత్మ. ఇది నిర్మలమైనది. దానిఅంతటు అది వెలుగునది, వికారములు లేనిది, ఆకారము లేనిది. దేహేంద్రియ ప్రాణములకంటె భిన్నమైన ఆత్మను హృదయంలో స్మరించు ఆత్మలో శుద్ధుడవై నేను చెప్పినదానిని ఎల్లప్పుడు భావన చేయుము. అమ్మ కౌసల్య నీవుకూడ దీనిని హృదయంలో భావిం చుచు నా రాకకు ప్రతీక్ష చేయుము. నీకు అధికకాలము దుఃఖముం డదు. పదునాలుగు సంవత్సరాలు అర్ధక్షణంలాగా గడచిపోతాయి. అనుమతించు నన్ను. దుఃఖమును దూరంచేయుము. నీవు అలాగంటే అరణ్యంలో నేను కులాసాగా ఉంటాను. అని బోధించి తల్లి పాదము లపై పడెను. లేపి ఆశీర్వదించి తొడపయిని కూర్చోపెట్టుకొని, గంధర్వులు, దేవతలు, బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు నిన్ను అన్ని వేళల రక్షించుగాత. నీవు నడచుచున్న, కూర్చొనియున్న, నిద్రలో ఉన్నను నిన్ను వారు రక్షించెదరు గాత. అని తిరిగి కౌగిలించు కొని అంపివేసెను.

లక్ష్మణుడు కూడ రామునికి నమస్కరించి తన హృదయ మందలి సంశయములను రాముడు నివారించె ననెను. నీ వెనుకనే ఉండి నీ సేవచేయుటకను గ్రహింపుము. లేనిచో నేను ప్రాణము లను విడిచి పెట్టెదను. అంత రాముడు అటులనే ఆలస్యం చేయ కుండా బయలుదేరు అనెను. ఆ తరువాత రాముడు సీతమ్మను చూచుట కేగెను. బంగారు పాత్రలతో తీర్థములనుండి తేబడిన జలముతో సీతమ్మ రాముని పాదములను కడిగి భర్తను చూచి స్వామీ మీరు శ్వేతచ్ఛత్రం లేకుండా వంది మాగధులు లేకుండా సామంతరాజులు లేకుండా కిరీటము పెట్టుకోకుండా ఎందుకు వచ్చారు అని అడుగగా నవ్వుచు రాముడు రాజావారు నకు దండకారణ్య రాజ్యం ఇచ్చేరు. నేను ఇప్పుడే బయలుదేరి వెళ్లి

పోవాలి. నువ్వు మామగారిని జాగ్రత్తగా కాపాడాలి నాతల్లి సేవ చేయుము. నేను అబద్ధము చెప్పలేదు అని అనెను. అంత సీతమ్మ మీకు వనరాజ్యం ఎందుకు ఇవ్వాలి అని అడుగగా కైకేయి వేరే దాన విషయములను చెప్పి నాకు వెంటనే దండకారణ్యమునకు వెళ్లవలెను. గాన అడ్డుపెట్టకుండా అంగీకార మిమ్మని అడిగెను. సీతమ్మ తాను ముందుగా అరణ్యానికి వెళ్లెదననియు ఆ తరువాత రాముడు రావచ్చుననియు తన్ను వదిలి రాముడు అరణ్యమునకు జనుట ధర్మయుక్తము కాదనియు పలికెను. అంత రాముడు వనము భయంకర మృగములతోను. రాక్షసులతోను, అరణ్య సంబంధమైన ముళ్లు, రాళ్లు, చీరండలు, పాములుతోను రోడ్లులేని మార్గములద్వారా నడువవలెననియు, తినడానికి ఏమీ దొరకదనియు, కందమూల ములు పండ్లు అచ్చటచ్చట దొరకవనియు, అరిసెలు, గారెలు అస లుండవనియు, కాలినడక వెళ్లి ఎండ వానలకు ఓర్చవలసి యుంటుంది. రాక్షస స్త్రీలను నీవు చూస్తే ప్రాణములను కూడ వదిలి వేస్తావేమో! అందుచేత నీవు ఇంట్లో ఉండుము. నేను తొందరగానే వచ్చెదనని బహువిధముల బోధ పరచెను.

అంత సీతమ్మ కోపముతో నేను నీకు ధర్మపత్నిని, పతివ్రతను దోషములు లేనిదానను నీ సమీపంలో నేను ఉండగా నన్ను అపహ రించే వ్యక్తి పుట్టలేద ననియు, ఫలమూలాదు లన్నియు నాకు అమృతసమానము లనియు నీవు తిని ఇచ్చినవిగాన నీతో సంచరించు నాకు ముళ్ళుపరుపులు అయిపోవును. నిన్ను నేను ఏవిధంగాను బాధపెట్టను. నీ కార్యములందు నేనుకూడ కార్యసాధకురాలను కాగలను. నీ కార్యమునకు భంగము చేయను. బాల్యముననే ఒక జ్యోతిష పండితుడు నన్నుచూచి భర్తతో కూడ అరణ్యవాసము కలుగునని చెప్పినాడు. ఆ బ్రాహ్మణుడు సత్యవాది యగుగాత. వానిమాట పొల్లుకాకూడదు. నేను నీతో వస్తాను. ఇంకొకటికూడా చెప్పుచున్నాను అనేక రామాయణములను అనేక పండితులు విని

పించినారు. ఎచ్చటకూడ సీత లేకుండ రాముడు వనమునకు వెళ్లు టను వ్యాఖ్యానించలేదు. సీతో వచ్చితీరుతాను. నన్ను విడిచి వెళ్లినచో నీముందే ఇప్పుడే ప్రాణములను విడిచిపెట్టు చున్నాను. అంత రాముడు సీతమ్మ మనోనిశ్చయము దృఢతరంగా ఉందని గ్రహించి వెంటనే బయలుదేరుటకు సిద్ధురాలు అవమని అంగీక రించెను. అరుంధతికొఱకు అభరణములు హారములను ఇమ్ము. బ్రాహ్మణులకు మనకుండుకున్న ధనమును ఇచ్చివేసి అరణ్యము నకు వెళ్లిపోదాము అని పలికి లక్ష్మణునితోకూడ బ్రాహ్మణులను పిలిపించి వందలాది గోవులను దివ్యవస్త్రములను, అభరణములను, బాగా కుటుంబము కలవారికి, శీలము గలవారికి బ్రాహ్మణులకు సంతోషంతో దానములు చేసెను.

అరుంధతికి సీతమ్మ ముఖ్యమైన అభరణములను నిచ్చివేసెను. రాముడు అమ్మగారి భృత్యవర్గమునకు అనేకంగా ధనమును ఇచ్చెను. మఱియు అంతఃపురవాసులకు సేవకులకు పట్టణంలోని ఇతర ప్రజలకు, గ్రామవాసులకు, బ్రాహ్మణులకు వేలాది ధన మును దానము చేసెను. ధనుష్పాణియై లక్ష్మణుడు తల్లి సుమిత్ర దగ్గఱకు వచ్చి అమ్మను కౌసల్యకు అప్పచెప్పెను. రాముడు, సీత, లక్ష్మణుడు దశరథుని మందిరమునకు వెళ్లిరి. మార్గమధ్యంలో సీతారామలక్ష్మణులు నడిచి వెళ్లుచుండగా రాముడు పౌరుల నందరిని జానపదులను ఆనందంతో చూచుచు శతకోటి మన్మథాకారుడై భాసిల్లుచు దశరథుని దగ్గరకు వెళ్లెను.

ఇట్లు అయోధ్యాకాండలోని చతుర్థ సర్గ సమాప్తము.

—O—

పంచమ సర్గ

## శ్రీ మహాదేవుడు పలికెను

"మార్గంలోని ప్రజలు కైకేయీ వరదానము వలన దశరథుడు కాముకుడు అందువలన ఇటువంటి రామున్ని అడవులకు పంపెను". వాడు సత్యసంథు డెట్లగును. స్త్రీకారణంగా పంపినవాడు. క్రూరాత్మురాలు కైకేయి రామున్ని పంపివేయుటకు ఏ విధంగా సిద్ధపడింది. ఓ జనులారా! మనము కూడా అరణ్యమునకు వెళ్ళిపోదాము పదండి. ఇచ్చట మన ముండకూడదు. రాముడు లక్ష్మణుడుండు చోటుకి మనముకూడ వెళ్ళిపోదాము. చూడండి. జానకమ్మ పాదచారియై నడుచు చున్నది. రాముడు కూడ పాదచారియై నడుచు చున్నాడు. రథములు, గుర్రములు లేవు. ఒక రాక్షస స్త్రీ కైకేయి పేరుతో పుట్టింది సర్వ వినాశకురాలు. సీతమ్మ పాదచారిణియై నడుస్తుఉంటే రామునికి కూడ దుఃఖము వస్తోంది. చెప్పాలంటే విధి బలీయము. పురుష ప్రయత్నము దుర్బలమైనది అని పౌరులు వారిలో వారు దుఃఖములో మునిగి అనుచున్నారు. నామదేవుడను మునిపుంగవుడు వారిని చూచి "మీరు ఏడవకండి. సీతారాముల తత్త్వమును పలుకుచున్నాను. వినండి". ఈ రాముడు సాక్షాదాది నారాయణుడైన విష్ణువు సీతమ్మ సాక్షాత్ లక్ష్మీదేవి. యోగమాయ అంటారు ఈమెనే. లక్ష్మణుడు ఆదిశేషుడు. ఎప్పుడు రామున్ని అంటియే ఉంటాడు. ఈ రాముడు రజోగుణయుక్తుడై ఇతడే సృష్టి చేయు బ్రహ్మ అవుతాడు. సత్వగుణయుక్తుడై పరిపాలకుడగు విష్ణువవుతాడు. కల్పాంతములో తమోగుణ యుక్తుడై సృష్టిని రుద్రుడై సంహారము చేస్తాడు. మత్స్యావతారమెత్తి పూర్వమందు వైవస్వత మనవును రక్షించెడు. కూర్మరూపధారియై పాతాళలోకము నుండి

మంథర పర్వతమును ఎత్తినాడు. వరాహావతారమెత్తి పాతాలము నుండి తన ముట్టెతో భూమిని ఎత్తెను. ప్రహ్లాదవరదుడై నరసింహ వేషముదాల్చి త్రిలోక కంటకుడైన హిరణ్యకశ్యపుని సంహరించెను. వామనావతారమెత్తి ఇంద్రునకు నష్టరాజ్యమును అదితి ప్రార్థనచే ఇచ్చి ఇంద్రుని రక్షించెను. దుష్టులైన క్షత్రియులను దునుమాడి భూభారమును తగ్గించుటకు భార్గవరాముడై పుట్టినవాడితడే. అట్టి నారాయణుడే ఇప్పుడు రాముడుగా పుట్టినాడు. రావణాది రాక్షసులను కోట్లాదిమందిని చంపుతాడు. ఆ దుర్మార్గునికి మనిషిచేత మృత్యువు కలుగును. దశరథుడుకూడ విష్ణువును ప్రార్థించి పుత్రుడుగా పుట్టుమని కోరగా శ్రీ మహావిష్ణువు రాముడుగా జన్మించినాడు. ఈ సీతమ్మ మాయారూపిణి విష్ణువుయొక్క మాయయై యుంది. దశరథుడు కాని కైకేయికాని వనవాసానికి కారకులు కారు. నారదుడు నిన్న ఇదే విషయము చెప్పినాడు. అందువలన రామునిగూర్చి చింత మానండి". రామ, రామ అంటూ ఏ జనము నిత్యము జపం చేస్తారో వారలకేనాడు కూడ చావు మున్నగువాని వలన భయము కలుగదు. మహాత్ముడైన రాముని విషయంలో క్షణ మాత్రమైన దుఃఖముండదు. అతని పేరును తలచిన కలియుగంలో ముక్తి కలుగుతుంది. ఇంకొక దానివలన కలుగదు. దశరథుని కోరికను సఫలీకృతం చేయుటకు భక్తుల మనోరథమును ఈడేర్చుటకు రావణవధ కొఱకు రాముడు మానవశరీరం ధరించేడు అని వామదేవుడు చెప్పగానే అచ్చటనున్న పండితులు బ్రాహ్మణులు అందరు రామున్ని సాక్షాత్ శ్రీహరి అని తెలిసికొని సంశయములను వీడి రాముని స్మరణచేయ మొదలిడిరి. ఇది రహస్యమైనది. ఈ విషయమును గుప్తముగా ఉంచండి అంటూ వెళ్లిరి.

అంత రాముడు సీతాలక్ష్మణ సమేతుడై కైకేయీ గృహమునకు వెళ్లి కైకేయితో తండ్రిగారి ఆజ్ఞకొఱకు వచ్చినాము. మేము ముగ్గురము అరణ్యమునకు వెళ్లుచున్నాము. అంత కైకేయి

స్వయంగా రామునికి, లక్ష్మణునికి, సీతమ్మకు నారబట్టల నిచ్చెను. రాముడు కట్టుబట్టలను విడిచి నారబట్టలను ధరించెను. లక్ష్మణుడు కూడ నటులజేసెను. సీత తెలియక రాముని ముఖమువైపు చూచెను. రాముడు నారబట్టను సీతమ్మ భుజములపై నుంచెను. అంత ప్రజలు ఏడ్చిరి. వశిష్ఠుడు కైకేయి నుద్దేశించి సీతమ్మకు నారబట్ట లిచ్చుట ఘోరమైనదని కైకేయిని దుష్టురాలు అని అనెను. రామున్ని ఎల్ల వేళల ననుసరించు తల్లి సీతమ్మ సర్వాభరణ భూషితయై పతివ్రతగా భర్తను సేవించ నిమ్ము. దివ్యాంబరాలతో వన దుఃఖమును పోగొట్టుచు అని అనెను. దశరథుడు సుమంతుని రథము తెమ్మన మని చెప్పెను. అని చెప్పి తిరిగి దుఃఖముతో ఏడుస్తూ భూమిమీద పడిపోయెను. బోరున ఏడ్వసాగెను. ముందుగా సీతమ్మ రథము నెక్కెను, రాముడు పితృపాదములకు ప్రదక్షిణంచేసి రథమెక్కెను. లక్ష్మణుడు రెండు ఖడ్గములను, ధనుస్సు రెండమ్ముల పొదులను పట్టుకొని రథమెక్కి రథమును కదలమని సారథితో చెప్పెను. అంత దశరథుడు ఉండు, ఉండు రథమును "కదల్చకుము అంటూ పలికెను. కదులుము, కదులుము" అంటూ రాముడు పలికెను. అంత రథము కదిలెను. రాముడు దూరము వెళ్లుసరికి దశరథుడు మూర్ఛిల్లెను. బ్రాహ్మణులు, పౌరులు. వృద్ధులు, బాలురు "ఉండు ఉండు" అంటూ రథము వెనుక పరుగులిడిరి.

దశరథుడు సేవకులను పిలిచి నన్ను రామ మాతయైన కౌసల్య యింటికి తీసికొని పొండు. కొంతకాలం ఉంటాను. జీవిత మింక కొంతకాలము మాత్రముంటుంది. రాముడు లేకుండా నేను జీవించలేను. అంత కౌసల్య యింటికి వెళ్లినవెంటనే మూర్ఛితుడై భూమిమీద పడిపోయెను. చాలాకాలం తరువాత తెలివివచ్చింది కాని మౌనంగా ఉండిపోయేడు.

రాముడు తామసానదిని చేరి అచ్చట సుఖముగా ఉండి నీరు

తాగ్రిగి ఆహారము తినకుండా చెట్టుక్రింద నిద్రించెను. లక్ష్మణుడు సీతమ్మతోను, సుమంతునితోను, మేల్కొనియుండి రామునికి రక్ష చేసెను. పౌరులందరుకూడ అచ్చట రామున్ని తిరిగి అయోధ్యకు తీసికొని వెళ్లదము లేనిచో తాముకూడ వనవాసము చేసెదమని నిశ్చయించిరి. రాముడది విని సుమంతుని పిలిచి నేను అయోధ్యకు తిరిగివెళ్లే యోచనలేదు, రథమును సన్నద్ధము చేయుము. ఇప్పుడే వెళ్లిపోదాము అని చెప్పెను. పౌరులకు కనపడకుండా సీతాలక్ష్మణులతో కలిసి అయోధ్యా నగరము వైపు రథమును వెళ్లించెను. కొంతదూరము అటుపోనిచ్చి తరువాత వనమువైపు తిరిగి వెళ్లి పోయిరి. పౌరులు తెల్లవారగానే లేచి రామున్ని కానలేక దుఃఖితులై రథమార్గాన్ని చూచుకుంటూ అయోధ్యకు వెళ్లిరి. సుమంతుడు సీతారామ లక్ష్మణులను పల్లెలద్వారా వనమార్గంలో రథమును నడుపుచు మార్గమధ్యంలోని చక్కని పల్లెలను చూచుచు, శృంగవేరము సమీపమందలి గంగానది తటమునకు తీసికొని వెళ్లెను. గంగనుచూచి నమస్కరించి ఆనందంగా స్నానంచేసి రాముడు రథ్యావృక్షము అనబడు శింశుపా వృక్షము యొక్క నీడలో నివసించెను. స్నేహితుడు హితైషియైన గుహుడు ప్రభువుఅయిన రామున్ని చూచి మహదానంద భరితుడై ఫలములు, పుష్పములు పట్టుకొని రామునిఎదుట ఉంచి సాష్టాంగదండ ప్రణామమాచరించెను. గుహున్ని లేపి రాముడు ఆలింగనము చేసికొనెను. అంత గుహుడు నా జన్మ తరించింది రామ నీ రాకవలన మా కులము పావనమైనది. నీ అంగస్పర్శవలన పరమానందము కలిగినది. ఈ నిషాదరాజ్యమంతా నీదే. ఇచ్చట ఉండి మమ్ములను రక్షింపుము. నగరానికి వెళ్లదము రండి. మా ఇల్లు పావనం చేయండి. అని గుహుడు వినయవిధేయతలతో రాముని ప్రార్థించెను. "నేను నీ దాసుడను నన్నును గ్రహించు అని అనెను. అంత రాముడు సంతోషించి మిత్రమా" నేను పదునాలుగు సంవత్సరాలు, ఏ గ్రామమునుగాని,

ఎవరి యింటిని చూడకూడదు. ఇతరులిచ్చిన ఫలమూలాదికము లను తినకూడదు. ఈ రాజ్యము అంతా నీదే. నీవు నాకు స్నేహితుడవు. మఱ్ఱిపాలు తెప్పించు, జటలను సవరించు కుంటాను. అని మఱ్ఱిపాలతో తన జుత్తుముడిని కట్టుకొనెను. లక్ష్మణుడు కూడ అటులనే చేసెను. రాముడు నీరుమాత్రము త్రాగి లక్ష్మణునిచేత తయారుచేయబడిన దర్భలు, ఆకులు వేయబడిన ఆసనముమీద సుఖముగా పరుండెను. అయోధ్యా పురమందలి మేడమీద పడుకున్నట్లుగానే ఈ పర్ణతల్పంమీద పడుకున్నాడు. లక్ష్మణుడు ధనుర్బాణములను సర్వదా చేతితో పట్టుకొని అప్రమత్తుడై గుహునితో సహా రక్షణ చేసెను.

ఇట్లు అయోధ్యకాండలోని పంచమ సర్గము సమాప్తము.

—()—

## షష్ఠ సర్గము

బంగారు మంచాలమీద హంసతూలికా తల్పంలో పడుకో వలసిన రామునికి చూడు లక్ష్మణా! ఈ అడవియాకుల పరుపు మీద దర్భలమీద పడుకుండుట తటస్థించింది. అని గుహుడు లక్ష్మణునితో అనెను. విధిని బలీయమని చెప్పాలి. కైకేయి, మంథరలు నిమిత్తమాత్రము. కైకేయి మంథర కుట్రబుద్ధితో ఇటు వంటి దుష్కృత్యమునకు దిగజారినది. అంత లక్ష్మణుడు మిత్రమా వినుము. పూర్వజన్మలో ఆచరింపబడిన కర్మఫలములే సుఖదుఃఖ ములకు కారణములు. ఇంకొకరు కాదు. సుఖమునకుగాని, దుఃఖము నకుగాని ఎవడు కర్తకాదు. ఇతరులు కారకులనుట మూఢుని మాట. నేను కర్తను అనుకొనుట కూడ వ్యర్థమైన అహంకార మగును. లోకమంతా వారివారి కర్మలప్రకారము ఫలితముల ననుభవించె దరు. ఈ మానవులకు వారు వారిచేత చేయబడిన కర్మలనుబట్టి మిత్రులు, శత్రువులు, బంధువులు సిద్ధమవుతారు. తాను చేసిన కర్మకు, వారావిధంగా నిమిత్త మాత్రులు అవుతారు. సుఖదుఃఖములు రెంటికి తానే కర్త. తన కర్మలనుబట్టి అనుభవిస్తాడు. కర్మ ప్రకా రం సర్వము జరుగును. ఏయే కాలమందు ఎపుడు ఎవనిచేత ఏవిధంగా ఎవనినుండి ఏమి జరగాలో అది జరిగి తీరుతుంది. అందు వలన సుఖదుఃఖముల జోలికి పోకుండుట మంచిది. విధాతచేత వ్రాయబడిన వ్రాత దేవతలకు, రాక్షసులకు కూడ దాటరానిది. నరుడు ఎల్లప్పుడు సుఖదుఃఖములచేత అడ్డుకొనబడు చున్నాడు. పుణ్యపాపములు రెండింటివలన శరీర మేర్పడినది. సుఖము తరువాత దుఃఖము, దుఃఖము తరువాత సుఖము దినము రాత్రివలె మనుష్యుల కిది దాటశక్యము కాదు. అవిష్టంవచ్చినా ఇష్టంవచ్చినా విద్వాంసులు ఏడవరు సంతోషించరు. అని గుహుడు, లక్ష్మణుడు భాషించువరికి

అంతరిక్షం నిర్మలమై పోయినది. రాముడు స్నాన సంధ్యాదికృత్య ములను నిర్వర్తించుకొని గుహునితో దృఢమైన పడవను తెప్పించ మని ఆనతిచ్చెను. చక్కని నావను తీసికొని వచ్చి గుహుడు రాముని, సీతను, లక్ష్మణుని కూర్చోబెట్టి స్వయముగా తన ఆప్త సేనానులతో నడపెను. గంగ మధ్యవచ్చునరికి సీతమ్మ గంగకు నమస్కరించి వనవాసము నుండి తిరిగివచ్చిన తరువాత గంగాపూజ చేసెదనని మొక్కెను. రామలక్ష్మణులతో సహా పూజ చేస్తానని నమస్కరించెను. అని పలుకుచు మెల్లమెల్లగా గంగ అవతలి ఒడ్డుకు వెళ్లిరి. గుహుడు రామునితో తిరిగి వస్తానని ఆనతి ఇవ్వండి లేనిచో ప్రాణములు విడిచి చచ్చిపోయెద ననెను. అంత రాముడు పదు నాలుగు సంవత్సరములు దండకారణ్యము నందుండెదననియు తిరిగి వస్తానని చెప్పెను. మఱియు గుహుని ఆలింగనము చేసికొని నేను చెప్పినది సత్యము. సత్యమునే పలికెదను విశ్వసింపుమని గుహుని ఓదార్చి పంపివేసెను. అనంతరము రాముడు సీతాలక్ష్మణులతో కూడుకొని భరద్వాజ మహర్షి ఆశ్రమము ముందు నిలబడి అచ్చట నిలబడియున్న ఒక బ్రహ్మచారిని పిలిచి సీతాలక్ష్మణ సమేతుడై రాముడు బయిట ఉన్నాడని మునివర్యునికి చెప్పవలెనని అనెను. రాముని వాక్యములను యథాతథంగా భరద్వాజునికి పాదాభివంద నము చేసి బ్రహ్మచారి నివేదించెను. భరద్వాజుడు అర్ఘ్యపాద్యా దులను స్వీకరించి రామునికి స్వాగతముపలికి తన పర్ణశాలకు తీసి కొని వెళ్లెను. తిరిగి లోపల ఉదారమైన ఆతిథ్యము నిచ్చెను. రాముని పాదధూళివలన తన ఆశ్రమము పవిత్ర మయ్యెననియు, తనకు రామావతార కథ భూత భవిష్య ద్వర్తమానములలో తెలుసు ననియు, రాముడు మాయామానుష వేషధారి యనియు, యదార్థ ముగా పరమాత్మ యనియు, రాముని రాకవలన తన తపస్సు పండిందనియు, యీ వనవాస కారణము తనకు తెలుసుననియు భరద్వాజుడు పలికెను. అంత రాముడు సీతాలక్ష్మణులతో సహా

భరద్వాజుని పాదాభివందనము చేసి భరద్వాజుని ఆశీస్సులు కావాలని పలికెను. ఉదయ సమయమున లేచి మునిబాలకుల సహాయముతో యమునా నదిని దాటి భరద్వాజుడు చెప్పిన దారిద్వారా చిత్రకూట పర్వతమునకు చేరెను. అప్పట వాల్మీకి మహాముని ఆశ్రమమునకు చేరెను. సోదర భార్యలతో కూడ వాల్మీకికి నమస్కరించెను. వాల్మీకి ఆనంద ముప్పొంగ రామున్ని ఆలింగనము చేసికొని అర్ఘ్యపాద్యాదులతో పూజచేసి కందమూలములతోను, ఫలములతోను భోజనము పెట్టెను. రెండు చేతులు జోడించి రాముడు వాల్మీకితో మహాత్మా ! మీకు సర్వము తెలుసును. మేము ఇచ్చట కొంతకాలము నివాసముండదలచు కున్నాము. ఏ స్థలమందు మాకు సుఖముండునో సెలవీయుడని పలికెను. సమస్త ప్రాణికోటులుకు రాముడు నివాస స్థానమనియు, రాముని యొక్క హృదయము యోగులకు శాంతులకు నివాస స్థానమని పలికి, వైరాగ్య సంపన్నులు రాగద్వేషములు లేనివారలు, సమబుద్ధి కలవారలు నీయందు నివసించెదరనియు నీవే కళ్యాణ కారకమైన గృహమని ప్రశంసించెను. మఱియు ఆకలి దప్పికలను విడిచిపెట్టి సుఖదుఃఖములను లక్ష్యపెట్టక సచ్చిదానంద స్వరూపుడయిన రాముని హృదయమందు ధ్యానించువారలలో రామునికి మందిరము అని చెప్పెను. రామనామ మహిమ ఎవఱికి తెలియదనియు ఆ రామనామ జపమువలన తాను బ్రహ్మర్షి అయినాడనియు, పూర్వమందు జన్మమాత్ర బ్రాహ్మణుడయి కిరాతులతో కలసి పెరిగినాడనియు, కామంతో శూద్ర స్త్రీయందు పెక్కుమందికని చోరుడయి, ధనుర్బాణములను పట్టుకొని కనుపించు వారలకు యముడుగా ఉండేవాడనియు, చెప్పి తనకు పెక్కుమంది సంతాన మగుటవలన వారినందఱిని పోషించుటకు దారికాచి దోచుకునే వృత్తిలో నున్నాననియు చెప్పెను. అంతట సప్తమహర్షులు కుటుంబములోని సభ్యుల నందరిని కలిసి వారిని నీవు చేయుచున్న పాపములో కూడ పాలుపంచుకునే వారున్నా

రేమో అడిగిరమ్మని యాజ్ఞాపించిరి. అటులనే నేను కటుంబసభ్యు లందరిని అడుగగ వారలలో ఒక్కడు కూడ తానుచేసిన పాపకృత్యముల పాపమును పంచుకొనుటకు ఇష్ట పడలేదని చెప్పితిని. మునులు సహజ కరుణా మూర్తులు వారి దర్శనమాత్రాన నేను శుద్ధచేతస్కుడనైతిని. ధనుస్సు బాణములను విదిలివేసి వారలకు సాష్టాంగదండ ప్రణామ మానరించితిని. అంత మునివరు లందరు కూడ వీడు దుర్వృత్తుడు వీనిగురించి పట్టించు కోకూడదు. అయిన శరణ అన్నాడు. అందువలన వీనికి ఉపదేశమిచ్చి పంపవలెనను కొనిరి. అప్పుడు రామ నీ నామమును వ్యత్యస్తాక్షరము చేసి 'మరా' అని ఉపదేశమిచ్చి వెళ్లిపోయిరి. మునీశ్వరులు చెప్పిన మంత్రమును జపించుచు నేను ప్రపంచ ధ్యాసలేకుండా జపముతో సమాధిని పొందిన కొన్ని సంవత్సరాల కాలమునకు నాపై పుట్ట బలిసినది. సర్వసంగ విహీనుడనైతిని. ఆ తరువాత వెయ్యి యుగముల కాలము గతించినది. అప్పుడు సప్తమహర్షులు తిరిగి వచ్చి నన్ను లెమ్మన మని ఆజ్ఞాపించిరి. నేను మంచునుండి విడిచిపెట్టబడిన సూర్యుడువలె బయటకు వచ్చితిని. అంతట మునీశ్వరులు నన్నును నీవు వాల్మీకివి మునీశ్వరుడవు. పుట్టలో నుండి పుట్టినావు ఇకది రెండవ జన్మ అయింది. అని వారు అంతరిక్షమునకు ప్రయాణము చేసిరి. నేను రామనామ ప్రభావమువలన ఇంతటివాడి నయితిని. సాక్షాత్తు ప్రస్తుతం శ్రీరాముని సీతాలక్ష్మణ సమేతంగా చూచు చున్నాను. నిన్ను రాజీవలోచనుని చూచుటవలన ముక్తుడనైతిని. సందేహము లేదు. రామ! రమ్ము భద్రమైన స్థలమును నీకు చూపిస్తాను అని చెప్పి ఒక కొండకి, గంగానదికి గల మధ్య ప్రదేశమునందు పర్ణశాలను శిష్యుల సాయంతో కట్టించి మందిరద్వయముగా తూర్పు పశ్చిమాలకు ఉత్తర దక్షిణాలకు విభజించి రాముని నివాసమును ఏర్పరచెను. అచ్చట వాల్మీకి మునిచేత సీతారామ లక్ష్మణులు నిత్యము పూజింప బడుచు స్వర్గంలోని ఇంద్రదశచులువలె మునీశ్వరులచేత గౌరవింపబడు చుండిరి.

ఇట్లు అయోధ్యాకాండలోని షష్ఠ సర్గము సమాప్తము.

## సప్తమ సర్గము

# శ్రీ మహాదేవుడు పార్వతితో పలికెను

సుమంతుడు అయోధ్యయందు సాయంసమయమున ప్రవేశించెను. బయట రథముంచి కళ్లనిండ నీరు క్రమ్ముకొనగ దశరథునకు జయశబ్దము పలికి నివేదించెను. అంత దశరథుడు విహ్వలుడై హే సుమంత ! రాముడు ఎక్కడ ఉన్నాడు. సీతమ్మ లక్ష్మణులతో కూడుకొని నీవెచ్చటను వదిలిపెట్టావు వారలను. పాపిని అయిన నాగురించి ఏమి పలికినారు. నిర్దయుడైన నన్నుగూర్చి సీతమ్మ ఏమి పలికింది. లక్ష్మణుడు ఏమని చెప్పాడు. అని అంటూ హా రామ, హా సీత, హా లక్ష్మణ అంటూ దుఃఖములో కూరుకొని పోయి చచ్చిపోతున్న నన్ను చూడవు కదా ! అని ఏడ్చుచున్న దశరథుని జూచి మంత్రియైన సుమంతుడు ప్రాంజలియై పలికెను.

నేను సీతారామ లక్ష్మణులను గంగాతీర మందలి శృంగవేర పురమును తీసికొని వెళ్లితిని. అచ్చట గుహుడు తెచ్చిన పండ్లు ఫలములను తీసికో కొండ ముట్టుకొని తిరిగి యిచ్చివేసెను. మర్రిపాలతో జటలను కట్టుకొని రాముడిలా అన్నాడు. మీతో చెప్పమన్నాడు. "అయోధ్య యందుకంటె అరణ్యంలో ఎక్కువ సౌఖ్యం కలుగుతుంది. నాగురించి దుఃఖించనవసరము లేదు. అమ్మకు నా నమస్కారములు చెప్పు. వృద్ధుడైన దశరథుని సేవ చేయుమనుము. అటులనే శోకతప్తయైన సీతమ్మ కళ్లనిండ నీళ్లు పెట్టుకుని రాముని ముఖమువైపు చూచుచు నా సాష్టాంగదండ ప్రణామమును అత్తమామలకు తెలియజేయుము. అని పలికి సీతమ్మ ఏడుస్తూ నిశ్శబ్దయైనది". గంగాతీరం వరకు వారిని దిగపెట్టి నేను వచ్చినాను.

దుఃఖముతో పీడింపబడుచు నేను తిరిగి వచ్చినాను. అప్పుడు కౌసల్య ఏడ్చుచు రాజు నడిగెను. నీ ప్రియభార్యయైన కైకేయికి ప్రసన్నుడవై వరములిచ్చితివి. అంతా నువ్వే చేసి ఇప్పుడు ఏడుస్తున్నావు ఎందుకు ? ఒకవేళ కైకేయికి రాజ్యమిచ్చినా నా కొడుకును అరణ్యమునకు ఎందుకు పంపావు ? కౌసల్య మాటలకు పుండుమీద నిప్పుచురక తగిలినట్లు తిరిగి ఏడుస్తు దరశథుడు దుఃఖముతో చచ్చిపోవుచున్న నన్ను తిరిగి మరింత ఎందుకు దుఃఖపెడతావు ? ఇప్పుడే నా ప్రాణములు పోవుచున్నవి. బాల్యభావంలో ఉన్న ఒక మునిబాలుని మూలకంగా నాకు శాపము ఇవ్వబడింది. పూర్వమందు యౌవనమదంతో వేటకు వెళ్లి ధనుర్బాణములు పట్టుకొని అర్ధరాత్రి సమయములో దాహార్తుడైన తండ్రికొఱకు మునిబాలుడు కుండనిండ నీళ్లు నదిలో పట్టుచున్నాడు. అప్పుడు శబ్దమును విని ఏనుగువచ్చిందని శంకించి శబ్దబేదిబాణముతో మునిబాలుని వైపు ప్రయోగించితిని ఆ బాలుడు "హతోస్మి" అంటూ నేను ఎవ్వరికి అపరాధము చేయలేదే అ కారణంగా నాపై ఎవ్వరీ బాణమును ప్రయోగించిరి, విధి ఎంత కఠినమైనది. దాహార్తులైన తల్లిదండ్రులు సంగురించి నిరీక్షించు చున్నారు అనెను. ఆ మాట విని నేను భయకంపితుడనై "స్వామీ" నేను దశరథుడను నేను అజ్ఞానముతో తెలియక నీపై బాణము ప్రయోగించితిని. నన్ను తెలియక చేసిన పాపము గాన రక్షించమని కోటితిని. మఱియు ఆ మునిబాలుని పాదములపయి పడితిని. అంత ఆ మునిబాలుడు భయపడకు రాజేంద్ర ! "నేను వైశ్యుడను తపస్సు చేసికొను చున్నాను. నీకు బ్రహ్మహత్యాదోషము సంభవింపదు. నా తల్లిదండ్రులు దాహార్తులై ఉన్నారు. వారలకు వెంటనే నీవు నీరుపట్టుకొని వెళ్లి యిమ్ము. జలమిచ్చి వారలకు నమస్కరించి నీవుచేసిన అపరాధమును సర్వము తెలియజేయుము. నా శరీరము నుండి శల్యమును తీసి వేయుము. పీడితుడను ప్రాణములను విడిచి పెట్టెదననెను". ముని

బాలుని శరీరమునుండి బాణమును తీసివేసి నీటితో కూడిన కుండను తీసికొని వృద్ధదంపతుల దగ్గఱకు వెళ్లితిని. వారలు మునిబాలుడు రాలేదేమి. మా కుమారవానికి భక్తి తగ్గినదా ? ప్రొద్దివారము. మునలి వారము. ఎందుకింత ఆలస్యము చేసినాడు ? అని వారలలో వారు మాట్లాడుకొను చున్నారు. అంత నా పాదధ్వనిని విని కుమార ? ఇంత జాప్యము చేసితివి. ఇమ్ము మాకు జలము దాహార్తిశమనము నకు. నీవుకూడ కొంత జలమును త్రాగుము. అని ఆర్తిలో ఉన్న వృద్ధదంపతులను సమీపించి నేను మీ పుత్రుడను గాను అయోధ్యకు రాజయిన దశరథుడను పాపిని. మృగయాసక్తుడను. రాత్రి యందు మృగములను చంపువాడను. జలములను కడవలో నింపు నపుడు బుడబుడమని ధ్వనిని విని వనగజము వచ్చినదని భ్రమపడి శబ్దభేది బాణమును ప్రయోగించితిని. "హతోస్మి" అను మానవుని ఆక్రోశమును విని దయపడి సమీపమునకు కేగి చూచుసరికి జుత్తులు వ్రేలబడి పడిపోయిన మునికుమారుని చూచితిని. భయపడి అతని పాదములను పట్టుకొని క్షమించుమని తెలియక అపరాధము కావించి తినని మొరపెట్టితిని. భయపడకు బ్రహ్మహత్యాపాపము నీకు లేదు. మా తండ్రిగారికి నీరిచ్చి జీవితముకొఱకు ప్రార్థిచు అని మునిబాలుడు చెప్పినాడు. అందువలన నేను మునిహింసకుడను మీ దగ్గఱకు వచ్చితిని మిమ్ములను శరణు వేడుకొను చున్నాను. నన్ను రక్షిం చండి అని ప్రార్థింప వారిరువురు వృద్ధదంపతులు ఎక్కువ ఏడ్చి మునికుమారుని సమీపమునకు వారిని తీసికొని పొమ్మనమని చెప్పిరి. నేను అటులనే చేసితిని. వారు చేతులతో మునిబాలకుని స్పర్శచేసి హా పుత్ర హా పుత్ర అని ఏడ్వసాగిరి. వెంటనే ముగ్గురికి చితిని తయారుచేయమని నాకు ఆనతిచ్చిరి. నేను అటులనే చేయగా ముగ్గురు ఏకకాలమందు చితియందు అగ్నిదగ్ధులయిరి. స్వర్గమునకు వెళ్లిరి. అప్పుడు చనిపోయే ముందు వృద్ధముని నీవుకూడ పుత్ర శోకంతో నావలె మరణం పొందెదవని చెప్పినాడు. ఆ శాపము

నన్నిపుడు వేధించు చున్నది. అని దశరథుడు కౌసల్యతో పూర్వ వృత్తాంతమును చెప్పి హా రామ, హా సీత, హా లక్ష్మణ అంటూ మీ మీ వియోగమువలన కైకేయిచేసిన దానివలన మృత్యువును పొందుచున్నాను. అని పలుకుచు దశరథుడు ప్రాణములను విడిచి పెట్టి స్వర్గమున కేగెను.

అంత కౌసల్య సుమిత్రలు ఇతర రాజదారలు కూడ గుండెలు బాదుకొంటూ ఏడ్చిరి. వశిష్ఠుడు వెంటనే మంత్రులతో సహా ప్రాతఃకాలముననే అచ్చటుకు వెళ్లెను. దశరథ కళేబరమును నూనె దోనెయందుంచి దూతలకు ఆనతిచ్చెను. వెంటనే అశ్వములపై యుధాజిత్తు గారి నగరమునకు పోయి అచ్చట మహారాజు భరతుడు శత్రుఘ్నునితో సహా నివసించి యున్నాడు. నా ఆజ్ఞచే భరతుని వెంటనే తీసికొని రండు. దశరథుని కైకేయిని చూచు నిమిత్తము రమ్మనమని చెప్పండి. వెంటనే రాజభటులు యుధాజిత్ నగరమునకు పోయి వశిష్ఠుడు "తమ్మునితో సహా భరతున్ని పంప మన్నారు. అయోధ్యకు రావలసినదని ఆజ్ఞ ఇచ్చితిరి. అటులనే భరతుడు భయపడి తమ్మునితో సహా మరికొందరు రాజభటులతో కూడ బయలుదేరి దశరథమహారాజుకి ఏదో కీడు సంప్రాప్తించిందని శంకించెను. అయోధ్యలో ప్రవేశించి పట్టణమంత లక్ష్మీరహితం గాను. జనులదే విడువబడ్డదిగాను, ఉత్సవ విరహితంగాను ఉండుటను చూచి చింతాకులు డాయెను. రాజ్యలక్ష్మీ రహితమైన రాజభవనమును చూచి ఒక్కతెగా ఆసనమందు కూర్చొనియున్న కైకేయిని చూచెను. మాతృపాదములకు శిరసా నమస్కరించెను. భరతున్ని లేపి తొడయందు కూర్చొపెట్టుకొని శిరస్సునందు ఆఘ్రాణించి తన కన్నవారి క్షేమమును అడిగెను. మా తండ్రిగారు బాగున్నారా, మా అన్న బాగున్నాడా, మా తల్లి బాగున్నదా. పూర్వపుణ్యము వలన నీ విప్పుడు బాగున్నావు. కైకేయిని చెప్పరాని ఆవేదనతో బాధపడుచున్న మనస్సుతో అమ్మ 'నిరాక్కతివే ఇచ్చట ఉన్నావు.

పూజ్యపాదులైన మా తండ్రిగారు ఎచ్చట ఉన్నారు. నీవు లేకుండ మా తండ్రి రహస్యంగా ఎచ్చటను ఏనాడు ఉండేవారు కారు. ఇప్పుడు కనపడలేదు. ఎచ్చట ఉన్నారో చెప్పవలెనని అడిగెను. నాకు తండ్రిగారిని చూడకుండా భయము, దుఃఖము కలుగుచున్నవి. అంత కైకేయి పుత్రా! నీకు దుఃఖ మెందులకు? అశ్వమేథాది యాగములు చేసిన ధర్మశీలురకు ఏ పదము వచ్చునో ఆ పదమును మీ తండ్రిగారు పొందిరి. అది విని భరతుడు దుఃఖముచేత కొట్టబడి భూమిమీద పడిపోయెను. హే తండ్రి! నన్ను శోకసముద్రంలో ముంచివేసి నీ వెచ్చటకు వెళ్లిపోతివి. నన్ను రామునికి అప్పగించ కుండ నీవెట్లు వెళ్లితివి". ఈ విధంగా జత్తులు విప్పుకొని ఏడ్చు చున్న భరతుని జూచి లేవదీసి కళ్లుఒత్తి కైకేయి భరతునితో అనెను. ఊరడిల్లుము భరతా! నీకు నేను సర్వమును సంపాదించితిని. చచ్చి పోతూ మా తండ్రి ఏమని చెప్పెను. అని ప్రశ్నించగా హా రామా, హా రామ. హా సీత, హా లక్ష్మణ అంటూ శరీరమును విడిచిపెట్టి స్వర్గమును చేరిరనెను. అప్పుడు రాముడు సమీపమునందు లేడా? అని భరతు డడిగెను. సీతగాని, లక్ష్మణుడుగాని సమీపంలో లేకుండ ఎచ్చటకు వెళ్లిరి? 'రామున్ని పట్టాభిషేకము చేయదలచి మీ నాన్నగారు సంబరము చేసారు దానికి నేను విఘ్నము కాపించి తిని. నేను దశరథుని రెండు వరముల నడిగితిని. ఆ రెంటిలో ఒకటి నీకు రాజ్యమును, రామునికి వనవాసము, రెండవదిగాను నేను కోరితి. సత్యసంధుడైన దశరథుడు నీకు రాజ్యమును ఇచ్చి నారు. రామున్ని అరణ్యవాసమునకు పంపినారు. సీత రామున్ని పతివ్రతగా సహధర్మచారిణిగా అనుసరించింది. లక్ష్మణుడు సౌభా త్రం పురస్కరించుకొని రాముని వెంట అరణ్యమునకు వెళ్లెను. వనమునకు వెళ్లిన వీరి ముగ్గురిని స్మరిస్తూ విలపించుచు దశరథుడు మరణించెను'. ఈ మాటలువిని వజ్రాయుధముచేత నరకబడిన చెట్టు వలె మాతృవాక్యముల వలన భరతుడు నేల గూలెను. దుఃఖించు

చున్న భరతుని జూచి వత్స నీకు దుఃఖ మెందులకు ? మహా రాజ్యాధిపత్యము వచ్చిన నీకు ఏడుపుకు అవసరము లేదు. అని మాట్లాడుచున్న కైకేయిని చూచి "ఓ పాపాత్మురాలా భర్తను చంపిన క్రూరురాలా ! నీ కడుపున పుట్టినందుకు నేను పాపాత్ముడ నయితిని. నీవు కుంభీపాక నరకంలో పడతావు. నేను అగ్నిలో పడిగాని, విషము తినిగాని, ఖడ్గము చేతగాని ఆత్మఘాతము చేసికొని యమలోకమునకు వెళ్లెదను' అంటూ కైకేయిని నిందించి విడిచిపెట్టి కౌసల్య గృహమునకు వెళ్లెను. భరతున్ని జూచి కౌసల్య భోరున విలపించెను. భరతుడు కౌసల్య పాదములందు పడి విలపించెను. భరతున్ని కౌగిలించుకొని, పుత్ర ! నీవు దూర మందుండుట చేత ఇది యంతా జరిగింది. మీ అమ్మవలన నీవు సర్వమును వినియే యుందువు. నా కొడుకు, కోడలు వనవాసానికి వెళ్లేరు. లక్ష్మణుడు వెంట వెళ్లేడు. నన్ను దుఃఖసము ద్రంలో విడిచిపెట్టి వెళ్లినారు. తలచుకుంటే శ్రీరాముడు పరమాత్మయే. అయినా నన్ను దుఃఖము వదలలేదు. అంత భరతుడు కౌసల్య రెండు పాదములను తన చేతు లతో పట్టుకొని పలికెను. రామరాజ్య అభిషేచన విషయములో కైకేయి చేత చేయబడిన దుష్కృత్యములో నా కేమాత్రము భాగము లేదు. అట్లుకాదని చెప్పితే నేను నూరు బ్రహ్మహత్యా పాపము లను పొందెదను. లేక అరుంధతీ సహిత వశిష్ఠుని చంపిన పాపము నాకు తగులుతుంది. అని ప్రయాణం చేసిన భరతుని కౌసల్య ఓదార్చి నాకు సర్వము తెలుసును నీవేమియు బాధపడవలసిన అవసరము లేదనెను. తిరిగి భరతుడు ఏడ్వ ప్రారంభించెను. భరతుడు వచ్చిన వార్తవిని వశిష్ఠుడు మంత్రులతో రాజభవనమునకు వెళ్లి ఏడ్చుచున్న భరతుని చూచి ఓదార్చెను. రాజు ముసలివాడు జ్ఞాని సత్యవంతుడు సనుత్తమయిన భూలోక సౌఖ్యములను అనుభ వించి అశ్వమేధాది క్రతువులను చేసి సాక్షాత్ శ్రీహరిని కుమా రునిగా కని అంత్యకాలమున ఇంద్రలోకమునకు పోయి ఇంద్రుని

అర్ధాసన మధిష్ఠించెను. నీవు అనవసరంగా విలపించు చున్నావు. ఆత్మ నిత్యమైనది. శరీరము నిత్యముకాదు. ఇది అపవిత్రమైనది. నశించేది. అజ్ఞానులు తండ్రి మొదలగువారు చచ్చిపోతే ఏడుస్తారు. జన్మ ఉంటే మృత్యువుంది. ఇది లోక సహజము. మృత్యువును దాటుట ఏ యొక్కరికి సాధ్యముకాదు. ఎవరిచేత చేయబడిన కర్మ ననుసరించి వారికి పుట్టుక, చావు వస్తుంది. బ్రహ్మాండకోటి సృష్టులు కాలగర్భంలో కలిసి పోతాయి. సముద్రము లన్నియు ఇంకి పోవును. ఈ క్షణ జీవితమునకు ఉనికి ఎక్కడిది. గాలికి కదలాడే ఆకుమీాద ఊగే నీటిబిందువు వంటిది ఆయువు. వెనుకటి జన్మలలో చేసిన కర్మలవలన దేహమును పొందుచున్నాడు. జీర్ణములైన బట్టలను విడిచిపెట్టి క్రొత్త బట్టలను ధరించు రీతిని, జీర్ణమైన శరీర మును విడిచి నూతనమైన శరీరమును పొందుతాడు జీవి. నాశము లేనిది ఆత్మ యొక్కటే. దీనికి చావు, పుట్టుక, పెరుకువ మారుట ముసలితనములు లేవు. ఇది అవినాశి. సచ్చిదానంద స్వరూపము ఆత్మ".

అందువలన భరతా! దుఃఖమును విడిచి కార్యము చేయుము. తైలద్రోణి యందుంచబడిన పితృకళేబరమును మంత్రులతో కూడ బయటకు తీయించి శాస్త్రప్రకారము ఉత్తరలోక క్రియల నాచరిం పుము. అంత భరతుడు దుఃఖమును వీడి అహితాగ్ని చేత పితృదేహ మునకు సంస్కారములను గావించి పదకొండవ రోజున వేద పండితులకు వేలాది మంది బ్రాహ్మణులకు అన్నదానము చేసెను. తండ్రిగారిని ఉద్దేశించి వెయ్యి గోవులను, రత్నాంబరములను, గ్రామములను, బ్రాహ్మణులకు దానముల నిచ్చెను. శ్రీరాముని మనస్సులో స్మరించుచు తన యింట్లో వశిష్ఠునితోను, శత్రుఘ్నుని తోను, మంత్రులతోను కూడుకొన్న వాడై ఇట్లనెను. "నా తల్లి కైకేయి ఒక రాక్షస స్త్రీవలెను, సీతారామ లక్ష్మణులను ఇంటినుండి

తరిమివేసి అరణ్యమునకు పంపుట అనే ఘోరకృత్యము నా హృదయమును కాల్చివేయు చున్నది. ఆమెను చూస్తేనే నా కసహ్యం వేస్తోంది. నేనిచ్చట ఉండలేను. రాజ్యాన్ని దూరంగా విడిచిపెట్టి నేను అరణ్యమునకు వెళ్లెదను. ఆ శ్రీరాముని నగు మోమువానిని, సీతాసమేతున్ని నేను అనుసరించి ఉంటాను. ఇది నా స్థిరనిర్ణయము.

ఇట్లు అయోధ్యాకాండలోని ఏడవ సర్గము సమాప్తము.

ఎనిమిదవ సర్గ

## శ్రీ మహాదేవుడు పలికెను

అంత వశిష్ఠుడు భరతున్ని పిలిచి నీవు రాజ్యాధికారాన్ని స్వీకరించాలి దశరథుడు నీకు రాజ్యమిచ్చినాడు. దాని ప్రకారము నిన్ను రాజ్యమునందు పట్టాభిషిక్తుని చేసెదము. కైకేయి నీ కొఱకు రాజ్యమును యాచించినది. సత్యసంధుడైన దశరథుడు నీకు రాజ్యము నిచ్చినాడు. మునీశ్వరులతో కూడికొని నీకు ఇప్పుడు అభిషేకము చేస్తాము. మంత్ర పూర్వకముగా చేస్తామని చెప్పెను. అంత భరతుడు పలికెను. "హే మునీశ్వరా! నాకు రాజ్యముతో పనిలేదు. రాముడు రాజాధిరాజు. మనము అతని దాసులము. రేపటి ప్రభాత సమయములో సమస్త లాంఛనములతో శ్రీరాముని తీసి కొని వద్దాము. నేను మీరు తల్లులు రాక్షసియైన కైకేయి వినా రేపటి ప్రభాతముననే బయలుదేరి రాముని దగ్గఱకు వెళ్లెదము. ఈ దుష్ట రాక్షసి కైకేయిని మాతృశబ్దమునకు నిందాభూతు రాలైన దానిని ఇప్పుడే కత్తితో నరికేస్తాను. కాని ఒక సంశయము ఉంది. రాముడు స్త్రీఘాతిని అని నన్ను స్వీకరిస్తాడో లేదో రేపు తెల్లవార గానే పాదచారులమై శత్రుఘ్న సహితముగా దండకారణ్యమునకు వెళ్లిపోవలసినదే. మీరు వస్తే రండి లేనిచో మానీయండి. నేను కూడ వల్కలధారినై రాముడు వనమునకు వెళ్లు భంగిలోనే ఫల మూలములను తింటూ జటలను ధరించి భూమిమీద పడుకొని రాముడు వచ్చువఱకు మునివేషధారినై యుంటాను. అని పలికి ఊరకుండెను. అంత ప్రజలందరు శభాష్ భరతా! చక్కగా పలికావు అని మెచ్చుకొనిరి.

ఆ మరునా డుదయముననే భరతున్ని సర్వసైన్యములు అనుసరించినవి. ఏనుగులు, గుర్రములుతో సహా బయలు దేరినవి. కౌసల్య మొదలయిన రాజదారలు వశిష్ఠుడు మున్నగు బ్రాహ్మణులు సమస్త భువనమును కప్పినంత ప్రజలు నాలుగు దిశలు కప్పబడగా శృంగవేర పురమునకు ముందు వెళ్లిరి. గుహుడు ఆ సైన్యమును చూచి భరతుని హృదయమును శంకించి వీడు రామునికి కీడు చేయదలచి, మోహరించి ససైన్యముగా వచ్చుచున్నాడా అని అనుమానించి వాని హృదయము తెలియునంత వఱకు గంగాతీర మందంతటను పొంచి, మోహరించి యుండడని తన సైన్యమునకు ఆజ్ఞాపించెను. రామునికి విరుద్ధముగాదని తెలిస్తే గంగను దాట నివ్వండి. లేనిచో ప్రతికూలించినచో అన్ని విధములైన ఆయుధము లతో వేచియుండండని సైనికులకు శాసించెను. అటులనే సర్వ సైన్యము ఎవరి ఆయుధములను వారు ధరించి కీలక స్థానముల నాక్రమించిరి. భరతుని జటావల్కలధారిని, రామనామ స్మరణ చేయుచు, రాముని అనుసరించుచు వశిష్ఠాది మహర్షులతో కూడికొని యున్న భరతుని జూచి కానుకలను సమర్పించి నమస్కరించి తాను గుహుడనని బయటకు పలికెను. గుహున్ని శీఘ్రముగా లెవదీసి గాఢాలింగనము కావించి భరతుడు సోదరా ! నీవు ధన్యుడవు. నిన్ను శ్రీరాముడు గాఢాలింగనము చేసికొనెను. సీతమ్మ లక్ష్మణుడు రాముల సంభాషణ నీవును విన్నావు. నీవు ధన్యుడవు. రాముడు నివసించిన స్థలమును నాకు చూపించు. నీవు రామునికి ప్రియుడవు, భక్తి గలవాడవు. అందువలన నీవు భాగ్యవంతుడవు అని బాష్పజల ములతో రాముని స్మరించి, స్మరించి గుహునితో కూడ రాముడు రాత్రిపూట పరుండిన స్థలమును చూచెను. దర్భలతోను, పువ్వుల తోను కూడిన స్థలము, సీతమ్మ అభరణముల నుంచి జాలువారిన బంగారు పూలతో కూడిన స్థలమును దర్శించి భోరుమని ఏడ్చెను. అతి సుకుమారి అయిన సీతమ్మ ఇచ్చటనా పడుకొన్నదిః అంతః

పురంలో బంగారు మంచములమీద పట్టుపరుపుల మీద పడుకున్న తల్లికి ఎట్టి కష్టము సంభవించినది. నా దోషము వలన గదా! సీతా రాములకు ఇట్టి కష్టములు వచ్చినవి. నా జన్మ నింద్యము. పాపాత్ము రాలైన కైకేయియందు జన్మించినందుకు. పరమాత్మ అయిన రాముని నికి నా నిమిత్తము ఇట్టి కష్టములు సంభవించినవి లక్ష్మణుని జన్మ ధన్యమైనది. అరణ్యంలో కూడ రామున్నే అనుసరించేడు. ఆనం దంతో రాముని దాసులకు దాసుడను అయి నా జన్మను సఫలం చేసికొంటాను. అన్న నీకు రాముడెచ్చట నున్నది తెలిస్తే నేను అచ్చటకు వెళ్లెదను. అంత గుహుడు భరతుని నిర్మలాంతఃకరణ మును గ్రహించి దేవ! మీరే ధన్యులు నీ రామభక్తి ఇంత గొప్పది మఱియు సీతారామ లక్ష్మణుల యందు కూడా నీకంటె ధన్యుడు మరిలేడు. రాముడు చిత్రకూట పర్వతము దగ్గఱ గంగకు సమీపంగా సీతాలక్ష్మణ సమేతుడై ఉన్నాడు. అచ్చట మునీశ్వరులుకూడ కలరు. జానకమ్మతో సుఖంగా రామప్రభు వున్నారు. అచ్చటకు మన మందరం వెళ్లెదము. అని గుహుడు ఐదువందల పడవలను తెప్పించి సైన్యంతో కూడ రాముని ధ్యానించి భరతున్ని, వశిష్టుని, రామ మాతను శత్రుఘ్నున్ని పడవలెక్కించి గంగను దాటి భరద్వాజా శ్రమమునకు వెళ్లించెను. దూరంగా సైన్యము నుంచి భరతుడు తమ్మునితో కూడ భరద్వాజ మహామునిని దర్శించి సాష్టాంగంగా నమస్కరించెను. భరతుడు దశరథ పుత్రుడు అని గ్రహించి ప్రీతితో భరద్వాజుడు పూజచేసెను. రాజ్యమేలుచున్న నీకు ఈ జటావల్కల ధారణ ఏమిటని ముందు కుశలమడిగి ప్రశ్నించెను. ముని సేవిత మైన అరణ్యమునకు నీవెందుకు వచ్చితివి అని కూడ ప్రశ్నించెను.

అంత భరతుడు సర్వము తెలిసిన మీకు అంతా తెలుసు. అయినను నన్ను అడుగుచున్నారని కంటనీరు పెట్టి కైకేయిచేత చేయబడిన పాపకర్మలు నాకు తెలియవు. మీ పద్మములానగా చెప్పుచున్నాను. భరద్వాజుని రెండు పాదములను పట్టుకొని నేను

ప్రమాణము చేయుచున్నాను. మునీశ్వరా! నేను శుద్ధుడనో, మలిను డనో నీవు తెలిసికొనుటకు అర్హుడవు. రాజైన రాముడుండగా నాకు రాజ్యముతో ఏమి పని? నేను రామచంద్రుని శాశ్వత సేవకుడను. అందువలన అతని పాదకమలములు సమీపించి, పాదములమీద పడి ఈ సమస్త రాజ్యమును రామునికి అచ్చటనే అతని ఎదుటనే అప్ప చెప్పెదను. వశిష్టాదుల సహాయముతో రామున్ని అచ్చటనే రాజ్యమందు అభిషిక్తుని చేసెదను. రామున్ని అయోధ్యకు తీసికొని వెళ్లిపోతాను. నీచాతినీచుడైన దాసుడువలె అతనిని సేవించెదను. ఈ విధమైన భరతవాక్యములను విని భరద్వాజ మహర్షి పరమా నంద భరితుడై భరతుని ఆలింగనము చేసికొని శిరస్సునందు వాసన చూసి ఆశ్చర్యంగా పొగిడెను. వత్సా భరతా! నేను ఇంతకుముందే జ్ఞాననేత్రంతో తెలిసికొని యున్నాను.

లక్ష్మణుడుకంటె నీవే శ్రీరాముని యందు పరమభక్తి కల వాడవు. నీ సేనాసమేతంగా మీకందరికి అతిథ్యం ఇవ్వదలచు కున్నాను. ఈ రోజు మా ఆశ్రమంలో భోజనంచేసి రేపటి దినమున రామసన్నిధికి వెళ్లవలెను. తమరు ఏ విధంగా ఆజ్ఞాపిస్తే అటులనే చేసెదను. భరద్వాజుడు తన అగ్నిహోత్రి గృహమునకు వెళ్లి నీళ్లు చేతిని స్పృశించి కోటికల నీడేర్చే కామధేనువుని స్మరించి అతిమానుషమైన దివ్యమైన మహత్తుతో యావన్మంది సైన్యమునకు ఆనందకరమైనట్లు వస్తుసామాగ్రిని వర్షించెను. వశిష్టుని ప్రప్రథ మంగా వేదోక్త రీతిలో పూజించి తరువాత ససైన్యుడైన భరతుని సంతృప్తి పరచెను. ఒక దినము భరద్వాజాశ్రమంలో ఉండి స్వర్గ సౌఖ్యముల ననుభవించి ప్రాతఃకాలమునందే భరతుడు భరద్వాజుని అభినందించి అనుజ్ఞ తీసికొని రామసన్నిధికి అరిగెను. చిత్రకూట మును సమీపించి సైన్యము నంతను దూరముగా నుంచి రామదర్శ

నముకొఱకు భరతుడొక్కడే బయలుదేరెను. శత్రుఘ్నుడు సుమంతుడు, గుహుడు కూడినవాడై ముని జనవాటిక నంతటిని దర్శించి రామభవనము కనపడనందున ఋషి మండలమును అడిగెను.

కొండవెనుక గంగ ఒడ్డున ఏకాంతంలో అందమైన వనములలో కూడియున్నదనియు మఱియు పండిన మామిడి పండ్లు, అరటి పండ్లతోను, సంపెంగెలతోను, పారిజాతములతో పున్నాగములతోను కూడియున్న దానిని చూపెట్టిరి. మునీశ్వరులీ ప్రకారము చెప్పిన పిమ్మట ఆనందముతో, మంత్రులతో సహా భరతుడు అతిదూరము నుండి చూచెను. ఇంకను ఆ మందిర ప్రాంగణమందలి వృక్షాగ్రములలో నారబట్టలు కట్టబడియున్నవి. మునిగణముచే సేవింపబడుచున్నది.

ఇట్లు అయోధ్యాకాండలోని ఎనిమిదవ సర్గ సమాప్తము.

## తొమ్మిదవ సర్గ

సీతారామ పాదములతో పవిత్రమైన రాముని కుటీరమును చూచుచు భరతుడు మహదానందముతో రాముడు నడచు మార్గము నందంతటను వజ్రము, పద్మము, అంకుశము, ధ్వజము మున్నగు భగవల్లక్షణములను పాదవిన్యాసములు ధూళియందు ముద్రింప బడినవి కనుగొనెను. తన జన్మ ధన్యమైనదని తలచెను. ఇటువంటి పవిత్ర భూస్థలమును స్పృశించి నందువల్లను రామున్ని చూచుట చేతను ఆశ్రమవాసు లందరు ధన్యులైతిరి. వేదములు బ్రహ్మాది దేవతలు ఆకాంక్షించే ఐశ్వర్య సామ్రాజ్యము రాముని పాదధూళి అని అద్భుతమైన అనుభూతిని పొంది శ్రీరాముని కనుగొనెను. ఇంద్రనీలముల కాంతిగల దేహచ్ఛాయ, విశాలమైన నేత్రములు, జటాకిరీటధారి నూతనమైన వల్కములు ధరించిన సొబగు, ప్రసన్న వదనము బాలభాస్కర ప్రభ అమ్మ సీతమ్మను కండ్లతో చూచు చున్న వాడు లక్ష్మణునిచేత కావింపబడిన పాదసేవ కలవాడు అగు రామున్ని చూచి చూడగనే ఏడ్చుచు అతని పాదములను దృఢ ముగా పట్టుకొనెను. రాముడు వానిని లేవనెత్తి రెండు బాహువులతో అలింగనము చేసికొని నేత్రముల నుండి జాలువారు బాష్పములతో వర్షించెను. అ తరువాత తొడమీద కూర్చొపెట్టుకొని మఱియు మాటిమాటికి అలింగనము చేసికొనెను.

అంత రాముని తల్లులు త్వరత్వరగా విచ్చేసిరి. ఆవు జలము నకు పోవు భంగిసంభ్రమంగా వెళ్లిరి. రాముడు తల్లి కౌసల్యను చూచి లేచి పాదాభివందనము గావించి అ విధముననే ఇతర రాజ మాతలకు నమస్కరించి వశిష్ఠునకు సాష్టాంగ దండప్రమాణము మాచ రించి "ధన్యుడనైతిని, ధన్యుడనైతినని రెండు సార్లు చెప్పి అందఱిని

కూర్చోపెట్టి మా తండ్రిగారు క్షేమంగా ఉన్నారా ? నా గురించి మహాదుఃఖించి నన్ను వదిలిపెట్టిరని అనెను. అంత వశిష్ఠుడు, దశరథుడు హా రామ, హా సీత, హా లక్ష్మణ అంటూ పరమపదించె నని చెప్పెను. అంత రాముడు ఘోరుమని విలపించి 'హా హతోస్మి' అని పడిపోయెను. లక్ష్మణుడు సీతకూడ దుఃఖ నిమగ్నులయిరి. రాముడు తండ్రీ ! నన్ను వదలిపెట్టి ఎచ్చటకు వెళ్లితివి ? ఓ దయామయా ! నన్ను అనాథుడను చేసితివి. ఇక నన్ను లాలించేవాడు ఎవడు లేడే. సీతాలక్ష్మణులు దుఃఖముతో విలపించిరి. వశిష్ఠుడు ఆ దుఃఖమును శాంతింప జేసెను. అంత మందాకిని అను పిలువబడు గంగానదిలో స్నానముచేసి పవిత్రులై లక్ష్మణునితో కూడ రాముడు పిండప్రదానము కావించెను. "మనకేది ఇష్టమవుతుందో పితృదేవతలకది ఇష్టము" అని వేదము చెప్పిన రీతిలో ('వయం యదన్నాః పితరస్త దన్నాః'). ఇంగుదీపముల పండ్లను పిండములుగా గావించి వానిలో తేనెపోసి దానము చేసెను. దుఃఖార్తుడై తిరిగి గంగలో స్నానము చేసి ఆశ్రమమునకు చనిరి. మిగిలిన వారు కూడ గంగలో స్నానము చేసి రామునితోపాటు ఆ దినమున ఉపవాస ముండిరి.

ఆ మరునాడు పవిత్ర గంగానది జలములో స్నానమాచరించి నిర్మలుడై భరతుడు, కూర్చొనియున్న రామున్ని చూచి 'ఓ మహాభాగా రామా ! రాజ్యమందు నిన్ను ను అభిషేకము చేసికొనవలెను. నీవు జ్యేష్ఠుడవు. నీకే రాజ్యాధికారము. క్షత్రియుల కిది ధర్మము. ప్రజలను పరిపాలించి బహువిధములైన యజ్ఞములను చేసి పుత్రులు కని వంశము నిలపెట్టి రాజ్యమునందు కొడుకుని అభిషేకించి అపుడు వనమునకు వెళ్లెదవు. ఇప్పుడు వనవాసమునకు కాలము కాదు. నన్నను గ్రహించు. నా తల్లిచేసిన అపరాధమును క్షమించి నన్ను రక్షించుము'. అని పలికి భరతుడు రాముని పాదములను

పట్టుకొనెను. సాష్టాంగముగా రాముని ఎదుటపడి పాదములను గ్రహించెను. రాముడు లేవదీసి తొడమీద కూర్చోబెట్టుకొని, దయతో కూడిన నేత్రములతో మెల్లగా పలికెను. హే వత్స భరత! నీవు చెప్పినదంతా సత్యమే. కాని మన తండ్రిగారు నన్ను పదు నాలుగు సంవత్సరము లరణ్యవాసము చేయమని ఆజ్ఞాపించిరి. సమస్త రాజ్యమును భరతుని కివ్వబడినది. అని చెప్పిరి. తండ్రిగారు నిర్ద్వంద్వంగా సుస్పష్టంగా నీకు రాజ్యము నిచ్చిరి. దండకారణ్య రాజ్యమును నాకు ఇచ్చినారు. పితృవాక్యము మన యిరువురికి దాటశక్యము కాదు. పితృవాక్యములను కాదని స్వతంత్రుడై వ్యవహరించిన సుతుడు బ్రతికి యుండియు చచ్చినవానితో సమానుడు. దేహమును వీడిన తరువాత వాడు నరకమును పొందె దడు. అందువలన నీవు రాజ్యమును పాలించు. మేము దండక మును పాలిస్తాము.

అంత భరతుడు "కాముకుడు స్త్రీ వశుడు, ఉన్మత్తుడు, మూర్ఖుడు అయిన దశరథుని వాక్యములకు విలువ ఇవ్వకూడదు. దానిని సత్యవాక్యము అని విలువ ఇవ్వనక్కర లేదు. అనెను.

రాముడు ఇట్లనెను. మన తండ్రి స్త్రీజితుడు కాడు, మూర్ఖుడు కాడు, కాముకుడు కాదు. అతడు సత్యవాది దశరథుడు సత్యవాది. ఆడినమాట తప్పినవాడు దశరథుడు అని నిందిస్తారని నీతికి కట్టుబడి చెప్పిన శాసనమది. పెద్దవారలకు అసత్యము వలన భీతి యెక్కువ. నరకమువలన కంటె అని యనెను. నేను కూడ ఆ విధముగనే చేస్తాను. నేనుకూడ రఘువంశమందు పుట్టాను. ఆడినమాట తప్పుట మన వంశములో లేదు. ఆడిన మాట తప్పితే రఘువంశమునకే అప్రతిష్ఠ వచ్చును. అంత భరతుడు, నేను జటావల్కలధారినై అరణ్యపాలన చేస్తాను. రాముడు రాజ్యము చేస్తాడనెను. అంత రాముడు తండ్రిగారు నీకు రాజ్యము నిచ్చారు. నాకు వనవాసము

నిచ్చారు. దానిని నేను వ్యత్యయము చేయుట అసత్యమగును. అట్లు తారుమారు చేయుటకు నాకు అధికారము లేదనెను. అంత భరతుడు, లక్ష్మణుడువలె నేనుకూడ వనానికి వస్తాను. నిన్ను సేవిస్తాను. దీనికి అంగీకరించకపోతే ప్రాయోపవేశముచేసి ప్రాణములను పరిత్యజిస్తాను. ఇట్లు పలికి ఎండలోనికి వెళ్ళి భూతలమందు దర్భలను పరిచి మనస్సులో చావును కోరుకొని తూర్పు దిక్కుకు ఎదురుగా కూర్చొనెను.

అంత రాముడు భరతుని దృఢదీక్షకు మెచ్చుకొని గురువగు వశిష్ఠునకు నేత్రములద్వారా సంజ్ఞచేసెను. అంత వశిష్ఠుడు భరతుని ఏకాంతంగా తీసికొని వెళ్ళి వత్స భరత! ఒక రహస్య విషయమును గోప్యము కూడ అగుదానిని నీకు చెప్పుచున్నాను.

రాముడు సాక్షాత్ నారాయణుడే బ్రహ్మచేత ప్రార్థింపబడి రావణవధ నిమిత్తము దశరథుని గర్భవాసమందు పుత్రుడుగా జన్మించెను. యోగమాయ సీతగా జన్మించినది. శేషుడు లక్ష్మణుడుగా జన్మించినాడు. ఎప్పుడు రామున్ని కలిసి తిరుగుచుంటాడు. వారలు రావణాసురవధ కొఱకు అవతరించిరి. ఇదంతా దేవతలు చేసిన పని. కైకేయి నిమిత్త మాత్రము. అమెచేతను వారలే అట్లు పలికించిరి. లేనిచో కైకేయి ఈ విధంగా ఎప్పుడైనా పలికిందా. రామున్ని తీసికొని వెళ్లు నుద్దేశమును మార్చుకొమ్ము. తల్లులతో కూడ సైన్యములతో కూడ తిరిగి నీవు వెళ్ళి పొమ్ము. రాముడు రావణుని సకులంగా చంపివేసి అతిశీఘ్రములో వస్తాడు.

ఆ మాటలు విని భరతుడు మహానంద పారవశ్యంతో రామునికి నమస్కరించి "మీ పాదుకలను సమర్పించండి. రాజ్యము కొఱకు. తమరు తిరిగి వచ్చు వఱకు వానిని పూజ చేస్తాను. అని పలికి రాముని చరణములనుండి ఇవ్వబడిన దివ్యపాదుకలను గ్రహిం

చెను. రామునికి ప్రదక్షిణచేసి తిరిగి తిరిగి నమస్కరించి పదునాలుగు సంవత్సరములు దాటిన తరువాత మొదటి దినమున రాకపోతే నేను అగ్గిలో పడి చచ్చిపోతాను. రామ" అని పలికెను. అవశ్యం వస్తాను. అని రాముడు భరతున్ని తిరిగి వెళ్లుటకు ఒప్పించెను. భరతుడు సర్వపరివారముతోను బయలుదేరుటకు సన్నద్ధుడాయెను. కైకేయి అంత రామున్ని ఏకాంతంగా పిలిచి నాయొక్క పాపకృత్యము వలన నీకీ దయనీయ స్థితి కలిగినది. నేను దుష్టురాలను. మోహము చేత చేసితి. నా దుర్మార్గమును క్షమించు. సత్పురుషులు క్షమకలిగి యుంటారు. నీవు సాక్షాత్ విష్ణువు అవ్యక్తుడవు సనాతనుడైన పరమాత్మవు. మాయామానుష రూపంలో సర్వజగత్తును మోహింప జేయుచున్నావు. నీచేత ప్రేరితమైన లోకము, శిష్టమైన కర్మలను దుష్టమైన కర్మలను చేయుచున్నది. నాటకంలో నర్తకులు సూత్రధారుని ఇచ్ఛానుసారం నటిస్తారు. మాయ నీ యధీనమై యుంది. మాయ బహురూపియైన నర్తకి. దేవకార్యము నిర్వర్తించుటకు వచ్చిన నీ చేత నీ ప్రేరణచేత నేను ఈ పాపకార్యమును చేయవలసి వచ్చినది. నీవు ఇప్పుడు నాకు ప్రసన్నుడ వైతివి. నీవు సనాతనుడైన పురుషోత్తముడవు. విశ్వేశ జగన్నాథ అనంత నీకు నమస్కారము నన్ను రక్షించుము. పుత్రవిత్తాది సంసారపాశమును నానుండి నరికివేయుము. నీ యొక్క జ్ఞానమనే అగ్ని ఆ అగ్ని అనే కత్తిచేత నా యొక్క తాపత్రయమును ఈషణత్రియమును ఛేదింపుము. నిన్ను శరణు పొందితిని. అంత రాముడు కైకేయి చెప్పినదంతయు సత్యమనియు "తాను ప్రేరణచేసి సరస్వతిని పంపించి నీచేత ఆ విధముగా పలికించితిని. దేవకార్యసిద్ధి కొరకు నేనట్లు చేసితిని. నీ దోషము లేదనెను. నీవు వెళ్లి నిత్యము నన్నును హృదయంలో భావన చేయుము. రాత్రింబవళ్లు నన్ను ధ్యానించు. నీకు తొందరలోనే ముక్తి కలుగును. నేను అందరియందు ఎల్లప్పుడు సమదృష్టి కలవాడను. నాకు శత్రువు లేడు ఇష్టుడు లేడు. నేను ఇంద్రజాల మాయచేసెడి గారడీవాడివి

నేను నన్ను భజించిన వారలను భజిస్తాను. ఈ జనము నాయొక్క నిజతత్త్వమును తెలిసికొనజాలరు. నీ పూర్వపుణ్యము వలన నా సంబంధమైన జ్ఞానము కలిగినది. నా స్మరణ చేస్తూ ఇంట్లోనే ఉండుము. కర్మలచే నాకర్షింపబడవు. అని రాముడు చెప్పగానే రామునికి ప్రదక్షిణచేసి కైకేయి వేయిసార్లు భూమియందు పడి రామునికి నమస్కరించి ఇంటికి వెళ్లెను. భరతుడుకూడ సపరివారంగా అయోధ్యకు వెళ్లెను. అచ్చట పరివారమును .పౌరజానపదులను వారివారి స్థలములలో ఉంచి తాను నంది గ్రామమునకు వెళ్లెను. అచ్చట సింహాసనమునందు రామపాదుకలను ఉంచి నిత్యము గంధ పుష్పాదులచేత పూజ గావించి రామున్ని పూజ చేసినట్లే చేయు చుండెను. తాను నిత్యవ్రతుడై ఫలమూలాదులను సేవించి ఇంద్రియ నిగ్రహుడై , జటావల్కలధారియై, బ్రహ్మచారియై, నేల పరుండుచు శత్రుఘ్న సహితుడై యుండెను. రాజకార్యముల నన్నింటిని భూభారము నంతటిని పాదుకలకు నివేదనచేసి తన పనులను చేయుచుండెను. రాముడు వచ్చుటకు దినములు లెక్కపెట్టుచు బ్రహ్మర్షివలె రామునికి హృదయము నర్పించి యుండెను.

రాముడు చిత్రకూట పర్వతమందు కొంతకాల ముండెను. మునీశ్వరులు వచ్చి వెళ్లు చుండెడివారు. ఈ విధంగా తన ఉనికిని గమనించి విపరీతంగా జనము ప్రతిదినము వచ్చుట గమనించి అచ్చటనుండి దండకారణ్య గమనమును రాముడు మనస్సులో సంకల్పించెను. సీతతోను, లక్ష్మణునితోను అత్రిమహాముని ఆశ్రమ మమును పొందెను. బ్రహ్మతేజస్సుతో వనమునంతను ప్రకాశింప జేయుచున్న అత్రిమహామునిని జూచి సాష్టాంగదండ ప్రణామమాచ రించి అభివాదనచేసి నేను రాముడను పితృాజ్ఞ ననుసరించి దండకా వనమునకు వచ్చితిని. వనవాస మిషచేత వచ్చినప్పటికి నీ దర్శన భాగ్యముచేత ధన్యుడను. అత్రిమహాముని రాముని సాక్షాత్ పర మాత్మగా నెఱిగి పత్ర పుష్పాదులచేత పూజ గావించి వన్యఫలముల

సత్కరించెను. సీతారామ లక్ష్మణులను చూచి "నా భార్య మిక్కిలి వృద్ధురాలు. అనసూయ అని ఖ్యాతిగడించింది. లోపల ఉంది. రామ అమెను సీతమ్మ దర్శించు గాత అని అనెను. రాముని అనుజ్ఞతో సీతమ్మ అనసూయను నమస్కరించి సాష్టాంగదండ ప్రణామ మాచ రించెను. అనసూయ సీతమ్మను ఆలింగనము చేసికొని వత్సే అని పిలిచి ఆలింగనము చేసికొని రెండు దివ్యకుండనములను, రెండు పట్టుబట్టలను దేవనిర్మితములైన వానిని బహూకరించెను. అంగ రాగమును కూడ సీతమ్మకు ఇచ్చెను. ఈ అంగరాగమును ధరించి నచో నీ లక్ష్మీకళ నిన్ను వదలదని యిచ్చెను. పాతివ్రత్యం గ్రహించి రామున్ని ఎల్లప్పుడు విడిచి పెట్టకుండా అనుసరించి యుండుము. నీవు రాముడు త్వరలో ఇంటికి భద్రముగా వెళ్లెదరు. సీతారామ లక్ష్మణులకు భోజనము పెట్టి రామునికి నమస్క రించెను. రామ నీవే విశ్వములను సృష్టించి వాటిని రక్షించుటకు దేవ, మానవ, పశు, వృక్షాది, జంతువుల యందు దేహములను ధరిస్తున్నావు. నీకు శరీరగుణము లంటవు. నీకంటె ప్రత్యేకముగా నీ మాయ సర్వమోహమును చేయుచు ప్రకాశించు చున్నది.

ఇట్లు అయోధ్యాకాండలో తొమ్మిదవ సర్గ సమాప్తము.

—O—

# అ ర ణ్య కాం డ

## ప్ర థ మ స ర్గ

## శ్రీ మ హా దే వు డు ప లి కె ను

శ్రీరాముడు లక్ష్మణ సీతానమేతుడై అత్రిమహాముని యాశ్రమ మందు ఒక దినము గడిపి అత్రిమహామునిని మార్గదర్శకులను దండ కారణ్య గమనమునకు ఉపయుక్తులగు వారిని సహాయ మివ్వమని కోరెను. అంత అత్రిమహాముని అందరికి మార్గదర్శకుడవు. నీకు ఎవరు మార్గమును చూపించువారు లేరు. అయినను లోకోక్త ఆచారమును అనుసరించి మా శిష్యులు వస్తారు కూడా అని తాను శిష్యులతో సహా కొంతదూరము దూరము తాను కూడ సాగనంపి తన ఆశ్రమమునకు తిరిగి వచ్చెను. రాముడు ఇంక రావద్దు అని చెప్ప గా మరలెను. కోశెడు దూరము గమించిన తరువాత బ్రహ్మాండమైన నదిని చూచెను. శిష్యులను నదిని దాటుటకు అడుగగా దృఢమైన నౌక కలదని చెప్పిరి. అత్రి శిష్యులు మేమే శీఘ్రముగా నది దాటించగలమని ముగ్గురిని నావయందు ఎక్కించి క్షణములో నదిని దాటించిరి. రామునిచే అనుమతింప బడినవారై శిష్యులు అత్రిమహా ముని ఆశ్రమమునకు తిరిగి వెళ్లిరి. అంతట రాముడు అరణ్యమును చూచి లక్ష్మణునితో పలికెను. ఇచ్చట నుండి మనము చాలా సావధానంగా ఉండాలి. ఈ అరణ్యం చాలా భయంకరంగా ఉంది. ధనుస్సునందు నారినెక్కించి చేతిలో బాణాలు ధరించి నడువుము సీతమ్మ మధ్యేమార్గంలో ఉంటుంది. నేను ముందు నడుస్తాను. నీవు వెనుక నడువుము. సీతను చాలా జాగ్రత్తగా కాపాడాలి. ఆమె మన యిరువురి మధ్యనే ఉండాలి. ఆత్మ పరమాత్మల మధ్య మాయ

వలె ఉండాలి. నీ దృష్టిని అన్ని కోణములందు ప్రసరింపజేయుము. ఇచ్చట మహాభయంకరమైన రాక్షసబృందము ఉన్నదని వినికిరి. సావధానంగా మెలగాలి ఇచ్చట నుండి. ఈ విధంగా మాట్లాడు కుంటూ ఒకటిన్నర యోజనములు దాటినారు. అచ్చట పద్మము లతో కూడిన సుందరతటాకమును జూచి అందలి జలములను త్రాగి ఆ సరస్సుయొక్క ఒడ్డున చెట్టునీడలో కొంతసేపు సేదతీర్చు కొనిరి. ఇంతలో భయానకమైన రాక్షసుడు అచ్చట అతని దంత ములు, కోరలు, దివిటీలువలె నున్నవి. భీషణాకారంగా ఎడమ భుజమునందు ఉంచబడిన శూలాగ్రమునందు వందలాది మనుష్యు లను తగిల్చినాడు.' కనబడ్డ ఎనుబోతులను, ఏనుగులను, పెద్దపులు లను తింటూ ఉన్నాడు. లక్ష్మణునితో రాముడు ధనుస్సును ఎక్కు పెట్టి తమ్ముడా! చూడుము. వీడు మహాకాయుడు, రాక్షసుడు మనకభిముఖంగా వస్తున్నాడు. ధనుస్సునందు నారిని ఎక్కిపెట్టి యుంచుము. సీతమ్మ భయపడకుండ చూడు అని పలికి రాముడు బాణమును సంధించి రాముడు అతికాయునికి ఎదురుగా ఒక కొండ వలె నిలిచెను. అతికాయుడు రామ సీతాలక్ష్మణులను చూచి అట్టహాసముచేసి భయపెట్టుచు పలికెను. ఎవరు మీరు బాణములు అమ్ములపొదిలను ధరించి నారబట్టలను జటలను ధరించియున్నారు. మునివేషధారులు స్త్రీని సహాయముగా పెట్టుకొని యున్నారు. సుందరంగా ఉన్నారు. కాని నా నోట్లో కబలములయి పోతారు. ఈ అరణ్యములోనికి మీరు ఎందుకు వచ్చారు? ఇది చాలా భయంకరమైన వనము. అంత రాముడు నేను రాముడను. మా తమ్ముడు లక్ష్మణుడు వీడు. ఈమె నా ప్రాణవల్లభయైన సీత. తండ్రి యాజ్ఞకొని నీవంటి దుర్మార్గులను సంహరించుటకు వచ్చాము. అంతట రాక్షను డట్టహాసముచేసి ముఖమును విస్తృత పరచి చేతులతో ఖడ్గమును ధరించి హే రామ నన్నెరుగవా లోక ప్రసిద్ధుడనైన విరాధుడను. నా భయము నుండి ఇచ్చట నుండి

మునులందరు పారిపోయిరి. మీరు బ్రతకదలచుకుంటే సీతను విడిచిపెట్టి మీ యిద్దఱివ్వటు నుండి పారిపొండి. లేనిచో మీ యందరిని భక్షిస్తాను. అని పలికి రాక్షసుడు సీతమ్మవైపు బాహువులు చాచెను. రాముడు ఒక్క బాణముతో రెండు బాహువులను నరికెను. ఇంతలో రామునివైపు మహావికృత రూపంలో రాక్షసుడు పరుగెత్తుచూ వచ్చెను. అంత రాముడు వాని రెండు పాదములను నరికెను. అంత రాక్షసుడు వికృత సర్పరూపమును ధరించియుండ రాముడు అర్ధచంద్రాకార బాణముతో అతని శిరస్సును ఛేదించెను. రాక్షసుడు రక్తములు కారుకుంటూ భూమిమీద పడిపోయెను. సీతమ్మ రాముని కౌగలించుకొనెను. దేవతలు దుందుభులు మ్రోగించిరి, అప్సరగణములు నాట్యము చేసినవి. గంధర్వ కిన్నర స్త్రీలు ఆనందంతో గానం చేసారు. అంత విరాధుని శరీరమునుండి బంగారు ఛాయతో మెరిసి పోతూ చక్కని బట్టలు ధరించబడిన నిర్మలమైన బంగారు అభరణ ములతో భాస్కరునివలె వెలుగు ఒక సుందరమూర్తి అవిర్భవించెను. అతడు రామునికి నమస్కరించి దయాపరుని ఆర్తిశమకారకున్ని రామున్ని సాష్టాంగ దండప్రణామము గావించెను. రామునితో ఇట్లనెను. హే రామ ! నేను విద్యాధరుడను, గంధర్వుడను. పూర్వ కాలమున కోపమూర్తియగు దూర్వాసుడు నన్ను శపించెను. నావల్ల ఏమీ తప్పులేదు. ఈ దినమున నీ ప్రసాదము వలన శాపమునుండి నాకు విముక్తి కలిగినది. నా స్మృతి యందు అన్ని వేళలందు నీవే ఉండుము. నీ పాదములే నాకు స్ఫురించుగాత. నా నాలుక నీ నామ మునే పలుకుగాత. నా చెవ్వులు నీ కథయనెడి అమృతమును పానము చేసీయుము. నా రెండుచేతులు ఎల్లప్పుడు నీ రెండు పాదములకు వందనము చేయుగాత. నా శిరస్సు ఎల్లప్పుడు నీ పాదద్వంద్వము నందు ఉంచబడు గాక.

జ్ఞానమూర్తి ఆత్మారూపుడవు, భగవంతుడవు, ఆత్మారాముడవు,

రాముడవు, సీతారాముడవు నీకు నమస్కారము. ప్రసన్నుడవు కమ్ము. దేవలోకమునకు చనెదను అప్పుడు నీ మాయ నాకు తగలకుండా అనుగ్రహించు. ఆ మాటలు విని రాము డానందించి విరాధునికి వరము నొసగెను. నా దర్శనము వలననే నీయొక్క దోషములు అన్నియు నశించినవి. నీవు సద్యోముక్తుడవైతివి. నాయందు భక్తి లోకమునందు దుర్లభము. కలిగిందా ముక్తిని ఇస్తుంది. నీవు భక్తి సంపన్నుడవై వెళ్లు నిన్ను అనుగ్రహించితిని. భయంకర రాక్షస వధ వానికి శాపవిముక్తి, వానికి వరదానము తిరిగి విద్యాధర రూపము ఇవ్వబడుట. ఏ పురుషుడు ఈ కథను కీర్తనల ద్వారా శ్రీరాముని గానం చేస్తాడో ఆ పురుషుడు తాను కోరిన కోరికలను పొందెదరు.

ఇట్లు అరణ్యకాండలోని ప్రథమ సర్గ సమాప్తము.

❀

## ద్వితీయ సర్గము

# శంకరుడు పలికెను

విరాధుడు స్వర్గమును చేరెను. రాముడు సీతాలక్ష్మణులతో శరభంగ మహాముని ఆశ్రమమునకు చనియెను. బుద్ధిమంతుడయిన శరభంగుడు సీతారామ లక్ష్మణులకు ఎదురేగి, పూజచేసి, ఆసనము లందు కూర్చొపెట్టెను. కందమూల ఫలములు మున్నగు వనభోజనముతో అతిధ్యమిచ్చెను. తరువాత ఇట్లనెను. హే రామ నీరాకకై బహుకాలమునుండి తపస్సు చేయుచున్నాను. నేను చేసిన తపస్సు పండింది నా తపఃఫలితము నంతటిని నీకు సమర్పణ చేయుచున్నాను. దానివలన నాకు ముక్తి కలుగును. అటులనే చేసి శరభంగుడు యోగియై సీతారాములకు నమస్కరించి చితిని పరచి అందు ప్రవేశించెను. దూర్వాదళ శ్యాముని సమస్త హృదయాంతర్వర్తిని రాజీవలోచనుని నిస్నిగ్ధ జటాకలాపుని దయాళువు అయిన రామున్ని ధ్యానిస్తూ స్వదేహమును చితిలో తగులపెట్టెను. అయోధ్యాధిపతియైన రాముడు సదా నా హృదయము నందుండు. ఎవని ఎడమ తొడయందు విద్యుత్‌ప్రభతో సమానురాలైన సీతమ్మ ఉందో ఆ రామున్ని నేను ధ్యానిస్తాను. అని రామున్ని చిరకాలము ధ్యానించి, చితిని అగ్ని చేత రగుల్కొల్పి పాంచభౌతికమైన శరీరమును తగులబెట్టెను. దివ్యదేహమును ధరించి సాక్షాల్లోకపతియైన బ్రహ్మ లోకమునకు చనెను.

అంతట చుట్టుప్రక్కల నుండు మునిగణమంతయు రామున్ని దర్శనము చేయుటకు శరభంగుని ఆశ్రమమునకు వచ్చిరి. ముని సమూహమునకు సీతారామ లక్ష్మణులు నమస్కరించిరి. వారు

రాముని ఆశీర్వదించి స్తోత్రముచేసిరి. బ్రహ్మగారి చేత ప్రార్థింపబడి భూభారమును తగ్గించుటకు భూమికి దిగివచ్చిన సాక్షాత్ ఆదివిష్ణువే రాముడనియు, జానకీదేవి లక్ష్మియనియు, లక్ష్మణుడు శేషుడని, శంఖచక్రములే భరత శత్రుఘ్నులనియు ప్రశంసించి తమతో సీతా రామలక్ష్మణులను మునివాటికలకు తీసికొని వెళ్లిరి. అచ్చట అనేక ములైన తలలను ఎముకలను చూచి రాముడు మునీశ్వరుల నడిగెను. ఈ ఎముక లెవరివి. ఎందుకు పడినవి. అంతట మునీశ్వరులు ఇవి మునులయొక్క మస్తకములు రాక్షసులచేత నరకబడినవి. కొన్ని బక్షించబడినవి. ఈ విధంగా మునీశ్వరులకు అంతరాయములను కలుగుచేయు చున్నారు. అని చెప్పగా రాముడు సమస్త రాక్షస సమూహమును నాశనము చేసెదను. అని ప్రతిజ్ఞ చేసెను. జానకీ లక్ష్మణులతో కూడుకొని రాముడు మునీశ్వరులతో సహా అచ్చట కొన్ని సంవత్సరములు గడపెను. కాలక్రమములో విశుద్ధ మునీ శ్వరులతో కూడిన సుతీక్ష్ణుని ఆశ్రమమునకు చనెను. సుతీక్ష్ణుడు రాముడు వచ్చినట్లు విని ఎదురేగి పూజించి భక్తిశ్రద్ధలతో ఆరాధిం చెను. తరువాత ఇట్లు పలికెను. హే రామ! నేను ఎల్లప్పుడు నీ మంత్రమునే జపిస్తాను. అనంతగుణ ప్రమేయ సీతాపతే శివ విరించి పూజిత పాదపద్మములు గలవాడా సంసారమనెడి సముద్ర మును దాటుట కవతరించిన నావ వీవు హే రామాభి రామ! నీకెల్ల ప్పుడు దాసుడను మఱియు నీ దాసదాసుడను. ఈషణత్రయమనునెడి నూతిలో పడిపోయిన మలము మూత్రములతో నశించె శరీరముపయి ఆశపెంచుకుని అలమటిస్తున్న నన్ను రక్షించుటకు విచ్చేసితివి రామా! నీవు సర్వభూత హృదయము లందున్న వాడివైనా నీ మంత్ర జపమును చేయని మూఢులయందు మాయను ప్రవేశపెడు తున్నావు. నీ పాదపద్మముల యందు నిత్యము హృదయము నందు నీ మంత్ర జపము చేయువారల యందు మాయ ఉండదు. నీవుకూడా రాజావారి వలెను ఎవనియొక్క సేవాప్రమాణమును

బట్టి వానికి ఇవ్వవలసినది యిస్తావు. సృష్టి స్థితి లయములను త్రిమూర్తుల పేర్లతో నీవే చేయుచున్నావు. అజ్ఞానులకు అనేకంగా కనిపిస్తావు ఏ విధంగా అంటె సూర్యుడు భిన్న భిన్న సరస్సుల లోను పాత్రలలోను ప్రతిఫలించునట్లు. నీవు చీకటికి అవతలనున్న వాడివి. (తమసః పరస్తాత్) అటువంటి నిన్ను ను నేను ప్రత్యక్షంగా చూచు చున్నాను. దుర్జనులకు నీవు కనపడవు. . నీవు వారలను చూస్తావు. నీ మంత్ర జపములచే పవిత్రములైన హృదయము లందు నీవు గోచరిస్తావు. నీకు రూపం లేదు. అయినను నీ రూపాన్ని చూచుచున్నాను. ఈ నీ మనుష్య వేషము మాయారచితము శతకోటి మన్మధాకారుడవు, సుందర బాణచాపములను ధరించిన వాడవు, దయతో నిండిన తడిసిపోయిన హృదయము కలవాడవు, చిరి నవ్వుతో కూడిన ముఖము కలవాడవు. సీతాసమేతుడవు. వీర్యవంతు డవు లేడిచర్మము కలవాడవు. లక్ష్మణునిచేత నిత్యము సేవించబడిన పాదపద్మములు కలవాడవు. నల్లకలువల కాంతి కలవాడవు. ప్రశాంతచిత్తము కలవాడవు. నా పూర్వపుణ్య భాగ్యము అయిన రామున్ని నిత్యము నమస్కరిస్తాను. నీవు ఉపాధిలేని వాడవనియు, దేశకాల పాత్రాతీతుడ వనియు, రూపరహితుడ వనియు, జ్ఞానులు తెలిసికొంటే తెలిసికోనీ. నా కంటికి ఇప్పుడు ఈ సమయమందు కనుపించే ఇదే రూపము ఎల్లప్పుడు నా హృదయములో ప్రకాశింతు గాత. నాకింకొటి వద్దు అని ధ్యానించెను. ఈ విధముగా స్తోత్రము చేసిన సుతీక్ష్ణునితో నవ్వుచు నీ హృదయము నిర్మలము. నన్ను గొలుచుటవలన అందుకే వచ్చినాను. నన్ను కొలుచువారలను, నన్నే నమ్ముకున్న వారలను, నా మంత్రోపాసకులను, ఇత రాపేక్ష లేకుండ నన్నే ఉపాసించువారలకు నేను కనపడెదను. నీచేత చేయబడిన ఈ స్తోత్రమును నా కిష్టమైన దానిని ఎవరైతే పఠించెదరో నాయందు వానికి సద్భక్తి కలుగుతుంది. విమలమైన జ్ఞానము కూడ కలుగును. నా ఉపాసనవలన నీవు విముక్తుడవయి

తివి. దేహాంతమందు నా సాయుజ్యమును పొందెదవు. నీ గురువైన అగస్త్యమహాముని చూడదలచు కున్నాను. అతని యాశ్రమములో కొంత కాలముండుటకు నా మనస్సు ఇష్టపడు చున్నది. సుతీక్ష్ణుడు అట్లే అనెను. రేపటి దినమందే వెళ్లెదమనెను. నేనుకూడా వస్తాను. చాలా కాలమయింది. గురువును జూచి. సుతీక్ష్ణుడు ప్రభాతసమయమునసే సీతారామ లక్ష్మణ సమేతుడై అగస్త్య సంభాషణ యందు అభిరతుడై అగస్త్యుని తమ్ముడైన అగ్నిజిహ్వుని యాశ్రమమునకు జనెను.

ఇట్లు అరణ్యకాండలోని ద్వితీయ సర్గము సమాప్తము.

---

## తృతీయ సర్గ

# శంకరుడు పలికెను

అగ్నిజిహ్వుని ఆశ్రమమునకు సీతారామ లక్ష్మణులతోకూడ సుతీక్ష్ణుడు మధ్యాహ్న సమయమందు చేరెను. వానిచేత యథావిధిగా పూజింపబడ్డవారలై కందమూల ఫలాదులను సేవించి మరునాడు ఉదయముననే లేచి అగస్త్య నివాసమునకు చనిరి. సర్వ ఋతువులయందలి ఫలముల చేతను, పువ్వులు చేతను, నానా మృగములతోను కూడినదియై వివిధములైన పక్షిసంఘములచేత శబ్దాయమానమైన నందనవనముతో సమానముగా నున్నట్టియు, బ్రహ్మర్షుల చేతను, దేవర్షులచేతను, మునిమందిరముల చేతను, సేవితమైనదియు సాక్షాత్ పరబ్రహ్మ లోకముగా భాసిల్లునదియు, సర్వతః అలంకరింపబడ్డదియు అగు అగస్త్య మహాముని ఆశ్రమమును రాముడు ప్రవేశించెను. బయటనే నిలబడి సుతీక్ష్ణునితో తమ రాకను అగస్త్యుని కెరుకపరచమని రాముడు సుతీక్ష్ణుని అంపెను. అగస్త్యుడా సమయములో తామమంత్ర వ్యాఖ్యానము చేయుచున్న మునిపుంగవులతో సభ చేసి యుండెను. సుతీక్ష్ణుడు, రాముడు, సీత, లక్ష్మణుడు మీ దర్శనమునకు విచ్చేసి బయట నిలబడి యుండిరని నివేదించెను. వెంటనే ప్రవేశపెట్టుము. అతని రాకను నిరీక్షించుచు, అతనినే హృదయమందు ధ్యానించుచు, నా హృదయమందు నిలుపుకున్న రామున్ని చూద్దామని కాంక్షిస్తున్నాను. అని పలికి స్వయముగా మునీశ్వరులతోను కలసి తొందరగా వెనువెంటనే లేచి వెళ్లి పరమభక్తితో పలికెను. రామ రమ్ము. నా పూర్వపుణ్యము వలన నీతో సమాగమ మేర్పడినది. దయసేయుడు. దివ్యమైన అతిథి నీవు. మరియు ప్రీతిపాత్రుడవైన అతిథివి నా యీ దినము పవిత్ర

మైనది. అగస్త్యుడు వచ్చుచుండుట చూచి సీతారామ లక్ష్మణులు సాష్టాంగదండ ప్రణామ మాచరించిరి. వెంటనే లేపి మునిరాజు రామున్ని ఆలింగనము చేసికొని ఆ గాత్ర స్పర్శవలన కలిగిన ఆహ్లాదమువలన బాష్పమును నేత్రముల నుండి వర్షించుచు ఒక చేతితో రాముని చెయ్యి పట్టుకొని తన ఆశ్రమమునకు సంతోషముతో చనెను. సుఖోపవిష్టుడైన రాముని విస్తారంగా పూజచేసి భోజ్యము లైన మన్యపదార్థములతో విందులిచ్చి కృతాంజలియై ఏకాంత మందున్న రామునితో భగవంతుడైన అగస్త్యుడు సంభాషించెను. మీయొక్క అగమనమును ప్రతీక్షించి ఇచ్చట ఉన్నాను. భూభార మును తగ్గించుటకు రావణవధకు బ్రహ్మగారి ప్రార్థన ననుసరించి అవతరించు చుంటెవని తెలిసిన నాటినుండి నీ దర్శనము కొఱకు ఇచ్చట మునీశ్వరులతో కూడి తపమాచరించు చున్నాను. నిన్నే స్మరణచేయు చున్నాను. ఈ చరాచర సృష్టికిముందు ఒక్కడే ఉపాధి రహితుడు, నిర్వికల్పుడు, అగుఆత్మపదార్థ ముండేది. మాయ నీయొక్క శక్తి యని పిలువబడు చున్నది. నిన్నాశ్రయించి యున్నది. నిర్గుణుడవైన నిన్ను నా మాయారూపకమైన శక్తి ఆవరించి యున్న ప్పుడు దానిని అవ్యాకృత మంటారు, వేదాంతులు. మరి కొంతమంది మూలప్రకృతియని అంటారు. మాయ అని కొంతమంది అంటారు. దీనినే అవిద్య, సంస్కృతి, బంధము అని అంటారు. నీచేత కదల్ప బడిన మాయ మహత్త్వమును ప్రసవించు చున్నది. మహత్తత్వము వలన అహంకారము పుట్టుచున్నది. ఈ అహంకారము సాత్త్విక, రాజసిక, తామసిక వృత్తులచే మూడు విధములు. తామసాహంకారము వలన సూక్ష్మతన్మాత్రలు పుట్టినవి. భూతములు తరువాత పుట్టినవి. తరువాత స్థూలములు పుట్టినవి. రాజసములు ఇంద్రియములు సాత్త్వికాహంకారము వలన ఇంద్రియాధిష్ఠానమైన మనస్సు పుట్టి నది. వీటన్నిటియొక్క సమిష్టి సంఘాతము వలన సూక్ష్మ శరీర రూపుడైన హిరణ్యగర్భుడు పుట్టెను. హిరణ్యగర్భున్నే సూత్రాత్మ

అని అంటూరు. స్థూలములైన భూతసముదాయము వలన విరాట్ పురుషుడు ఉదయించెను. విరాట్ పురుషునివలన స్థావర జంగమాత్మక మైన సృష్టి పుట్టినది. కాలకర్మలను అనుసరించి దేవ ! నీవు పశు పక్ష్యాదిప్రాణుల యందు ఆవిర్భవించు చున్నావు. నీవు రజోగుణ మయుడవైన బ్రహ్మవై సంపూర్ణ సృష్టిని చేయుచున్నావు. సాత్విక గుణముద్వారా సృష్టించిన జగత్తు రక్షించు విష్ణుస్వరూపు. డయినావు. తమోగుణము ద్వారా లయమును చేయు రుద్రుడవయితివి. సత్త్వ రజస్తమోగుణములచే జాగ్రత్ స్వప్నసుషుప్తులు క్రమముగా ఏర్పడుచున్నవి. నీవు ఈ మూడింటికి భిన్నుడవై సాక్షిమాత్రుడవై యున్నావు. చిత్ స్వరూపుడవు మఱియు అధికారివై యున్నావు. సృష్టిని విస్తరింప దలచినపుడు మాయకు అంగీకారము నిచ్చి విస్తరింపజేయు చున్నావు. నీ మాయ రెండు విధములు అవిద్య, విద్య అని. ప్రవృత్తి అనగా విషయములందున్న వారిలో అవిద్యగా ఉంటుంది. నీ భక్తికలిగి నిత్యుడైన ఆత్మను ధ్యానించు వారలందు విద్య రూపములో ఉన్నది. అవిద్య వలన పుట్టుక చావులతో కూడిన సంసారము పెరుగుతుంది. విద్యవలన మోక్షమునకు ద్వారము సంభవించును. నీ మంత్రోపాసకులకు నీయందు భక్తి కలవారలకు విద్య పుట్టును. ఇతరులకు ఎప్పుడు విద్య కలుగదు. అందువలన నీయందు భక్తికలవారలు ముక్తులే. ఇందులో సందేహము లేదు. నీయందు భక్తిలేని వారలకు స్వప్నమందును కూడ మోక్షము కలుగదు. ఎందుకు ఇన్ని చెప్పడం. ఒక్క సారవంతమైన విషయ మును మనవిచేస్తాను. సత్పురుష సహవాసమొక్కటియే మోక్ష హేతువు అని ప్రసిద్ధి గాంచినది. ఇంద్రియ నిగ్రహము కలవారలు ప్రశాంతులు నీ భక్తులైన వారు, మల్లిన కోరికలు కలవారు ఇష్టా నిష్టములందు సమచిత్తము కలవారు, లంపటములు లేనివారు సర్వకర్మలను విడిచినవారు, సర్వదా బ్రహ్మయందు తత్పరులు, యమాది గుణములు కలవారు, ఏదానితో సంతోషించినవారు,

సత్సంగము కలవారు నీయొక్క కథలందు ఇష్టులు అయినవారి యందు భక్తి పుట్టును. సనాతనుడవయిన నీయందు భక్తి పుట్టును. ఆ తరువాత ముక్తిమార్గ ముదయించును. అందువలన రామ ! నీ యందు ప్రేమ లక్షణములు గల సద్భక్తి ఎల్లప్పుడు ఉండుగాక. నీ భక్తులయందు విశేషముగా సంగమము కలుగుగాక. ఇప్పుడు నీ శుభసందర్శనము వలన నా జన్మ తరించినది. నా క్రతువు లన్నియు సఫలములయినవి. చాలాకాలము నుండి నాచేత చేయ బడిన పూజాఫలమే తపఃఫలమే ఇప్పుడు నీ ప్రత్యక్ష సాక్షాత్కారము నకు కారణము. హే రాఘవ ! ఎల్లప్పుడు అమ్మ సీతమ్మతో కూడ నీవు నా హృదయమందు వసించుము. నడచినను, కూర్చున్నను నీయందే నాకు సదా స్మృతి కలుగుగాక. ఈ విధంగా రామనాధుని స్తోత్రముచేసి దేవేంద్రునిచే పూర్వము ఇవ్వబడిన ధనుస్సును రాము నకు ఇచ్చెను. నాశనము లేని బాణతూణీరముల నిచ్చెను. రత్న విభూ షితమైన ఖడ్గము నిచ్చెను. ఓ రాఘవ ! భూభార భూతమైన రాక్షస సమూహమును చంపుము. నీవందుకే మాయచే అవతరించితివి. ఇచ్చటకు రెండు యోజనముల దూరములో పవిత్రకా ననమండిత మైన పంచవటి అను ఆశ్రమము గౌతమీనది యొద్దన కలదు. నీయొక్క శేషకాలమును అచ్చట గడుపుము. దేవతల యొక్క పనులను అనేకములను అచ్చటనే చేయుము. అగస్త్యమునిచేత చేయబడిన స్తోత్రమును తత్త్వార్థ ప్రకాశకమైన వేదాంత గోష్ఠిని విని సంతుష్టుడై అగస్త్యునిచేత చెప్పబడిన మార్గమున చనెను.

ఇట్లు అరణ్యకాండమందలి ఉమామహేశ్వర సంవాదమందలి తృతీయ సర్గము సమాప్తము.

—౧·

## చతుర్థ సర్గము

# శంకరుడు పలికెను

పంచవటికి పయనమైన రాముడు మార్గమధ్యములో పర్వతా కారంలో ఉన్న ముసలివాడైన జటాయువును చూచెను. ధనుస్సు తీసికొని రమ్ము నీవెవడో రాక్షసుడులా గున్నాడు. అని లక్ష్మణునితో పలుకగా జటాయువు భయకంపితుడై హే రామ ! నీకు నేను వధా ర్హుడను కాను. మీ తండ్రికి నేను ఇష్టసఖుడను. నాపేరు జటా యువు నీకు మంగళమగు గాక. నీకు హితమును చేయు నిమిత్తము నేను పంచవటిలో ఉంటున్నాను. లక్ష్మణుడు వేటకు వెళ్లేటప్పుడు సీతమ్మకు నేను రక్షకుడుగా ఉంటాను. ఓ మహారాజ ! చక్కని మాట చెప్పేవు. అటులనే నాకు ఇష్టమును ఆచరింపుము. నేను ఇచ్చటకు సమీపంలో గల పంచవటిలో నివసిస్తాను అని జటాయు వును ఆలింగన చేసికొని రాముడు పంచవటికి పయనమాయెను. గంగకు ఉత్తర తటమందు పంచవటిలో చక్కని పర్ణశాలను నిర్మించు కొని యుండిరి. లక్ష్మణుడు మందిర నిర్మాణము గావించుటయే గాక, అనుదినము కందమూలఫలాదులను సమర్పించుచు రాత్రు లందు రక్షకభటునివలె సీతారాములకు రక్షణనిమిత్తము జాగరణము చేయుచుండెను. గోదావరీ జలములలో ప్రతినిత్యము స్నానము చేయుచు సీతమ్మ రామలక్ష్మణుల మధ్య చరిస్తూ ఒస్తుపోతూ ఉండేది. లక్ష్మణుడు ప్రతిదినము నీరు తీసికొనివచ్చి అనన్యసేవ చేయుచు నుండెను. ఏకాంతమందున్న రాముని జూచి ఒకనాడు లక్ష్మణుడు విజ్ఞానసహితమైన జ్ఞానము గూర్చి తెలియజేయమని ప్రార్థించెను. తామునికంటె శ్రేష్ఠుడుచెప్ప సర్హుడు లేడని పలికెను. అంత శ్రీరా ముడు పలికెను.

వత్స ! గుహ్యమైన దానికంటె గుహ్యమైనదియు దేనిని తెలిసికొని మానవుడు వికల్పములతో కూడిన భ్రమను వదిలి వేస్తాడో చెప్పెదను వినుము. ముందుగా మాయయొక్క స్వరూపమును చెప్పుచున్నాను. ఆ తరువాత జ్ఞానముయొక్క సాధనము, ఆ తరువాత విజ్ఞాన సహితమయిన జ్ఞానమును చెప్పెదను వినుము. పరమాత్మను గూర్చి కూడ తెలిసికోవాలి. దేనిని తెలిసికొంటే భయ ముక్తుడు కాగలడో అదికూడ చెప్పెదను. అనాత్మ అయిన శరీరము మున్నగువానియందు ఆత్మబుద్ధిని కలిగియుండుట మాయ. మాయ చేతనే సంసారము కలిగినది. ఈ మాయకు రెండు రూపములు. ఒకటి విక్షేపము. రెండవది ఆవరణ. ఈ విక్షేప శక్తియే మహత్తత్త్వమును మొదలుకొని బ్రహ్మ పర్యంతము సమస్త సంసారమందును స్థూలసూక్ష్మ శక్తిని కల్పించుచున్నది. రెండవదిఅయిన ఆవరణ శక్తి సంపూర్ణ జ్ఞానమును ఆవరించి యున్నది. ఈ సంపూర్ణ విశ్వమంతయు రజ్జువునందు సర్వభ్రాంతిని కలిగించు విధముగా మాయచేత కల్పించ బడినది. విచారణచేస్తె విశ్వమంతయు నిలబడదు. శరీరమే ఈ సంసారమనెడి వృక్షమున కాండము పుత్రులు, భార్య మున్నగు సంసారబంధ మంతయు దేహమూలము. దేహము పంచభూతములు, పంచతన్మాత్రలు, అహంకారము, బుద్ధి, దశవిధ ఇంద్రియములు, చిదాభాస, మనస్సు మూలప్రకృతి, వీనియొక్క సమూహమే దేహము. దీనిని క్షేత్రమని కూడ అంటారు. శరీరమని కూడా అంటారు, దోషములేని పరమాత్మ రూపంలోఉన్న జీవుడు వీనికంటె భిన్నమై యున్నాడు. జీవుడు, పరమాత్మ అన్నవి పర్యాయ పదములని తెలిసికొవవలెను. రెండిటియొక్క అభిప్రాయ మొక్కటే. అభిమానమునుండి దూరముగా ఉండుట ధంభమ్ము, హింస మున్నగువానిని దూరముగా ఉంచుట. ఇతరులుచేసిన ఆక్షేపాదులను సహించుట అన్నిచోట్ల సరళభాషముతో మెలగుట మనోవాక్కాయ కర్మలచేత సద్గురువుయొక్క సేవ చేయుట, బాహ్యము మరియు

అంతరంగికమైన శౌచమును కలిగి యుండుట, సత్కర్మలయం దాసక్తి కలిగియుండుట, మనస్సు, వాక్కును, శరీరములను, నియమము చేయుట, భోగములందు తగుల్కొనక యుండుట, అహంకార శూన్యత్వము జన్మ మృత్యు జరారోగములను కష్టములను లెస్సగా ఆలోచించుట, ఈషణత్రయము (అనగా కళత్రము, ధనము, పుత్రులు). వీనియందు స్నేహము లేకుండా ఉండుట. ఇష్టానిష్టము లందు సమచిత్తము కలిగియుండుట. సర్వాత్ముడైన నాయందు (సర్వాత్మారామ్) అనన్యబుద్ధిని కలిగియుండుట. జనసమూహముచే శూన్యమైన స్థలములందు పవిత్ర స్థలములందు ఉండుట. ఆత్మజ్ఞానమును ఎల్లప్పుడు చర్చించుట. వేదాంతార్థ విచారణవలన జ్ఞానము ఉత్పన్నమగును. వీనికి భిన్నముగా ఆచరించినచో అజ్ఞానము కలుగును. బుద్ధి ప్రాణ, మనో, దేహ, అహంకారములకంటె విలక్షణుడైన చిదాత్మ స్వరూపుడు నిత్యశుద్ధుడు, బుద్ధుడు అగు ఆత్మను నేను. ఇదియే జ్ఞానము ఇది నా సిద్ధాంతము. ఆత్మ పరిపూర్ణమైనది. సచ్చిదానంద స్వరూపము కలధి. సాకరరహిత మైనది. బుద్ధ్యాది ఉపాధులు లేనిది. పరిణామాది వికారములు లేనిది. తన ప్రకాశముచేత దేహాదులను ప్రకాశింప చేయుచున్నది. ఆవరణ లేనిది, అద్వితీయమైనది. సత్యజ్ఞానాది లక్షణములు కలది, సంగ రహితమైనది. స్వప్రకాశము, సర్వత్రసాక్షి మాత్రముగా నున్నది. అని విజ్ఞానమువలన తెలిసికోవలసి యున్నది. గురూపదేశమువలన శాస్త్రములయొక్క ఉపదేశమువలన జీవాత్మ పరమాత్మల యొక్క ఏకతాజ్ఞానము కలుగును. అప్పుడు మూలఅవిద్య పరమాత్మయందు లీనమగుచున్నది. అవిద్యకు సంబంధించిన నాశమును మోక్షమం టారు. ఆత్మయందు మోక్షమనగా కేవలము ఉపచార మాత్రము. ఎందుకనగా ఆత్మ నిత్యముక్తము. నీకొఱకు నేను జ్ఞాన విజ్ఞాన వైరాగ్య సహితమైన పరమాత్మ రూపమైన మోక్షము గూర్చి చెప్పినాను. కాని నాయందు భక్తిలేని వారలకు దుర్లభమని భావించు

చున్నాను. కళ్లున్నను రాత్రిపూట ఏ విధముగా పూర్తిగా కనపడదో దీపము ఉన్న వారికి సరిగ్గా కనపడునో అవిధంగానే నాయందు భక్తి కలవారలకు ఆత్మపూర్ణముగా ప్రకాశించును నాయందు భక్తికి కొన్ని యుపాయములను చెప్పుచున్నాను సావధానముగా వినుము. నా భక్తులతో పరిచయము, నా సంబంధమైన సేవ నా భక్తులకు సంబంధించిన సేవ ఏకాదశ్యాది పర్వదినములందు ఉపవాసములను సలుపుట, నా కథలను వినుట చదువుట భాష్యము చెప్పుట. నా పూజయందు అనక్తి కలిగియుండుట, నా నామస్మరణ చేయుట. ఈ విధముగా నిరంతరము నాయందే లగ్నమై యున్న వారలకు నాయందు భక్తి ఏర్పడుతుంది. నాయందు భక్తి కలిగిన పురుషులకు జ్ఞాన విజ్ఞాన వైరాగ్యములు శీఘ్రముగా కలుగును. వాడు మోక్షమును పొందుచున్నాడు. లక్ష్మణా! నీ ప్రశ్ననుసారము చెప్పితిని. దీనియందు మనమునుంచి ఎవడుంటాడో వాడు ముక్తిని పొందును. నాయందు భక్తి లేనివారల కిది చెప్పగూడదు. నా భక్తులకు పిలిచికూడ చెప్పవలెను. దీనిని ఎవరు నిత్యము పఠించెదరో వారి అజ్ఞానాంధకారము నశించును.

భక్తులగు వారలు శాంతచిత్తులు నిర్మలాంతఃకరణము కలవారు నా సేవయందు అనక్త మనస్కులు విమలజ్ఞానవంతులు యొక్క సహవాసమును ఎవరు చేసెదరో వారి చేతిలో మోక్షము సిద్ధముగా ఉన్నది. మఱియు వారి దృష్టికి నేను ఎప్పుడు ప్రకాశించెదను. దీనికి వినా ఇంకొక ఉపాయమువలన నాయొక్క దర్శనము లభ్యము కాదు.

ఇట్లు అధ్యాత్మ రామాయణంలోని అరణ్యకాండలోని చతుర్థ సర్గము సమాప్తము.

పంచమ సర్గము

# శంకరుడు పలికెను

సీతారామ లక్ష్మణులు పంచవటియందు వసించు కాలములో రామచంద్రుడు నిత్యము గోదావరి స్నానము చేయుచు ఆ ప్రాంత మందు భూభాగమునందు చరణములతో నడచుచుండెడి వాడు. రాముని పాదకమలములందలి వజ్రము, శంఖము, పద్మము మఱియు అంకుశ చిహ్నములు. భూమిపై యథాతథంగా ముద్రిత ములై యుండెడివి. ఆ ముద్రలను ఆ ప్రాంతమందలి రాక్షసి చూసి ఆ పురుషునితో రమింప నుద్దేశించి పాదముద్రలను సంకేతములుగా తీసికొని తిన్నగా పంచవటిలోని రామాలయమునకు జేరెను. అచ్చట రఘునాధుని సీతాసహితుని, శతకోటి మన్మథాకారుని జూచి కామ పరవశురాలై రామునితో నీవెవ్వడవు. నీవెవ్వని కుమారుడవు. నీ పేరేమి అని అడిగెను. జటావల్కలములను ధరించి యున్నావు. నీవేమి గోరి ఇచ్చటకు వచ్చావు. నేను రాక్షస రాజయిన రావణుని సోదరీని. కామరూపిణి రాక్షసిని నా పేరు శూర్పనఖ. నా సోదరుడు ఖరునితో సహా ఈ అరణ్యములో ఉంటున్నాను. రాజైన రావణుడు ఈ అరణ్యమునంతను నాకు అనుభవమునకు ఇచ్చినాడు. మునీశ్వరు లను తినుచు ఇచ్చట ఉంటున్నాను. నీవెవరివో తెలిసికోదలచినాను. నీ వివరములు తెలియపరచ గోరుతాను. అంత రాముడు తాను దశరథ మహారాజ కుమారుడననియు, ఈమె జనకుని కుమార్తె సీత నా భార్యయనియు వాడు మా తమ్ముడు మిక్కిలి అందగాడు. హే భువనసుందరి ! నీకు నాతో పని ఏముంది. చెప్పమని అడిగెను. అంత శూర్పనఖ హే రామ ! నీ విశాల లోచనములను నీ అంద మును చూచి నేను మోహితురాలనైతిని. నీతో భోగించుటకు ఇష్ట

పడుచున్నాను. ఈ కొండగుహలలోనికి రమ్ము. నిన్ను విడుచుటకు ఇష్టము లేదు. కామార్తురాలను. నీతో రమిస్తాను. రావణెనంటె రాముడు నవ్వుచు సీతమ్మవైపు చూచి ఈ నా భార్య మంగళదాయిని. సీతమ్మ నాకు ప్రియురాలు. నీకు సవతిదుఃఖము కలుగును. అందు వలన మా తమ్ముడు మిక్కిలి అందగాడు బయట నున్నాడు. నీకు అనుకూలంగా ఉంటాడు. నీకు యోగ్యుడైన భర్త కాగలడతడు. అంత శూర్పనఖ లక్ష్మణుని సమీపించి నీవు నాకు భర్తవు కావాలి. మీ అన్నగారు చెప్పినారు. మనమిప్పుడు సంగమించుదాం అని కామతాడితయై శూర్పనఖ లక్ష్మణుని సంభోగం కొఱకు ఆహ్వానించింది. అంత లక్ష్మణుడు నేను బుద్ధిమంతుడైన రామునియొక్క సేవకుడను, దాసుడను నన్ను పెండ్లాడితే నీవు దాసివి అయిపోతావు. అంతకంటె దుఃఖమేమున్నది. అతనినే నీవు పొందుట మంచిది. అతడు రాజు, స్వతంత్రుడు, అఖిలేశ్వరుడు దుష్టచిత్తురాలైన శూర్పనఖ తిరిగి రాముని దగ్గఱకు వెళ్లి హే రామ! నీవు నన్ను ఇటు అటు ఎందుకు త్రిప్పుచున్నావు. ఇప్పుడే నీఎదుటనే సీతను భక్షిస్తాను అని పలికి భయంకరమైన రాక్షసి రూపమును ధరించి సీతవైపు పరుగులిడెను. లక్ష్మణుడు రాముని ఆజ్ఞ తీసికొని కత్తితీసి శూర్పనఖ ముక్కు, చెవులు కోసివేసెను. అంత విపరీత శబ్దమును కావించి రక్తము ధారలతో ఖరునిఎదుటపడి వచ్చినది. ఖరుడు నీకు ఎవడు ఈ విధమైన అపచారము చేసినాడు. వానికి మృత్యువు సమీపించినది. యముడైనా చంపివేస్తాను. చెప్పు ఎవరు నీకీ విధమైన మానభంగము చేసినారు? అంత శూర్పనఖ రాముడట సీతాలక్ష్మణ సమేతుడైన దండకంలోనికి వచ్చాడు. రాక్షస కులమును నాశనం చేయడానికి వచ్చేడట వాని తమ్ముడు లక్ష్మణుడు నా ముక్కు, చెవ్వులు కోసి నన్నవమాన పరిచాడు. నీలో రాక్షసరక్తం అంటూ ఉంటే నీవు శూరుడవైతే శత్రువులయిన రామలక్ష్మణులను చంపివేయుము. వాళ్ల రక్తము తాగుతాను. ఏ పని చేయకపోతే ప్రాణములను

వదిలియు మునిదగ్గఱకు వెళ్లెదను. అంత ఖరుడు మహాభయంకర రాక్షసులను పదునాలుగు వేలమందిని రాముని దగ్గఱకు పంపెను. వారందరు అన్ని విధములైన ఆయుధములను ధరించి రాముని సమీపమునకు చనిరి. ఈ కోలాహలమును విని రాముడు లక్ష్మణుని తో చాలా పెద్ద ధ్వని వినపడుచున్నది. నిశ్చయంగా రాక్షసులు యుద్ధమునకు వచ్చుచుంటిరి. ఇప్పుడు మహాయుద్ధము నాతో వారలకు జరుగుతుంది. సీతను తీసికొని నీవు గుహలో ప్రవేశించి యుండుము. మహాబలులైన రాక్షసుల నందరిని నేనే చంపదలచి నాను. ఇంక నీవేమియు మాట్లాడవద్దు. మాట్లాడితే నామీద ఒట్టు. అంత లక్ష్మణుడు అటులనే అని సీతను తీసికొని గుహలోనికి ప్రవేశించెను. రాముడు పరికరమును బంధించి ఘోరమైన ధనుస్సును స్వీకరించి అక్షయ తూణీరములను ధరించి యుద్ధమునకు సన్నద్ధుడాయెను. అంత రాక్షసులందరు నానావిధములైన ఆయుధములను, చెట్లను, రాళ్లను రామునిపై విసరిరి. వాని నన్నిటిని రాముడు దును మాడెను. నూలగింజలను రాసినట్లు క్షణకాలములో దునిమెను. వెయ్యి బాణములతో పదునాలుగువేల రాక్షసులను సంహరించెను. ఖరుని, త్రిశిరసుని, దూషణుని అర్ధచంద్రాకార బాణముతో కొట్టెను. సీతను తీసికొనివచ్చి లక్ష్మణుడు రాముని ప్రశంసించెను. సీత రాముని ఆలింగనము చేసికొని శరీరమందలి శస్త్రములవలన కలిగిన పుండ్లను చేతులతో తుడిచెను. శూర్పనఖ రాక్షసశ్రేష్ఠులందరు చంపబడుట చూచి లంకానగరమునకు పరుగులిడెను. రాజసభలో కొలువు చేయుచున్న రావణుని పాదములపై పడెను. భయభ్రాంత యైన శూర్పనఖను జూచి రావణుడు లేవదసి ఓదార్చి నీకి వికృతరూప మును కావించినవాడు ఇంద్రుడా, యముడా, వరుణుడా, కుబేరుడా చెప్పు వానిని ఒక్క క్షణంలో భస్మీభూతం చేస్తాను. రాక్షసి యైన శూర్పనఖ ఓరి మూర్ఖుడా! నీవు ప్రమత్తుడవై యున్నావు.

మద్యం త్రాగుచు స్త్రీలోలుడవై, నపుంసకుడువలె ప్రవర్తిస్తున్నావు. చారచక్షువులు లేని నీవు ఏ విధంగా రాజనిపించు కుంటావు. (రాజావో చారచక్షుషః అని శాస్త్రము). ఖర, దూషణ త్రిశిరలు ముగ్గురు రణంలో చచ్చిపోయారు. పదునాలుగువేల మంది రాక్షసులు యుద్ధములో చచ్చిపోయినారు. రాక్షసశత్రువైన రామునిచేత చంపబడ్డారు. జనస్థానము నంతటిని మునీశ్వరులకు భయం లేకుండ చేయబడినది. నీవు మూర్ఖుడవని అందుకే అంటునాను. నీ రాజ్యంలో జరిగింది. నీ రక్షకభటులకు గాని నీకుగాని తెలియదంటే నీ రాజరికమంతా భ్రష్టుపట్టిందని అనుకోక తప్పదు. అంత రావణుడు ఎవడీ రాముడు దేనికొఱకు ఏ విధంగా ఎందుకొఱకు రాక్షసులను చంపి వేసినాడు. వృత్తాంతమంతయు లెస్సగా చెప్పుము. వానిని సమూలంగా అంత మొనరిస్తానని చెప్పెను.

అంత శూర్పనఖ చెప్పెను. జనస్థానంలో పంచవటి కలదు. అందు మునీశ్వరు లుంటారు. ఆ పంచవటిలో రాజీవలోచనుడైన రాముడు నాకు కనపడ్డాడు. ధనుర్బాణములను ధరించి యున్నాడు. జటలను నారబట్టలను ధరించి యున్నాడు. అవిధంగానే అతనికంటె చిన్నవాడు లక్ష్మణుడున్నాడు. రాముని భార్య విశాలాక్షి అపరలక్ష్మీదేవివలె ఉంది. దేవగంధర్వ నాగకన్యలలో అటువంటి అందగత్తె ఇదివఱకు చూడబడలేదు. వినబడలేదు. ప్రసిద్ధిని పొందలేదు. వనమంతా ఆమె కాంతిచేత ప్రకాశమాన మగుచున్నది. ఆమెను నీకొఱకు నీకు భార్యగా చేద్దామని నేను ప్రయత్నించాను. లక్ష్మణుడు రాముని తమ్ముడు నా ముక్కు, చెవులను కోసినాడు. నేను మహాదుఃఖముతో ఖరునిదగ్గఱకు వెళ్లినాను. ఖరుడు తమ యావన్మంది రాక్షసులతో క్షణములో చచ్చిపోయాడు. త్రిలోకములను కూడ అర్ధనిమిషములో రాముడు తలచుకుంటే భస్మీభూతం చేయగలడని ఇందులో సందేహమునకు అస్కారము లేదని నా బుద్ధికి

అనిపిస్తోంది. ఆమె నీ భార్య అయితే నీ జీవితము సఫలమవుతుంది. అందువలన ప్రయత్నం చేయుము. నీకే విధముగా ఆమె భార్య కాగలదో. సర్వలోకైక సుందరి రాజీవపత్రాక్షి సీత నీకు దక్కి తీరాలి. సాక్షాత్ రామునిఎదుట నీవు నిలపడే శక్తి కలవాడవు గావు. మాయచేత రామున్ని మోహింపజేసి సీతను పొందుము. అని ఊరకుండెను.

అంత రావణుడు ఆమెను ఓదార్చి కట్నాలు కానుకలు ఇచ్చి తన అంతఃపురమునకు రావణాసురుడు వెళ్లెను. చింతావ్యాకులుడై రాత్రియందు నిద్రను పొందలేదు.

ఒక్క రామునిచేత మనుష్య మాత్రునిచేత నా సోదరుడు ఖరుడు సమస్త భయంకర రాక్షసపటలంతో యుద్ధములో నశించెను. లేక రాముడు మనుజుడు కాడేమో, సాక్షాత్ పరమాత్మయేమో పూర్వము బ్రహ్మగారిచేత ప్రార్థితుడైన నన్ను చంపుటకు మనుష్య రూపంలో రఘుకులమందు పుట్టినాడా. నేను ఆ విధంగా చంపబడ వలసియుంటే వైకుంఠ రాజ్యమును పరిపాలిస్తాను. పరమాత్మచేత చంపబడి లేనిచో ఈ రాక్షస రాజ్యాన్ని పరిపాలిస్తాను చిరకాలం. అందువలన రామున్ని పొందవలసిందే. రాక్షసాధీశుడైన రావణుడు ఈ విధంగా బాగా ఆలోచించి రాముడు సాక్షాత్ శ్రీమన్నారాయణుడే విరుద్ధభావంతో శత్రుభావంతో హరిని పొందుతాను. భక్తిచేత భగవంతుడు తొందరగా సాక్షాత్కారము నివ్వడు, ప్రసన్నుడు కాదు.

ఇట్లు అరణ్యకాండలోని పంచమ సర్గ సమాప్తము.

—ు

# షష్ఠ సర్గము

ఈ విధముగా రాత్రి ఆలోచించి ప్రభాతకాలమందు బుద్ధి మంతుడైన రావణుడు తన మనస్సులో ఏదో కార్యమును నిశ్చయించుకొని రథమునెక్కి సముద్రమునకు అవతలి తటమందున్న మారీచి ఆశ్రమమునకు జనెను. మారీచుడు సమాధిలో ఉండి జటా వల్కలములను ధరించి నిర్గుణుడైన పరబ్రహ్మను ధ్యానము చేయుచుండెను. సమాధి అనంతరమునందు రావణుడు ఇంటికి వచ్చినట్లు తెలుసుకొని ఆలింగనం చేసికొని పూజచేసి అతిథిసత్కారము చేసి సుఖాసీనుడైన రావణునితో మారీచుడిట్లు పలికెను. రావణా ! నీవేదో మనస్సులో చింతాక్రాంతుడవై ఒక ప్రయత్నం కొఱకు వచ్చినట్లు అగపడు చున్నావు. నాకు చెప్పు. పాపములేని పనియైతే తప్పక చేస్తాను. న్యాయపరంగా కార్యముండాలి. అంత రావణుడుప క్రమించెను.

అయోధ్యాధిపతియైన దశరథుడు కలడు. అతని జ్యేష్ఠ కుమారుడు సత్యపరాక్రముడు రాముడు. వానిని లక్ష్మణ సహాయంతో భార్యతో సహా దశరథుడు అరణ్యమునకు పంపెను. లక్ష్మణుడు అతనిని అనుగమించెను. ఘోరమైన పంచవటి వనమందు ప్రస్తుతమున్నాడు రాముడు. అతని భార్య త్రిభువనసుందరి సీత కూడ ఉన్నది. రాముడు అపరాధము చేయని నా రాక్షస సమూహము నంతను ఖరున్ని కూడ చంపివేసి సుఖంగా అరణ్యంలో ఉన్నాడు. నిర్భయంగా నా సోదరి శూర్పనఖ యొక్క కండ్లు, ముక్కులను కోయించెను. అందువలన నీ సహాయంతో రాముడు లేని సమయములో రాముని భార్య సీతను అపహరిస్తాను. నీవు మాయా మృగ వేషధారివై రామున్ని, లక్ష్మణున్ని దూరంగా తీసికొని వెళ్తావు. ఆ సమయంలో సీతను నేను అపహరిస్తాను. అని అనెను

అంత మారీచుడు నీకిది యెవరు చెప్పిన ఆలోచన. సమూలంగా నాశనమైన పనియిది. ఈ దురాలోచనను నీకు చెప్పినవాడు నిశ్చయంగా నీకు శత్రువయి యుండాలి. వాన్ని చంపాలి ముందు. రాముని పౌరుషం వింటూఉంటే ఇప్పటికికూడ నాకు భయోత్పాత ములు కలుగుచున్నవి. బాలుడుగా ఉన్నప్పుడు విశ్వామిత్రి యాగ సంరక్షణమునకు వచ్చి ఒక్క బాణంతో నూరు యోజనముల దూరము చిమ్మి నన్ను సముద్రములో పడతోసినాడు. ఆనాటినుండి ఆ కథనే తలచుకుంటూ రామున్నే స్మరణచేయు చున్నాను.

దండకారణ్యము నందు కూడ రామునితో నాకుగల పూర్వ వైరమును మనస్సులో పెట్టుకొని మిక్కిలి కఠినములు వాడిగల కొమ్ములను ధరించి మిగతా మృగములతో కలసి వెళ్లితిని. సీతారామ లక్ష్మణులను మహాపరాక్రమంతో చంపుటకు వెళ్లితిని. అప్పుడుకూడ రాముడొకే ఒక బాణమును నాపై ప్రయోగించెను. ఆ బాణకాడ నంతో నేను వెళ్లి ఆకాశమంతా తిరిగి తిరిగి సముద్రములో పడి పోతిని. ఆ దినమునుండి భయకంపితుడనై ఎవరికి కనపడకుండ ఇచ్చట నిర్భయమైన స్థలంలో కాలం గడపుచున్నాను. రాజ్య, రత్నము, రమణి, రథము మున్నగు భోగసామాగ్రిలోని ఏ ముందు అక్షరమును విన్నను నాకు భయము కలిగి కంపం పుడుతోంది. రాముడు వచ్చుచున్నాడను భీతితో బయటపనుల నన్నిటిని మాను కున్నాను. నిద్రలో కలలో కూడ రామున్నే స్మరించు చున్నాము. స్వప్నంలో రాముడు కనపడితే మరి నిద్ర పట్టదు. అందువలన నీవుకూడ రామునియందు పగమాని వచ్చినదారిలోనే ఇంటికి వెళ్లుట మంచిది. రాక్షసకులాన్ని అనాదిగా ఉన్నదాన్ని రక్షించు. రామున్ని వైరభావంతో స్మరిస్తే సర్వనాశనం సంభవిస్తుంది. నీకు హితముకోరి పలికితిని. పరమాత్మయైన రామునియందు వైరము విడిచిపెట్టు. భక్తితో భజన చేయుము. రాముడు దయాసముద్రుడు. నేను పూర్వము మునీశ్వరుల నుండి విన్నాను. బ్రహ్మగారి ప్రార్థనచే

శ్రీహరి ఏమి కావాలని యడిగిరి. నీవు మానుషశరీరమును ధరించి దశరథ గర్భమందు పుత్రుడుగా జన్మించవలె ననియు, దశకంఠుని చంపవలె ననియు బ్రహ్మగారు వేడిరి. అందుచేత రాముడు మానవుడు కాడు. సాక్షాన్నారాయణుడే రాముడు. మాయామానుష వేషముతో భయిం లేకుండా అరణ్యంలో సంచరించు చున్నాడు. భూభారహరణమునకు పుట్టిన శ్రీహరి రాముడు. అదుచేత తాత నీవు ఇంటికి సుఖముగా మరలి వెళ్లిపో అనెను. అంత రావణుడు మారీచునితో ఇట్లనెను. మారీచ నీవన్నట్లు రాముడు పరమాత్మయు, సాక్షాత్ శ్రీమన్నారాయణుడ్డై ననాడు, బ్రహ్మగారి ప్రార్థనను అంగీకరించి మాయామానుష వేషమును స్వీకరించి వచ్చినచో సత్యసంకల్పుడైన పరమేశ్వరుడు తన కార్యమును తాను తప్పకుండా చేస్తాడు. అందుచేత నేను ప్రయత్నము చేసి సితను రాముని నుండి హరిస్తాను. యుద్ధంలో వధను స్వీకరించి పరమపదమును పొందుతాను. ఒకవేళ నేను రామున్ని యుద్ధములో చంపినట్లయితే నిర్భయుడనై సీతను పొందుతాను. అందువలన ఓ మహాభాగ నీవు లెమ్ము. నీవు. మాయలేడి వేషమును గైకొనుము. రామున్ని లక్ష్మణునితో కూడ ఆశ్రమానికి చాలాదూరము తీసికొని వెళ్లుము నా పనిని చేసిన తరువాత నీవు నీ ఆశ్రమమునకు వచ్చి సుఖముగా ఉండుము. ఇంతకు మించి మారుమాట పలికేవో ఇచ్చటనే ఇప్పుడే ఈ కత్తితో నిన్ను చంపేస్తాను. అంత మారీచుడు తన అంతరంగమందు రాముడు నన్ను చంపివేసినచో నేను ముక్తుడ నగుదును. ఈ దుష్టుడైన రావణుడు చంపినచో నరకము వస్తుంది అని ఆలోచించి బహిర్గతంగా ఓ ప్రభో రాజా! నీ ఆజ్ఞను పాలిస్తాను. అని పలికి రథమెక్కి రామాశ్రమమునకు చనెను. స్వచ్ఛమైన బంగారు వర్ణము, వెండివలె మెరిసే మచ్చలు, రత్నములు కొమ్ములు గలదియు, మణులు డెక్కలుగా గలదియు, మెరుపువంటి దేహకాంతి గలది చక్కని ముఖము గల లేడి అయిపోయి వనాంతరమందు

సంచరించెను. రామునియొక్క ఆశ్రమస్థానమందు సీతమ్మ కండ్లకు కనుపించులాగున సంచరించు చుండెను. ఓ క్షణం పరుగిడుచు, ఓ క్షణం కూర్చొంటూ దగ్గఱకు వచ్చి భయముతో తిరిగి పరుగిడుచు మాయామృగ వేషధారియైన మారీచుడు సీతను మోహింపజేసెను.

ఇట్లు అరణ్యకాండలోని ఆరవ సర్గము సమాప్తము.

---

స ప్త మ స ర్గ ము

# మా రీ చ వ ధ - సీ తా ప హ ర ణ ము

## శంకరుడు భవానితో పలికెను

శ్రీరాముడు రావణాసురుని మాయా నాటకమును ఎరింగిన వాడై సీతను ఏకాంతముగా పిలిచి అనెను.

రావణుడు భిక్షుకుని రూపంలో, నీ సమీపమునకు వస్తాడు. అందుచేత నీవు నీ ఛాయారూపమును, నీలాగే ఆకారము కలదానిని ఆశ్రమంలో వదిలిపెట్టి అగ్ని యందు ప్రవేశించుము. ఇది నా యాజ్ఞ. ఒక సంవత్సరమట్లు అగ్ని యందుండుము. రావణుని చంపిన తరువాత నీవు పూర్వమువలె వుండెదవు. రాముడు చెప్పిన మాట విని సీత ఆ విధముగా అట్లు జేసెను. మాయా సీతను బయటకు ఉంచి తాను అగ్నియందు ప్రవేశించెను. మాయ సీత మాయమృగ మును చూచి నవ్వుచు రాముని దగ్గఱకు వచ్చి వినయముతో పలికెను.

రామ ఈ వింత లేడి బంగారురంగు కలిగియుండి రత్న భూషి తంగా ఉంది. మంచి మచ్చలలో ఉంది. దీని బంధించి నాకిమ్ము. ఇది నాకు క్రీడామృగము (అనగా ఆడుకునే లేడి) అగు గాక. అటులనే అను రాముడు ధనుస్సును పట్టుకొని లక్ష్మణునితో పలికెను. లక్ష్మణ ! నా ప్రాణవల్లభయైన సీతను నీవు కాపాడాలి. ఈ అరణ్యంలో మాయారాక్షసులు వికృతాకారులు ఉన్నారు. అందు చేత నీవు ఏమరుపాటు లేకుండా సీతమ్మను కాపాడుము అనెను. అంత లక్ష్మణుడు ఇది మృగము కాదు. మాయలేడి ఆకారమును

ధరించిన మారీచుడు వీడు. ఈ విధమైన లేడిఉండుటకు అస్కారము, లేదు. అంత శ్రీరాముడు పలికెను.

వీడు నిజంగా మారీచుడే అయితే వీనిని చంపి తీరుతాను. ఇందులో సంశయము లేదు. లేడి అయితే సీతతో ఆడ కుఁడుటకు తీసికొని వస్తాను. నీవు పూనికతో సావధానంగా ఉండు. సీతమ్మను కాపాడు మనస్సుతో అని చెప్పి రాముడు మాయామృగము వెంట చనెను. జగదాకారంగలో ఉన్న ఈ మాయ ఎవని యధీనములో ఉన్నదో, లోకమోహకమై క్రియలను చేయుచున్నదో అట్టి మాయకు ఆశ్రయభూతుడైన రాముడు లేడివెనుక పడినాడో శ్రీహరి భక్తాను కంపి యని ప్రసిద్ధుడు గదా! (భక్తాను కంపీ భగవాన్) భక్తురాలైన సీతయొక్క మనోరథమును నెరవేర్చుటకు మృగము వెంటపడెను. లేకపోతే పూర్ణకాముడు, ఆత్మ నెరింగినవాడు అయిన రామునికి, పరమాత్ముడయిన రామునికి అడదానితోకాని, లేడితోకాని పని ఏముంది? ఆ లేడి ఒకసారి కనపడుతుంది. ఒకసారి దూరంగా వెళ్లి పరుగులెత్తి మళ్లి మరుగవుతుంది. మళ్లీ దూరంలో కనపడుచు రాముని బహూదూరము తీసికొని పోయెను. అంత రాముడు ఇది నిశ్చయముగా రాక్షసుడని తెలిసికొని ఒక బాణంతొ కొట్టెను. బాణం తగలగానే మారీచు తన నిజరూపంతొ ముఖంనిండా రక్తం కార్చుచు భూమిమీద పడెను. అప్పుడు రాముని కంఠమును అను కరించుచు హా లక్ష్మణ! అని కేకలు వేసి నన్ను వేగంగా వచ్చి రక్షించు అని పలికెను. మరణ సమయమందు రామనామము చెప్పినంత మాత్రాన రామసాయుజ్యం పొందుతాడు. మారీచుడు రాముని ఎదుట రామునిచేత విడవబడిన బాణముచే చంపబడెనంటే వాని దేహమునుండి వచ్చిన తేజస్సు సర్వలోకములు చూచు చుండగా రామునినే పొందినది. దేవతలందరు ఆశ్చర్యము పొందిరి.

మునిహింసకుడు, రాక్షసుడు, పాపకర్మరతుడు అగు మారీచుడెచ్చట రామసాయుజ్యమును పొందుటెచ్చట లేక ఇది శ్రీరాముని మహిమ అయియుంటుంది. మారీచు పూర్వకాలమందు రామబాణము తగిలి భయభీతుడై దానినే స్మరించుకొనుచు స్వప్నంలో కూడ రామున్ని తలంచుచు ఈషణత్రయమును వదిలిపెట్టి రామున్ని హృదయంలో ఎల్లప్పుడు ధ్యానంచేస్తూ అంత్యకాలంలో రామునిచేత చంపబడి నాడు. రామున్ని చూస్తూ రామునిలో ఐక్యము పొందాడు. బ్రాహ్మణుడే అగుగాక, రాక్షసుడగు కాక, పాపికానీ ధార్మికుడవనీ రామున్ని తలచుకుంటూ కళేబరమును వదిలినవానికి పరమపదము సంప్రాప్తిస్తుంది. అని దేవతలు పరస్పరము సంభాషించుకొని స్వర్గమునకు చనిరి. రాముడు రాక్షసుడైన మారీచుడు చచ్చిపోయే ముందు నావాగనుసారము "హా లక్ష్మణ" అని అనుటలో అర్థమే ముంది అని చింతాపరిక్రాంతుడై దూరమునుండి తిరిగి మళ్లెను.

దుర్మార్గుడైన మారీచుని సంభాషణమును విని భయాతురాలై దుఃఖపరివృతయై సీత లక్ష్మణుని గూర్చి పలికెను. లక్ష్మణ! మీ అన్న రాక్షసపీడితుడైనాడు. హా లక్ష్మణ! అని యన్నాడు నీవు వెంటనే వెళ్లు. నీకు అన్నగారి ఆర్తనాదం వినపడలేదా ?

అంత లక్ష్మణుడు అమ్మా! అది రామవాక్యము కాదు. ఒక రాక్షసుడు రాముని చేతిలో చంపబడి చనిపోయెముందు అట్లనెను. రాముడు కోపంవస్తే మూడులోకాలను నాశనం చేస్తాడు. దేవతల చేత పూజింపబడిన రాముడు దీనవాక్యమును పలుకుతాడా ?

అంత సీతమ్మ కోపముతో లక్ష్మణునివైపు చూచి కన్నుల యందు బాష్పములు రాగా దుర్బుద్ధితో కూడినవాడా! మీ అన్న గారికి కీడు ఇష్టపడుచున్నావు. రామున్ని నాశనము చేయుటకు భరతునితో పంపబడితివా ? రాముడు చచ్చిపోతే నీవు నన్ను ను

తీసికొనుటకు నీవు వచ్చేవు. నీవు నన్ను పొందలేవు. ఇప్పుడు చూడు. ప్రాణములను విడిచిపెట్టుచున్నాను రాముడు నీవు భార్యాపహరణ ప్రయత్నశీలివని ఎరుగడు. రామున్ని వినా నిన్ను ను గాని, భరతునిగాని నేను తాకను. ఈ విధంగా పలికి తన రెండు చేతులతో కొట్టుకొంటూ ఏడ్వనారంభించెను. ఆ మాటలను విని లక్ష్మణుడు తన రెండు చెవ్వులను చేతులతో కప్పి హేచండి. వన్ని విధంగా అవమానిస్తావా. నీకు నింద కలుగుగాక. నీకు నాశము అవహించినది. అని వనదేవతలకు సీతను అప్పచెప్పి మహాదుఃఖ ముతో రాముని జాడవైపు మెల్లమెల్లగా ప్రయాణము చేసెను.

ఇంతలో రావణుడు తనకు సదవకాశము దొరికిందని సంతో షించి భిక్షుకుని వేషమును ధరించి చేత కమండలమును ధరించి సీతా సమీపమునకు వెళ్లెను. సీత వానిని జూచి నమస్కరించి భక్తితో పూజచేసి కందమూల ఫలాదులను ఇచ్చి తినమని చెప్పి యథా సుఖంగా విశ్రాంతిని తీసికొమ్మనమని, ఇప్పుడే భర్తగారు వచ్చి నీకిష్టమును చేకూర్చెదరని ఇష్టమయితే కూర్చొనుమని చెప్పెను. అంత భిక్షకుడు ఓ కమలపత్రముల వంటి కన్నులు కలదానా నీవెవరివి? నీ భర్త ఎవరు? రాక్షస సేవితమైన ఈ వనమందు వాస మెందులకు? ఓ మంగళదాయిని నీయొక్క యావద్వృత్తాంత ముమ వినిపింపుము అనియెను.

అంత సీత తాను జనకనందిని యగు సీతననియు దశరథ తనయుడు రాముని ఇల్లాలుననియు, అతని తమ్ముడు లక్ష్మణు డనియు, పితాజ్ఞను పురస్కరించుకొని తాము వనములో పదునాలుగు సంవత్సరములు నివాసము చేయుటకు వచ్చితిమనియు చెప్పెను.

అంత భిక్షుకుడు పౌలస్త్యుని కుమారుడు రావణుడ ననియు, రాక్షసాధిపతి యనియు చెప్పుచు సీతతో ఇట్లనెను. నీయుండలి

కామమువలన పీడితుడను నిన్ను లంకాపురమును తీసికొని వెళ్లు టకు వచ్చితిని. ముని వేషుడైన రామునితో ఏమి చేయగలవు ? నన్ను పొందు. నాతోపాటు భోగములను అనుభవింపుము. వనవాస సంబంధమైన దుఃఖమును విడిచి పెట్టుము. అని అనెను. వాని వాక్యములను విన్న సీత భయపడి ఇట్లనియెను. నీవీధంగా మాట్లాడినావంటే రామునివలన నాశమును పొందుతావు. ఒక్కనిమి షం ఉండు. రాముడు కూడ వస్తాడు. తమ్ముడు లక్ష్మణునితో కూడ. నన్ను బలాత్కారం చేయగల సమర్థుడు లేడు. సింహపత్నిని కుందేలు తాకగలదా. రామబాణములతో కొట్టబడిన వాడవై నీవు భూమిమీద పడిపోతావు. అని పలికిన విని రావణుడు క్రోధముతో గ్రుడ్డివాడై మహాపర్వతాకార సదృశమైన తన రూపమును చూపె ట్టెను. పది ముఖములు, ఇరువది భుజములు, కాలమేఘము వంటి శరీరకాంతి కలిగిన వికృతరూపమును ప్రదర్శించెను ఆ రూపమును చూచి వనదేవతలు భూతములు కూడ భయపడినవి. ఆ తరువాత భూమిని గోళ్లతో చీల్చి చేతులతో ఆ భూభాగమును పట్టుకొని రథములో పెట్టి వెంటనే ఆకాశ మార్గములో ఎగిరెను. హా రామ, హా లక్ష్మణ అంటూ సీత భూమివైపు చూచుచు ఏడ్చుచుండెను. జటాయువు ఆ ఆక్రందనను విని కొండ శిఖరము నుండి ఎగిరి నిలపడు నిలపడు అంటూ ఎవడు నేను ఉండగా నా ఎదుటనే వెళ్లుచున్నాడు. లోకనాథుని భార్యయైయిన సీతమ్మను దొంగిలించి కుక్కమంత్రపూతమైన పురోడాశమును అపహరించినట్లు పట్టుకువెళ్లు చున్నాడు. అని పలు కుచు వాడియైన ముక్కుతో రావణరథమును ముక్కలు ముక్కలు చేసెను. పాదములచేత గుర్రములను నరికెను. ధనుస్సును ముక్కలు చేసెను. అంత రావణుడు సీతను విడిచిపెట్టి ఖడ్గముతీసి జటాయువు యొక్క రెక్కలను నరికెను. అంత జటాయువు కొనఊపిరితో భూమిమీద పడిపోయెను. రావణు డింకొక రథముపై సీతను తీసి కొనివెళ్లి అంతరిక్షమునందు వాయువేగముతో చరించుచుండెను.

హా రామ, హా లక్ష్మణ అంటూ సీత ఏడ్చుచుండెను. హా లక్ష్మణ నన్ను అపరాధినిని రక్షింపుము. నాయొక్క వాక్కులనే బాణములచే కొట్టబడితివి. నన్ను క్షమించుము మరది అని ఏడుస్తూ క్రిందికి చూచింది. ఓ కొండమీద ఐదుగురు కోతులను చూచింది. పయటబట్టలోని నగభాగమునందు ఆభరణములను కట్టి వానరులున్న కొండమీద పడవైచెను. రాముని కొఱకు చెప్పండి అని పడవేసెను.

అంత రావణుడు సముద్రమును దాటి లంకను పొంది అశోక వనంలోని అంతఃపురములోని ఒక భాగములో రాక్షస స్త్రీలను కాపుంచి తల్లి భావనతో ఆమెను ఉంచెను. అచ్చట సీత దీనవదనయై కృశించి మిక్కిలి భయార్తురాలై హా రామ! హా రామ! అని విలపిస్తూ ఉండెను.

ఇట్లు అధ్యాత్మ రామాయణంలో అరణ్యకాండలో ఉమా మహేశ్వర సంవాదమందలి సప్తమ సర్గ సమాప్తము.

## ఎనిమిదవ సర్గము

# శంకరుడు పలికెను

కామరూపి మాయావి అయిన మారీచుని పరిమార్చి రాముడు తన యాశ్రమమువైపు బయలుదేరెను. అంత దీనముఖంతో దీనముగా వచ్చుచున్న లక్ష్మణుని చూచి ఆత్మలో మహాబుద్ధిమంతుడైన రాముడు చింతించెను. నాచేత మాయాసీత చేయబడిందని లక్ష్మణునకు తెలియదు. నాకు తెలిసినప్పటికి లక్ష్మణునికి తెలియనీయకుండా పామరుడువలె శోకిస్తాను. నేనే మౌనంగా ఇంట్లో కూర్చుంటే ఏమీ నటించకుండా కోటానుకోట్ల రాక్షసుల సంహారమెట్లు జరుగును. దుఃఖమును నటించి శోకించినచో కాముకుడులాగున నటించి సీతాన్వేషణ మిషతో రాక్షస లోకానికి వెళ్లవచ్చును. ఫలితంగా రావణుని చంపివేసి అగ్నిహోత్రుడు నాచేతనే ఉంచబడిన సీతను తీసికొని వెంటనే అయోధ్యకు వెళ్లెదను. బ్రహ్మగారు నన్ను మనుష్యభావమును పొందమన్నారు. కాన నేను కూడ మనుష్యునివలె కొంతకాలం నివసిస్తాను. అప్పుడు భక్తిభావంలో ఉన్న మానవులు మాయామానుష రూపగాథను విని తొందరగా ముక్తిని పొందుతారు. ఈ విధంగా స్వగతంలో నిశ్చయించుకొని ఎదురుకుండా ఉన్న లక్ష్మణుని చూచి ఇట్లనెను. నాకిష్టురాలైన భార్యను సీతను విడిచిపెట్టి నీవెందుకు వచ్చినావు. సీతను రాక్షసు లెత్తుకొని పోయినారో లేక తిని వేసినారో ఏమో ఎంత పని చేసితివి అని అనెను.

అంత లక్ష్మణుడు అంజలిఘటించి ఏడుస్తూ సీతమ్మ అన్న దుష్టవాక్యములను మనవి చేసెను. ఆమె నేనెంత చెప్పినా వినలేదు.

హా లక్ష్మణ ! అని రాక్షసుడు పలికినాడు. రాముడు కాదు. నీకు రాముని గూర్చి ఏశంత అక్కరలేదు. స్వస్థురాలవై ఉండుము. అని నేను యదార్థము పలికితే సీతమ్మ నన్ను అనరాని మాటలు, నిందలు పలికి మనోవ్యధకు గురి చేసింది. ఆ మాటలు నీదగ్గఱ నేను తిరిగి చెప్పకూడదు. వేనే చెవ్వులు రెండు మూసుకొని ఆమె కఠోర నిందలు వినలేక బయటకు వచ్చి నిన్ను వెదకుచు వచ్చితిని. అనగా రాముడు, అయినప్పటికి నీవు చేసిన పని యోగ్యము కాదు. ఆడదాని కబుర్లను నిజమని నమ్మి నా ప్రియురాలైన సీతను విడిచి పెట్టితివి. రాక్షసులచేత అపహరింపబడినదైనా యుండాలి. లేక తిన బడినదైనా ఉండాలి. ఈపాటికి. ఇందులో సంశయము లేదు. అని త్వరితంగా పర్ణశాలకు జని అచ్చట జానకి కనపడకపోగానే భోరుమని విలపించెను. హే ప్రియురాల ! నీవెచ్చటకు వెళ్లితివి. పూర్వమువలె ఆశ్రమమందు లేవు. లేక నన్ను మోహింప జేయుటకు లీలచేత ఎచ్చటనైనా దాంకున్నావా ? అని వనమంతా వెదకి నా సీతను కను గొనలేక పోయెను. ఓ వన దేవతలారా ! నా సీత ఎక్కడ ఉందో చెప్పండి. ఓ మృగములారా ! ఓ పక్షులారా ! ఓ వృక్షములారా ! నా సీత ఎచ్చట ఉన్నదో చెప్పండి అని ఏడుస్తూ సీతను ఎచ్చట కూడ కనుగొనలేక పోయెను. అహో ఓ భగవంతుడా ! రాముడు ఆనందస్వరూపుడైనా సీతానిమిత్తము దుఃఖమును పొందుచున్నాడు. అతడు చలనములేని వాడయినప్పటికి ఇటుఅటు పరుగెత్తు చున్నాడు. నిర్మముడు, అహంకారము లేనివాడు అఖండానంద స్వరూపుడైనను నా భార్య అని, నా సీత అని దుఃఖముతో విలపిస్తున్నాడు. ఈవిధంగా అనక్తుడైనను మాయను అనుసరించి తిరుగుచున్న రాముడు మూర్ఖుల దృష్టిలో అనక్తుడుగా కనపడు చున్నాడు. తత్త్వవేత్తల దృష్టిలో అనక్తుడుగానే గోచరిస్తాడు.

**సీతమ్మను వెదకుచు తిరిగిన రథమును, విరిగిపోయిన**

బాణము, గొడుగును, రథముయొక్క కర్రను భూమిపై చూచి లక్ష్మణా!చూడుము. అపహరింపబడిన సీతను ఎవడో ఎదుర్కొని యుద్ధమందు శత్రువుచేత ఓడిపోయి యుంటాడు. అట్లూ మరికొంత దూరము వెళ్లేసరికి పర్వతాకారమైన రక్తముతో కూడిన శరీరముకల వానిని చూచి లక్ష్మణా! చూడు వీడే సీతను భక్షించి రహస్యంగా మిక్కిలి తృప్తితో నిద్రిస్తున్నాడు. చూడు. ఈ రాక్షసుని ఇప్పుడే చంపుతాను. అని బయటకు అనెను. ఆ మాట విని జటాయువు భయపడి నన్ను చంపకు. నేను నా కర్మచేత చంపబడినాను. నేను జటాయువును నీ భార్యను అపహరించిన వానిని ఎదుర్కొన్నాను. రావణుడుకు నాకు ఘోరమైన యుద్ధము జరిగింది. వాని గుర్రములను రథమును నేను భగ్నము చేసినాను. వాడు కత్తితో నా రెక్కలు నరికి వేసినాడు. భూమిమీద పడిపోయినాను. ప్రాణములను వదలుచున్నాను. చూడు రామ! నన్ను జగన్నాథ అని చెప్పెను. కంఠగత ప్రాణునిగా జటాయువును రాముడు సందర్శించెను. దుఃఖముతో నిండిన నేత్రములు కలవాడై తన రెండు చేతులతో జటాయువు శరీరమును స్పృశించి హే జటాయూ! నా భార్య అయిన సీత ఎవనిచేత అపహరింప బడినది. నా కార్యము కొఱకు నీవు నీ జీవితమును బలి యిచ్చినావు. నీవు నా ప్రియబంధువువు. అంత జటాయువు అతిదీనమైన స్వరముతో పలికెను. భయంకర పరాక్రమము కల్గిన రావణుడను రాక్షసుడు సీతను అపహరించి దక్షిణదిక్కుగా వెళ్లిపోయెను. ఇంతకంటె చెప్పుటకు నాకు శక్తి చాలదు. నీ సమక్షమందు ప్రాణములను వదిలిపెట్టు చున్నాను. చచ్చిపోతున్న నాకు రామ నా పూర్వపుణ్యము వలన కనపడ్డావు. నీవు పరమాత్మవు, విష్ణువవు, మాయామానుష రూపధారివి. అంత్యకాలంలో నాకు కనుపించావు. నేను ముక్తుడనయితిని. నీ చేతులతో నన్ను ముట్టుకో తిరిగి నీ పదమును పొందుతాను. అటులనె అని

రాముడు జటాయు శరీరమును స్పృశించెను. అంత జటాయువు ప్రాణములను వదలివేసి భూమిమీద పడిపోయెను. రాముడు జటాయువును ఆత్మబంధువుగా స్వీకరించి పరితపించి లక్ష్మణునిచేత తేబడిన కర్రలతో జటాయుశరీరమును కాల్చెను. లక్ష్మణుడు తాను స్నానముచేసి ఒక లేడిని చంపి దాని మాంసపుముక్కలను గడ్డిగల ప్రదేశములందు వేరువేరుగా పెట్టి పక్షులన్నియు తినమని చెప్పి జటాయువు తృప్తుడగు గాక. అని పలికి జటాయో నీవు నా పదమునకు వెళ్లుము. ఈ సమస్త లోకము చూచుచుండ నా సారూప్యమును ఇప్పుడే పొందుము. ఆ వెంటనే జటాయువు దివ్యరూపధరుడై సూర్యునివలె ప్రకాశిస్తు ఒక విమానముపై అధివసించి యుండెను. ఆ సమయములో దివ్యపీతాంబరములను ధరించి శంఖచక్ర గదాపద్మ కిరీటాది అలంకారములతో ప్రకాశించుచు అటువంటి వేషభూషణములు కల నలుగురు విష్ణులోక రక్షకులు అతనికి పూజలు సలుపుచుండిరి. యోగిజనము అతనిని స్తోత్రము చేయుచుండిరి. అంత అతడు రెండు చేతులు జోడించి రాముని స్తోత్రము చేసెను. జటాయువు స్తోత్రము చేసెను.

శ్రీరామచంద్రుని నేను ఎల్లప్పుడు నమస్కరించు చున్నాను. ఏ రాముడయితే ఉపరతి పరముడో, పరమాత్మయో, ఆనందమయుడో, లక్ష్మీకటాక్షములకు ఆశ్రయభూతుడో, బ్రహ్మ ఇంద్రుడు మున్నగు దేవతలయొక్క దుఃఖమును దూరము చేయుచున్నాడో, సుందర బాణచాపములను ధరించునట్టి నరవేషధారియైన, వరముల నిచ్చు వాడయిన రామున్ని నిత్యము నమస్కరించు చున్నాను. ముల్లోకములందు సుందర తమరూపధారి, సహస్రభాను సంకాశుడు కోటీకలను ఇచ్చువాడు, శరణు ఇచ్చే వాడు, ప్రేమ హృదయము లందు వసించువాడు అగు రఘురాముని శరణు వేడుచున్నాను.

సంసారమనే అరణ్యమునకు దావాగ్ని వంటివాడు, శంకరుడు మున్నగు దేవతలకు వందనీయుడు, దయాస్వరూపుడు, కోట్లాది రాక్షసులను చంపినవాడు యమునానది రంగువంటి రంగుగల శ్రీరాముని నేను శరణ పొందుచున్నాను. సంసారంలోనే మునిగి పోయి ఈషణత్రయముతో బాధపడువారలకు కనపడనివాడు, సంసార విముఖులైన మునీశ్వరులకు నిత్యము ఆరాధనీయుడు. సంసార సముద్రమునకు దాటుటకు నావయైనవాడు అగు రఘు రాముని నేను శరణు పొందుచున్నాను. శంకరుని యొక్కయు, భవానియొక్కయు మనస్సులందు నివాసముండు వాడు, గోవర్ధన పర్వతము నెత్తినవాడు అతి మనోహరమైన చరిత్ర గలవాడు, వాంఛలను నెరవేర్చుటయందు ఇష్టపడువాడు, దేవతలచేతను, రాక్షసరాజులచేతను పూజింపబడ్డ పాదపద్మములు కలవాడు. దేవత లకు వరముల నిచ్చే రఘురాముని నేను శరణు పొందుచున్నాను. ఇతరుల ధనమును ఇతరుల స్త్రీలను కోరనటువంటి వారు, ఇతరుల గుణములను సంపత్తును చూచి సంతుష్టి చెందువారలు ఇతరులకు ఉపకారమును చేయుటయందు ఎల్లప్పుడు అభిరుచి గలవారు అగు మానవులచేత ప్రశంసింపబడ్డ రామచంద్రుని నేను శరణు పొందెదను. మందహాసముచేత వికసించిన పద్మమువంటి ముఖము కలవాడు, భక్తుల కతి సులభుడు ఇంద్రనీల మాణిక్యమువలె దేహచ్ఛాయ కలవాడు. ఈశ్వరునికి గురువయిన, పరమ గురువయిన శ్రీ రఘు రాముని నేను శరణు పొందుచున్నాన. విష్ణువని, బ్రహ్మ అని, రుద్రుడని, సత్త్వరజస్తమోగుణ భేదముచే నీ ఒక్కడవే. అన్ని రూపములతో ప్రకాశించు చున్నావు సూర్యుడు జలము నిండిన పాత్రములందు ఒక్కడై అనేకుడుగా గోచరించు భంగి నున్న నిన్ను శరణు పొందుచున్నాను. దేవేంద్రుని స్తోత్రమునకు పాత్రుడ వయిన నిన్ను సేవించు చున్నాను. శతకోటి మన్మథాకారుడు,

లక్షలాది మార్గములందు దృశ్యమానమైన బావనకు దూరమైన వాడవు, యతీశ్వరుల హృదయములందు ఎల్లప్పుడు ప్రకాశించు వాడు, సంకటములను పోగొట్టు రఘుపతిని శరణు పొందు చున్నాను. ఈ విధంగా స్తోత్రము చేసిన జటాయువునకు రాముడు ప్రసన్నుడాయెను. హే జటాయు ! సుఖంగా వెళ్లు నీకు భద్రము జరుగుత. నీవు నా విష్ణుపదమును పొందెదవు. ఈ జటాయుకృత రామస్తోత్రమును ఎవడు వింటాడో లేక వ్రాస్తాడో భక్తితో పఠిస్తాడో వాడు నా సారూప్యమును పొందును. మరణ కాలమందు నా స్మృతిని పొందును. పక్షిరాజు జటాయువు రామునియొక్క అభయ కథను విని సంతోషించి రఘునందన సమానమైన రూపమును పొంది బ్రహ్మాదిదేవతలచేత పూజింపబడిన పరమపదమునకు చనెను.

ఇట్లు అరణ్యకాండ యందు అష్టమ సర్గము సమాప్తము.

## నవమ సర్గము

అమ్మ సీతమ్మ జాడ వెదకుచు వనము నుండి వనము తిరుగుచున్నాడు రాముడు. ఇంతలో భయంకరాకారుడు, గుండెల్లోనె ముఖము కలవాడు, కండ్లు చెవులు లేనివాడు, యోజన దూరము గల బాహువులు గలవాడు. సమస్త ప్రాణిహింసకుడు, కబంధుడనే రాక్షసుడు తన రెండు బాహువులందు రామలక్ష్మణులను ఇరికించెను. రాముడు నవ్వుచు లక్ష్మణునితో చెప్పెను. చూడు లక్ష్మణా! వీని వికృతాకారమును శిరస్సు లేదు. చేతులు లేవు. ముఖము గుండెల్లో ఉంది బాహువుల కందినదానినంతా తింటున్నాడు. నీవొక బాహువును నేనొక బాహువును నరికివేద్దాము. ఎందుకు విచారమన్నాడు లక్ష్మణుడు. అటులనే అని రాముడు ఖడ్గంతో కుడి బాహువును నరికివేసెను. ప్రతాపంతో లక్ష్మణుడు లీలగా ఎడమ భుజమును నరికివేసినాడు. దైత్యుడు ఆశ్చర్యము పొంది మీరు దేవతలా నా బాహువులను ఛేదింపగలవాడు స్వర్గములో దేవతలలో కూడ లేడు. అంత రాముడు తాను దశరథుని జ్యేష్ఠ పుత్రుడననియు, లక్ష్మణుడు తన తమ్ముడనియు నుడివెను. మఱియు తన భార్య సీతను ఎవడో రాక్షసుడు అపహరించెననియు ఆమెను వెదుక్కుంటూ అరణ్యంలో తిరుగుచున్నామనియు ఇంతలో నీవు మమ్ములను నీ భుజ మధ్యమందు ఇరికించగా నీ రెండు భుజములను ఛేదించితిమనియు సత్యమును పలికెను.

అంత కబంధుడు నీవు రాముడవయితే నేను ధన్యుడనైతిని. నేను గంధర్వ రాజును. సౌందర్య గర్వంతో అష్టావక్ర మహా మునిని పరిహసించితిని. స్త్రీలందరు వశులయినట్లు చక్కని రూప

మిమ్మని అడుగగా బ్రహ్మగారటులనే ఇచ్చిరి. అష్టావక్రుడు నన్ను రాక్షసుడయి పోయెదవని శపించెను. దయాళుడైన అష్టావక్రుడు శాపముయొక్క అంతమును కూడ చెప్పెను. త్రేతాయుగంలో సాక్షాత్ శ్రీహరి దశరథుని కుమారుడై జన్మించి నీ బాహువులను స్వయంగా నరికివేస్తాడు. అప్పుడే శాపవిముక్తి యని చెప్పెను. నేను గర్వంతో ఒకసారి దేవేంద్రుని వెంట పరుగులు చేసాను. అతడు వజ్రాయుధంతో నా తలమీద కొట్టాడు. అప్పుడు నా శిరస్సు, పాదములు కడుపులోనికి చొచ్చుకొని పోయినవి. దేవతలు ముఖము లేకుండ ఎలా జీవిస్తాడని ఇంద్రునికి నివేదించిరి. ఇంద్రుడు కడుపులో ముఖముంటుం దనియు, బాహువులు ఒక యోజనము పొడవుకలిగి యుంటాయనియు చెప్పి పంపెను. నాటినుంచి అరణ్యంలో తిరుగుచు బాహువుల కందిన జీవరాశులను తినుచు జీవించుచున్నాను. ఇప్పుడు నీవు బాహువులను ఖండించితివి. నీవు ఇప్పుడు చితి తయారుచేయుము. నేను అందులో దిగెదను. నీవు నన్ను చితిలో కాల్చివేయుము. అగ్ని దహనము తరువాత నాకు పూర్వ రూపం వుస్తుంది. అప్పుడు నీ భార్య ఎచ్చటఉన్నదో మనవి చేస్తాను. రాముడు లక్ష్మణ సహాయముతో రాక్షసుని చితిమీదపెట్టి కాల్చివేసెను. శతకోటి మన్మధాకారుడయి సమస్తాభరణ మండితుడై కబంధుడు దివ్యరూపమును ధరించి రామునికి ప్రదక్షిణ చేసి సాష్టాంగంగా నమస్కరించి చేతులు జోడించి భక్తితో కంపించు వాక్కులతో పలికెను. రామ ! నిన్ను స్తోత్రము చేయుటకు నా మనస్సు ఉత్సాహముతో చెప్పుచున్నది. నీవు మనస్సుకు, వాక్కులకు దొరకనివాడవు. అంతము లేనివాడివి. అది లేనివాడివి. నీ దేహము సూక్ష్మమైనది. అవ్యక్తమైనది. స్థూల సూక్ష్మ ద్వయము కంటె భిన్నమైనది. కంటికి గోచర మైనదంతా జడమైనది. ఆత్మ సంబంధమైనది కాదు. అటువంటప్పుడు జడమైన నా మనస్సు

నీ నిజస్వరూపమును ఎట్లు తెలిసికొనగలదు. బుద్ధికి చిదాభాసకు పరస్పరము ఐక్యత నొందినవాడు జీవుడు. ఈ బుద్ధికి సాక్షియైన వాడు బ్రహ్మ. విషయరహితుడైన బ్రహ్మయందు అజ్ఞానముచేత చరాచర జగత్తును ఆరోపించు చున్నారు. ఆ బ్రహ్మ మనస్సుకు గాని వాక్కులకు గాని అందదు నీ యొక్క సూక్ష్మదేహమును హిరణ్య గర్భుడనియు, స్థూలదేహమును విరాట్టనియు అంటారు. నీ భావనా మయమైన సూక్ష్మ శరీరమునందు త్రికాలములతో కూడిన జగత్తంతా కనపడుతోంది. నిన్ను ధ్యానముచేసిన వారలకు శుభప్రదమగు తోంది.

నీ స్థూల దేహము నీయొక్క తత్త్వములతో ఏడు ఆవరణలు కలిగి యున్నది. భూః, భువః, స్వః, మహః, జనః, తపః, సత్యః అనునవి తనంత తానుగా జన్మించిన ఆత్మకు ఏడు ఆవరణలు. (ఆవరణలు అనగా వైశాల్యముతోకూడిన స్థలములని ఊహించవచ్చు)

ఇది విరాట్టుకు నిలయమైన ఇల్లు. అనగా స్థూల రూప దేహ ధారికి ఇల్లు లేక కేంద్రము. ఏడు ఆవరణలకు బయట నాలుగు ప్రక్కల భూమి తేజస్సువలన పుట్టిన అండము. ఇది పదునాలుగు భువనముల కంటె పదిరెట్లు అధికము. ఈ అండమునకు భూమి ఆవరణ. అండము కంటె భూమి పదిరెట్లధికము. ఈ భూమికి ఆవ రణ జలము. ఈ జలము భూమికంటె పదిరెట్లధికము. జలమునకు ఆవరణ తేజస్సు లేక అగ్ని. ఈ అగ్నికి ఆవరణ వాయువు. వాయువుకు ఆవరణ ఆకాశము. ఆకాశమునకు ఆవరణ అహం కారము. అహంకారమునకు ఆవరణ మహతత్త్వము. ఇందులో ఒక్కొక్కటి తమ్ము కాశయమైన భూమికంటె పదిరెట్లధికము. పృథి వ్యా పస్తేజో వాయురాకాశములలో ఉన్నది. సూక్ష్మమైన పృథివి. స్థూలమైనది కాదు.

(ఇది ఆవరణ వివరణము పురాణములందు అంగీకరింప బడినది).

ఓ రామా ! నీవే సర్వకైవల్యము లోకములు నీ అవయవములు. పాతాలలోకము నీ చరణతలము. మహాతలము నీయొక్క పార్ష్ణి. రసాతలము గుల్ఫములు అనగా చరణ సంధులు. తలాతలము నీ యొక్క మోకాళ్లు (మునుకులు). సుతలము నీయొక్క పిక్కలు. వితలము నీయొక్క రెండు తొడలు. అతలము మఱియు భూమి నీయొక్క జఘనము అనగా కటి ప్రదేశము. భూలోకము నీయొక్క బొడ్డు. స్వర్లోకము నీ వక్షస్థలము. మహర్లోకము నీయొక్క మెడ లేక కంఠము. ఓ రామా ! జనలోకము నీ ముఖము. నీ లలాటమే తపోలోకము. సత్యలోకము నీయొక్క శిరస్సు. ఇంద్రాది లోకపాలకులు నీయొక్క భుజములు. దిక్కులు నీయొక్క చెవ్వులు. అశ్వినీ కుమారుడు నీయొక్క ముక్కు. అగ్ని నీయొక్క నోరు. అని చెప్పబడింది. నీయొక్క కన్ను సూర్యుడు. నీయొక్క మనస్సు చంద్రుడు. నీ కనుబొమలు కాలుడు బృహస్పతి నీయొక్క బుద్ధి. ఓ వికారములు లేని రామా ! రుద్రుడు నీయొక్క అహంకారము. వేదములు నీ వాక్కు. యముడు నీయొక్క కోరలు. నక్షత్రములు నీయొక్క దంతములు. అందరిని మోహింపచేసే మాయ నీయొక్క నవ్వు. నీ కటాక్షవీక్షణమే సృష్టి. ధర్మము నీ అగ్రభాగము. అధర్మము నీయొక్క పృష్టభాగము. రాత్రి పగలు నీయొక్క కళ్లు తెరచుట మూయుటలు. హే ప్రభో ! సప్త సముద్రములు నీయొక్క కడుపు నదులన్నియు నీయొక్క నాడులు హే ప్రభో ! వృక్షములు ఓషధులు నీయొక్క రోమములు. వృష్టి నీయొక్క వీర్యము (వర్షము). జ్ఞానశక్తి నీయొక్క మహిమ ఈ విధమైనది నీ స్థూల శరీరము. ఈ నీ స్థూలశరీరమునందు మనస్సుంచినవాడు, అనాయా సంగా మోక్షమును పొందగలడు. నీ స్థూల శరీరముకంటే వేరుగా ఇంకేమియు లేదు. రామ నేను ఎప్పుడు నీ స్థూలశరీరమునే మనస్సులో ధ్యానించు చున్నాను. దీనిని ధ్యానించినంత మాత్రాన శరీరమందు గగుర్పాటు సంభవించును. హృదయమందు ప్రేమ

రన ముప్పొందగును. హే రామా ! ఏ జీవుడు నీ స్థూల రూపమును ఎల్లప్పుడు చింతనచేస్తాడో అదే కాలంలో ఆ నిమిషంలోనే ఆతనికి ముక్తి కలిగిపోతుంది. అయినప్పటికి నేను మాత్రం నీ యీ రామ రూపాన్నే ధ్యానిస్తాను. ధనుర్బాణధరుడు జటావల్కల శోభితుడు తరుణవయస్కుడు సీతాలక్ష్మణ సమేతుడు శ్యామసుందరుడు అగు ఈ నా కంటికి కనపడు ఈ రాముడు ఈ రాముని రూపమే నా మనస్సులో శాశ్వతంగా ఉండుగాక. హే రఘునందన ! ఈ రూపాన్నే నాకు ప్రసాదించు. ఈ రూపమును ధ్యానించు స్థితిని సర్వదా నాకు అనుగ్రహించు. నా మానస మందిరములో సదా ఈ రూపమే ముద్రింపబడి యుండుగాక.

సర్వజ్ఞుడైన శంకరుడు కూడా పార్వతితో కూడ ఎల్లప్పుడు నీ యీ రూపాన్ని ధ్యానిస్తూ కాశీనగరంలో చచ్చిపోయినవారికి రామ రామ అను తారకమంత్రమును ఉపదేశము చేయుచు ఎల్లప్పుడు మహదానందంతో ఉన్నాడు. జానకీనాథ ! నీవు పరమాత్మవు. ఇది నిశ్చితము. నీ మాయచేత కప్పబడ్డవారలు నీ నిజస్వరూపమును యథాతథంగా తెలిసికొనలేకున్నారు.

రామభద్ర ! నీకు నమస్కారము. పరబ్రహ్మమా ! నీకు నమస్కారము. లక్ష్మణ సేవిత అయోధ్యాధిపతీ ! నీకు నమస్కారము. రక్షించు రక్షించు జగన్నాథ. నీ మాయ నన్ను ఆవరించ కూడదు. అంత రాముడు పలికెను.

ఓ దేవగంధర్వ ! నేను సంతుష్టుడనైతిని. నీ భక్తిచేత స్తోత్రముచేత యోగి గమ్యమైన నా పరమపదమునకు వెళ్లుము. ఇప్పుడు నీచేత చెప్పబడ్డ ఈ స్తవమును వేదోక్తమైనదానిని ఏకాగ్రతతో ధ్యానిస్తారో, జపిస్తారో వారలు అజ్ఞానమువలన సంభవించెడి సంసారమును విడిచిపెట్టి నిత్యము అనుభవమువలన పొందవలసిన నన్ను పొందెదరు.

ఇట్లు అరణ్యకాండలోని నవమ సర్గము సమాప్తము.

దశమ సర్గము

## శబరితో సమాగమము

గంధర్వుడు రామునివలన వరముపొంది పలికెను. హే రామ! నీకు ముందుభాగమందు శబరి అను నీ భక్తురాలు కలదు. ఆమె భక్తితో నీ పాదపద్మములందు సేవ చేయుచున్నది. ఆమెను నీవు పొందుము. సర్వమును సీతావిషయిక మైనదంతయు చెప్పును. అని చెప్పి సూర్య తేజస్సుగల విమానముపై వెళ్లిపోయెను. విష్ణుపదమును పొందెను. రామనామ స్మరణమందలి ఫలమిటువంటిది. అంత రాముడు ఘోరాతిఘోరమైన ఆ విపినమును విడిచి శబరియొక్క ఆశ్రమమును పొందెను. లక్ష్మణునితో గూడిన రాముని చూచి వెంటనే లేచి నిలబడెను. ఆనందబాష్పములు కండ్లనిండ శబరి రాముని పాదములపయిబడి స్వాగతమునుపలికి ఆసనమందు కూర్చొ పెట్టెను. రామలక్ష్మణుల పాదములను లెస్సగా కడిగి ఆ జలముతో తన శరీరమును అభిషేకించి అర్ఘ్యపాద్యాదులతో రామలక్ష్మణులను పూజచేసి వేదోక్తముగా అర్చించెను. ఇదివఱకు రాముని కొఱకు దాచిన అమృతముతో సమానమైన రుచిగల పండ్లను రామునికి అర్పించెను. పువ్వులతోను, సుగంధములైన పదార్థములతోను, చందనాదులతోను అర్చించి సుఖాసీనుడైన సోదర సహితుడైన రామునికి భక్తి నిండార రెండుచేతులు జోడించి పలికెను. ఈ ఆశ్రమమందు నాకు గురువులు మహర్షులున్నారు. వారల శుశ్రూషను చేయుచున్నాను. కొన్ని వేల సంవత్సరాలు నుండి ఉంటున్నాను. ఆ మహర్షు లందరు బ్రహ్మలోకమునకు వెళ్లినారు. వెళ్లిపోవుచున్న సమయములో వారలు నన్ను శ్రద్ధాభక్తులతో దివచర్య

గడపుచు ఇచ్చటనే ఉండమని ఆజ్ఞాపించిరి. పరమాత్మయైన శ్రీహరి దశరథ కుమారుడైన రామునిగా జన్మించినాడు. రాక్షస సంహారము నకు, ఋషీశ్వరులను కాపాడుటకు వస్తాడు. ఏకాగ్ర నిష్ఠురాలవై, స్థిరురాలవై ఉండుము అనిరి, ప్రస్తుతము చిత్రకూట పర్వతమునందు ఆశ్రమమందు రామప్రభువు బసచేసి యున్నారు. అతడు వచ్చు వఱకు కళేబరమును రక్షించు చుండుము. రాముని చూచిన తరువాత శరీరమును కాల్చి వేసి దహించుము. రాముని పదమును పొందెదవు. ఋషీశ్వరుల ఆన ప్రకారము నీ రాకకు నిరీక్షించుచు, నీయందే మనస్సు నిలిపి కాలక్షేపంచేయు చున్నాను. గురుభాషి తము సఫలమైనది. నా గురువులకు కూడ నీ సందర్శనము దొరక లేదు. నేను ఆడదానిని, మూఢురాలను ఓ మహానుబావా! హీనజాతి యందు పుట్టినదానిని. నీ దాసాను దాసులయొక్క వేలమందికి దాసిగా పనిచేయుటకు కూడ నాకు అధికారము లేదు ఏ విధంగా నీయొక్క ప్రత్యక్ష దర్శనము జరిగినది ? నీవు మనోవాక్కులకు గోచరుడవు కావు. స్తోత్రము చేయుటను తెలిసినదానిని కాను. ఏమి చేయగలను ? అనుగ్రహింపుము.

అంత రాముడు పలికెను. నన్ను భజించుటకు పురుషుడు, ఆడది, జాతి, ఆశ్రమము, పేరు అనునవి ప్రధానములు గావు భక్తి ఒక్కటే కారణము. యజ్ఞ, దాన, తపస్సులచేతను, వేదాధ్యయన ములచేతను, కర్మలచేతను నేనే విధముగ దర్శనము నివ్వను. భక్తి లేని అన్ని కర్మలవలన నేను పొందబడను. అందువలన హే వనితా మణీ! భక్తిసాధనమును చెప్పుచున్నాను. సంక్షేపంగా చెప్పు చున్నాను. సావధానంగా వినుము. సత్పురుషులతో సహవాసము ప్రథమ సాధనము. రెండవది నా కథలను గానము చేయుట. మూడవది నా కథల వివరించుట. నాలుగవది నా కథలలోని వేదాంత రహస్యములను వ్యాఖ్యానము చేయుట. మాయలేని బుద్ధి

చేత ఆచార్యులను కొలుచుట ఐదవది. పుణ్యశీలము యమాది నియమములు నా పూజయందు నిష్ఠ నిత్యము కలిగియుండుట ఆరవ సాధనము. సాంగోపాగంగా నా మంత్రమును ఉపాసన చేయుట. ఏడవది. నా భక్తులయందు అధికమైన పూజ సర్వ భూతములందు ఈశ్వరబావము, బాహ్యపదార్థములందు వైరాగ్యము శమదమాది సంపత్తి. ఎనిమిదవ సాధనము. తత్త్వ విచారము. తొమ్మిదవది. ఈ విధంగా భక్తి తొమ్మిది విధములు. ఆడవారికైనా, మగవారికైనా, పశుపక్ష్యాది జంతువులకైనా ప్రేమ రూపకమైన భక్తి ఉదయించును. ఈ భక్తి, ప్రేమ అనే రూపముకలది. భక్తి కలుగగానే నా తత్త్వానుభవము కలుగుతుంది. నా అనుభవ సిద్ధునికి ఆ దేహమందే ముక్తి కలుగును. అందుచేత మోక్షమునకు భక్తియే ప్రధాన కారణము అని నిశ్చితము ప్రథమ సాధనమైన సత్పురుషుల సహవాసమువలన క్రమముగా అన్ని కలుగును. అందువలన భక్తియే ముక్తి అని నిశ్చితమైనది.

నాయఁదు భక్తి యుక్తురాలవైనందున నిన్ను నేను అనుగ్రహించితిని. ఇక నీకు 'నా దర్శనమువలన ముక్తి కలుగును. ఇందు సంశయము లేదు. నీకు తెలిసినచో కమలలోచనయైన సీత యొక్క జాడ కొంచెము తెలియజేయ వలెను. ఎచ్చట ఉన్నది ఎవరిచేత అపహరింపబడినది తెలియజేయుము. అంత శబరి పలికెను.

సర్వజ్ఞ, దేవ, రామ, విశ్వభువన నీకు సర్వము తెలుసును. అయినను లోకానుసారంగా నన్నడుగు చున్నావు. చెప్పెదను వినండి. రావణునిచేత సీత అపహరింప బడినది. ప్రస్తుతము లంకలో ఉన్నది. ఇచ్చటకు సమీపములో పంపయనెడి సరోవరమున్నది. దాని సమీపములోనే ఋష్యమూకమనే గొప్ప పర్వతము కలదు. నలుగురి మంత్రులతో సుగ్రీవుడు వానరరాజు భయపడుచు, భయపడుచు అచ్చట కాలము గడుపుచున్నాడు. తన యన్నయైన

వాలివలన భయము కలిగియున్నాడు. ఋషిశాపము వలన వాలి ఇచ్చటకు రాడు. సుగ్రీవునితో మైత్రి చేయుము. సుగ్రీవుడు నీయొక్క కార్యమునంతను సాధించెగలడు. ఓ రామచంద్ర ! ఒక్క క్షణం ఉండు. నేను అగ్నిని ప్రవేశించెదను. నీ సమక్షమందు ఈ కళేబరమును, దగ్ధమును చేసెదను. విష్ణుపదమునకు ఆ తరువాత వెళ్లెదను. అంతవఱకు నిలబడు. అని రామునితో పలికి శబరి అగ్నిలో ప్రవేశించెను. మాయాసంబంధమైన అన్ని కర్మలను అజ్ఞానమును క్షణమాత్ర కాలములో పోగొట్టుకొని శ్రీరాముని అనుగ్రహమువలన శబరి అతిదుర్లభమైన మోక్షమును పొందెను. భగవంతుడు, జగన్నాథుడు, భక్తవత్సలుడు అయిన రాముడు ప్రసన్నుడైన వానికి ఏది దుర్లభము ? అన్ని సంప్రాప్తమగును. అధమజన్మురాలైనప్పటికి శబరికి మోక్షం వచ్చింది. శ్రీరాముని చింతకులు, పుణ్యాత్ములు బ్రాహ్మణులైన వారి విషయములో ఏమి చెప్పవలెను. ముక్తిని పొందెదరని అవశ్యం పొంది తీరుతారు. రామునియందు భక్తియే ముక్తి ఇందులో సంశయము లేదు.

భగవంతుడైన శ్రీరామచంద్రుని యందు భక్తి ముక్తికి కారణము. ఓ జనులారా ! కామధేనువైన శ్రీరామచంద్రుని పాద పద్మములను మహోత్సాహముతో సేవించండి. వివిధములైన విజ్ఞాన కథలను, మంత్రములను దూరంగా ఉంచి శ్యామసుందరుడు, కామారి హృదయబానుడు ఎల్లప్పుడు జ్యోతిస్వరూపుడైన రాముని సేవించండి. బుద్ధిమంతులారా !

ఇట్లు అధ్యాత్మ రామాయణంలో అరణ్యకాండలో ఉమా మహేశ్వర సంవాదమందలి దశమ సర్గ సమాప్తము.

——: ● :——

# కిష్కింధకాండ

## ప్రథమ సర్గము

## శంకరుడు పలికెను

శ్రీరాముడు లక్ష్మణునితో సహా మెల్లగా పంపాసరస్సుకు చేరెను. ఆ సరస్సు పద్మములతోను, కలువలతోను, హంసలతోను, నీటి కోళ్లతోను, చిత్రవిచిత్రములైన పక్షులతోను, చక్రవాకముల తోను, అనేక విధములైన పుష్పలతలతోను, నానాఫలములతోను, స్వచ్ఛమైన మహానుభావుల మనస్సువలె నిర్మలమైన ఉదకముతోను కంటికి ఆనందజనకంగాను, మనస్సుకు ఉల్లాసకరంగాను తీర్చిదిద్ద బడినట్లు ఉన్నది. రామలక్ష్మణులు అందలి జలముతో ఆచమనం చేసి ఆ శీతల జలమును త్రావి ఋష్యమూక పర్వతప్రాంతమందు ధనుర్బాణధరులై, జటావల్కలధరులై, పర్వతశోభను, చెట్లయొక్క అందమును చూచుచు ప్రకృతియొక్క అందమును కనులారా మన సార తనివితీర అనుభవించిరి. సుగ్రీవుడు ఋష్యమూక శిఖరాగ్ర మందుండి నలుగురి మంత్రులతో వానరములతో రామలక్ష్మణులను చూచెను. చూచి భయమును పొంది హనుమంతుని చూచి వీరెవ రయి యుంటారు. వీర్యవంతులువలె కనపడుచున్నారు. హనుమ ! నీవు బ్రహ్మచారి వేషమును ధరించి బ్రాహ్మణ బ్రహ్మచారి వేషముతో వారితో సంభాషించి ఒకవేళ వాలితో పంపబడ్డారేమో లేక ఎందుకు వచ్చుచున్నారో ఎవరో వారితో సంభాషించి వారి హృదయమును తెలిసికొని రావలెనని ప్రార్థించెను. ఒకవేళ వారలు దుష్టహృదయులయితే నీ చేతితో ఒక సంజ్ఞ చేయుము. వినయముతో కూడుకొన్న వాడవై 'యథార్థమును గ్రహించవలెనని

పంపెను. అటులనే అని హనుమంతుడు వటురూపమున ఆ ప్రాంతము నుండి చనెను. వినయముతో కూడినవాడై రామునికి నమస్కరించి పలికెను. మీరెవరు తరుణవయస్కులు పురుషశ్రేష్ఠులు నాలుగు దిక్కులను మీయొక్క శరీరకాంతిచేత సూర్యునివలె ప్రకాశింప చేయుచున్నారు. మీరు త్రిలోకములను సృజించిన వారలని నా మనస్సు చెప్పుచున్నది. మీరు ప్రధాన పురుషులు జగత్తుకు కారకులు. విశ్వమయులు మాయచేత మానవ శరీరములను ధరించిన వారలు లీలగా సంచరించు చున్నారు. భూభారహరణమునకు భక్తులను పాలించుటకు అవతరించిన వారివలె నున్నారు. మీరుమిక్కిలి క్షత్రియ రూపధారులు సృష్టి స్థితి లయములను అవలీలగా చేసిన వారు సర్వస్వతంత్రులు. సర్వ హృదయము లందున్న వారు లోకములో నరనారాయణులని ప్రసిద్ధిగాంచిన వారు. లోకములో నడచుచున్నట్లు వాకు తోచుచున్నది. అంత రాముడు లక్ష్మణునితో చూడు లక్ష్మణా! బ్రహ్మచారి వేషము దాల్చినాడు. అనేకంగా శబ్దశాస్త్రము నంతను తన సంభాషణలో కనపరిచాడు. ఇతని భాషణలో ఏ మాత్రము అపశబ్దము గోచరించలేదు. జ్ఞానశరీరు డయిన రాముడు హనుమంతునితో నిట్లనెను. నేను దశరథరాజ పుత్రుడను నా పేరు రాముడు, వీడు మా తమ్ముడు లక్ష్మణుడు, భార్యయైన సీతతో కూడ పితృవాక్య గౌరవముచే దండకమునకు వచ్చినాము. అచ్చట నా భార్య అయిన సీతను ఎవడో రాక్షసుడు అపహరించినాడు. ఆమెను వెదుకుచు ఇచ్చటకు వచ్చితిమి. నీవెవ రవు? ఓ బ్రహ్మచారీ! అని రాముడు పలికెను. అంత వటువు పలికెను.

వానరులకు రాజు సుగ్రీవుడు మంచి బుద్ధిమంతుడు. ఈ కొండ శిఖరమందు నలుగురు మంత్రులతో నివసించి యున్నాడు. ఇతడు కనిష్ఠుడు. ఇతని అన్న వాలి దుష్టచిత్తుడు. ఇతని భార్యను అపహ

రించి ఇతనిని ఇంటినుండి తరిమివేసినాడు. వాలి భయముచేత ఋష్యమూకమును ఆశ్రయించి ఇచ్చటనే ఎల్లప్పుడు నివసించి యున్నాడు. నేను సుగ్రీవుని మంత్రిని. వాయుపుత్రుడను. హనుమంతుడని పేరు అంజనీదేవి గర్భమందు సంజాతుడను. సుగ్రీవునితో మీకు మైత్రి మంచిది. నీ భార్యను అపహరించిన వానిని చంపుటకు సహాయము నీకు కలుగుతుంది. మీ కిష్టమయితే రండి. ఇప్పుడే వెళ్ళిపోదాము అని పలికెను. అంత రాముడు తాను కూడ సుగ్రీవునితో మైత్రి చేసికొనుటకు వచ్చినాము. మిత్రుడయిన సుగ్రీవుని యొక్క కార్యమును కూడ నేను చేసెదను. సందేహము లేదు. అప్పుడు హనుమంతుడు తన నిజరూపమును ధరించి నా భుజము లందు అధివసించండి. పర్వత శిఖరమునకు చేరెదము. వాలి భయము వలన సుగ్రీవుడు అచ్చటనే ఉన్నాడు. అటులనే అని రామలక్ష్మణులు హనుమంతుని భుజస్కంధములపై అధిరోహించిరి. అంజనేయుడు ఒక్క క్షణంలో కొండశిఖరముపై వ్రాలెను. ఓ చెట్టునీడలో రామలక్ష్మణులు విశ్రమించిరి. హనుమంతుడు సుగ్రీవుని సమీపించి నమస్కరించి సుగ్రీవ ! నీ భయమును తీసిపారీ. రామలక్ష్మణులు వచ్చిరి. శెమ్ము తొందరగా, రామునితో నీకు మైత్రిని నేను యోచించితిని. తొందరగా అగ్నిని సాక్షిగా పెట్టుకొని అతనికి మైత్రిని ప్రకటింపుము.

అంత సుగ్రీవుడు పరమానంద భరితుడై తన చేతితో కొమ్మను నరికి వారు కూర్చొనుటకు ఆసనము నేర్పాటు చేసెను. హనుమంతుడు లక్ష్మణునకు ఆసనమిచ్చెను. లక్ష్మణుడు సుగ్రీవునకు ఆసనము నిచ్చెను. అందరు మిక్కిలి ఆనందముతో సమావేశమయిరి. లక్ష్మణుడు వనవాసము మొదలు ఆ దినము వరకు జరిగిన తమ వృత్తాంతమును సంగ్రహముగా చెప్పెను. సుగ్రీవుడు విని రామునితో సీతాన్వేషణము, సహాయ సంపత్తిని తా నందిస్తానని

రామునికి చెప్పెను. మఱియు నింకొక గాథను చెప్పెను. ఒకప్పుడు మంత్రులతో తాను కొండ పై భాగమున కూర్చొని యుండగా ఒక ఉత్తమ ఇల్లాలు హా రామ ! హా రామ ! అంటూ విమానము నుండి విలపిస్తూ మమ్ములను చూచి తన చీరకొంగులో కట్టిన ఆభరణముల మూటను విడిచి పెట్టింది. వానిని నేను భద్రంగా కొండగుహలో దాచినాను. తమరిప్పుడే చూడండి. తెలిసికొనండి. అవి మీవో, కావో అని చెప్పి ఆభరణములను తెప్పించి రాముని దగ్గఱ ఉంచి వేసెను. ఆ మూటను విప్పి చూచి హా సీత ! హా సీత ! అంటూ వానిని తన హృదయమునకు హత్తుకొని ప్రాకృతునివలె ఏడ్చెను. రాముని ఓదార్చి లక్ష్మణుడు పలికెను. కొందరలోనే జానకి నీకు లభ్యమవు తుంది. వానరేంద్ర సహాయముచే రావణుని యుద్ధములో చంపివేసి సీతను పొందగలవు. సుగ్రీవుడు కూడా హే రామ ! ప్రతిజ్ఞ చేయు చున్నాను. యుద్ధములో రావణుని చంపివేసి నీకు జానకిని ఇచ్చు చున్నాను. ఇంతలో హనుమంతుడు అగ్నిని రగిల్చి యుంచెను. ఆ అగ్ని సాక్షిగా రామ సుగ్రీవు లిరువురు పరస్పరము చేతులు చాచి పరస్పరము ఒకరినొకరు ఆలింగనము చేసి పరస్పరము కల్మషము లేనివారలై ఆనందముతో మైత్రిని ప్రకటించు కొనిరి. రామునికి దగ్గఱగా సుగ్రీవుడు ప్రేమతో తన వృత్తాంతమును నివేదించెను. మిత్రమా ! రామా ! పరమ మదోన్మత్తుడైన దానవుడు మయుని కుమారుడు పేరు మాయావి. కిష్కింధ పురమును ప్రవేశించి వాలిని యుద్ధము నిమిత్తము ఆహ్వానించెను. ఆ రాక్షసుడు చాలా ధ్వనితో సింహనాదము చేసెను. వాలి వాని దర్పమును చూచి ఓర్వలేక కోపముతో కళ్లు ఎఱ్ఱజేసి గాఢమైన పిడికిలితో ఒక గుద్దుతో వానిని చితకనొప్పించెను ఆ దెబ్బకు తట్టుకోలేక రాక్షసుడు తన గుహ లోనికి వెళ్లు మార్గములో పలాయన మంత్రము పఠించెను. అప్పుడు వాలి వానిని వెంటతరిమి నన్ను కూడ తీసికొని వెళ్లెను. రాక్షసుడు లోపలికి వెళ్లి దాగుకొనుట వాలికి గొప్ప కోపమును పుట్టించెను.

వాలి నన్ను బయట ఉండమని తాను గుహ లోపలికి వెళ్లెను. ఒక నెలవఱకు వాలి ఆ గుహనుండి బయటకు రాలేదు. ఒకనెల అయిన తరువాత ఆ గుహనుండి రక్తధారలు ప్రవహించెను. దానిని చూచి నేను చాలా బాధపడి వాలి చచ్చిపోయెనని చాలా దుఃఖించితిని. గుహయొక్క ద్వారమునకు అడ్డు ఒక పెద్దరాయిని పెట్టి ఇంటికి వచ్చితిని. ఆ తరువాత వాలి రాక్షసుని చేతిలో మరణించెనని చెప్పితిని. అప్పుడు వానరులందరు దుఃఖించి నాకు వద్దన్నను రాజ్యమునకు నన్ను రాజుగా నిర్ణయించిరి. ఆ విధంగా కొంతకాలము నేను రాజ్యము చేసితిని. కొందకాలమైన పిదప వాలి వచ్చి మహా పరుషవాక్యములతో నన్ను నిందించి నా మనస్సును కఠినమైన పదములతో గాయపరిచెను మఱియు తీవ్రమైన ముష్టిఘాతములతో నన్ను చావబాదెను. అప్పుడు నేను భయముతో పరుగులిడుచు లోకములో చాలా స్థలములకు పరుగులిడి ఆఖరున ఈ ఋష్యమూక పర్వతమునకు చేరుకొంటిని. వాలి ఈ ప్రదేశమునకు ముని శాప భీతివలన ప్రవేశించలేడని తెలిసికొంటిని. అప్పటినుండి మూర్ఖుడైన వాలి నా భార్యనుకూడ భోగించు చుండెను. నాకు నివాసము పోయింది. భార్య పోయింది. ఇల్లుఇల్లాలు రెండు పోయిన తరువాత దుఃఖముతో బాధపడుచు ఇచ్చటనే ఉన్నాను. ఇప్పుడు నీ పాద పద్మములను పట్టుకొనుటవలన సుఖించు చున్నాను. రాముడు మిత్రదుఃఖమువలన తాను కూడ దుఃఖమును పొంది నీ శత్రువు భార్యాపహారిఅయిన వాలిని చంపెదను. శీఘ్రములో చంపెదను. అని సుగ్రీవుని ఎదుట ప్రతిజ్ఞ చేసెను. అంత సుగ్రీవుడు వాలి బలవంతులలో బలవంతుడు దేవతలకు వశముకాని వాని వాలిని రామచంద్ర ప్రభువు లెదుర్కొనుట కష్టమనియెను. మఱియు వాలి గాధను చెప్పెను. ఒకనాడు దుందుభి అను రాక్షసుడు మహాకాయుడు మహాబలుడు కారుఎనుపోతు రూపమును దాల్చి కిష్కింధకు

వచ్చెను. రాత్రియందు యుద్ధమునకు వాలిని పిలిచెను. అసహాయ శూరుడు వాలి వాని రెండు కొమ్ములను గ్రహించి ఆ రాక్షసుని భూమిపై పడవేసెను. ఒక కాలితో వాని శరీరమంతా కప్పి వాని శిరస్సును ఊడదీసి చక్రమును త్రిప్పినట్లు త్రిప్పి దానిని విసిరెను. ఒక యోజన దూరంలో ఉన్న మతంగ మహాముని ఆశ్రమంలో ముని వాకిలిలో పడెను. రక్తము కార్చుచు ఆ శిరస్సు మీదినుండి తన ఆశ్రమములో పడుటగాంచి మాతంగ మహాముని వాలి ఏ నాడైనా తన ఆశ్రమంలోకి అడుగుపెడితే ఆ క్షణమే శిరస్సు పగిలి చచ్చిపోతాడని శపించెను. అంత వాలి ఆ శాపము కారణంగా ఋష్యమూక పర్వతమునకు నాటినుండి వచ్చుటకు ఇష్టపడడు. నేను ఈ విషయము తెలిసికొని నిర్భయంగా ఈ కొండమీదనే ఉంటున్నాను పర్వతంతో సమానంగా ఉన్న దుందుభియొక్క శిరస్సు చూడుమని రామునికి చూపెట్టెను మఱియు దీనిని చూచినచో రామునికి వాలియొక్క బలము అర్థము కాగలదనియు ఆ శిరమును రాముడు విసరకలిగితే వాలిని చంపగల సత్తాఉందని తెలియుపడుతుందని పలికెను. రాముడు ఆ శిరస్సు చూచి నవ్వు కొనుచు తన కాలిబొటనవ్రేలుతో ఆ శిరస్సును చిమ్మెను. పది యోజనముల దూరము పడుకు అదియొక విచిత్రమైన దృశ్య మాయెను. సుగ్రీవుడు ఆశ్చర్యమును పొంది రాముని బలపరా క్రమములను ప్రశంసించెను. తిరిగి భక్తపరాయణుడు, వీర్యవంతుడు అగు రాముని జూచి సుగ్రీవుడనెను. ఓ రామా! చూడు మిటు ఏడు పెద్ద తాటిచెట్లు గలవు. వాలి ఒక్కొక్క తాటిని తన చేతితో కదిపి ఆకులు లేకుండా చేసేవాడు. నీవొక్క బాణంతో ఏకకాలంలో ఏడు తాళ్లకు ఛిద్రము చేయగలిగినచో నీచేత వాలి తప్పక హతుడు కాగలడని నాకు విశ్వాసము ఏర్పడగలదు. అన్నంతనే రాముడు ఒక్క బాణముతో ఏడు తాటిచెట్లను పడవేసెను. ఆ బాణము చెట్లనే కాకుండా చెట్లుండే పర్వతములను చెట్లక్రింది భూమిని

పెకిలించి తిరిగి రాముని అమ్ముల పొదిలోనికి ప్రవేశించెను. సుగ్రీవుని ఆనందోత్సాహములకు పరిమితి లేదు. రామదేవా! నీవు జగత్ పతివి సంశయము లేదు. నేను పూర్వజన్మల యందు చేసిన తపః పూజల ఫలితమువలన నీ సాంగత్యమును పొందితిని. మహాత్ములు నిన్ను పూజించి సంసారమునుండి విముక్తుని పొందెదరు. మోక్షము నిచ్చు రాముని పొంది సంసార పదార్థములను నేనెట్లు కోరగలను? పిల్లలు, పెళ్లాలు, ధనము, రాజ్యము ఇవన్నీ మీ మాయచేత ఏర్పడినవి. నిన్ను పొందిన నేను మఱియొకటిని కోరను. నిన్నే కోరుకుంటున్నాను. నీవే కావాలి నాకు. నా పూర్వపుణ్యమువలన మహానందమును నీవలన పొందితిని. మట్టిని త్రవ్వువానికి నిధులు దొరికినట్లు నీవు నాకు దొరకావు. ఈ దినమున నాకు ఎన్నియో వేల జన్మలనుండి సంప్రాప్తమైన అజ్ఞానము నశించినది. ఈ సంసార బంధము ఛిన్నమైనది యజ్ఞ, దాన, తపశ్చర్యలవలన ఇష్టాపూర్తాది కర్మలవలన ఈ సంసారబంధము వీడదు. మఱింత దృఢమౌతుంది. నీ పాదపద్మముల దర్శనము వలన సంసారబంధము వెంటనే నశిస్తుంది. ఇందులో సంశయము లేదు. ఒక్క క్షణమైన నీయందు చిత్తము లగ్నమైనచో వానియొక్క తత్త్వావర్థ మూలమైన అజ్ఞానము ఆ క్షణమునుండి నశిస్తుంది. ఎవని నాలుక "రామ రామ" అని మధురంగా క్షణమైనా పాడుతుందో వాడు బ్రహ్మహత్య చేసినవాడైనా, సురాపానము చేసినవాడైనా సర్వపాపముల నుండి విముక్తుడగును. రామ, విజయము వద్దు పెళ్లాము, పిల్లలు, ధనము ఇత్యాది సుఖము లేవియు వద్దు. బంధము నుండి తప్పించు భక్తిని నీయందు కోరుచున్నాను. ఈ సంసారము నీ మాయయొక్క లీల. నేనుకూడ నీ అంశలోని వాడనే. నీ పాదభక్తిని అనుగ్రహించి నన్ను రక్షించుము. శత్రువులు, మిత్రులు, బంధువులు అని నీ మాయావృత మనస్కుడనై పలికితిని. నీ పాదదర్శనము నుండి నాకంతా బ్రహ్మమయంగా కనపడు చున్నవి. శత్రు వెవడు?

మిత్రు డెవడు ? నీ మాయ యుండువఱకు రాగద్వేషముల కాల వాలమగు గుణములు ఉండును. మాయ దూరముకాగానే భేద భావము నశించి పోవును. మాయ యుండువఱకు నా వాడు పై వాడు శత్రువు, మిత్రుడు అను భేదభావంతో కూడిన నానాత్వము ఏర్పడును. నానాత్వ మున్నంతవఱకు మృత్యుభయ ముండును. అవిద్యవలన చీకటియందు మునిగిపోతాడు. పుత్ర, కళత్ర, మిత్ర, శత్రుబంధము మాయామూలము. నీ దాసియైన ఈ మాయను తీసివేయు రఘుశ్రేష్ఠా ! నా మనస్సు ఎల్లప్పుడు నీ పాదపద్మము లందు ఉండుగాక. నా వాణి నీ నామకీర్తన సుధాగానమును చేయు గాక. నా చేతులు నీయొక్క భక్తుల సేవలందు వినియోగపడు గాక. నా అంగము నీ అంగముయొక్క స్పర్శను పొందుగాక.

నా కన్నులు ఎల్లప్పుడు నీ మూర్తిని, నీ భక్తులను, నీ గురు వును చూచుగాక. నా చెవ్వులు నీ యవతార లీలావర్ణనలను విను గాక. నా పాదములు ఎల్లప్పుడు నీ మందిర యాత్ర యందుండు గాక. హే గరుడధ్వజా ! నా శరీరము నీ పాద పద్మధూళితో కూడిన తీర్థోదకములను ధరించుగాక. నా శిరస్సు ఎల్లప్పుడు బ్రహ్మాది దేవతలచే సేవచేయబడిన నీ పాదపద్మము లందుండు గాక. మఱియు నీ పాద కమలములకు నమస్కరించు గాక.

ఇట్లు కిష్కింధకాండ యందు ప్రథమ సర్గము సమాప్తము.

## ద్వితీయ సర్గము

# శ్రీ మహాదేవుడు పార్వతితో పలికెను

ఈ విధంగా తన గాత్ర స్పర్శవలన కడగబడిన సమస్త పాపసంఘముగల సుగ్రీవుని జూచి రాముడు పలికెను. శివ్వుచు పలికెను. మిత్రమా! నీవు నా గూర్చి చెప్పినదంతా సత్యమే. కాని అగ్నిసాక్షికంగా సుగ్రీవునితో మైత్రిని జరిపించి రాముడే ఉపకారం చేసాడు సుగ్రీవునికి, అని లోకం అంటారు. లోకాపవాద నాకు వస్తుంది. అందువలన వాలిని యుద్ధమునకు పిలువుము. ఒక్క బాణంతో వానిని చంపివేసి నిన్ను రాజ్యమునందు పట్టాభిషేకము చేయిస్తాను. సుగ్రీవు డటులనే అని చెప్పి కిష్కింధకు వెళ్లి మంచి ధ్వనిని చేసి వాలిని యుద్ధమునకు ఆహ్వానించెను. ఆ శబ్దమును విన్న వాలి మహాకోపంతో ఎర్రని నేత్రములు కలవాడయి ఇంటి నుండి సుగ్రీవుడున్న స్థలమునకు వెళ్లెను. వచ్చుచున్న వాలిని రాగానే సుగ్రీవుడు వక్షస్థలమందు తన్నెను. వాలికూడ కోపంతో సుగ్రీవుని కొట్టెను. పరస్పరము మల్లయుద్ధము చేసికొనుచుండగా రాముడు వాలి ఎవడో సుగ్రీవు డెవడో తెలిసికొనలేక పోయెను. ఒక వేళ బాణమును వదలినచో సుగ్రీవునిమీద పడి వానిని చంపునను భయముతో బాణమును ప్రయోగించక ఊరకుండెను. వాలిచేత సుగ్రీవుడు చావుదెబ్బలు తిని రక్తం కక్కుకుంటూ పరుగులిడెను. వాలి ఇంటికి వెళ్లిపోయెను. సుగ్రీవుడు రాముని జూచి హే రామ! నీవెందుకు బాణము వేయలేదు. నీవు మాట యిచ్చినట్లు నేను వాలి చేతిలో చచ్చిపోవుట నీకిష్టమా! అటులైనచో నాపై ఒక బాణము వేసి నీవే చంపివేయుము. వాలిచేతిలో నాకు చావువద్దని పలికెను.

రాముడు దుఃఖముతో కండ్లనిండా నీరునింపుకొని సుగ్రీవుని ఆలింగనము చేసికొని సుగ్రీవ! భయపడకము. మీరిరువురును ఒకే రూపంలో ఉన్నారు. నా బాణము నీకు తగిలినచో మిత్రఘాతి నగుదునని శంకించి బాణమును వదలలేదు. ఇప్పుడే నిన్ను గుర్తుపట్టుటకు ఒక చిహ్నమును ఏర్పాటుచేస్తాను. అపుడు మళ్లీ వాలిని యుద్ధమునకు పిలువుము. ఒక్క క్షణకాలములో వాలిని వధిస్తాను. అని చెప్పుచు సుగ్రీవుని పుష్పమాలతో అలంకరింప జేయుమనగా లక్ష్మణుడు సుగ్రీవుని మెడలో బాగా పండిన పువ్వులుగల పుష్పమాలను వేసెను.

అంత సుగ్రీవుడు కిష్కింధకు వెళ్లి తిరిగి బ్రహ్మాండమైన శబ్దమును వినిపించెను. ఆ శబ్దమును విని వాలి మహాకోపముతో పరికరమును తయారుచేసి యుద్ధమునకు వెళ్ల సంకల్పించెను. ఆ సమయములో తార వాలిని నిషేధించెను. నీవిప్పుడు యుద్ధమునకు వెళ్లవద్దు నా మనస్సులో శంక కలుగుతోంది. ఇప్పుడిప్పుడే చావుదెబ్బలు తిన్న సుగ్రీవుడు తిరిగి యిప్పుడే యుద్ధమునకు నన్నుద్దెశించి యుద్ధమునకు పిలిచెనంటే వానికి బలవంతమైన సహాయము ఉండి తీరాలి. అందుచేత నీవు వెళ్లవద్దని తార చెప్పెను. ఈ వాలికి పిరికిమందు పోయవద్దు. సుగ్రీవున్ని వానికి సహాయము నిచ్చిన వానినికూడ చంపివేసి నిమిషములో నేను ఇంటికి వస్తాను. నీవు భయపడ వద్దు. ఇంట్లో ఉండు. యుద్ధమునకు పిలువబడిన ఏ శూరవరుడు కూడ ఇంట్లో ఉండడు. అని పలికెను. తార తిరిగి పలికెను. నేను ఇంకొక విషయమును విన్నాను. వేటకు వెళ్లిన అంగదుడు నాతో ఆ విషయమును చెప్పెను. అయోధ్య రాజయిన శ్రీమంతుడయిన రాముడు సీతాలక్ష్మణులతో దండకారణ్యమునకు వచ్చెననియు, అరణ్యములో సీతను రావణుడు అపహరించె ననియు, ఆ సీతను వెదుకుచు ఋష్యమూక పర్వతమునకు వచ్చెననియు, అగ్నిహోత్రి సాక్షి

కంగా సుగ్రీవునితో రాముడు మైత్రి చేసెననియు, రాముడు వాలిని చంపి సుగ్రీవుని పట్టాభిషిక్తుని చేసెదనని ప్రతిజ్ఞ చేసెననియు తెలిసినది. అని నిశ్చయించి వారున్నారు. లేకపోతే ఇప్పుడే ఓడిపోయిన సుగ్రీవుడు వెంటనే యుద్ధమునకు వచ్చేవాడా? అందు చేత నీవు రాముని శరణు వేడుము. సుగ్రీవుని యౌవరాజ్యమందు అభిషేకము చేయుము. నన్ను రక్షించు. అంగదున్ని రక్షించు. వానర కులమును రక్షించు. అని విలపించుచు తార పాదములమీద పడెను. భయాక్రాంతయై రెండు చేతులతో వాలి పాదములను పట్టుకొని ఏడ్చుచుండెను. వాలి తారను ఆలింగనము చేసికొని ప్రేమతో పలికెను. నిజముగా రాముడు లక్ష్మణునితో సహా వచ్చియున్నట్లయితే అతనితో నాకు స్నేహము ఏర్పడును. సాక్షాన్నారాయణుడే రాముడుగా పుట్టి భూభారహరణమున కావిర్భవించెనని నాచేత ఇదివరకే వినబడినది. అతనికి స్వపక్ష పరపక్షములు లేవు. అతని పాదాంబుజములకు మ్రొక్కి ఇంటికి తీసికొని వచ్చెదను. భక్తిగమ్యుడైన రాముడు భక్తులకు సులభుడు. ఒకవేళ సుగ్రీవుడొక్కడే వస్తే వానిని వెంటనే చంపెదను. సుగ్రీవునకు యౌవరాజ్య మిమ్మని చెప్పితివి. ఇది ఏ విధంగా జరుగునో చెప్పుము. నేను ప్రసిద్ధికెక్కిన వీరశూరుడను. సర్వలోకములందు ఇది నిశ్చితము. భయంభయంగా వాలి పలుకలేదు. దుఃఖమును విడిచి ఇంటికి మరలుము. అని ఏడ్చుచున్న తారను ఓదార్చి వాలి యుద్ధమునకు బయలుదేరెను. సుగ్రీవుడు పుష్పమాలాలంకృతుడై ఏనుగువలె వాలిపైకి ఎగిరెను. ఒకరినొకరు ముష్టిఘాతములచేత నొప్పించుకొనిరి. ఒకరినొకరు కొట్టుకొనుచు పరస్పరము భీకర యుద్ధము సలిపిరి. రాముడు వారిరువురిని చూచి ఇంద్ర సంబంధమైన చాపమునందు ఒక బాణమును తీసి ఆకర్ణాంతము ఎక్కుపెట్టి చెట్టు చాటున దాగుకొని పిడుగువంటి బాణమును వాలిని లక్ష్యముగా

గ్రహించి విడిచిపెట్టెను. ఆ బాణము వాలి వక్షస్థలమును ఛేదించినది. బ్రహ్మాండమైన శబ్దమును చేయుచు భూమిమీద వాలి పడెను. ఆ సమయమందు భూమి కంపించినది. వాలి ఒక్క నిమిషము చైతన్యమును గోల్పోయి మళ్లీ పొందెను. అంత వాలి తన ఎదుట రాముని జూచెను. ఎడమచేతితో ధనుస్సు స్వీకరించి కుడిచేతిలో బాణము పట్టుకొని వల్కలములను ధరించినవాడు, జటల కిరీటమును ధరించినవాడును, విశాల వక్షస్థలము కలవాడు, వికసించు వనమాలచేత విరాజితుడు, స్థూలములు మఱియు పొడవైన బాహువులు కలవాడు, నూతన దూర్వాదల శ్యాముడు సుగ్రీవ లక్ష్మణుల చేత ఇరు ప్రక్కల సేవింపబడు వాడును అగు రాముని అవలోకించి మెల్లగా వాలి తిరస్కరించిన విధముతో పలికెను. హే రామ ! నేను ఏ పాపము చేసితినని లేక నీకేమి యపరాధము చేసితినని నన్ను చంపితివి. రాజధర్మములను తెలియకుండ నీచేత చేయబడిన కర్మ నింద్యమైనది. చెట్టుచాటున దాగుకొని నాయందు బాణము వేసిన నీకు కీర్తి ఎందుకు వచ్చును. ఒక దొంగవలె యుద్ధము చేసినావు. ఒక క్షత్రియ కుమారుడవైతే నీ జన్మ మను వంశమందు సంభవించి నట్లయితే నా కెదుట నిలబడి యుద్ధం చేసినట్లయితే దాని ఫలము నీకు కలిగియుండేది. నీకు సుగ్రీవుడు చేసిన కార్యమేమి ? నాచేత చేయబడని దేది ? నేను విన్నది యేమిటంటే దండకారణ్యంలో రావణుడు నీ భార్యను అపహరించె ననియు, ఆమెను పొందుటకు నీవు సుగ్రీవుని శరణుపొందితి వనియు తెలిసికొంటిని. నాకు కలిగిన దుఃఖము ఏమిటంటే నీవు నా విశ్వవిఖ్యాత బలపరాక్రమములను వినియే యుందువు. ఓ రాఘవా ! నేను తలచుకుంటే అర్ధ ముహూర్తములో రావణుని సకులంగా బంధించి నీ యెదుటకు తీసికొని రాగలను. లోకంలో నీకు ధర్మిష్ఠుడని కీర్తిగలదు. ఒక తోయ్యువాడు తుళె కోతిని చంపి నీవేమి ధర్మమును పొందెదవు.

చెప్పుము. పోనీ మాంసముకొఱకు చంపితివంటే వానర మాంసమును ఎవరు తినరు. నన్ను చంపినను నీకు దాంతో ఉపయోగము లేదు. ఈ విధంగా ఎక్కువగా మాటలాడుచున్న వాలిని చూచి రాముడు పలికెను. నేను ధర్మమును రక్షించుటకు ఈ లోకములో ధనుర్బాణములతో సంచరించు చున్నాను. అధర్మ మాచరించిన వానిని చంపివేసి సద్ధర్మగామిని పాలన చేస్తాను. కూతురు, అక్క చెల్లెలు, అన్నదమ్ముల భార్యలు, కోడల్లు అను వీరు నలుగురు సమాన ప్రతిపత్తిగల వారలు. వారిలో ఏ ఒక్కరిని రమించినను వాడు పాతకిరాజులకు వాడు వధ్యుడు. నీ కనిష్ఠ భ్రాతయొక్క భార్యను నీవు రమిస్తూన్నావు. ధర్మ విధుడనైన నాచేత ఆ కారణము వలన చంపబడితివి. మహానుభావులు చరించు జ్ఞానమార్గమును నీవు కోతివగుటవలన తెలిసికొన జాలవు. ఆచరణవలన మహానుభావులు లోకమున కుపదేష్టలు అగుదురు. మఱియు ఆచరణ వలననే లోకమును పవిత్రీకరణ చేస్తారు. అందుచేత వ్యర్థప్రసంగములను అధిక భాషణలను కట్టిపెట్టుము.

వాలి ఆ మాటలను విని భయముచేత కంపించబడుచు శ్రీరాముడు సాక్షాత్ లక్ష్మీపతియైన శ్రీమన్నారాయణునిగా తెలిసికొని తెలియక తనచేత చేయబడిన పాపమును క్షమించమనియు, తన మాటలలోని అపరాధమును క్షమించమనియు, తాను సాక్షాత్ శ్రీరాముని సన్నిధిలో శ్రీరామునిచేత విడువబడిన రామబాణముచేత ప్రాణములను విడిచిపెట్టు చున్నాననియు, ఇట్టి చావు యోగీశ్వరులకు కూడ దుర్లభం అనియు మరణ కాలమందు మతిలేకుండా అయిన ఎవని నామస్మరణ చేసినంత మాత్రాన పరమ పదప్రాప్తిని పొందునో అట్టి రాముడే సాక్షాత్ నా కళ్లెదుట ప్రత్యక్షమై యున్నాడు. ఏమి నా భాగ్యము అని వాలి తిరిగి పలికెను.

హే రామా ! నీవు రావణవధ నిమిత్తము బ్రహ్మచేత ప్రార్థితుడవై రామావతారమై వెలసితివి. దివ్యమైన నీ వైకుంఠ ధామమును చేరుటకు నన్నును గ్రహింపుము. నాతో సమానమైన బలముకల వాడు నా కుమారుడు అంగదుడు. బాలుడు వాడు వానియందు దయయుంచు. నాయందు ప్రయోగించిన బాణమును దయచేసి తీసివేయుము. నీ హస్తములతో నా శరీరమును స్పృశించుము. అటులనే అని రాముడు బాణమును తీసివేసి వాలియొక్క శరీరమును స్పృశించెను. వెంటనే వాలి వానర సంబంధమైన దేహమును విడిచిపెట్టి ఇంద్రరూపమును పొందెను. రాముని బాణముచే కొట్టబడిన వాలి రాముని శీతలకరములచే ముట్టబడిన దేహము కలవాడై వెంటనే కోతిరూపును విడిచి ఇతరులకు లభ్యము కాజాలని పరమ హంసలకు కూడ పొందబడని పరమ పదమును పొందెను.

ఇట్లు అధ్యాత్మ రామాయణంలో కిష్కింధకాండలో ఉమా మహేశ్వర సంవాదమందలి ద్వితీయ సర్గ సమాప్తము.

—○—

## తృతీయ సర్గము

# శంకరుడు భవానితో పలికెను

వాలి చంపబడిన వార్త విని వానరులందరు విహ్వాలులైరి. అంగదుని రాజ్యాభిషేకం చేయమని తారను అడిగిరి. తార దుఃఖమును సహించలేక రెండు చేతులతో తలమీద, హృదయము నందు బాదుకొని నా కంగదుడుతో ఏమిపని ? రాజ్యమేల, ధనమేల ? నేనుకూడ నా భర్తతో స్వర్గము నలంకరించెదనని జుత్తులను విప్పి వేసికొని భర్త కళేబరముందు స్థలమునకు వెళ్లినది. నాథ ! నాథ ! అంటూ అతని పాదములందు పడి ఏడ్చుచూ రఘురాముని చూచి పలికెను. రామ ! నన్ను కూడ వాలిని చంపిన బాణముతో చంపి వేయుము. నేను భర్త సాలోక్యమును పొందెదను. వాలి కూడ నన్ను రమ్మనమని పిలుచు చున్నాడు. నేను లేకుండ అతనిక స్వర్గమందు కూడ సుఖము లేదు. పత్నీ వియోగము వలన కలిగెడు దుఃఖమును నీవు స్వయముగా అనుభవించు చున్నావు. ఇప్పుడు వాలికొఱకు నన్ను దానము చేయుము. నీకు పత్నీ దానఫలము కలుగును. సుగ్రీవున్ని చూచి సుగ్రీవ ! నీకు వాలి ఘాతియైన రామునిచే రాజ్యమివ్వ బడినది. జ్ఞాతులులేని రాజ్యమును రుమను అనుభవించుము. అని ఏడ్చుచున్న తారను చూచి రాముడు పలికెను. తత్త్వజ్ఞానము నుపదేశించెను. హే తార ! నీ భర్తయైన వాలి శరీరమా లేక జీవుడా ఈ కళేబరమును చూచుచున్నావు గదా చెప్పుము. శరీరము పంచభూతములతో తయారుచేయబడిన జడమైన పెట్టె. దీనిలో చర్మము, మాంసము, రక్తము, ఎముకలు కలవు. కాలాన్ని ననుసరించి, గుణముల ననుసరించి ఇది పుడుతుంది. అది

యిప్పుడు కూడ నీ దగ్గఱనే ఉంది. కళేబరమును ప్రత్యక్షముగా చూచుచున్నావు. ఇప్పుడు చెప్పు. జీవుడు ఆత్మ స్వరూపుడా? కాదా? జీవుడు ఆత్మ యని తెలిసికొంటే వానికి రోగము లేదు. పుట్టుక లేదు. చావులేదు. వాడు కూర్చొనడు. నడవడు. వాడు స్త్రీ కాదు. పురుషుడు కాదు. నపుంసకుడు కాదు. నాశరహితుడైన ఆత్మయే జీవుడు. రెండవది లేనివాడు ఆకాశమువలె నిర్లేపుడు, నిత్యుడు, జ్ఞానవ యు క్త, శుద్ధుడు అటువంటివాని గురించి దుఃఖము చెందుట పనికిరాదు.

అంత తార రామునిగూర్చి ప్రశ్నించెను. హే రామచంద్రా! దేహము కాష్టమునవలె నశ్వరము జడము చిత్ స్వరూపము కాదు. జీవుడు చిదాత్మకుడు. అటువంటప్పుడు సుఖదుఃఖాది సంబంధము ఎవనికి కల్గును. అంత రాముడు ప్రత్యుత్తర మిచ్చెను. సుఖ దుఃఖాధి సంబంధము మనస్సుకు కలుగును. అహంకారము వలన జీవుడు మనస్సును ఇంద్రియ భోగములందు ఉద్యుక్తముచేసి, కర్తను, నేను, భోక్తను నేను అను అవిద్యకు సంబంధించిన అజ్ఞానముచే రాగ ద్వేషములను పొందుచు సంసారమందు లంపటుడై అనాత్మయగు శరీరాదులందు, ఇంద్రియములందు, మనస్సునందు ఆత్మభావన చేయుచు, మనస్సు వలననే సుఖదుఃఖములను పొందు చున్నాడు. అనుభవము అనగా సుఖము కాని దుఃఖము కాని మనస్సువల్లనే కలుగుచున్నది. మనస్సు సంకల్ప వికల్పముల పుట్ట. అజ్ఞానము చేత మనస్సే తానని భ్రమించి సుఖదుఃఖములను ఆత్మకు సంబంధము లేనివానిని మనస్సు వలన అనుభవించు చున్నాడు. మనస్సే సంసారము. మనస్సే బంధము కూడ. ఈ మనస్సు ఒక రంధ్రు పూవ. ఆత్మ ఒక స్ఫటికము. ఆత్మకు రంగులు లేవు. స్ఫటికము నకు వలెను రంగులపూస సహవాసముతో స్ఫటికమునకు పూస యొక్క కాంతి కనుపడుతుంది. ఎర్ర పూసయితే ఎర్రకాంతి, పచ్చ

పూసయితే పచ్చ కాంతి, నల్లపూసయితే నల్లని కాంతి స్ఫటికములో కనపడును. నిజముగా స్ఫటిక మొక్కటినే చూస్తే దీనికి కాంతి లేదు. నిర్మలమైనది. స్వచ్ఛంగా ఉంటుంది. దీనితోపాటు రంగు పూసలను మాలలో వేసికొంటే ఆ పూసల రంగు దీనియందు ప్రతిఫలింపిస్తుంది. ఆ రంగు దీనిది కానప్పటికి అటులనే ఆత్మ స్ఫటికమువలె శుద్ధము. మనస్సుయొక్క సహవాస దోషమువలన ఆత్మకు లేనివానిని ఆత్మకు సంబంధించిన వానినిగా గ్రహించుటయె అవిద్య. మనస్సును అంటే రంగుపూసను ఏనాడు స్ఫటికంతో కలపకూడదు. జ్ఞానము లేనివాడు రంగుపూసలను కలుపుతాడు. మనస్సుయొక్క సంపర్కమువలన ఆత్మకులేని కర్తృత్వమును తన యందాపాదించుకొని సుఖము దుఃఖములను జీవుడు మనస్సుచేత అనుభవించు చున్నాడు. అయితే ఆత్మను గ్రహించు సాధనము కూడ మనస్సే. ఆత్మను గ్రహించుటకు బదులు మనస్సుయొక్క వికారములకు దాసుడయి సుఖదుఃఖములను అనుభవించు చున్నాడు. సంసారమును పెంచు కుంటున్నాడు. సంసారములో పడి అన్ని విధములైన కర్మలను చేయుచున్నాడు. సాత్విక, రాజసిక, తామస్క కర్మలను చేయుచు వానిలో బందీఅగు చున్నాడు. ప్రళయ పర్యంతము జీవుడు కర్మలకు వశుడై కర్త, భోక్త, లక్షణ ములకు పాత్రుడై సంసార సముద్రములో మునిగిపోవు చున్నాడు. ప్రళయ కాలమందు సమస్త భూతములు నశించును. అయినప్పటికి కర్మలవలన కలిగెడు వాసనలయొక్క ప్రభావముచేచేత తిరిగి సృష్టి ప్రారంభమైనను తన కర్మఫలములను, వాసనలను జీవుడు తిరిగి అనాదిగా తనచేత చేయబడిన కర్మలయొక్క ప్రభావము వలన, కర్మఫలముల ప్రకారము జన్మమును పొందుచున్నాడు. అనగా ప్రళయము వచ్చినప్పటికి కర్మ, వాసనలు వదలవు. ఆ విధమైన శరీరమును స్వీకరించి సుఖదుఃఖములకు తిరిగి బద్ధుడగు

చున్నాడు. ఘటీ యంత్రమువలె ఘట్టుచున్నాడు. కాని పుణ్య మధికమై అదృష్టముంటే కొన్నివేల జన్మలకు సత్పురుషుల సహవాసము దొఱుకును. విష్ణుభక్తుల సహవాసము దొఱుకుతుంది. ఆత్మ విషయికమైన భక్తిశ్రద్ధలు లభించును. విష్ణుసంబంధమైన కథలను వినుటలో శ్రద్ధ కలుగును. అప్పుడు తనయొక్క నిజరూప జ్ఞానము సులువుగా కలుగుతుంది. గురువుయొక్క అనుగ్రహము వలన, వేదాంతవాక్య విచారణవలన. క్షణములో దేహము, ఇంద్రియములు, మనస్సు, ప్రాణము, బుద్ధి, అహంకారములకంటె భిన్నమైన అనగా వేరుగా ఉన్న ఆత్మను దానియొక్క సచ్చిదానంద స్థితిని తెలిసికొని సద్యోముక్తిని పొందును. నేను చెప్పినది సత్యము. ఈ సత్యమైన నాచేత చెప్పబడిన విషయమును రాత్రి పగలుకూడ ఎవడు విచారించి లెస్సగా అనుభవంలోకి తెచ్చుకుంటాడో వానికి సంసార సంబంధమైన బాధలుండవు. హే తార! నీవుకూడ నాచేత చెప్పబడిన సత్యమైన తత్త్వమును తెలిసికొని, విశుద్ధమైన బుద్ధితో విచారించినచో సుఖదుఃఖము లుండవు. కర్మ బంధములనుండి విముక్తురాలవు కాగలవు. నీవు నీ పూర్వజన్మమందు నాయందు విశేషమైన భక్తి కలిగియుండెడి దానవు. అందుచేత నీకు మోక్షమును ఇచ్చుటకు నా రూపమును చూపెట్టితిని. నా రూపమును నిత్యమును ధ్యానము చేయుము. బుద్ధిచేత నేజేసిన ఉపదేశమును విచారించు చుండుము. అప్పుడు నీకు ప్రారబ్ధమైన కర్మలయొక్క బంధము అంటుదు. తార రామోపదేశమును తెలిసికొని సంతసించి నదియై ఆత్మానుభవమును వెంటనే పొంది జీవన్ముక్తురాలాయెను. రామునియొక్క క్షణకాల పరిమితమైన సాంగత్యమువలన కొన్నివేల జన్మలయొక్క కర్మబంధము వీడినది. సుగ్రీవుడుకూడా దానిని విని శాంతచిత్తు డాయెను. రాముడు సుగ్రీవుని జూచి వాలియొక్క జ్యేష్ఠుడైన అంగదునిచేత ఊర్ధ్వ దైహిక కర్మలను చేయించుము అనెను.

అటులనే సుగ్రీవుడు వాలి శరీరమును పుష్పకమందుంచి భేరీదుంధుభి నిర్ఘోషలతో బ్రాహ్మణులు మంత్రులచే మఱియు పౌరులతో తారచేత, అంగదుడు చేతను యథాశాస్త్రంగా చేయించెను. తిరిగి రాముని పాదములకు నమస్కరించి సుగ్రీవుడు వానర రాజ్యమును పరిపాలించమని వేడెను. తాను లక్ష్మణుడువలె రాముని పాదపద్మములను సేవించెదనంటూ, దాసుడనంటూ పలికెను. రాముడు నవ్వుచు "త్వమేవాహం" నీవే నేను నా ఆజ్ఞచేత నీవే రాజ్యమందు అభిషిక్తుడవు కమ్ము. నేను పదునాలుగు సంవత్సరాలు నగరమును ప్రవేశించ కూడదు. మా తమ్ముడు లక్ష్మణుడు నీతో కూడా వస్తాడు. అంగదున్ని ఆదరణతో యౌవరాజ్యమందు అభిషిక్తుని చేయుము. ఇచ్చటకు దగ్గఱగా ఉన్న పర్వత శిఖరమునందు లక్ష్మణునితో సహా వర్షకాలము నందు నివసిస్తాను. ఆ తరువాత నీవు ప్రియత్నము చేయుము. అటులనే అని రామునిదగ్గఱ అనుమతి తీసికొని లక్ష్మణునితో కూడ నగరమును ప్రవేశించెను. లక్ష్మణుని పూజచేసి సుగ్రీవుడు, రాముడు చెప్పినట్లే చేసెను. లక్ష్మణుకు తిరిగి వచ్చి రామునితో సహా ప్రవర్షణగిరి యొక్క మీఁదిభాగమును చేరెను. అందు స్ఫటిక సంకాశమైన గుహను చూచెను. వర్షము, గాలి, ఎండలు వచ్చినను సుఖముగా ఉండుటకు అనువుగా ఉన్నది. అచ్చటకు పండ్లు, కందమూలములు దగ్గఱలో ఉన్నవి. రాముడు లక్ష్మణునితో సహా అచ్చట వసించుటకు ఇష్టపడెను. ఆ పర్వతమును చూచిన తరువాత రామునికి మనస్సు అత్యంత ఆనందమును పొందెను. ఆ కొండ అంతా కూడ మంచి మంచి ఫలవృక్షములు, కందమూలములు, మంచి ముత్యముల కాంతితో మెరయు నీళ్లతో కూడిన సరస్సులు రంగు రంగుల పక్షులు, మృగములు ఎంతో ఆహ్లాదకరంగా ఉండెను.

ఇట్లు కిష్కింధకాండ యందు తృతీయ సర్గ సమాప్తము.

---

## చతుర్థ సర్గము

# శ్రీ మహాదేవుడు పార్వతితో పలికెను

అచ్చట కొండపైని వర్షకాలమునందు శ్రీరాముడు మణిగుహాలందు నివసించుచు లక్ష్మణునితో సుఖముగా కాలము గడుపుచుండెను. గాలితో కదల్చబడిన మేఘములు లోపల కాంతి(మాత)మైన మెరుపులు జాలుకుచ్చులతో కూడిన గజములవలె సౌందర్యముగ కనుపించెను. పచ్చగడ్డిమేసిన లేళ్లు, రంగు రంగుల పక్షులు రామున్ని చూచి కదలకుండా ధ్యాననిష్ఠులైన మునీశ్వరులవలె నిలపడినవి. భూమియందు పరమాత్మ నడచుచు కదులుచున్నాడని సిద్ధగణములు మృగపక్షి వేషములతో రాముని సేవించిరి. ధ్యానతత్పరుడైన రాముని లక్ష్మణుడు ఒకదినమున చూచి భక్తిచేతను, ప్రేమచేతను సమాధినుండి బహిర్దృష్టి గలవానిని జూచి పలికెను. అనాదినుండి ప్రవాహమువలె వచ్చుచున్న అజ్ఞానము నీయొక్క పూర్వోక్త ఉపదేశమువలన నశించినది. ఇప్పుడు బ్రాహ్మణ, క్షత్రియాది వర్ణములకు స్త్రీ శూద్రులకు కూడ సులభంగా మోక్షము నిచ్చు క్రియామార్గమును విన సంకల్పము కల్గినది. లోకములో యోగులు నీ ఆరాధనను ఏ విధంగా చేస్తారో అట్టి క్రియామార్గమును ఉపదేశింప వేడుచున్నాను. పూర్వము బ్రహ్మ, వ్యాసుడు, నారదుడు కూడ ఈ క్రియామార్గమును ముక్తికి సాధనముగ చెప్పిరి. నేను నీకు తమ్ముడను. నీ భక్తుడను లోకోపకారకమైన క్రియ మార్గమును సెలవియ్యవలెను. అని పలికెను.

అంత రాముడు భగవంతుడైన తన్నుగూర్చి పూజావిధానము

నకు అంతులేదు. అయినను సంక్షిప్తంగా క్రమంలో చెప్పెదను. నాయందు భక్తికలిగిన మానవుడు తన శాఖకు అనుగుణంగా గృహ్య సూత్రముల ద్వారా ఉపనయనాది సంస్కారములు పొందిన తరువాత, సద్గురువును పొంది అతనినుండి మంత్రమును గ్రహింప వలెను. అట్టి గురువుచెప్పిన విధిప్రకారము నన్ను తన హృదయ మందు గాని, అగ్నియందు గాని లేక ప్రతిమయందు గాని, లేక సూర్యునియందు గాని, శాలిగ్రామమునందు గాని సావధాన మనస్కుడై నన్ను శ్రద్ధతో ఉపాసన చేయవలెను. మొదట దేహశుద్ధికొఱకు తెల్లవారగనే స్నానము చేయవలెను. ఆ స్నానము చేయునపుడు వైదిక మంత్రములను గాని, తాంత్రిక మంత్రములను గాని ఉచ్చరించుచు శరీరమందు శాస్త్రోక్త ప్రకారము మట్టిని ధరించ వలెను. లేక విభూతిని కుంకుమలను చందనమును గాని ధరించ వలెను. ఆ తరువాత నియమాను సారంగా సంధ్యావందన మాచరించవలెను. సిద్ధికొఱకు ముందు సంకల్పమును చేయవలెను. తన గురువుగా (రాముని) నన్ను పూజించ వలెను. నా ప్రతిమకు లేక శాలగ్రామమునకు స్నానమును తక్కినవానికే మార్జనము చేయవలెను. ప్రసిద్ధము లైన గంధపుష్పాదులతో నా పూజ చేయవలెను. ఇది సిద్ధిని ఇచ్చును. నిర్మలమైన మనస్సుతో నా పూజను చేయవలెను. ప్రతిమాదులయందు అలంకారము నాకు ఇష్టము. అగ్నియందు హవిస్సుచేతను, సూర్యునియందు సూర్యాకారమును వేదికయందు ఉంచి పూజించవలెను. భక్తితో ఇవ్వబడిన శ్రద్ధాపూర్వకంగా ఇవ్వ బడ్డదయితే నీరుకూడ నాకు ప్రీతికరము. ఇంక పిండివంటల, పరమాన్నము మున్నగువానిని సమర్పించినచో చెప్పవలసిన దేముంది? గంధ, పుష్ప, అక్షతములుతో పూజ కూడ నాకు ప్రీతి కరము. పూజాద్రవ్యముల నన్నిటిని ముందుగా సమకూర్చుకొని

నా పూజను ప్రారంభించ వలెను. ముందుదర్భలు దానిపై లేడి చర్మము, దానిపై పట్టుబట్ట ఏర్పరచుకొని తన ఆసనమును లెస్సగా ఏర్పరచుకొన వలెను. శుద్ధమానసము కలవాడై దేవునికి అభిముఖుడై లోపల, బయట కూడ న్యాసమును చేయవలెను. విష్ణుపంజర విధిచే చేయవలెను. కేశవ అను ఇరువది నాలుగు నామములను ఉచ్చరించ వలెను. తరువాత తత్త్వన్యాసమును చేయవలెను. నా మూర్తియందు పంజరన్యాసము, మంత్రన్యాస మును చేయవలెను. కలశను తనముందు ఎడమ భాగమందును పూజా ద్రవ్యములను కుడిప్రక్కన ఉంచవలెను. అర్ఘ్యమునకు ఒక పాత్రను, పాద్యమునకు ఒక పాత్రను, మధుపర్కమునకు ఒక పాత్రను ఆచమనమునకు ఒక పాత్రను నాలుగు పాత్రలను ఉంచవలెను. ఆ తరువాత హృత్కమలమునందు జీవసంజ్ఞ గల నాయొక్క కలశను ధ్యానము చేయవలెను. భానుసమానమైన హృదయము నందును, ఆ తరువాత శరీరము నందంతటను ఆ జీవ కలశను ధ్యానము చేయవలెను. ప్రతిమాదులకు పూజచేయు సమయిమునందు కూడ ఆ జీవకలశను ప్రతిమాదుల యందు ఆవాహనము చేయవలెను. పాద్యము, అర్ఘ్యము, ఆచమనము, స్నానము, వస్త్రము, అలంకారము మున్నగువానిచే లేనిచో శక్త్యానుసారముచే దొరికిన సామాగ్రిచే కాపట్యము లేకుండా పూజ చేయవలెను. ఐశ్వర్యముంటే కర్పూరము, కుంకుమ, అగరుబత్తి, చందన శుభ్రమైన సుగంధ కుసుమములచేతను, మంత్రో చ్చారణ చేస్తూ నా పూజను చేయవలెను. ఆ విధంగా నీరాజనము (ఐదు వత్తులతో ఆరతి).

ధూపదీప నైవేద్యముల ద్వారా వేదోక్తమైన దశావరణ పూజను చేయవలెను. ప్రతినిత్యము మిక్కిలి శ్రద్ధతో అన్ని పదా ర్థములను నివేదనము చేయవలెను. ఎందుకంటే నేను పరమాత్మను

శ్రద్ధను తింటాను. శ్రద్ధనే తింటానని మఱచి పోకూడదు. ( శ్రిద్ధాభుక్ అను ప్రయోగము ).

(ఇంకొక గ్రంథమందు నా దృష్టిలో కనపడలేదు). పూజ అయిన పిమ్మట విధిపూర్వకంగా హోమము చేయవలెను. మంత్రి కోవిదుడు అనగా మంత్రార్థములను తెలిసిన వాడగుచు హోమము చేయవలెను. అగస్త్యమునిచేత చెప్పబడిన శాస్త్రవిధి ప్రకారము హోమకుండము తయారుచేసి అందులో గూరూక్త మంత్రముచేత గాని, పురుషసూక్తము చేతగాని హోమము చేయవలెను. లేక ఔపాసనాగ్ని యందు హవిస్సు చేతను, చరువు చేతను, హోమము చేయవలెను. కాల్చబడిన బంగారురంగు గలవాడు దివ్యాభరణ భూషితుడు అగ్నిహోత్రి మధ్యయందు ఉన్నవాడు యజ్ఞపురుష రూపంలో ఉన్న పరమాత్మను ధ్యానము చేయవలెను. విష్ణువు యొక్క పార్షదులకు బలిని ఇవ్వవలెను. ఆ తరువాత హోమ సమాప్తిని చేయవలెను. ఆ తరువాత మౌనము వహించి నన్ను స్మరిస్తూ జపము చేయవలెను. ముఖశుద్ధి కొఱకు తాంబూలమును ఇచ్చి నాకొఱకు నృత్యమును, గీతమును, స్తుతిపాఠములను చేయవలెను. భూమిమీద వ్రాలి సాష్టాంగదండ ప్రణామము చేయవలెను. హృదయమందు నన్ను ధ్యానించి, నాచేత ఇవ్వబడిన భావనామయ ప్రసాదమును ఇది భగవత్ ప్రసాదమని తలంచి తలపైని ఉంచి భక్తిభావంతో నాయొక్క చరణమును శిరస్సునందు గ్రహించి "నన్ను ఘోరమైన సంసారము నుండి రక్షించమని నమస్కరించవలెను. ఆ తరువాత శాస్త్రోక్తముగా ఉద్వాసన చేయవలెను. ఆ ఉద్వాసన చేసేటప్పుడు జీవకళ తిరిగి భగవంతుని యందు ప్రవేశించునట్లు తలంచవలెను. పైని చెప్పిన రీతిని శాస్త్రోక్తముగా పూజచేసేవాని వా అనుగ్రహము వలన సిద్ధిని పొందును. నా భక్తులు అను నిత్యము ఈ విధంగా ప్రతిదినము పూజచేసినచో నా సాయుజ్యమును పొందెదరు. ఇందులో సంశయము లేదు.

ఇది చాలా రహస్యమైనది, సనాతన మైనది, పావనమైన, ఉత్కృష్టమైనది. నా చేతను సాక్షాత్‌గా చెప్పబడినది. నిత్యము పఠించినను, వినినను దానివలన సంపూర్ణ పూజాఫలము కలుగును. శేషుని అంశమైన లక్ష్మణుడు అడుగగా అనుత్తామమైన క్రియా యోగమును భక్తుడైన లక్ష్మణునకు ఉపదేశించెను. ఆ తరువాత రాముడు ప్రాకృతుడువలె తిరిగి హా సీతే! హా సీతే! అని దుఃఖించి నిద్రించెను.

కిష్కింధా నగరమందు సుగ్రీవుని చూచి రామకార్యమునందు సుగ్రీవునికి శ్రద్ధకలుగలేదని రాజ్యాభిషిక్తుడై స్త్రీ సుఖమును, రాజ్య సుఖమును అనుభవించుచు రాముని యెడచేసిన మైత్రీపూర్వక ప్రమాణమును మరచెననియు, తారతో కూడ సుఖించుచు కృతఘ్నుడాయెననియు, వాలినివలె తన్నును కూడ రామునికి కోపము వస్తే హతమార్చ గలడని హెచ్చరించెను. హనుమద్వచనమును విన్న సుగ్రీవుడు హనుమంతుడు చెప్పిన దంతయు, సత్యమే యనియు వెంటనే రామకార్యము నుద్దేశించి పదివేలమంది వానరులను వేగముగా చలించువారిని అయత్తపరచమని చెప్పెను. సప్త ద్వీపగతులగు వానరుల నందఱిని ఒక పదునైదు దినములలో హాజరు కావలసినదిగా అనతిచ్చెను. ఆ గడువులో రానిచో వారు మృత్యువును చవిచూస్తారని హెచ్చరించెను. హనుమంతుడన్ని దిక్కులకు వార్తాహరులను సుగ్రీవాజ్ఞ తెలియచేయమని పంపెను. సమర్థులయిన వారలు వాయువేగముతో ప్రయాణము చేయగల వారు పర్వతాకారులయిన వార్తాహరులను అన్ని దిక్కులకు పంపెను.

ఇట్లు కిష్కింధకాండలోని చతుర్థ సర్గము సమాప్తము.

---

పంచమ సర్గము

## శ్రీ మహదేవుడు పలికెను

శ్రీరాముడు ప్రవర్షణ పర్వతమందు మణిమయ శిఖరమీాదు కూర్చొని సీతావియోగమువలన కలిగిన దుఃఖమును సహించలేక లక్ష్మణుని పిలిచి ఇట్లనెను. లక్ష్మణ! నా సీత రాక్షసునిచేత అపహరింపబడి బ్రతికియున్నదో లేక ప్రాణములు విడిచినదో నిశ్చయించ లేకున్నాను. బ్రతికియుంటే ఎక్కడ ఉన్నను తిరిగి తీసికొని రాగలను. సముద్రమందలి అమృతమునువలె సుఖంగా తీసికొని వస్తాను. నేను ఒక ప్రతిజ్ఞ చేయుచున్నాను వినుము. ఏ దుర్మార్గుడు జానకిని అపహరించెనో వానిని బంధుమిత్ర సేనా సమేతంగా భస్మంచేస్తాను. రాక్షసాలయంలో నివసిస్తూ దుఃఖార్తురాలవై నన్ను చూడకుండా ఎటుల ప్రాణములను ధరించుచున్నావు. ఓ సీతా! సీతలేని కారణాన నాకు చంద్రుడుకూడ సూర్యుడువలె కనపడు చున్నాడు. చంద్రా! నీవు ముందు నీ శీతల కిరణములచే జానకిని స్పృశించి తరువాత నన్ను స్పృశించు. సుగ్రీవుడు దయాహీనుడు నాగురించి మఱచిపోయేడు. శత్రురహితమైన రాజ్యమును పొంది రహస్యంగా స్త్రీలతో రమించుచు మద్యపానం చేస్తూ అతికాముకుడై నేను చెసిన మేలును మఱచి పోయెను. శరదృతువు సమీాపించినను జానకిని వెదకుటకు రాలేదు. వీడు కృతఘ్నుడు నేను వానికి పూర్వమందు ఉపకారము చెసినాను. దుష్టుడా విషయమును మరచి పోయాడు. సుగ్రీవున్ని కూడా సబాంధవంగా వాలిని వలె చంపివేస్తాను.

ఈ విధంగా అతికోపంతో ఉన్న రాముని జూచి లక్ష్మణుడు

పలికెను. ఇప్పుడే సుగ్రీవుని చంపివేసి నీ దగ్గఱ పడవేస్తాను. అనుమతి యివ్వండి. ధనుస్సు తూణీరములను గ్రహించి వెళ్లుటకు సిద్ధముగా ఉన్న లక్ష్మణుని జూచి రాముడు పలికెను. వత్స లక్ష్మణ! సుగ్రీవుడు నా కిష్టుడైన మిత్రుడు. నీకు వాడు వధార్హుడు కాడు కాని భయపెట్టు. వాలికి పట్టిన గతి తనకు కూడ పడుతుందని చెప్పి బెదిరించుము. అటులనే అంటూ లక్ష్మణుడు సుగ్రీవుని వార్తను వెనువెంటనే తీసికొని వచ్చెదనని బయలు దేరెను.

నిత్యలక్ష్మీ సంపన్నుడు, విజ్ఞాననిధి, సర్వజ్ఞుడు అయిన రాముడు ఒక సాధారణ మానవుడువలె సీతను గూర్చి విలపించెను. సమస్త ఇంద్రియములకు బుద్ధికి సాక్షియైన పరమాత్మ మాయా తీతుడు రాగద్వేషాది వికారములు లేనివాడయి యున్నను శోకమెపు డగుట ఎట్లు సంభవము? తపస్సుచేసిన దశరథునకు పుత్రుడయి పుట్టి మానుషవేషమును అంగీకరించిన విష్ణువు మాయతో కూడిన మూర్ఖులకు కూడ మోక్షమును ఇవ్వదలచి, సమస్త లోకముల పాపములను పారద్రోలు రామాయణ కథను లోకములో ప్రశస్త ముగా నుండుటకు కామమును, క్రోధమును, మోహమును, కార్య సాధన కొఱకు నటించి గుణములు లేనివాడయ్యు గుణరక్తుడు వలె ప్రవర్తించెను. విజ్ఞానమూర్తి, విజ్ఞాన శక్తిమంతుడు, సాక్షి భూతుడు, గుణాతీతుడు, కామక్రోధముల వలన లిప్తుడు కానివాడు ఆకాశమువలె లిప్తుడు కానివాడు అగు రాముని జనకుడు మున్నగు మునులు తెలిసికొను చున్నారు. మఱియు నిర్మలమనస్కులైన భక్తులు తెలిసికొను చున్నారు. జన్మలేని భగవంతుడు భక్తుల యొక్క చిత్తానుసారము అవతారము నెత్తును. లక్ష్మణుడు క్రోధ ముతో కూడినవాడయి కిష్కింధా నగరమునకు చని ధనుర్బాణ ధరుడయి సమస్త వానరవీరులను హతమార్చే విధముగా ధనుష్టం

కారము చేయుచు భయపెట్టెను. వానరులు యుద్ధసన్నద్ధులగు చుండగా అంగదుడు వారించెను. అంగదుడు లక్ష్మణునకు ప్రణమిల్లి సాష్టాంగదండ ప్రణామము గావించెను. లక్ష్మణు డంగదుని కౌగలించుకొని "వత్స ! నీ పినతండ్రియైన సుగ్రీవునితో నివేదించుము". శ్రీరాముడు మంచి క్రోధముతో తన్ను పంపెనని నివేదింపుము అనెను. సుగ్రీవుడు అంగదుని మాటలను విని భయపడి ఆంజనేయుని పిలిచి అంగదుడుతో కలసి లక్ష్మణుని లోపలకి తీసికొని రావలసినదిగా పంపెను. లక్ష్మణుని శాంతము, మృదువైనట్టి సంభాషణముతో సంభాళించి తీసికొని రమ్మనెను. తార చాలా సంతసించి మధ్య గృహములోనికి ప్రవేశించెను. హనుమంతుడు కార్యవాది చతురుడు లక్ష్మణుని బుజ్జగించి నగరంలోనికి తీసికొని వెళ్లి అంతఃపురమునకు కూడ ఆహ్వానించెను. లక్ష్మణుడచ్చట పెద్ద మేడలను, సేనానాయక మందిరములను చూచి దేవేంద్రుని మందిరముతో సమానమైన రాజమందిరంలోనికి ప్రవేశించెను. అచ్చట తార సర్వాభరణ సంపన్నమై, మదముతో ఎర్రని నేత్రాంతములు కలది, మందహాస పూర్వకంగా లక్ష్మణునితో పలికెను. హే దేవ ! దయచేయుడు. లక్ష్మణ ! నీవు భక్తవత్సలుడవు. నీ భక్తుడు దాసుడు అయిన సుగ్రీవునిపై కినుక నేల వహించితివి. సుగ్రీవుడు బహుకాలము దుఃఖమునే అనుభవించెను. అప్పుడు మీరు వాని కష్టములను తొలగించితిరి. మీ అనుగ్రహము వలన బుద్ధిమంతుడైన సుగ్రీవుడు సౌఖ్యమును అనుభవించు చున్నాడు. కామాసక్తుడు జాతిచేత కోతి అందువలన రఘుపతి సేవలకు రాలేదు. సమస్త దిక్కులనుండి లక్షలాది వానర శ్రేష్ఠులను యోధులను తీసికొని వచ్చుటకు పదివేలమంది వానరభటులను పది దిక్కులకు పంపినాడు. వానర యోధులంతా వస్తారు. వారితో కలిసి సుగ్రీవుడు రాక్షసుల నందరిని చంపి రావణుని కూడా చంపుతాడు. నీతో ఇప్పుడే కలసి సుగ్రీవుడు వస్తాడు. చూడు పిల్లలు, భార్యలు, మిత్రులతో

ఆనందంగా అంతఃపురంలో ఉన్నాడు. వానిని కలసి వానికి అభయ దానము చేయుము. చేసి సీతోపాటే శ్రీరామచంద్రుని దగ్గఱకు తీసికొని వెళ్లుము. అని తార ఆహ్వాన పరచెను. లక్ష్మణుని కోపము తార సంభాషణవలన తగ్గినది. సుగ్రీవుని అంతఃపురములోనికి ప్రవేశించెను. రుమను ఆలింగన చేసికొంటూ సుగ్రీవుడు మంచము మీద ఉండెను. లక్ష్మణుని రాకచూచి భయముతో మంచమునుండి పడిపోయెను. సుగ్రీవుని కళ్లు మదముతో ఎఱ్ఱపారి యున్నవి. లక్ష్మణుడు క్రోధముతో ఎఱ్ఱని నేత్రములు కలవాడయి సుగ్రీవుని గూర్చి పలికెను. ఓ దుర్వృత్తా! రామున్ని మరచిపోయితివి. వాలిని చంపిన బాణము నీగురించి నిరీక్షిస్తోంది. నాచేత చంపబడి నీవు కూడ వాలి మార్గమునే పొందుతావు. ఈవిధంగా పరుషంగా సంబాషించుచున్న లక్ష్మణుని చూచి హనుమంతుడు పలికెను.

హే లక్ష్మణ! నీవిట్లు మాట్లాడుట ఆశ్చర్యకరంగా ఉంది. వానరాధిప యైన సుగ్రీవునికి నీకంటె రామునియందు ఎక్కువ భక్తి కలదు. రామకార్యమున తడుమరువ లేదు. రాత్రింబవళ్లు అందులోనే నిమగ్నుడై యున్నాడు. చూడు దిక్కులంతట కోటిమంది వానరులు వచ్చినారు. వెంటనే వీరంతా సీతామార్గణమునకు వెళ్లెదరు రామకార్యాన్ని నిశ్శేషంగా సాధిస్తారు. అని హనుమంతుడు చెప్పగానే లక్ష్మణుడు లజ్జితుడయ్యెను. సుగ్రీవుడు అర్ఘ్యపాద్యాదులతో లక్ష్మణుని పూజించి, ఆలింగన చేసికొని నేను రాముని దాసుడనని చెప్పెను. నేను రామునిచేతనే రక్షింప బడితిని. రాముడు అర్ధనిమిషములో సర్వలోకములను నాశనము చేయకలడు. వానరయుక్తునైన నేను సహాయ మాత్రుడనే. లక్ష్మణుడంత సుగ్రీవుని క్షమాపణ వేడికొనెను. తనచేత పరుషవాక్యములు స్నేహమువలన పలుకబడినవనియు, నేను వెంటనే రాముని దగ్గఱకు వెళ్లిపోవాలనియు, ఒంటరిగా ఉన్నాడనియు, అరణ్యంలో జానకీ విరహము

వలన దుఃఖితుడై నాడనియు వినయముతో పలికెను. అటులనే అంటూ రాజయిన సుగ్రీవుడు లక్ష్మణునితో రథమెక్కి సమస్త వానరసైన్యము వెంట రాగా శ్వేతాతపత్రములతో ఛత్రచామరములతో దుందుభి ధ్వనులతో నీలుడు, అంగదుడు, హనుమంతుడు మున్నగు మహాయోధులతో కూడి రాముని కొఱకు చనెను.

ఇట్లు కిష్కింధకాండ యందు పంచమ సర్గ సమాప్తము.

—○—

## ఆరవ సర్గము

సుగ్రీవ లక్ష్మణులు గుహయొక్క ప్రవేశ ద్వారమందు రాతిపయి కూర్చొనియున్న జటావల్కలములను ధరించిన రాముని చూచి దూరమందే రథముదిగి భక్తిపూర్వకముగా రాముని పాదములందు పడి నమస్కరించిరి. రాముడు సుగ్రీవుని ఆలింగనము చేసికొనెను. కుశలప్రశ్నల నడిగి తన ప్రక్కన కూర్చొనపెట్టుకొని యథాన్యాయంగా సత్కరించెను. అంత సుగ్రీవుడు కామరూపులయిన లక్షలాది వానరులను, పర్వతాకారులను, దేవాంశ సంభూతులను, యుద్ధ విశారదులను చూపించెను. వీరిలో కొందరు గజబలులు మఱికొందరు దశగజబలులు మఱికొందరు పదివేల ఏనుగుల బలము కలవారు. కొందరు నీలాద్రి సన్నిభులు, కొందరు సువర్ణ చ్ఛాయగల మేరుపర్వత సములు యుద్ధమును కాంక్షించుచు మొత్తము వానరసైన్య మంతయు రాముని అనుజ్ఞకు వేచియున్నారని పలికెను. ఎలుగుబంట్లకు రాజు జాంబవంతుడు మంచి బుద్ధిమంతుడు ఇతడు ఒక కోటి ఎలుగుబంట్లకు సేనానాయకుడు. వీడు హనుమంతుడు. మహాపరాక్రమ సంపన్నుడు. వాయుపుత్రుడు మహాతేజస్వి, బుద్ధిమంతులలో అగ్రగణ్యుడు. ఇంక వీరిలో ముఖ్యులయిన మహావీరు లున్నారు. నలుడు, నీలుడు, గవయుడు, గవాక్షుడు, గంధమాదనుడు, శరభుడు, మైందవుడు, గజుడు, పనసుడు, బలిముఖుడు, దధిముఖుడు, సుషేణుడు, తారుడు మఱియు కేసరి కలరు. ఈ కేసరి హనుమంతుని తండ్రి. ముఖ్యమైనవారు వీరందరు సేనానాయకులతో పరిచయము చేసితిని. వీరు కాకుండా దేవేంద్ర తుల్యపరాక్రములుకల కోట్లాది కపివీరులు కలరు. వీరంతా దైవాంశ సంభూతులు. మీ ఆజ్ఞకొఱకు ఎదురు

చూచుచున్నారు. వాలి సుతుడైన అంగదు డితడు. వాలితో సమాన బలము కలవాడు. రాక్షసులుపాలిటి యము డితడు. వీరు వీరితో కలసి లక్షలాది వీరులు నీకొఱకు ప్రాణత్యాగము చేయుటకు సన్నద్ధులై యున్నారు. వీరందరు మీ అజ్ఞావర్తులే. మీ అండలో ఉండువారే అని సుగ్రీవుడు సేనలను పరిచయము చేసెను.

అంత రాముడు ఆనందభరితుడై సుగ్రీవుని ఆలింగనము చేసికొని సుగ్రీవునితో అనెను. సుగ్రీవుని కార్యదీక్షతను సమయజ్ఞతను మెచ్చుకొని నీ కిష్టమయితే జానకిని వెదకుటకు పంపుము అనెను. ప్రభువువారి ఆనఅంటూ సుగ్రీవుడు అన్ని దిశలకు వివిధులైన వానరులను పంపెను. దక్షిణ దిశకు మాత్రం యోచనచేసి మహాబలవంతులైన అంగదున్ని; జాంబవంతుని మహాబలుడైన హనుమంతుని, నలున్ని, సుషేణున్ని, శరభుని, మైందుని, ద్వివిదున్ని పంపెను. వారి కందరికీ కఠినమైన అజ్ఞలను జారీచేసెను. శుభదేవతయైన జానకమ్మను మీరందరు వెదకవలెను. మీకు గడవు ఒక నెల దినములు ఒక మాసములో తిరిగి రావలెను. సీతను చూడకుండ నెలకు ఒక రోజు మించినా మీకు మరణదండము విధించబడును. అని వారిని పంపెను. అందుకే లోకంలో సుగ్రీవాజ్ఞ ప్రసిద్ధి కెక్కినది. అ తరువాత సుగ్రీవుడు రాముని ప్రక్కనే కూర్చొని యుండెను.

ప్రయాణ మగుచున్న ఆంజనేయున్ని పిలిచి రామచంద్రుడు పలికెను. “ఇదిగో ఉంగరము. దీనియందు “రామ” అని నా పేరు వ్రాయబడినది. గుర్తుపట్టుటకు రహస్యంగా దీనిని సీతమ్మకు ఇచ్చివేయుము. ఓ కపిశ్రేష్ఠ ! ఈ కార్యమందు నీవే సమర్థుడవు. నీ బలమంతా నాకు తెలుసును. వెళ్లుము. నీకు మార్గమములు శుభకరములగు గాక”. అని ఆశీర్వదించి పంపెను. ఈ విధంగా సుగ్రీవునిచేత నియమింపబడిన యువరాజు అంగదుడు మున్నగు వీరులు సీతమ్మ

కొలకు వెదకుచు వింధ్యపర్వతమునందు ఒక రాక్షసుని చూచిరి. ఆ రాక్షసుడు పర్వతంవలె భీషణాకారుడు అడవి మృగములను ఏనుగులను భక్షించుచు భయంకరంగా కనపడెను. కొంత వానర సైన్యము వాడు రావణుడని కిలకిల శబ్దమును చేసిరి. ఆ తరువాత పిడికిళ్లతో పొడిచి చంపివేసిరి. కాదుకాదు - రావణుడింత సులువుగా చావడని ఇంకొక వనమునకు వెళ్లిరి. అంతట వారికి దాహమధిక మైనది. నీటికి ప్రయత్నం చేయుచు లతలతోను, గడ్డితోను బాగా కప్పబడిన కొండగుహను చూచిరి. ఆ గుహనుండి హంసలు, క్రౌంచ పక్షులు బయటకు వచ్చుటను చూచి ఇచ్చట నీరు తప్పక దొరుకు నని హనుమంతుడు ముందుగా గుహలో చొరుట చూచి తక్కిన వానరులు వానివెనుక బయలుదేరిరి. ఒకరి చేతులను భుజములను మరియొకరికి సాయమిచ్చుచు చీకటిలో చాలా దూరము వెళ్లి అచ్చట స్ఫటికతో సమానమైన నీరు గలదిని, కల్పవృక్షముల వంటి పండ్లచెట్లను, తేనెగుట్లు గలవానిని, ఆ ప్రక్క దివ్యవస్త్రములను, దివ్య ఆభరణములను, దివ్యమైన భక్ష్య భోజ్య లేహ్య చోహ్యమైన తినుబండారములను గల దివ్యమందిరమును కనుగొనిరి. ఆ యింట్లో ఒక సువర్ణ రచిత సింహాసనమందు యోగాభ్యాసంలో నిమగ్నమై యున్న కాంతిచేత మందిరమునంతను వెలిగించుచున్న ఒక స్త్రీని చూచిరి. వానరులందరు భయముచేత, భక్తిచేత కూడ ఆమెకు నమస్కరించిరి. వానరులను చూచి ఆ దేవి మీరెందుకు వచ్చిరి? ఎందునిమిత్తము వచ్చిరి? ఎవరి దూతలు మీరు? నా స్థానము నకు ఏ విధంగా రాగలిగితిరి అని అడిగెను.

అంత హనుమంతుడు పలికెను: హే దేవి! అయోధ్యాధిపతి యైన దశరథ మహారాజుని జ్యేష్ఠ కుమారుడు రాముడు తండ్రి అజ్ఞచే తన తమ్ముడు లక్ష్మణునితోను, భార్య సీతతోను వనవాసము నకు వచ్చెను. అచ్చట దుర్మార్గుడైన రావణుడు రాముని భార్యను

అపహరించెను. లక్ష్మణునితో కూడ రాముడు సుగ్రీవునితో మైత్రి చేసికొనెను. సుగ్రీవుడు మిత్రభావంతో జానకిని వెదకమని మమ్ములను నియమించెను. వనమందు జానకిని వెదకుచు నీరును కోరుచు మేమిచ్చటకు వచ్చితిమి. దుర్గమమైన గుహను దాటి దైవంవలన మేము ఇచ్చటకు వచ్చితిమి. నీ వెవతెవు? ఎందుకిచ్చట ఉంటున్నావు. నీ గురించి మాకు కొంచెము తెలియజేయమని అడిగెను. అంత యోగిని "ముందు మీరంతా మంచినీరు త్రాగి మంచిమంచి పండ్లను మీ యిష్టము వచ్చినంత తిని తరువాత రండి. నా వృత్తాంతమును మొదటినుండి చెప్పెదను. అటులనే అని చెప్పి వానరులందరు కావలసిన ఫలములను తిని నీళ్లు కడుపునిండా త్రాగి వినయ విధేయతలతో చేతులు జోడించి ఆ దేవిఎదుట ఉండిరి. దేదీప్యమాన కాంతిగల దివ్యకాంత యోగినీ వేషధారిణి హనుమంతుని జూచి పలికెను. పూర్వకాలమందు విశ్వకర్మకు "హేమ" అను పేరుతో ఒక కన్య ఉండెడిది. అమె దివ్యకన్యక. తన నటనాచాతుర్యంతో పరమశివుని ఆనందింప జేసెను. మహేశ్వరుడు సంతోషించి ఈ దివ్యపురమును ఆమెకిచ్చెను. ఆ సుందర దేవత ఇచ్చట కొన్ని వేల సంవత్సరాలు నివసించెను. నేను ఆమెకు చెలికత్తెను గంధర్వ కన్యకను. నా పేరు స్వయంప్రభ. ఆ దేవకన్య బ్రహ్మలోకం వెళ్లుచు నన్ను ఇచ్చట తపస్సు చేయమని అడిగినది. సర్వప్రాణి విరాజితమైన ఈ మందిరమందుంటూ తపస్సు చేయమని అడిగెను. త్రేతాయుగములో నారాయణుడు దశరథుని కుమారుడయి భూభారమును తగ్గించుటకు అరణ్యంలో సంచరించెదరు. అతని భార్యను వెదకుచు జలములకొఱకు నీ గుహకు వానరులు వచ్చెదరు. వారలను పూజించి సత్కరింపుము. రాముని నమస్కరించి స్తోత్రము చేసి భగవంతుడైన విష్ణువుయొక్క మందిరమును యోగీశ్వరులకు ప్రాప్తమగు వైకుంఠమును పొందుమని నాతో చెప్పెను. అందు

వలన నేను ఇచ్చటనుండి తొందరగా రాముని దగ్గఱకు వెళ్లెదను. మీరు మీమీ కన్నులు మూసుకొనండి. నేను గుహనుండి బయటకు వెళ్లెదను. వారలు అటులనే అని చెప్పి కళ్లుమూసుకొని ఆ తరువాత ముందు సంచరించిన వనమునకు చనిరి. స్వయంప్రభ గుహను వదిలిపెట్టి రాముని సన్నిధికి అరిగెను. రామలక్ష్మణ సుగ్రీవులను చూచెను. రామునికి ప్రదక్షిణచేసి గద్గదమైన గొంతుకునుండి సన్న గిల్లిన వాక్కులతో పలికెను. శరీరమందంతటను గగుర్పాటు కలిగెను. రామ! నేను నీయొక్క దాసిని. మీ దర్శనమునకు ఇచ్చటకు వచ్చితిని. నేను కొన్ని వేల సంవత్సరాలు అతి ఘోర మైన తపస్సును చేసితిని. ఇన్ని సంవత్సరములు గుహ యందుండి తపస్సు చేసితిని. ఆ తపస్సు ఇప్పుడు ఫలించినది. మాయకు అవతల నుండు, నిన్ను నేను ఇప్పుడు నమస్కరించు చున్నాను. సర్వ భూతములందు లోపల బయట కూడ ఉన్నప్పటికి కనపడవు. అజ్ఞానులకు నీవు కనపడవు. ఇంద్రజాలుని సామన్యుడు పోల్చుకో లేనట్లు. సాధారణ మానవులు నిన్ను తెలిసికొనలేరు. మహాభాగవ తోత్తములకు నీవు భక్తి యోగ విధానమును తెలియపఱచుటకు అవతరించితివి. తమోగుణుడు నిన్ను తెలిసికొన జాలడు. లోకములో నీ తత్త్వమును తెలిసినవాడు ఒకడైనా ఉంటే ఉండనీ. నా హృదయ మందు మాత్రం మీ రూపమే ఎల్లప్పుడు మెలగుగాక. హే రామ! మోక్షదాయకమైన నీ చరణకమలమును చూచితిని. అది సంసార మును దాటవేయు నావ. అది సన్మార్గులకు జ్ఞానబోధ. ఓ ఆది పూరుష! ధనపుత్రకలత్ర సంపదలచే మదించు మానవులు నీయొక్క స్తోత్రమును చేయలేరు. ఎందుకంటే నీవు అకించనులకు సొమ్ము. నశించిన త్రిగుణములు కలవారు, నిష్కించన ధనులయొక్క హృదయములందు రమిస్తావు. నీవు నిర్గుణుడవు అయినను సుగుణు డవు. నీకు క్షణం క్షణం నమస్కరించు చున్నాను. కాలరూపంతో అందరిని నియమించిన వాడవు. ఆది మధ్య అంతములు లేనివాడవు.

అంతట సమాన భావంతో చరించు వాడవు. పరమ పురుషుడవు నీవు. మానవచేష్టలను అనుకరించు నీ చేష్టలను ఎవరు తెలిసికొన లేదు. నీకెవడు ఇష్టుడు లేడు, ప్రియుడు లేడు, ఉదాసీనుడు లేడు. నీ యొక్క మాయచేత కప్పబడిన మనస్సు కలవారై జనులు వారి వారి భావనానుసారం ఆ విధంగా నిన్ను చూస్తారు. పుట్టుకలేని వాడు, కర్తృత్వము లేనివాడు, ప్రభువు అయిన నీకు పశుపక్ష్యాది జంతువులందు అవతారమెత్తుట జన్మము, పెరకువ, పేరు కలిగి యుండుట చాలా విస్తారమైన నీ లీల. నిన్ను నాశనము లేని (అవినాశి) ఈశ్వరు డంటారు. నీ కీర్తిని చెప్పుకుంటూ ఉండుటకు కథారూపంలో వినుటకు ఒక ఆలంబన ముండుటకు నీవు అవతార మెత్తుతావు. కొందరంటారు నీవు దశరథుని తపఃఫలసిద్ధికి జన్మమెత్తి నావని అంటారు. కొందరంటూరు నీవు కౌసల్య నోముల పంటని మఱికొంద రంటారు. దుష్ట రాక్షస సంహారమునకు అవతరించితివని కొందరంటారు. బ్రహ్మగారి ప్రార్థనవలన రాక్షస సంహారము కొఱకు పుట్టేవంటూరు. హే రఘునందనా ! ఏ జనులు నీ కథ లను వింటారో, ఏ జనులు నీ చరితమును గానం చేస్తారో వారలు తప్పకుండా సంసారరూప సముద్రమును దాటుటకు నీ పాదపద్మ ములను చూచెదరు. హే దేవ ! నీ మాయకు లోనయిన దానిని నేను. దానికి భిన్నమైనవాడివి నీవు. అట్టి నిన్ను నేను ఎట్లు చూడగలను. లేక నీ విషయములను స్తోత్రము చేయగలను. ధనుర్బాణధరుడైన రఘుశ్రేష్ఠుని నమస్కరించు చున్నాను. లక్ష్మణ సుగ్రీవులచేత కూడుకొని యున్న రఘురాముని ధ్యానించు చున్నాను.

ఇట్లు స్తోత్రము చేసిన స్వయంప్రభను శ్రీరాముడు అను గ్రహించి అమ్మా ! నీ మనసులోని కోఱిక యేమి ? అడిగెను. హే రాఘవ ! నీయందు భక్తికావాలి. ఎచ్చట ఎచ్చట ఏ యె

విధములను ఎత్తినను నిశ్చలమైన భక్తిని అపేక్షించు చున్నాను. నాకు ప్రాకృతజనులతో సహవాసము వద్దు. నీ భక్తులతో సహవాసము కావాలి. నా నాలుక ఎప్పుడు రామ, రామ అంటూ పలుకాలి. నా మనస్సు ధనుర్బాణధరుడు, పట్టుబట్టలను ధరించినవాడు, శ్యామలుడు, సీతాలక్ష్మణ సహితుడు, కిరీటమును ధరించినవాడు, బాహుపురులు అందెలు కలవాడు, ముక్తాహారములు, కౌస్తుభకుండలములు కలవాడు ప్రకాశించు రాముని నిరంతరము ధ్యానించాలి. ఇంకొక కోరిక లేదు ప్రభో !

శ్రీరాము డంత అటులనే కానిమ్ము. బదరీ వనమునకు వెళ్లుము. అచ్చటనే నన్ను స్మరించుచు పంచ భూతాత్మకమైన శరీరమును విడిచిపెట్టుము. ఆ తరువాత పరమాత్మనైన నన్నును తొందరలోనే పొందగలవు. అమృతపూరముతో తుల్యమైన శ్రీరాముని ఉపదేశమును స్వీకరించి బదరీవన ప్రదేశమునకు జని మనస్సునందు రామున్ని నిలిపికొని కళేబరమును విడిచిపెట్టి స్వయంప్రభ పరమ పదమును పొందెను.

ఇట్లు అధ్యాత్మ రామాయణంలో కిష్కింధకాండలో ఉమామహేశ్వర సంవాదమందలి ఆరవ సర్గ సమాప్తము.

## సప్తమ సర్గము

# శంకరుడు పలికెను

వానర సైన్యము సీతమ్మను వెదకుచు అమ్మను కానలేక విచారగ్రస్తులైరి. యువరాజైన అంగదుడు తనతోటి వానరులతో మనము బయలుదేరి నెల కావచ్చుచున్నది. సీతమ్మ జాడ తెలియ లేదు. సుగ్రీవు డిచ్చిన రాజశాసనము నెలదినములు గడచినవి. కిష్కింధకు తిరిగి వెళ్లినచో సుగ్రీవుడు చంపివేసెదడు. ముఖ్యంగా శత్రువు కుమారుడనైన నన్ను చంపి వేస్తాడు. అతనికి నేను జ్ఞాతిని. నాయందు అతనికి ప్రీతి యెట్లుంటుంది? నన్ను రాముడు రక్షించినాడు. నేను రాముని కార్యమును చేయలేదు. దీనిని మిషగా పెట్టుకొని నన్ను చంపివేస్తాడు. సుగ్రీవుడు దుర్మార్గుడు. తల్లితో సమానమైన తన అన్న భార్యను సంభోగిస్తున్నాడు. అందువలన మనము సుగ్రీవుని దగ్గఱకు వెళ్లవద్దు. ఏదో ఒక విధముచే మృత్యువుచే జీవితమును విడిచి పెట్టెదను. అని అంగదుడు కండ్ల నిండ నీళ్లతో ఏడ్చుచుండెను. అంత వారు అంగదుని ఓదార్చి నీకు ప్రాణభయ మేల? మేమంతా నీవెంట రక్షకుల ముండగా ఇచ్చటనే ఉండి పోదుము. ఈ కొండగుహలో భయము లేకుండా జీవితము గడుపుదాం. ఇచ్చట చాలా బాగుంది. అమరేంద్రుని స్వర్గపురంతో సమానంగా ఉంది. ఈ మాటలు వాళ్లలోవాళ్లు గుస గుసలుగా చెప్పుకొనగా అవి హనుమంతుని చెవిలో పడినవి. హను మంతుడు అంగదుని ఆలింగనం చేసికొని నీతియుక్తుడైన వాడు కనుక అంగదుని విచారించవలసిన అవసరము లేదని చెప్పెను. రాజు

గారికి నీ వత్యంత ప్రియపుత్రుడవు. సుగ్రీవునకు కూడ నీయందు ప్రీతి కలదు. రామునికి లక్ష్మణునియందు కంటె నీయందు ప్రీతి దినదిన ప్రవర్ధమానమగు చున్నది. అందువలన శ్రీరాముని వలన గాని, సుగ్రీవుని వలనగాని, నీకు భయమవసరము లేదు. హే వత్స! హితము కోరే నేనుండగా నీకు భయమేల ? ఇంకొక లేనిపోని ఆలోచనను చేసియకు. ఈ వానరు లంటున్నారు ఈ గుహయందు నివాసము ఎవరికి దుర్భేధ్యమని. రాముని బాణమునకు మూడు లోకములందు అభేద్యమయిన వస్తువులేదు. దుర్భోధల నిచ్చుచున్న యీ వానరులు ఇల్లు, పెండ్లాము, పిల్లలను విడిచిపెట్టి నీకు నిత్యం సహాయం ఎట్లు చేస్తారు. ఓ కుమారా ! నీకొక రహస్య విషయ మును చెప్పుచున్నాను. వినుము. "రాముడు మానవుడు కాడు. సాక్షాన్నారాయణుడే దేవుడే రాముడు. సీత మోహమును పుట్టించు మాయ. లక్ష్మణు డాదిశేషువు భూభారము నంతను ధరించిన శేష మూర్తి. బ్రహ్మగారి ప్రార్ధన ననుసరించి రాక్షస వినాశమునకు అవతరించిరి. మాయామానవ రూపములో లోకరక్షణకు అవతరించిరి. మేమంతా వైకుంఠ లోకములో ఉండే విష్ణువు యొక్క పార్షదులము (ద్వారపాలకులము). పరమాత్మ మనుష్యభావము పొందితే మేము అతని మాయచేత వానరు రూపంలో జన్మించాము. మేము తపస్సు చేసి చేసి జగత్పతియైన విష్ణువును ప్రార్థించగా అతని ద్వారపాలకు లుగా అనుగ్రహింప బడితిమి. ఇప్పుడు కూడా మాయచేత అతనినే సేవించు చున్నాము. తిరిగి వైకుంఠమును పొంది సుఖంగా అచ్చటనే ఉంటాము. అని అంగదుని ఓదార్చి వింధ్యపర్వతమునకు జనిరి. జానకిని వెదకుచు దక్షిణ సముద్ర తీరమందలి మహేంద్ర పర్వతమునకు చేరిరి. సముద్రమును చూచి ఏ విధముగా దీనిని దాటగలమని చింతాక్రాంతులై సముద్రపు టొడ్డున నివసించిరి. అంగదునితో సహా అందరు పరస్పరము విచారమునకు లోనయిరి. సీత జాడ కనపడలేదు. నెల దినములు గడువుదాటినది. సుగ్రీవుడు

చండశాసనుడు మనలను చంపకుండా వదలడు. సుగ్రీవుని చేతిలో చావుకంటె ప్రాయోపవేశము చేసి మరణించుట మనకు శ్రేయస్కరము. అని నిశ్చయించి దర్భలు పరిచి మరణోన్ముఖులైరి. ఇంతలో మహేంద్ర పర్వత గుహనుండి పర్వతోపమానమైన గేద్ద వచ్చి ఈ రోజు తనకు కావలసినంత ఆహారము దొరికినది. ఒక్కొక్క వానరమును రోజుకొక దానిని తింటూ మొత్తము నన్నిటిని భక్షించెదను అనెను. అగృధ్రి వచనమును విని వానరము లన్నియు మృత్యువు ఆసన్నమైనట్లు భయపడినవి. భయపడి జటాయువు ధన్యాత్ముడు, ధర్మాత్ముడు, పండితుడు రామకార్యము నిమిత్తము ప్రాణత్యాగము చేసెను. యోగీశ్వరులకు కూడ పొందరాని మోక్షమును పొందెను. అని అనిరి. "జటాయువు పేరు విన్నంతనే శ్రోత్రానన్దకమైన వాక్కును పలికిరి. జటాయువు అని మీలో మీరు పలుకుచుండిరి. జటాయువు నా సోదరుడు. మీకు భయము వలదు. చెప్పండి. వానరోత్తములారా" అని వృద్ధ గృధ్రము పలికెను. అంత అంగదుడు దాశరథియైన రాముడు సీతతోను, లక్ష్మణునితోను వనములో నివసించెను. దుర్మార్గుడైన రావణాసురుడు సీతను వనములో అపహరించెను. రాముడు, లక్ష్మణుడు వేటకు వెళ్లగా సాధ్వీమతల్లి జానకిని రావణు డపహరించెను. రామ, రామ అని విలపించుచున్న సీతమ్మ ఆక్రందనమును విని ప్రతాపవంతుడైన జటాయువు రావణునితో యుద్ధము చేసెను. రావణాసురుడు జటాయువును సంహరించెను. శ్రీరాముడు జటాయువుకు తన చేతులతో దహన సంస్కారములను గావించెను. అ పిదప రామసాయుజ్యమును పొందెను. రాముడు సుగ్రీవునితో అగ్ని సాక్షికంగా మైత్రిజరిపి, సుగ్రీవుని ప్రేరణతో శ్రీరాముడు దుర్జయుడైన వాలిని సంహరించెను. వానర రాజ్యమును సుగ్రీవున కిచ్చెను. సుగ్రీవుడు మహాబల పరాక్రమవంతులైన మా వానర యోధులను సీతాన్వేషణకు పంపెను. ఒక నెల దివములలో సీతమ్మను వెదకి

రాకపోతే మా ప్రాణములను తీసివేసెదనని సుగ్రీవు డానతి నిచ్చెను. అతని ఆజ్ఞను మన్నించి ఈ అరణ్యంలో తిరుగాడు చున్నాము. ఈ గుహలోనికి వచ్చితిమి. ఒక నెల అయిపోయినది మేము బయలుదేరిన నాటినుండి. సీతయొక్క జాడగాని, రావణుని యొక్కయు జాడతెలియ లేదు. లవణ సముద్రతీరమందు ప్రాయోప విష్టులమై మరణము పొందుటకు సిద్ధపడితిమి. ఓ పక్షిరాజవరా! నీకు తెలిసినట్లయిన తెలుపుమన్న' అంగదుని వాక్కులను విని సంపాతియను గృధ్రరాజు మిక్కిలి హృష్ట మనస్కుడై పలికెను. ఓ వానరోత్తములారా! వేల సంవత్సరాల తరువాత నా సోదరుని వార్త వినిపించినది. మీకు సహాయము చేసెదను. ముందు నన్ను ఒక జలస్థలమునకు తీసికొని వెళ్లండి. నేను అతనికి ఉదక దానము చేయవలెను. ఆ తరువాత మీ కార్యసిద్ధికి అంతా శుభ వార్త చెప్పెదను. అటులనే అని సముద్రతీరమునకు సంపాతిని వానరులు తీసికొని వెళ్లిరి. సంపాతి జలములందు స్నానముచేసి జటాయువుకు జలాంజలులు లిచ్చెను. తిరిగి తన స్థానమునకు కపీశ్వరులు తీసికొని వెళ్లిరి. సంపాతి వానరులతో పలికెను. త్రికూట పర్వతము యొక్క శిఖరమందు లంక అనే పట్టణము గలదు. అచ్చట అశోకవనములో సీత సుఖంగా ఉంది. రాక్షస స్త్రీలు ఆమెను కాపాడు చున్నారు. ఆ లంక శతయోజన విస్తీర్ణ మైన సముద్రము యొక్క మధ్యమందు కలదు. లంక నాకు కనపడుచున్నది. సీతమ్మ కూడ కనపడుచున్నది. ఇచ్చట సంశ యించుటకు అవకాశము లేదు. నేనిప్పుడు ఇచ్చట నుండి చూచు చున్నాను. గృధ్రము నయినందున నాకు దూరదృష్టి కలదు. నేను చాలా దూరమును చూడగలను. శతయోజన విస్తీర్ణమైన సముద్రమును ఎవడు దాటెదడో వాడే జానకిని చూడగల సమర్థుడు. చూచి రాగలడు. దుర్మార్గుడైన రావణుని నేనే చంపుటకు ఉత్సాహ

పడుచున్నాను. నా అన్నను చంపిన దుర్మార్గుని నేనే చంపదలచి నాను. కాని నేను ఏకాకిని. నాకు ఎగురుటకు రెక్కలు లేవు. సముద్రము దాటుటకు ప్రయత్నించండి. అప్పుడు రాముడు స్వయంగా రాక్షస రాజైన రావణాసురిని చంపెదడు. శతయోజన విస్తీర్ణమైన సముద్రమును దాటి లంకను ప్రవేశించి జానకిని చూచి సంభాషించి తిరిగి సముద్రమును దాటుటకు సమర్థుడు ఎవడో ఆలోచించండి అని పలికెను.

ఇట్లు కిష్కింధకాండలోని సప్తమ సర్గము సమాప్తము.

—o—

# అష్టమ సర్గము

## శంకరుడు భవానితో పలికెను

అప్పుడు సమస్త వానర బృందము ఆనందమును పొంది సంపాతితో తన పూర్వ వృత్తాంతమును చెప్పమని అడిగిరి. అంత సంపాతి పలికెను. "నేను జటాయువు అన్నదమ్ములము. మంచి యౌవన బలంతో ఉండేవాళ్లము. బలపరీక్షకు, బలముతో గర్వించిన మేము సూర్యమండల పర్యంతము వెళ్లుటకు మదమువలన ప్రయత్నించతిమి. మేమిరువురము కొన్ని వేల యోజనముల దూరమును ఎగిరితిమి. జటాయువు సూర్యకిరణముల వేడిమి వలన పరితప్తుడాయెను. అతనిని రక్షించుటకు నేను నా రెక్కలతో కప్పి గమనమును చేయుచుంటిని. కాని సూర్యకిరణముల మంటవలన కాలిపోయిన రెక్కల కలవాడనై వింధ్యపర్వతము శిఖర మందిచ్చట నివసించు చున్నాను. దూరము నుండి పడిపోవుటవలన నేను మూర్ఛను పొందితిని. మూడు దినములు తరువాత ప్రాణములు వచ్చినవి. కాని రెక్కలు కాలిపోయినవి. అందువలన నా చిత్తమునందు వ్యాకులత వచ్చినది. నాకు ఏ దేశమో లేక పర్వత శిఖరమో కూడ పోల్చుగొనుటకు తగిన బుద్ధిలేదు. మెల్లగా కళ్లువిప్పి చూస్తే అచ్చట ఒక శుభప్రదమైన ఆశ్రమము కనపడినది. దేకురుకుంటూ మెల్లగా నేను ఆశ్రమమునకు చేరుకొంటిని. చంద్రముడను ముని పుంగవుడు నన్ను చూచెను. ఈ రూపమేమిటి? ఎవనివలన వికృత రూపము వచ్చినది. నీవు మహాబలవంతుడవు అని నాకు తెలియును. నీ రెక్కలు ఎందువలన కాలిపోయినవి. చెప్పవలెనని ప్రశ్నించెను. నేను నాచేత చేయబడిన దుందుడుకు పనినంతా వివరించితిని.

మఱియు దుఃఖముతో కూడినవాడనై నేను దావాగ్నియందు మండి పోయి కాలిపోతాను. ఎందుకంటే పక్షములు లేని జీవితమును భరించుట కష్టము అని చెప్పితిని. అంత మునిపుంగవుడు దయాంత రంగుడై బాష్పనేత్రుడై పలికెను.

హే వత్స ! సంపాతి నేను చెప్పే మాటలు వినుము. ఆ తరువాత నీ యిష్టము వచ్చినట్లు ఆచరించుము. దుఃఖము దేహ మునకు సంబంధించినది. దేహము కర్మలవలన పుట్టుచున్నది. "శరీరమే నేను" అను అహంకారము వలన కర్మ పుట్టుచున్నది. జడమైన అహంకారము అనాదియైన అవిద్యవలన సముత్పన్న మయింది. బాగా కాల్చబడిన అయః పిండము (ఇనుమురాయి) వలె ఈ అహంకారము చిత్తుయొక్క ఆభాసవలనే వ్యాప్తమై యున్నది. అట్టి చిదాభాస వ్యాప్తమైన అహంకారము యొక్క వ్యాప్తివలన దేహమే నేను అను తాదాత్మ్య బుద్ధి కలుగుచున్నది. మఱియు దేహమందు చైతన్యము కలుగుచున్నది. అహంకారము వలన ఆత్మకు 'నేను దేహమును' అను బుద్ధి కలుగుచున్నది. నేను దేహమును అను బుద్ధివలన సుఖదుఃఖములు సంభవించు చున్నవి. సుఖదుఃఖములే కాకుండ జర, చావులతో కూడిన సంసార మేర్పడు చున్నది. నిర్వికారమైన ఆత్మకు దేహతాదాత్మ్యము వలన, నేను దేహమును, నేను చేయుచున్నాను, నేను అనుభవించు చున్నాను. అను విశ్వమందలి భావన లేర్పడు చున్నవి. దేహ తాదాత్మ్యము చెంది కర్తృత్వమును తనయం దారోపించు కొనుటవలన కర్మలు చేయుచు, కర్మలవలన బద్ధుడగు చున్నాడు. పాపపుణ్యములకు వశీభూతుడగు చున్నాడు. పాపపుణ్య కర్మలను చేయుటవలన ఉచ్చమై నట్టియు, నీచమై నట్టియు, నింద్యమై నట్టియు యోనులందు పుట్టుచున్నాడు. మఱియు నేను యజ్ఞ యాగాది కర్మలను చేసితిని. కాబట్టి నేను తప్పక స్వర్గసుఖముల ననుభవించెదనని తలంచు

చున్నాడు. అతని సంకల్పము ప్రకారమే స్వర్గమందు, సుఖముల ననుభవించి, పుణ్యములు నశించిన పిదప ప్రారబ్ధ ప్రేరణచేత ఇష్టము లేకపోయినను క్రిందికి పడిపోవు చున్నాడు. మొదట చంద్ర మండలమందు పడుచున్నాడు. చంద్ర కిరణముల ద్వారా చంద్ర మండలము నుండి భూమిపైకి పడిపోయి చాలా దినములు వరిచేలు మున్నగు ధాన్యము లందుంటున్నాడు. పురుషుడు తినే నాలుగు విధములైన భక్ష్య, భోజ్య, లేహ్య, చోహ్యములు అను నాలుగు విధములైన ఆహారమునందు ప్రవేశించు చున్నాడు. పురుషుని చేత తినబడిన ఆహారము వీర్యరూపములో మార్పుచెందు చున్నది. ఈ వీర్యమును ఋతుకాలమందు స్త్రీయొక్క యోనియందు విడుచు చున్నాడు. యోని యందున్న రజస్సుచేత మిళితమయి ఒక దిన మందే కల్లము అయి ( అనగా దుంపవలె ) ఘన రూపమును దాల్చును. చాలా కఠినమగును. అది తిరిగి ఐదు రాత్రులలో బుద్బుదాకారమును పొందును. (అనగా నీటియందు బుడగ) ఏడు రాత్రులలో మాంసముతో కూడిన అండాకారమును దాల్చును. పదునైదు దినములు తరువాత దానిపైని రక్తములో ములుగును. ఇరువదియైదు దినములకు అందులో అంకురముద యించును. ముప్పది దినములు తరువాత దానియందు, ముందుగా మెడ, తరువాత తలకాయ, తరువాత బాహువులును కలుపు స్కంధము, పృష్టము, కడుపు అను ఐదు విధములైన అంగములు పుట్టును. రెండు మాసములో చేతులు, కాళ్లు, పార్శ్వముల, పిరుదుల, మోకాళ్లు కలుగును. ఇంకోలాగున కాదు. మూడు మాసములు తరువాత అంగముల సంధులు (గ్రంధులు) పుట్టును. నాలుగు మాసముల లోపల అన్ని వేళ్లు పుట్టును. పంచమ మాసమందు ముక్కు చెవ్వులు, నేత్రములు పుట్టుచున్నవి. మఱియు దంతపంక్తి గోళ్లు గుహ్యస్థానము (జననేంద్రియము) పుట్టుచున్నవి. అరవ మాసము మొదట్లోనే చెవ్వులకు రంధ్రములు కలుగును. ఈ కాలమందే గుద

స్థానము, లింగము, బొడ్డు పుట్టుచున్నవి. ఏడవ నెలయందు రోమ ములు శిరమందు కేశములు పుట్టును. ఎనిమిదవ మాసమందు సర్వాంగములు స్పష్టముగా గోచరించును. ఓ గృధ్రమా! ఈ విధంగా స్త్రీయొక్క గర్భాశయమందు గర్భము పెరుగును. పంచమ మాసమందు ప్రతిజీవి చైతన్యమును పొందును. గర్భస్థిత పిండము తన నాభియందలి నాళముయొక్క చిన్న రంధ్రము ద్వారా (Embelical Card) తల్లిచే, తినబడ్డ ఆహార రసముచే, వృద్ధి పొందును. ఏనాడు కూడ గర్భస్థ పిండము తనవలన చావదు. తన కర్మవలన చావదు. గర్భస్థుడైన జీవుడు తనయొక్క పరిపూర్ణ పూర్వజన్మల యొక్కయు, ఆ జన్మలయందు చేయబడిన కర్మల యొక్కయు, స్మరణ చేయుచు జఠరానలముచేత దహింపబడిన జీవుడు ఈ విధంగా చెప్పుకుంటాడు. "ఎన్నియో వేల యోనులందు పుట్టాను. లక్షలాది కోట్లాది బంధువులను, బాంధవులను, పుత్రులను, భార్యలను, భర్తలను, పశువులను కలిగి వారి సంబంధము ననుభవించితిని. కుటుంబ భారమును వహించుటకై న్యాయంగాను, అన్యాయంగాను, ధనార్జన చేసితిని. ఆ సమయములో విష్ణువుయొక్క చింత చేయలేదు. పోనీ స్వప్నమందైనా చేయలేదు. ఇప్పుడు దాని ఫలితమును అనుభవించు చున్నాను. మహత్తరమైన గర్భదుఃఖమును అనుభవించు చున్నాను. నశించే దేహము శాశ్వతమని నమ్మి దీని ఆశతో కట్టుబడ్డాను. నేను ఎల్లప్పుడు దుష్కృత్యములనే చేసితిని. నేను మంగళకరములైన పనులను చేయలేదు. అందువలన కర్మ ఫలానుసారముగా దాని ఫలితమును అనుభవించు చున్నాను. దుఃఖమును అధికంగా అనుభవించు చున్నాను. ఇది నా కర్మలవలన వచ్చిన ఫలితము. నేనెప్పుడు ఈ గర్భనరకము నుండి బయటు పడెదనో? ఇకముందు నే నెల్లప్పుడు విష్ణువునే పూజిస్తాను. ఈ విధంగా చింతిస్తూ యోని యంత్రముచే పీడను పొందుచు మహాకష్టముచే జన్మను పొందు

చున్నాడు. పాపాత్ముడైన జీవుడు నరకమునుండి పడిపోవునట్లు గర్భమునుండి పడును. ఆ సమయంలో దుర్గంధంతో నిండిన పుండు నుండి కారుచున్న పురుగువలె నుండును. ఆ తరువాత బాల్యము మున్నగు దుఃఖములను అనుభవించు చున్నాడు. ఈ అనుభవము అన్ని జీవులకు దేహధారులందఱికి అనుభవించక తప్పదు. హే గృద్రిమా! బాల్యావస్థ తరువాత వచ్చే యౌవనావస్థయొక్క సర్వదుఃఖములను నీవు స్వయంగా అనుభవించావు. అందరు అనుభవిస్తారన్నది జగద్విదితము. దానిని వర్ణించ నవసరము లేదని నేను చెప్ప లేదు. చెప్పవలసిన దేమిటంటే "నేను దేహము" అనే భ్రాంతివలన, దేహాభిమానము వలన, జీవులకు నరకములు గర్భనరకము కూడ సంప్రాప్తించు చున్నవి. అందువలన మను ష్యులు కోరవలసిన దేమిటంటే స్థూల సూక్ష్మదేహముల కంటె వేరుగా ఉన్న ఆత్మను, ప్రకృతికంటె అతీతంగా ఉన్న ఆత్మను తెలిసికొని తీరాలి. దేహాదులందు నేను, నాది అను మమకారమును విడిచిపెట్టాలి. ఆత్మ అవస్థాత్రియము (జాగ్రత్ స్వప్న సుషుప్తి) లేనట్టిదానినిగా తెలిసికొని, ఆత్మ సచ్చిదానంద స్వరూపమనియు, శుద్ధ బుద్ధశాంత స్వరూపమని తెలిసికొని ప్రవర్తించాలి. చైతన్య స్వరూపమైన ఆత్మజ్ఞానము ఉదయించగానే అజ్ఞానమువలన పుట్టిన మోహము నశించును. ఈ దేహము ప్రారబ్ధకర్మ వేగముచే ఉంటే ఉండనీ, పడిపోతే పడిపోనీ యోగికి అజ్ఞానము వలన సంభవించు సుఖదుఃఖములు ఉండవు. అందుచేత ప్రారబ్ధ క్షయమయ్యే వఱకు సర్పముకుబుసమును ధరించునట్లు ఆనంద పూర్వకముగా దేహ ధారణ చేయవలెను. ఇది కాకుండా ఓ పక్షిరాజా! మఱియొక హితకరమైన సందేశమును చెప్పుచున్నాను. వినుము. త్రేతాయుగ మందు సాక్షాన్నారాయణుడు దశరథుని గర్భమందు జన్మించి రావణవధ నిమిత్తము దండకారణ్యమును చేరును. సీతాలక్ష్మణు లతో కలసియుండును. ఆ సమయమందు రావణాసురుడు దొంగ

పలె రామలక్ష్మణులు లేనికాలమందు సీతను అపహరించును. లంక యందు ఉంచును. ఆ సీతమ్మను వెదుకుచు సుగ్రీవుని యాజ్ఞచే వానరులు సముద్ర తీరమునకు వచ్చెదరు. కారణవశము వలన వారలతో నీకు సమాగమ మేర్పడును. అప్పుడు నీవు సీతయొక్క ఉనికి గూర్చి వారికి యదార్ధంగా చెప్పుము. అప్పుడే నీయొక్క రెండు రెక్కలు తిరిగి నూతనము లయి, వృట్టును". అని చంద్రుడను మహర్షి నాకు చెప్పెను. చూడండి నాకు నూతనము లైనవియు మిక్కలి కోమలములయిన రెక్కలు పుట్టినవి. మీకు స్వస్తి అగు గాక. నేను వెళ్లదలచు కున్నాను. ఇందులో సందేహము లేదు. మీరు తప్పకుండా సీతను చూచెదరు. మీరు చేయవలసినదంతా శతయోజన విస్తీర్ణమైన సముద్రమును దాటుటకు ప్రయత్నము చేయవలెను. ఓ వానర శ్రేష్ఠులారా ! ఏ మహాత్ముని నామ స్మరణ మాత్రం చేతనే, సంసారమనే మహాసముద్రాన్ని, మహా పాపాత్ముడు, దుర్జనుడయిన వాడు కూడా దాటకలుగు చున్నాడో, మఱియు శాశ్వతమైన విష్ణుపదమును పొందుచున్నాడో అట్టి రక్షకుని యొక్క ప్రియభక్తులైన మీరు సముద్రమాత్ర తరణమందు ఎందుకు సమర్థులు కాజాలరు. అవశ్యంగా సమర్థు లయ్యెదరు.

ఇట్లు కిష్కింధకాండ యందు అష్టమ సర్గ సమాప్తము.

—౦—

## నవమ సర్గము

## శంకరుడు భవానితో పలికెను

ఆ విధంగా గృధ్రరాజు అంతరిక్ష మార్గమందు వెళ్లిన తరువాత వానర పుంగవులంతా మహానంద భరితులైరి. సీతమ్మను చూడగలమనే నమ్మకము కలిగి దానివలన ఉత్సాహమును పొందిరి. కాని భయానకమైన సముద్రమును దాటుటకు భయపడు చుండిరి. అంగదు డంత పలికెను. మీలో ఎవడు రాజకార్యమును నిర్వర్తించ గలడో వాడు వానరులందరికి ప్రాణదాత. రామ సుగ్రీవులకు వాడే పాలకుడగును. వానర సైనికు లందరు మౌనముతో నుండిరి. ఎవరి బలమును వారు ప్రత్యేకంగా చెప్పమని అడిగెను. ప్రతి వానరుడు వానివాని బలముఎంతో వేరువేరుగా చెప్పెను. ఒక యోజనమునుండి పది యోజనముల వఱకు బలము కలదని చాలా మంది చెప్పిరి. అనంతరం జాంబవంతుడు తన బలము నూరు యోజనములకు లోపల కలదనియు భగవంతుడు త్రివిక్రమావతార మెత్తినపుడు నేను భూమిచుట్టూ ఇరువదియొక్కసార్లు పరిక్రమము చేసితిననియు కాని ఇప్పుడు వార్ధక్యంవలన సముద్రమును దాట లేనని చెప్పెను. అంగదుడు తనకు సముద్రమును దాటుటకు బలమున్నదనియు కాని తిరిగి వచ్చుటకు సత్తువ యున్నదో లేదో చెప్ప లేనని చెప్పెను. అంత జాంబవంతుడు, అంగదుడు సమర్థత కలిగినను తమకు నియమించుటకు అర్హత లేదనియు అంగదుడు యువరాజు నాయకుడు అందువలన నాయకుడీ పనిని చేపట్టకూడ దని చెప్పెను. అటులనే అయితే మనమంతా తిరిగి ప్రాయోప వేశము చేసి మరణమునకు సంసిద్ధముగా నుండుట మంచిదనెను.

అంత జాంబవంతుడు వత్స ! అంగద ! నీవు భయపడకు. తొందరలో కార్యసిద్ధి చేయగల మనిషిని, నీకు చూపిస్తాను. ఈ విధంగా అంగదు నోదార్చి కూర్చొని యున్న అంజనేయునితో జాంబవంతుడు పలికెను. ఓయీ హనుమంతా ! ఏకాకిగా, రహస్యంగా, మౌనంతో కూర్చొని యున్నావు. మహాంతమైన కార్యము 'సాధించవలసి యున్నది. హే మహావీర ! నీవు సాక్షాత్ వాయుపుత్రుడవు. వాయు వుతో సమానమైన బలము కలవాడవు. రామకార్యం కొఱకే నీవు పుట్టితివి. బాలచేష్టచే పుట్టిన వెంటనే నీవు ఉదయించుచున్న సూర్యుని చూచి పండిన పండనుకొని గ్రహించుటకు ఐదువందల యోజనములు మీదికి ఎగిరి భూమిమీద పడిపోతివి. అందువలన నీ బలపరాక్రమములను వర్ణించుటకు సమర్థు డెవడు లెమ్ము. రాముని కార్యమును చేయుము. మనకందఱికి రక్షణ ఇమ్ము. జాంబవంతుని వాక్కులను విన్నవాడయి హనుమంతుడు ఆనంద మును పొంది బ్రహ్మాండమును కదలించు సింహనాదము చేసెను. అపర త్రివిక్రముడు వలె పర్వతాకారమును ధరించెను. "సముద్ర మును దాటి, లంకను భస్మముచేసి రావణుని సకులంగా చంపి జానకిని తీసికొని వచ్చెదను. . కాకపోతే రావణుని కంఠమందు తాడుతో కట్టి ఎడమచేతితో పర్వతంతో సహా లంకను గ్రహించి రామునిముందు విసిరెదను". హనుమద్వచనమును విని జాంబవంతు డిట్లనెను. హే అంజనేయ ! సీతను చూచి తిరిగి రమ్ము. నీకు శుభము కలుగును. శుభలక్షణయైన జానకిని సజీవురాలుగా చూచి తిరిగి రమ్ము. తరువాత రామునితో కూడి నీ పౌరుషమును చూపెట్ట గలవు. అంతరిక్ష మార్గంలో పయనించు నీకు కళ్యాణమగు గాక. రామకార్యము కొఱకు వెళ్లు. వాయువు నిన్ను అనుసరించు గాక. ఈ విధంగా ఆశీస్సుల నందుకొనుచు హనుమంతుడు మహేంద్ర పర్వత శిఖరమందు అధిరోహించెను. అచ్చట హను

మంతుడు ఆశ్చర్యకరమైన రూపమును ధరించెను. ఒక పెద్దకొండ వలెనున్న వాడు, బంగారు ఛాయ గలవాడు, ఎఱ్ఱని అందమైన ముఖము కలవాడు మహానుభావుడు, శేషునువలె దీర్ఘమైన బాహువులు కలవాడయి సర్వభూతములకు కనపడెను.

ఇట్లు అధ్యాత్మ రామాయణంలో కిష్కింధకాండలో ఉమా మహేశ్వర సంవాదమందలి నవమ సర్గ సమాప్తము.

—

# సుందరకాండ

## ప్రథమ సర్గము

శతయోజన విస్తీర్ణమైన సముద్రమును దాటుట కిచ్ఛగల అంజనేయుడు పరమాత్మయైన రాముని స్మరించుచు ఇట్లనెను. ఓ వానరములారా ! ఇటు ప్రక్క చూడండి. రామునిచేత విడువబడిన అమోఘమైన బాణమువలె నేను ఆకాశమార్గములో వెళ్లుచున్నాను. నేను ఈ దినమందే జనకనందినియైన సీతమ్మవారిని చూచెదను. ఇది నిశ్చయము. నేనిప్పుడు కార్యమును సఫలము చేసి తిరిగి శ్రీ రఘురాముని దర్శనము చేసెదను. ప్రాణములను విడుచు కాలమందు ఒక్కసారి రామ అంటే అపారమైన సంసార సముద్రమును దాటి రాముని పరంధామమునకు చేరగలడు. మఱియు నేను రామునియొక్క దూతను. అతని అవయవ రూపమైన ఉంగరమును గ్రహించితిని. నా మనస్సులో రాముని స్మరించుచు ఈ నీచమైన సముద్రమును దాటెదను. ఇదేమీ పెద్దపని కాదు. అని పలికి మెడను తిన్నగా ఉంచి దృష్టిని మీదికిపెట్టి రెండు పాదములను కుదించి దక్షిణ దిక్కువైపు వాయువేగముతో పయనించు చుండెను. ఆ సమయములో మారుతియొక్క బలపరీక్ష చేయుటకు దేవతలు, మారుతిలంక ప్రవేశించగల శక్తి కలిగియున్నాడా లేదా అను విషయమును కూడా పరీక్షించుటకు సురసయను దేవమాతను సమీపించి పయనించుచున్న మారుతికి విఘ్నములు చేయవలెనని ప్రార్థించిరి. వాని బలము బుద్ధిని పరీక్షించి తిరిగి రావలసినవిగా కోరిరి. దేవమాతయగు సురస అంజనేయుని ఎదుట నిలిచి మార్గమునావరించి తన ముఖములో ప్రవేశించమని కోరెను. మఱియు తనకు

ఆకలిగా ఉందనియు, దేవతలు మారుతిని భోజన పదార్థముగా పంపిరని చెప్పెను, హనుమంతుడు రామకార్యముపై జానకిని అన్వేషించుటకు శాసించ బడితిననియు, జానకియొక్క కుశలమును రామునికి నివేదించి సురసకు ఆహారముగా వచ్చెదననియ పలికెను. హే సురస! నా మార్గమున కడ్డురావద్దని విన్నవించెను. మఱియు నమస్కరించెను. సురస తనకు బాగా ఆకలిగా ఉందనియు, తన ముఖములో ప్రవేశించకపోతే భక్షిస్తానని చెప్పెను. అటులనే నీ ముఖము విప్పు ప్రవేశించెదనని అంజనేయుడు యోజన దూరము గల శరీరముతో ఆమెఎదుట సాక్షాత్కరించెను. సురస తన నోరును పంచ యోజన విస్తారము చేసెను. అంజనేయుడు దశ యోజన శరీరమును ధరించెను. సురస వింశతి యోజన ముఖమును పొందెను. అంజనేయుడు ముప్పది యోజనముల పొడవు శరీరమును పొందెను. సురస తన ముఖమును ఏబది యోజనములు విస్తీర్ణముగా పెంచెను. అంత హనుమ బొటకనవ్రేలు అంత చిన్నవాడయి ఆమె నోటిలో ప్రవేశించెను. తిరిగి ఎదుట నిలబడెను. అమ్మా! నీ అనుమతి ప్రకారం ప్రవేశించాను తిరిగి వచ్చాను. నీకు నమస్కారము. అంత సురస అంజనేయా! వెళ్లుము. నీవు తప్పక రామకార్యమును సాధించెదవు. దేవతలు నీ బలపరీక్షకు నన్ను పంపిరి. నీవు సీతను చూసి తిరిగి రామునిదగ్గఱకు వెళ్లగలవు. అని పలికి దేవలోకమునకు వెళ్లెను. అంజనేయుడు గరుత్మంతుడువలె వాయువేగంతో అంతరిక్షంలో పయనించుచుండెను. అంత సముద్రుడు తవలోపల దాగియున్నమైనాకుని జూచి యీ కపీశ్వరుడు రామకార్యార్థము చనుచున్నాడు. నేను సగరచక్రవర్తివేత వృద్ధిపొందితిని. శ్రీరాముడు వారివంశమునందు జన్మించెను. ఆ రామకార్యమునకు చనుచున్న హనుమకు మనము సహాయము చేయవలెను. రాముడు సగర వంశీయుడు కాన నాకు ప్రభువు. నీవు ఎదిగి హనుమకు విశ్రాంతికొఱకు ఆ స్థానమును ఇమ్మనిమైనాకునితో సముద్రుడు

పలికెను. అటులనే అని మైనాకుడు నరాకృతిని స్వీకరించి అంజలి ఘటించి మణిమయ శృంగములతో గల కొండపై నిలబడి "హే హనుమ! నేను మైనాకుడను. నన్ను సముద్రుడు నీ విశ్రాంతికి పంపినాడు. దయచేయుము. బాగాపండిన ఫలములను సేవించి ఇచ్చట కొంతకాలము విశ్రాంతి తీసికొని తరువాత వెళ్లవలెనని కోరెను. హనుమంతుడు తాను రామకార్యము కొఱకు వెళ్లవలసి యున్నది. కాన విశ్రాంతి తీసికొనుటకు, తిండి తినుటకు అవకాశము లేదు. అని చేతులతో మైనాకుని శిఖరములను స్పృశించి ప్రయాణ మును కొనసాగించెను. కొంతదూరము వెళ్లుసరికి సింహికయను ఘోరరాక్షసి హనుమంతుని నీడను గ్రహించి పట్టుకొనెను. ఎవరైనను అంతరిక్షముపై వెళ్లినచో వాళ్ల నీడను గమనించి తినివేయుట ఆమె కృత్యము. హనుమంతుడు తనదారికి విఘ్నకరమగు అడ్డును ఎవరు చేసియున్నారని ఆలోచించి ఎవరు మనిషి లేరు. కాని ప్రయాణమున కవరోధము కలిగినది. చిత్రముగా నున్నదని గమనించి క్రిందికి దృష్టిని ప్రసరించెను. భయంకర రూపంతో ఉన్న సింహికను చూచి నీళ్లలోనికి పడి కాళ్లతోనే గుద్ది చంపివేసెను. తిరిగి దక్షిణముఖ ప్రయాణమును సాగించెను. అంత నానాఫల ములు గల చెట్లు, పక్షులు, మృగములు, లతలు, పువ్వులుతో గూడిన త్రికూట పర్వతమందలి నగరమును చూచెను. అచ్చట త్రికూట పర్వతము యొక్క ఉన్నత శిఖరమందు ఎక్కి లంకాపట్టణమును చూచెను. లంకాపట్టణము నాలుగు ప్రక్కల అగడిదలతోను అనేక ప్రాకారములతోను కూడియున్నది. ఈ లోపలకు ప్రవేశించుట ఎట్లు జరుగునని చింతాపరుడయి ఆలోచించి రాత్రియందు ప్రవే శము చేసెదను. సూక్ష్మరూపమును ధరించి, లంకను ఆ మూలా గ్రంగా పర్యవేక్షిస్తాను. అని అచ్చట కొంతకాలము గడిపి రాత్రి యగునరికి లంకానగరమును ప్రవేశించెను. సూక్ష్మ శరీరమును

ధరించి లంకాపురము యొక్క ద్వారమును ప్రవేశించెను. అప్పుట లంకాపురియను రాక్షసి వికారమయిన రూపము కలది. హనుమంతుని అడ్డగించి నీ వెవడవు ? కోతి రూపమును ధరించి నగరంలోనికి ప్రవేశించు చుంటివి. నేను లంకిణిని. నన్ను లెక్కసేయకుండా నగరంలోనికి ప్రవేశించుటకు నీకు అవసర మేమున్నది. రాత్రిపూట దొంగవలె ప్రవేశించు చున్నావు. అని కోపంతో కాలితో అంజ నేయుని తన్నెను. హనుమంతుడు లీలగా ఎడమ పిడికిలితో పోటు పొడిచి ఆమెను చంపివేసెను. రక్తం కక్కుకుంటూ ఆమె భూమిమీద పడెను. తిరిగి లేచి హనుమాన్ ! నీచేత లంక జయింప బడినది. నీకు శుభము కలుగును. పూర్వము బ్రహ్మగారు నాకు చెప్పిరి. చతుర్యుగములకు ఇరువది యెనిమిదవ ఆవృత్తి వచ్చినప్పుడు త్రేతాయుగమునందు దశరథ కుమారుడుగా సాక్షాన్నారాయణుడు రాముడుగా జన్మించువనియు, యోగమాయ సీతగా జనకుని యింట జన్మించుననియు, తనచేత ప్రార్థితుడయి భూభారహరణమునకు అవతారమెత్తు ననియు, సీతాలక్ష్మణులతో కలసి వనవాసము చేయు ననియు, అప్పుట సీతను రావణుడు అపహరించు ననియు, తరువాత సుగ్రీవునితో రామునికి మైత్రిఏర్పడు ననియు, సుగ్రీవుడు జానకిని వెదకుటకు వానరులను పంపుననియు, ఆ సమయంలో ఒక వాన రుడు రాత్రిపూట తన దగ్గఱకు వచ్చుననియు, వానిని తాను పీడించెద ననియు, వాడు నన్ను పిడికిలితో చంపుననియు, అప్పుడే రావణ వినాశము జరుగునని చెప్పిరి. అందువలన హనుమ నీచేత లంకానగరము జయింప బడినది. నీచేత సర్వము జయింప బడును. రావణాంతఃపుర మందు శ్రేష్ఠమైన క్రీడావనము కలదు. దాని మధ్యలో దివ్యమైన వృక్షములతో అశోకవన మున్నదనియు, అందలి మధ్యలో శింశప అను మహావృక్షము కలదనియు, అప్పుట జానకమ్మ రాక్షస స్త్రీలతో చుట్టు వారికొనబడి యున్నదనియు,

ఆమేను నీవు చూచి తొందరగా రామునికి నివేదించుమని పలికెను. మఱియు లంకిణి తాను ధన్యురాల నైతిని. చిరకాలమునకు రాఘవ స్మృతి కలిగినది. సంసార బంధమును తెంచునట్టి రామస్మరణ కలిగినది. రామభక్తుల పరిచయముకూడ దుర్లభమైనది. నా హృదయ మందు రాఘవుడు అనుగ్రహించు గాత. ఆంజనేయుడు సముద్రము దాటిన సమయంలో రావణుని ఎడమ కన్ను అదిరింది. జానకికి కూడ ఎడమ కన్ను అదిరింది. శ్రీరాముని యొక్క దక్షిణ భుజము కూడా మఱియు దక్షిణాంగము కూడా అదిరినది.

ఇట్లు సుందరకాండలోని ప్రథమ సర్గము సమాప్తము.

—O—

కార్యము నాచేతనే సాధింప బడినదని మనస్సులో పరమానంద మును పొందెను.

అంత అంతఃపురములో కిలకిల శబ్దము సంభవించెను. ఏమిటది అని ఆశ్చర్యంతో వచ్చుచున్న రావణాసురుని చూసెను. పది ముఖ ములు, ఇరువది భుజములు, నీలాంజనమువంటి శరీరఛ్ఛాయ కలిగి యున్న రావణుని చూచి ఆశ్చర్యపడెను. చెట్టుపైని ఆకుల మధ్యలో పొంచుడి దాగుకొనెను.

రావణుడు రామునినే మనస్సులో సదా స్మరిస్తూ నాకు ఎంత తొందరలో రామునివలన మరణం కలుగుతుంది. సీత కొఱకైనా రాలేదు. ఏమి కారణమయి ఉండవచ్చు. అని నిత్యము స్మరించుచు ఒపర రాత్రియందు కలకాంచెను. రామునిచేత పంపబడిన ఒక వానరుడు కామరూపధరుడు, సూక్ష్మశరీరుడు చెట్టుచివర నెక్కి యుండెనని కలకాంచి స్వప్నము ఎప్పుడప్పుడు సత్యమగునని తలంచి అందుకనుగుణంగా నేడు ప్రవరిస్తాను. సీతను పరుషమైన వాక్కులనే బాణములతో హింసించి మఱికొంత దుఃఖితురాలుగా చేసెదను. దానిని చూచి వానరుడు రామునికి నివేదించు గాత. అని చింతించుచు రావణుడు సీతయొక్క సమీపమునకు వెళ్లెను. ఆ సమ యంలో అందెల చప్పుడు, గాజుల చప్పుడు సీతవిని భయపడి అధో ముఖము పెట్టి కళ్లయందు నీళ్లుకార మనస్సులో రామున్నే స్మరిం చుచు కూర్చొనెను. రావణుడు సీతను చూచి నీవెందుకు నన్ను చూచి కుదించుకొను చున్నావు. రాముడు తమ్మునితో కూడి కోతులమధ్య నివసించి యున్నాడు. ఒకప్పుడు కొందఱికి కనపడు చున్నాడు. ఒక్కొక్కప్పుడు కనపడకుండా ఉన్నాడు. నేను పెక్కు వందిని రాముని జాడతెలిసికొని రమ్మనమని పంపితిని. అంతట వెదకి రాముని ఎక్కడ కనుగొనలేక పోయిరి. నీ ఊసే పట్టించుకోని

## ద్వితీయ సర్గము

హనుమంతుడు సూక్ష్మశరీరమును ధరించి పరమ శోభాయమానంగా లంకా పట్టణము నంతను తిలకించెను. సీతాన్వేషణ కార్యమును కోరుచు రాజమందిరమునకు చనెను. దానిని పూర్తిగ వెదకి జానకిని కనుగొనక లంకిణి చెప్పిన మాటలను స్మరించి తొందరగా అశోకవనంలోనికి ప్రవేశించెను. రత్నసోపానములతో, కల్పవృక్షములతో, అనేకములైన పక్షి మృగములతో కూడినట్టియు, బంగారు మేడలతో నిర్మితమైనదియు, అంతట చేతికందిన పండ్లతో, భూమికి వంగిన చెట్లతో కూడినదియు నగు ఉద్యాన వనమందు ప్రతి చెట్టును జానకికొఱకు వెదకెను. ఆకాశమునకు తాకుచున్న శిఖరములతో వేయి మణిస్థంభములతో నిర్మింపబడిన మంటపము గల చైత్య ప్రాసాదమును దర్శించెను. దాన్ని దాటి మఱికొంత దూరము వెళ్లి దట్టంగా నీడను కలిగియున్నదియు, ఎండను చూడనట్టిదియు, బంగారురంగు పక్షులుగల శింశపా వృక్షమును చూచెను. ఆ శింశపా వృక్షము యొక్క మూలమునందు రాక్షస స్త్రీలతో పరివృతయైన జానకిని చూచెను. ఆమె భూలోకములోని దేవతవలె మెఱియుచున్నది. ఒంటిముడిగల జుట్టు, కృశించిన శరీరము, దీనురాలు మాసిన బట్టలు ధరించియున్నదియు, భూమియందు పరుండియున్నదియు, దుఃఖించు చున్నదియు, రామ, రామ అంటూ సంభాషించు నదియు, రక్షించే దిక్కులేనిదియు, ఉపవాసములచేత కృశించిపోయినదియు, మంగళస్వరూపము గలదియునగు సీతమ్మను చూచెను. హనుమంతుడు కృతార్థుడ నైతిని. కృతార్థుడ నైతినని సీతమ్మను జనకనందినిని చూచితిని నేను, పరమాత్మయైన రాముని

రామునితో నీకు పని యేముంది. నీతో ప్రేమతో మెలిగాడు. నిన్ను కౌగిలించుకొని యుండేవాడు. కాని ఇంతవఱకు వాని హృదయంలో నీపయి జాలి కలుగలేదు. అధముడు నీచుడయిన రాముడు నీచేత ఇవ్వబడిన సర్వభోగములను, నీయొక్క సుగుణములను మఱచి పోయి కృతఘ్నుడయి నిన్ను స్మరించుటకు కూడా లేదు. నీవు సాధ్వివి, పతివ్రతవు దుఃఖసముద్రంలో మునిగియున్నావు. ఇట్టి పరిస్థితులలో కూడ ఇప్పటికి కూడ రాలేదు. నీయందు వానికి ప్రేమలేదు. అందువలన ఎందుకు వస్తాడు. వాడన్ని విధాలా అసమర్థుడు, పౌరుషము లేనివాడు, మూర్ఖుడు, పండితంమన్యుడు అహంకారం కలవాడు. హే భామిని! నీయందు ఇంచుకొంత అభిమానములేని, నరాధమునివలన నీకు ఏమి జరుగుతుంది. నేను నీయందు మిక్కిలి ప్రేమ కలవాడను రాక్షస రాజును. నన్ను పొందుము. నన్ను పొందితే సమస్త దేవ కిన్నర, గంధర్వ, నాగ, యక్షకన్యకలకు నీవు పరిపాలించి రాణివి అయెదవు.

రావణుని దురాలాపములు విన్న సీతమ్మకు మిక్కిలి కోపము కలిగెను. ఒక గడ్డిపోసను రావణునికి తనకు గల మధ్య స్థలంలో ఉంచి, తల భూమిమీదకు దించి పలికెను. రామునివలన భయము చేతనే నీవు సన్యాసివేషము ధరించి రామలక్ష్మణులు లేనిసమయంలో అడకుక్క హవిస్సును యాగమందు హరించునట్లు నన్ను అపహరించితివి. నీచుడా! దాని ఫలితమును అనుభవించెదవు. రాముని బాణములతో భగ్నమైన శరీరము పొందిన కాని నీకు రాముడు దేవుడని జ్ఞానము ఉదయించదు. నీకు యమలోకప్రాప్తి వఱకు ఈ జ్ఞానము కలుగదు. సముద్రాన్ని ఇంకింపచేసి గాని, బాణములతోనే సముద్రమందు వారధి కట్టుకొని గాని, లక్ష్మణునితో కూడ వచ్చి నిన్ను యుద్ధంలో రాముడు చంపి తీరుతాడు. ఓ రాక్షసాధమ! నిన్ను, నీ పిల్లలను, నీ బంధువులను, నీ మిత్రులను, నీ కులాన్ని

శేషం లేకుండా చంపి నన్ను అయోధ్యకు తీసికొని వెళ్లెదడు. అని సీతమ్మ పలికిన వెంటనే రావణుడు మహాకోపంతో కత్తితీసి జనక రాజనందినిని చంప నుద్యుక్తు డాయెను. మండోదరి నివారించెను. దీనురాలు, దుఃఖిత, భయపడిన పిల్ల ఎండిపోయిన శరీరము కలది, మానుషియైన సీతను విడిచిపెట్టి, దేవగంధర్వ నాగస్త్రీలను వరించ మని హితవు చెప్పెను. వారంతా నిన్ను కోరుచున్నారు. అంత రావణుడు రాక్షస స్త్రీలకు ఆదేశములు ఇచ్చెను. సీతను, భయపెట్టి లేక ఆదరించి ఏదోవిధంగా రెండు నెలల కాలంలో తన వశురాలుగా చేయవలెననెను. రెండు మాసముల తరువాత మొదటి దినమందు ఆమెను చంపి ఆమె మాంసమును నా ప్రాతఃకాల భోజనమునకు పంపవలసినదిగా పలికెను. అని పలికి అంతఃపురమునకు వెళ్లి పోయెను. రాక్షస స్త్రీలు జానకిని సమీపించి ఇష్టము వచ్చినట్లు సంభాషించు చుండిరి. ఒకామె ఆమె యౌవనమంతా వృధాగా పోతోందని రావణుని చేరితే సాఫల్యమును పొందుననియు, ఒకామె ఎందుకు ఆలస్యము? ఈమె శరీరమును ముక్క ముక్కలుగా నరకండిని పలికెను. ఇంకొక ఆమె తన వికృతమైన ముఖమును విప్పి భయపెట్టెను. ఈ విధంగా జానకిని హింసించుచున్న రాక్షస స్త్రీలను నివారించి వృద్ధురాలైన త్రిజట ఒక రాక్షస స్త్రీ వారిని మందలించి పలికెను. "జానకమ్మను భయపెట్టకండి. ఆమెకు నమస్కరించండి. నాకు ఇప్పుడే స్వప్నమందు కమలలోచనుడైన రాముడు శుద్ధమైన ఐరావతము నెక్కి లక్ష్మణ సమేతుడై లంకా నగరాన్ని పూర్తిగా కాల్చి వేసి యుద్ధమందు రావణుని పరిమార్చి, తన తొడయందు జానకిని కూర్చొపెట్టుకొని కొండ శిఖరమందు కనపడెను. రావణుడు (అవు) పేడ గుమ్మిలో కూరుకుపోయి శరీరమునిండా నూనె నంటుకొని దిగంబరుడై పుత్ర పౌత్రులతో సహా పేడగుమ్మిలో కూరుకొని పోయెను. విభీషణుడు రాముని సన్నిధిలో ఆనందంతో రామపాదములకు సేవచేయుచు భక్తితో

రాముని కొలుచు చున్నాడు. దీనివలన నిశ్చితమైన దేమిటంటే రాముడు అవలీలతో రావణుని చంపి సమస్త రాక్షసవర్గమును రూపు మాపి లంకారాజ్యమునకు విభీషణుని రాజుగా చేసి పవిత్రురాలైన సీతను తొడ యందుంచుకొని అయోధ్యకు వెళ్లెదడు. ఇందులో సంశయము లేదు. త్రిజటయొక్క మాటలను విని రాక్షస స్త్రీలు భయపడి మౌనంపాటించి నిద్రపోయిరి. సీత రాక్షస స్త్రీలచేత భయపెట్టబడ్డదై మిక్కిలి విహ్వాలయై దిక్కులేక రక్షించేవాడు కన పడక దుఃఖముతో క్రుంగిపోయి ఆలోచించి ఇట్లు పలికెను. రేపు ఉదయమందు రాక్షస స్త్రీలు నన్ను భక్షించెదరు. ఇప్పుడే ఏ ఉపా యంతో మరణము కలుగునో ఆలోచించాలి. అంటూ భోరున కంఠం విప్పి చాలాకాలం తరువాత ఓ కొమ్మను పట్టుకొని అనుకొని చావుకు ఉపాయమును విచారించుచు ఏ ఉపాయమును కనుగొన లేక నిస్సహాయ స్థితిలో నీరసించి ఏడ్చు చుండెను.

ఇట్లు సుందరకాండ యందు ద్వితీయ సర్గ సమాప్తము.

## తృతీయ సర్గము

# శంకరుడు భవానితో పలికెను

సీతమ్మ ఎడతెగని ఆలోచనలతో రాత్రియంతా నిద్రపట్టక జీవితమందు నిస్పృహను పొంది రాముడు లేకుండా జీవించినా ఫలము లేదని యోచించి తన సుదీర్ఘమైన జడ తనకు ఉరిపోసి కొనుటకు పనికి వస్తుందని ఆలోచించు చుండెను.

అంత హనుమంతుడు ఆమెను ఆ పరిస్థితిలో చూచి కొంచె మాలోచించి ఈ విధంగా పలికెను. ఇంకను సూక్ష్మరూపమును ధరించి మెల్లగా జానకీదేవి చెవికి వినిపించే స్వరంతో "ఇక్ష్వాకు వంశ రాజగు అయోధ్యాధిపతికి నలుగురు కుమారులున్నారు. రామలక్ష్మణ భరత శత్రుఘ్నులను వారలు కలరు. వారిలో రాముడు జ్యేష్ఠుడు. పితృవాక్య పరిపాలనకొఱకు దండకారణ్య ప్రవేశము చేసెను. భార్యయైన సీతమ్మతో తమ్ముడైన లక్ష్మణునితో కూడ గౌతమీతీర మందు పంచవటిలో ఉండెను. రామ లక్ష్మణులు లేని సమయ మందు దుర్మార్గుడైన రావణునిచేత సీతమ్మ అపహరింప బడినది. రాముడు అతిదుఃఖముతో ఖిన్నుడై జానకిని వెదకుటకు ఉపక్ర మించెను. భూమియందు పడిపోయిన జటాయువను పక్షిరాజును చూచెను. వానికి దివ్యమైన వైకుంఠమును ప్రసాదించి రాముడు ఋష్యమూక పర్వతమునకు చేరెను. ఆత్మ స్వరూపుడైన రాముని చేత సుగ్రీవునితో మైత్రి చేయబడినది. సుగ్రీవుని భార్యను అపహ రించిన వాలిని చంపి సుగ్రీవుని రాజ్యమందు అభిషిక్తుని చేసెను. మిత్రకార్యమును రాముడు నిర్వర్తించెను. సుగ్రీవుడు తన వానర

మంత్రులను పిలిపించి సీతను వెదకుటకు అన్ని దిక్కులకు పంపెను. సంపాతి వచనమువలన సీతమ్మ స్థానమును తెలిసికొని శతయోజన విస్తీర్ణమైన సముద్రమును దాటి లంకకు వచ్చి లంకలోని అశోక వనమునకు, ఆ తరువాత శింశప వృక్షమును చూచి అచ్చట దుఃఖించుచు విచారించుచున్న జానకిని చూచితిని. రామపట్ట మహిషినిదేవిని చూచితిని. నేను కృతకృత్యుడను. ఇచ్చటకు వచ్చియున్నాను. బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన మారుతి ఇట్లు పలికి ఊరకుండెను. సీతమ్మ క్రమంగా వృత్తాంతము నంతను విని ఆశ్చర్యమును పొందెను. ఏమిది ఆకాశమందు నాకు వినపడ్డదా గాలిచేత తీసికొని రాబడినదియా లేక స్వప్నమా లేక మనోభ్రాంతియా లేక సత్యమేనా. ఆ విషయము దుఃఖమువలన నాకు నిద్ర కలుగలేదు. అందుచేత స్వప్నము కాదు. లేక నా మనోభ్రాంతియా అంటే ప్రత్యక్షముగా శబ్దమును వినుచున్నాను. అందుచేత భ్రాంతి కాదు. నా కర్ణములకు అమృత వర్షముతో సమానమైన వచనములను ఇచ్చిన మహనీయుడు, ప్రియవాది నా కండ్ల దగ్గఱకు వచ్చుగాత, అని జానకి పలికెను.

హనుమంతుడు జానకిదేవి వచనములను విని ఆకుల మధ్య నుండి దిగి మెల్లగా సీతమ్మ అగ్రభాగమందు నిలబడెను. కలవింక పక్షివలె అతి సూక్ష్మమైన శరీరము కలవాడయి ఎర్రని ముఖము, పసుపుపచ్చని వానరుడు మెల్లగా సీతమ్మకు నమస్కారము చేసెను. అంజలి ఘటించి నమస్కరించెను. వానిని చూచి జానకీదేవి రావణుడీ విధముగా వచ్చెనా నన్ను మోహింప చేయుటకు మాయచేత కోతి వేషము వేసికొని వచ్చెనా అని మౌనము వహించి క్రిందికి చూచుచుండెను. "హే దేవి! నేను నీవనుకొన్న మాయావిని కాను. నా యందు నీకుగల శంకను విడిచిపెట్టుము. పరమాత్మ కోసలదేశ రాజు అయిన రామునియొక్క సేవకుడను నేను. హే శుభప్రదే! నేను వానరరాజగు సుగ్రీవునికి మంత్రిని. నిఖిల ప్రాణభూతుడయిన

వాయువుయొక్క కుమారుడను. అని హనుమంతుడు పలికెను. ఆ మాటలు విన్న జానకి వానరులకు మనుష్యులకు మైత్రి ఎట్లు సంభవము ? నీవు రామచంద్రుని దాసుడనని పలుకుచుంటివి. ప్రీతుడయిన ఆంజనేయుడు అమ్మ ఎదుట నిలబడి పలికెను. శబరి చేత పంపబడిన రాముడు ఋష్యమూక పర్వతమును చేరెను. రామలక్ష్మణులను సుగ్రీవుడచ్చట చూచెను. సుగ్రీవు పనుపుచే నేను బ్రహ్మచారి వేషముతో రామలక్ష్మణుల హృదయమును తెలియగోరి రామునిచేరితిని. రాముని సహృదయత్వమును తెలిసి కొని రామలక్ష్మణులను భుజముపై ఎక్కించుకొని సుగ్రీవుని దగ్గఱకు తీసికొని వెళ్లితిని. వారిరువురి మధ్య మైత్రిని నెలకొల్పితిని. సుగ్రీవుని భార్యను అపహరించిన వాలిని ఏకబాణంతో చంపివేసి సుగ్రీవుని రాజ్యమందభిషేకము చేసెను. సుగ్రీవుడు నిన్ను వెదకు టకు అన్ని దిక్కులకు వానరులను పంపెను. వెళ్లుటకు సిద్ధముగా నున్న నన్ను జూచి ఆదరంతో రాముడు పలికెను. ఆంజనేయ ! నీ యందు నా కార్యమంతయు ఉన్నది. సీతకు నా యొక్కయు లక్ష్మణుని యొక్కయు క్షేమమును తెలియపరచుము. సీతయొక్క పరిజ్ఞానమునకు ఈ ఉంగరమును సీతకు ఇమ్ము. నా పేరు గలది యీ ఉంగరము. అని తనయొక్క చేతి ఉంగరమును నీకిమ్మన మని చెప్పినాడు. అతిప్రయత్నంతో తీసికొని వచ్చితిని. దేవి ! చూడు మీ అంగుళీయకమును అని చెప్పుచు దేవికి మారుతి ఉంగ రము నిచ్చెను. నమస్కారముచేసి అంజలి ఘటించి దూరముగా హనుమ నిలపడెను. రామ నామాంకితమైన ఉంగరమును చూచి మహదానందమును పొంది శిరస్సు నందుంచుకొని హే కపే ! నీవు చాలా బుద్ధిమంతుడవు, నాకు ప్రాణదాతవు. రాఘవునియందు భక్తి కలవాడవు. నీవు ప్రియమును చేయువాడవు నీకొక్కడికే మా యందు విశ్వాస ముంది. లేకపోతే ఇంకొక పురుషుని నా

సన్నిధికి ఎట్లు పంపును ? హనుమ నీవు చూచితివి గదా నా దుఃఖము నంతను ఈ సర్వమును శ్రీరామునికి చెప్పు. అతనికి నా యందు దయ కలుగులాగున. నా ప్రాణములు రెండు మాసములవధిగా ఉంటాయి. రాముడు రాకపోతే యీ దుర్మార్గుడు నన్ను భక్షిస్తాడు. అందువలన సుగ్రీవునితోను, వానర సైన్యముతోను వచ్చి సకులంగా రావణుని నాశమొనర్చి నన్ను విడిపించమని చెప్పుము. అప్పుడు రామునియొక్క వీర్యమునకు ఉచితమగు కార్యము లోకమందు ప్రస్ఫుటమగును. హే హనుమ ! ఏ విధమైన పదప్రయోగంతో యుక్తిపూర్వకమైన భాషణచేసి రాముని పురిగొల్పెదవో, నన్ను విముక్తురాలను చేసెదవో నీ పదజాలము, ప్రతిభమీద ఆధారపడి యుంది. అప్పుడు నిజముగా నీవు నాకు వారికి సహాయముచేసిన పుణ్యమును పొందెదవు అని పలికెను. అంత హనుమంతుడు అమ్మ రాముడు లక్ష్మణ సమేతుడై సైన్యంతోను, సుగ్రీవునితోను అతి శీఘ్రంలో వచ్చి రావణవధ గావించి నిన్ను అయోధ్యకు తీసికొని వెళ్లెదడు. ఇందులో సందేహము లేదు. అంత జానకి ఏ విధంగా సముద్రమును సమస్త వానర సైన్యము దాటగలరు అని అడిగినది. హనుమంతుడు రామలక్ష్మణులు నా భుజస్కంధముల నెక్కి సుగ్రీవుడు ససైన్యంతో అంతరిక్ష మార్గంలో వచ్చి సముద్రమును దాటి సమస్త రాక్షస వంశమును నీకొఱకు దహిస్తారు. ఇందులో సంశయము లేదు. అనుజ్ఞ ఇమ్ము తల్లి. తొందరగా వెళ్లెదను. లక్ష్మణుని రాముని తొందరగా చూచి నీ దగ్గఱకు వెంటనే పంపుటకు ప్రయత్నం చేస్తాను. రాముడు విశ్వసించు లాగున ఏదైనా ఒక గుర్తు ఉంటే ఇమ్ము. అప్పుడానందంతో వెళ్ల గలను. అప్పుడమ్మ జానకి తన జుత్తులోని నాగరమును తీసి (చూడామణి) ఆంజనేయునికిచ్చెను. మఱియు హనుమంతునితో నిట్లు పలికెను. చిత్రకూట పర్వతమందు ఒకనాడు శ్రీరాముడు నా తొడ యందు తలపెట్టుకొని నిద్రించెను. ఇంద్రపుత్రుడైన

జయంతుడు అనే కాకి నా పాదములు యొక్క బొటకనవేళ్లును ముక్కుతో పొడిచి రక్తము కారులాగున కన్నము పెట్టెను. నిద్ర నుండి రాముడు లేచి పాదముపైని వ్రణమును చూచి ఎవడీ విధ మగు దుష్కృత్యమును చేసినాడంటూ ఎదురుగా నున్న కాకిని చూచి, నన్నును చూచి కాకియొక్క రక్తముతో కూడిన ముక్కును చూచి కోపించి ఒక గడ్డిపరకను తీసి దివ్యాస్త్రముగా కాకిపై ప్రయోగించెను. అది కాకిని చుట్టుపెట్టెను. కాకి మూడు లోకము లను పరిభ్రమించి ఇంద్రబ్రహ్మాదుల వలన కూడ శరణపొందలేక దిక్కులేక దయానిధియైన రాముని పాదములందు పడెను. శరణా గతి పొందిన కాకిని చూచి ఈ అస్త్రము అమోఘము. నీ రెండు కండ్లలో ఒక కన్నును దీనికి బలియిమ్మని చెప్పెను. కాకి కుడి కన్నును అస్త్రమునకు ఆహుతిగా సమర్పించెను". అని చెప్పి పౌరుషవంతుడైనప్పటికి రాముడు ఇంతవఱకు నాకొఱకు ఎందుకు ఉపేక్షించు చున్నాడు ? అని అడిగెను. "నీ విక్కడ ఉన్నట్లు తెలిస్తే రాముడుకఒక్క క్షణము కూడా ఆలస్యము చేయకుండా రాక్షస మండితమైన లంకను నిమిషములో భస్మం చేస్తాడు. అంత జానకి హనుమను చూచి ఇంత చిన్న శరీరము కలవాడవు. నీలాగే అందరు వానరులుంటారు. మీరు రాక్షసులతో ఏ విధంగా యుద్ధం చేయ గలరు ? అని అనెను. అంత హనుమంతుడు మేరుపర్వతం, మందర పర్వతముతో సరియైనట్టి శరీరమును ధరించి రాక్షసులందఱికి భయ మును కలిగించు శరీరమును ధరించెను. ఈ విధంగా మహాపర్వతం లాగున్న ఆంజనేయుని చూచి "సమర్థుడవయ్యా ! మహాసత్త్వ వెంటనే నీవు శ్రీరాముని కడకు చనుము. లేకపోతే ఈ రాక్షసస్త్రీలు నీ మహా బలమును చూస్తారు. నీ మార్గమందు మంగళము కలుగు గాత. నీ ప్రయాణమ సుఖకరమగు గాత. అని దీవించెను. అంత హనుమంతుడు దేవి ! నీ శుభసందర్శనము కలిగినది. ఇపుడు నీ యెదుట కనపడుచున్న పండ్లతో పండుగ చేసికొంటాను. జానకమ్మ

మంచిది అనగానే హనుమ ఫలహారము చేసెను. జానకికి నమస్క రించి తిరుగు ప్రయాణమునకు బయలుదేరెను. కొంతదూరము వెళ్లిన తరువాత మనస్సులో ఆలోచించెను. ఏ దూతయినా, తన స్వామి కార్యములో బయలుదేరి, ఆ కార్యమునకు దోహదముగా కొంత సహాయక పనులను చేయనివాడు అధముడైన దాసుడగును. అందువలన నేను మఱికొంత పనిచేసి రావణుని కలసి వానితో సంభాషించి అప్పుడు రాముని దర్శనమునకు వెళ్లెదనని యోచన చేసెను. నిశ్చయించి వెనువెంటనే అశోకవనములోని చెట్టుకర్రి విరిచి క్షణంలో చెట్లనన్నిటిని విరగగొట్టి అశోకవనంలో ఒక చెట్టులే కుండా నిర్వృక్షమును చేసెను సీతకు ఆశ్రయమిచ్చిన శింశపా వృక్షమును మాత్రము విడిచిపెట్టెను. అట్లు వనమును తగులబెట్టిన వాడెవడని రాక్షస స్త్రీలు సీత నడిగిరి. జానకమ్మ మీకే తెలుస్తుంది. రాక్షస మాయ నాకేమీ తెలియదు. ఈ విధంగా సీతను ప్రశ్నించి రాక్షస స్త్రీలందరు అశోకవన విధ్వంసము గురించి రావణునకు నివేదించిరి. దేవ! ఒక మహాబలుడు ఆకృతిలో కోతి సీతతో మాట్లాడి అశోకవనము నంతను ఒక్క క్షణంలో తగులపెట్టెను. చైత్య ప్రాసాదమును మూలస్థంభములతో ఊడబెరికి విధ్వంసము చేసెను. ఇంకయు చైత్యప్రాసాదమును రక్షించిన రక్షకరాక్షసుల నందఱిని చంపివేసెను. రావణుడప్పుడు పది లక్షలమంది రాక్షసులను పంపెను. కొట్టబడిన చైత్యప్రాసాద మందలి మొదటి అంతస్థులో నిలబడి హనుమంతుడు ఆ ప్రాసాదమందలి ఇనుప స్థంభమును చేతియందు ధరించి యుండెను. పర్వతాకారుడు లోహస్థంబమే. ఆయుధముగా కలవాడు. ఎర్రని ముఖము కలవాడు. భయంకారకారుడు తోకను కదుపుచు ఉండెను. వచ్చుచున్న పదిలక్షల రాక్షస బృందమును చూచి ఘోరమైన సింహనాదము చేసెను. ఆ శబ్దమునకు రాక్షసులు స్థబ్ధులై పోయిరి. వివిధాయుధములతో హనుమంతుని కొట్టిరి.

ఏనుగు తొండముతో దోమలను కొట్టినట్లు హనుమంతుడు ఇనుప స్తంభముతో వారినందరిని చావకొట్టి యమపురికి పంపెను. రావణు డీ మాట తెలిసికొని అచ్చటకు ఐదుగురు సేనాపతులను పంపెను. హనుమంతుడు వారలను కూడ లీలగా చంపెను. రావణుడు ఏడుగురు మంత్రిసుతులను పంపెను. పవనపుత్రుడు వారినందఱిని అదే లోహ స్థంభంతో చంపివేసెను. తిరిగి తన పూర్వస్థానంలో నిలఁబడి ఎవరైనా వస్తారా నంచుకుందామని కూర్చొనెను. అంత అక్షకుమారుకు మహా ప్రతాపవంతుడు వచ్చెను. వానిని హనుమంతుడు తన స్థంభముతో పాటు మీదికి ఎగిరి ఆ స్థంభముతో వానిశిరస్సుపై కొట్టెను. ఆ తరు వాత వాని సేనను హతమార్చెను. ఒక్కడు మిగులకుండ చంపి వేసెను. ఈ వార్తను విని రావణుడు శోకించి ఇంద్రజిత్తును పిలిచెను. పుత్రా! నేనే ఆ వానరుని దగ్గఱకు వెళ్లి వాన్ని చంపిగాని లేక కట్టివేసిగాని తెచ్చెదననెను. ఇంద్రజిత్తు నేనుండగా మీ రెం దుకు దుఃఖిస్తారు. నేనే వెళ్లి వానిని బ్రహ్మాస్త్రంతో బంధించి తీసికొని వచ్చెదను. అని చెప్పి రథమెక్కి అంజనేయుని సమీపము నకు ఇంద్రజిత్తు వెళ్లెను. పెక్కుమంది రాక్షసులను వెంట నిడి కొనెను. అంజనేయుడు ఇంద్రజిత్తును చూచి గరుత్మంతుడు వలె అంతరిక్షమునకు ఎగిరెను. ఇంద్రజిత్తు ఎనిమిది బాణములు హను మంతునిపై ప్రయోగించెను. అవి హనుమంతుని శిరమందు తగిలినవి. ఆ తరువాత అరు బాణములతో హనుమంతుని హృదయమును రెండు పాదములను ఒక బాణముతో హనుమంతుని తోకను కట్టి వికారమైన సింహనాదము చేసెను. హనుమంతుడు ఏమి నొవ్వకుండా ఒక స్థంభమును ఊడదీసి ఇంద్రజితు రథసారథిని చంపెను. గుఱ్ఱము లతో కూడ వాని రథమును పిండిచేసెను. ఇంద్రజిత్తు మఱియొక రథమును తెచ్చి ఎక్కి బ్రహ్మాస్త్రముతో హనుమంతుని బంధించెను. రాక్షస రాజయిన రావణునిముంగిట నిలిపెను. ఏ రామనామ జపము

చేసిన, తెలియకచేసిన పాపములను క్షణములో పోగొట్టుకొంటారో మఱియు సద్యోముక్తిని పొంది సహస్ర సూర్యసంకాశమగు బ్రహ్మ పదమును పొందుతారో అటువంటి రామునియొక్క పాదపద్మము లను ఎల్లప్పుడు అన్ని వేళల హృదయ పద్మమునందు నిలిపిన మారుతికి సమస్త బంధనములు ఎప్పుడో తెగియున్నవి. అట్టి హను మంతునికి ఇతర పాశములొక లెక్కా. లేక వానిని ఏ పాశము కట్టి వేయగలదు ? ఏ పాశము కట్టజాలదు.

ఇట్లు సుందరకాండలోని తృతీయ సర్గము సమాప్తము.

—O—

చతుర్థ సర్గము

# శంకరుడు భవానితో పలికెను

కట్టబడి భయమును నటించుచున్న ఆంజనేయుని చూచి లంకానగర పౌరులు పిడికిళ్లతో వానివెనుకపడి కొట్టుచుండిరి. బ్రహ్మాస్త్రము హనుమత్ శరీరమును క్షణమాత్రము స్పృశించి వెంటనే వెడలిపోయెను. ఆ విషయమును తెలిసికూడ హనుమంతుడు తాళ్లతో కట్టబడ్డవానివలె కార్యసాధన గౌరవంతో నడచుచుండెను. ఇంద్రజిత్తు హనుమంతుని తోడ్కొని రావణ సమీపమును నుంచి వీని బ్రహ్మాస్త్రముతో కట్టివేసి బందీగా తీసికొని వచ్చితినని పలికెను. మహారాజ ! వీడు పెక్కుమంది రాక్షసులను చంపివేసెను. మంత్రులతో సమాలోచన చేసి వీనికేవిధమయిన దండమును విధింప వలెనో విచారించి ఇవ్వగలరని ఇంద్రజిత్తు పలికెను. అంత రావణుడు మంత్రులలో ప్రధానుడయిన ప్రహస్తుని పిలిచి వీడెవడు వీడెందుకు వచ్చాడు ? ఇచ్చట వీనికిగల కార్యమేమి ? ఈ వానరుడు నా సమస్త వనమును ఎందుకు ధ్వంసము చేసెను. మఱియు నా రాక్షసవీరుల నందరిని బలంతో ఎందుకు చంపి వేసెను. ఆ విషయములను వీనిని ప్రశ్నించి తెలిసికొమ్మనెను. ప్రహస్తుడు ఆదరంతో హనుమంతుని అడిగెను. హే వానర ! నిన్నెవరు పంపిరి. నీకు భయము లేదు. రాక్షసాధిపతి ముందు విషయముల నన్నింటిని సత్యంగా చెప్పుము. నేను నిన్ను విడిచి పెట్టెదను. అని అడిగెను. హనుమంతుడంత, మూడు లోకములకు కంటకుడైన దశకంఠుని చూచి మిక్కిలి ఆనందంతో, మనస్సులో శ్రీరాముని ధ్యానించుచు రాముని సత్కథను చెప్ప నారంభించెను. "దేవాదులకు శత్రువగు

రావణా ! నేను చెప్పింది సావధానంగా విను. కుక్క హవిస్సును దొంగిలించినట్లు పరమ పావనుడైన రామునియొక్క భార్యను నాశం కోరి నీవు హరించినావు. సమస్త ప్రాణికోటి హృదయాంతర్వర్తి యైన ఆ రాముని దూతను నేను.

ఆ రాముడు మతంగ పర్వతమునకు వచ్చి అగ్నిసాక్షిగా సుగ్రీవునితో మైత్రిని కుదుర్చుకొని ఒక్క బాణంతో మహాబలశాలి యైన వాలిని చంపి వానరరాజుగా సుగ్రీవుని చేసెను. హే రావణ ! ఆ రాముడు లక్ష్మణునితో కూడి మహాబలవంతు లయిన వానర యూధములతో ప్రవర్షణ పర్వతమందు కోపంతో నున్నాడు. ఆ రాముడు జానకీ మాతను వెదకుటకై పది దిక్కులకు పెద్ద పెద్ద వానర యోధులను పంపెను. ఆ వానరులలో నే నొకడను. నేను వాయుపుత్రుడను. నేను సీతమ్మ జాడతెలిసి కొనుటకు మెల్లమెల్లగా ఇచ్చటకు వచ్చితిని. నేను పద్మలోచనయైన అమ్మ జానకిని చూచితిని. నేను కోతిని, కోతిజాతి కనుగుణమైన స్వభావంతో ఆ వనమును ధ్వంసము చేసితిని. అంత రాక్షసులు పెద్ద పెద్ద అయుధములతో చుట్టుముట్టి నన్ను చంపుటకు వచ్చిరి. గాన ఆత్మ రక్షణకొఱకు వారిని చంపితిని. సమస్త దేహధారులకు దేహమంటె మహాప్రీతి గదా ప్రభూ ! ఆ తరువాత ఈ మేఘనాధుడు (ఇంద్రజిత్తు) నన్ను బ్రహ్మాస్త్రముతో కట్టివేసి యిచ్చటకు నీ దగ్గఱకు తీసికొని వచ్చినాడు. హే రావణ ! ఆ బ్రహ్మాస్త్రము నన్ను ముట్టుకొని తిరిగి వెళ్లిపోయినట్లు నాకు తెలుసును. కాని బందీవలె నటించి నీ దగ్గఱకు వచ్చి నీకు హితమును బోధించుటకు ఇచ్చ కలవాడనై వచ్చుటకు బందీవలె తీసికొని పోవుటకు అంగీకరించితిని.

నీవు బుద్ధిమంతులైన గృహస్థులగతిని స్వీకరించు. రాక్షస బుద్ధిని గ్రహించకుండ ఉండుము. సంసార బంధమునుండి తప్పించు

ప్రాణులకు హితముగూర్చు దైవీమార్గమును స్వీకరింపుము. నీవు బ్రహ్మయొక్క అత్యుత్తమమైన వంశమందు పుట్టినావు. పులస్త్య నందనుడవు. కుబేరుని చుట్టమయి యున్నావు. (అన్నదమ్ముడవు) దేహమే శరీరమే ఆత్మ అని కుబుద్ధిని నీవు విడిచిపెట్టు. దేహాత్మ బుద్ధిచేత నీవు రాక్షసుడవు కావు. (బ్రాహ్మణ సంభవుడగుట) ఆత్మ బుద్ధిచేతను రాక్షసుడవు కావు. వాస్తవస్థితిచేత నీవెవడవో నేను చెప్పు చున్నాను. విను. నీవు నిర్వికారుడవు అన్ని విధాలా గమనిస్తే శరీరము, ఇంద్రియములు, సుఖదుఃఖములు నీవి కావు. నీవు కూడా కావు అవి ఈ సుఖదుఃఖాదు లన్నిటికి కారణము అజ్ఞానము. సుఖ దుఃఖములు స్వప్న సదృశములు అవి అసత్తు యొక్క లక్షణములు. ఇది అత్యంతము సత్యము. నీయొక్క ఆత్మకు వికారములు లేవు. ఎందువలెనంటె ఆత్మ అద్వితీయమైనది. ఏ ప్రకారము ఆకాశము అన్నిచోట్ల ఉన్నప్పటికి ఏ పదార్థముయొక్క గుణదోషములు దానికి అంటవు. ఆకాశము లిప్తము కాలేదు. ఆ ప్రకారమే నీవు దేహమందున్నప్పటికీ సూక్ష్మరూపుడ వయినందున సుఖదుఃఖాది వికారములకు ఆకర్షింపబడ జాలవు. ఎప్పుడు బద్ధుడగుచున్నాడంటే, ఆత్మను, దేహేంద్రియ ప్రాణ శరీరములని భావించి నందున బద్ధు డగుచున్నాడు. నేను సచ్చిదానంద స్వరూపుడనని భావించి బుద్ధి వలన బంధముక్తుడగు చున్నాడు. ఈ దేహము ఆత్మకాదు. ఇది పృథివీ వికారమైనది కాబట్టి. ప్రాణము ఆత్మ కాదు. గాలియొక్క వికారమైనందున. మనస్సు ఆత్మకాదు అహంకార సంపర్కముంది కాబట్టి. బుద్ధికూడా ఆత్మకాదు ఎందువలెనంటె ప్రకృతి యొక్క సంపర్కము కలిగినందువలన. ఆత్మ చిదానంద మయము. వికార ములు లేనిది దేహాదులకంటె భిన్నమైనది. స్వతంత్రమైనది. నిర్మల మైనది. ఉపాధి రహితమైనది. నిత్యముక్త మైనది. అని తెలిసికొంటే మనుష్యుడు సంసారమునుండి విముక్తుడగు చున్నాడు. అందువలన

ఓ మహాబుద్ధిమంతుడైన రావణా ! నీకు అత్యంతము ప్రధానమైన మోక్షసాధనమును తెలియజేయు చున్నాను. సావధానుడవై తెలసి కొనుము. భగవంతుడైన విష్ణువునందు భక్తి బుద్ధిని శుద్ధి చేస్తుంది. అనంతరము నిర్మలమైన జ్ఞానము ఉదయించును. నిర్మలమైన ఆత్మ జ్ఞానము కలుగును. ఆత్మజ్ఞానమువలన శుద్ధమైన ఆత్మతత్వము అనుభవంలోకి వస్తుంది. దానియొక్క దృఢమైన ఉపదేశము వలన పరమపదము ప్రాప్తించును. అందువలన నీవు ప్రకృతి కంటె పరుడ, పురాణపురుషుడు, సర్వ వ్యాపకుడు, ఆదినారాయణుడు, లక్ష్మీపతి హరి భగవంతుడగు రాముని భజన చేయుము. సీతమ్మను ముందుంచుకొని ఆమె వెనుక నీ పుత్ర బంధుమిత్ర బాంధవులతో కూడ వెళ్లి భగవంతుడగు రాముని శరణుపొంది నమస్కరించుము. దానివలన నీవు భయ విముక్తుడవు కాగలవు. ఏ మానవుడు తన హృదయ మందున్న వాడు అద్వితీయుడు సుఖస్వరూపుడు, భగవంతుడగు రామున్ని భక్తిపూర్వకంగా నమస్కరించడో దుఃఖ సుఖ రూపమైన సంసార సముద్రమును ఎటుల దాటగలడు ? దాటలేడన్న మాట. భగవంతుడైన రాముని భజన చేయనిచో అజ్ఞాన రూపమైన అగ్ని చేత దహింపబడి నీవు నీయొక్క శత్రువువయి రక్షణలేనివాడ వయ్యెదవు. నీచేత చేయబడిన పాపములచే ఉత్తరోత్తరంగా అధోగతిని పొంది మరి మోక్షమువైపు తలెత్తజాలవు.

అమృత సమానమైన అంజనేయోప దేశమును విని దశకంఠుడు మహాకోపతప్తుడై రక్తవర్ణ లోచనుడై కపీశ్వరుని గురించి పలికెను.

ఓరీ మూర్ఖుడా ! వానరాధమా ! నాముందు భయములేకుండ నీ యిష్టము వచ్చిన ప్రలాపములు చేయుచున్నావు. ఎవడీ రాముడు.

సుగ్రీవు డెవడు ? వీడు వనచరుడు సుగ్రీవ సహితంగా నరాధము డైన రామున్ని చంపివేస్తా. హే వానరా ! ముందు నిన్ను ఇప్పుడు చంపిన తరువాత జానకిని చంపివేస్తాను. ఆ తరువాత లక్ష్మణునితో కూడ రాముని చంపివేస్తా. ముందుగా సుగ్రీవుని సవానరంగా చంపి వేస్తాను. ఆ తరువాత సమస్త వానర సైన్యమును చంపుతాను. అని పలికెను.

రావణుని వాక్యములు విన్న తరువాత హనుమంతునికి ఆ పాదశిరః పర్యంతము కోపము ప్రవేశించినది. రావణుని దహించు రీతిని ఆవేశంతో "ఓరీ అధమా ! నీవంటి కోటి రావణులు నాకు సరికారు. రాముని దాసుడను మహాపరాక్రమ వంతుడను. అని అనగానే రావణుడు తనప్రక్కనే ఉన్న రాక్షసులతో ఈ కోతిని ముక్కముక్కలుగా కొట్టి చంపివేయండి. సమస్తమైన మిత్రులు, బాంధవులు చూడుడు అనెను. హనుమంతుని చంపుటకు ఆయుధ ముతో వచ్చుచున్న రాక్షసుని హత్యాకార్యము నుండి విభీషణుడు నివారించెను. ఓ రాజా ! పరరాజుల దూతయగు హనుమంతుని చంపుట శాస్త్రసమ్మతము కాదు. వీనిని చంపివేసినచో రామునికి ఈ సమాచారము అందించే వారుండరు. అందుచేత వధతో సమాన మైన మరియొక దండమును చింతించి ప్రయోగించవలెను. ఆ తరువాత దూత సమాచారమును తీసికొని. సుగ్రీవ సహితుడైన రామునితో నీకు యుద్ధము జరుగును. విభీషణుని వాక్కును విని రావణుడు కూడ అటులనే పలికెను. కోతులకు తోకల యందభి మానము మెండుగా నుండును. అందువలన ప్రయత్నంతో వీని తోకకు గుడ్డలు కట్టి, నిప్పుట్టించి పట్టణంలో అన్ని వీధుల గుండా త్రిప్పి విడిచిపెట్టండి. రాక్షస యోధు లందరు చూస్తారు. అటులనే అంటూ రాక్షసులు హనుమంతుని తోకకు గుడ్డలను కట్టి తైలంలో ముంచబడిన అనేక విధముతైన వస్తులుతోను,

తోకను కట్టివేసిరి. ఆ తరువాత అగ్గిని ముట్టించిరి. తాళ్లతో బాగా కట్టి బలవంతులైన రాక్షసులు అన్నిచోట్ల త్రిప్పిరి. 'వీడు దొంగ అని కేకలు వేసిరి. గడిగడికి కొట్టుచు భేరీనాదములతో వీథులగుండా త్రిప్పుచుండిరి. హనుమంతుడు కొంచెము నాటకీయ సంతోషంతో సహించు చుండెను. పశ్చిమ ద్వారమునకు రాక్షసులు హనుమంతుని గొనిపోయిరి.

అప్పుడు హనుమంతుడు చిన్న పిట్టంతరూపమును ధరించి రాక్షసులు కట్టిన ముడులనుండి జారిపోయి వెంటనే పర్వతాకారమును ధరించెను. గోపురము మీదికి ఎగిరి ఒక స్థంభమును ధరించి ఆ రాక్షసుల నందరిని హతమార్చెను. ఇంకా ఏమి పని మిగిలింది? అని ఆలోచించి ఇంటినుండి ఇంటికి గెంతుచు మొత్తం లంకాపట్టణము నంతను దహించెను. దైత్యుల భార్యలు పెద్దపెద్ద ఏడుపులతో ఓ తండ్రీ తల్లీ అన్నా కొడుకా అని ఏడుపులు సాగించిరి. సమస్త రాక్షస స్త్రీలు అగ్నిలో పడుచున్నప్పుడు దేవతా స్త్రీలవలె భాసించిరి. విభీషణుని ఇంటిని విడిచిపెట్టి శేషించిన గృహముల నన్నింటిని తగుల పెట్టెను. ఆ తరువాత అంజనేయుడు ఎగిరి తోకను సముద్రంలో కడిగి స్వస్థచిత్తుడై యుండెను. అగ్నిహోత్రుడు అంజనేయుని పుచ్ఛము కాల్చలేదు. ఎందుకంటె హనుమంతుని తండ్రి వాయువు అగ్నికి మిత్రుడు. రెండవ కారణమేమిటంటే సీతమ్మ అగ్నిని అంజనేయుని శరీరమును తాక కూడదని ప్రార్థించింది. అందువలన అగ్ని హనుమకు మిక్కిలి శీతలమాయెను. ఏ శ్రీరాముని నామస్మరణ మాత్రం చేతనే సమస్త పాపములు, తాపత్రియములు అనెడి అగ్నిని దాటుచున్నారో అటువంటి రాముని యొక్క ప్రథమ శిష్యుడు విశిష్ట సేవకుడయిన హనుమంతుని ప్రకృతిలోని అగ్ని ఏ విధంగా దహించ గలదు?

ఇట్లు సుందరకాండ యందు చతుర్థ సర్గ సమాప్తము.

## పంచమ సర్గము

హనుమంతుడు లంకాదహనము గావించి తిరిగి సీతమ్మ దగ్గఱకు వచ్చి నమస్కరించి దేవీ! మీరు ఆజ్ఞ ఇవ్వవలెనని రామ సన్నిధికి వెళ్లుచున్నాననియు, రాముడు లక్ష్మణునితో కూడ మిమ్ము చూచుటకు త్వరలోనే విచ్చేయు ననియు చెప్పి మూడుసార్లు సీతమ్మకు ప్రదక్షిణచేసి నమస్కరించి వెళ్ల నిశ్చయించి వెళ్లేముందు దేవి వెళ్లుచున్నాను. నీకు భద్రము జరుగును. తొందరలోనే రామున్ని చూచెదవు. లక్ష్మణుని, సుగ్రీవుని కొన్ని కోట్ల వానర సైన్యమును కూడ చూచెదవు. అంత సీతమ్మ హనుమంతుని చూచి నిన్ను చూడగానే దుఃఖము పోయింది. నీవిప్పుడు తిరిగి వెళ్లిపోవు చున్నావు. రామవార్త వినకుండా ఇకముందు ఏ విధంగా మెలగె దను అని పలికెను. అంత మారుతి అమ్మా! నీకు అంత ప్రాణ భయముంటే నా భుజములపై ఎక్కిపో. ఒక్క క్షణంలో రామునితో కలుపుతాను. సీత ప్రత్యుత్తర మిచ్చెను. రాముడు సాగరమును ఎండపెట్టియో, లేక తన బాణ పరంపరలతో వారధి కట్టియో సముద్రమును దాటి వానర యోధములతో సహా వచ్చి రావణుని బంధుమిత్రకళత్ర సహితంగా చంపి నన్ను తీసికొని వెళ్లినచో శాశ్వత మైన కీర్తిని రాముడు సంపాదిస్తాడు. అని హనుమను సీతమ్మ పంపెను. నేను ప్రాణములను ఏదో విధంగా ధరించియుంటా ననెను. అంత హనుమంతుడు పర్వత సమీపమునకు వెళ్లెను. అచ్చట పాదములతో కొండను పీడించి వాయువేగముతో పయనిం చెను. అంజనేయుని పాదభారంతో ముప్పది యోజనములు విస్తీ ర్ణముగల పర్వతము భూమియొక్క చదరముతో సమాన మాయెను. అంతరిక్షంలో ప్రయాణం చేయుచు ఆకాశ మధ్యం నుండి మహా

శబ్దమును చేసెను. ఆ శబ్దమును విన్న వానరములు అంజనేయుడు ఎచ్చుచున్నట్లు తెలిసికొనిరి. వారు కూడా మహదానందంతో శబ్దమును చేసిరి. ఈ శబ్దము వలననే హనుమంతుడు కార్యమును సాధించెనని తెలిసికొనిరి. హే వానరులారా ! చూడండి హనుమంతునివలె నున్నాడు. ఇట్లు వానరవీరులు వారిలో వారు ఆశ్చర్యంతో ఆకాశంపైకి చూచుచుండిరి. వాళ్లు ఆ విధంగా పలుకుచుండగానే అంజనేయుడు కొండశిఖరముపై దిగి వానరులతో పలికెను. దృష్టా సీతా ! సీతమ్మ కనపడెను. (ముందు పదము దృష్ట అనెను). ఉద్యానవనములతో కూడిన లంకానగరమును విధ్వంసము చేసితిని. రావణునితో మాట్లాడినాను. తిరిగి ఇచ్చటకు వచ్చితిని. రామ సుగ్రీవుల సన్నిధికి ఇప్పుడే వెళ్లెదము. అనగానే మారుతిని వానరులంతా అలింగన చేసికొనిరి. కొంతమంది తోకను ముద్దుపెట్టుకొనిరి. కొంతమంది ఉత్సాహంతో నాట్యమాడారు. వారందరు హనుమంతునితో కూడ ప్రస్రవణ పర్వతమునకు వెళ్లిరి. మార్గ మధ్యంలో సుగ్రీవుని మధువనమును చూచిరి. అంగదున్ని అడిగిరి. ఆకలితోఉన్నాము. అనుజ్ఞ ఇస్తే ఫలములను తిని అమృతము వంటి మధువును (తేనెను) త్రాగెదము. ఇది సంతోష సమయము. లక్ష్మణ సమేతుడైన రాముని దర్శించెదము. అంగదుడు పలికెను. హనుమంతుడు కృతకార్యుడైనాడు. ఇతని కృపవలన తొందరగా ఫలములు తిని, తేనె త్రాగవలెనని చెప్పెను. వానరులు మధువనమును ప్రవేశించి తేనెలను త్రాగుట మొదలుపెట్టిరి. అ తోటమాలి దధివక్త్రుడు పంపిన భటులను కొట్టివేసిరి. వానరులు పిడికిళ్ళతోను, కాళ్లతోను ముద్దచేసిరి. సుగ్రీవుని మేనమామయగు దధివక్త్రుడు కోపగించినవాడై వనరక్షకులను వెంట పెట్టుకొని సుగ్రీవుని దగ్గఱకు వెళ్లి చిరకాలముగా రక్షింపబడిన తోటను ఈ దినమున అంగదుడు హనుమంతుడు నష్టపుచ్చేరు. అని అనగానే సుగ్రీవుడు

ఉత్సాహమును పొందెను. పవననందనుడైన హనుమ సీతమ్మను చూచి వచ్చెను. ఇందులో సందేహము లేదు. లేకపోతే నా మధు వనమును చూచుటకు కూడ సమర్థుడు ఎవడున్నాడు. మఱియు వాయుపుత్రుడు ఆ కార్యమును చేసెనంటే నిస్సందేహంగా హను మంతుడు సీతను చూచి యుండెను. అంత రాముడు సుగ్రీవునితో సీతాసంబంధమైన సంభాషణ వినిపించింది ఏమిటి విశేషమని అడిగెను. దేవ ! సీతమ్మ కనబడినదన్నట్లు తెలియుచున్నది. ఎందువలెనంటే హనుమంతుడు మున్నగు వానర గణమంతా మధువనంలో ప్రవేశించి అందలి పండ్లను తినుచున్నారని తెలిసినది. మఱియు తోట కాపలావారిని కొట్టినట్లు తెలిసినది. మీ కార్యము చేయ కుండా నా మధువనంలోనికి అడుగుపెట్టజాలరు. అందువలన సీతా దేవి కనపడినట్లు నిశ్చయము. సుగ్రీవు డంగదాదులను వెంటనే రమ్మనమని తోటమాలిలకు ఆనతిచ్చెను. వారలట్టులనే చేసిరి. సుగ్రీవుని వచనమును విన్నవారై వానరులంతా వాయువేగముతో హనుమంతుని, యువరాజైన అంగదుని ముందు పెట్టుకొని రామ సుగ్రీవుల మధ్యయందు భూమిపై వ్రాలిరి. హనుమంతుడు రాము నితో "దృష్టా సీతా నిరామయా" సీతమ్మ చూడబడింది. ఆరోగ్యంగా ఉంది" అని చెప్పెను. ఆ తరువాత రామునికి సాష్టాంగదండ ప్రణామ మాచరించి ఆ తరువాత సుగ్రీవునికి నమస్కరించి హనుమ ఇట్లనెను. "హే రాజేంద్ర ! ఆచారవంతురాలైన జానకి సీయొక్క క్షేమమును అడిగినది. అశోకవన మధ్యంలో శింశపా వృక్షముక్రింద రాక్షస స్త్రీలతో చుట్టు వారుకొని యున్నది. ఆహారము తినలేదు. మిక్కిలి కృశించి యున్నది. హా రామ ! హా రామ ! అని దుఃఖించుచు మాసిన బట్టలను ధరించుచు ఒకే జుత్తుపేట కలిగి కనపడినది. నేను ఓదార్చినాను".

చెట్టు కొమ్మల మధ్య యందుండి సూక్ష్మరూపముళ్ళు ధరించి సీయొక్క కథను జన్మము మొదలు దండకారణ్య ప్రవేశము, దశాననుచేత హరణము, సుగ్రీవ మైత్రి, వాలివధ, సుగ్రీవునిచేత సీతాన్వేషణ నిమిత్తము మహాబలవంతులైన వానరులు పంపబడి నట్లు, నేను వారిలో నొకడను ఇచ్చటకు వచ్చినట్లు, నేను సుగ్రీ వుని మంత్రి ననియు, రాముని సేవకుడ ననియు, అని చెప్పితిని. నా భాగ్యమువలన జానకి కనపడింది. నా ప్రయాస ఫలించింది. అని చెప్పగానే సీతమ్మ కళ్ళువిప్పి కర్ణపేయూషమైన నాకు వినిపించిన దంతా సత్యమైతే నా ముందుకు రావలెనని అన్నది. అంత నేను వానరరూపంలో చిన్నదైన శరీరమును ధరించి అంజలి ఘటించి దూరంలో నిలబడితిని. అమెచేత నీవెవరవు అని అడుగబడితిని. అందుకు సమాధానంగా క్రమంగా చెప్పితిని. ఆ తరువాత ప్రభువు వారిచ్చిన ఉంగరమును ఇచ్చితిని. దానివలన అమె నన్ను మిక్కిలి విశ్వసించెను. శ్రీరామునితో ఇచ్చట తాను పడుచున్న బాధలను యథాతథంగా నివేదించమని అన్నది. మీ వార్త తెలియక రాత్రిం బవళ్లు అమె దుఃఖించు చున్నది. నేను రామునికి సర్వవిషయములు చెప్పెదననియు చెప్పినవెంటనే రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు వానరసైన్యము వచ్చి రావణాసురుని కుల సహితంగా హతమార్చి అయోధ్యకు తన్ను రాముడు తీసికొని వెళ్లెదడని" చెప్పితిని. అంతట నేను "గుర్తుకుగాను అభిజ్ఞను ఇమ్మని" అడిగితిని. అమె తన శిరోపాశమందలి శిరోరత్నమును ఇచ్చి, చిత్రకూట పర్వతమందలి కాక వృత్తాంతమును కళ్లనిండా నీళ్లుపెట్టుకొని చెప్పినది. అయిన ప్పటికి రాముని కుశలవార్త నడిగితినని చెప్పమన్నది. లక్ష్మణునికి కూడ క్షమాపణ చెప్పమన్నది. అమె పూర్వమందు పలికిన దురుక్తు లను అజ్ఞానమువలన పలుకులని చెప్పమన్నది. నేను అమెను ఏడ్చుచున్న దానిని ఓదార్చితిని. అమె అ విధంగా నన్ను పంపినది. తిరుగుప్రయాణము ముందు అందమైన అశోకవనమును ధ్వగము

గావించితిని. క్షణకాలంలో కొన్ని వేలమంది రాక్షసులను చంపివేసి నాను. రావణుని కుమారుడు అక్షుని చంపివేసితిని. రావణాసురునితో సంభాషించితిని. లంకాపట్టణమును నిశ్శేషంగా దహించితిని. తిరిగి క్షణములో వచ్చితిని.

హనుమంతుని వాక్యములను విని మిక్కిలి హృష్టమానసుడై రాముడు "హే హనుమ! నీవు చేసిన కార్యము దేవతలకు కూడ సాధ్యము కాదు. ఇంత ఉపకారము చేసిన నీకు ప్రత్యుపకారం కొఱకు ఏమి చేయాలో నాకు తోచలేదు. హే మారుతి! నా సర్వ స్వమును నీకు నేను ఇచ్చుచున్నాను". అని పలికి హనుమను ఆలింగ నము చేసికొని దగ్గఱకు చేరదీసి ఆనందభాష్పములతో హనుమంతు నితో తిరిగి భక్తవత్సలుడైన రాముడు పలికెను. "పరమాత్మయైన నాయొక్క ఆలింగనము ప్రపంచంలో అతి దుష్కరమైనది. అందు వలన నీవు నాయొక్క భక్తుడవైతివి. ఇష్టుడవైతివి. హరిపుంగవ! కపి శ్రేష్ఠమా!" అని సంబోధించెను.

ఏ రామచంద్రుని పాదపద్మములను తులసిదళము, పుష్పము లతో మున్నగు పూజాద్రవ్యములతో పూజచేసి సాటిలేని విష్ణు పదవిని పొందుచున్నారో అటువంటి రామునిచేత ఆలింగనము కావింపబడిన శరీరము కలవాడు వాయుపుత్రుడు ఎంత పూర్వ పుణ్యము చేసినాడో అతని జన్మ ధన్యము.

ఇట్లు సుందరకాండలోని పంచమ సర్గము సమాప్తము.

—O—

# యుద్ధకాండ

# యుద్ధ కాండ

## ప్రథమ సర్గము

## శంకరుడు భవానితో పలికెను

శ్రీరాముడు హనుమ సంభాషణము నంతను విని పరమా నంద భరితుడై దేవతలకు కూడ సాధ్యముకాని పని హనుమంతుడు చేసెననియు, భూలోకంలోని ఏ మానవుడు, మనస్సు చేత ఆలోచించు టకు కూడ శక్యముకాని కార్యమని ప్రశంసించెను. ఏకాకిగా శత యోజన విస్తీర్ణమైన సముద్రమును రాక్షసపాలితమైన లంకను విధ్వంసము చేయగల సమర్థుడెవ డున్నాడు. భృత్యకార్యమును ఏ విధమైన లోటుపాట్లు లేకుండా సర్వవిధముల సంపూర్ణంగా, శాస్త్ర ప్రకారంగాను, ఔచితీగరిమతోను, ప్రశంసనీయంగాను, చక్షువునకు, రాజనీతికి లోబడి ప్రాణములను పణముపెట్టి, కోపమును మ్రింగి సమర్థత కలిగినను వినియోగించకుండ పౌరుషవాక్యములు పలుక కుండా, విదేశములలో రాయబారులు ఏ విధంగా సమయజ్ఞతను ఎఱిగి నడవాలో ఆచరించి స్వకార్యమునకు, స్వామి కార్యమునకు భంగము కాకుండా ఆత్మరక్షణకు రాక్షసుల చంపితి ననియు, కోతి బుద్ధిచే అశోకవనమును ధ్వంసము చేసితిననియు, బ్రహ్మాస్త్రము తన్ను బంధించలేదని తెలిసియు, నిగ్రహము పాటించి రావణ సహస్రముకంటె అధికమైన బలము కలవాడనియు, అయినప్పటికి దూతగా తాను లంకను, రావణుని, రాక్షసులను చంపకూడదను వివేకముతో మెలగి రావణుడు చేసిన లాంగూలదహనముతో లంకా దహనము గావించి తప్పు తాను చేయకుండా రక్షణ నిమిత్తము తెలకువతో చేసినట్లు వ్యక్తముచేసి సీతమ్మను తన భుజములపై

పెట్టి తీసికొని పోగల సమర్థత కలవాడయినను మర్యాదకు భంగము కలుగునను శంకతో ఆ పనిని చేయకుండా అమ్మకు ఆత్మ విశ్వాసము కలుగునట్లు కథలను చెప్పి నశించే ప్రాణములను సీతమ్మలో తిరిగి పునరుజ్జీవింపజేసి, సామ, దాన, భేద దండోపాయములను నాలుగుపాయములలో సామమును తీసికొని రావణునికి రాముని బలమును తేటతెల్లంగా విశదపరచి వేదాంత పరమైన తత్వ బోధచేసి ఆత్మానాత్మ వివేకమును తెలియపరిచి ప్రజానాశమును నివారించు ఉద్దేశముతో సమస్త జనులు సంతోషంగా ఉండాలనే సంకల్పంతో రావణునకు తుదిసమయంలో కూడ అవకాశమిచ్చు తెరగున రాముని శరణుపొంది సీతను అప్పచెప్పమనెను. రాముడు మెచ్చుకున్నాడంటే ఏ దూతకు కూడ ఇట్టి సర్వతోముఖ ప్రజ్ఞ, లోకజ్ఞత, విశదత్వము, స్వామిభక్తి, యుక్తాయుక్త వివేకము, సమయజ్ఞత, కార్యదీక్ష లోకసంగ్రహ బుద్ధి, అపార బలవిక్రమ సంపత్తి, అన్నింటికి మించి ప్రాణములను తెగించి కార్యముచేయుట ఒక్క హనుమంతునిలోనే తప్ప ఇతర వ్యక్తుల యందు త్రిలోకములలో కూడ లేవు. ముమ్మాటికి లేవు. వీనికితోడు తపస్వి బ్రహ్మచారి, యోగి, సత్యసంధుడు, సంతత రామనామ జాపి షట్ శాస్త్ర పండితుడు, వ్యాకరణ శాస్త్రనిధి, వక్త, న్యాయవాది, లోకజ్ఞతకల వ్యక్తి హనుమంతు డొక్కడే. నిజంగా రాముడు మెచ్చుకొని తన సర్వస్వమును ఇస్తానంటే దానికి అర్హుడు హనుమ యొక్కడే. సర్వస్వమంటే రాజ్యంకాదు, ధనం కాదు, భోగములు కావు. త్రిలోకాధిపత్యం కాదు. సర్వస్వం అంటే శ్రీరాముని శరీరముతో హనుమ పొందిన ఆలింగనము. ఇదియే సర్వస్వము. శ్రీరాముడు హనుమకిచ్చినది. సుగ్రీవుకు కూడా ధన్యుడే. ఆంజనేయుని వంటి సచివుడు సుగ్రీవునికి లభించుట సుగ్రీవుని అదృష్టమని చెప్పాలి. రాముడు రఘువంశము, లక్ష్మణుడు, సుగ్రీవుడు కూడ జానకీ దర్శనకార్యమనే హనుమత్ కృతివలన రక్షింపబడిరి. అని అంటాడు శ్రీరాముడు.

జానకి పరిమార్గణము మహాపవిత్రమైన కార్యము. అయితే సముద్రము చూచినప్పుడు నా మనస్సు కంపిస్తోంది శతయోజన విస్తీర్ణమైన సముద్రమును దాటుట అనునది మహాకష్టమనిపించు చున్నది.

అంత సుగ్రీవుడు శతయోజన విస్తీర్ణమైన సముద్రమును దాటెదము. లంకను భస్మీభూతం చేసెదము. రావణాసురుని ఇప్పుడు చంపివేయ గలము. చింతవద్దు. చింతకార్యమును నశింప చేస్తుంది. ఇచ్చటనున్న వానరవీరులను చూడుము. వీరందరు శూరులు మహాపరాక్రమ సంపన్నులు. నీ ప్రియమును చేయుటకు అగ్నిలో దూకి ప్రాణముల నర్పించమంటే అర్పిస్తారు. ముందుగా సముద్ర తరణమందు బుద్ధిని పెట్టండి. లంక కనపడితే రావణుడు చచ్చిపోయి నట్లే లెక్క. ఈ మూడు లోకములందు కూడ నీవు ధనుస్సు పట్టుకొని నిలపడితే నీముందు నిలబడ గలవాడు లేడు. హే రామ! అన్ని విధముల మనకు జయము కలుగును. సందేహము లేడు. మంచి నిమిత్తములను కూడ చూచుచున్నాను. భక్తివీర్యములతో మేళవింపబడిన సుగ్రీవుని సంభాషణ విని రాముడు సంతసించి, అంగీకరించి హనుమంతునితో ఇట్లనెను. "సముద్రమును ఏదో ఒక ఉపాయంతో దాటుగలము. లంకయొక్క స్థితిని యథాతథంగా వినిపించు. ఇది దేవదానవులకు కూడ దుర్భేద్యం అని వినికిడి. ముందుగా నీవు లంకయొక్క భౌగోళిక స్థితిని చెప్పినచో ప్రతీకారము ను ఆలోచిస్తాను". అంత హనుమ అంజలిఘటించి తనచేత చూడబడ్డ దానిని యథాతథంగా చెప్పెదననెను. త్రికూటపర్వత శిఖరమందు లంక ఉన్నది. దివ్యమైన నగరమది. బంగారు ప్రాకారములు, బంగారపు మిద్దెలు అగడిదలతోను కూడుకొని యున్నది. అగడిదల యందలి జలములు నిర్మలమైనవి. చక్కని ఉద్యానవనములు, చక్కని దిగుడు బావులు, మణులతో కట్టబడిన స్తంభములతో కట్టబడిన మేడలు ఉన్నవి. పశ్చిమ ద్వారమందు వేలాది ఏనుగులు,

ఉత్తర ద్వారమందు అశ్వ సైన్యములు, పూర్వద్వారమందు కోట్లాది పదాతి సైన్యములున్ను అటులనే దక్షిణమందు కూడా రాక్షస పరీవృతమై యుంది. మధ్య కక్ష్యలో లెక్కపెట్టలేనన్ని, ఏనుగులు, రథములు, సేనాధిపతులు గలరు. అన్ని విధములైన అస్త్రములను ధరించి. రాత్రి, పగలు, ఈ సేనలు లంకను రక్షించు చున్నవి. అనేక విధముల మార్గములు, సొరంగములు వానియందు శతఘ్నులు కలవు. ఇట్లు రక్షణలు కలిగియున్నప్పటికి దేవేశ్వరుడగు రామా! నేను రావణునియొక్క నాలుగవ వంతు సేనను హతమార్చితిని. లంకానగరమును దగ్ధము చేసితిని. చైత్యప్రాసాదమును కూల్చివేసితిని. శతఘ్నులు, సంక్రమములు నాశనము చేయబడినవి. దేవ! నీవు చూస్తే చాలు లంక భస్మీభూతము కాగలదు. దేవా! లవణ సముద్రమునకు మన యావత్తు వానరవీరులతో తీరమును చేరుటకు ప్రయాణ ముహూర్తము పెట్టుము. అనగానే రాముడు సుగ్రీవుని చూచి ఇప్పుడే విజయమనే ముహూర్తమున్నది. సమస్త సైన్యమును ప్రయాణమునకు సన్నద్ధము చేయుము. ఈ ముహూర్తములో బయలుదేరితే సరావణంగా లంకా నగరాన్ని రాక్షస కులాన్ని నాశనంచేసి జానకిని తీసికొని వచ్చెదను. నా కుడికన్ను అదురుచున్నది. వేగవంతులైన వానరులందరు బయలుదేర నిమ్ము. సేనానాయకులు సేనకు ముందు వెనుక ఉభయ పార్శ్వములయందు రక్షించు గాక. నేను హనుమంతుని భుజమెక్కెదను. నీవు నావెనుక రమ్ము. లక్ష్మణుడు అంగదుని భుజములమీాద వచ్చెదరు. గజుడు, గవాక్షుడు, గవయుడు, మైందుడు, ద్వివిదుడు, నలుడు, నీలుడు, సుషేణుడు, జాంబవంతుడు ఇంకను మున్నగు మహాయోధులందరు బయలుదేరు గాక. అని చెప్పి రాముడు, లక్ష్మణ సుగ్రీవులుతో కూడ సేనమధ్యలో ప్రవేశించి పయనించు చుండెను. కామరూపులైన వానరులందరు సంతోషంతో గెంతుచు, కేకలు పెడుచు, పళ్లు తింటూ, తేనెలు త్రాగుచు రావణుని చంపి తీరుతామని రాముని

ముందు పలుకుచు దక్షిణ దిశలో పయనించు చుండిరి. వారలతో వెళ్లుచున్న రామలక్ష్మణులు నక్షత్ర మధ్యంలో సూర్యచంద్రులవలె ప్రకాశించు చుండిరి. భూమినంతను అవరించి వానరసేన లోకములు కదల్చుచు, చెట్లను విరుచుచు, కొండల నెక్కుచు, వాయువేగంతో లెక్కకురాని వానర సైన్యము కదలుచుండెను. రామునిచేత పరి పాలితులై ఒక్క క్షణముకూడా విశ్రామము లేకుండ రాత్రిఅనక, పగలనక చిత్ర విచిత్రములైన అరణ్యములను, మలయ సహ్య పర్వతములను దాటి మహానాదము చేయుచున్న సముద్రతీరము నకు చేరిరి. రాముడు హనుమనుండి దిగి సుగ్రీవుని కలసి మన మందరము సుఖముగా సముద్రతీరమునకు వచ్చితిమి. ఇచ్చట నుండి వెళ్లుట ఉపాయము లేకుండ జరుగదు. ఇచ్చట సేనలు ఉండనిమ్ము. సముద్ర తరణముగూర్చి విచారించెదము. సుగ్రీవుడు సమస్త సేనను సముద్రపు టొడ్డున నిలపెట్టెను. యోధులను రక్షణకు నియమించెను. వానరసేన సముద్రమును చూచుచు మనస్సులో విషాదమును పొందుచుండిరి. అగాధమైనది, మొసళ్లతో నిండినది, మహోన్నత తరంగములతో కూడిన దీనిని దాటుటెట్లా అని ఆలోచిస్తూ రాముని ప్రక్కకు చేరిరి. రాముడు సీతను స్మరించి మహాదుఃఖమును పొంది ఏడ్చెను. అద్వితీయుడు, చిదాత్మ, పర మాత్మ సనాతనుడైన రాముడు మనుష్య శరీరమును ధరించినందున జానకీమాత గూర్చి అనేకముగా విలపించెను. ఏ పురుషుడు పరమాత్మ యైన రామునియొక్క నిజస్వరూపమును తెలిసినంత మాత్రాన అతనిని సుఖదుఃఖములు స్పృశించవు. అటువంటిది అవినాశి ఆనంద స్వరూపియైన భగవంతుడైన రామునికి సుఃదుఃఖము లెట్లుండును ? ఉండవే ఉండవు. దుఃఖము, హర్షము, భయము క్రోధము మున్నగు అరిషడ్వర్గములు అజ్ఞానానికి చిహ్నములు. చిదాత్మయగు రాముని యందివి ఎట్లుండును ? ఉండనేరవు. దేహ భిమానికి దుఃఖముండును.

గాని చైతన్యవంతమైన ఆత్మకు దుఃఖముండదు. సమాధ్యవస్థ యందు ద్వైతమైన ప్రపంచములేని కారణమువలన కేవలం సుఖమే సాక్షాత్కరించును. ఆ అవస్థలో మనస్సు, బుద్ధి మున్నగునవి లేనందున శుద్ధమైన ఆత్మయందు లేశమాత్రమైన దుఃఖముండదు. అందువలన దుఃఖము మున్నగునవి బుద్ధికి సంబంధించినవని. భగవంతుడు పరమాత్మ పురాణపురుషుడు నిత్యప్రకాశ స్వరూపుడు, నిత్యసుఖ స్వరూపుడు, కోరికలు లేనివాడు అగు రామునికి, మాయాగుణ సంపర్కము వలన సుఖదుఃఖము లున్నవాడువలె ఊహింపబడు చున్నాడు.

ఇట్లు యుద్ధకాండ యందు ప్రథమ సర్గ సమాప్తము.

—O—

ద్వితీయ సర్గము

## శంకరుడు భవానితో పలికెను

లంకలో రావణుడు హనూమత్కృతమైన విధ్వంసమును, బల పరాక్రమ ప్రదర్శనములను చవిచూచి ప్రప్రథమంగా చవిచూచి గుండెల్లో గుబగుబలు చెలరేగ మంత్రుల నందరిని సమావేశపరచి హనుమత్ కృతకార్యములకు పునరాలోచన అవసరమున్న దనియు, వీరరాక్షసులను మండోదరీ కుమారుడైన అక్షుని లీలగా చంపివేయుట సాగరతరణము చేయుట సీతను చూచుట మున్నగు అతిలోక విశేష ములను బాగా ఆలోచించి ముందు కార్యక్రమము గూర్చి సలహా సంప్రదింపులు కావించి తనకు హితమైన దానిని చెప్పవలెనని అడిగెను. మీరందరు మంత్ర విశారదులైన వారని ప్రత్యేకంగా చెప్పెను. రాజనీతి నిపుణులు రావణుని కొలువులో కూడ ఉన్నారు. ప్రయత్న పూర్వక విచారణలు జరుపవలెనని వారిని అడిగెను. రాక్షసవీరులు, రాముని వలన కీడుకలుగ గలదనే శంకను విడిచిపెట్ట వలె ననిరి. నీవు లోకముల జయించిన వాడవు. ఇంద్రున్ని కట్టి బంధించాడు నీ కొడుకు. నీవు కుబేరుని జయించి వాని పుష్పక విమానమును తీసికొని యున్నావు. యమున్ని జయించావు. యమునివలన భయము లేదు. హుంకారం చేసి వరుణుని జయిం చావు. ఇంత పెద్దపెద్ద రాక్షసుల గూర్చి చెప్పాలంటే మయున్ని జయించి మయుని కన్యను నేటివఱకు అనుభవించు చున్నావు. తక్కినవారల గూర్చి పెద్దగా పట్టించుకో నవసరము లేదు. హను మంతుడు చేసిన తిరస్కారము గూర్చి వాడు కోతి గదా! అని మేము ఉపేక్షించాము. కోతితో యుద్ధమెందుకని పౌరుషమునకు

తిరస్కారమని వదిలిపెట్టినాము. లేకపోతే వాడేవిధంగా మనకు తిర స్కృతి చేయగలడు. మేము జడంగా అపేక్ష చేయలేదు. చాలా సావధానంగానే ఉన్నాము. కాని కోతితో కొట్లాటకు ఇష్టపడలేదు. వాని వికారములను ముందుగా తెలిసియుంటే వాడు జీవించి వెళ్ల గలడా! మీరు అజ్ఞాపిస్తే జగత్తులో కోతి లేకుండా మానవుడు మచ్చుకు లేకుండా ఉపక్రమిస్తాము. మేమందరము గాని లేక వాలో ప్రతి ఒక్కడు అందుకు తగియున్న వారలమే. మీరు నియోగిస్తే తప్పక జయము సాధిస్తామనిరి.

కుంభకర్ణుడు రావణుని చేష్టలను నిందించెను. రావణా! నీచేత చేయబడిన పనులు ఆత్మనాశన కారకములు (Self destruc- tive) నీ అదృష్టమువలన సీతాపహరణ సమయములో రాముడు నిన్ను చూడలేదు. రాముడు చూచి ఉంటే నీవు పంచవటి నుండి బ్రతికి రాలేవు. రాముడు మానవుడు కాడు. సాక్షాన్నారాయణుడు. రామపత్నియైన సీత సాక్షాత్ లక్ష్మీదేవి. ఆమెను రాక్షస వినాశము నకు తెచ్చితివి. చేప నీట్లో విషముతో కూడిన ఎరను మ్రింగినట్లు తెచ్చినావు. జానకిని తీసికొని వచ్చిన తరువాత ఏమి జరుగునో నీకు తెలియదా? ఒకవేళ నీవు అనుచిత కార్యమును చేసితివి. కానిమ్ము. నేను నిన్ను శాంతచిత్తుడ చేసెదను. నేను పనిని సుఖాం తము చేసి నీకు కీడుకలుగకుండా చూస్తాను అనెను. అంత ఇంద్ర జిత్తు ఆ మాటలను విని నాకు అనుజ్ఞ ఇమ్ము. నేను రామలక్ష్మణులను సుగ్రీవుని వానరులను హతమార్చి తిరిగి నీ దగ్గరకు వస్తాననెను.

ఇంతలో భాగవత ప్రధానుడు బుద్ధిమంతులలో విశిష్టుడు అంతఃకరణమందు ఎల్లప్పుడు శ్రీరామచరణ కమలములను ధ్యానించు వాడు విభీషణుడు వచ్చి రావణునికి నమస్కరించి కూర్చొనెను. మత్తులు ప్రమత్తుల్లై యున్న కుంభకర్ణాది రాక్షసులను ఆశ్చర్యంతో చూచి, అటు కామాతురుడైన రావణుని చూచి నిర్మలబుద్ధిచేత కర్త

వ్యంలో సావధాన బుద్ధితో పలికెను. హే రావణా! కుంభకర్ణ, ఇంద్రజిత్తులు, మహాపార్శ్వ మహోదరులుని కుంభకుంభులు, అతికాయ మహాకాయాది రాక్షసులెవ్వరు యుద్ధములో రాముని ఎదుర్కొన జాలరు. వీరలెవరు శక్తులు కారు. సీత అని పిలువబడిన ఒక పెద్ద గ్రహముచేత నీవు గ్రస్తుడవై యున్నావు. వీరలు చెప్పిన విధానములువలన నీకు అగ్రిహమునుండి విముక్తి కలుగదు. నీవు ఇప్పుడు మర్యాదాపూర్వకంగా కొంత ధనముతో కూడ శ్రీరామునికి ఆ సీతమ్మను తిరిగి అప్పచెప్పుము. నీవు సుఖముగా ఉండుము. వాడియైన రామబాణములు లంకలో ప్రవేశించి రాక్షసుల తలకాయలను తీసివేయక ముందే రఘురామునకు జానకిని సమర్పించుటకు అర్హతకలిగి యున్నావు. పర్వతాకారులు, మహాబలులు, సింహ సమానబలులు గోళ్లు, కోరలు, అయుధములుగా గలవారు లంకానగరము ప్రవేశించి సర్వనాశము చేయకముందే నీవు సీతమ్మను రామునికి అప్పచెప్పుము. లేకపోతే దేవేంద్రుడు కానిమ్ము. శంకరుడు కానిమ్ము. లేక దేవేంద్రుని తొడమీద కూర్చొన్నా యముని తొడమీద కూర్చొన్నా రామునికాదని బ్రతికి బయట పడలేవు. పాతాళలోకములోనికి ప్రవేశించినా నీవు బ్రతుకలేవు.

ఈ విధంగా పవిత్రము హితకారి అయిన, విభీషణ వాక్కును దుష్టరావణుడు గ్రహించలేక పోయెను. చచ్చిపోయే మనిషి మందును గ్రహించడు గదా! కాలుడనే రాక్షసుని దుర్బోధచే రావణుడు విభీషణు నుద్దేశించి ఇట్లనెను. నా కూడు తింటూ కండలు పెంచి నా అండలో ఉండి కూడా హితమాచరించిన నాకు ప్రతికూలమును సలుపుచున్నాడు. మిత్రరూపంలో శత్రువు పుట్టాడు. ఇందుల సంశయము లేదు. అనార్యుడు, కృతఘ్నుడు అయిన వ్యక్తితో సహవాసము చేయకూడదు. జ్ఞాతులు జ్ఞాతులయొక్క వినాశమును కోరుచుంటారు. ఇంకొక రాక్షసు డీ విధంగా పలికుతే వానిని

ఖడ్గంతో నరికేవాడిని. నీకు నింద అగుగాక! నీవు రాక్షస కులాధము డవు అని గర్జించెను.

విభీషణుడు రావణుని సంభాషణ విన్న వెంటనే గదాపాణియై సభనుండి వెడలిపోయెను. తనయొక్క నలుగురు మంత్రులతోకూడ ఆకాశమునకు ఎగిరి మహాంతమైన కోపంతో రావణుని గూర్చి పలికెను. నేను నీయొక్క హితమును కోరేవాడిని. తిరిగి నీవు నన్ను ధిక్కారము చేయుచున్నావు. అయినను నేను కోరుకున్న దేమిటంటే నీకు వినాశము రాకూడదు. నీవు నాకు జ్యేష్ఠ భ్రాతవు. జ్యేష్ఠభ్రాత పితృసమానుడు. దశరథుని యింట్లో రాముని రూపంలో నీకు యము డుదయించినాడు. కాళీదేవి జనకుని యింట్లో సీతగా అవిర్భవించింది. వారిద్దరు భూభారహరణమునకు ఇచ్చటకు వచ్చిరి. వారి ప్రేరణచేత నీవు నాయొక్క హితకరమైన పలుకును వినుట లేదు. భగవంతుడయిన రాముడు ప్రకృతికంటె పరుడు అతడు ప్రాణులయొక్క బయట లోపల నున్నాడు. సర్వత్ర సమాన భావంతో ఉన్నాడు. నిత్యనిర్మలుడైనను నామరూపాది బేధములు వలన విభిన్నంగా ప్రకాశించు చున్నాడు. అన్ని వృక్షముల యందున్న అగ్ని ఒక్కటే. కాని పలువృక్షములయొక్క భేధముచే అగ్ని కూడ భిన్నంగా కనపడుతుంది. అజ్ఞానులకు రంగుపూసల కాంతులవలన వానితో కూడిన స్ఫటికములో భిన్న భిన్న రంగులు కనపడును. పంచభూతముల భేదమువలన ఆత్మభిన్నమని మోహి స్తారు. భగవంతుడు నిత్యముక్తు డయినను తన మాయచేత గుణము లందు సమానుడగుచు కాల, ప్రధాన, పురుష, అవ్యక్త అను నాలుగు విధాల పురుషులుగా కనపడు చున్నాడు. జన్మలేని వాడయ్యు ప్రధాన పురుష రూపములచే జగత్తును సృష్టించు చున్నాడు. ఆత్మ

అవినాశియై నప్పటికి కాలరూపంతో జగత్ సంహారమును కావించు చున్నాడు. బ్రహ్మచేత ప్రార్థింపబడి కాలపురుషుడే రాముని రూపంలో బ్రహ్మగారి ప్రార్థనచేత నీ వధకొఱకు ఇచ్చటకు వచ్చినాడు. నిన్ను రాముడు నప్పుత్ర సకులంగా వధిస్తాడు. రామునిచేత సంపూర్ణ రాక్షస సంహారము మఱియు నీ సంహారము చూడలేను. అందువలన నేను శ్రీరాముని వెంటకు వెళ్లుచున్నాను. నేను వెళ్లిన తరువాత సుఖంగా ఇంట్లో ఉండుము. విభీషణుడు కర్ణకఠోరమైన రావణ వాక్యమును వినలేక, తన యావత్తు పరికరములతో ఇంటిని విడిచి పెట్టి రామపాదారవిందములకు సేవచేయదలచి పరిపూర్ణ మనస్కుడై వెళ్లెను.

ఇట్లు యుద్ధకాండలోని ద్వితీయ సర్గ సమాప్తము.

## తృతీయ సర్గము

శ్రీరాముని సన్నిధికి నలుగురు మంత్రులతో విభీషణుడు వచ్చి దగ్గరగా పలికెను. హే స్వామిన్ ! రామచంద్ర ప్రభో ! రాజీవలోచన ! నీ భార్యాపహారియైన రావణుని సోదరుడను. పేరు విభీషణుడు. సోదరుడు నన్ను వెడలగొట్టెను. నిన్ను నేను శరణు పొందితిని. అజ్ఞానియైన రావణునికి నేను ఎన్నిసార్లు హితము చెప్పినను వినలేదు. సీతను పంపమని రాముని శరణుపొందమని చెప్పినను వానికి నా మాటలు రుచింపలేదు. కాలపాశవశంగతుడై చెప్పబడినను మంచిని స్వీకరించలేదు. ఖడ్గముతీసి రాక్షసాధముడు నన్ను చంపుటకు నా మీదకు పరుగులిడెను. భయముతో వెంటనే ఒక క్షణము కూడా ఆలస్యము కాకుండ నేను నా నలుగురు మంత్రులతో నిన్ను శరణు పొందుటకు, సంసార నాశనమునకు మోక్షమునకు నీ సన్నిధిని చేరితిని.

సుగ్రీవుడు విభీషణ వాక్యములను విని వీడు రాక్షసుడు మాయావి. వీనిని విశ్వసించ రాదు. విశేషించి సీతాపహరణ చేసిన రావణునికి సోదరుడు. బలవంతుడు. సాయుధులైన మంత్రులతో కూడి ఏకాంతంలో అదును చూచుకొని మనలను చంపగలడు. ఆజ్ఞాపిస్తే వీనిని వానరులు చంపివేయగలరని పలికెను. నా బుద్ధితో విమర్శించి చూస్తే. ఇది నాకు తోచిన విషయము; మీ నిశ్చయము కూడ మనవి చేయవలె ననెను.

సుగ్రీవుని మాటలను విని మందహాసము చేయుచు రాముడు పలికెను. హే కపిశ్రేష్ఠ సుగ్రీవ ! నేను తలచిన ప్రభువులతో కూడిన సర్వలోకములను అరనిమిషములో చంపగలను. సృజించ

గలను. అందువలన నావలన అభయము ఇవ్వబడినది. వెంటనే రాక్షసుని ప్రవేశపెట్ట వలెను. ఇది నా నిశ్చితము. "ఎవరైనా సరే నన్ను శరణా అని ఒక్కసారి యాచిస్తాడో, నన్ను ను[illegible] కావాలని కోరుతాడో వానికి సమస్త ప్రాణుల నుండి భయమును నివారిస్తాను. ( సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చయాచతే. అభయం సర్వభూతేభ్యో దదామ్యేత ద్వ్రతం మమ ). రాముని శరణాగత కార్యనిశ్చయమును విని ఆనందించి విభీషణుని రప్పించి రాఘవుని చూపించెను. విభీషణుడు సాష్టాంగదండ ప్రణామమ్ము నాచరించి, విశేషమైన భక్తితో ఆనందంతో గద్గదమైన వాక్కులతో రాముని ధ్యానించెను. ఆనందరాముడు, శ్యాముడు, విశాలాక్షుడు, ప్రసన్నముఖ పంకజుడు, ధనుర్బాణ ధరుడు, శాంతుడు, సలక్ష్మణుడు అగు రాముని అంజలి ఘటించి స్తోత్రము చేసెను.

నమస్కారము రామచంద్ర ! సీతారామ నమస్కారము ! చండ కోదండ నమస్కారము. భక్తవత్సల నమస్కారము. అనంత, శాంత స్వరూప అమిత పరాక్రమా ! సుగ్రీవ మిత్ర రఘువంశ విభో ! జగదుత్పత్తి వినాశకారక, మహాత్మ నీకు నమస్కారము. త్రిలోకములకు గురువు అనాది కాలగృహస్థా నీకు నమస్కారము. నీవే జగములకు ఆదిమూర్తివి. నీవే పోషకుడవు. నీవే రుద్రుడవు, స్వతంత్రుడవు. భూతములకు బయట వెలుపల నున్నవాడవు. వ్యాపకుడవీవే. వ్యాప్తమైన ప్రపంచము నీవే. నీ మాయవలన అజ్ఞానులు, మూర్ఖులు, నష్టబుద్ధులు దుఃఖసుఖములకు లోనుకాబడి ఆగామిసంచిత ప్రారబ్ధ కర్మలకు వశులగుచున్నారు. నీయొక్క నిజస్వరూపము అనన్యభక్తి, జ్ఞానములచేత తెలియబడు వఱకు ఈ జగత్తంతయు సత్యముగా గోచరించును. ముత్తెపు చిప్పలోని వెండివలె గోచరించును. అజ్ఞానమువలన పుత్రదార గృహములందు తగులుకొన్న

వారై అంతమందు దుఃఖ భూయిష్టములైన విషయ భోగములను కోరుదురు. నీవు ఇంద్రుడవు, అగ్నివి, యముడవు. నిఋృతివి వాయువు వరుణుడవు, రుద్రుడవు, కుబేరుడవు. నీవు అణువుకంటె సూక్ష్మతరుడవు. మహాంతముకంటె మహనీయుడవు. సర్వలోకము లకు నీవే తండ్రివి, తల్లివి ధరించేవాడివి. ఆదిమధ్య అంత్యములు లేనివాడవు, పరిపూర్ణుడవు, అచ్యుతుడవు, అవ్యయుడవు. నీకు చేతులు కాళ్లు లేవు. కళ్లు, చెవులు లేవు. అయినను నీవే శ్రోతవు, నీవే ద్రష్టవు, నీవే గ్రహీతవు, నీవే వేగవంతుడవు, నీకు అన్నమయాది పంచకోశములు లేవు. నీకు గుణములు లేవు. నీవు నిరాశ్రయుడవు, నిర్వికల్పుడవు, నిర్వికారుడవు, అకారము లేనివాడవు, ప్రేరకుడవు లేనివాడవు. ఉత్పత్తి, వృద్ధి, పరిణామము, క్షయము, జీర్ణత్వము, నాశము అను ఆరు భావములు లేనివాడవు. ప్రకృతికంటె అతీతు డవు. కాన అనాది పురుషుడవు నీవు. మాయాకారణము వలన నీవు ఆవరణతో కూడిన మానవుడువలె ప్రతీతుడవగు చున్నావు. విష్ణు భక్తులు నిన్ను నిర్గుణుడవని, జన్మలేని వాడవని తెలిసికొని మోక్ష మును పొందుచున్నారు. నేను నీ చరణపద్మములందు భక్తియనెడి నిచ్చెనయొక్క సహాయముతో జ్ఞానయోగమనెడి రాజభవన శిఖ రాగ్రమును ఎక్కుటకు ఇచ్ఛగించు చున్నాను. రామ! నీకు నమస్కారము. సీతాపతి! నీకు నమస్కారము. కరుణాసాగర! నీకు నమస్కారము. రావణ శత్రు! నీకు నమస్కారము. నన్ను సంసార సముద్రమునుండి రక్షించుము. కాపాడుము. అని విభీష ణుడు స్తోత్రము చేయ సీతాపతియు భక్తవత్సలుడువగు రాముడు పలికెను. నేను వరదుడను. అడుగుము నీవు కోరిన వరమిచ్చెదను విభీషణుడు "ధన్యోస్మి రామా" కృతకృత్యుడనైతిని, కృతకార్యుడ నైతిని. నీ పాదపద్మ దర్శనమువలననే విముక్తుడనైతిని. సంశయము లేదు. నావంటి ధన్యుడు లేడు. నావంటి పవిత్రుడు లేడు, నావంటి

పురుషుడు లోకంలో లేడు. నాకు నీ మూర్తి దర్శనమైనది. కర్మ బంధములు పోవుటకు పరమైన నీ ధ్యానము, భక్తి లక్షణములు అయిన నీ జ్ఞానమును ప్రసాదించు. ఇంద్రియ సంబంధ భోగము లను యాచించను. నీ పాదపద్మముల యందలి భక్తినే నేను సదా సర్వథా కోరుచున్నాను. అటులనే అని రాముడు తిరిగి విభీషణునితో పలికెను. నాయొక్క మనోనిశ్చయమును రహస్యమైన దానిని నీకు మంగళకరమైన దానిని చెప్పుచున్నాను. వినుము. నాయొక్క భక్తులు ప్రశాంతులు, వీతరాగులు, ప్రశాంతులు అయిన మానవుల యొక్క హృదయమందు నిత్యము నేను ఉంటాను. సీతతో కూడ ఉంటాను. నీవు శాంతుడవు, సర్వపాప విముక్తుడవు. ఎల్లప్పుడు నన్ను ధ్యానించి, ఘోరమైన సంసారసాగరమునుండి మోక్షమును పొందెదవు. ఈ స్తోత్రమును ఎవరు వ్రాసినను, పఠించినను, విన్నను, నా ప్రీతివలన నాయొక్క సారూప్య పదమును పొందు చున్నాడు. అని చెప్పి లక్ష్మణునితో భక్తాభీష్టవర ప్రదుడగు రాముడు ఇట్లనెను. నన్ను చూచినందుకు ఇప్పుడే విభీషణునకు ఫలమును ఇచ్చుచున్నాను. సముద్రము నుండి జలము గైకొని రమ్ము. విభీషణుని లంకా రాజ్యమందు అభిషేకము చేస్తాను. ఎంతకాలము సూర్యుడు, చంద్రుడు, భూమి ఉంటాయో ఎంతవరకు నా కథ లోకమందు విఖ్యాతముగా నుండునో అంతవరకు విభీషణుడు రాజ్యము చేస్తాడు. అని చెప్పి లక్ష్మణునిచే తెకొని రాబడిన సాగర జలములచేత రమాపతియైన రాముడు అభిషేకము చేసెను. లక్ష్మ ణుడు మంత్రులు వానరులు "సాధు సాధు అంటూ రాముని కొని యాడిరి". సుగ్రీవుడు విభీషణుని ఆలింగనము చేసికొని ఇట్లనియెను. హే విభీషణ ! మన మందరము పరమాత్ముడైన రాముని సేవకు లము. నీవు ముఖ్యుడవు రాముని భక్తితో పరిగ్రహించావు. రావణ వినాశకులో నీవు సహాయము చేయ వలెను. అంత విభీషణుడు "పరమాత్మయైన రామునికి నేనేపాటి సాయము చేయగల

వాడను ? నిష్కపటంగా నిర్మలమైన భక్తితో రాముని సేవ చేసెదను.

ఆ సమయంలో రావణునిచేత పంపబడిన శుకుడనే రాక్షసుడు ఆకాశమందుండి సుగ్రీవునితో ఇట్లనెను. "రాక్షసరాజు రావణుడు నిన్ను తన సోదర సమానునిగా చూచుచున్నాడు. నీ గురించి అతడు చెప్పిన దేమంటే నీవు పెద్దకులమందు పుట్టితివి. నీవు వానర రాజువు. నీవు నా సోదర సమానుడవు. నేను ఏదో ఒక రాజకుమార్తెను అపహరించితిని. దానివలన నీకు ఏమి కీడు జరుగలేదు గదా ! అందువలన నీవు నీ వానర సైన్యముతో సహా తిరిగి కిష్కింధా నగరమునకు వెళ్లిపొమ్ము. లంకను చేరుటకు దేవతలకే సాధ్యము కాదు. మనుష్యుల, కోతుల మాట ఇంకేముంది. అని యూరకుండెను. వెంటనే వానరులంతా వానిని కఠినమైన పిడికిలి గుద్దులతో కొట్టుచుండిరి. ఆ ప్రహారములను తట్టుకోలేక శుకుడు రామునితో మొరపెట్టుకొని రామా ! దూతలను ఎవరు కొట్టరు, చంపరు. ఈ వానరవీరులను వారించుమని యాచించెను. రాముడు వానరులను నివారించెను. వానిని చంపవద్దనెను. తిరిగి శుకుడు ఆకాశ మార్గమున తిరిగి సుగ్రీవునితో రావణునకు సమాధానమేమంటావని అడిగెను. అంత సుగ్రీవుడు హే రాక్షసాధమ ! మా సోదరుడు వాలికి పట్టిన గతియే నీకు కూడ పట్టగలదు. నీవు పుత్రపౌత్ర కుల బాంధవ సమేతముగా హంతవ్యుడవు అని రావణునితో చెప్పు. నా రామచంద్రుని యొక్క భార్యను అపహరించి ఎక్కడకు వెళ్లగలడని అనెను. వెంటనే వానరులు శుకున్ని బంధించి వానరుల పరిరక్షణలో ఉంచిరి. అంతకు ముందు రావణునిచేత పంపబడిన శార్దూలుడనే రాక్షసుడు వానర సైన్యము యొక్క వివరములను తాను చూచినదంతయు రావణునికి నివేదించెను. రావణుడు దీర్ఘ

చింతాపరుడయి ఉచ్ఛ్వాసనిశ్వాసములను వదులుచు మందిరంలోనే ఉండి పోయెను.

అంత రాముడు లక్ష్మణునితో చూడు లక్ష్మణా ! ఈ సముద్రుడు నన్ను చూచి కూడ నా దర్శనము చేయలేదు. నా రాకను గుర్తించలేదు. వాడనుకొను చున్నాడు. మానవుడైన రాముడు కోతుల సాయంతో నన్నేమి చేయగలడు. చూడు వీనిని ఇప్పుడే ఇంకింప చేస్తాను. వానరులు దుఃఖము లేకుండా పాదచారులై నడిచెదరు. అని పలికి కోపంతో ఎర్రని నేత్రములు కలవాడయి విల్లునందు బాణమును ఆరోహించి ఓ పంచ మహాభూతములారా ! రామునియొక్క బాణ పరాక్రమమును చూడండి. నదులకు రాజయిన సముద్రుని ఇప్పుడే భస్మీభూతుని చేస్తాను. అని రాముడు పలుకుసరికి పర్వతములతోను, అరణ్యములతోను కూడ భూమి కంపించెను. అంతరిక్షము దిక్కులు స్వర్గము కూడ కంపించినవి. ఈ మధ్యలో సాగరుడు దివ్యరూప ధరుడయి దివ్యాభరణములతో ప్రకాశించుచు దిక్కులను ప్రకాశింప జేయుచు రాముని పాదపద్మముల యెడ సముద్రి సంబంధమైన నానావిధములైన కానుకలను సమర్పించెను. రామునికి సాష్టాంగ వందన మాచరించి త్రైలోక్య రక్షక రామా ! త్రాహి త్రాహి రక్షించు రక్షించు నేను జడుడను, మూర్ఖుడను. నీవు సర్వజగత్తును సృజించినప్పుడు నన్నా విధంగా సృజించావు. దేవ నిర్మితమైన స్వభావమును మార్చుటకు ఇతరులెవరికి సాధ్యము కాదు. పంచభూతములుకూడ జడములే స్వభావం చేత. ఆ విధంగా నీచేత సృష్టింపబడినవి. నీ ఆజ్ఞ దాటుటకు సమర్థములు కావు. భూతములు తామసాహంకారము వలన జన్మిస్తాయి. అందువలన వాటికి పుట్టుగుణము పోదు. పుట్టుకలోనే జడమైనవి ఏ విధంగా చైతన్యవంతములు కాగలవు ? నీవు నిర్గుణుడవు. ఆకారము లేనివాడవు. నీవు వైరాజసమై లీలచేత మాయాగుణములను అంగీక

శించు చున్నావు. గుణస్వరూపులైన విరాట్ పురుషుని సత్వగుణము వలన దేవతలు పుట్టిరి. రాజసగుణము వలన ప్రజాపతి గణము పుట్టినది. తామసాంశవలన రుద్రగణము పుట్టినది. జడబుద్ధిని, జడాత్మను మూర్ఖున్ని నేను లీలామానుషుడునైన విన్నే విధముగా తెలిసికొనగలను. మూర్ఖులను బాగుచేద్దామంటే దండమే విధానము. (దండ ఏవహి మూర్ఖానాం సన్మార్గ ప్రాపకః ప్రభో). భూతములకు కూడ అల్లే పశువులను ముల్లుక్రరపెట్టి పొడిచినట్లు పొడిస్తేగాని పనిచేయవు. శరణ శరణ భక్తవత్సల రామ! అభయం ఇమ్ము. రామ! లంకామార్గాన్ని నీకు ఇస్తాను. అని సముద్రుడు పలికెను. అంత శ్రీరాముడు ఈ నా రామబాణము అమోఘము. ఏ ప్రదేశమందు విడవాలో వెంటనే లక్ష్యమును చూపెట్టు, అంత సముద్రుడు పలికెను. హే రామ! ఉత్తర దిశయందు ద్రుమకుల్యమనే దేశము కలదు. అచ్చట అంతా పాపాత్ములు నివసించు చున్నారు. రాత్రింబవళ్లు నన్ను వాళ్లు బాధించుచున్నారు. హే రఘుశ్రేష్ఠ! మీరు ఈ బాణమును అందు ప్రయోగించండి. ఏకక్షణంలోనే రామబాణము సమస్త ఆభీర మండలమును చంపివేసి తిరిగి రాముని అమ్ముల పొదిలో ప్రవేశించెను. పూర్వస్థితిలోనే ఉండెను. అంత సముద్రుడు రామునితో పలికెను. విశ్వకర్మ కుమారుడు బుద్ధిమంతుడు, సమర్థుడు, ప్రాజ్ఞుడు, అనుభవము కలవాడు అగు నలునకు నా సముద్రజలములందు వారధిని కట్టుమని ఆజ్ఞ యివ్వండి. దానివలన లోకములు సర్వపాపహారమగు నీ కీర్తిని తెలిసికొందురు గాక. అని చెప్పి సముద్రుడు రామునికి నమస్కరించి అంతర్ధానుడాయెను. అంత రాముడు సుగ్రీవ లక్ష్మణులతో కూడ నలున్ని సేతుబంధనమునకు ఆజ్ఞాపించెను. అంత మహోత్సాహుడై నలుడు శతయోజన విస్తీర్ణమైన సముద్రమునందు పర్వతపాదములతో సేతువుని వానర సహాయముతో నిర్మించెను.

ఇట్లు యుద్ధకాండలోని తృతీయ సర్గ సమాప్తము.

చతుర్థ సర్గము

## శంకరుడు భవానితో పలికెను

రాముడు (రామేశ్వరం వద్ద) సేతువు నారంభించు ముందు రామేశ్వరుని మంగళదాయకుని లోకకళ్యాణము కొఱకు స్థాపించి చెప్పెను. శివుడయిన రామేశ్వరుని చూచి నమస్కరించినచో వాడు బ్రహ్మహత్యాది పాపములవలన ముక్తుడగు చున్నాడు. సేతుబంధము (రామేశ్వరమునందలి కట్టడము) నందు స్నానముచేసి, శివస్వరూపుడైన రామేశ్వరుని చూచి కాశీనగరమునకు వెళ్లి గంగానదీ జలములను తీసికొని వచ్చి రామేశ్వరుని అభిషేకముచేసి, ఆ జలపాత్రను సముద్రములో పారవేసినచో వాడు నిస్సందేహముగా బ్రహ్మపదమును పొందును. [ఈ విధంగా మ్రొక్కుకొని అనగా ముందు రామేశుని దర్శనము, సేతుబంధ స్నానము గావించి కాశీకి వెళ్లి గంగతెచ్చి ఆ గంగాజలముతో రామేశుని అభిషేకము చేసి ఆ తరువాత గంగ డబ్బాను సముద్రములో పారవేసెదను అని మ్రొక్కుకొనవలెను]. ఇది సాక్షాత్ శ్రీరామచంద్రుడు పలికిన పలుకు. రాముని మాటకు తిరుగు లేదు.

పలుకు రామేశ్వర పూజ తరువాత సేతుబంధనము నారంభించెను. మొదటి రోజున పధునాలుగు యోజనములు, రెండవ రోజున ఇరువది యోజనములు, మూడవ రోజున ఇరువదియొక్క యోజనములు, నాలుగవ రోజున ఇరువదిరెండు యోజనములు, ఐదవ దినమున ఇరువదిమూడు యోజనములను చొప్పున నూరు యోజనముల సముద్రంపై వారధి కట్టెను. వానరశ్రేష్ఠుడైన నలుని యొక్క పటిమ ప్రశంసనీయము. ఆ వారధిపై అంతమంది వానరులు

నడిచి అవతల తీరమునకు వెళ్లిరి. కొన్ని వేల మంది సువేల పర్వ తము నెక్కిరి. రామలక్ష్మణులు కూడ హనుమ దంగదుల వీపులనెక్కి మహాపర్వతము నెక్కిరి. అచ్చటనుండి విశాలమైనదియు, దివ్యంగా అలంకరింప బడ్డదియు అగు లంకాపట్టణమును చూచిరి. మంచి మంచి మేడలు, అగడిడలు, శతఘ్నులు, సంక్రమములు (కూడలిలు) కలిగియున్న నగరమును సావధానంగా చూచిరి. ఆ సమయంలో రావణాసురుడు బాగా విస్తీర్ణంగా ఉన్న మేడ పై భాగములో మంత్రులతో మంతనాలు చేస్తూ ఉన్నాడు. పది కిరీటములను ధరించినవాడు, నీలాంజన పర్వతము లాగున ఉన్నవాడు, కాలమేఘంవంటి నల్లని కాంతి కలవాడు రత్నదండములు, శ్వేతాత పత్రములు ధరించిన రాక్షసులతో కూడుకొని యుండెను.

కోతులచేత దెబ్బలు తిని రాముని దయవలన విడువబడిన శుకుడు మెల్లగా రావణాసురుని దగ్గఱకు వెళ్లెను. రావణుడు నవ్వుచూ శత్రువులు బాగా కొట్టారా అని అడిగెను. శుకుడు రావణునితో ఇట్లు పలికెను. నీవు చెప్పినట్లే సముద్రముయొక్క ఉత్తర తీరమును చేరి నీవెట్లు చెప్పమంటే అట్లే పలికితిని. వెంటనే కోతులందరు వచ్చి నన్ను పట్టుకొని కాళ్లతోను, గోళ్లతోను కొట్టి చీల్చి రామున్ని శరణుకోరేవఱకు చిదకబాదిరి. రాముడు విడిచిపెట్టుమని చెప్పిన తరువాత నన్ను విడిచి పెట్టిరి. వానరసేనను చూచిన తరువాత భయముకలుగ, ఇచ్చటకు వచ్చితిని. నా బుద్ధితో ఆలోచిస్తే దేవ దానవ బలములకు వానరబలములకు సరిపోలిస్తే పోలిక పనికిరాదు. వాళ్లు యుద్ధమునకు దండెత్తి వచ్చుచున్నారు, లంకా పట్టణ ప్రాకారముల వఱకు వచ్చుచున్నారు. నీవు సీతమ్మను రామునికి ఇచ్చి వేయుము. లేనిచో యుద్ధము చేయుము. నీతో చెప్పమని శ్రీరాముడు చెప్పమన్న మాటలు వినుము. ఏ బలమును పరిగణించి సీతను అపహరించితివో ఆ బలమును సేనతో కూడ బంధువుల పరాక్రమమును ప్రదర్శన చేయమనుము. రేపటిదినమందే ప్రాకార

సహితమైన లంకాపట్టణమును రాక్షససేనను ధ్వంసము గావింప బడినదిగా చూచెదవు. నా బాణములకు రాక్షస బలమాహుతి యిగును. మహాఘోరమైన క్రోధమును ఆ సమయంలో విడిచి పెడతాను. అని చెప్పి కమలలోచనుడైన రాముదూర కొనెను. ఇంకను శుకుడు చెప్పెను. ఓ రావణా! ప్రస్తుతం శ్రీరాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, విభీషణుడు ఒకేస్థానంలో కూర్చొని యున్నారు. వీరలు నలుగురు చాలు లంకానగరాన్ని సమూలంగా నాశనంచేయుటకు వీరిలో కూడ రాముడొక్కడు చాలు సమస్త లంకాపట్టణమును నాశ నము చేయుటకు మిగతా వానరులు వాళ్లబలం ఇంతితయని చెప్ప లేము. చూడు అన్ని దిశలందు వ్యాపించి వానరసైన్యము ఉన్నారు. వాళ్ల సంఖ్యను లెక్కపెట్ట లేము. పర్వతసమానులైన వానరులు గర్జించు చున్నారు. చూడు. లెక్కపెట్టుటకు వీలులేనంత మంది యున్నారు. ముఖ్యులైనవారిని చెప్పుచున్నాను. వినుము. నీకెదురుగా ఉన్నవాడు నీలుడు. వానరరాజు సుగ్రీవునికి సేనాధిపతి. లక్షమంది యోధులు వీనిక్రింద యున్నారు. ఆ ప్రక్క ఉన్నవాడు అంగదుడు యువరాజు. పర్వతాకారుడు ఎర్రని పద్మవర్ణం కలవాడు. వాలి పుత్రుడు. మహా బలవంతుడు. ఆ ప్రక్కవాడు హనుమంతుడు సీతమ్మను చూచి నీ కొడుకు అక్షుని చంపినవాడు. వీడు రంభుడు క్షణక్షణంకి సుగ్రీవుని దగ్గఱకు వచ్చుచు వెళ్లుచున్నాడు. సింహబలం కలవాడు. వీడొక్కడు చాలును లంకను నాశనం చేయుటకు. వాడు శరభుడు కోటి సేనాధిపతులకు నాయకుడు. వాడు పనసుడు, మైందుడు, ద్వివిదుడు సేతునిర్మాణము చేసిన నలుడు విశ్వకర్మ కుమారుడు. వానరులను వర్ణించుటగాని లెక్కించుటకుగాని ఎవ్వడు సమర్థుడు లేడు. అందరు ఎవనికి వాడే మహాబలులు లంకను నాశము చేయగల సమర్థులు సుగ్రీవుని సచివుల సంఖ్య వెయ్యికోట్ల మంది వేలసంఖ్యలో శంఖములు, శతములాది అర్బుదములు. మిగతా

వారి వివరములు నాకు తెలియవు. రాముడు మానవుడు కాడు. సాక్షాదాది నారాయణుడే. సీత సాక్షాత్ చిచ్ఛక్తి స్వరూపిణి యగు జగన్మాత. సీతారాము లిరువురు జంగమ స్థావరరూపక మైన జగత్తుకు తల్లిదండ్రులు. ఆలోచిస్తే వారలకు శత్రువు ఎవడు లేడు. నీవు తెలియక తీసికొని వచ్చిన తల్లి సీతమ్మ జగన్మాత. సంసారము క్షణికము. శరీరము నిమిషభంగురము. పంచభూతాత్మక మైనది. ఇరువదినాలుగు తత్వ్వములు కలది. మలం, మాంసం, రక్తం, ఎము కలు దుర్గంధములతో కూడినది. ఇది అహంకారానికి ఇల్లు. జడ రూపమైనది. దీనియందు నీవు స్థిరత్వముకల ఆవాసము చేయలేవు. ఇది అస్థిరము నశించేది. ఇటువంటి నశ్వరమైన శరీరము గూర్చి నీవు బ్రహ్మహత్యాది మహా పాపములను చేసినావు. భోగము శరీరమే. అనుభవించేది శరీరమే. అటువంటి దేహము భూమిమీదనే పడిపోతుంది. జీవునిచేత పూర్వజన్మల యందు చేయబడిన పుణ్య పాపములే తిరిగి వస్తాయి. దేహసంబంధ మైనవి అగుటవలన అవి నిత్యము జీవునికి సుఖదుఃఖములు కలిగిస్తాయి. ఎంతవరకు అజ్ఞానమువలన కలిగిన దేహాభిమానము, నేను కర్తను, నేను భోక్తను అను అహంకారముతో జీవిస్తాడో అంతవఱకు వానికి బద్ధుడై జన్మమృత్యువులకు కారకుడగు చున్నాడు. అందువలన హే రావణా ! నీవు దేహాభిమానము వదిలిపెట్టుము. ఆత్మ నిర్మలమైనది. పవిత్రమైనది. విజ్ఞానమయ మైనది. అవికారి మఱియు చలనము లేనిది. అజ్ఞానమువలన బంధకారకమగు మోహములో జీవుడు పడిపోవు చున్నాడు. నీవందువలన శుద్ధుడైన ఆత్మను జ్ఞానముతో స్మరింపుము. భార్యాపుత్ర ధనాదులయందు విముఖుడవు కమ్ము. ఎందుకంటే పందులకు, కుక్కలకు కూడ పుట్టి నరకములందు పడి పోకుండా కాపాడుకొనుము. యుక్తాయుక్త వివేకము కలిగి, మనుష్య శరీరమును పొంది, బ్రాహ్మణ జన్మను పొంది, అందును భారత వర్షమందు జన్మపొంది కర్మభూమి యందు అతికష్టముమీద గాని

ప్రాప్తించని స్థితిని పొందినావు. ఇటువంటి పరిస్థితిలో విద్వాంసుడైన మానవుడు దేహాభిమానియై ఏ విధంగా భోగములను అనుభవిస్తాడు. మఱియు బ్రాహ్మణుడవై పుట్టినావు. పులస్త్యుని కుమారుడవై పుట్టినావు. వ్యర్థంగా ఒక అవివేకివలె భోగములను ఎందుకు కాంక్షిస్తావు ? ఇకముందు సర్వసంగ పరిత్యాగివై పరమాత్మయైన రాముని ఆశ్రయించి సీతను భక్తిభావంతో అర్పించి, రామ పాదములను సేవించుము. సర్వపాపముల నుండి విముక్తుడవై విష్ణులోకమునకు చనెదవు. లేకపోతే తిరిగి నీచాతినీచమైన అధోలోకములకు వెళ్లెదవు. పునరావృత్తి రహితమైన శాశ్వత బ్రహ్మలోకములో నుండుటకు నీకు మార్గమును విశదపరిచితిని. నీవు దీనిని అంగీకరించుము. నేను హితకరమైన వాక్యములను పలికితిని. సత్ సహవాసము చేయుము. హరిని సేవించుము. ఇంద్రనీల కాంతి సమానమైన శరీరకాంతి గలవాడు సీతాసమేతుడు చేత ధరింపబడిన చాపబాణములు కలవాడు సుగ్రీవుడు, లక్ష్మణుడు, విభీషణుడు సేవించిన పాదపద్మములు కలవాడు అగు రఘురాముని భజించుము.

ఇట్లు యుద్ధకాండ యందు చతుర్థ సర్గ సమాప్తము.

---

పంచమ సర్గము

## శంకరుడు భవానితో పలికెను

అంత రావణుడు శుకుని హితోపదేశములను విని మహా కోపమును పొంది ఎర్రని నేత్రములు కలవాడై మండిపడి పోవుచు శుకునితో పలికెను. ఓరీ దుర్బుద్ధీ శుకా! నీవు నావలన జీవించుచు ఒక గురువువలె నాకు హితోపదేశము చేయుచున్నావు. మూడు లోకములను శాసించే నాకు హితోపదేశం శావించుటకు నీకు సిగ్గు కలుగలేదా? ఇప్పుడే నిన్ను చంపివేస్తాను. కాని నీవు చేసిన పూర్వ కృత్యములను స్మరించి నిన్ను రక్షించుచున్నాను. నీవు వధార్హుడవు. ఇచ్చటనుండి వెంటనే వెళ్లిపొమ్ము. నిన్ను నేను విడిచివేయుచున్నాను. నీ మాటలు నేను వినలేను. మహాప్రసాద మంటూ శుకుడు తన ఇంటికి వెళ్లిపోయెను. శరీరమునందు కంపము పుట్టినది శుకునకు భయభయంగా ఇంటికి వెడలెను.

శుకుడుకూడా పూర్వజన్మలో బ్రహిష్ఠుడు బ్రహ్మవిత్తముడైన బ్రాహ్మణుడు. వానప్రస్థాశ్రమములో వేదోక్తములైన స్వకర్మలను చేయుచు, దేవతల వృద్ధికొఱకు రాక్షస వినాశమునకు అవిచ్ఛిన్నమైన యజ్ఞసంతతిని చేసెను. దేవహితుడైనందు వలన రాక్షసులకు శుకుడు శత్రువాయెను. వజ్రదంష్ట్రుడనే రాక్షసుడు శుకునికి అపకారము చేయుటకు తగిన అవకాశమునకు వేచియుండెను. ఒకరోజున అగస్త్య మహాముని శుకుని యాశ్రమమునకు వచ్చిరి. శుకుడు అగస్త్యునికి పూజనలిపి భోజనమునకు అగస్త్యుని ప్రార్థించెను. అటులనే అని అగస్త్యుడు స్నానమునకు నదికి వెళ్లెను. ఆ సమయంలో వజ్రదంష్ట్రుడు అగస్త్య రూపమును ధరించి శుకునితో భోజనముపెట్టు

దలచుకొంటే మాంసముతో కూడిన భోజనమును పెట్టవలెను అని చెప్పెను. మఱియు "చాలాకాల మయినది. మేకమాంసంతో భోజనం చేసి" అనెను. శునుడు తమ ఆజ్ఞ అని అంగీకరించెను. మాంసభోజన మును తయారు కావించెను. అగస్త్యుడు భోజనమున కాసీనుడగు నరిగి ఆ రాక్షసుడు శుకుని భార్యను మూర్ఛితురాలుగా చేసి తానా రూపమును ధరించి నరమాంసముతో భోజనమును వడ్డించెను. వెంటనే రాక్షసుడచ్చట నుండి అంతర్ధాన మాయెను. అగస్త్యుని కోపమునకు అంతులేదు. అమేధ్యమగు నరమాంసమును తినరాని దానిని దుర్మతీ నీవు నాకు ఇచ్చితివి. నీవు రాక్షసుడవయి పోయి నరమాంసమును తింటూ ఉండుము. అని శపించెను. శుకడు భయపడి స్వామీ! ఇప్పుడే మీరు మాంసభోజనము కావాలని అనతిచ్చారు. నేను అటులనే అని తమ ఆజ్ఞను పాలించితిని. ఇప్పుడు నాకు శాపమెందుల కిచ్చెదరు. అని యూరకుండెను. అంత అగస్త్యుడు ధ్యానములో కొంచెము ఆలోచించి ఇది యంత రాక్షస కృతమని ఎరిగి శుకునితో ననెను. నీకు అపకారము తలపెట్టిన రాక్షసుడీ విధంగా చేసినాడు. నేను ఆలోచించకుండా నీకు శాప మిచ్చితిని. నా వాక్కు వ్యర్థము కాదు. నా శాపము నీకు తప్పదు. రాక్షస శరీరమును ధరించి రావణుని ఇంట్లో ఉండుము. రావణసంహార నిమిత్తము రాముడు లంకాసమీపమునకు వస్తాడు. నిన్ను రావణుడు చారరూపంలో వెళ్ళమని పంపెదడు. రఘురాముని చూచి నీవు శాపమునుండి విముక్తుడవు కాగలవు. రావణునకు జ్ఞానోపదేశం చేస్తావు. అనంతరము పరమపదమును పొందగలవని అగస్త్యుడు పలికి వెళ్ళిపోయెను. అగస్త్య శాపము వలన శుకుడు రాక్షసరూపమును ధరించెను. చారరూపంతో రాముని చూచిన శుకుడు శాపవిముక్తుడయి రావణునకు తత్త్వబోధచెసిన వెంటనే వానప్రస్థులతో తన విధులను తాను నిర్వర్తించు చుండెను.

తావణుడుశుకుని తరిమివేసి వానరసేన వైపు చూచుచుండెను. ఆ సమయములో మాతామహుడు వృద్ధుడు మాల్యవంతుడను రాక్షసుడువచ్చి రావణునితో సంభాషించెను. హే రాజా! నేను చెప్పినది వినుము. నీకిష్టమైతే ఆ విధంగా ఆచరింతుము లేనిచో మానివేయుము. ఏ దినమున, నీవు జానకిని తీసికొని వచ్చితివో ఆ దినమునుండి ఏవో దుర్నిమిత్తములు లంకలో జరుగుచున్నవి. మహాభయంకర మేఘములు రక్తవర్షమును లంకలో కురుపించుచున్నవి. వేడి రక్తధారలు కురియుచున్నవి. దేవాలయములలోని దేవతలు ఏడ్చుచున్నవి. కదలిపోవుచున్నవి. శోకించుచున్నవి. కాళికాదేవి రాక్షసుల సమీపములో తెల్లని దంతములతో నవ్వుచున్నది. ఆవులు, గాడిదలను కనుచున్నవి. ఎలుకలు ముంగిసలతోను, పిల్లులతోను యుద్ధము చేయుచున్నవి. పాములు గరుడములతో పోరాడుచున్నవి. కాలపురుషుడు నలుపు, తెలుపురంగు కలవాడయి భయంకర కరాళవదనుడై గుండుతో ప్రతి రాక్షస గృహములో వికటాట్టహాసము చేయుచున్నాడు. ఈ విధంగా ఇంకెన్నియో దుర్నిమిత్తములు పొడసూపుచున్నవి. అందువలన రాక్షస కులసంరక్షణకు శాంతిని చేయుము. కొంత ధనముతో కూడ సీతను రామునికి వెంటనే ఇచ్చివేయుము. రాముని నారాయణునిగా తెలిసికొమ్ము. విద్వేషమును విడిచిపెట్టుము. రాముని పాదపద్మములను పట్టుకొని జ్ఞానులు సంసార సముద్రమును దాటుచున్నారు. రాముని భక్తిభావముతో భజించు. సర్వాంతర్యామి రాముడు మానవుడు కాడు. దురాచారుడ వైనను భక్తిచేత పవిత్రుడగుదువు. కులముయొక్క క్షేమంకోఱకు నా వాక్యమును వినుము. మాల్యవంతుని మాటలు దశగ్రీవునికి రుచించలేదు. దుష్టాత్ముడు కాలమునకు వశుడైనాడు. "తుచ్ఛమనుష్యుడు రాముడు కోతులతో పొత్తుపెట్టుకొని మునుల కిష్టుడయి తండ్రి లేనివాడయి యున్న రాముని సమర్థుడని ఏ విధంగా యోచించుచున్నావు. నీవు రాముడుచేత పంపబడి యుంటివి. నీవు

బంధువువు. వృద్ధుడవు. ఏదో నీవు చెప్పింది విని సహించి ఊరు కున్నాను. నీ వాక్యములు నా కర్ణగంధ్రములను దహించు చున్నవి. అని పలికి రావణుడు సమస్త మంత్రిబృందముతో వెడలి పోయెను. మేడమీది భాగమునెక్కి రావణుడు కోతులను చూచి రాక్షసుల నందరిని యుద్ధమునకు సన్నద్ధులుకమ్మని అనతించెను. రాముడు లక్ష్మణునిచేత ఇవ్వబడిన ధనుస్సును ఎక్కుపెట్టి మహా కోపంతో దశానుని చూచి కిరీటములు ధరించినవాడు మంత్రిసహితు డగు రావణుని ఉద్దేశించి అర్ధచంద్రాకార బాణముతో రావణునియొక్క వేలాది శ్వేతచ్ఛత్రములను దశకిరీటములను అరనిమిషంలో దునిమెను. అదియొక అద్భుతములా జరిగెను. రావణుడు లజ్జతో అంతఃపురములోనికి వెళ్లిపోయెను. దుర్మార్గుడైన రావణుడు ప్రహ స్తుడుమున్నగు రాక్షసుల నందరిని, మంత్రుల నందరిని పిలపించి వానరులతో యుద్ధము చేయవలసినదిగా ఆజ్ఞాపించెను. అంతట రాక్షసులు, భేరీనాదములతోను మృదంగ, పణవములతోను, బాజాలు వాయించుచు, దున్నపోతులు, ఒంటెలు, గాడిదలు, సింహములు, పెద్దపులులపై ఎక్కి ఖడ్గములు, శూలములు, పాశములు, వెదురు కర్రలు, తోమరములు శక్తి అదిగాకల అస్త్రశస్త్రములతో లంకనుండి ప్రతి ద్వారప్రదేశములకు చేరిరి. అంతకుముందే రామునిచేత చెప్ప బడిన వానరులందరు పర్వతశిఖరములను, వృక్షములను పెద్దపెద్ద బండరాళ్లను పట్టుకొని యుద్ధమునకు సిద్ధపడిరి. లంకమీద తల పడిరి. వేలు, లక్షలు, కోట్లు అద్భుతసంఖ్యగల వానరులు పట్టణం లోని నాలుగుప్రక్కల చుట్టుముట్టిరి. అరుపులు చేయుచు, గర్జించుచు గెంతుచు రాముడు మహాబలము కలవాడు జయమును పొందును. లక్ష్మణుడు అద్భుత విక్రముడు జయిస్తాడు. రామునిచేత అనుగ్ర హింపబడిన సుగ్రీవుడు జయిస్తాడు. అని జయజయమని నినాదములు చేయుచు వానరులందరు రాక్షసులతో సమంగా పోరాటం సాగించు చుండిరి. హనుమంతుడు, అంగదుడు, కుముదుడు, నీలుడు, నలుడు,

శరభుడు, మైందుడు, ద్వివిదుడు, జాంబవంతుడు, దధివక్త్రుడు, కేసరి, తారుడు ఇతరులైన వానర వీరులందరు లంకా ద్వారములను పెరికి లంకను యావత్తు చుట్టుముట్టిరి. వృక్షములతోను, పర్వత శిఖరములతోను, నఖములతోను, దంతములతోను రాక్షసుల నందరిని సంహారించు చుండిరి. భయంకరులైన రాక్షసులు కూడ ఖడ్గములు, శూలములు భయంకరములైన భిండివాలములతోను, పరశువులతోను వానరులపై యుద్ధమును ఘోరాతిఘోరంగా పోరాడిరి. అస్త్రశస్త్రము లతో కూడ పోరాడిరి. రాక్షసుల నందరిని వానరవీరులు సంహ రించిరి. రక్తమాంసములు వరదలై రణభూమిలో ప్రవహించినవి. రాక్షసులు రథములపయిని, సింహముల పైని, ఏనుగుల పైని ఎక్కి అనేక మారణాయుధములతో వానరులపైకి తలబడి పరస్పర యుద్ధము తాము జయిస్తాము అని ఉభయులు శబ్దములు చేయుచు ఒకరిపై నొకరు పట్టుదలతో విజృంభించి రణభూమిని రక్తప్రవాహ ములతో నింపిరి. విష్ణువైన రామునిచేత చూడబడిన వానరులు దేవాంశ సంభూతులు కూడా అయినందున ఆనందితులై బలవంతులై పోరాడుచుండిరి. రాక్షసులు నిర్బలులై లక్ష్మీకళలు లేనివారయి వానరులచేత హతమార్చ బడిరి. రాక్షసబలము చంపబడి మెల్ల మెల్లగా నాలుగవ వంతుకు తగ్గినది. దుష్టబుద్ధియై మేఘనాథు తన సైన్యము నశించుట చూచి బ్రహ్మగారి చేత ఇవ్వబడిన వరము వలన అంతర్ధాన మాయెను. అంతరిక్షము నుండి సర్వ అస్త్రశస్త్ర కుశలుడు సర్వాస్త్రములను నేర్చినవాడు అగు ఇంద్రజిత్తు వానర సైన్యమును చిందరవందర చేయుచు శస్త్రవర్షమును కురిపించెను. మహాద్భుతమైన ప్రదర్శన చేయుచు శరములను వర్షించెను. వానర బలమంతయు భూమిపై పడెను. రాముడు బ్రహ్మాస్త్రమునకు కొంచెము గౌరవించి లక్ష్మణుని పిలిచి బాణము తెమ్ము. బ్రహ్మాస్త్ర ముతో రాక్షసుని భస్మం చేసేదనని అనెను. అంత ఇంద్రజిత్తు రాముని మాటవిని కిమ్మనకుండా మాయచేత లంకా నగరమునకు

చనెను. మహామాయావి ఇంద్రజిత్తు. వానరసేన పడిపోవుటను చూచి రాముడు కడుదుఃఖించి ఆంజనేయునితో ఇట్లనెను. ఆంజనేయా! నీవు పాలసముద్రమునకు పోయి ఓషధులకు నిలయమగు ద్రోణ పర్వతమును తీసికొని వెంటనే రావలెను. ఈ మహాపరాక్రమ వంతులైన వానరులను జీవింపచేయ వలెననెను. నీకు శాశ్వతమైన కీర్తి ఉండిపోవు ననెను. రామాజ్ఞ అని ఆంజనేయుడు వాయువేగంతో ద్రోణపర్వతమును తీసికొని వచ్చి ఓషధుల మహిమచే వానరులను బ్రతికించి తిరిగి పర్వతమును యథాస్థానములో నుంచి వచ్చెను. ఆ వెంటనే వానర సైన్యమంతయు భయంకర శబ్దమునుచేసి యుద్ధ సన్నద్ధులయిరి. రావణుడా శబ్దమును విని తన సేనానాయకులను తన శత్రువు అయిన రాముని చంపుటకు వెళ్లవలెనని ఆజ్ఞాపించెను. మంత్రులు బాంధవులు నా కిష్టము నలుపుబంధువులు శూరులు అందరు కూడ యుద్ధమునకు తరలివెళ్లండని శాసించెను. ప్రాణభయముతో ఎవరైనా యుద్ధమునకు వెళ్లనిచ్చగించరో వారినందరిని తాను చంపెదనని బెదరించెను. ఆ మాటలను విని రణకోవిదులైన రాక్షసులు బయలుదేరిరి. అతికాయుడు, ప్రహస్తుడు, మహానాధుడు, మహో దరుడ నికుంభుడు, దేవాంతకుడు, నరాంతకుడు తక్కిన బలముకల వారందరు యుద్ధమునకు బయలుదేరిరి. ఇతరులైన వేలాది రాక్ష సులు బలదర్పితులై వానరసైన్యముపై యుద్ధమును చేయుచుండిరి. భిందివాలములను భుశ్యండిలను, బాణములను ఖడ్గములను, పరశు లను మఱియు ఇతరములైన మారణాయుధములతో వానర సైన్య మును ఎదుర్కొనిరి. వానరులు చెట్లతో పర్వత శిఖరములతో గోళ్లతో, కోరలతో, పిడికిళ్లతోను సమస్తరాక్షససైన్యమును చంపివేసిరి. కొంతమంది రాముని చేతిలోను కొంతమంది సుగ్రీవుని వలనను హనుమంతునిచేత, లక్ష్మణునిచేతను, అంగదునిచేతను చంపబడిరి.

ఈ విధముగా సమస్త రాక్షస యూథములను అంతమొందించిరి. రాముని తేజస్సుచేత వానరులందరు మఱికొంత బలమును కలిగి యుండిరి. రామశక్తిలేని వారలకు బలమెట్లు కలుగును. రాముడు సర్వేశ్వరుడు, సర్వమయుడు, విధాత చిదానందమయుడు, మాయా మానుషవేషమును ధరించి యుద్ధము మున్నగు లీలతో మాయను కనపరుచు చున్నాడు.

ఇట్లు యుద్ధకాండలోని పంచమ సర్గ సమాప్తము.

## షష్ఠ సర్గము

# శంకరుడు భవానితో పలికెను

అతికాయుడు మున్నగు రాక్షసులు నిహతులైనట్లు రావణుడు విని కడుంగడు దుఃఖితుడై ఇంద్రజిత్తును లంకా సంరక్షణకొఱకు నియమించి, తాను స్వయంగా రామునితో యుద్ధము చేయుటకు బయలుదేరెను. సమస్త శస్త్రాస్త్రములను పెట్టుకొని ఒక దివ్యరథము నెక్కి రాముడున్న స్థలమునకు వెళ్లెను. రామునిపైకి పరుగుఁడి పాములవంటి బాణములతో ఎందరినో వానరులను చంపివేసి సుగ్రీవాది వీరులను భూమిపై పడవేసెను. గదను ధరించి విశాలపరాక్రమంతో విరాజిల్లుచున్న విభీషణుని జూచి మయునిచేత ఇవ్వబడిన మహాశక్తిని విభీషణునిపై విడిలెను. లక్ష్మణుడు విభీషణునిపై ప్రయోగింపబడిన శక్తిని చూచి విభీషణుడు రక్షితవ్యుడని రాముడభయము నిచ్చినందున విభీషణుని ముందుకు తాను వెళ్లి ఆ శక్తికి ఎదురు నిలపడెను ఒక కొండవలె నిలపడెను. ఆ శక్తి అమితబలంతో లక్ష్మణ శరీరములోనికి ప్రవేశించినది. సమస్త శక్తులకు ఆధారభూతమైన మాయాశక్తికి ఆధారభూతుడైన లక్ష్మణునకా శక్తి ఏమి చేయగలదు. అయినను లక్ష్మణుడు మానుషవేషమును ధరించినందున భూమిమీద మూర్ఛితుడై పడిపోయెను. సాక్షాత్ ఆదిశేషుడు అవతారమే లక్ష్మణుడు భూమిమీద పడిపోయిన లక్ష్మణుని తీసికొని పోవుటకు రావణుడు చేతులతో ప్రయత్నించెను. కాని ఎత్తలేక పోయెను. ఒక చిన్న రాక్షసుడు భూభారము నంతను మోయుచున్న ఆదిశేషును ఎట్లు కదల్చ గలడు. లక్ష్మణుని అపహరించి పట్టుకొని పోవుటకు ప్రయత్నించు చున్న రావణుని జూచి హనుమంతుడు వజ్రాయుధముతో సమాన

మైన పిడికిలితో గుండెమీద కొట్టెను. ఆ దెబ్బతో రావణుడు మునుకులతో భూమిమీద పడెను. ముఖముమీద, కండ్లనిండా చెవ్వుల లోను, రక్తమును కక్కుచు కళ్లు కనపడక రథమెక్కెను. రావణునిచేత కొట్టబడిన లక్ష్మణుని హనుమంతుడు రెండు బాహువులతో పట్టుకొని రాముని సమీపమునకు తీసికొని వచ్చెను. హనుమంతుడు మిత్రుడగుట వలన హనుమంతుని భక్తిభావమువలన పరమేశ్వరుడైన లక్ష్మణుడు చాలా తేలిక అయెను. ఆ శక్తి కూడా లక్ష్మణుడు నారాయణాంశ సంభూతుడగుట వలన లక్ష్మణుని శరీరమునుండి వెడలి రావణుని రథములోనికి ప్రవేశించినది. రావణుడు మెల్లమెల్లగా తెలివితెచ్చుకొని ధనుస్సును స్వీకరించి రామచంద్రునివైపు పరుగులిడెను. హనుమంతుని భుజస్కంధముల నెక్కి రాముడు రథముపై ఉన్న రావణుని ఎదుర్కొనెను. వజ్రమును కూడా పిండిచేయగల ధనుష్టంకారముచేసి గంభీరమైన వాక్కుతో రావణునితో పలికెను. హే రాక్షసాధమ! నాయెదుట నిలబడు. ఎచ్చటకు వెళ్లగలవు సర్వత్ర సమదృష్టికల నాకు అపరాధముచేసి ఏ బాణముచేత ఖరదూషణాది రాక్షసులు జనస్థానములో హతులు గావింపబడినారో దానిచేతనే నిన్ను చంపివేసెదను. నా ఎదుట నిలపడుము. అని పలికెను. రావణుడీ మాటలు విని రాముని వహించుచున్న హనుమంతుని తీక్ష్ణములైన బాణములతో కొట్టెను. బాణములు తగులుచున్న కొలది అంజనేయుని బలము అధికమగు చుండెను. పెద్ద సింహగర్జనమును హనుమచేసెను. హనుమంతుని శరీరముమీద దెబ్బలుచూచిన తరువాత రాముడు మహాక్రోధముతో కాలరుద్రుడువలె కోపమును వహించి రావణుని రథముయొక్క గుర్రములను, జెండాను, సారధిని శస్త్రసంపత్తిని ధనుస్సును, ఛత్రమును భగ్నము చేసెను. తరువాత మఱియొక తీక్ష్ణ బాణముతో వజ్రాయుధముతో సమానమైన దానితో ఇంద్రుడు పర్వత

మును కొట్టినట్లు రావణుని కొట్టెను. దానితో రావణుడు చలించి పోయి మూర్ఛపోయెను. రావణుని చేతినుండి ధనుస్సుజారి పోయెను. రాముడు అర్ధచంద్రాకార బాణముతో సూర్యునివలె మెరుస్తున్న రావణుని కిరీటమును కొట్టివేసి హే రావణ ! నీకు బాగా దెబ్బలు తగిలినవి. నీకు ఆజ్ఞ యిచ్చుచున్నాను. ఈ దినానికి ఇంటికి పొమ్ము. విశ్రాంతి తీసికొమ్ము. రేపు తిరిగి నా బలమును రుచి చూడగల వనెను. రామబాణములచేత కొట్టబడి గర్వము పోయి సిగ్గుతో రావణుడు లంకలో ప్రవేశించెను.

రాముడు మూర్ఛపొందిన లక్ష్మణుని జూచి మానుష మంగీకరించి దుఃఖించెను. హనుమంతుని జూచి వత్స ! లక్ష్మణుని బ్రతికింపుము. పూర్వము ఒంసరులకు వలె మహౌషధులను తీసికొని వచ్చి లక్ష్మణుని బ్రతికించమనెను. అతులనే హనుమ ! వాయు వేగంతో సముద్రమును దాటి ద్రోణపర్వతమును తెచ్చుటకు బయిలుదేరెను.

చారులవలన రావణాసురు డీ వృత్తాంతమును విని, చింతతో ఏకాకియై రాత్రియందు కాలనేమి యింటికి వెళ్లెను. ఇంటికి వచ్చిన రావణుని జూచి కాలనేమి ఆశ్చర్యపడి ఎందుకు వచ్చితివి. రాజేంద్ర ! నీవు వచ్చుటకు కారణమేమని అడిగెను. అంత రావణుడు తనకు కష్టకాలము దాపరించిన దనియు తాను శక్తి ప్రహారముచేత లక్ష్మణుని మూర్ఛిల్లజేసితి ననియు, భూమిమీద పడిపోయినా డనియు, వానిని బ్రతికించుటకు ఓషధులను తెచ్చుటకు హనుమ వెళ్లె ననియు, వాని కార్యమునకు విఘ్నము కావించవలెనని కోరెను. నీ మాయచేత మునివేషము ధరించి హనుమంతుని మోహింపజేయుము. ఓషధి ప్రయోగకాలమును దాటించేలాగున ప్రయత్నము చేసి నీ యింటికి తిరిగి రావలెనని కోరెను.

రావణుని మాటలు వినిన కాలనేమి పలికెను. హే రావణ ప్రభూ ! నా వాక్కులను విని యదార్థమంటే గ్రహింపుము. నీకు నేను ప్రియము చేయగలను. ప్రాణములకు హానిలేకుండ చేయ గలను. కాని మారీచునికి అరణ్యంలో జరిగినట్లే నాకు అ గతి పట్టును. ఇందులో సందేహము లేదు. కొడుకులు, మనవలు చచ్చిపోయారు. బంధువులు, రాక్షసులు చచ్చిపోయారు. అసురకులమును ఈ విధంగా నాశనం చేసిన నీకు లాభమేమి ? జీవితంతో ప్రయోజనమేమి ? రాజ్యంతోగాని లేక సీతతోగాని ప్రయోజనమేమి ? ఈ జడమైన శరీరమువలన లాభమేమి చేకూరును. సీతను రామునికి అప్ప చెప్పుము. రాజ్యమును విభీషణున కిచ్చివేయుము. మునిసేవితమైన వనమునకు వెళ్లుము. తెల్లవారగానే స్నానముచేసి సంధ్యాదులు చేసి ఏకాంతమందు సుఖాసీనుడవై సర్వసంగ పరిత్యాగివై బాహ్య మైన భోగములను విడిచిపెట్టి అంతర్ముఖుడవు కమ్ము. ఆత్మను ప్రకృతికంటె భిన్నమైనదానిగా గ్రహించు. చరాచర జగత్తంతయు దేహబుద్ధ్యాది గోచరమని తెలిసికొమ్ము. స్తంభము మొదలు బ్రహ్మ పర్యంతము చూడబడినది, కనబడినది అంతా ప్రకృతియే. దీనిని మాయ అని అంటారు. సృష్టిస్థితి లయములకు సంసార వృక్షమున కిది కారణము. వినాశనమునకు దారితీసే సత్త్వరజస్తమోగుణ విరాజి తులగు మానవులను ఇది సృష్టి చేయుచున్నది. అదియే జీవులను స్వగుణములచేత కర్తృత్వ భోక్తృత్వములు లేని ఆత్మకు వానిని అంటుగట్టి వారు వానికి వశులయి వానియందు నిత్యము ఆడుకొను చున్నట్లు చేయుచున్నది. సద్గురూపదేశము ఎప్పుడు కలుగునో అప్పుడు బాహ్యవిషయముల నుండి నివృత్తి - దృష్టి అయి స్వచ్ఛమైన ఆత్మను చూడగలడు. జీవన్ముక్తుడయి దేహ ప్రకృతికి సంబంధించిన గుణముల నుండి విముక్తుడగు చున్నాడు.

ప్రకృతికంటె ఆత్మ భిన్నమైనదని తెలిసికొన్నచో ముక్తుడగు చున్నావు. ధ్యానము చేయుట కసమర్థు డయినచో గుణసహితు డైన దేవుని ఆశ్రయింపుము. (సగుణోపాసన) హృదయ పద్మము నందు మణిగణాదులతో విరాజిల్లు (స్వర్ణ పీఠమందు) చాలా మృదువైనదియు స్వచ్ఛమైన స్వర్ణసింహాసనమందు జానకీదేవితో కూడ స్థితుడైనట్టి, వీరాసనము గలవాడు, విశాలాక్షుడు మెరుపు తీగవంటి కాంతిగల బట్టలను ధరించినవాడు, కిరీటము, కేయూర ములు, కౌస్తుభము మున్నగువానితో కూడినవాడును, అందెలు, కంకణములతో భాసిల్లువాడును, వనమాలా విరాజితుడు లక్ష్మణుని చేత ఒకచేతి ధనుస్సువలన రక్షింపబడిన వాడు అందరి హృదయము లందున్నవాడు అగు రాముని హృదయ మందు ధ్యానించి అత్యంత భక్తిచేత సేవించినచో నీవు ముక్తుడ వయ్యెదవు. ఇక్కడ సంశయము లేదు. ఇతర చింతలు లేకుండ నిరంతరము రామభక్తుల నుండి రామచరితమును వినుము. ఈ విధంగా చేస్తే ఎంత పెద్ద పాపములు, పూర్వజన్మార్జితములు సంక్రమించి నప్పటికి నశించును. పరిపూర్ణుడు ఒక్కడైన వాడు అగు రాముని భజన సేయుము. వైరమును విడిచిపెట్టుము. ఆత్మప్రేమతో నామ రూపములు లేని పురాణ పురుషుని సేవింపుము. అని కాలనేమి హితోపదేశము చేసెను.

ఇట్లు యుద్ధకాండలోని షష్ఠ సర్గము సమాప్తము.

## ఏడవ సర్గము

## శంకరుడు పార్వతితో పలికెను

అమృతముతో సమానమైన కాలనేమి వాక్కులను విని రావణుడు కోపముతో మండిపోయెను. మండిన నేయిమీద నీళ్ళు పోసినట్లు చుంయిచుంయిమని రగిలెను. దుర్మార్గుడువైన నిన్ను చంపుతాను. ' నా శాసన ధిక్కారము చేసినావు. శత్రువుల నుండి లంచము తీసికొని నీవిట్లు పలుకుచుంటివని తలపోసెదను. నీవు రామ కింకరుడువలె పలుకుచుంటివి. అని రావణుడు పలుకగా కాలనేమి దేవ! క్రోధముతో పనియేమి నేను చెప్పినది నీ కిష్టపడకపోతే నేను వెళ్లి నీ పనిచేస్తాను. అని పలికి వెంటనే బయలుదేరి వెళ్లెను. హిమవత్ పర్వతప్రాంతమునకు జనిమాయచేత సుందర తపోవనమును నిర్మించెను. కపటు మునివేషమును ధరించి, కపటు శిష్యులతో ఆశ్రమంలో, హనునుంతుడు వెళ్లు మార్గములో ఉండెను. వాయువేగంతో వెళ్లుచున్న హనుమంతుడు ఆశ్రమమును చూచి మనస్సులో విచారించెను. పూర్వము నేను వెళ్లినప్పుడు ఈ ఆశ్రమ మిచ్చట లేదే. నేను దారి తప్పితినా లేక నా మతి భ్రమించినదా? మునీశ్వరుల ఆశ్రమములో విశ్రమించి దాహశాంతికి నీరుత్రాగి ఆ తరువాత ద్రోణపర్వతమునకు చనెదను అని పలికి యోజన దూరము వైశాల్యముగల ఆశ్రమములో ప్రవేశించెను. ఆశ్రమము అరటిచెట్లులు, శారవృక్షములు, ఖర్జూరపుచెట్లు, పనసచెట్లు వంగిన కొమ్మలు కొమ్మలనిండా పండ్లు కలిగియుంది. మఱియు సహజ ప్రకృతి వైరమును వీడి నిర్మలంగా స్వచ్ఛంగా సుందరముగా కవ పడినది. ఈ సుందర విశాల ఆశ్రమంలో కాలనేమి ఇంద్రజాల

విద్యచే శివపూజను చేయుచు కనపడెను. హనుమంతుడు మునిని దర్శించి నామగోత్రములతో తాను రామదూతను అంజనేయుడను రామకార్యము నొక పెద్దపానిని పురస్కరించుకొని క్షీరసముద్ర ప్రాంతమునకు వెళ్లవలసి వచ్చినది నాకు దాహము, బాధపెట్టు చున్నది. కడుపునిండా నీరు త్రాగెదను. నీరు ఎచ్చట నున్నది. తెలియజేయమని ప్రార్థించెను. ఆ ముని నా కమండలంలోని నీరును నీవు త్రాగవచ్చు. ఆ తరువాత ఈ పండిన పండ్లుదిని విశ్రమింస్తాను. తొందరక్కర్ర లేదు. నేను నా తపస్సుచేత భూత భవిష్య ద్వర మానములను ఎరిగి యున్నాను రామచంద్రునిచేత చూడబడి లక్ష్మణుడు లేచి కూర్చొన్నాడు అందరు వానరులు జీవించిరి. అని అనెను. అంత హనుమ కమండలంలోని నీటిచేత నాకు దాహము తీరదు. నాకేదైనా నీటి సరస్సును చూపవలసినదిగా ప్రార్థించెను. అంత కాలనేమి అటులనే అని తన మాయచేత విశాలమైన సరస్సును నిర్మించెను. అంజనేయునికి చూపించి ఇందులోని నీరును కళ్లు మూసికొని త్రాగవలెను. ఆ తరువాత నా సమీపమునకు రమ్మనెను. నీకొక మంత్రమును ఉపదేశిస్తాను. ఆ మంత్రమహిమ వలన ఓషధు లను దర్శించెదవు. అటులనే మునీశ్వరుల ఆజ్ఞ అంటూ సరస్సును చూపించు ఓ బ్రహ్మచారీ-అని అంజనేయు డనెను. అటులనే అంటు వటువు (కపట వటుడు) జలాశయమును చూపించెను. కళ్లుమూసి కొని అందలి జలములను అంజనేయుడు త్రాగసారం భించెను. ఇంతలో ఒక భీకరమైన ఆడ మొసలి వచ్చి అంజనేయుని మహా వేగంతో పట్టుకొనెను. తన్ను మొసలి మ్రింగుచున్నదని తెలిసికొని అంజనేయుడు మహా క్రోధంతో దానిని చీల్చెను. రెండు చేతులను దాని నోటిలోపెట్టి నిలువున జీల్చి వేసెను. మొసలి చచ్చి పోయినది. ఆ తరువాత ఆకాశంలో దివ్యరూపధారిణియైన ధాన్యమాలి అను ప్రశస్తనామము కల ఒక ఆడమనిషి ప్రత్యక్షమయి హనుమతో పలికెను. ఓ అంజనేయా! నీ అనుగ్రహమువలన నేను

శాపమునుండి విముక్తురాల నయితిని. నేను ముందు ఒక అప్సర స్త్రీని. ఒకానొక కారణమువలన పూర్వము ఒక మునీశ్వరుడు మొసలి కాగలవని శపించెను. నీవు చూసిన ఆశ్రమములోని వటువు కాలనేమి అను మహారాక్షసుడు. రావణుడు నీ కార్యమునకు విఘ్నములను చేకూర్చుటకు వీనిని పంపినాడు. వీడు మునివేషధరుడే కాని ముని కాడు. వీడు బ్రాహ్మణ హింసకుడు. వీనిని వెంటనే చంపివేయుము. ఉత్తమమైన ద్రోణపర్వతమునకు వెళ్లమని ధాన్యమాలి చెప్పెను. నేను నీ కరస్పర్శ వలన నా పాపముల నుండి విముక్తురాల నైతిని. శాపముకూడ వీడినది. నేను బ్రహ్మలోకమునకు వెళ్లుచున్నాను. అని పలికి ఆమె స్వర్గలోకమునకు వెళ్లెను. హనుమంతుడు ఆశ్రమములోనికి వెళ్లెను. కాలనేమి ఇంత ఆలస్యమెందులకు. నీకు మంత్రోపదేశము చేసెదను. స్వీకరించి నాకు గురుదక్షిణ ఇమ్ము అనెను. అంత హనుమంతుడు పిడికలిని గట్టిగా మూసి రాక్షసునితో పలికెను. ఇదిగో గురుదక్షిణ స్వీకరించండి. అంటూ ఆ పిడికిటతో ఒక్క పోటు పొడిచెను. ఆ పోటుతో ముని వేషమును విడిచిపెట్టి మాయారాక్షసుడైన కాలనేమి హనుమంతునితో యుద్ధము చేసెను. నానావిధములగు మాయలను ప్రదర్శించి హనుమంతునితో యుద్ధము చేసెను. శ్రీరాముడు మహా మాయికుడు అందరిని మోహింప జేయువాడు మఱియు మాయకు అధిపతి. అటువంటి శ్రీరాముని సంతతము జపించు హనుమ ముందు రాక్షస మాయలు ఏ విధంగా పనికి వచ్చును. హనుమంతుడు తన కఠినమైన పిడికిలితో కాలనేమి నెత్తిమీద గుద్దెను. కాలనేమి రక్తం కక్కుకుంటూ నెత్తిపగిలి చచ్చిపోయెను. ఆ తరువాత హనుమ వెంటనే పాలసముద్ర ప్రాంతమునకు వెళ్లి ద్రోణపర్వతమును చూచి అందు ఓషధులను కనుగొనలేక ద్రోణపర్వతమును సమూలంగా పీకివేసి చేతితో ధరించి వాయువేగంతో శ్రీరాముని సన్నిధికి చేరెను. హనుమ రాముని జూచి యీ ద్రోణ పర్వతమును

మహా మహిమాన మన్వితమైన దానిని తెచ్చితిని. ఏది యుక్తమో వెంటనే చేయండి. అలస్యము చేయవద్దు అనెను. రాముడు హనుమంతుని వాక్యములకు సంతసించి సుషేణుని ద్వారా సంజీవకరణి మున్నగు ఓషధులను తీయించి లక్ష్మణునకు చికిత్స గావించెను. అంత లక్ష్మణుడు నిద్రనుండి లేచినట్లు లేచి "హే రావణ ! నిలపడు నిలపడు ఎచ్చటకు పారిపోయెదవు ? ఇప్పుడే నిన్ను చంపివేస్తాను. అని పలుకుచున్న లక్ష్మణుని రాముడు తలయందు నిమిరి తలను వాసనచూచి హనుమను చూచి పలికెను. వత్స ! హనుమ ! నీ అనుగ్రహమువలన తమ్ముడు లక్ష్మణుడు స్వస్థదేహము ధరించెను. అని పలికి విభీషణ మంత్రాంగముతో వానరులందరితో సుగ్రీవునితో సహ సమస్త వానర బృందముతో, యుద్ధమునకు తరలివెళ్లెను. వానరులందరు చెట్లు, బండరాళ్లు పర్వత శిఖరములను అయుధములుగా ధరించి యుద్ధమునకు బయలుదేరిరి.

రావణుడు రామబాణములచే ఎక్కువగా దెబ్బ తినెను. సింహముచేత ఏనుగు గరుత్మంతునివలన నాగుపామువలె రాముని బాణములచే రావణుడు చితకకొట్టబడి సింహాసనమునందు కూర్చొని రాక్షసులతో ఇట్లు పలికెను. బ్రహ్మగారు పూర్వమందు మనుష్యుని వలన మృత్యువుకలుగునని నాకు చెప్పిరి. భూమియందలి ఏ ఒక్క మానవుడు కూడ నన్ను చంపుటకు సమర్థుడు కాడు. అందువలన సాక్షాత్ శ్రీమన్నారాయణుడే మనుష్య శరీరమును ధరించెను. ఇందులో సంశయము లేదు. రాముడు దశరథనందనునిగా జన్మించి నన్ను చంపుటకు వచ్చియున్నాడు. పూర్వకాలమందు అనరణ్యుడను వాడు శాపము నిచ్చెను. అనరణ్యుడు నన్ను జూచి "ఓ రాక్షసాధమా ! నా వంశమందు సనాతనుడైన పురుషోత్తముడు అవతారమెత్తి నిన్ను పుత్రపౌత్ర సమేతంగా చంపగలడు. సందేహము వలదు, అని చెప్పి స్వర్గమునకు వెళ్లిపోయెను. వాడే రాముడు

పురాణపురుషుడు. నాకోసం జన్మించివాడు. నన్ను చంపితీరుతాడు. కుంభకర్ణుడు మూర్ఖుడు. ఎల్లప్పుడు నిద్రలోనే ఉంటాడు. వానిని మహాపరాక్రమబలుఁని నిద్రనుండి లేపి నా సమీపమునకు తీసికొని రండని రాక్షసభటులకు ఆనతిచ్చెను. వెంటనే రాక్షసులలో మహాకాయులు కుంభకర్ణుని అనేక ప్రయత్నములలో నిద్రనుండి లేపి రావణసన్నిధికి తీసికొని వెళ్లిరి. కుంభకర్ణుడు రావణునకు నమస్కరించి ఆసనమందు కూర్చొనెను. వానితో రావణుడు అతిదీనమైన వాక్కుతో పలికెను. హే కుంభకర్ణ! నీవు నాకు చెప్పుము. నాకు మహాకష్టము సంభవించినది. నా కొడుకులు, పౌత్రులు, బంధువులు, శూరులందరు రామునివలన చంపబడిరి. నేనేమి చేయవలెను? నాకు మృత్యుకాలము సమీపించినది. దశరథకుమారుడైన రాముడు మహాబలవంతుడు అగు సుగ్రీవునితో కూడి సముద్రమును ససైన్యంగా దాటి మనమూలము నంతటిని ఛేదించు చున్నాడు. ముఖ్యతములైన వీరాధివీరులైన రాక్షసులందరు చచ్చిపోయిరి. కోతుల చేతిలో మరణించిరి. కాని యుద్ధమందు ఒక్క వానరుని నాశనమును నేను చూడలేదు. వీరినందరిని నీవు నశింప చేయుము. అందుకొఱకే నిన్ను నిద్రమండి లేపినాను. అన్నగారి కొఱకు ఈ కష్టతరమైన పనిని చేయుము".

ఈ విధమైన దీనవాక్యములను విని కుంభకర్ణుడు వికారంగా నవ్వి బిగ్గఱగా పలికెను. పూర్వమందే నేను మంత్రివిచార సమయమందు నీతో చెప్పితిని. హే రాజ! నీచేత చేయబడిన పాపకర్మల ఫలము నీకు ప్రాప్తించినది. నేను ఇదివరకే నీకు రాముడు సాక్షాత్ శ్రీమన్నారాయణుడని సీత సాక్షాదాది లక్ష్మియగు యోగమాయ అని చెప్పితిని. చెప్పినా నీకు బోధపడలేదు. నేనొకనాడు అర్ధరాత్రి యందు ఒక పెద్ద బండరాతి యందు ఆసీనుడనై యుంటిని. ఆ సమయమందు దివ్యదర్శనుడైన సాక్షాన్నారద మునిని చూచితిని.

నేను మునీశ్వరా! ఎచ్చటుకు చనుచుంటిరని అడిగితిని. అంత నారదుడు నేనింతవఱకు దేవతల యొక్క రహస్య మంతనములతో నుంటిని. అచ్చట జరిగిన సమాచారము నంతను నీకు చెప్పెదను. వినుమనెను. నీవు మీ అన్న రావణునిచేత పీడింపబడిన దేవత లందరు విష్ణువు నాశ్రయించిరి. దేవదేవుడైన విష్ణువుని భక్తితో స్తోత్రము చేసిరి. ఆ తరువాత వినమ్రులై లోకకంటకుడైన రావణా సురిని చంపమని వేడిరి. మఱియు మానుషునిచేత వానికి మరణమని బ్రహ్మగారు చెప్పిరి. అందుచేత నీవు మానుష వేషధారివై హింసాత్మకుడైన రావణుని చంపవలెనని ప్రార్థించిరి. విష్ణువటులనే అటూ సత్యసంకల్పుడైన ఈశ్వరుడు రఘుకులమందు రాముడుగా జన్మించి మిమ్ముల నందరిని హతమార్చునని పలికి నారదుడు వెళ్లి పోయెను. అందువలన రాముని సనాతనుడైన పరబ్రహ్మగా తెలిసి కొమ్ము. వైరమును విడిచిపెట్టుము. మాయామానుష విగ్రహుడు అగు రాముని భక్తితో భజించుము. భక్తిభావముతో భజన చేస్తే తప్పకుండా ప్రసన్నుడౌతాడు. భక్తి జ్ఞానమునకు తల్లి. భక్తి మోక్ష ప్రదాయిని. భక్తిహీనంగా చేయబడిన కర్మ అంతా ఫలితము నివ్వ జాలదు. అది క్రియ అనిపించుకోదు. శ్రీ మహావిష్ణువు యొక్క లీలావతారములు ఎన్నియో కలవు. అటువంటి వెయ్యి అవతారము లతో సమానమైనది రామావతారము. జ్ఞాన స్వరూపుడు మంగళ స్వరూపుడు రాముడు. ఏ మానవులు రాత్రి పగలు మనస్సుచేత వాక్కుచేత భగవంతుడగు రాముని భజనను చేసెదరో వారు అనా యాసంగా సంసారమును దాటి శ్రీహరియొక్క పరంధామమును చేరగలరు. నిర్మలమైన మనస్సు కలవారలు అగు మహానుభావులు ఈ భూమండలములో నిరంతరము రామునిని ధ్యానించెదరో లేక రాముని చరిత్రను చదివెదరో వారలే సంతులు, సంసార రూపమైన విషయ రూపమైన నాగుపాము పాశములనుండి విముక్తులయి అత్యంత సుఖ నికరములగు శ్రీరాముని సీతాపతి యొక్క చరణ కమలములను పొందెదరు.

ఇట్లు యుద్ధకాండ యందు సప్తమ సర్గ సమాప్తము.

అష్టమ సర్గము

# శంకరుడు భవానితో పలికెను

హే పార్వతి! కుంభకర్ణు డీ విధముగా పలికిన పలుకులను విని రావణుడు భ్రూకుటులు క్రోధముతో కదలిపోయినవి. మహా రోషమును పొంది కుంభకర్ణునితో పలికెను. తన ఆననము నుండి ఉరికి రావణుడు పలికెను. నీవేమి బుద్ధిమంతుడవని తీసికొని వచ్చితినను కొంటివా? నిన్ను ఈ సమయమందు జ్ఞానోపదేశము నకు నేను పిలువలేదు. నేను చెప్పినది నీ కిష్టమని తోచినచో యుద్ధము చేయుము. లేనిచో వెళ్లి హాయిగా నిద్రపొమ్ము. నిదర నిన్ను ప్రస్తుతం బాధించు చున్నదేమో వెళ్లి నిద్ర చేయమనెను.

కుంభకర్ణుడు రావణునకు కోపము కలిగినదని నిర్ణయించి వెంటనే యుద్ధమునకు బయలుదేరెను. పర్వతాకార సన్నిభుడై ప్రాకారమును దాటి సమస్త వానర సైన్యమును భయపెట్టుచు ఘోరమైన నాదమును చేసెను. సముద్రమును కూడ ఆ మహానాదము మహాశబ్దముతో కదల్చెను. మఱియు తన విశాలమైన బాహువులతో వానరులను భక్షించుచు నష్టమును కావించెను. యమున్ని చూచి సమస్త ప్రాణులు భయపడినట్లు వానరులు సపక్ష పర్వతము వలె నున్న కుంభకర్ణుని జూచి యుద్ధస్థలము నుండి పరుగులిడి పారి పోయిరి. ముద్గరమును ధరించుచు సమస్త వానరులను చూర్ణము చేయుచు, చేతులతో, కాళ్లతో మట్టి చంపివేయుచు, వికటకరాళ యుద్ధము చేయుచున్న కుంభకర్ణుని చూచి గదాపాణియైన విభీషణుడు నమస్కరించెను. జ్యేష్ఠభ్రాతయైన కుంభకర్ణుని

పాదాభివందనముచేసి నేను విభీషణుడను నీయొక్క ప్రియభ్రాతను మహామతే దయ జూపుము. నేను రావణునకు పదేపదే రాముడు సాక్షాన్నారాయణుడని బోధ చేసితిని. నా మాటను వినలేదు. మిదుమిక్కిలి కత్తితో నన్ను చంపుట కుపక్రమించెను. నన్ను తన పాదముతో తన్ని వెళ్లిపొమ్మని నిందించి పొమ్మనెను. నా నలుగిరి మంత్రులతో నేను రాముని శరణ పొందితిని. ఆ మాటలు విని కుంభకర్ణుడు తమ్ముడు విభీషణుడు రామునన్నిధికి వచ్చినట్లు తెలిసి కొని విభీషణుని ఆలింగనము చేసికొని "వత్స రామపాదాభిసేవివై నీవు వర్ధిల్లు. రాక్షస కులసంరక్షణ కొఱకు రాక్షసుల హితమునకు నీవు వర్ధిల్లు. నీవు మహాభాగ్యవంతుడ వైతివి. నేనంత పూర్వము నారదునివలన వింటిని. నీవు వెళ్లిపొమ్ము తమ్ముడా. నాకు ప్రస్తుతము తనవాడు ఇతరుడు అను బావము లేదు. అని మదముచేత మదించిన కండ్లతో పలికెను. అంత విభీషణుడు కుంభకర్ణుని పాదములకు నమస్కరించి రాముని ప్రక్కకు వచ్చి చింతలో నుండెను".

కుంభకర్ణుడు చేతులతోను, కాళ్లతోను వానరులను పీడించుచుండెను. మదమత్తమైన ఏనుగువలె వానర సైన్యములో వీర విహారము చేయుచుండెను. శ్రీరాముడు కుంభకర్ణుని వీరవిహారమును వానరుల ఏడుపులను వహించలేక కోపించి వాయవ్యమైన అస్త్రముతో కొట్టెను. ముద్గర సహితమైన కుంభకర్ణుడి కుడిచేయిని అది ఖండించెను. కుంభకర్ణుడు మహాభయంకరమైన ఘోషమును చేసెను. వాని కుడిచేయి భూమిమీద పడిపోయెను. దానిక్రింద పెక్కుమంది వానరులు నలిగిపోయిరి. అప్పుడు అచ్చట ఇచ్చట ఉన్న వానర సైన్యమంతా భయకంపితులై రామ కుంభకర్ణుల యుద్ధమును చూచుచుండిరి. కుంభకర్ణుడు కుడిచేయి పోగానే ఒక పెద్ద మద్దిచెట్టును తీసి రామునిపై విసరెను. ఎడమచేతిలో ఉన్న మద్దిచెట్టును ఎడమ చేతిని కూడ రాముడు ఇంద్రాస్త్రముతో దునిమెను. రెండు బాహు

వులు పోయినప్పటి రాక్షసుడు గర్జిస్తూ తనవైపు పరుగులిడి వచ్చు టను చూచి రాముడు తీక్ష్ణమైన రెండు అర్ధచంద్రాకార బాణములతో కుంభకర్ణుని రెండు పాదములను నరికెను. ఆ రెండు పాదములు పెద్ద శబ్దము చేయుచు లంకాద్వారము నందు పడినవి. కుంభకర్ణుకు చేతులు, కాళ్లు తెగినప్పటికి రాహువు చంద్రునిపైకి పరుగులిడునట్లు రామునివైపు నోటిని బాగా ఏనుగు ముఖములా చాచి రాముని ఎదుర్కొనెను. తీక్ష్ణములైన బాణములను వేసి రాముడా ముఖమును నిండా నింపెను. బాణములతో పూడ్చబడ్డ ముఖముతో భయంకర స్వరూపముతో కుంభకర్ణుడు భయంకరంగా అరచెను. రాముడు సూర్యతేజస్సుతో సమానమైన కాంతిగల ఇంద్రాస్త్రమును తీసి వానిని వధించుమని ప్రయోగించెను. అదియొక వజ్రసమానమైన కఠోరబాణము. ఇంద్రుని వజ్రాయుధము వృత్రాసుని శిరస్సును ఎట్లుభేదించినదో అటులనే కుంభకర్ణుని శిరస్సును ఛేదించినది. కుంభ కర్ణుని శిరస్సు పర్వతాకారము కలది. కుండలములతో ధగధగ మెరసిపోవు చున్నది. అప్పుడు కుంభకర్ణుని శిరస్సు లంకాద్వార ముపై పడెను. అతని శరీరము సముద్రములో పడిపోయినది. శిరస్సు వెళ్లి లంకాద్వారమును పూర్తిగా కప్పినది. దాని క్రింద పడి జలజంతువులు, మొసళ్లు మున్నగు జంతువులు చూర్ణములైనవి. అంతరిక్షమునుండి దేవతలు, ఋషులు, గంధర్వులు, పన్నగులు, గుహ్యకులు, యక్షులు మున్నగువారు సంతుష్టులై రఘురామునిపై పుష్పవర్షమును కురిపించిరి. రఘురాముని సహస్రశః స్తోత్రము చేసిరి. ఆ సమయములో తన కాంతితో పది దిక్కులను ప్రకాశింప జేయు దేవర్షి నారదుడు శ్రీరామ దర్శనమునకు వచ్చెను. శ్రీరాముని ఇందీవర శ్యాముని విశాల బాహువులు కలవానిని ధనుర్ధ మనిఇంచు కొంత ఎర్రని దీర్ఘములైన నేత్రములు కలవానిని చాచిన బాహువులు కలవానిని ఇంద్రాస్త్రమును ధరించి యున్న వానిని, దయచేత తడిసిన దృష్టి కలవానిని చూచెను. మఱియు

బాణములచేత పీడితులైన వానరులను చూచి నారదుడు గద్గదమైన వాక్కుచేతను, భక్తితోను, రాముని స్తోత్రముచేయ నారంభించెను.

దేవదేవ ! జగన్నాథ, పరమాత్మ, సనాతన, నారాయణ, అఖిలాధార, విశ్వసాక్షి నీకు నమస్కారము. నీవు శుద్ధమైన విజ్ఞాన స్వరూపుడవు. అయినను లోకములను మోహింప చేయుటకు, మాయచేత మనుష్య వేషమును ధరించి, సుఖదుఃఖములను కలిగిన వాడువలె మాయచేత కప్పబడినవాడవై సర్వుల హృదయము లందున్నావు. స్వభావముచేత నీవు స్వయం జ్యోతివి. నిర్మలమైన హృదయముగల వారలకే నీవు సాక్షాత్కరిస్తావు. హే రామ ! నీవు నేత్రములను విప్పి సమస్త లోకములను సృష్టించు చున్నావు. నీవు కళ్లుమూసి సృష్టిని లయము చేయుచున్నావు. ఎవ్వని యందు ఈ సమస్త చరాచర సృష్టి ప్రకాశించు చున్నదో, ఎవ్వనియందు ఈ సృష్టి పుట్టుచున్నదో, ఎవనికంటె అతిరిక్తంగా ఈ ప్రపంచములో వేరే వస్తువులేదో అ బ్రహ్మవు నీవే. నీకు నమస్కారము. మునిజనులు ఎవనిని ప్రకృతిపురుషుడు, కాలుడు, వ్యక్తము, అవ్యక్తములుగా తెలిసికొను చున్నారో అట్టి రామా ! నీకు నమస్కారము. శ్రుతులు నిన్ను వికార రహితుడవని, శుద్ధుడవని, జ్ఞాన స్వరూపుడవని వర్ణించినవి. అదే శ్రుతి నిన్ను సమస్త జగదాకారమూర్తివని వర్ణించినది. ఈ రెంటికి విరోధము కనపడు చున్నది. వేదవాదులకు వైదిక వచనములకు భేదము కనపడు చున్నది. నీవు మాయచేత విలాసగా క్రీడించు చున్నావు. అందుచేత వానిమధ్య ఇంచు కొంతయు విరోధము ఏర్పడజాలదు. కాని నీయొక్క దయలేనిదే విద్వాంసులు కూడ నిశ్చయ జ్ఞానమును పొందలేరు. ["ధాతుః ప్రసాదాన్మ హిమానమీశం"]. అందువలన ఈ సంపూర్ణ జగత్తంతా అజ్ఞానమువలన నీ యందారోపింప బడినది. వాస్తవ మాలోచిస్తే

నీ నిర్గుణ రూపము మనస్సుకు తెలియబడదు. మనస్సుచేత తెలియ బడజాలదు. భ్రమచేత సూర్యకిరణములు ఏ విధంగా జలసదృశంగా కనపడునో జగత్తు కూడా ఆ ప్రకారము నీ యందారోపింప బడినదియే. భ్రాంతి వలన కల్పింప బడినది. నీ నిర్గుణరూపము మనోగోచరము కాదు. హే దేవ ! నీ నిర్గుణరూపము దృశ్యమెట్లగును ? దృశ్యము కానప్పుడు ఎవడు దానిని ఏ విధంగా భజన చేస్తాడు ? వేయిలేదు. అందుచేత బుద్ధిమంతులు చతురులు అగు జ్ఞానులు నీ అవతార రూపములను ధ్యానించి సంసారసముద్రమును దాటుచున్నారు. ఈ భక్తిమార్గంలో కామక్రోధాదులు నిత్యము అడ్డు అగుచున్నవి. పిల్లి ఎలుకలను భయపెట్టునట్లు అవి అటులనే చిత్తమును భయముచేత భీతము చేయుచున్నవి. హే రామ ! నీ నామమును స్మరించు వారలకు, నీ రూపమును మనస్సులో ధ్యానించు వారలకు నీ పూజలో ఆసక్తులైన వారలకు నీ కథామృత పానము చేసినవారలకు నీ భక్తుల సాంగత్యము చేసినవారలకు సంసారము గోష్పదమగు చున్నది. అందువలన నీయొక్క సగుణమైన రూపమునే, నా హృదయ మందు ఎల్లప్పుడు ధ్యానించి, ముక్తుడనై లోకములందు త్రిలోకములందు సంచారముచేయ కలుగుచున్నాను. సర్వదేవతలు నిన్ను పూజిస్తారు. హే రామ ! దేవహితము కోరి నీవు మహత్కార్యమును చేసినావు. ఇప్పుడు నీచేత కావింపబడిన కుంభకర్ణ వధవలన భూభారము గతించినది. హే ప్రభో ! రేపు లక్ష్మణుడు ఇంద్రజిత్తును సంహరిస్తాడు. ఎల్లుండి నీవు రావణుని సంహరించెదవు. నేను అంతరిక్షమందు సిద్ధులతో కూడి సర్వమును చూచెదను. నన్ను గ్రహించు దేవ ! నేను స్వర్గమునకు వెళ్లెదను. నారదు డీ విధముగా పలికి పాపరహితమైన బ్రహ్మలోకమునకు దేవతలచేత పూజింపబడి వెళ్లిపోయెను.

అద్భుత సాహస క్రియలను చేయుచున్న రాముని చేతిలో

కుంభకర్ణుడు చచ్చిపోయెనని విని రావణుడు దుఃఖముతో మూర్ఛిల్లి భూమిమీద పడెను. మూర్ఛనుండి తెప్పరిల్లి ఏడుపు మొదలు పెట్టెను. అప్పుడు ఇంద్రజిత్తు తన పినతండ్రి చావును దానివలన తండ్రికి కలిగిన దుఃఖమును, ఏడుపును చూచి రావణునితో పలికెను. బుద్ధిమంతుడైన పితాజీ దుఃఖమును విడనాడుము. మహాబలుడు, మేఘనాథుడను నేను బ్రతికియుండగా దుఃఖమునకు అవసరమెచ్చట నున్నది. దేవాంతక, దుఃఖము నంతను పారద్రోలుము. హే రాజా! స్వస్థచిత్తుడవు కమ్ము. నేనంతను చక్కదిద్దుతాను. శత్రువులను చంపుతాను. నేను ఇప్పుడు నికుంభిలా గుహాలోనికి వెళ్లెదను. వెంటనే అగ్నిని తర్పణచేసి, రథాదులను పొందెదను. దానివలన నేను శత్రువులచే జయింపబడను. అని పలికి వెంటనే అగ్నిహోత్రశాలకు వెళ్లెను. ఎర్రని మాలను ధరించి, ఎర్రని గంధమును పూసుకొని మౌని అయి నికుంభిలా స్థలమందు హోమమునకు అరంభము కావించెను.

విభీషణుడు మేఘనాధుని ప్రయత్నమును విని దుర్మార్గుడైన ఇంద్రజిత్తు యొక్క కుటిలప్రయత్నముల నంతను రామునికి నివేదించెను. హే రామ! ఇంద్రజిత్తుయొక్క ఈ హోమము సమాప్తమైతే వాడజేయుడు కాగలడు. వానిని ఎవరు జయించలేరు. దేవతలు కాని రాక్షసులు కాని వానిని జయించలేరు. అందువలన నేను లక్ష్మణునిచేత వాని సంహారమును కావించెదను. తొందరగా. నాతోకలసి లక్ష్మణుని వీరశ్రేష్ఠుని పంపుటకు అజ్ఞాపించుము. మీ తమ్ముడు మేఘనాధుని సంహరించగలడు. సందేహము లేదు అనెను.

## శ్రీ రాముడు పలికెను

నేనే స్వయంగా ఇంద్రజిత్తును చంపుటకు వచ్చెదను. సర్వ రాక్షసులను చంపిన అగ్నేయాస్త్రముతో చంపివేసెదను. అని పలికెను.

విభీషణుడు రామునితో తిరిగి యిట్లనెను. వీడు ఇతరులచేత చంప బడడు. పన్నెండు సంవత్సరములు నిద్రాహారములు మాని ఎవ డుంటాడో వానిచేత వీనికి చావని బ్రహ్మగారు వరమిచ్చారు. లక్ష్మణుడు అయోధ్యను విడిచిపెట్టి నీతో కూడ వచ్చినాడు. ఆ దినమునుండి నిద్రాహారములను ఎరుగడు. నీయొక్క సేవలో నిరం తరము మగ్నచేతస్కుండై నిద్రాహారములు మానివేసి నీ సేవ పన్నెండు సంవత్సరములు చేసెనని నాకు తెలిసినది. అందువలన అజ్ఞాపించు దేవా ! తొందరగా లక్ష్మణుని వెనువెంటనే పంపండి. భూమినంతను మోసియున్నట్టి లక్ష్మణుడు నిస్సంశయంగా మేఘ నాధుని చంపగలడు. జగత్తుల కన్నింటికి అధిపతివైన నీవు సాక్షాత్ శ్రీమన్నారాయణుడవు. శేషుడే లక్ష్మణుడు. మీరు ఇరువురు జగ న్నాటక సూత్రధారులు భూభారమును తగ్గించుటకు అవతరించిరి.

ఇట్లు యుద్ధకాండలోని అష్టమ సర్గము సమాప్తము.

—○—

## నవమ సర్గము

# మేఘనాద వధ

విభీషణుని వాక్యములను విని శ్రీరాముడు పలికెను. హే విభీషణ! ఆ భయంకర రాక్షసుడైన ఇంద్రజిత్తు యొక్క అన్ని మాయలను ఎఱిగి యున్నాను. బ్రహ్మాస్త్రము తెలిసినవాడు, శూరుడు, మాయావి మఱియు మహాబలుడు. నేను లక్ష్మణుని సేవా నిరతిని, నా గురించి ఒనర్చిన పరిచర్యలను ఎఱిగి యున్నాను. ఇది నీకు తెలిసినప్పటికి కార్యగౌరవము వలన, నేను వచ్చే కార్య విషయములో మౌనంగా ఉంటిని. అంత రాముడు లక్ష్మణునితో పలికెను. హనుమంతుడు మున్నగు ప్రముఖ వీరులతో కలసి, గొప్ప సైన్యమును వెంట నిడికొని రావణపుత్రుని సంహరింపుము. యుద్ధమునకు బయలుదేరుము. జాంబవంతుడు, భల్లూకరాజు తన సైన్యముతో నీవెంట వస్తాడు. తన యావత్తు సైన్యముతో విభీషణుడు కూడా నీ వెంట ఉంటాడు. విభీషణుడు వానికి చిరపరిచితుడు. ఇంద్రజిత్తు మాయల నన్నిటిని వాని వివరముల నన్నింటిని ఎరిగి యున్నాడు. రామవాక్యమును విని భీమపరాక్రముడైన లక్ష్మణుడు తనయొక్క రెండవ ధనుస్సును పరిగ్రహించి విభీషణునితో కూడా బయలుదేరి రాముని పాదారవిందములకు ప్రణమిల్లి స్పృశించి పలికెను. ఇప్పుడు నా ధనుస్సునుండి విముక్తములైన బాణములు, ఇంద్రజిత్తుని సంహరించి పాతాళ లోకమందలి భోగవతీ నదిలో స్నానము చేయుటకు వెళ్లగలవు. అని పలికి రామునికి ప్రదక్షిణచేసి అతివేగముతో ఇంద్రజిత్ సంహారమునకు బయలుదేరెను. కొన్ని వేల సంఖ్యగల వానరులతో హనుమంతుడు ముందు నడవగా లక్ష్మ

ణునివెనుక నడచు చుండెను. విభీషణుడు కూడ తన మంత్రివర్గముతో కూడ తొందరగా వెళ్లెను. జాంబవంతుడు మున్నగు భల్లూకముల అతివేగముతో సౌమిత్రిని వెంట వెళ్లిరి. వానరులతో కూడ లక్ష్మణుడు నికుంభిలా స్థలమునకు వెళ్లి రాక్షస సంకులమైన బలమును చూచెను. ధనుస్సును గ్రహించి లక్ష్మణుడు, అంగదుడు, జాంబవంతుడు చూచు చుండ విల్లు ఎక్కుపెట్టి ఉండెను. అంత విభీషణుడు లక్ష్మణునితో పలికెను. లక్ష్మణ ! చూడు శ్యామసవర్ణమైన రాక్షస సైన్యము కనపడు చున్నది. ఈ సేనను చంపుటలో ప్రయత్నం చేయుము. ఇది నష్టమైనచో ఇంద్రజిత్తు బయటకు వస్తాడు. దీన్ని సమాప్తిచేసి వెంటనే దుర్మార్గుడైన ఇంద్రజిత్తుని చంపివేయుము. వెంటనే లక్ష్మణుడు శరవర్షమును కురిపించెను. కోతులు పర్వత శిఖరములతో, బండరాళ్లతో, వృక్షములతో, రాక్షసులను కొట్టిరి. రాక్షసులు కూడ వానరులను కొట్టిరి. రాక్షసులు, పరశువులుచేతను, తీక్ష్ణబాణములు, ఖడ్గములు, వెదురుకర్రలు మున్నగు నానావిధము లైన మారణాయుధములతో మార్కొనిరి. అప్పుడు బ్రహ్మాండమును పగులుగొట్టు రీతిని ఒక శబ్దము వ్యాపించినది. ఇంద్రజిత్తు తన సైన్యముకొట్టబడుచు నశించుచున్నట్లుగమనించి నికుంభిలాస్థలమును హోమమును విడిచిపెట్టి బయటకు వచ్చి రథమునెక్కి ధనుస్సును గ్రహించి మహాక్రోధంతో లక్ష్మణుని చూచి "హే సౌమిత్రి ! నాతో యుద్ధమునకు వచ్చినవాడు తిరిగి జీవించడు. నా పేరు విన్నావా ? మేఘనాధుడను". విభీషణునితో కూడ ఇట్లనెను. హే విభీషణ నీవు మా యింట్లో పుట్టి అన్నగారిచేత పెంచబడి అనగా మా తండ్రి రావణునివలన బ్రతికి, స్వకీయులను విడిచిపెట్టి శత్రువులకు భృత్యుడవై, పుత్రసమానుడనైన నాకు ఏ విధంగా ద్రోహము చేయుచున్నావో ఆలోచించవా ? నీవు ఒక మహా పాపాత్ముడవు. దుర్మార్గుడవు. అని పలికి హనుమంతుని వీపుమీద అధివసించియున్న

లక్ష్మణుని దగ్గఱకు రథముపై వెళ్లి మహాభయంకరమైన ధనుస్సును స్వీకరించి, ఘోరమైన నాదముతో, ధనుష్టంకారము గావించిపలికెను. ఓ వానరులారా! "ఇప్పుడు నాయొక్క బాణములు మీ ప్రాణములను త్రాగ గలవు.

అంత లక్ష్మణుడు తన చాపమునుండి ఒక బాణమును సంధానము చేసి పామువలె బుస్సకొట్టుచు ఇంద్రజిత్తుపై ప్రయోగించెను. ఇంద్రజిత్తు కూడ కోపంతో ఎర్రని నేత్రములు కలవాడయి వజ్రాయుధమువలె తీక్షణమైన లక్ష్మణ బాణములతో కొట్టబడి ముహూర్త కాలము చైతన్యమును కోల్పోయి వెంటనే లేచి తనుఎదుట దశరథ కుమారుడగు లక్ష్మణుడు ఉన్నట్లు చూచి లక్ష్మణుని వైపు పరుగులిడెను. ధనుస్సులో బాణములను సంధించి లక్ష్మణుని ఉద్దేశించి పలికెను. నీవు నా మొదటి యుద్ధమందు నా పరాక్రమమును చూసియుండవు. ఇప్పుడు నీకు నా బలవిన్యాసమును చూపిస్తాను. ఇక్కడ ఉండు కదలకుండా. అని పలికి ఏడు బాణములతో లక్ష్మణుని నొప్పించెను. పది బాణములతో హనుమంతుని, అనేకములైన తీక్ష్ణమగు బాణములతో విభీషణుని అతికోపంతో కొట్టెను. ఇనుమడించిన కోపంతో విభీషణుని నొప్పించెను. లక్ష్మణుడు శర వర్షమును జొప్పించి ఇంద్రజిత్తుయొక్క సువర్ణ కవచమును నువ్వులతో సమానమగు ముక్కలకింద కొట్టెను. ఇంద్రజిత్తు నూరు బాణములను లక్ష్మణునిపై ప్రయోగించి లక్ష్మణుని దివ్యకవచమును ఛిన్నాభిన్నము చేసెను. అది భూమిమీద పడిపోయెను. ఇద్దరిద్దరు పరస్పరము నువ్వా నేనా ? అన్నట్లు అద్భుతంగా సమరము గావించు చుండిరి. తీక్ష్ణములైన బాణములతో పరస్పరము ఒకరినొకరు నొప్పించుకొను చుండిరి. జయాప జయములను మరచిపోయి యుద్ధవిన్యాసముతో, బలప్రదర్శనతో చాలాకాలము సమరము చేయుచుండిరి. యుద్ధ మధ్యంలో లక్ష్మణుడు ఐదు

బాణములతో ఇంద్రజిత్తుయొక్క రథమును, సారథిని, గుర్రము లను హస్తలాఘవము చూపించి రాక్షసుని ధనుస్సును కూడ ముక్కలు ముక్కలు గావించెను. వెంటనే మేఘనాథుడు మఱియొక ధనుస్సును తీసికొని లక్ష్మణుని, సూర్యసమాన బాణములతో నొప్పిం చెను. పది దిక్కులయందు బాణముల వర్షమును కురిపించి వానరుల నందఱిని నొప్పించెను. అంత లక్ష్మణుడు ఇంద్ర సంబంధమైన అస్త్రమును చాపమందు సంధానం చేసి (ఐంద్రాస్త్రం) ఆకర్ణాంతము ఎక్కుపెట్టి రామ పాదపద్మములను స్మరించుచు పలికెను.

"రాముడు దశరథ పుత్రుడు, ధర్మాత్ముడు, సత్యసంధుడు త్రిలోకములందు ఎదుర్కొనే వీరుడు లేనివాడయితే ఈ ఇంద్ర జిత్తును చంపివేయుము". అని పలికి వీరుడైన లక్ష్మణుడు బాణమును ఇంద్రజిత్తుమీద ప్రయోగించెను. ఆ బాణము ఇంద్రజిత్తు యొక్క శిరస్సును నఱికి భూమిమీద పడవేసెను. ఆ శిరస్సు శిరస్త్రాణము కలిగి కవచ కుండలములు ప్రకాశించు కాంతితో విరాజమానమై యున్నది.

దేవతలందరు ఆనందభరితులైరి. లక్ష్మణుని బహుధా కీర్తిం చిరి. పుష్పవర్షమును కురిపించిరి. క్షణక్షణం లక్ష్మణ పరాక్రమ మును కొనియాడిరి. ఇంద్రుడు మిక్కిలి సంతుష్టుడాయెను. దేవతలు, మహర్షులు సంతసించిరి. ఆకాశమందు దేవతలు దుందుభి ధ్వనములు వినిపించిరి. మేఘనాథుని పతనమువలన అంతట భూమ్యాకాశ స్వర్గములందు జయజయ నాదములు పలుకబడినవి. లక్ష్మణుడు జయశ్రీని వరించి శంఖనాదమును కావించెను. భయంకరమైన సింహనాదము చేసి తిరిగి ధనుష్టంకారమును చేసెను. ఆ నాదము వలన వానరులందరు ఆనందించిరి. శ్రమలేకుండ తిరిగి బలమును పొందిరి. లక్ష్మణుని పదేపదే ప్రస్తుతించిరి. వానరులు, సుగ్రీవుడు

హనుమంతుడు, విభీషణుడు వెంట రాగా లక్ష్మణుడు రాముని సంద ర్శించెను. నారాయణ స్వరూపుడైన రాముని జ్యేష్ఠభ్రాతను చేయి విధాలా ప్రస్తుతించెను. రామునితో రాముని అనుగ్రహంవలననే ఇంద్రజిత్తు హతుడు కావింపబడినట్లు పలికెను.

శ్రీరాముడు లక్ష్మణ వాక్యములను విని కౌగిలించుకొని శిరస్సునందు వాసనచూసి ఆనందించి స్నేహంతోను, వాత్సల్యం తోను పలికెను. సాధు లక్ష్మణ సాధు చాలా ఆనందించాను. అతి కష్టమైన పనిని చేసితివి. మేఘనాధుని చావుతో ఇతరమంత జయింపబడినట్లే. సర్వమును జయించితివి. నీవు మూడు దివ ములు, మూడు రాత్రులు నిరంతర సంగ్రామంచేసి ఒక మహావీరుని సమరమందు జయించి చూపితివి. దీనివలన ఇప్పటినుండి నీవు నన్ను శత్రుహీనుడను చేసితివి. ఇప్పుడు పుత్రశోకంతో ఖిన్నుడవు చున్న రావణుడు నాతో యుద్ధానికి వస్తాడు. వానిని నేను సంహ రిస్తాను.

లంకలో రావణుడు తన ముద్దులపట్టి ఇంద్రజిత్తు లక్ష్మణుని వలన హతుడయినట్లు విని భూమిమీద పడిపోయెను. మూర్ఛను పొందెను, తిరిగి లేచి అతిదీనంగా భోరుమని ఏడ్చెను. పుత్రశోకము వలన విహ్వలు డాయెను. పుత్రుని సాహస బలపరాక్రమములను స్మరించుచు చెప్పరాని ఆవేదనతో విలపించుచు "ఈ దినము నుండి దేవతలు లోకపాలులు మహర్షులు ఇంద్రజిత్తు హతుడని విని భయ హీనులై సుఖంగా ఉంటారు. ఈలాగున ఎన్నియో విధముల పుత్ర గుణములను శ్లాఘించుచు ఏడ్చుచుండెను. ఆ తరువాత క్రోధము వచ్చి సీతమ్మను చంపివేయుటకు పరుగులిడెను. యుక్తాయుక్త విచక్షణజ్ఞానము కోల్పోయెను. సమస్త రాక్షసులను శత్రువులను

సంహరించమని పలికెను. ఖడ్గపాణియై సీతను చంపుటకు కోపించుచు వచ్చుచున్న దశాననుని చూచి సీతమ్మ భయదుఃఖములతో వ్యాకులత చెందెను.

ఇంతలో బుద్ధిమంతుడు, శుద్ధహృదయుడు, విచార వివేకము కలవాడు అగు సుపార్శ్వుడు అను మంత్రి రావణునితో పలికెను. హే దశానన ! ఇది యేమిటిది ? ఇటువంటి దుష్కృత్యము నకు పాల్పడుచుంటివి. నీవు సాక్షాత్ కుబేరునికి తమ్ముడవు. వేద విద్యలో నిపుణుడవు మఱియు యజ్ఞాంత స్నానకర్తవు, అనేక సుగుణములు కలవాడవు. స్త్రీవధను ఎట్లు ఇచ్ఛగించు చున్నావు. మమ్ములనందఱిని వెంటపెట్టుకొని యుద్ధముచేసి రామలక్ష్మణులను చంపి తొందరలో జానకిని పొందగలవు. అని పలుకునరికి రావణుడు అచ్చటనుండి తిరిగి వెళ్లిపోయెను. తరువాత మిత్రుడు చెప్పిన వాక్యములను ధర్మయుక్తములని, నమ్మి దుర్మార్గుడైన రావణుడు ఇంటికి వెంటనే వెళ్లిపోయెను. ఆ మరుచటి దినమున బంధు బాంధవులతో సభలో ప్రవేశించెను.

ఇట్లు యుద్ధకాండ యందు నవమ వర్గ సమాప్తము.

## దశమ సర్గము

# శంకరుడు భవానితో పలికెను

a) రావణ యజ్ఞ విధ్వంసము. b) మండోదరి హితోపదేశము.

సభలో ప్రవేశించి రావణుడు మిగిలిన రాక్షసులతోను, మంత్రులతోను రామునితో యుద్ధమునకు బయలుదేరెను. శ్రీరాముడు శేషించిన రాక్షసుల నందరిని లీలగా సంహరించెను. రామబాణం అనే అగ్నిలో రాక్షసులనే మిడతలువడి ఒకరి తరువాత ఒకరు మండిపోయిరి. రావణుడు రామబాణం తీక్షణంగా గుండెల్లోకి నాటిపోయి వ్యధచెంది తిరిగి లంకాపట్టణమునకు వెళ్లిపోయెను. అతిమానుషమైన రామపరాక్రమాన్ని అతులనే ఆంజనేయుని దైవదత్త బలాన్ని మనస్సులో స్మరించుచు రాక్షసులకు గురువైన శుక్రాచార్యుని కడకు చనెను. చేతులు జోడించి శుక్రాచార్యునికి నమస్కరించి రావణుడు పలికెను. భగవన్! లంకాపట్టణమంతా రాక్షస యూధములతో రాముని చేత వినాశము కావింప బడినది. మహాదైత్యులు, పుత్రులు, బాంధవులు చచ్చిపోయిరి. నీవంటి సద్గురువు జీవించియుండగా నాకు దుఃఖసమ్మోహ మెట్లు కలుగును. అని పలుకగనే శుక్రాచార్యుడు రావణునితో పలికెను. రహస్యంగా హోమముచేసి ప్రయత్నంతో సిద్ధిని పొందుము. విఘ్నములు లేకుండా హోమములు చేయవలెను. చేసినచో హోమగుండము నుండి వచ్చు అగ్నినుండి శక్తిమంతమైన రథము, గుర్రములు, అస్త్రశస్త్రాది బాణములు కలుగును. వానితో కూడినచో నీవు అజేయుడ వయ్యెదవు. నేను మూలమంత్రాలను ఇస్తాను. తొందరగా హోమము చేయుము. రావణుడు వెనువెంటనే [illegible] యింటికి వెళ్లి

మహల్‌లో పాతాళ సదృశమైన గహను త్రవ్వించి ఎట్టి విఘ్నములు రాకుండా లంకాపట్టణంలోని ద్వారములనన్నిటిని బంధించెను. అభిచారిక హోమములకు యుక్తములైన హోమద్రవ్యములను సంపాదించి ఏకాకియై గుహలో ప్రవేశించి మౌనంతో హోమము నారంభించెను.

బయటకు ప్రసారమగుచున్న హోమాగ్ని ధూమమును విభీషణుడు చూచి రామునితో దశకంఠుడు హోమము చేయుచున్నాడనియు అది సమాప్తమైనచో పీడజేయు డగుననియు హోమవిఘ్నమును కావించుటకు వానర యోధులను పంపవలెనని పలికెను. అటులనే అని రాముడు సుగ్రీవుని అనుమతితో అంగదుడు, హనుమంతుడు మున్నగు మహాబలము కలవారలకు ఆజ్ఞ యిచ్చెను. ప్రాకారములను దాటి రావణ మందిరములోనికి ప్రవేశించిరి. పదికోట్ల మంది వానరులు వెళ్లి హోమమందిర రక్షకులను పిండిక్రింద చంపిరి. ప్రభాతములో విభీషణుని భార్య సరమ, చేతిసంజ్ఞలచేత హోమ స్థానమును చెప్పెను. గుహనుకప్పిన బండరాతిని అంగదుడు కాళ్లతో పిండిచేసి బలవిజృంభితుడై గుహలోనికి ప్రవేశించెను. అచ్చట కళ్లుమూసికొని స్థిరమైన ఆసనమందు కూర్చొనియున్న రావణుని జూచెను. ఆ తరువాత అంగదుని ఆజ్ఞచేత వానరులందరు గుహలోనికి ప్రవేశించిరి. సేవకులను కొట్టుచు కోలాహలము చేయుచు హోమ సంభారములను, హోమ కుండములో పడవేసిరి. వానరాగ్రణియైన హనుమంతుడు బలాత్కారంగా రావణుని చేతినుండి స్రువమును (నెయ్యివోసే కర్ర) తీసికొని దానిచేత రావణుని కొట్టెను. వానరగణము రావణునిపై అటుఇటు గెంతుచు ధళితముల చేతను, కర్రలతోను రావణుని శరీరముపై దెబ్బలు కొట్టిరి. కాని రావణుడు దీక్షనుండి విరమించలేదు.

అంగదుడు అంతఃపురములో ప్రవేశించి జుత్తు పట్టుకొని మండోదరిని బలాత్కారంగా ఈడ్చి రావణునిఎదుట ఏడ్చుచున్న దానిని నిలబెట్టెను. ఆమెయొక్క రత్నభూషితమైన రవికెను చించి వేసెను. ముక్తాహారములు విడిపోయి ముత్యములు నేలయందు పడి పోయినవి. మొలత్రాడు జారిపోయినది. సమస్త ఆభరణములు నేలనిండా చిమ్మబడి యున్నవి. దేవగంధర్వ కన్యలను కూడా వానరులు అంతఃపురము నుండి రావణుని సమీపమునకు కొని తెచ్చిరి. మండోదరి అతిదీనురాలై ఏడ్చుచు రక్షించమని దశకంఠు నితో పలికెను. హే రావణ ! నీకు సిగ్గు కలుగలేదా ? నీ భార్య నయిన నన్ను ఇతర పురుషులు జుత్తుపట్టుకొని ఈడ్చుచుంటే నీ యెదుటనే అవమానం జరుగుచుంటే నీవెట్లు హోమం చేయు చున్నావు ? ఏ భర్తయొక్క ఎదుట ఎవని భార్య పరపురుషులచే పీడింపబడి శత్రువులచే అవమానం పడుతుందో ఆ భర్త అప్పుడునే చచ్చిపోవుట శ్రేష్ఠము. బ్రతికి యుండుటకంటె. హే మేఘనాధ ! నీవే బ్రతికియుంటే నా కిటువంటి అవమానము జరుగుతుందా ? వానరులు అపకారము చేయుచుంటే నీవే బ్రతికియుంటే నాకిట్టి దుఃఖము చూచి యూరకుందువా ? నా భర్త ఇప్పుడు భార్యను సిగ్గును రెంటిని కూడా విడిచిపెట్టాడు. తన జీవితమును ఆశించి స్వార్థపరుడు అని పలికెను. మండోదరి వాక్యములను విని దశ కంఠుడు లేచి చేతియందు ఖడ్గమును ధరించి దేవిని విడిచిపెట్టుంటూ అంగదునుకటి ప్రదేశమందు కొట్టెను. అప్పుడు వానరులందరు హోమమును ఆ విధంగా విధ్వంసంచేసి రామపార్శ్వమునకు చనిరి. రావణుడు మండోదరితో ఓదార్చుచు పలికెను.

హే దేవి ! మంగళకారిణి ! సుఖదుఃఖములు దైవాధీనములు. జీవించియున్న ప్రతిప్రాణి దీనిని తెలిసికొనగలదు. హే విశాలాక్షి ! శోకమును విడిచిపెట్టుము. నిశ్చితమైన జ్ఞానమును ఆశ్రయింపుము.

శోకము అజ్ఞానమువలన కలుగును. శోకము జ్ఞానమును వినాశనము చేయును. ఆత్మ యగు శరీరాది యందు అజ్ఞానముచేత పుట్టిన అహంకారము సంసార హేతువు. పుత్రులు, భార్య, ఇల్లు, ధనములు, అహంకారమువలన జనించును. జన్మము మృత్యువు జరయున్న గు నవి అజ్ఞానమువలన పుట్టినవి, ఆత్మ యొక్కటే పరిశుద్ధమైనది. అన్ని టికంటె వేరుగా ఉంది. సంగమములు లేనిది. ఆనంద రూపమై నది జ్ఞానమ్మే శరీరముగా కలది. సర్వభావములచేత విడిచిపెట్టబడ్డది. సత్యస్వరూపమైన ఆత్మకు కలయిక వియోగములు లేవు. పరిశుద్ధ మైన జీవితముకల నీవు ఈ విధంగా ఆత్మను తెలిసికొని శోకమును విడిచిపెట్టుము. ఇప్పుడే వెళ్లి లక్ష్మణుని రాముని ఇద్దరిని చంపివేసి వస్తాను. ఒకవేళ రాముడు తన వజ్రతుల్యములైన బాణములచేత నన్ను చంపివేసినచో నేను అతని స్థానమగు వైకుంఠమునకు పోయెదను. అప్పుడు నీచేత నాకొఱకు ఒక కార్యము ఆచరింపబడ వలసినదియున్నది. హే ప్రియే నేను కాసింతపుడు అడుగుచున్నాను. 'నీవు సీతను చంపి నా శవంతో కూడ అగ్నియందు ప్రవేశించుము'. ఇది నా తుదికోరిక. నీవు తప్పక చేసి తీరాలి అని పలికెను.

అంత మండోదరి పలికెను. హే నాథ! శ్రీరాముడు నీవను కున్నట్లు నీచేతగాని లేక యితరుల చేతిలో గాని చంపబడడు. రాముడు సాక్షాత్ శ్రీమన్నారాయణుడు. ప్రధాన పురుషేశ్వరుడు. భగవంతుడగు రాముడు మత్స్యావతారమెత్తి వైవస్వత మనువును అన్ని ఆపదలనుండి రక్షించెను. భగవంతుడగు రాముడే పూర్వము ఒక లక్ష యోజనముల పొడవుగల కూర్మావతారమెత్తి సముద్ర మథన సమయమందు తన వీపుమీద సుమేరు పర్వతమును ధరిం చెను. ఒక సమయమందు వరాహ రూపము ధరించి భూమిని ఉద్ధ రించి మహాదైత్యుడగు హిరణ్యాక్షుని చంపెను. ఈ రాముడే నృసింహ రూపమును ధరించి త్రిలోకకంటకుడైన హిరణ్యకశ్యపుని

పరిమార్చెను. మఱియు ఈ రఘుశ్రేష్టుడే వామనావతార మెత్తి బలిచక్రవర్తిని బందించి మూడు లోకములను, మూడు పాదములతో ఆక్రమించి తన సేవకుడైన ఇంద్రునికి తిరిగి దానము చేసెను. క్షత్రియులందరు బలగర్వితులై రాక్షస కృత్యములను చేయునప్పుడు ఈ రాముడే పరశురామావతార మెత్తి వారినందరిని ఇరువదియొక్క పర్యాయములు యుద్ధములో జయించి కశ్యపునకు భూమినంతను దానము చేసెను. ఆ పరాత్పరుడే ఈ సమయమందు రఘువంశ మందు దశరథ గర్భమందు రామావతారమెత్తి మనుష్య రూపములో నిన్ను సంహరించుటకు జన్మించెను. అతని భార్యయైన సీతను బలాత్కారంగా అతడు లేని సమయములో తపోవనము నుండి తెచ్చి నా పుత్రులకు నీకు మృత్యువును తెచ్చితివి. సీతను నీవు దొంగిలించితివి. నీవు బుద్ధిమంతుడవు. సీతను రఘురామునికి పంపి వేయుము. విభీషణునికి రాజ్యమునిచ్చి మనమిద్దరము వనమునకు వెళ్లెదము, అని పలికిన మండోదరి పలుకులను విని రావణుడనెను.

హే కళ్యాణి! నేను పుత్రులను, సోదరులను, మఱియు రాక్షస సమూహములను రాఘవునకు యుద్ధమందు అప్పచెప్పి వన మందెట్లు ఉండగలను? జీవితమును ఏ విధంగా గడపగలను? నేను కూడా ఇప్పుడే రామునితో యుద్ధము చేసెదను. అతని వేగ యుక్తములైన బాణములతో చంపబడి అతని పరమపదమైన విష్ణు పదమును పొందెదను. రాముడు సాక్షాద్విష్ణువని ఎరిగియున్నాను. జానకిని ఆదిలక్ష్మి యని ఎరిగియున్నాను. తెలిసియే సీతమ్మ సాక్షాదాది లక్ష్మి అని ఎరిగియే వనమునుండి ఆమెను బలాత్కా రంగా తెచ్చినాను. రామునివలన చావును పొంది పరమపదమును పొందగలననే ఉద్దేశముతోనే సీతను తెచ్చినాను. నేనిప్పుడు నిన్నును విడిచిపెట్టి సమస్త రాక్షస సైన్యముచేరిన చోటుకు వెళ్లి

పోయి సంసారముకుండి విముక్తుడ నగుదును. రాముని చేతిలో యుద్ధమందు చచ్చిపోయి ముముక్షువులగు జనులు నిత్యము సేవించు పరానంద మయమగు శుద్ధమగు పరమపద గతిని పొందెదను. ఇచ్చటనే సమస్త పాపములను కడుగుకొని దుర్లభమైన ముక్తిని పొందెదను. అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము మఱియు అభినివేశ మను ఐదువిధములైన తరంగములు కలదియు, భ్రాంతి అనే సుడి గుండంలో, స్త్రీ పుత్ర స్వజన విభవ బంధువులనెడి చేపలతో కూడినదియు, క్రోధమనే బడబానలమందు మన్మథుడనే జలముతో కూడినదియు అగు సంసారసాగరమును దాటి హరిని సేవిస్తాను.

ఇట్లు యుద్ధకాండలోని దశమ సర్గ సమాప్తము.

---

ఏ కా ద శ  స ర్గ ము

## శంకరుడు భవానితో పలికెను

మండోదరితో రావణుడా విధంగా పలికి రామునితో యుద్ధము చేయుటకు రణభూమికి వెళ్లెను. దృఢమైన రథముపై ఘోరరాక్షసులతో కూడి, పిశాచ ముఖములతో కూడిన గాడిదలమీద ఎక్కిన రాక్షసులతో భయంకర వాతావరణం చూపించి, సర్వాస్త్ర శస్త్రములను తీసికొని, సమస్త యుద్ధసామాగ్రితో బయలుదేరెను. ఆ రథమునకు పదునారు చక్రాలు, రథమునకు చుట్టూ ఇనుప ముళ్ల చట్రము, ఇనప తాళ్లకట్లతో దృఢముగా చేయబడి యున్నది. రావణుడు భయంకర ఆకారముతో వచ్చుచుంటే చూచి వానరులు భయపడిపోయిరి. హనుమంతుడు చెంగులువేయుచు రావణునితో యుద్ధము చేయుటకు ముందుకు పరుగులిడి ఘోరమైన పిడికిలి పోటులతో రావణుని వక్షస్థలమందు కొట్టెను. ఆ ప్రహారముతో రావణుడు రథమునుండి భూమిమీదకు పడిపోయెను. కొంతసేపు మూర్ఛితుడయి తిరిగి లేచి హనుమంతునితో నీవు సమర్థుడవయిన శూరుడవు నిజంగా అని పలికెను. హనుమంతుడు రావణునితో నీవు నా ముష్టిప్రహారము తిని కూడా బ్రతికియున్నావు అనెను. నన్ను నేను నిందించుకోవలసి యున్నది. నీవిప్పుడు నా వక్షస్థలమందు ఒక దెబ్బ కొట్టు రావణ. ఆ తరువాత నా ముష్టిఘాతముచేత ప్రాణములను వీడెదవనెను. అటులనే అని రావణుడు హనుమంతుని వక్షస్థలమందు ముష్టిప్రహారమును కావించెను. దానితో హనుమంతుని కళ్లు తిరిగినవి. కొంచెము కాలము స్పృహతప్పి తిరిగి తెలివితెచ్చుకొని రావణుని చంపుటకు ఉద్యుక్తుడాయెను. రావణుడు, హనుమంతుడు చంపివేస్తాడని భయ

పడి ఇంకొక స్థలమునకు పారిపోయెను. హనుమ, అంగదుడు, నలుడు, నీలుడు నలుగురు కలసి ఒకచోటుకు వచ్చి తమముందు నిలబడియున్న అగ్నివర్ణుడు, సర్పరోముడు, ఖడ్గరోముడు మఱియు వృశ్చికరోముడు అను నలుగురు మహారాక్షసులను చూచి ఎవరి ముందున్న వారిని వారు క్రమంగా చంపివేసిరి. (అంజనేయుడు అగ్నివర్ణుని. అంగదుడు సర్పరోముని, నలుడు ఖడ్గరోముని, నీలుడు వృశ్చికరోమున్ని చంపివేసిరి). నలుగురు, నలుగురి రాక్షసులను చంపివేసి సింహనాదము ప్రత్యేకముగా కావించి రాముని దగ్గఱకు వచ్చిరి.

అంత రావణుడు కోపముతో పటుపటుమని పండ్లు కొఱుకుచు కండ్లను పూర్తిగా విప్పి రామునివైపు యుద్ధమునకు బయలుదేరెను. రథముమీద కూర్చొని వజ్రసమానమైన బాణములతో, మేఘములు వర్షమును వర్షించునట్లు రాముని శరీరముపై శరవర్షమును కురిపించెను. రామునిముందున్న వానరుల నందరిని బాధపెట్టునట్లు బాణ యుద్ధము చేయుచుండెను. శ్రీరాముడు సావధానుడై అగ్నిహోత్రిముతో సమానమైన బంగారురంగు గల బాణములతో రావణునిపై శరవర్షము గావించెను. అంతట ఇంద్రుడు రావణుడీ రథముపై నుండుటయు, రాముడు వేలపై యుండి సమరముచేయుట చూచి, మాతలిని పిలిచి తన రథముతో తొందరగా వెళ్లి రామునికి సహాయపడి తన సహాయక కృత్యమును నిర్వర్తించమని చెప్పెను. అటులనే అంటూ మాతలి దేవ రథమును సమకూర్చి గుర్రములను కట్టి రామవిజయం కొఱకు స్వర్గమునుండి భూలోకమునకు దిగి రాముని దగ్గఱకు వచ్చి పలికెను. రెండుచేతులు జోడించి మాతలి "హే రఘూత్తమా! దేవేంద్రునిచేత పంపబడితివి. దేవేంద్రుడు ఈ తన స్వంత రథమును తమ కొఱకు పంపినాడు. మఱియు తమ విజయము కొఱకని చెప్పుచు ఇంద్రధనుస్సు అభేద్యక వచము,

ఖడ్గము, రెండు దివ్యతూణీరములను కూడ పంపినారని చెప్పి రండి. దయచేయండి. రథమెక్కండి. ఇంద్రుడు వృత్రాసురుని చంపినట్లు రాక్షసుడైన రావణుని చంపవలసినదిగా అని పలికి రామునికి ప్రదక్షిణచేసి నమస్కరించెను. రాముడు రథము నెక్కి సంపూర్ణ లోకమును లక్ష్మీసంపన్నము చేయుచున్నట్లు ప్రకాశించెను. ఆ తరువాత రామ రావణుల మధ్య అతిఘోరము, భయంకరమైన యుద్ధము జరుగుచుండెను. అస్త్రవిద్యలో ఆరితేరిన రాముడు రాక్షసరాజు యొక్క ఆగ్నేయాస్త్రమును తన ఆగ్నేయాస్త్రముతోను, దివ్యాస్త్రమును తన దివ్యాస్త్రముతో పరిహరించెను. రావణుడు ఘోరాతిఘోరమైన రాక్షసాస్త్రమును రామునిపై ప్రయోగించెను. రావణాసురుని ధనుస్సునుండి విడువబడిన బాణములు మహావిష సర్పములయి, బంగారు పొన్నులతో రామునిచుట్టూ బరికట్టి చుట్టు వారినవి. ఆ శరములు అగ్నిని కక్కుచు సర్పాకారము కలవయి అన్ని దిశలందు ఉపదిశలందు వ్యాపించినవి. రాముడు రావణుడు సర్పాస్త్రమును ప్రయోగించెనని గ్రహించి అతి భయంకరమైన గారుడాస్త్రమును ప్రయోగించెను. రాముని వలన విడువబడిన బాణములన్నియు గరుత్మంతులయి సర్పబాణములను చేదించినవి. తిరిగి రావణుడు భయంకర బాణయుద్ధమును చేయసాగెను. వానితో రామునికి పీడకలిగెను. మాతలికి గాయము లాయెను. రావణుడు అతిక్రోధంతో ఇంద్రుని గుర్రములను చంపివేసెను. ఆ రథకేతనమును కూల్చివేసెను. దేవతలు, గంధర్వులు, చారణులు, చారులు, పితరులు రామునికి కలిగిన ఆపత్తును చూచి విషాదము చెందిరి. విభీషణుడు, సమస్త వానర సైన్యము కూడ మిక్కిలి చింతించిరి. ఆ సమయములో రావణుడు ఇరువది భుజములతో చేతులందు ధనుర్బాణములను ధరించుచు మైనాక పర్వతముతో సమానమైన ఆకారమును ధరించెను.

అంత శ్రీరాముడు రాక్షసుని హతమార్చులాగున కోపించి

ప్రళయకాల అగ్నివలె మండు బాణమును తీసి ఎదుటనున్న శత్రువును దహించులాగున చూచుచు, సమస్త లోకములకు తన పరాక్రమమును ప్రదర్శించు రీతిని తేజస్సుతో వెలుగుచు సర్వలోకములు చూచుచుండ బాణవర్షమును రావణునిపై కురిపించెను. వానరులందరు హర్షము చెందిరి. కాలాంతకుడువలె రాముడు యుద్ధ భూమిలో విన్యాసము చేసెను. రాముని క్రోధసహిత ముఖమును చూచి సమస్త ప్రాణికోటి భయపడి పోయెను. భూమి కదలినది. పంచ భూతములు కంపించినవి. రావణునిలో కూడ భయము పుట్టినది. అంతరిక్షముపయి విమానముల నెక్కి దేవతలు, సిద్ధ గంధర్వ కిన్నరులు విశ్వప్రళయ సమానమైన రామరావణ యుద్ధమును చూచుచుండిరి. రాముడు ఇంద్రాస్త్రమును తీసి రావణుని శిరస్సును ఛేదించెను. రావణుని శిరస్సులు రక్తమును చిమ్ముచు తాటిచెట్ల నుండి తాటిపండ్లు పడుచున్నట్లు భూమిమీదకు పడుచున్నవి. ఆ సమయంలో పగలు, రాత్రి, సంధ్యలు, దిక్కులు కనపడలేదు. మఱియు రావణుని శరీరముకూడ యుద్ధభూమి యందు కనపడలేదు. కేవలము ఛేదింపబడిన తలకాయలు మాత్రం కనపడు చుండెను. శ్రీరామచంద్రునకు ఆ సమయములో గొప్ప ఆశ్చర్యము కలిగినది. మనస్సులో ఆలోచించెను. ఒకే వర్చస్సుగల నూటఒక్క శిరస్సులను ఛేదించితిని. కాని రావణుడు జీవితమును నాశమును పొంది శాంతుడు కాలేదు. సర్వశస్త్రాస్త్ర కోవిదుడైన కౌసల్య ముద్దుపట్టి రాముడు సమస్త అస్త్రములు కలిగినవాడు చింతించెను. మహాసత్వ సంపన్నులైన లక్షలాది మంది రాక్షసులను లీలగా చంపిన బాణములు రావణుని చంపుటలో నిష్ఫలము లైనవి. అని రామునికి చింత కలిగినది. అంత దగ్గఱలో నున్న విభీషణుడు పలికెను. హే రామా! రావణుడు బ్రహ్మవరములను పొందినవాడు. ఎన్నిసార్లు వీని బాహువులను శిరస్సులను నఱికినను తిరిగి అవి వెనువెంటనే పుట్టునని భగవంతుడగు బ్రహ్మగారు వరమొసంగిరి.

రావణుని నాభిదేశమందు కుండలాకారముతో అమృతమున్నది. ఆగ్నేయాస్త్రముతో దానిని ఇంకింపుము. అనంతరము రావణునికి మృత్యువు కలుగును. అని చెప్పెను. అంత రాముడు మహాపరాక్రమము కలవాడు. శీఘ్రపరాక్రమము కలవాడు. తన ధనుస్సునందు ఆగ్నేయాస్త్రమును సంధించి రావణుని నాభిని కన్నంపెట్టెను. శిరస్సులను బాహువులను కూడ నరికివేసెను.

అంత రావణుడు ఘోరమైన శక్తిని గైకొని విభీషణుడు చచ్చిపోవాలని విభీషణునిపై విసిరెను. బంగారు రంగుగల బాణములతో రాముడు దానిని నరికివేసెను. రావణుని శిరస్సులు ఖండించబడిన తరువాత రావణుడు వికృతరూపమును పొందెను. రావణుని శరీరము నుండి తేజస్సు బయటికి వెడలిపోయెను. రావణుడు మాడిపోయిన రూపమును ధరించెను. అప్పుడు రావణునకు ఒకే ముఖ్యమైన శిరస్సు రెండు బాహువులు మిగిలెను. వానితోనే రావణుడు మహాశస్త్రాస్త్రములతో రాముని ఎదుర్కొని విజృంభించెను. రాముడు వానినన్నింటిని సమాన బలంతో పరిమార్చెను. రామరావణుల మధ్య భీకర సంగ్రామము సాగుచుండెను. ఇద్దరు ఒకరిని మించి ఇంకొకరు పోరాడుచుండిరి. చూపరులకు చాలా దృశ్యాతిదృశ్యంగాను రోమాంచమును కలుగజేసెను, అందుకే లోకంలో రామరావణ యుద్ధమును రామరావణ యుద్ధముతోనే సరిపోల్చిరి. ఇంకొకరితో పోల్చుటకు సమాను లుండలేదు. లేరు.

ఇట్లు భీకర సంగ్రామం జరుగుచుండగా మాతలి రామునితో వీనిని సంహరించుటకు బ్రహ్మాస్త్రమును వెంటనే వేయవలెనని గుర్తు తెచ్చెను. వీనికి దేవతలందరు పెట్టిన <u>వినాశకాల ముహూర్తము</u> ఇప్పుడు సంభవించినది. హే రాఘవేంద్రా! వీని శిరస్సును ఛేదించినచో వీడు చావడు. అందువలన శిరస్సును నరకవద్దు. కాని మర్మరూపమైన (హృదయము నందు) స్థలములందు కొట్టినగాని వీనికి

చావురాదు. అని మాతలి సమయస్ఫూర్తితో గుర్తు చేసినందున రాముడు ప్రకాశవంతమైన నాగుపామువలె బుస్సలు కొట్టుచున్నదియు, ఇరుప్రక్కల సూర్యుడు, అగ్ని కలదియు, ఆకాశమే శరీరముగా కలదియు, బరువులో మేరుమందర సమాన మైనదియు, పర్వములందు ( గుంపులందు ) అష్టదిక్పాలకులు కలదియు, సూర్య తేజస్సు జాజ్వల్యమానమై నట్టియు, లోకముల కన్నిటికి భయోత్పాతములను పోగొట్టునదియు అగు బాణమును ధనుర్వేద మందలి విద్యలచేత అభిమంత్రితము చేసి వేదమందు చెప్పబడిన విధిచే చాపమునందు ఎక్కుపెట్టెను. ఆ సమయములో సర్వభూతములు భయగ్రస్తము లయినవి. భూమి కంపించినది. ఎక్కుపెట్టిన బాణమును రాముడు సావధానంగా, అతికోపంతో మర్మఘాతుక బాణమును రావణునిపై విడిచిపెట్టెను. కాలునితో సమానమైనదియు, భయంకర ముఖము కలదియు, వజ్రాయుధంతో సమానమైనదియు, దుర్భేద్యమైనదియు అగు ఆ బాణము రావణుని వక్షస్థలమందు తగుల్కొన్నది. భయంకరమైన ఆ బాణము రావణుని శరీర మందంతటను చొరబడి వెంటనే రావణుని హృదయమును చీల్చివేసినది. రావణుని ప్రాణములను అంతము చేసినది. తరువాత ఆ బాణము భూమిలోనికి చొచ్చుకొని తిరిగి రాముని అమ్ములపొదిలోనికి ప్రవేశించినది.

రావణుని చేతినుండి బాణములతో కూడిన ధనుస్సు భూమి మీద పడిపోయినది. రావణుడు మట్టికరిచి ప్రాణములను గోల్పోయి భూమిమీద పడిపోయెను. మిగిలిన రాక్షసులు రావణుడు చచ్చిపోయినట్లు తెలిసికొని భయముతో నాలుగు దిక్కులకు పరుగులిడిరి.

దశగ్రీవుని మరణమును, శ్రీరాముని విజయమును వానరులందరు ప్రస్తుతించిరి. రామునికి జయజయ ధ్వానములు మిన్నుముట్టినట్లు పలికిరి. అంతరిక్షమునందు దేవదుందుభులు మోగినవి.

రాముని శరీరమునిండా పుష్పవర్షము పడినవి. దేవతలు, సిద్ధులు, చారణులు, మునీశ్వరులు రాముని కొనియాడిరి. అప్సర స్త్రీలందరు నాట్యము చేసిరి. దేవతలందరు చూచుచుండగా రావణ శరీరము నుండి వెలువడిన దివ్యతేజస్సు సూర్యసంకాశ మైనది, రాముని యందు ప్రవేశించెను. దేవతలందరు రావణునియొక్క మహాభాగ్య మును కొనియాడిరి. రామసాయుజ్యమును పొందిన రావణుడు శ్లాఘనీయుడే. మఱియు దేవత లిట్లనిరి. మేము దేవతలమయ్యు సత్వగుణ ప్రధానులము మాత్రము అయియున్నాము. కాని మాకు భయము, దుఃఖము సంసారములో క్రిందపడుట, మాదికి ఎదుగుట ఉన్నవి. వీడు క్రూరరాక్షసుడు, బ్రహ్మహంతకుడు, తామసుడు, పరదారరతుడు, విష్ణుద్వేషి మునీశ్వరులను హింసించినవాడు, సర్వ భూతములు చూచుచుండగా రామున్ని ప్రవేశించెను. అని దేవత లందరు పలుకుచుండ నారదుడు నవ్వుచు పలికెను.

ధర్మవేత్తలైన దేవతలారా ! వినండి. రఘురాముని యందు ద్వేషమువలన రావణుడు రాముని సర్వవేళలందు స్మరించెను. రామచరితమును తన భృత్యులతోపాటు నిత్యము వినెను. రాముని చేతిలో తనకు మరణమును తెలిసికొని అన్నిచోట్ల శ్రీరాముని చూచెను. స్వప్నమందు కూడ శ్రీరామునినే చూచెను. రావణుని యొక్క క్రోధము రావణునిపాలిట గురూపదేశ మాయెను. కాదు గురూపదేశముకంటె అధిక మాయెను. అంత్యకాలమందు స్వయంగా శ్రీరామునిచేత మరణమును పొందిన వాడగుటచేత వాని పాపము లన్నియు కరిగిపోయినవి. పాపములు క్షాళింపబడిన తరువాత బంధములు లేనివాడాయెను. బంధహీనుడయి నందున శ్రీరాముని సాయుజ్య ముక్తిని పొందెను. ఎంతటి పాపిష్టి అయినా దుర్మార్గు డయినా పరదార పరధనములందు సక్తుడైనప్పటికి, స్నేహమువలన గాని, భయమువలన గాని, రఘుకుల తిలకుని అంత్యకాల మందు

సంస్మరించినచో నిర్మల అంతరంగుడయి, అనేక వేల జన్మల నుండి సంప్రాప్తమైన దోషములు, పాపములు నుండి విముక్తుడయి, విష్ణుస్వరూపుడైన రాముని యొక్క పరమ పదమైన వైకుంఠమును దేవతలకు దేవరాజులకు పూజనీయమైన దానిని వెనువెంటనే పొందగలడు. ఏ రాముడు త్రిలోక కంటకుడైన రావణాసురుని యుద్ధమందు చంపివేసి, తన ఎడమ చేతితో చాపమును భూమియందు మోపి, కుడి చేతితో ఒక బాణమును సంధించి త్రిప్పుచున్నాడో, ఏ రాముడు నేత్రముల చివరి భాగములందు ఎర్రని రంగు కలిగి యున్నాడో, ఏ రాముడు బాణములచేత ఛిన్న భిన్నమైన శరీరముతో సహస్ర సూర్యతేజస్సుతో విరాజమానుడగుచున్నాడో, ఏ రామున్ని దేవేంద్రుడు స్తుతించుచున్నాడో, ఏ రాముడు విజయ లక్ష్మీ సమేతుడై విరాజిల్లుచున్నాడో అట్టి వీరరాముడు నన్ను రక్షించుగాక.

ఇట్లు యుద్ధకాండ యందు ఏకాదశ సర్గ సమాప్తము.

——:●:——

## ద్వా ద శ స ర్గ ము

### విభీషణునకు రాజ్యాభిషేకము, సీతాదేవి అగ్ని పరీక్ష.

## శంకరుడు భవానితో పలికెను

శ్రీరాముడు హనుమంతుని, అంగదుని, లక్ష్మణుని, సుగ్రీవుని, జాంబవంతుని ఇతరులైన వానరసైన్యములను ఉద్దేశించి ఆనందంతో నిండయిన మనస్సుతో పలికెను. "మీ యందరి బాహుబలంతో రావణుడు నాచేత చంపబడినాడు. పుణ్యాత్ములైన మీయందరి కీర్తి సూర్యచంద్రుడు ఉన్నంతవఱకు నిలబడుతుంది. త్రైలోక్యపావన మైనదియు, కలిపాపహారమగు నాతో కూడి మీరు చేసిన కథను ప్రజలు కీర్తిస్తారు. మఱియు అట్లు గానము చేసినవారు పరమ పదమును పొందెదరు. ఇంతలో రావణ మృతిని తెలిసికొని రావణ పాలితలైన మండోదరీ మొదలగు స్త్రీలందరు రావణుని శవము ముందు పడి ఘోరున దుఃఖముతో విలపించు చుండిరి. విభీషణుడు కూడ మహాంతమైన దుఃఖముతో దుఃఖించెను. రావణుని ముందు పడిపోయి అనేకవిధములుగా శోకించెను. రాముడు లక్ష్మణుని పిలిచి విభీషణుని ఓదార్చి జ్ఞానోపదేశమును చేసి తక్షణ కర్తవ్యమును గూర్చి ప్రబోధించ మనెను. రావణునకు ఉత్తరక్రియలను చేయించ మని చెప్పుమనెను. ఎందుకు ఆలస్యము చేయుట సత్వరము చేయించవనెను. మండోదరీ ప్రముఖులు స్త్రీలు విపరీతంగా ఏడ్చు చున్నారు. వారినందరిని ఓదార్చి సమయ కర్తవ్యమును ఎఱుక పరచమని చెప్పెను, రావణునిముందుపడి మహాదుఃఖముతో విలపించు చున్న విభీషణుని చూచి లక్ష్మణుడు పలికెను. హే విభీషణ !

నీవెందుల కిట్లు విలపించెదవు. దుఃఖించుటకు వీనికి నీకు ఉన్న సంబంధము ఏమి? క్రిందటి జన్మలోగాని, ముందు జన్మలోగాని నీ వెవడవో, వాడెవడో ఈ జన్మలో ఇట్లు నదిలోని పెద్దపెద్ద ఇసుక తిన్నెలవలె కలిసినారు. దేహవంతులు కలుస్తుంటారు. కాలంవస్తే వియోగం పొందుతారు. ధాన్యము మున్నగు విత్తనములు, ఇంకొక విత్తనములతో కలసి నష్టము చెందునో, కలసి పుట్టునో, ఆ ప్రకారమే భగవంతుని మాయచేత ప్రేరితులైన సర్వప్రాణులు ఇతర ప్రాణుల వలన పుడుతూ ఉంటాయి. మఱియు చచ్చిపోతూ ఉంటాయి. నీవు, నేను, మనమందరము, వీరు. ఇతరులైన భూతములు కూడ సమాన భావంతో కాలవశంలో పుట్టితిమి. జన్మము, మృత్యువు ఏ కాలంలో ఎవనికి ఎవరి వలన ఏ విధంగా జరగాలో వానికి వారివలన ఆ సమయమందు ఆ విధంగా జరుగుతాయి. జన్మములేని ఈశ్వరుడు తనకే విధమైన కోరికలు లేనివాడయి సప్పటికి చిన్నపిల్ల వానివలె వినోదం కొఱకు తన సృష్టిలో అస్వతంత్రులైన ప్రాణులను పుట్టిస్తాడు మఱియు నష్టము కలుగ జేస్తాడు. జీవుడు దేహసంబంధము వలన దేహి అని పిలువబడు చున్నాడు. దేహము ఇతరుల దేహము నుండి (మాతా పితరులు) పుట్టుచున్నది. ఒక బీజము నుండి మఱియొక బీజము పుట్టినట్లు పుట్టుచున్నాడు. సనాతనమైన ఆత్మ దేహముకంటె భిన్నమైనది. దేహము దేహి అను విభజనము అవివేకము వలన కావింపబడినది పూర్వమందు. అగ్నిహోత్రము నందు కాష్ఠముల యొక్క వికారములు కనుపించునో ఆ విధంగానే సాక్షిభూతుడైన ఆత్మయందు నానాత్వం, జన్మము, మరణము, క్షయము, వృద్ధికర్మము మఱియు కర్మఫలము మున్నగునవి ఆరోపించ బడినది. ఇవి వాస్తవంలో ఆత్మయొక్క ధర్మములు కావు. మిధ్యాభ్రాంతివలన ఆత్మకు దేహ సంయోగము వలన దేహధర్మములు నత్యములుగా కనపడును. ఆత్మను ధ్యానించి తెలిసికొన్నచో వాని అనత్యస్థితి గోచరమగును. ఏ విధంగా లోకంలో గాఢనిద్రలో ఉన్న వానికి అహంకార ముండ

నందున, ప్రపంచముయొక్క భావము ఉండదో ఆ విధంగానే అహం కార హీనుడైన ముక్తపురుషునకు జీవించియున్నను ప్రపంచము యొక్క ధ్యానముండదు. అందువలన నీవు అహంత, మమత (నేను నాది) భ్రాంతిరూప మనోధర్మములను విడిచిపెట్టి, ఆత్మరూపుడైన వాకు మాయామానుషధారి సర్వాంతర్యామి అయిన భగవంతుడగు రామునియందు అంతర్ముఖుడవై స్థిరపడుము. బాహ్యేంద్రియ సంబంధ దోషములకు చిత్తమును చొరనీయక రామానందమునందు నియోగింపుము. తల్లి, తండ్రి, సోదరుడు, మిత్రుడు, ఆపులు వీరం దరు దేహబుద్ధివలన ఏర్పడినవారు. ఏ సమయము నందు తన విశుద్ధ అంతకరణము ద్వారా ఆత్మదేహము కంటె వేరని తెలిసి కొంటాడో అప్పుడు ఎవడు ఎవనికి కొడుకు ఎవనికి మిత్రుడు ఎవనికి తల్లి ? ఎవనికి తండ్రి ? స్త్రీలు, గృహము శబ్దాది విషయములు, నానాప్రకార సంపత్తులు, బలము, కోశము, సేవకగణము, రాజ్యము, భూమి, పుత్రాదులు మిధ్యాకారణము వలన జన్మించినవే కాని మఱి అజ్ఞానము వలన పుట్టినవి కాన అవిక్షణ భంగురములు. అందువలన నీవు లెమ్ము. హృదయమందు ఎల్లప్పుడు రాముని స్మరించుము. రాజ్యాదులను పాలించుము. ప్రతిదినమందు ప్రారబ్ధమును అనుభ వించుము. భూతమును, భవిష్యత్తును ఆలోచించకుండా వర్తమాన ములో ఉండుము. న్యాయానుకూలమైన పనులను చేయుము. దానిచే నీకు సంసార దోషము లంటవు. రాముడు మీ అన్న రావ ణునిని ఊర్ధ్వ దేహసంబంధమైన కర్మలను యథాశాస్త్రంగా చేయ మని ఆజ్ఞాపించినాడు. ఆ విధంగా చేయుము. ఏడ్చుచున్న స్త్రీలను నివర్తించుము. వారిని లంకానగరమునకు వెంటనే పంపివేయుము.

లక్ష్మణుని వాక్యములను విని విభీషణుడు మోహశోకములను విడిచిపెట్టి రామసన్నిధికి చేరెను. ధర్మముతో కూడిన లక్ష్మణోప దేశమును లెస్సగా విచారించి రామునితో పలికెను. హే రామ !

ఈ రావణుడు పరమ దుర్మార్గుడు, అబద్ధాల నిధి పరదారలను పొందిన వాడు, అధర్మ మార్గగామి వీనికి నేను సంస్కారములను చేయ ననెను. వాని వాక్యములను విని రాముడు ప్రసన్న వదనుడయి విభీషణా! వైరము మరణాంతము వఱకు ఉండును. (మరణాంతాని వైరాని) ఇప్పుడు మన పని నెరవేరినది. వీనికి సంస్కారములను నీవు చేసితీరాలి. వీడు ఇప్పుడు నీకు ఏ విధంగా కావలసిన వాడో నాకు కూడా అట్లే కావలసిన వాడు. రామాజ్ఞను శిరసావహించి విభీషణుడు మండోదరిని సాంత్వ వాక్యముతో ఓదార్చి ధర్మ బుద్ధి, ధర్మాత్ముడు అగు విభీషణుడు సంస్కారముల కొఱకు నడుము కట్టెను. తన బంధువులను ప్రేరేపించి రావణుని చితి యందుంచి దహన సంస్కారమును తడిబట్టలతో కావించి దర్భలతో కూడిన తిలలను నీళ్లయందుంచి తిలోదకములను సమర్పించి, శిరస్సుతో నమస్కరించి ఆడవారి నందరిని లంకకు వెళ్లిపొమ్మని చెప్పెను. రావణ స్త్రీలు వెళ్లిన తరువాత విభీషణుడు రాముని ప్రక్కకు వచ్చి వినయ విధేయతలతో కూర్చొనెను. రాముడు సుగ్రీవాది మిత్రులతో వానర సైన్యముతో విజయమును లక్ష్మణు నితో కూడ అభినందించి వృత్రాసుర సంహారము తరువాత ఇంద్రుడువలె ప్రకాశించెను. మాతలి రాముని ఆజ్ఞతో రామునికి ప్రదక్షిణచేసి నమస్కరించి స్వర్గమునకు వెళ్లెను. అప్పుడు సంతుష్ట మనస్కుడైన రాముడు లక్ష్మణునితో అనెను. లక్ష్మణా! విభీషణునికి లంకారాజ్యము నాచేత ఇదివరకే ఇవ్వబడినది. ఇప్పుడు కూడా నీవు నా తరపున లంకకు వెళ్లి బ్రాహ్మణోత్తములతో విభీష ణుని లంకా రాజ్యమందు యథాశాస్త్రంగా అభిషిక్తుని చేసి, రావలెనని ఆజ్ఞాపించెను. లక్ష్మణుడు వానరులతో లంకలో ప్రవే శించి సముద్ర జలపూరితములైన సువర్ణ కలశలతో బుద్ధిమంతుడైన విభీషణునికి పట్టాభిషేకము గావించెను. ఆ తరువాత అనేకవిధము లైన కానుకలతో, లక్ష్మణుని ముందుంచుకొని పురజనులతో కూడా విభీషణుడు వచ్చి సన్మార్గవర్తి సత్కృత్య కర్తయగు రామునికి

నమస్కరించి సాష్టాంగదండ ప్రణామము కావించెను. రాముడు లంకా రాజ్యమందు విభీషణుని అభిషేకము చేసిన తరువాత తాను కృతకృత్యుడ నయితినని లక్ష్మణుడు కూడా కృతకృత్యుడయినట్లు భావించి సంతసించి సుగ్రీవుని ఆలింగనము చేసికొని రాముడు పలికెను. హే సుగ్రీవ ! నీ సహాయమువలన మహాబలుడైన రావణుడు చంపబడెను. విభీషణుని లంకయందు అభిషేకము గావించితిని. తిరిగి ప్రక్కనే వినయవిధేయతలతో కూడి నిలబడియున్న హనుమంతుని చూచి ఇట్లనెను. ఆంజనేయ ! నీవు విభీషణుని అనుమతి తీసికొని లంకలో ప్రవేశించి జానకీదేవికి రావణవధాది కృత్యములను యథాతథంగా తెలియజేయుము. జానకియొక్క ప్రతి వచనమును తిరిగి నాకు వెంటనే తెలియజేయుము అని అనెను. బుద్ధిమంతుడైన హనుమంతుడు రామాజ్ఞను శిరసావహించి, లంకను ప్రవేశించి రాక్షసులందరు నమస్కరించి సేవచేయుచుండ రావణుని మందిరములో శింశుపా వృక్షముయొక్క క్రింది స్థలములో ఉన్న సీతమ్మను చూచి వినయముతో కూడినవాడై నమస్కరించి రెండు చేతులు జోడించి నిలబడెను. అమ్మ జానకి ఆంజనేయుని చూచి పూర్వ వృత్తాంతమును సంస్మరించి రామదూతునిగా తెలిసికొని ఆనందంతో ప్రసన్న వదను రాలాయెను. అంత హనుమంతుడు దేవి శ్రీరాముడు రావణుని సకుటుంబ సపరివారంగా చంపివేసెను. విభీషణుని లంకా రాజ్యమునకు రాజుగా చేసెను. నీయొక్క క్షేమమును అడిగిరి. అంత సీతమ్మ ఆనందంతో గద్గద ధ్వనికల వాక్కులతో హనుమ ఇంతటి చక్కనిమాట చెప్పిన నిన్ను ఎట్లు సత్కరించవలెను. మూడు లోకములందు నీకు ప్రత్యుపకారము కావించుటకు అర్హతగల ఆభరణములు, రత్నములు కనబడలేదు. అంత హనుమ హే అమ్మ ! రాముడు శత్రునాశమును కావించిన పిమ్మట ప్రసన్న వదనుడయి స్వస్థచిత్తుడయి విరాజిల్లుచున్నాడు. అట్టి రాముని చూచిన నాకు రత్నసంచయము లన్నిటికంటెను దేవేంద్ర

రాజ్యముకంటెను అధికానందము వచ్చుచున్నది. అంత జానకమ్మ హనుమను జూచి సమస్త సద్గుణములు నీయందు మూర్తీభవించి యున్నవి. శ్రీరాముని చూచుటకు ఇష్టపడుచున్నాను. ఏలినవారు తొందరగా ఆజ్ఞయిస్తే, వారి అనుమతి కావలెనని చెప్పమనెను. అటులనే అని హనుమంతుడు రాములవారితో జానకీదేవి సంభాషణ మును సమగ్రంగా చెప్పెను. మఱియు హే భగవన్! ఏ సీతామాత నిమిత్తము ఈ యుద్ధము మున్నగువన్నియు ఆరంభింపబడినవో, అట్టి సమస్త కర్మలయొక్క ప్రతిఫలమైన దుఃఖ సంతప్తురాలైన మైథిలిని, దేవిని మీరు చూడవలెనని మనవి అనెను. జ్ఞానవంతులలో శ్రేష్ఠతముడగు రాముడు మాయాసీతను విడిచిపెట్టి అగ్ని యందుంచ బడిన నిజసీతను తెచ్చుటకు మనస్సులో నిర్ణయించి విభీషణుని జూచి, ఇయటకు హే రాజ! నీవు వెళ్లి సీతమ్మను నాదగ్గఱకు వెంటనే తీసికొని రావలెనని ఆజ్ఞాపించెను. స్నాతురాలు, పరిశుద్ధ వస్త్రధారిణి సమస్త భూషణాలంకృతురాలగు సీతమ్మను నాదగ్గఱకు తీసికొని రమ్మని విభీషణునితో పలికెను. ఆ మాటలను శిరసావ హించి హనుమ వెంట రాగా వృద్ధురాండ్రైన రాక్షస స్త్రీలతో సీతమ్మకు స్నానము చేయించి, సర్వాభరణ శోభితురాలునిగా అలంక రించి పల్లకియందు కూర్చొబెట్టి చక్కని రంగురంగుల గుడ్డలతోను, జెండాలతోను పల్లకిని అలంకరించి శుద్ధమైనట్టి పాగాలు, పగిడీలు ధరించిన భటులతోకూడ రక్షణకాపించి తీసికొని వెళ్లెను. సీతమ్మను చూచుటకు వానరులందరు ఒక్కుమ్మడి పెద్దకోలాహలము చేసిరి. వేత్రపాణులయిన రక్షకభటులు వారిని వారించిరి. వారు కోలా హలంతో రాముని జేరిరి. పల్లకిలో కూర్చొనియున్న జానకిని రాముడు దూరమునుండి చూచి విభీషణునితో పలికెను. విభీషణా! జానకిని చూచుటకు వానరులను ఎందుకు వారించితివి. సర్వవానర బృందముకూడ జానకిని తల్లిగా చూడనిమ్ము. మఱియు జానకి పాదచారిణియై నాదగ్గఱకు రావలెనని ఆజ్ఞాపించెను. సీతమ్మ

రామవాక్యమును విని పల్లకినుండి దిగి మెల్లగా పాదములతో నడిచి రామునిసన్నిధికి చేరినది. రాముడు కార్యార్థముకొఱకు నిర్మింపబడిన మాయాసీతను చూచి అనరాని నిందలతో మాటలాడి సీతను నొప్పించెను. అంత సీతమ్మ లక్ష్మణుని చూచి రామునికి నమ్మకము కలుగుటకొఱకున్ను లోకులకు సత్యమును తెలియపరచుటకు నీవు నాకొఱకు అగ్నిని రగులుకొల్పి ఉంచమని చెప్పెను. రాముని అభిష్టమును తెలిసికొని లక్ష్మణుడు శత్రుదమనుడయిన లక్ష్మణుడు పెద్ద ఎత్తున భారీగా కఱ్ఱలనుపేర్చి అందులో అగ్నిని ప్రవేశింప చేసెను. అగ్నిని మంటవచ్చునట్లు ప్రజ్వలింపజేసి రాముని ప్రక్కకు వచ్చి మౌనంగా నిలబడెను. ఆ తరువాత సీతమ్మ రామునికి ప్రదక్షిణచేసి భక్తిభావంతో కూడినదియై, సమస్త లోకములు, దేవతలు, రాక్షస స్త్రీలు చూచుచుండగా బ్రాహ్మణులకు, దేవతలకు నమస్కరించి రెండు చేతులు జోడించి అగ్నిని సమీపించి ఇట్లు పలికెను.

"నాయొక్క హృదయము ఏ కాలమునందు కూడా రాఘవుడైన రామునినుండి విడవబడకుండా ఉన్నట్లయితే, అప్పుడు లోక సాక్షియైన అగ్నిహోత్రుడు నన్ను అంతట రక్షించు గాక" అని పలికి సీతమ్మ అగ్నిహోత్రమునకు ప్రదక్షిణము గావించి భయము లేకుండ మండుచున్న మంటలుకల అగ్నిని ప్రవేశించెను. ఆ సమయములో సీతమ్మ మహాప్రచండమైన అగ్ని యందు ప్రవేశించుటను చూచిన సిద్ధగణులు భూతగణములు మిక్కిలి వ్యాకులత చెందిరి. మఱియు వారిలో వారు "ఏమి ఆశ్చర్యము అన్ని తెలిసికూడా శ్రీరాముడు సాక్షాత్ ఆదిలక్ష్మియైన సీతమ్మను ఏ విధంగా విడిచి పెట్టెనో" అని బాధాకరంగాను ఆశ్చర్యకరంగాను వారిలో వారను కొనిరి.

ఇట్లు యుద్ధకాండలోని ద్వాదశ సర్గ సమాప్తము.

త్రయోదశ సర్గము

## శంకరుడు భవానితో పలికెను

ఆ సమయమునందు, సహస్రాక్షుడైన ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు మహాతేజస్వియైన వృషభారూఢుడైన శంకరుడు, మునులు, సిద్ధులు, చారులు బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడైన బ్రహ్మగారు పితృగణము, ఋషిగణము, సాధ్యులు, గంధర్వులు, అప్సరసలు మఱియు నాగగణములు మఱియు ఇతర శ్రేష్ఠులైన దేవ గణములందరు శ్రేష్ఠములైన విమానములందు అధివసించి శ్రీరాముని సన్నిధికి వచ్చిరి. వారందరు రెండు చేతులను జోడించి నమస్కరించి పలికిరి. హే రామా ! నీవు సమస్త లోకములకు ఆదికర్తవు, అందరియందు సాక్షిరూపంలో ఉన్న వాడవు. విశుద్ధ విజ్ఞానస్వరూపుడవు. వసువులలో ఎనిమిదవవాడివి. రుద్రులలో శ్రీ మహాదేవుడవు. నీవే సృష్టికర్తయైన బ్రహ్మవు. చతుర్ముఖుడయిన బ్రహ్మవు. అశ్వినీ కుమారులు నీయొక్క ఉశ్వాశ నిశ్వాసములు. సూర్యుడు, చంద్రుడు నీ నేత్రములు. సమస్త లోకములకు నీవే కర్తవు. నీవే హర్తవు. నీవు నిత్య స్వరూపుడవు. ఏకుడవు ఎల్లప్పుడు ఉదయం అస్తమానం లేని సదోదితుడవు, నిత్యశుద్ధుడవు, నిత్యబుద్ధుడవు, నిత్య ముక్తుడవు, నిర్గుణుడవు, అద్వితీయుడవు. హే రామ ! నీవు నీమాయ చేత కప్పబడ్డవారలకు మనుష్యుడవుగా కనపడుతావు. కాని నీ నామ స్మరణ చేసినవారలకు నీవు ఎల్లప్పుడు చైతన్య స్వరూపుడవై కన పడెదవు. రావణాసురుడు మా తేజస్సుతోపాటు మా పదవులను కూడ అపహరించెను. నేడు అట్టి దుర్మార్గుడైన రావణుడు నీ చేతిలో చంపబడెను. ఇప్పుడు అందువలన మేము తిరిగి మా పదవులను

పొందితిమి. ఈ విధంగా దేవతలందరు రాముని కొనియాడుచుండగా సాక్షాత్ పితామహుడైన బ్రహ్మగారు మిక్కిలి వినమ్రుడై సత్య మార్గంలో ఉండే రామునితో పలికెను.

1) హే రామ ! సంపూర్ణ ప్రాణుల యొక్క స్థితికి హేతు భూతుడైన వానిని ఆత్మజ్ఞానులచేత హృదయమందు నిత్యము ధ్యానింపబడు వానిని, ఇష్టానిష్టములు లేనివానిని, ద్వంద్వ రహితుని, అన్నిటికంటె అవతల సర్వోత్కృష్టుడై యున్నవానిని, ఏకుడైన వానిని, సత్తామాత్రుని, సర్వహృదయము లందున్న వానిని సాక్షిస్వరూపుడైన విష్ణువును నేను నమస్కరించు చున్నాను.

2) బుద్ధిసహాయముచేత ప్రాణఅపాన వాయవులను హృద యము నందరికట్టి, సంశయ సమూహములను విడిచిపెట్టి, విషయ భోగములను ఛేదించి, గతమోహులైన యతీశ్వరులు ఏ పరమేశ్వరుని దర్శించుచున్నారో అట్టి రత్నకిరీటధారి సూర్యునితో సమానమైన తేజస్సుగల భగవంతుడైన రామునికి నేను నమస్కరించు చున్నాను.

3) ఎవ్వడు మాయకు అవతల నుంటాడో, లక్ష్మీపతి యెవ్వడో, అందటికీ ఆదికారకు డెవ్వడో, జగదుత్పత్తికి స్థాన మెవ్వడో, ప్రత్యక్షాది ప్రమాణములకు ఎవ్వడతీతుడో, మోహనమును నాశమొనర్పగల సమర్థుడు మునిజనులకు వందనీయుడు, యోగీశ్వ రులకు ధ్యానించదగ్గ వాడెవ్వడో, యోగమార్గమును ప్రవర్తింప చేయువానిని అంతట పరిపూర్ణు డెవ్వడో, సర్వలోకములకు ఆనంద కారకుడెవ్వడో అట్టి పరమ సుందరమూర్తికి భగవంతుడగు రామునికి నేను నమస్కరించు చున్నాను.

4) భావంలోను, అభావంలోను ప్రతీతుడైనవాడు, శంకరుడు మున్నగు దేవతలు యోగపరాయణులు ఎవని పాదకమలమందు

నిష్ఠతో పూజించెదరో, ఎవడు నిత్యుడు, నిత్యశుద్ధుడు, శుద్ధుడు, బుద్ధుడు మఱియు అనంతుడో, దానవ సమూహమునకు ఎవడు దావానలుడో అట్టి ఓంకార నాముడైన (వీరవర) రామునికి నేను ప్రణామము సల్పుచున్నాను.

5) హే రామచంద్ర ! నీవు నా ప్రభువువు. నేను కోరిన సమస్త కార్యములను, పూర్ణము చేయువాడవు, ఎవ్వడు దేశ, కాల, పాత్రాతీతుడో, నారాయణ స్వరూపుడెవ్వడో, సమస్త విశ్వమును ధరించిన వాడెవ్వడో, ఎవ్వడు భక్తిచేత పొందబడగలడో, ఎవ్వడు తన స్వరూపమును ధ్యానము చేసినంతమాత్రాన సంసార భయమును దూరము చేయునో, ఎవ్వడు యోగాభ్యాసముచేత శుద్ధమైన అంతఃకరణమందు విహారయాత్ర చేయునో వానికి నా ప్రణామములు. హే రామ ! నీవు సమస్త లోకపరంపరకు మొదటి వాడవు. మఱియు అంతము చేయువాడవు నీవే. నీవు లోకమందలి ఏ ప్రమాణముచేతను తెలియబడవు. నీవు భక్తిశ్రద్ధలుగల పురుషులచేత భజన చేయబడు చున్నావు. నీవు ఇందీవరశ్యామ సుందరుడవు. అట్టి శ్రీరామచంద్ర మూర్తికి నేను ప్రణామము చేయుచున్నాను.

6) హే లక్ష్మీపతే ! నీవు ఎప్పుడుకూడ ప్రత్యక్షాది ప్రమాణములకు కూడ అతీతుడవు. మఱియు అమానివి. మాయచేత ఆవరింపబడిన ఏ ప్రాణికూడ నిన్ను తెలిసికొనజాలదు. నీవు మహర్షులకు కూడ వందనీయుడవు. కృష్ణావతార సమయంలో బృందావన వనమందు నిన్ను సమస్త దేవతలుకు ఆరాధ్యుడవు అగు రామునిగా సేవించెదరు. శివుడు మున్నగు వారలకు స్వయంగా వందనీయుడవు. నీవు ఆనంద నిధివి అటువంటి భగవంతుడవైన రామా నీకు నమస్కారము.

7) సమస్త శాస్త్రముల, వేదములు ఎవనిని ఆనంద స్వరూపు

నిగా నిర్వికల్పునిగా మఱియు జ్ఞానస్వరూపునిగా ప్రస్తుతించినవో, ఎవడు నాచేత ప్రార్థింపబడి మానుష రూపమెత్తినాడో అట్టి మరకత మాణిక్య సంకాశుడగు మధురాపతిని (రామకృష్ణుల కభేదము) శ్రీరాముని నేను కొలుచు చున్నాను.

8) ఏ మానవుడు మనస్సులోని కోటికలను సఫలము కావాలని ఈ బ్రహ్మగారిచేత చేయబడిన బ్రహ్మజ్ఞాన నిధాయకమైన శ్యామమూర్తి భగవంతుడగు రాముని ధ్యానిస్తూ శ్రద్ధాపూర్వకంగా అద్యస్తోత్రమును పఠించెదడో అట్టి ధ్యానశీల పురుషుడు సకల పాపముల నుండి విముక్తుడు కాగలడు.

లోకగురువగు భగవంతుడైన బ్రహ్మగారి స్తోత్రమును విని లోకసాక్షియైన అగ్ని దేవుడు తన తొడయందు నిర్మలమైన అరుణ కాంతిచేత సుశోభితయైన ఎఱ్ఱని ముఖము కలదానిని సుందర భూషణములను ధరించిన విదేహపుత్రియైన జానకిని ప్రకటించి శరణాగతుల దుఃఖమును హరించు శ్రీ రఘునాధునితో ఇట్లు పలికెను. హే రఘువీరా! మొదట నీవు వనవాస సమయమందు నాకు అప్ప చెప్పిన జానకిని నీవు తిరిగి స్వీకరించుము. ఓ హరీ! రావణుని చంపు నిమిత్తము నీవు మాయాసీతను సృష్టించి రావణుని, వాని పుత్ర బాంధవ సమేతంగా నశింపజేసితివి. హే ప్రభో! నీవిట్లుచేసి సమస్త భూభారమును పోగొట్టితివి. ప్రతిబింబ రూపిణియగు మాయాసీత ఏ కార్యము కొఱకు రచింపబడినదో, ఆ కార్యమును పూర్తిచేసి అంతర్ధాన మయినది. అని అగ్నిహోత్రుడు చెప్పినదంతయు విని శ్రీరామచంద్రుడు ప్రసన్న వదనుడయి జానకమ్మను స్వీకరించెను. మఱియు లక్ష్మీపతియగు రాముడు తనయందు సర్వదా ప్రేమ తాత్పర్యము గలదియు, తన వియోగమును సహించలేని జానకమ్మను తొడయందు ఉంచుకొనెను. త్రిలోకమాతయగు ఆదిలక్ష్మితో కూడిన రామచంద్రుని చూచి, సుశోభితుడైన రామచంద్రుని చూచి దేవరాజ

యిన దేవేంద్రుడు అతిప్రసన్నుడై రెండు చేతులు జోడించి భక్తితో గద్గదమైన వాక్కుచే స్తోత్రముచేయ నారంభించెను. ఇంద్రుడు పలికెను.

1) నేను ఇందీవర శ్యాముడు, సంసార సముద్రమునకు దావానలమైనవాడు, పార్వతీదేవిచేత సర్వదా హృదయములో కొలువబడినవాడు, సంసారమునుండి దూరముచేయువాడు శంకరునకు ఆశ్రయ భూతుడునగు రాముని సేవిస్తాను.

2) సమస్త దేవతా మండలముయొక్క దుఃఖములను రూపుమాపుటకు ఏకైక ప్రభువయినవాడు, మనుష్యరూపమును ధరించినవాడు, ఆకారము లేనివాడు, స్తోత్రమునకు అర్హుడైన దేవుడు భూభారహరణ సమర్థుడు అగు ఆ పరమేశ్వరుని, పరమానంద రూపుడును భగవంతుడగు రాముని నేను భజిస్తాను.

3) శరణాగతులకు అన్ని విధములైన ఆనందముల నిచ్చువాడు, ఆనందములకు పెన్నిధియైన వాడు, ఎవ్వని నామము శరణాగతుల దుఃఖమును దూరము చేయునో, ఏ మహానుభావుడు తపస్సు వలన, యోగము వలన పెద్దపెద్ద యోగీశ్వరుల భావనలో ధ్యానింపబడు చున్నాడో, ఎవ్వడు సుగ్రీవాదులకు మిత్రుడో అట్టి మిత్రరూపుడైన భగవంతుడైన రాముని నేను కొలుచు చున్నాను.

4) ఏ పరమాత్మ యగు రాముడు భోగపరాయణులకు చాలా దూరంగా ఉంటాడో యోగపరాయణులకు చాలా దగ్గరలో ఉంటాడో, సచ్చిదానంద స్వరూపుడు జానకీదేవి యానందమనే రూపము కలవాడు అగు రాఘవేశుని నేను భజించెదను.

5) ఓ భగవంతుడవయిన రామా ! నీవు నీయొక్క అపారమైన యోగమాయ యొక్క గుణములచేత కూడినవాడవై లీలా

మానుషవేషధారివై విలసిల్లు చున్నావు. ఎవ్వని చెవ్వులు నీ యీ ఆనందకరమైన లీలాకథలచేత నిండునో, వాడు సంసారమందు నిత్యానంద రూపుడగు చున్నాడు.

6) హే మహాప్రభో! నేను గర్వంతోను, సోమపానంతోను మత్తుడనై యున్నాను. సర్వేశ్వరుడననే గర్వము, అభినివేశము చేత నీయొక్క అగ్రభాగమందు ఏమి ఏ విధమైన జ్ఞానము లేకుండా ఉన్నాను.

7) ఇప్పుడు నీ పాదపద్మ ప్రసాదమువలన ప్రత్యక్ష రామ పాదపద్మ దర్శనమువలన నేను త్రిలోకాధిపతిని అనే గర్వము నశించినది. ప్రకాశించుచున్న రత్న కేయూరములను ధరించిన వానిని పరశోభితుని భూభార రూపక రాక్షసులకు దావానలమైన వానిని.

8) శరత్ కాల చంద్రునివంటి ముఖము కలవానిని, శోభిల్లు పద్మ నేత్రములు కలవానిని, ఎవ్వని ఆద్యంతములు బోధపడవో అట్టి ప్రభువును రఘురాముని నేను కొలిచెదను.

9) ఎవ్వని శరీరము ఇంద్రనీలములు మఱియు మేఘముల యొక్క కాంతిని కలిగియున్నదో, ఎవ్వడు విరాధాది రాక్షసులను సంహరించి లోకమునందు శాంతిని స్థాపించెనో, ఎవ్వడు కిరీటాదులచే సుందరరూప ప్రకాశుడై యుండెనో, ఎవ్వడు మహాదేవుడగు శంకరునకు పెన్నిధియో రఘువంశజులకు రాజయిన రామచంద్రుని నేను భజిస్తాను.

10) ఏ రాముడు తలతల లాడుచున్న బంగారు వర్ణము గలదియు, మెరుపు తీగవంటి కాంతిపుంజముతో సమానమైన శరీర

చ్ఛాయగల జానకమ్మను తొడయందుంచుకొని, కోటి చంద్రుల కాంతిగల సింహాసనమందు విరాజిల్లుచుండెనో అట్టి దుఃఖము లేనివాడు, అలసత లేనివాడు భగవంతుడగు రాముని నేను భజిస్తాను.

ఆ తరువాత ఆకాశమందు, విమానమందు కూర్చొని భవానీ సహితుడయిన శంకరుడు పద్మపత్రనేత్రుడయిన భగవంతుడైన రామునితో ఇట్లనెను. హే రఘునందనా, నేను నిన్ను రాజ్యాభిషిక్తునిగా చూచుటకు అయోధ్యానగరమునకు పట్టాభిషేక మహోత్సవమునకు వచ్చెదను. ఇప్పుడు నీకు ఈ శరీరమును దానము చేసిన నీ తండ్రి దశరథుని చూడుము. అంత శ్రీరామచంద్రుడు తన సమీపమునందు విమానములో కూర్చొనియున్న తండ్రి దశరథుని చూచెను. చూడగానే లక్ష్మణునితోకూడా పితృచరణములకు నమస్కరించెను. శిరస్సును పాదములందుంచి నమస్కరించెను. దశరథుడు రాముని ఆలింగనము చేసికొని, శిరస్సునందు వాసన చూచి రామునితో పలికెను. హే వత్స రామా! దుఃఖసముద్రమైన సంసారము నుండి నీవలన తరింప బడితిని. అని పలికి తిరిగి కౌగిలించుకొని రామునిచేత పూజింపబడిన వాడై దశరథుడు వెళ్ళిపోయెను.

దేవరాజయిన దేవేంద్రుని, చేతులు జోడించి నమస్కరించుచున్న వానిని, శ్రీరాముడు చూచి హే దేవేంద్రా! నాకు సాయంచేసి నాకొఱకు యుద్ధములో ప్రాణములను పోగొట్టుకున్న వానరవీరులను భూమియందు పడిపోయియున్న వారలను నా అనచే అమృత వర్షమును కురిపించి జీవింపచేయుము. ఇంద్రుడటులనే అని అమృత వర్షముచేత వారినందరిని ప్రాణవంతులను చేసెను. ఏయే వానరులు యుద్ధమందు ముందు చచ్చిపోయినారో వారందరు కూడ నిద్ర నుండి లేచినవారు వలెనే లేచి పూర్వమువలె బలవంతులై రాముని సమీపమునకు వెళ్ళిరి. అమృతవర్షము పడినప్పటికి రాక్షసులు

జీవించలేదు. లేవలేదు. అంత విభీషణుడు సాష్టాంగదండ ప్రణామ మును గావించి రామునికి నివేదించెను. దేవా! నీకు నాయందు మిక్కిలి ప్రీతి కలదు. ఇప్పుడు తమరు దయచేసి సీతమ్మతో కూడ మంగళ స్నానముల నాచరింప గలరని నా విన్నపము. నీవు తమ్ముడు లక్ష్మణునితో కూడ వస్త్ర భూషణాదులను ధరించి మన మందరము అయోధ్యకు వెళ్లెదము అనెను. విభీషణుని వాక్యము లను విని రాముడు పలికెను.

సుకుమారుడు ప్రేమపాత్రుడు, జటావల్కలధారి, భగవ న్నామ పరాయణుడు, అగు భరతుడు లేకుండా నాకు మంగళ స్నానాదులు ఎట్లు పొసగును? అతడు లేకుండా అలంకరణము నాకు ఏ విధముగా గ్రాహ్యము. అందుచేత నీవు సుగ్రీవుడు మున్నగువారలకు పూజచేసి తొందరగా సత్కరించుము. ఈ వానరవీరులకు సత్కారమంటే నాకు సత్కారము జరిగినట్లే. ఇందులో సందేహము లేదు. ఆ విధంగా రాఘవునిచేత చెప్పబడ్డ వాడై విభీషణుడు యథాకామంగా, యథారుచిగా వానరుల కందఱికి వస్త్రములు, రత్నములు, ధనములు ఎవరిచ్ఛానుసారం వారికి దానము చేసెను. అప్పుడు రాముడు వానరులందరు సత్కరింపబడిన తరువాత వారికి శుభాశీస్సులిచ్చి పంపివేసెను. వానరులు రాముని దగ్గఱ సెలవుతీసికొని వెళ్లిరి. ధగధగమగు కాంతులను ఈనుష్పక విమానమును విభీషణుడు తీసికొని వచ్చి రాముని ఎదుట ఉంచెను. శ్రీరాము డా విమానమును అధిరోహించెను. లజ్జితురాలైన దేవిని సీతమ్మను తొడమీద కూర్చొబెట్టుకొని ధనుష్మంతుడైన తమ్ముడు లక్ష్మణుడు వెంట రాగా సర్వవానరులతో రాముడు పలికెను. సుగ్రీవుని, అంగదుని, విభీషణుని మఱియు ఇతర వానరులను చూచి వానరులందరి సాయముతో మీరు మిత్రకార్యమును నెరవేర్చిరి. ఇప్పుడు నేను మిమ్ములను ఆజ్ఞాపించు చున్నాను. మీరు మీ మీ

స్థలములకు వెళ్లవచ్చును. యథేచ్ఛగా వెళ్లవచ్చును. సుగ్రీవ! నీవు నమస్త సైన్యముతో తొందరగా కిష్కింధానగరమునకు వెళ్లుము. విభీషణా! నీవు నా భక్తిరతుడవై లంకలో నీ రాజ్యమును నీవు పాలించుము. లంకలో సుఖముగా నుండుము. ఇప్పుడు ఇంద్రునితో కూడిన దేవగణ మంతయు నిన్నేమి చేయజాలరు. నేనిప్పుడు నా తండ్రి దశరథుని రాజధానియగు అయోధ్యా నగరమును వెళ్లుటకు ఇష్టపడు చున్నాను.

ఈ విధంగా రాముడు పలుకగానే మహాబలులైన వానరు లందరు చేతులుజోడించి, రాక్షసుడయిన విభీషణుడు కూడ తామం దరు రామునితో కూడ అయోధ్యకు వచ్చెదమని చెప్పిరి. మఱియు అభిషిక్తుడైన రాముని చూచి కౌసల్యకు వందనమొనర్చి ఆ తరువాత రాజ్యమును స్వీకరించెదమనియు అందుకు రాముని అజ్ఞను అనుజ్ఞను ప్రార్థించిరి. రాముడు అటులనే అని సమ్మతించెను. సుగ్రీవుడు వానరులతో కలసి, విభీషణుడు మంత్రులతో కూడ హనుమంతునితో పుష్పక విమానము నెక్కిరి. అందరు విమానమును ఎక్కినతరువాత రాముని అనుజ్ఞవలన విమానము అంతరిక్షము లోనికి ఎగిరినది. ఆ తేజఃపుంజమైన విమానమందు అధివసించిన రాముడు హంస వాహనమందు అధివసించిన అపరబ్రహ్మవలె శోభించెను. సీతా లక్ష్మణ సమేతుడైన రామునిచేత అధిరోహింప బడిన పుష్పకవిమా నము కుబేరుని యానము, తపస్సువలన లభించినదియు, భాస్కర బింబమువలె శోభిల్లెను.

ఇట్లు యుద్ధకాండ యందు త్రయోదశ సర్గ సమాప్తము.

—O—

## చ తు ర్ద శ   స ర్గ ము

### అయోధ్యకు ప్రయాణం, భరద్వాజుని అతిథ్యము, భ ర తు ని తో  క ల యి క

## శంకరుడు భవానితో పలికెను

శ్రీరాముడు పుష్పకమును అదిరోహించి అమ్మ జానకితో అన్ని దిశలందుగల స్థలవిశేషములను ముచ్చటించు చుండెను. ఇదిగో త్రికూట పర్వతము. ఇదిగో లంక. ఇదిగో యుద్ధభూమి. రక్తం బురదకట్టింది. ఈ స్థలమందు వానరులకు రాక్షసులకు ఘోర యుద్ధము జరిగింది. ఇచ్చట రావణుడు నాచేత చంపబడి భూమిమీద పడిపోయెను. ఇచ్చట కుంభకర్ణుడు పడిపోయినచోటు ఇంద్రజిత్తు కూడ ఇచ్చటనే మరణించెను. ఇదిగో చూడు. నేను శతయోజన విస్తీర్ణమైన సముద్రమునందు వారధిని కట్టితిని. దీనిని సేతుబంధ మని ప్రఖ్యాత తీర్థమంటారు, మూడు లోకములందిది ప్రసిద్ధము. ఇది చూడగానే సమస్త పాపములు నాశనమగును. ఇచ్చట రామే శ్వరలింగము (శంభువు) నాచేత ప్రతిష్ఠకావింప బడినది. ఇచ్చట విభీషణుడు నానుండి శరణు పొందెను. చిత్రమైన అడవులు కలది. ఇది సుగ్రీవుని నగరము కిష్కింధ. కిష్కింధ రాగానే సుగ్రీవుడు తార మున్నగు వానర స్త్రీలను రామ సందర్శనార్థము తెప్పించెను. సీతకు ప్రియమును కాంక్షించు తార మున్నగువారితో సహా తిరిగి విమానము బయలుదేరినది. ఇది ఋష్యమూక పర్వతము. ఇచ్చటనే వాలి నాచేత చంపబడినాడు. ఇదియే పంచవటి ఇచ్చట నేను రాక్షసు లను చంపివేసినాను. అగస్త్యుని యొక్కయు, సుతీక్ష్ణుని యొక్కయు

ఆశ్రమములివి. వీనిని చూడుము శుభము కలుగును. వీరంతా తాపసులు. ఇది చిత్రకూట పర్వతము. పర్వతములలో శ్రేష్ఠమైనది. ఇచ్చట కేకేయీ పుత్రుడు భరతుడు నన్ను తిరిగి రాజ్యము తీసికొమ్మని చెప్పినచోటు యమునానది యొడ్డునందున్నది. ఇది భరద్వాజాశ్రమము. దీనిని చూడుము. లోకపావనియైన గంగ యిది. భాగీరథి ఇది సరయూనది. సూర్యవంశపు రాజులు ఇచ్చట యజ్ఞములాచరించి యజ్ఞస్థంభములను కట్టియుంటిరి. ఇదిగో ఇది అయోధ్యానగరము. హే భామిని! దీనికి నమస్కారం చేయుము. ఈవిధంగా క్రమంగా శ్రీహరియైన రాముడు భరద్వాజాశ్రమమును చేరెను. ఇప్పటికి పదునాలుగు సంవత్సరములు గడిచినవి. పంచమి తిథి యందు రఘునందనుడు భరద్వాజ మునిని దర్శించి వందనచేసెను. లక్ష్మణునితోకూడ పూజచేసెను. ఆసీనుడైన మునిని చూచి వినయముతో రాముడు పలికెను. హే మునివర! భరతుడు శత్రుఘ్నునితో సహా క్షేమంగా ఉన్నట్లు వార్తలు వింటున్నావా? అయోధ్య సుభిక్షంగా ఉందా? తల్లులందరు జీవించి యున్నారా? అని అడిగెను. అంత భరద్వాజుడు హృష్టమనస్కుడై రామా! మీయొక్క సర్వపరివారము ఇచ్చట క్షేమంగా ఉన్నారు. మహామనీషియైన భరతుడు కందమూలములను పండ్లను ఆహారముగా కలవాడయి జటావల్కలములను ధరించి సమస్త రాజ్యమును పాదుకలందు అప్పచెప్పి నీ రాకకు ఎదురుచూచు చున్నాడు. దండకారణ్యమందు నీచేత చేయబడిన కర్మలన్నియు, సీతాపహరణ, రాక్షస వినాశము. అంతా తపస్సు వలన నీ అనుగ్రహము వలన తెలిసికొంటిని. "ఆదిమధ్యాంత రహితుడవైన బ్రహ్మవు నీవు. నీవు సమస్త భూతములను సృష్టించితివి. నీవు అన్నిటికంటె ముందు నీటిని సృజించి అందులో శయనించితివి. అందువలన నీవు నారాయణుడవయితివి. విశ్వాత్మా! రామా! నీవు సమస్త మానవుల అంతరాత్మవు లోకపితామహుడైన బ్రహ్మ నీ నాభికమలమునుండి పుట్టి

నాడు. అందువలన నీవు జగత్తుల కధిపతివి. సర్వలోకములచేత నమస్కరింపబడిన విష్ణువు నీవు. జానకి లక్ష్మీదేవి లక్ష్మణుడు శేషుడు. దీనినంతను నీవు నీ మాయచేత ఆత్మయందు సృజించు చున్నావు. అయినను ఆకాశమువలె దేనివలనను లిప్తుడవు కావు. నీవు నీయొక్క చిచ్ఛక్తిచేత అందరిలోన సాక్షిభూతుడవై యున్నావు. హే రఘునందనా ! నీవు సర్వప్రాణికోటి లోపలను బయట కూడ వ్యాపించి యున్నావు. నీవు పూర్ణుడవు. కాని మూఢులను పరిచ్ఛిన్నుడువలె కనపడెదవు. ఓ జగత్పతీ నీవే జగత్తువు. జగత్తుకు ఆధారము నీవే. జగత్తును సృష్టించినవాడవు కూడ నీవే. జగత్తును పరిపాలించిన వాడవు నీవే. సర్వభూతములకు కాలరూపములో భోక్తవు అన్న రూపంలో భోజ్యుడవు. విన్నది, కనపడినది, స్మరింపబడినది తత్సర్వము నీవే. నిన్ను వినా ఇంకొకటి లేదు. మాయ, లోకములను, త్రిగుణముల చేతను అహంకారము చేతను సృజించు చున్నది. ఆ మాయ నీ శక్తివలన ప్రేరితమైనది. అందువలన నీయందు ఈ సృష్టిరచనను ఆరోపించు చున్నారు. ఏ విధంగా అయస్కాంతము యొక్క సమీపమందలి స్థితివలన ఇనుము మున్నగు జడపదార్థములు చలించుచున్నవో ఆ ప్రకారమే నీ దృష్టి పడేనరికి మాయ సమస్త జగత్తును సృష్టించు చున్నది. ప్రపంచ రక్షణకొఱకు నీవు దేహము లేనివాడవయ్యు రెండు దేహములు కలిగియున్నావు. నీయొక్క స్థూలశరీరము విరాట్టనియు, సూక్ష్మశరీరము సూత్ర అనియు పిలువబడు చున్నవి. హే రఘు రామ ! నీ విరాట్ స్వరూపమునుండి వేలాది అవతారములు పుట్టు చున్నవి. తమ కార్యమును సమాప్తిచేసి అందులోనే లీనమగు చున్నవి. హే రామ ! ఈ ప్రపంచంలో నీ అవతార కథలను అనన్య చిత్తులై గానము చేయుచుంటిరో వినుచుంటిని, వారికి ముక్తి అవశ్యము కలుగుచున్నది. నీవు పూర్వము బ్రహ్మగారి ప్రార్థనను అంగీకరించి భూభారహరణమునకు దశరథరాముడవై ఉదయించి

నావు. దుష్కరమైన దేవకార్యమును నీవు శేషములేకుండ నిర్వర్తించి నావు. కొన్ని వేల సంవత్సరాలు మానుషశరీరమును ధరించి ఉభయలోకములకు కళ్యాణములను ఒనగూర్చు మహత్కార్యము లను చేసి అన్నిలోకములను నీయొక్క కీర్తిచేత నింపెదవు. నీ కృత్యములు పాపములను హరించును. జగత్తులో కీర్తిని కలిగించును. హే జగన్నాథ రామ ! ఒక కోటిక నాకున్నది. ఈ దినమునందు నా యింటికి విచ్చేసి పావనము చేయుము. ఇచ్చట భోజనముచేసి విశ్రాంతి గైకొని రేపటి దినమందు రాజధాని అయోధ్యకు వెళ్లి గలవు అని భరద్వాజుడు పలికెను. రామచంద్రుడు అటులనే అంటూ ఆ ఆశ్రమంలో పవిత్ర భూభాగంలో సపరివారుడై ఉండెను. భరద్వాజుడు సీతారామ లక్ష్మణులను సత్కరించి పూజలు సలిపి గౌరవించెను. అంత రాముడు మనస్సులో ఒక మాహూర్తమును పెట్టుకొని హనుమంతుని జూచి, వెంటనే అయోధ్యకు వెళ్లమని నుడివెను. అయోధ్యలో రాజమందిరములో అందరి క్షేమమును తెలిసికొని అటుపైని శృంగవేర పురమునకు వెళ్లి తన మిత్రుడైన గుహునితో జానకీలక్ష్మణులతో శ్రీరాముడు వచ్చినట్లు చెప్పమని చెప్పెను. ఆ తరువాత నంది గ్రామమునకు వెళ్లి మా తమ్ముడు భరతుని జూచి సీతయొక్కయు, నాయొక్కయు క్షేమమును తెలియ చేయుము. మఱియు సీతాపహరణము నుండి రావణవధ వఱకు జరిగిన వృత్తాంతములను యథాక్రమంగా భరతునికి చెప్పుము. శత్రువర్గము నంతటిని హతమార్చి, సఫలావతారుడై భార్య, లక్ష్మణు లతో సుఖంగా, భల్లూకములతో వానరములతో కూడి వచ్చుచున్నా డని భరతునికి చెప్పి, అచ్చట భరతుని సంపూర్ణ వృత్తాంతమును తెలిసికొని అతిత్వరలో నా సన్నిధికి రావలెను. అటులనే అని హనుమంతుడు మనుష్యశరీరమును ధరించి వాయువేగంతో నంది గ్రామమునకు వెళ్లెను. శ్రేష్ఠ సర్పగ్రహణమునకు గరుత్మంతుడు వేగమును చూపునట్లు అతిత్వరితగతిని వెళ్లెను. శృంగవేరపురమును

చేరి గుహునితో సీతారాముల సుఖ ఆగమన వృత్తాంతమును తెలియ జేసెను. మఱియు గుహుని క్షేమమును రాము డరసినట్లు తెలియ జేసెను. భరద్వాజాశ్రమము నుండి రాముడు బయలుదేరెను. నీవు రాముని చూచుటకు అర్హుడవై యున్నావు. అని గుహునికి వార్త లందించి వాయువేగంతో రామతీర్థమైన అయోధ్యను సరయూ నదిని చూచి నందిగ్రామమునకు చనెను. అయోధ్య నుండి ఒక కోసెడు దూరములో నంది గ్రామము కలదు. అచ్చట భరతుని చూచెను. భరతుడు కృశించిన దేహము, దైన్యము గలవాక్కు, ఆశ్రమవాసి ఒంటినిండ బురద కశ్మలములతో కూడిన అంగములు, నారబట్టలు, ఫలములు కందమూలములు ఆహారము, రామచింతా పరాయణత రామపాదుకలను మోసి భూమిని పాలించుటకు కాషాయాంబరము లతో కూడిన మంత్రులు పౌరశ్రేష్ఠులు కలవాడు సాక్షాత్ మూర్తీ భవించిన ధర్మము శరీరముగ కలవాడు కనపడెను. హనుమంతుడు అంజలిఘటించి భరతునితో పలికెను. హే భరతా! ఏ దండకారణ్య వాసియైన భగవంతుడగు రాముని గూర్చి నీవు చింతాపరుడగు చున్నావో, ఏ రాముని గూర్చి నీ వింతతాపమును సహించి యున్నావో అకాకుత్‌స్థనందన రాముడు నీయొక్క క్షేమమును అడిగినాడు. హే దేవ! నీవీ దారుణమైన శోకమును విడిచిపెట్టు. నీకొఱకు ఒక చక్కని నీకు అత్యంత ప్రియమైన కథను చెప్పెదను విను. నీవిప్పుడే ముహూర్తమునందే నీ సోదరుడు రాముని కలిసెదవు. యుద్ధంలో రాముడు రావణుని చంపివేసి, సీతమ్మను పొంది సఫల మనోరథుడయి, సీతాలక్ష్మణ సమేతుడై విచ్చేయు చున్నాడు. అని చెప్పెను. అంత భరతు డానందముతో మూర్ఛను పొంది భూమిమీద అస్వస్థుడై పడిపోయెను. తిరిగి ముహూర్త భాగంలో లేచి హనుమంతుని ఆలింగనము చేసికొని ఆనందబాష్ప ములతో అంజనేయుని తడిపెను. మఱియు భరతుడు పలికెను. స్వామీ! మీరు దేవుడా లేకా మనుష్యుడా? ఇటువంటి ప్రియ

తమమైన వార్తను చెప్పి దయతో విచ్చేసినారు. హే సాధు పుంగవా ! ఇట్టి ప్రియసమాచారమును చెప్పిన నీకు, ఒక లక్ష ఆవులను, అతిసుందరమైన ఒక వంద గ్రామములను, మఱియు సర్వ ఆభరణములతో కూడిన పరమసుందరులైన పదునారు మంది కన్యలను ఇచ్చుచున్నాను. ఇట్లని తిరిగి భరతుడు హనుమతో పలికెను. ఈ దినమున నేను భయంకార వనవాస చింతాకులమైన అనేక వర్షముల వాసమును దాటిన పిమ్మట నా స్వామి, నా ప్రభువు అయిన శ్రీరాముని గూర్చి ప్రియమైన సమాచారమును వింటిని. లోకంలో కళ్యాణ పరమైన గాథ ఒకటి ఉంది. బ్రతికియుండిన సుఖములుబడయవచ్చు. "ఏతి జీవంత మానందో నరం వర్షశతాదపి" బ్రతికియుంటే నూరేండ్లు తరువాత కూడా ఆనందమును పొందగలడని, నిజంగా ఎంత చక్కని మాట యిది. అని భరతుడు పలికి తిరిగి హనుమంతుని ప్రశ్నించెను, రఘురామునికి కోతులకు సమాగమము ఎటులుకలిగినది. దానివలన నీ మాటలను పూర్తిగా నేను నమ్ముతాను. అనెను. రామచరితమును సమగ్రంగా భరతునికి యథాక్రమంగా నివేదించెను. పరమానందకరమైన రామకథను విని భరతుడు పరమానందమును పొందెను. శత్రుఘ్నుని పిలిచి హే సోదరా ! నగరములో ఉన్న దేవాలయములను పండిత జనులందరు విచ్చేసి నానావిధములయిన బలులను పూజలను నిర్వర్తించ వలెను. సూతులు, వైతాళికులు, వంది మాగధులు, ప్రసిద్ధులైన వారవనితలు వేలాది సంఖ్యలో ఇప్పుడే గుంపుగా నగరం వెనుకల అనన్యులై యుందురు గాక. ఇవి గాకుండ, రాజ మందిరమాతలు, మంత్రి గణములు, రథాశ్వగజపదాతి సేనలు, బ్రాహ్మణ సమూహములు, పౌరులు ఇచ్చుటకు వచ్చిన సమస్త రాజలోకము శ్రీరాముని ముఖచంద్రుని దర్శించుటకు పట్టణము నుండి బయటకు వెళ్లి వేచియుందురు గాక. శత్రుఘ్నుడు సమస్త రాజభటులకు ఆజ్ఞాపించి నగరమును శోభాయమానంగా అలంకరింప

చేసెను. మంచిముత్యాల తోరణాలు, మామిడి తోరణాలు, పతాకాలు పట్టణంలోని ప్రతయింట కట్టబడినవి. రామదర్శనము నిమిత్తము వేలాదిమంది పౌరజనులు త్వ్యాలో గుంపుగా బయలుదేరిరి. ఒక లక్ష గుర్రములు, పదివేల ఏనుగులు. బంగారు త్రాళ్లతో కట్టబడిన పదివేల రథములు, నాటియు ఐశ్వర్యసూచకములగు వేలాది వస్తువులను స్వీకరించి ఊరుముందు నిలబడిరి. వారివెనుక పల్లకీలతో రాజస్త్రీలు వెళ్లిరి. భరతుడు పాదుకలను శిరస్సు నందుంచుకొని అంజలి ఘటించి శత్రుఘ్న సహితుడై పాదచారియై నడచెను. ఆ సమయములో దూరమునుండి భరతుడు పుష్పక విమానమును చూచెను. ఆ విమానము, బ్రహ్మగారి ఊహచే నిర్మించ బడినది. చంద్రసమానమైన తెలుపుకాంతి గలది. సూర్య సమానమైన తేజస్సు గలది. అంత ఆంజనేయుడు చూడు భరతా ! ఈ విమానంలో వీర వర్యులైన రామలక్ష్మణులు, అమ్మ వైదేహి, వానర రాజయిన సుగ్రీవుడు, మంత్రులు విభీషణుడు కనపడు చున్నారు. చూడండి. జనులారా ! అని అనెను. అప్పుడు ఆనందముతో కూడిన కోలాహల ధ్వని మిన్నుముట్టెను. స్త్రీలు, బాలులు, యువకులు, వృద్ధులు కూడా "ఇదిగో రాముడు, వీడే రాముడు, అదిగో వైదేహి ప్రక్కన కూర్చొని యున్నది". అంటూ దిక్కులు పిక్కటిల్లునట్లు శబ్దము చేసిరి. రథములనుండి, గుర్రములనుండి, ఏనుగులనుండి భటులు భూమిపైకి దిగిరి. ఆకాశంమీద చంద్రుని చూచినట్లు విమానం మీద ఉన్న రాముని జనులంతా చూచిరి. రెండు చేతులు జోడించి భరతుడు ఆనందమగ్నుడై శ్రీరాముని పాదములకు నమస్కరించెను. మేరు పర్వతముమీది సూర్యనారాయణమూర్తి వలె రాముడు ప్రకాశించెను. అప్పుడు రాముని అజ్ఞవలన విమానము భూమికి దిగెను. అప్పుడు రాముడు భరత శత్రుఘ్నులను విమానమందు ఎక్కించెను. రామునిపొందిన భరతుడు తిరిగి ఆనందంతో రామునికి నమస్కరించెను. కొన్ని సంవత్సరాల తరువాత కనబడిన భరతుని రాముడు

విమానము నుండి దించి అనుగ్రహంతో తన తొడమీద కూర్చో పెట్టుకొని ఆలింగనము కావించెను. భరతుడు లక్ష్మణుని నమస్కరించి అమ్మ సీతమ్మకు నామగోత్రములతో అభివాదన చేసెను. తిరిగి నమస్కరించెను. ఆ తరువాత భరతుడు, సుగ్రీవుని, అంగదుని, జాంబవంతుని, మైందుని, ద్వివిదుని, నీలుని, ఋషభుని, సుషేణునిని, నలుని, గవాక్షుని, గంధమాదనుని శరభుని, పనసుని కూడా హృదయమున కత్తుకొని ఆనందము నొందెను. అప్పుడు వానరులందరు మనుష్యరూపములను ధరించి భరతుని క్షేమవార్తల నడిగిరి. భరతుడు సుగ్రీవుని తిరిగి హృదయమున కత్తుకొని ప్రేమపూర్వకంగా పలికెను. హే సుగ్రీవా ! నీ సహాయమువలన శ్రీరామచంద్రునికి విజయము ప్రాప్తించినది. రావణుడు చంపబడెను. అందువలన మా నలుగురి అన్నదమ్ములకు నీవు ఐదవ అన్నదమ్ముడవు. 'త్వమస్మాకం చతుర్ణాంతు భ్రాతాసుగ్రీవ పంచమః' అనంతరము శత్రుఘ్నుడు రామలక్ష్మణులకు ప్రణమిల్లి వినయముట్టిపడట్లు సీతమ్మ పాదములకు నమస్కరించెను. రాముడు వర్ణరహిత మైనదియు, దుఃఖార్తయగు తల్లి కౌసల్యకు నమస్కరించి పాదములకు అభివందనము చేసెను. కేకేయి, సుమిత్ర మఱియు నితర తల్లులకు నమస్కరించెను. అంత భరతుడు రామపాదములకు అనేక విధములు పూజచేసి పాదుకలను అతని పాదములకు తొడిగెను. మహాభక్తి తాత్పర్యములతో పలికెను. హే ప్రభో ! నీవు నాకు సురక్షితంగా ఉంచమని అప్పచెప్పిన నీ రాజ్యమును నీకు తిరిగి అప్పచెప్పు చున్నాను. ఇప్పుడు నా జన్మ సఫలమైనది. నా మనోరథము పండినది. "అద్యమే సఫలం జన్మ ఫలితోమే మనోరథః" మీరు ఇప్పుడు అయోధ్యకు వచ్చినట్లే భావించు చున్నాను. హే జగన్నాథ ! నీయొక్క ప్రతాపముచేత, నేను, అన్నాగారములను కోశాగారములను, సేనాగారములను పదిరెట్లు అధికము గావించినాను. నీయొక్క

పురమును నీవు స్వయంగా పాలన చేయుము. ఇట్లు పలుకుచున్న భరతుని చూచి కపీశ్వరులందరు భరతుని కొనియాడిరి. కళ్లనిండా ఆనంద బాష్పములతో నీరును ప్రవహింప జేసిరి. అప్పుడు శ్రీరామ చంద్రుడు మిక్కిలి ఆనందముతో తొడమీద భరతుని కూర్చోబెట్టు కొని అదే విమానములో అందరితో కూడ భరతుని ఆశ్రమమునకు చనెను. విమానము భూమిమీదకు దిగినది. అప్పుడు రాముడు విమానముతో పలికెను. 'వెళ్లు పుష్పకమా ! నేను ఆజ్ఞ యిచ్చు చున్నాను. ఇప్పుడు ధనపతి కుబేరుని అనుసరించి అతనిని మోసియు చుండుము. ఆ తరువాత ఇంద్రుడు బృహస్పతిని వందనచేయు రీతిలో శ్రీరాముడు వశిష్టుని చరణకమలములకు ప్రణమిల్లి అమూల్య మైన ఆసనమును వశిష్టునికి ఇచ్చి తాను కూడ అతనితో కూడ కూర్చొనెను.

ఇట్లు యుద్ధకాండ యందు చతుర్దశ సర్గ సమాప్తము.

-:●:-

## పంచదశ సర్గము

## శ్రీ రామ రాజ్యాభిషేకము

# శంకరుడు భవానితో పలికెను

ఆ సమయంలో భరతుడు శిరస్సు నందంజలి ఘటించి జ్యేష్ఠ భ్రాతయైన రామునితో పలికెను. హే రామ ! నీవు నాకు రాజ్యము నిచ్చితివి. దానివలన మా అమ్మ సత్కరించబడినది. ఇప్పుడు నేను, నీవేవిధంగా ఇదివరకు నాకు రాజ్యము నిచ్చితివో, అదే రాజ్యమును ఇప్పుడు తిరిగి నేను నీకు ఆ విధంగా అప్పచెప్పు చున్నాను. అని పలికి పాదములకు సాష్టాంగదండ ప్రణామమును ఆచరించి కేకేయితో వశిష్టునితో సహా భరతుడు అనేక విధముల ప్రార్థించెను. అటులనే అని ప్రభువయిన రాముడు భరతుని నుండి రాజ్యమును స్వీకరించెను. మాయచేత నరచేష్టను నటించి ఒక ప్రత్యేక మానవుడువలె భరతుని నుండి రాజ్యమును స్వీకరించెను. ఏ పరమాత్మ స్వారాజ్యాను భవమును ఎల్లప్పుడు స్వీకరించి ఆనందించునో, అట్టి సచ్చిదానంద స్వరూపుడు అగు జగత్ ప్రభువునకు మానుషరాజ్యమందు కోరిక ఉండునా ? ఉండదు. ఎవ్వని భ్రుకుటివిలాసచేత మూడు లోకములు క్షణములో నశించునో, ఎవని అనుగ్రహమాత్రము చేత దేవేంద్ర సంపదలు సమకూరునో, ఎవ్వని లీలచేత ఈ సమస్త సృష్టి కావింప బడినదో అటువంటి లక్ష్మీపతికి అయోధ్యాధిపత్యమేపాటి. అయినప్పటికి తన భక్తులయొక్క కోరికలను పూర్ణము చేయుటకు ఎల్లప్పుడు రాముడు ఏదో ఒక నాటకమును ఈ మాయా మానవదేహంతో చేస్తూ ఉంటాడు.

అంత శత్రుఘ్నుని ఆజ్ఞచేత నిపుణుడైన మంగలి వచ్చి రామునికి స్నానక కర్మకొఱకు ఆమంత్రితు డాయెను. పట్టాభిషేకనిమిత్తము అన్ని సంభారములు చేయబడినవి. సామగ్రి అంతయు సమకూర్చ బడినది. భరతుడు ముందు ఆ తరువాత లక్ష్మణుడు మంగళ స్నానములను చేసిరి. ఆ తరువాత వానరరాజు సుగ్రీవుడు, రాక్షసరాజు విభీషణుడు స్నానము చేసిరి. శ్రీరాముడు జటాజూటములు క్షవరము అయిన తరువాత స్నానము చేసెను. చిత్రవిచిత్ర వర్ణములుగల మాలలను, అంగరాగములను, విలువయిన పట్టుబట్టలు ధరించి తన కాంతిచేత విరాజిల్లు చుండెను. మహామతియైన లక్ష్మణుడు మఱియు భరతుడు రామునికి అలంకరించిరి. రాజమహాలులోని అంతఃపురంలోని స్త్రీలు సీతమ్మను అలంకరించిరి. అనేకవిధములైన ఆభరణములతోను, పట్టువస్త్రములతోను అలంకరించిరి. పుత్రవత్సలఅయిన కేకేయి సమస్త వానర స్త్రీలకు అలంకారము గావించెను.

ఆ తరువాత శత్రుఘ్నుని ఆజ్ఞచేత సుమంత్రుడు సూర్య సమాన తేజస్సుగల రథమును తెచ్చియుంచెను. సత్యధర్మ పరాయణుడైన రాముడు ఆ రథముపై నధివసించెను. ఆ సమయంలో సుగ్రీవుడు, అంగదుడు, హనుమంతుడు మఱియు విభీషణుడు మున్నగు ప్రధానులు స్నానాదులుచేసి శుభ్రవస్త్రధారులై ఆభరణాదులచే శోభించిరి. రథములు, గుర్రములు, ఏనుగులు మున్నగు వాహనములందు ఎక్కిరి. శ్రీరామచంద్రుని ముందు కొంతమంది వెనుక కొంతమంది ఉండిరి. సుగ్రీవుని భార్యలు మఱియు సీతమ్మ సుందరమైన పల్లకీలపై కూర్చొని విస్తారమైన అయోధ్యా నగరమునకు వెడలిరి. అప్పుడు తేజస్వంతుడైన భరతుడు రథసారథి అయెను. ఇంద్రుడు దేవతలతో కూడి పయనించుమాదిరి శ్రీరాముడు హరిత వర్ణముగల గుర్రముల రథమందు బయలుదేరెను. భరతుడు సారథి

కాగా శత్రుఘ్నుడు రత్నఖచిత దండములుగల శ్వేతచ్ఛత్రములను పట్టుకొనెను. లక్ష్మణుడు చామరములను ధరించెను. చక్కని మెరసిపోతున్న దుస్తులను ధరించి సుగ్రీవ, విభీషణులు చంద్ర సమాన కాంతితో విరాజిల్లిరి. ఆ సమయములో భగవంతుడయిన రాముని స్తోత్రము చేయుచు దేవతలు సిద్ధులు, ఋషులు అతిమధుర మైన నాదమును వినిపించిరి. వానరులందరు మనుష్య రూపధారులై భేరీశంఖ నినాదములతోను, మద్దిల్లు, డప్పులు మున్నగువాని శబ్దములచేత బయలుదేరిరి. రఘుతిలకుడైన రాముడు షహనాయి మున్నగు మంగళ వాయిద్యముల ధ్వనిలో సుందరంగా అలంక రింపబడిన అయోధ్యా నగరమును చూచెను. పురవాసు లందరు వచ్చుచున్న రాముని బారులుతీర్చి చూచుచుండిరి. మహాభాగులైన అయోధ్యా పురవాసులందరు, దూర్వాదలములు శ్యామవర్ణముగల వాడు, అతి విలువయిన కిరీటమును ధరించినవాడు నవరత్న ఖచిత అభరణములచేత అలంకరింప బడినవాడు, కమలంతో సమానమైన ఇంచు కొంత ఎరుపు జీరగల విశాల నేత్రములు కలవాడు, చిత్ర విచిత్ర రత్నములచేత విభూషితుడు నక్షత్రములతో సమాన కాంతి గల పట్టుబట్టలను ధరించినవాడు, విశాలమైన వక్షస్థలము కలవాడు, అతివిలువయిన మంచి ముత్యాలహారములతో, సుశోభితుడు సుగ్రీ వాది శాంతస్వభావులచేత సేవితుడు, సూర్యసమాన తేజస్వి, శరీరము నందంతటను కర్పూరము, చందనములచేత పూయబడినవాడు కల్ప వృక్షముయొక్క పువ్వుల మాలలచేత విరాజితుడును అగు శ్రీరామ మూర్తిని దర్శించి అత్యంతానంద పారవశ్యత నొందిరి. స్త్రీలందరు భగవంతుడగు రాముడు వచ్చినట్లు వినిన వెంటనే వారి ముఖకాంతి ఉజ్జ్వలితమైనది. గృహ కార్యము లందున్న స్త్రీలు వానిని వదిలిపెట్టి బాగా అలంకరించుకొని ప్రాసాదాగ్రములకు (మేడల మీది భాగాలకు) చనిరి. సమస్త నేత్రములకు పండుగయిన శ్రీరామమూర్తిని చూచి నవ్వుతో కూడిన ముఖముకలవారై స్త్రీలం

దరు శ్రీరామునిపై పుష్పవర్షమును కురిపించిరి. తిరిగి మనస్సులలో కండ్లకు, మనస్సుకు కూడ ఆనంద రసాన్ని పంచిపెట్టిన దివ్య సుందరమూర్తిని, రామమూర్తిని మనసారా ఆలింగన చేసికొన్నట్లు ఆనందించిరి.

రెండవ బ్రహ్మగారివలె శ్రీరాముడు సాక్షాత్ విష్ణుస్వరూపుడు మందహాసకలిత మనోహర దృష్టిచే ప్రజల నందఱిని చూచుచు మెల్లమెల్లగా ఇంద్రభవనముతో సమానమయిన తన తండ్రిగారి రాజమహాలునకు వెళ్లెను. రాజమహాలు లోనికి ప్రవేశించి శ్రీరామ చంద్రుడు అతి ప్రసన్నచిత్తముతో తల్లి కౌసల్య పాదములకు నమస్కరించెను. రఘువంశ శిరోమణియైన రాముడు తరువాత రాజ మాతలందఱికి భక్తిపూర్వకంగా నమస్కరించెను. అంత రాముడు సత్యసంధుడైన రాముడు భరతునితో పలికెను. హే భరత! నా యొక్క సర్వసంపదలతో కూడిన శ్రేష్ఠప్రాసాదమును నా మిత్రుడు వానరరాజు అయిన సుగ్రీవునకు ఇమ్ము. ఆ తరువాత అందఱికి కూడ సర్వసదుపాయములతో కూడిన గృహములను నివాసమునకు ఇవ్వవలెను. శ్రీరాముని ఆనప్రకారము భరతుడట్లే చేసెను. మఱియు భరతుడు సుగ్రీవునితో పలికెను. శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేకము కొఱకు చతుస్సముద్రముల నుండి పవిత్ర జలము లను తెచ్చుటకు వెంటనే తొందరగా వెళ్లే సమర్థతగల వారిని, నమ్మకమైన దూతలను పంపవలసినదిగా చెప్పెను. సుగ్రీవుడు, జాంబవంతుడు, హనుమంతుడు, అంగదుడు, సుషేణుడు అను నలుగు రివి పంపెను. వారలు వాయువేగముతో బంగారు కలశలందు సముద్ర జలములను పూరించి తిరిగి మహావేగంతో తీసుకొని వచ్చిరి. శత్రుఘ్నుడు మంత్రులతో కూడి వశిష్టునకు తీర్థజలములను అప్ప చెప్పెను. ఆ తరువాత బ్రాహ్మణులతో వయోవృద్ధులతో కూడిన వశిష్టుడు, సీతమ్మతో కూడిన శ్రీరాముని రత్నసింహాసన మందు కూర్చొపెట్టెను.

వశిష్ఠుడు, వామదేవుడు, జాబాలి, గౌతముడు, వాల్మీకి మున్నగు మహర్షులందర్లు మిక్కిలి ప్రసన్న చిత్తులయి దర్భలు, తులసిదళములు పవిత్ర పరిమళమయ జలములతో శ్రీరామునికి అభిషేకము గావించిరి. మఱియు ఋత్విక్కులు శ్రేష్ఠబ్రాహ్మణులు కన్యకలు, మంత్రులు, మహర్షులు ఆకాశమందలి దేవతలు గణము లతోకూడిన నలుగురు లోకపాలకులు స్తోత్రముచేయుచు సర్వౌషధ రసములతో శ్రీరామునికి అభిషేకము చేసిరి. ఏ విధంగా అంటే వసువులు ఇంద్రునికి చేసినట్లు చేసిరి.

ఆ సమయములో భగవంతుడయిన రామునికి శత్రుఘ్నుడు శ్వేతచ్ఛత్రము పట్టెను. సుగ్రీవుడు, విభీషణుడు తెల్లని చామరము లను ధరించిరి. ఇంద్రుని ప్రేరణచేత వాయువు బంగారు మాలను ఇచ్చెను. ఇంద్రుడు స్వయంగా సర్వరత్న పరిభూషితమైన ఒక హారము నిచ్చెను. అనంతరము దేవతలు, గంధర్వులు గానమును ఆరంభించిరి. అప్సరస్త్రీలు నాట్యమాడిరి. దేవదుందుభులు మ్రోగి నవి. ఆకాశము నుండి పుష్పవర్షము కురిసినది.

నూతనమైన దూర్వాదలములవలె శ్యామవర్ణము కలవాడు, రవికోటికాంతిగల కిరీటముచేత విరాజితుడు, కోటిమన్మథాకారుడు, పీతాంబర సమావృతుడు, దివ్యాంబరముల చేతను, దివ్యాభరణముల చేతను కూడిన వాడును, దివ్యశ్రీ చందన లేపనము కలవాడు, సహస్ర సూర్యసంకాశుడు, రెండుభుజములు కలవాడు, రఘునందన నుడు, బంగారు తీగెవలె నున్న సీతమ్మను సర్వాభరణభూషితయైన దియు, ఎర్ర కలువలను చేతిలో ధరించినట్టియు, విరాజమానయై వెలుగుచున్న సీతమ్మను ఎడమ తొడయందు ధరించినట్టి శ్రీరాముని జూచి సర్వాతి శయలావణ్యము గల శ్రీరాముని జూచి, సర్వదేవ గణములతో కూడిన శంకరుడు రఘురాముని స్తోత్రము చేసెను. శ్రీ మహాదేవుడు స్తోత్రము చేసెను.

## టీక

1) అత్యంత కాంతి గలవాడు, సింహాసనము నందున్నవాడు, కిరీటము, హారము, అంగదములు మున్నగు భూషణముల చేత భూషితుడు, నీలోత్పలదళ శ్యాముడు, కోమలుడు శక్తియగు సీతమ్మతో కూడినవానికి రామునికి నమస్కారము.

2) నీవు ఆదిమధ్యాంత రహితుడవు, రామా! నీవు ఏకుడవు. నీవు నీ మాయచేత లోకములను సృష్టిస్తునావు, పాలిస్తునావు సంహారము చేయుచున్నావు. అయినప్పటికి నీకు వానియందు లిప్తత లేదు. ఎందువలెనంటే నీవు నిత్యము ఆనందసాగర మందుంటావు. ఆనంద మగ్నుడవు మఱియు ఆనంద స్వరూపుడవు.

3) నీ మాయయొక్క గుణములచేత ఆవరింపబడి నీవు శరణాగత భక్తులకు మార్గము చూపెట్టుటకొఱకు, దేవమనుష్యాది నానా వతారములను స్వీకరించి విచిత్ర లీలావిన్యాసములను చేయుచున్నావు. జ్ఞానులు మాత్రం ఆ సమయంలో నిన్ను తెలుసుకుంటారు.

4) నీవు నీయొక్క అంశచేత సంపూర్ణ లోకములను రచించి వానిని శేషావతారంతో క్రిందిభాగంలో ఉండి ధరిస్తునావు. సూర్యుడు వాయువు, చంద్రుడు, ఓషధులు మఱియు వర్షరూపములతో నానా ప్రకారాలతో మీదినుండి పాలన చేయుచున్నావు.

5) నీవే జఠరాగ్ని రూపమును ధరించి ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము అను పంచవిధ వాయువులు లేక పంచవిధ ప్రాణములచేత ప్రాణులు తిన్న అన్నమును జీర్ణింపజేసి పుష్టినిచ్చి వానిద్వారా సర్వసంపూర్ణ జగత్తుయొక్క పాలనచేయుచున్నావు.

6) హే పరమేశ్వర రామా! చంద్రుడు, సూర్యుడు, అగ్ని

వీనియందున్న తేజస్సు సమస్త ప్రాణులయొక్క చేతనాంశమై యున్నది. దేహధారుల యొక్క ధైర్యము, శౌర్యము, ఆయువు యొక్క బలము నీయొక్క సత్తామాత్రమే అయియున్నది.

7) హే రామ! నీవు భిన్న భిన్న ఈశ్వరాదులలో నీవొక్క డవే బ్రహ్మ, విష్ణు, మహేశాది నామములతోను, కాల, కర్మ, చం ద్రుడు, సూర్యుడు అని భిన్నభిన్నంగా ప్రకాశించు చున్నావు. ఇందులో సందేహము లేదు, కాని వాస్తవంలో నీ వొక్కడవే అద్వితీయ బ్రహ్మవై యున్నావు.

8) వేదములందు, పురాణములందు మఱియు లోకమందు నీ వొక్కడవే మత్స్యము మున్నగు అనేక రూపములందు ప్రసిద్ధు డవయి యున్నావు. అటులనే సంసారమందుకల సదసద్రూపమగు విభాగముకూడ నీవే అయియున్నావు. నీకంటె భిన్నమైనది. మరియొకటి లేదు.

9) ఈ అనంతమైన సృష్టియందు ఉత్పన్నమైన దంతయు, ఇంకను పుట్టబోయేది ప్రస్తుతము ఉత్పన్నమగు చున్నదంతయు స్థావర జంగమాది సంపూర్ణ ప్రపంచమందు నీవు లేకుండా ఇంకొ కటి ఏదియు కనపడలేదు. అందువలన నీవు రామా ప్రకృత్యాదుల కంటె పరుడవు. మఱియు పరాత్పరుడవు.

10) హే రామా! నీ మాయచేత మోహితులై నందువలన అందరు నీయొక్క పరమాత్మ స్వరూపముయొక్క తత్త్వమును తెలియకుండా ఉన్నారు. నీయొక్క భక్తులయొక్క సేవలోని ప్రభా వమువలన ఎవరు నిర్మలమైన అంతఃకరణ కలవారగుదురో వార లకు, నీయొక్క అద్వితీయ ఈశ్వర రూపము భానమానమగును.

11) ఎవరికి బాహ్యపదార్థ బుద్ధికలదో అట్టి బ్రహ్మాదులకు కూడ నీచిత్ స్వరూపము యొక్క జ్ఞానము తెలియ పడదు. అందు వలన బుద్ధిమంతుడైన పురుషుడు నీయొక్క శ్యామసుందర మూర్తిని భక్తిచేత కొలుస్తూ దుఃఖము యొక్క ఒడ్డును దాటి మోక్షమును పొందెదడు.

12) హే ప్రభో రామ! నేను నీ నామజపముచేసి కృతార్థుడనై కాశీలో ఉంటున్నాను. రాత్రింబవళ్లు దేవి పార్వతితో కూడ కాశీలో ఉంటున్నాను. అచ్చట ఆసన్న మరణులకు పురుషులకు వారికి మోక్షమును ప్రసాదించు బుద్ధిచేత నీయొక్క తారకమంత్రమైన "రామ" అనే మంత్రమును ఉపదేశము చేస్తాను. రామా మఱియొక ప్రార్థన—పై విధముగా నాచేత చేయబడిన స్తోత్రమును అనన్య భక్తిచేత నిత్యము విన్నను, గానము చేసినను, లేక వ్రాసినను వారు నీయొక్క కృపవలన సంపూర్ణ పరమానంద లాభమును పొంది నీయొక్క నిజపదమగు వైకుంఠ పదమును పొందెదరు గాక.

### ఇంద్రుడు పలికెను

హే రామచంద్ర! బ్రహ్మగారి వరప్రభావమువలన, రాక్షస రాజగు రావణుడు నాతాలూకు దేవోచిత సుఖములను హరించినాడు. ఇప్పుడా దుష్టశత్రువు తమచేత చంపబడినందున మీ యొక్క దయ చేత నా సర్వసుఖములు నాకు ప్రాప్తించినవి.

### దేవతలు పలికిరి

హే మురారే విష్ణో! ఈ దుష్టుడైన అదిత్యుడు బ్రాహ్మణుల ద్వారా మాకివ్వబడిన నమస్త హవిర్భాగములను హరించినాడు. ఇప్పుడు మీరు వానిని సంహరించిరి. మీయొక్క దయచేత తిరిగి మేము పూర్వమువలె మా యజ్ఞభాగములను పొందుచున్నాము.

## పితరులు పలికిరి

దేవా! ఈ దుష్టరాక్షసుడు గయ ఆదిపుణ్య క్షేత్రములందు మానవులచేత ఇవ్వబడిన పిండోదకాదులను బలాత్కారంగా అడ్డి తాను తినేసేవాడు. ఇప్పుడు మీరు వానిని చంపివేసిరి. తిరిగి ఇప్పుడు మేము మా భాగములను తినుచు శక్తిని పొందెదము భవదనుగ్రహము చేత.

## యక్షులు పలికిరి

హే రఘునాథా! దుష్టరావణుడు మమ్ములను బలాత్కరంగా పల్లకి మున్నగువాటిని మోయుటకు నియోగించెడి వాడు. దుఃఖముతో మోసేవారము, తమచేత దుర్మార్గుడైన రావణుడు చంపబడినాడు. నీవలన మేము దుఃఖజాలము నుండి విముక్తులమైతిమి.

## గంధర్వులు పలికిరి

మేము సంగీత నిపుణులము ప్రభో. మేమెప్పుడు మీయొక్క అమృతతుల్యమైన కథలను గానము చేసెడివారము. ఆనందామృత డోలికలలో విహరించెడి వారము. దుష్టరావణుడు వాని కథలను పాడించి వాని భజన మాచేత చేయించెను. మేము మీవలన రక్షింపబడితిమి. రావణుడు చంపబడెను. ఈ విధంగా మహోరగులు, సిద్ధులు, కిన్నరులు, మరుద్గణములు, వసువులు, మునులు, గోవులు, గుహ్యకలు, పక్షులు, ప్రజాపతి మరియు అప్సర సమూహము లందరు వచ్చి భూమికి వచ్చి నయనానంద వర్ధనుడగు రాముని ప్రభువుని దర్శించి వానిని పదేపదే వేరువేరుగా స్తోత్రము చేసి రాఘవునిచేత అభివందితులై ఎవరి లోకములకు వారు చనిరి. బ్రహ్మ రుద్రాదులు కూడ ఆనందంతో రాముని స్తుతిస్తూ రాముని చేష్టలను గానము చేయుచు, సింహాసనమందు విరాజమానుడు, అభిషేకములచేత

తడిసిన రాజరాజేశ్వరుడైననానిని సీతాలక్ష్మణ సమేతుని హృదయ మందు ధ్యానించుకుంటూ రాముని దగ్గర అనుమతి తీసికొని వెళ్లి పోయిరి. ఆ సమయములో అంతరిక్షములో బాజాలు వాయిస్తూ న్నారు. దేవతలందరు నిర్మలహృదయంతో రాముని స్తోత్రము చేయుచుండిరి. పుష్పవర్షము కురిసినది. సప్తమహర్షులు నాలుగు దిక్కులందు రాముని స్తోత్రము చేయుచుండిరి.

కోటిసూర్యప్రభా భాసమానుడైన రాముడు, ప్రసన్న ముఖుడు, చిరునవ్వు ముఖారవిందము శ్యామసుందరుడు, భగవంతు డగు రాముడు, సీతాలక్ష్మణుడు, హనుమంతుడు, మునిజనులు, వానరగణములతో సేవింపబడుచు మిక్కిలి శోభతో ప్రకాశించెను.

ఇట్లు యుద్ధకాండలోని పంచదశ సర్గ సమాప్తము.

## షోడశ సర్గము

### వానరులకు వీడుకోలు, గ్రంథ ప్రశంస

# శంకరుడు భవానితో పలికెను

హే పార్వతి ! శ్రీరాము డభిషిక్తుడయిన నాటినుండి రాజ రాజేశ్వరుడయి రామచంద్రరాజు రాజ్యమును ఏలిననాటి నుండి భూమాత ధనధాన్యములతో నిండిపోయినది. వృక్షములన్నియు ఫలవంతము లయినవి. గంధహీనములయిన పుష్పములు కూడా గంధయుక్తము లయినవి. శ్రీరాముడు ప్రప్రథమంగా సింహాసన మెక్కిన తరువాత ఒక లక్ష గుర్రములను, పాలిచ్చే లక్ష గోవులను, వందలాది ఎడ్లను, మూడుకోట్ల బంగారు నాణెములను, వస్త్రము లను, ఆభరణములను, రత్నములను బ్రాహ్మణులకు దానము చేసెను. సూర్యకాంతితో సమమైన ప్రభగల సర్వరత్నమయమైన సుగ్రీవునకు ప్రీతితో బహూకరించెను. అంగదునకు రెండు దివ్యము లయిన అంగదములను (బహుపురులను) ఇచ్చెను. ప్రేమతో అమ్మ సీతమ్మకు కోటిచంద్ర ప్రభాభాసమానమగు, అమూల్యమైన మణులతోను, రత్నములతోను, విభూషితమైన ఒక హారమును బహూకరించెను. ఆమె హారమును మెడలోనిది బయటకు తీసి పదే పదే రాముని వైపు వానరముల వైపు చూచుచుండెను. ఇంగితజ్ఞానము గల రాముడు సీతమ్మను చూచి అమ్మ నీకిష్టమైన వారలకు ఇవ్వ వచ్చు అనెను. రాముడు చూచుచుండగా హారమును హనుమంతుని కిచ్చెను. ఆ హారమువలన మారుతి అతిగౌరవముతోను, మిక్కిలి శోభతోను ప్రకాశించెను. కృతాంజలియై యున్న హనుమను జూచి పరమభక్తిచేత తుష్టుడై రాముడు పలికెను. హే హనుమ ! నేను

నీకు ప్రసన్నుడనైతిని. వరమును కోరుకొమ్మనెను. హనుమంతుడు సంతసించి రామునికి నమస్కరించి సంతుష్టాంతరంగుడై 'హే రామ! నీ నామమును స్మరించినను నా మనస్సుకు తృప్తి కలుగలేదు. అందుచేత నేను నిరంతరము నీ నామమును స్మరించుచు భూతల మందుండెదను. లోకములో నీ నామము ఉన్నంతవఱకు నా కళే బరము ఉండుగాత. ఇది నాకు కావలసిన వరము రామ. రాముడటు లనే అని చెప్పి నీవు జీవన్ముక్తుడవయి సంసారములో సుఖంగా ఉండుము. కల్పాంతమందు నీవు నా సాయుజ్యమును పొందెదవు. ఇందులో సందేహము లేదనెను. అప్పుడు జానకీమాత హనుమతో పలికెను. హే మారుతీ ! నా ఆజ్ఞచే నీవెచ్చట నివసించినను నీకు సమస్త భోగములు ప్రాప్తించును'. అని చెప్పగానే హనుమంతు డానందాశ్రువులు కండ్లలో పొడమగా పునః పునఃప్రణామముల నాచరించి అతికష్టంతో తపస్సు చేసికొనుటకు హిమాలయ పర్వత మున కరిగెను.

తదనంతరము చేతులు జోడించి నిలపడియున్న గుహుని సమీపించి మిత్రమా ! ఇప్పుడు నీవు నీ సుందర రమణీయమైన శృంగవేదమునకు వెళ్లుము. నన్నే ఎల్లప్పుడు చింతించుచు నీ నిజా రిజత విత్తముతో భోగములను అనుభవించుము. అంత్యమందు నన్నే చేరెదవు. అని చెప్పి వానికొఱకు దివ్యాభరణములను, విశాలమైన రాజ్యమును, విజ్ఞానమును ఇచ్చెను. రామునిచేత అలింగుతుడయి గుహుడు తన యింటికి వెళ్లెను. అయోధ్యకు వచ్చిన వానరశ్రేష్ఠుల నందరిని సుగ్రీవ విభీషణులను కూడ యథోచితంగా సత్కరించెను. వారందరు మహానందముతో ఎవరి పురములకు వారు చనిరి. విభీషణుడు లంకారాజ్యమున కరిగెను. శ్రీరాముడు అందరియందు దయకలవాడు తన సంపూర్ణ రాజ్యమును పరిపాలింప నారంభించెను.

లక్ష్మణునకు ఇష్టము లేకున్నను భగవంతుడగు రాముడు,

లక్ష్మణుని యువరాజ్యమునందు పట్టాభిషిక్తుని చేసెను. లక్ష్మణుడు అతిభక్తి తాత్పర్యములతో రాముని సేవలో నిమగ్నుడాయెను. భగవంతుడగు రాముడు సమస్త కర్మ సాక్షి, నిత్యనిర్మల స్వరూపుడు, కర్తృత్వాది రహితుడు, నిర్వికారుడు, నిత్యతృప్తుడయి నప్పటికి లోకములకు ఉపదేశము చేయుటకు మానవ రూపమును ధరించి విపులదక్షిణలతో కూడుకొనిన అశ్వమేధాది సమస్తయజ్ఞములకు అనుష్ఠానము చేసెను. శ్రీరాముని రాజ్యమందు విధవలయొక్క ఏడుపులు లేవు. పాములవలన భయము లేదు. వ్యాధి భయములు లేవు. దొంగల భయము లేదు. అనర్థములు లేవు. పెద్దవాళ్లు బ్రతికియుండగ చిన్నవాళ్లు చచ్చిపోవుటలు లేవు. అందరు రామ పూజాపరులు. అందరు రాఘవచింతకులే. మేఘములు సకాలంలో సస్యానుకూలంగా ప్రజలకు ఇష్టమగు రీతిని వర్షించెను. ప్రజలు వర్ణాశ్రమ ధర్మములను పాటించి ఎవరి విధులను వారు నిర్వర్తించెడివారు. ప్రజలను కన్నకొడుకులును వలె రాముడు రక్షించెను. సర్వలక్షణ సంపన్నుడు, సర్వధర్మ పరాయణుడు రాముడు పదివేల సంవత్సరములు రాజ్యమును పరిపాలించెను.

ధనధాన్యములను వృద్ధిచేయునది దీర్ఘాయురారోగ్యకరమైనది పవిత్రమైనది, రహస్యమైనదియు అధ్యాత్మికమైన పేరుకలది భగవంతుడగు శంకరునిచే పూర్వకాలమందు చెప్పబడినది.

1) దీనిని భక్తితో శ్రద్ధతో వినినను, నిర్మలమనస్కుడై భక్తితో పఠించినను, పరితుష్ట మనస్కుడై, మనస్సులోని కోరికలన్నిటిని పొందెదరు. మఱియు సర్వపాపముల నుండి విముక్తుడగును.

2) శ్రీరామ పట్టాభిషేకమును శ్రద్ధతో విన్నవాడు ధనము కోరినచో ధనమును పొందును. పుత్రులు కావలసినవాడు సత్పుత్రుని పొందెదడు. ఈ రామాయణమును ఆదినుండి పఠించవలెను.

3) ఏ రాజు ఈ అధ్యాత్మ రామాయణమును వినునో, వాడు ధనధాన్య సంపన్నమైన పృథివీపాలన చేసెదరు. శత్రువులను జయించి శత్రుభయము లేనివాడు, విజయవంతుడు, దుఃఖము లేనివాడగును.

4) స్త్రీలు ఈ అధ్యాత్మ రామాయణమును విన్నచో వారి సంతానము దీర్ఘాయువులై వర్ధిల్లెదరు. వారిచేత పూజింప బడుదురు. వంధ్యా స్త్రీ కూడా ఈ రామాయణ కథను భక్తితో వింటే రూప వంతుడైన కుమారుని పొందును.

5) ఎవ్వడు శ్రద్ధాభక్తులతో దీనిని విన్నా, చదివినా, కోప మును జయించి మత్సరము లేనివాడయి, సమస్త అవగుణముల నుండి విడువబడి, నిర్భయుడు, సుఖి, రాఘవభక్తి యుక్తుడు కాగలడు.

6) ఆరంభంనుండి ఈ అధ్యాత్మ రామాయణమును భక్తి శ్రద్ధలతో విన్నవారలకు దేవగణములు ప్రసన్నులై వారికి అను గ్రహము అభీష్టము కూర్చెదరు. అట్టి మనుష్యులకు విఘ్నములు ఉండవు. వారు అన్ని విధములైన సంపత్తిని పొందెదరు.

7) రజస్వలయైన మైనప్పటికి ఏ స్త్రీ రామభక్తితో ఈ అధ్యాత్మ రామాయణమును మొదటినుండి చివరివఱకు వినునో, అత్యుత్తముడు, దీర్ఘాయుష్మంతుడును అగు పుత్రుని కనును. సంసారంలో ఆమె పతివ్రతయై అందరి మెప్పును పొందగలదు.

8) ఈ అధ్యాత్మ రామాయణ గ్రంథమును భక్తిపూర్వకంగా పూజచేసి ఎవరు నిత్యము నమస్కరించెదరో వారు సమస్త పాపముల నుండి విముక్తులై పరమాత్మయైన విష్ణువు యొక్క పంధామమును పొందెదరు. అధ్యాత్మ చరితమును సంపూర్ణంగా భక్తితో విన్నను, పఠ నము చేసినను (తమ నోటినుండి) వారలకు రాముడు ప్రసన్నుడగును.

9) రాముడే పరబ్రహ్మ. అఖిలాత్మయైన శ్రీరాముడు సంతోషిస్తే ధర్మార్థ, కామ, మోక్షములలో దేనిని కోరినను అది సంప్రాప్త మగును. ఈ అధ్యాత్మ రామాయణమును నిత్యమును, సంపూర్ణంగా, వ్రతముతో వినవలెను. ఆయురారోగ్యములు కలుగును. కల్పకోటి జన్మలందు చేయబడిన పాపసమూహములు నశించును. దేవతలు సంతోషిస్తారు. నవగ్రహములు, సప్తమహర్షులు, పితృ దేవతలు కూడ సంతోషిస్తారు.

ఏ మానవులు ఈ అద్భుతమైన జ్ఞాన వైరాగ్య యుక్తమైన ఈ అధ్యాత్మ రామాయణమును చదివెదరో, వినెదరో, వ్రాసెదరో వారికి ఈ సంసారంలో తిరిగి జన్మ యుండదు.

భూతనాధుడైన, భగవంతుడైన శంకరుడు సమస్త వేదరాశులను పదేపదే మధించి తాను తారకమంత్రమైన రామనామమును విష్ణువుయొక్క రహస్యమూర్తిగా తెలిసికొనెను. అందువలన శంకరుడు సమస్త వేదసారమైన ఈ అధ్యాత్మ రామాయణము ద్వారా శ్రీ భగవంతుడైన రామునియొక్క గుప్తతత్త్వమును పార్వతీదేవితో చెప్పిరి. ప్రియురాలైన పార్వతికి ఉపదేశించిరి.

ఇట్లు యుద్ధకాండలోని షోడశ సర్గము సమాప్తము.

—O—

శ్రీరామ జపం చేయువారలకు మూలంలోని శ్లోకములను స్తోత్ర రూపంలో—

1) నీలోత్పల దళశ్యామః
పీతవాసా శ్చతుర్భుజః
జలజారుణ నేత్రాంతః
స్ఫురత్కుండల మండితః ॥

2) నహస్రార్క ప్రతీకాశః
కిరీటీ కుంచితాలకః
శంఖచక్ర గదాపద్మ
వనమాలా విరాజితః ॥

3) అనుగ్రహాఖ్య హృత్స్థేందు
సూచకస్మిత చంద్రికః
కరుణారస సంపూర్ణ
విశాలోత్పల లోచనః ॥

4) శ్రీవత్సహార కేయూర
నూపురాది విభూషణః
దృష్ట్వాతం పరమాత్మానం
కౌసల్యా విస్మయాకులా ॥

( బాలరాముడు, కౌసల్యకు చూపించిన రూ. ము.

5) యస్మిన్ రమంతే మునయో
విద్యయా జ్ఞానవిప్లవే
తం గురుః ప్రాహ "రామేతి"
రమణాద్రామ ఇత్యపి ॥

( నామకరణం )

6) అహో కృతార్థాస్మి
జగన్నివాసతే పాదాబ్జ
సంలగ్న రజః కణాదహం
స్పృశామి యత్పద్మజశంకరాదిభిః
విమృగ్యతే రంధితమానసైః సదా ॥

7) యత్పాద పంకజ పరాగపవిత్ర గాత్రా
భాగీరథీ భవవిరించి ముఖాన్పునాతి
సాక్షాత్స ఏవ మమ దృగ్విషయోయదాస్తే
కింవర్ణ్యతే మమ పురాకృత భాగధేయం ॥

8) యత్పాద పంకజరజః శ్రుతిభిర్విమృగ్యం
యన్నాభి పంకజ భవః కమలాన నశ్చ
యన్నామసార రసికో భగవాన్ పురారిః
తం రామచంద్ర మనిశం హృది భావయామి ॥
( అహల్యకు కనపడ్డ రాముడు )

9) "క్షాళయామి తవ పాదపంకజం
నాథ దారు దృషదోః కిమంతరం ॥
మానుషీకరణ చూర్ణమస్తి తే
పాదయోరితి కథా ప్రథీయసీ"

( నావికుడు గంగను దాటించే ముందు రామపాదములను కడిగితే గాని నావలో కాలు పెట్టవద్దంటాడు ఎందుకంటే తన పడవ కూడా ఆడదయి పోతుందని భయమట ). రామ పాదధూళి మానుషీకరణ చూర్ణమంటాడు ).

10) "అద్యమే సఫలం జన్మ రామత్వాం సహసీతయా
ఏకాసన స్థం పశ్యామి భ్రాజమానం రవింయథా"
( జనకుడికి కనపడిన రాముడు )

11) అద్యమే సఫలం జన్మ ప్రతీతోసి మమ ప్రభో
బ్రహ్మాది భిరలభ్య స్త్వం ప్రకృతేః పారగోమతః"
( పరుశురామునికి దర్శనమిచ్చిన రాముడు )

12) "త్వం విష్ణుః జానకీ లక్ష్మీః
శివ స్త్వం జానకీ శివా
బ్రహ్మాత్వం జానకీ వాణీ
సూర్య స్త్వం జానకీప్రభా" ॥

13) లోకే స్త్రీవాచకం యావత్ తత్ సర్వం జానకీ స్మృతా
పున్నామ వాచకం యావత్ తత్సర్వం త్వం హి రాఘవ ॥

14) తస్మాల్లోక త్రయేదేవ యువాభ్యాం నాస్తి కించన
త్వ దా భాసోదితాऽజ్ఞానం అవ్యాకృత మితీర్యతే ॥

15) తస్మా న్మహాన్ తతః సూత్రం లింగం
సర్వాత్మకం తతః ॥

16) అహంకారశ్చ బుద్ధిశ్చ పంచప్రాణేంద్రియాణి చ
లింగమిత్యు చ్యతే ప్రాజ్ఞైః
జన్మమృత్యు సుఖాదిమత్
స ఏవజీవ సంజ్ఞశ్చ
లోకే భాతి జగన్మయః

17) త్వన్నాభి కమలోత్పన్నో
బ్రహ్మామే జనకః ప్రభో
అతస్తవాహం పౌత్రోస్మి
భక్తంమాం మాపాహి రాఘవ ॥
( నారదునిచే స్తుతి గాబడిన రాముడు )

18). "రామాయణాని బహుశః శ్రుతాని బహుభిర్ద్విజైః
సీతాం వినా వనం రామోగతః కింకుత్ర చిద్వద" ॥
( సీత రామున్ని నిలపదీసి అడిగిన ప్రశ్న )

19) రామరామేతి యే నిత్యం జపంతి మనుజాభువి
తేషాం మృత్యుభయాదీని నభవంతి కదాచన

20) కా పునస్తస్య రామస్య దుఃఖశంకా మహాత్మనః
రామనామ్నైవ ముక్తిఃస్యాత్ కలౌనాన్యేన కేనచిత్ ॥
( మహాముని వామదేవుడు )

21) సుఖస్య దుఃఖస్య న కోపిదాతా
పరోద దాతీతి కుబుద్ధి రేషా
అహం కరోమీతి వృధాభిమానః
స్వకర్మ సూత్రగ్రధితోహి లోకః ॥

22) సుఖస్యా నంతరం దుఃఖం
దుఃఖస్య అనంతరం సుఖం
ద్వయమేతద్ధి జంతూనాం
అలంఘ్యం దినరాత్రివత్ ॥

23) సుఖమధ్యేస్థితం దుఃఖం
దుఃఖమధ్యేస్థితం సుఖం
ద్వయ మన్యోన్య సంయుక్తం
ప్రోచ్యతే జలపంకవత్ ॥
( లక్ష్మణ వాక్యం )

24) అసత్యా ద్భీతిరధికా మహతాం నరకాదపి
కరోమీత్య హమప్యేతత్ సత్యం తస్యై ప్రతిశ్రుతం
( భరతునితో రాముడు )

25) నిరవధి సుఖమిందిరా కటాక్షం
క్షపిత సురేంద్ర చతుర్ముఖాది దుఃఖం
నరవర మనిశం నతోస్మి రామం
వరదమహం వరచాప బాణహస్తం ॥

26) గిరిశగిరి సుతా మనోనివాసం
గిరివరధారిణ మీహితాభిరామం
సురవరదనుజేంద్ర సేవితాంఘ్రిం
సురవరదం రఘునాయకం ప్రపద్యే ॥

27) రతిపతి శతకోటి సుందరాంగం
శతపథగోచర భావనావిదూరం
యతిపతి హృదయే సదావిభాతం
రఘుపతి మార్తిహరం ప్రభుంప్రపద్యే ॥

( జటాయువుకు దర్శనమిచ్చిన రాముడు )

28) యస్మిన్ ధ్యాతే ప్రేమరసః
సరోమపుల కోభవేత్
తదైవ ముక్తిః స్యాద్రామ
యదాతే స్థూలభావకః ॥

29) తదప్యాస్తాం తవైవా హం ఏతద్రూపం విచింతయే
ధనుర్బాణధరం శ్యామం జటావల్కల భూషితం ॥

30) అపీచ్య వయసం సీతాం విచిన్వంతం
సలక్ష్మణం ఇదమేవ సదామే స్యాత్
మానసే రఘునందన ॥

31) సర్వజ్ఞః శంకరః సాక్షాత్
పార్వత్యా సహితః సదా

త్వద్రూపమేవం సతతం
ధ్యాయన్నాస్తే రఘూత్తమ ॥

32) ముమూర్షూణాం తదాకాశ్యాం
తారకం బ్రహ్మవాచకం
రామరామేత్యుప దిశన్
సదా సంతుష్ట మానసః ॥
( కబంధునిచే స్తుతింపబడిన రాముడు )

33) రామప్రసాదాత్ శబరీమోక్షం ప్రాపాతి దుర్లభం
కిం దుర్లభం జగన్నాధే శ్రీరామే భక్తవత్సలే ॥

34) ప్రసన్నే అధమజన్మాపి శబరీముక్తిమాపసా
కిం పునర్బ్రాహ్మణా ముఖ్యాః పుణ్యాః శ్రీరామ చింతకాః ॥

35) దేవత్వం జగతాం నాధః పరమాత్మాన సంశయః
మత్పూర్వ కృత పుణ్యౌఘైః సంగతోద్యమయా సహ ॥

36) రామ, రామేతి, యద్వాణీ మధురం గాయతిక్షణం
సబ్రహ్మహాసురా పోవా ముచ్యతే సర్వపాతకైః ॥

37) మాయామూల మిదం సర్వం పుత్రదారాది బంధనం
తదుత్సారయ మాయాంత్వం దాసీంతవ రఘూత్తమ ॥

38) త్వత్పాద పద్మార్పిత చిత్తవృత్తిః
త్వన్నామ సంగీత కథాసువాణీ
త్వద్భక్త సేవానిరతా కరోమే
త్వదంగ సంగిం లభతాం మదంగం ॥

39) త్వన్మూర్తి భక్తాన్ స్వగురుం చ చక్షుః
పశ్యత్వజస్రం న శృణోతి కర్ణః
త్వజ్జన్మ కర్మాణి చ పాదయుగ్మం
వ్రజ త్వజ స్రంతవమంది రాణి ॥
( సుగ్రీవ కృత రామస్తోత్రం )

40) స్థాపమేవాహం న సందేహః
శీఘ్రం గచ్ఛ మమాజ్ఞయా
పురరాజ్యాధి పత్యేత్వం
స్వాత్మాన మభిషేచయ ॥
( రాముడు సుగ్రీవునితో )

41) రామతే పాదయుగళం దర్శితం మోక్షదర్శనం
అదర్శనం భవర్ణానాం సన్మార్గ పరిదర్శనం ॥

42) త్వద్భక్తేషు సదాసంగో భూయాత్ మే ప్రాకృతేషు న
జిహ్వేమే రామరామేతి భక్త్యావదతు సర్వదా ॥

43) మానసం శ్యామలం రూపం సీతాలక్ష్మణ సంయుతం
ధనుర్బాణధరం పీతవాససం మకుటోజ్వలం ॥

44) అంగదైర్నూపురై ర్ముక్తాహారైః కౌస్తుభ కుండలైః
భాంతం స్మరతుమే రామవరం నాన్యం వృణే ప్రభో ॥
( స్వయం ప్రభాదేవి స్మరణ )

45) యన్నామస్మృతి మాత్రతోఽపరిమితం సంసార వారాం నిధిం
తీర్త్వా గచ్ఛతిదు రజనోపి పరమం
విష్ణోః పదం శాశ్వతం

త స్యైవస్థితికారిణ స్త్రిజగతాం
రామస్య భక్తాః ప్రియాః
యూ యం కిం న సముద్రమాత్రి తరణే
శక్తాః కథం వానరాః ॥

[ సంపాతి వాక్యం ]

46) కృతార్థోహం కృతార్థోహం
దృష్ట్వా జనకనందినీం
మయైవ సాధితం కార్యం
రామస్య పరమాత్మనః ॥

[ హనుమంతుని ఆనందం అమ్మను చూచిన తరువాత ]

47) దృష్ట్వా సీతా ప్రముదితా రామనామాం కితాం తదా
ముద్రికాంశిర సాధృత్వా
ప్రవదానంద నేత్రిజా ॥

48) కపేమే ప్రాణదాతా త్వం
బుద్ధిమానసి రాఘవే
భక్తోసి ప్రియకారీ త్వం
విశ్వాసోస్తి త వైవహి ॥

[అంగుళీయకమునుచూచి ఆనందముతో అమ్మ సీతమ్మ పలికిన పలుకు]

49) దేహేంద్రియ పాః
సంగత స్త్వాత్మేతి బుద్ధ్వా
ఖిలబంధ భాగ్భవేత్
చిన్మాత్రిమే వాహమ జోహమక్షరోహి
ఆనంద భావో ఽహామితి ప్రముచ్యతే ॥

50) దేహోప్యనాత్మా పృథివీ వికార జో
న ప్రాణ ఆత్మా అనిల ఏష ఏవ నః
మనోప్య హంకార వికార ఏవనో
న చాపిబుద్ధిః ప్రకృతేర్వికారజా ॥

51) ఆత్మా చిదానంద మయోఽవికారవాన్
దేహా ది నం ఘాద్వ్యతిరిక్త ఈశ్వరః
నిరంజనోముక్త ఉపాధితః నదా
జ్ఞాత్వా ఏవం ఆత్మానం ఇతోవిముచ్యతే ॥

52) విష్ణోర్హి భక్తిః సువిశోధనం ధియః
తతోభవేత్ జ్ఞానమతీవ నిర్మలం
విశుద్ధ తత్వానుభవో భవేత్తతః
సమ్యగ్విదిత్వా పరమం పదం వ్రజేత్ ॥

53) అతో భజస్వాద్య హరిం రమాపతిం
రామం పురాణం ప్రకృతేః పరం విభుః
విస్సృజ్య మౌర్ఖ్యం హృది శత్రుభావనాం
భజస్వరామం శరణాగతి ప్రియం ॥

[ హనుమంతుని హితోపదేశం రావణబ్రహ్మకు ]

54) రామసుగ్రీవ యోరగ్రేని పేతుర్భు వినత్వరం
హనుమాన్ రాఘవం ప్రాహ "దృష్టా సీతా, ని రామయా"

[ హనుమంతుని ముందుమాట రామునితో ]

55) ఇదానీం తే ప్రయచ్ఛామి నర్వస్వం మమ మారుతే
ఇత్యాలింగ్య నమాకృష్య గాఢం వానరపుంగవం ॥

56) సార్ద్ర నేత్రో రఘుశ్రేష్ఠః పరాం ప్రీతి

మ వాపనః హనుమంత ము వా చేదం
రాఘవో భక్తవత్సలః ।

57) పరి రంభోహిమే లోకే దుర్లభః పరమాత్మనః
అతస్త్వం మమ భక్తోసి ప్రియోసి హరిపుంగవ ॥

[ శ్రీరాముడు హనుమ కిచ్చిన సర్వస్వం ఏమిటంటే
తన గాఢాలింగనమే అట ]

58) రామోనమానుషోదేవః సాక్షాన్నారాయ
ణోఽవ్యయః సీతా భగవతీ లక్ష్మీ రామపత్నీ యశస్వినీ ॥

[ కుంభకర్ణుడు రావణునితో ]

59) ధిక్కరోషి తథాపి త్వం జ్యేష్ఠో భ్రాతాపితుః సమః
కాలోరాఘవ రూపేణ జాతో దశరథాలయే ॥

60) కాలీ సీతాభిధానేన జాతా జనకనందినీ
తౌ ఉభౌ ఆగతౌ అత్ర భూమేర్భారానుపత్తయే ॥

[ విభీషణ వాక్యం రావణునితో ]

61) ధన్యోఽస్మి కృతకృత్యోఽస్మి కృతకార్యోఽస్మి రాఘవ
త్వత్పాద దర్శనాదేవ విముక్తోఽస్మిన సంశయః ॥

[ విభీషణుడు శ్రీరామునితో ]

62) మద్భక్తానాం ప్రశాంతానాం యోగినాం వీతరాగిణాం
హృదయే సీతయా నిత్యం వ సామ్యత9 న సంశయః ॥

[ శ్రీరాముడు విభీషణునితో ]

63) యావచ్చంద్రశ్చ సూర్యశ్చ యావత్తిష్ఠతి మేదినీ
యావన్మమ కథాలోకే తావద్రాజ్యం కరోత్యసౌ

[ శ్రీరాముడు లక్ష్మణునితో విభీషణునకు లంకారాజ్యం
ఇచ్చు సందర్భంలో ]

64) సత్సంగతిం కురు భజస్వ హరిం శరణ్యం
శ్రీ రాఘవం మరకతోపల కాంతి కాంతం
సీతాసమేత మనిశం ధృతచాప బాణం
సుగ్రీవ లక్ష్మణ విభీషణ సేవితాంఘ్రిం

[ శుకోపదేశం ]

65) సీతాం సత్కృత్య సధనాం రామాయాశు ప్రయచ్ఛభోః
రామం నారాయణం విద్ధి విద్వేషం త్యజ రాఘవే ॥

66) యత్పాదపోతమాశ్రిత్య జ్ఞానినో భవసాగరం
తరంతి భక్తి పూతాంతాః తతో రామో న మానుషః ॥

67) భజస్వభక్తి భావేన రామం సర్వహృదాలయం
యద్య పి త్వం దురాచారో భక్త్యాపూతో భవిష్యసి ॥

[ మాల్యవంతుని హితోపదేశము ]

68) సర్వేశ్వరః సర్వమయోవిధాతా
మాయామనుష్యత్వ విడంబనేన
సదా చిదానందమయోపి రామో
యుద్ధాది లీలాం వితనోతి మాయాం ॥

[ కవి ]

69) భజస్వ రామం పరిపూర్ణమేకం
విహాయవైరం నిజభక్తి యుక్తః
హృదా సదా భావితభావ రూపమ్
అ నామరూపం పురుషం పురాణం

[ కాలనేమి హితోపదేశం ]

70) ప్రకృతిం పురుపంకాలం వ్యక్తా వ్యక్తస్వరూపిణం
యం జానంతి మునిశ్రేష్ఠాః తస్మై రామాయతే నమః ॥

71) వికారరహితం శుద్ధం జ్ఞానరూపం శ్రుతిర్జగౌ
త్వాం సర్వజగదాకార మూర్తిం చాప్యాహసా శ్రుతిః ॥

72) విరోధో దృశ్యతే దేవవైవి కోవేద వాదినాం
నిశ్చయం నాధిగచ్ఛంతి త్వత్ప్రసాదం వినా బుధాః ॥

73) మాయ యాక్రీ డతోదేవ
న విరోధో మనాగపి
రశ్మిజాలం రవేర్యద్వత్
దృశ్యతే జలవత్ భ్రమాత్ ॥

74) అతస్తే సగుణం రూపం
ధ్యాత్వా హం సర్వదాహృది
ముక్తశ్చరామి లోకేషు
పూజ్యోహం సర్వదేవతైః ॥

[ నారద వాక్యం ]

TIRUPATI
5.34.73

—O—



శ్రీరస్తు చిరంజీవి మహావ్రతయాజుల శంకర శర్మ జననం కలువరాయి తే 6-11-1929 బాల్యాదారభ్య సంస్కృత విద్య ప్రంచకావ్యముల వఱకు విద్వాన్ ఉభయ భాషా ప్రవీణ శ్రీగంటి నరసింహశర్మ గారి వద్ద ఆతరువాత మహారాజ సంస్కృత కళాశాలలో 16వ ఏటనే భాషా ప్రవీణ. ఆ తరువాత ఆంధ్రాయూనివర్సిటీలో B A Hons, Economics. వివాహం 6-4-1947 సతీమణి సుభద్రాదేవి. ప్రారంభం నాతోపాటు మహారాజా కళాశాలలో (విజయనగరం) అధ్యాపక వృత్తి ఆతరువాత ఆంధ్రప్రదేశ్ రిజిష్ట్రేషను శాఖ. మధ్యలో లేబరు మినిష్ట్రీలో **ESI Inspector**గా పని చేసిరి. ప్రవృత్తిలో ఆధ్యాత్మిక తత్వ విచారము. వృత్తిలో బహుశాఖలున్నను; వీరు కవులు పండితులు వక్తలు. ఆంధ్ర ఆంగ్ల సంస్కృత భాషలలో అభినివేశము కలవారు. జ్యోతిశాస్త్రములో కృషి చేసి విదేశముల కేగి అచ్చట ప్రపంచ జ్యోతి శ్శాస్త్ర పండితులతో పరాశరునివయి ప్రసంగించిరి. వీరు రేడియోలో ఆధ్యాత్మిక ప్రసంగములు గావించి పండిత పామరుల మన్ననలను పొందిరి వీరు ఆధ్యాత్మిక వ్యాసములు ప్రచురించి సారస్వత సేవ చేసిరి. భగవాన్ శ్రీరమణ మహర్షి కావ్యకంఠ గణపతి మునులు వీరికి ఆరాధ్యులు. వీరు ఢిల్లీ రమణ కేంద్రము నందే గాకఅనేక సభలలో శ్రీరమణ నాయనల పై ప్రసంగించిరి. వీరు భయదంపతులు స్వగ్రామం అయిన కావ్యకంఠుని జన్మ స్థలంలో శ్రీఅపీతకు చాంబాసహిత అరుణాచలేశ్వరస్వామి మఱియు వేంకటేశ్వరస్వామివారి దేవాలయములను **1984** ఏప్రియల్ నెలలో ప్రతిష్ఠగావించిరి. వీరు మహర్షి మహాయోగి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారి ఆశీస్సులకు పాత్రులయిరి. వీరు విశాఖపట్నంలో కావ్యకంఠ పీఠమును స్థాపించి నేటికి సంస్కృత భాషామ తల్లికి సేవలందించుచున్నారు. వారి ఇతర గ్రంథాలు కావ్యకంఠ శత సుమమాల, ఉమాసహస్రం - ఆంగ్లానువాదం, అక్షరమణమాల సంస్కృతానువాదం, శ్రీమాతృ నివేదనము ఇత్యాదులు వీరికి నాహృదయ పూర్వక ఆశీస్సులు.

**అప్పల్ల సోమేశ్వర శర్మ**